
# మహానటి

# సావిత్రి

## వెండితెర సామ్రాజ్ఞి




పల్లవి

91132



© పల్లవి

హెచ్-96
మధురానగర్,
హైదరాబాద్-38.
040-23711421
Email: pallavirg@rediffmail.com

791 43092
పల్లవి - మహాన

...ందరయ్య గ్రంథాలయ...
A.C. No. 91132
హైదరాబాద్-500 044.

మొదటి ముద్రణ : ఆగష్టు, 2007
రెండవ ముద్రణ : నవంబర్, 2007
మూడవ ముద్రణ : ఆగష్టు, 2008


ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో

Acc. No. 5746
C. 13282

వెల : రూ.200/-

*డి.టి.పి., ముద్రణ:*
కళాజ్యోతి ప్రాసెస్ ప్రై. లిమిటెడ్,
1-1-60/5, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్,
ముషీరాబాద్, హైదరాబాద్-500 020.
ఫోన్ : 040-27645536

# అంకితం



ఆదిదంపతుల వంటి

పద్మభూషణ్ డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి - వసంత గార్లకు

# ముందుమాట

నేత్రాభినయంతోనే జనస్రవంతిని మంత్రముగ్ధులను చేసిన అభినేత్రి జీవితం నాటకీయతలో ఆమె ధరించిన ఏ పాత్రకూ తీసిపోదు. తారాజువ్వలా తారామండలాన్నికి ఎగిసి, మితిమీరిన బోళాతనంతో తోకచుక్కలా రాలి, రోగగ్రస్తమై, శల్యావశిష్టమైన శరీరంతో జీవన రంగస్థలినుండి నిష్క్రమించిన తారామణి ఆమె. కరుణకు, పరోపకారానికి చిరునామా అయిన ఆ సహృదయురాలి కథ కరుణామయగాథగా మిగిలిపోవడం గుండెలు పిండేటంతటి విషాదం. గొప్ప భావకవుల, భాసాది నాటకకర్తల ఊహకు సైతం అందనంత 'మెలాంకలిక్ డ్రామా'!

ఆ విషాదాన్ని అక్షరీకరించడానికి శ్రీమతి పల్లవి కొత్త ప్రయోగం చేశారు. తారీఖుల వారీ జీవిత చరిత్రగా కాకుండా పతితకు సావిత్రి హృదయాన్ని ఆవిష్కరించడానికి సినేరియో పద్ధతి ఎంచుకున్నారు. ఆనాటి సంఘటనలను కళ్లారా చూసినట్టుగా, అప్పటి సంభాషణలను స్వయానా విన్నట్టుగా సన్నివేశాలను కల్పించి, ఒక్కొక్కప్పుడు పాత్రలను సృష్టించి, పకడ్బందీగా స్క్రీన్‌ప్లే రాసినట్టు రాశారు. ఇది ఈమె తొలి రచనంటే నమ్మబుద్ధి కానంత లాఘవంగా రాశారు. ఇది రచనలో చేయి తిరిగిన వారు మాత్రమే సాహసించగల రచనా విన్యాసం!

కంటిచూపుతో, పెదవి విరుపుతో పర్వాలకు, స్కంధాలకు సరిపడా భావాన్ని సునాయాసంగా సగటు ప్రేక్షకుడికి కూడా అవగతం చేయగలిగిన సావిత్రి అభినయకౌశలం గురించి, దర్శకత్వ ప్రతిభ గురించి వ్యాఖ్యానించే పని పెట్టుకోలేదు యీ రచయిత్రి. ఆమె జీవితంలో ప్రతి ఘట్టాన్ని వివరించే పని కల్పించుకోలేదు. తీవ్రాభిమాని గనుకనే తనెన్నడూ

ప్రత్యక్షంగా చూడని సావిత్రిని హృదయంతో దర్శించి ఆమె కష్టసుఖాలను తనవిగా భావించి, స్పందించిన పల్లవి పాఠకులను సైతం తన  భావోద్వేగంలోకి తీసుకుని వెళ్ళగలిగారు. తనతో బాటే మననూ ఆమె కలల్లో విహరింపజేశారు. అందుకే హాలీవుడ్ నటీమణి తెలుగు సినిమా పాటల గురించి ఉత్తరం రాసిందంటే చటుక్కున 'నిజం కాబోసు' అని  భ్రమిస్తాం. పి.వి. నరసింహారావు గారు రాసిన 'ఇన్‌సైడర్'లా యిది కూడా వాస్తవాన్ని, కల్పననూ కలబోసిన సొగసైన రచన. భావసాంద్రతకు, రచనాశిల్పానికి మచ్చుతునకగా ఉదహరించదగిన వ్యక్తీకరణ.

ఆమెకు సావిత్రితో ప్రత్యక్ష పరిచయం లేనట్టే నాతోనూ పెద్దగా పరిచయం లేదు. కానీ ఆమె రాసిన ఆర్ద్రతాపూరితమైన ఓ లేఖ చదివి ఆమెలో ఒక చక్కటి రచయిత్రి వున్నదని గుర్తించినందుకే కాబోలు ఆమె తొలిపుస్తకాన్ని నాకు అంకితం యివ్వదలచినది! కీర్తిశేషులు సావిత్రిగారిపై వున్న అపారగౌరవం, చి॥ పల్లవి రచనాశైలిపై గల మక్కువ ఈ సత్కారానికి అంగీకరించేట్లు చేశాయి.

శ్రీమతి పల్లవి నుండి భావుకతతో కూడిన రచనలు మరెన్నో ఆశిస్తూ...

వరప్రసాద్

**24-04-07**



పుస్తకావిష్కరణ సభ (20-08-2007) లో తొలి ప్రతిని శ్రీ అక్కినేని నుంచి స్వీకరిస్తున్న సావిత్రిగారి కుమార్తె శ్రీమతి విజయ చాముండేశ్వరి. చిత్రంలో శ్రీమతి జమున.

# రచయిత్రి మాట

*పాఠకులకు నమఃసుమాంజలి.*

నాకు మా అమ్మ తర్వాత అత్యంత ప్రియమైన వ్యక్తి సావిత్రి. గత 20 సంవత్సరాల నుండి అమితంగా ప్రేమిస్తూ ఇక నా ప్రేమని నలుగురితో పంచుకోవాలనే తాపత్రయమే ఈ పుస్తకం రాయడానికి పురిగొల్పింది. ఈ పుస్తకం సావిత్రి జీవిత కథ అనో లేక ఆమె జీవిత చరిత్ర అనో నేను చెప్పలేను. నేను విన్న సావిత్రిని, నేను చదివిన సావిత్రిని, నేను తెలుసుకున్న సావిత్రిని, నేను విశ్లేషించిన సావిత్రిని అక్షరరూపంలో పెట్టాను. ఈ పుస్తకం రాయడానికి ఇంకో కారణం, ఒక ప్రముఖ రచయిత "సావిత్రి ఇంకో ఇరవైయేళ్ల దాకా జీవించే ఉంటుంది" అన్నారు. సావిత్రి ఇరవైయేళ్లుకాదు, ఆచంద్రతారార్కం గుర్తుండి పోవాలని, అందుకు నా పుస్తకం కూడా దోహదం కావాలని రాశాను. ఇప్పటి తరం వాళ్లు సావిత్రి గురించి తెలుసుకోవాలనే ఆశతో రాశాను. నా ఆశ ఫలిస్తుందని నమ్మకంతో, నేను చూడలేక పోయిన నా సావిత్రికి ప్రేమతో, ఇదే నా నివాళి.

ఈ పుస్తకం మీ ముందుకు రావడానికి నాకు విశేషంగా సహకరించిన శ్రీయుతులు ...త్తుల ప్రసాద్, ఎమ్. రవికృష్ణ (తెలుగు అధ్యాపకులు, ఆర్.వి.ఆర్.బి.ఎడ్ కాలెజ్, గుంటూరు), ...వెంకట్, పి.దిలీప్ కుమార్ రాజు, వై. శ్రవణ్‌లకు నా ధన్యవాదాలు.

ముందునుంచి నన్ను ప్రోత్సహించిన, సావిత్రిగారి వీరాభిమాని గెడా. రంగారావు గారికి, ...న్నో మంచి ఫోటోలిచ్చిన జి.ఎన్.భూషణ్ గారికి, సంగమ్ సంజయ్ కిషోర్‌గారికి, నా ...స్తకాన్ని మొదటిసారిగా సమీక్షించి నాకు కొండంత మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిన ...మారి ఎస్.రాధకు కృతజ్ఞతలు.

**...పల్లవి**



పుస్తకావిష్కరణ సభ (20-08-2007) లో తొలి ప్రతిని శ్రీ అక్కినేని నుంచి స్వీకరిస్తున్న సావిత్రిగారి కుమార్తె శ్రీమతి విజయ చాముండేశ్వరి. చిత్రంలో శ్రీమతి జమున.

# రచయిత్రి మాట

*పాఠకులకు నమఃసుమాంజలి.*

నాకు మా అమ్మ తర్వాత అత్యంత ప్రియమైన వ్యక్తి సావిత్రి. గత 20 సంవత్సరాల నుండి అమితంగా ప్రేమిస్తూ ఇక నా ప్రేమని నలుగురితో పంచుకోవాలనే తాపత్రయమే ఈ పుస్తకం రాయడానికి పురిగొల్పింది. ఈ పుస్తకం సావిత్రి జీవిత కథ అనో లేక ఆమె జీవిత చరిత్ర అనో నేను చెప్పలేను. నేను విన్న సావిత్రిని, నేను చదివిన సావిత్రిని, నేను తెలుసుకున్న సావిత్రిని, నేను విశ్లేషించిన సావిత్రిని అక్షరరూపంలో పెట్టాను. ఈ పుస్తకం రాయడానికి ఇంకో కారణం, ఒక ప్రముఖ రచయిత "సావిత్రి ఇంకో ఇరవైయేళ్ల దాకా జీవించే ఉంటుంది" అన్నారు. సావిత్రి ఇరవైయేళ్లుకాదు, ఆచంద్రతారార్కం గుర్తుండి పోవాలని, అందుకు నా పుస్తకం కూడా దోహదం కావాలని రాశాను. ఇప్పటి తరం వాళ్లు సావిత్రి గురించి తెలుసుకోవాలనే ఆశతో రాశాను. నా ఆశ ఫలిస్తుందని నమ్మకంతో, నేను చూడలేక పోయిన నా సావిత్రికి ప్రేమతో, ఇదే నా నివాళి.

ఈ పుస్తకం మీ ముందుకు రావడానికి నాకు విశేషంగా సహకరించిన శ్రీయుతులు బత్తుల ప్రసాద్, ఎమ్. రవికృష్ణ (తెలుగు అధ్యాపకులు, ఆర్.వి.ఆర్.బి.ఎడ్ కాలెజ్, గుంటూరు), సి.వెంకట్, పి.దిలీప్ కుమార్ రాజు, వై. శ్రవణ్‌లకు నా ధన్యవాదాలు.

ముందునుంచి నన్ను ప్రోత్సహించిన, సావిత్రిగారి వీరాభిమాని గెడా. రంగారావు గారికి, ఎన్నో మంచి ఫోటోలిచ్చిన జి.ఎన్.భూషణ్ గారికి, సంగమ్ సంజయ్ కిషోర్‌గారికి, నా పుస్తకాన్ని మొదటిసారిగా సమీక్షించి నాకు కొండంత మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిన కుమారి ఎస్.రాధకు కృతజ్ఞతలు.

**పల్లవి**

మహానటి సావిత్రిని గురించి శ్రీమతి పల్లవిగారు రూపొందించిన ఈ పుస్తకం చాలా యదార్థంగా ఆమె జీవితాన్ని ఆవిష్కరించింది.

భారతదేశంలో వున్న ముగ్గురు నటీమణులంటే నాకు ఇష్టం. బెంగాలీ చిత్రసీమకు చెందిన సుచిత్రాసేన్, హిందీ రంగానికి చెందిన మీనాకుమారి, దక్షిణ భారతానికి చెందిన సావిత్రి. ఈ ముగ్గురూ ముగ్గురే.

వీరు నిర్వహించిన పాత్రలను ఒక్కసారి పరిశీలిస్తే ఎంత వైవిధ్య భరితమైన నటనను ప్రదర్శించారో మనకు అవగతమవుతుంది.

తోటి కళాకారిణిగా సావిత్రితో నాకున్న పరిచయం, బాంధవ్యం తీపిగుర్తు. నన్ను నోరారా 'అన్నయ్యా' అని పిలిచే నటీమణులు ఇద్దరు. ఒకరు సూర్యకాంతమ్మ, రెండు సావిత్రి. నటీమణిగా సావిత్రి ఎన్ని శిఖరాలను అధిరోహించిందో నేను ఇప్పుడు కొత్తగా చెప్పవలసిన పనిలేదు. వ్యక్తిగతంగా పరిశ్రమలో అందరికీ ఆత్మీయురాలుగా, ప్రేమాస్పదురాలుగా మెలిగింది. నటిగా ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా వ్యక్తిగా ఒదిగిపోయింది. అందరి మన్ననలను పొందింది. అందరికంటే ఉన్నత స్థానంలో వున్నా ఏనాడూ భేషజాలు, పటాటోపాలు ప్రదర్శించలేదు. కాగా ఆమె జీవితం నటీమణులకు ఒక గుణపాఠం. విధి చేతిలో కొవ్వొత్తిలా కరిగిపోయింది.

హాలీవుడ్ నటీమణి సూసన్ హేవర్డ్ సావిత్రికి వ్రాసిన ఉత్తరంగా ఒక వూహా చిత్రాన్ని పల్లవిగారు నేర్పుగా కూర్చారు. వీరి రచన అసాంతం ఉత్కంఠభరితంగా సాగింది.

మహానటి సావిత్రి పట్ల పల్లవిగారికి వున్న అభిమానం, అప్యాయత అభినందనీయం.

**గుమ్మడి వెంకటేశ్వరరావు**
**22-01-2007**

*చెప్పింది బావుంది, చెప్పవలసింది ఇంకా ఉంది!*

"తెలుసు" అన్న పదంలో, మూడంటే, మూడక్షరాలే ఉన్నాయని మీకూ తెలుసు, నాకూ తెలుసు. కానీ – ఈ పదం విస్తరించే రీతి, వారివారి అనుభవాలను బట్టి ఉంటుంది.

1956కు ముందు, నాకు సావిత్రి నటించిన కొన్ని సినిమాలు తెలుసు. ఆ సినిమాలను గురించిన పత్రికల వారి సమీక్షలు తెలుసు. ప్రేక్షకుల స్పందనలూ తెలుసు – అదీ నా పరిధిలోనే! 1956 తరువాత, ఉద్యోగరీత్యా మద్రాసు వెళ్లాక, జ్యోతి, అభిసారిక, చిత్రసీమ పత్రికలలో ప్రవేశించాక, నాకు తెలిసిన సావిత్రి వేరు, నేను తెలుసుకొన్న సావిత్రి వేరు.

తెనాలిలో ఉన్నప్పుడు, నాకు తెలిసిన సావిత్రికి; మద్రాసు చేరాక నేను తెలుసుకున్న సావిత్రికి; చాలా తేడాలున్నాయి.

పల్లవిగారి, ఈ పుస్తకంలోని సావిత్రి, మరికొన్ని నూతనాంశాలను నాకు తెలిపింది. నాకు బొత్తిగ తెలియని కొన్ని విషయాలను పల్లవిగారి పుస్తకంలో ప్రస్తావించారు. నాకు బాగా తెలుసుననుకొన్న మరికొన్ని అంశాల జాడలు, ఇందులో నేను గుర్తించలేక పోయాను.


కొందరు వ్యక్తులను గురించి, కొన్ని కొన్ని అంశాలను గురించి, ఎంత తెలుసుకొన్నా ఇంకా ఇంకా తెలుసుకొనవలసింది మిగిలి పోతూనే ఉంటుంది! తెలిసిన అన్ని అంశాలను గురించి, చెప్పలేం. తప్పనిసరిగా చెప్పవలసివస్తే, ఆయా అంశాలలోని తీవ్రతను, విషాదాన్ని, బాగా తగ్గించి, బాగా బాగా తగ్గించి, చూచాయగా మాత్రమే చెప్పవలసి వస్తుంది!

మహానటి సావిత్రిని గురించిన, ఈ పుస్తకం; ఆమెను, సరళ – సుందరంగా పరిచయం చేస్తున్నది!

గాలినిండా సువాసనను నింపే మంచి గంధపు ముక్క వంటిది సావిత్రి!

చీకటి చిక్కదనానికి భయపడకుండా ఉజ్వలంగా వెలిగే కర్పూరపు తునక వంటిది సావిత్రి!!

ఆ చందన శకలాన్ని, కర్పూరపు ముక్కను తెలుగు పాఠకులకందించిన పల్లవి గారిని అభినందిస్తున్నాను!



**రావూరి భరద్వాజ**

**22-01-2007**



**4-7-1962 నిశ్చల ఛాయగ్రాహకులు శ్రీ భూషణ్ ఒక ఫంక్షన్‌లో తీసిన ఫోటో**

# మూడో ముద్రణకు ముందు ఇంకొక్క మాట.....

మహానటి సావిత్రిగారి గురించి, ఎవరైనా తెలియదన్నా... ప్రముఖులు, ముఖ్యంగా సినీ పరిశ్రమలోని వారు ఏదైనా మీడియాకు వెల్లడిస్తున్నప్పుడు వారి అభిమాన నటీమణుల జాబితాలో సావిత్రిగారి పేరు లేకపోయినా నాకు తీవ్రమైన అసహనం కలుగుతుంది. అలాంటి నాకు, ఇరవైయేళ్ల వారి దగ్గర నుంచి డెబ్బైవపడిలో వున్నవారి వరకూ ఈ పుస్తకం చదివి, ఫోన్‌చేసి, మాట్లాడారు. వీరంతా సావిత్రిగారిని తలచుకొని గర్వపడ్డారు. ఆమె చివరి రోజులు గుర్తుచేసుకొని చలించిపోయారు. ఇప్పటి యువతరంలో సావిత్రిగారి జన్మదినాన్ని, వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటాలకు పూజలు నిర్వహించే వారు, ఆమెకు ప్రేమ లేఖలు వ్రాసిన వారు వున్నారని తెలుసుకొని మురిసిపోయాను. తెలుగువారందరి హృదయాల్లో, వారి ఆత్మీయురాలిగా, ఆమె పట్ల ప్రేమ, గౌరవం నిండుగా వున్నాయని తెలుసుకొని ఆనందిస్తున్నాను. విస్మృతి, జరయు, మృతియు లేని వారు మహానటి సావిత్రి.

నిజంగా ప్రజల్లో వుండే ఆదరణ, నటనలో మేటితనమే భారతరత్న, పద్మవిభూషణ్, దాదాసాహెబ్‌ఫాల్కే అవార్డులు బహూకరించటానికి కొలబద్దలయితే, మన మహానటి సావిత్రి భారతరత్నమే, పద్మవిభూషణాలంకృతురాలే, ఫాల్కే అవార్డు గ్రహీతే!

మహానటి సావిత్రి మన తెలుగుజాతి సంపద. ఈ తరం వాళ్ళమయిన మనం, ఈ అమూల్యమైన సంపదను ముందు తరాలకి పరిచయం చేయాలి. ఈ ఒక్క పని మనం చేస్తే చాలు, ఆమె నటనని విశ్లేషిస్తూనో, ఆమె స్నిగ్ధత్వాన్ని, మంచితనాన్ని కొనియాడుతూనో, ఆమె జీవిత చరిత్ర మరొక్కసారి తిరగవ్రాస్తూనో.... ఇంకెందరో పల్లవులు పుట్టుకొస్తారు.

ఈ పుస్తకం చదివిన సావిత్రిగారి అభిమాని ఒకరు, నన్ను ఉద్దేశించి, "సావిత్రిగారి అభిమానులు మీకు రుణపడి ఉంటారండి" అన్నారు. ఈ మాట ఎలా వున్నా నేను మాత్రం సావిత్రిగారికి రుణపడి ఉన్నాను. ఎందుచేతనంటే కేవలం వీరి వల్లనే నాకు సావిత్రిగారి ప్రతిరూపమైన శ్రీమతి విజయ చాముండేశ్వరి ఇంకా శ్రీ వరప్రసాద్ శ్రీమతి వసంతగార్ల పరిచయ భాగ్యం లభించింది. నా పుస్తకంలో సావిత్రిగారిని కొనియాడగలిగాను కాని, శ్రీ వరప్రసాద్ శ్రీమతి వసంత దంపతుల విషయంలో మాత్రం నా మనసుకు తట్టిన మాటలు సరిపోవటం లేదు. ఒకవేళ వచ్చినా చిక్కే. ఆ మాటలను పొగడ్తలుగా భావించి వద్దంటారు వీరు. కాని అవి నిజాలు. మంచితనం, ప్రేమా-ఆప్యాయత, కరుణ వంటి మానవత్వపు విలువలకు నిలువెత్తు నిదర్శనాలు. ఈ విలువలు అందరిలోను వెల్లివిరియాలని తపించే పావన హృదయులు.

మొదటి ముద్రణ నుంచి మూడో ముద్రణ వరకు సహకారమందించిన కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత శ్రీబాపన్నగారికి సదా కృతజ్ఞురాలుని.

ఆనాడు నన్ను ప్రోత్సహించి, ఈ పుస్తకానికి విశేష ప్రాచుర్యం కల్పించిన శ్రీ వరప్రసాద్ - శ్రీమతి వసంతగార్లకు, ఆనాటి సభకు (20-8-2007) ముఖ్య అతిథులుగా విచ్చేసిన సావిత్రిగారి కుమార్తె శ్రీమతి విజయ చాముండేశ్వరిగారికి, వారి భర్త శ్రీ వి. గోవిందరావుగారికి, శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారికి, శ్రీమతి జమునగారికి, శ్రీ ఎస్.వి. రామారావుగారికి, పీఠికలు వ్రాసిన శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావుగారికి, శ్రీ రావూరి భరద్వాజగారికి ఎప్పటికి కృతజ్ఞురాలుని. ఈనాడు మూడో ముద్రణకు వచ్చేట్టు చేసిన పాఠకులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

పల్లవి



అదిగో నిశ్శంకర సావిత్రి! అంపశయ్య మీద వుంది. ఈ పేరు చెపితే మీరు బొత్తిగ గుర్తు పట్టకపోవచ్చు. పోనీ కొమ్మారెడ్డి సావిత్రి అంటే ఏమన్నా గుర్తు పడతారా? ఏమో ఇలా కూడా గుర్తు పట్టరేమో, కానీ మహానటి సావిత్రి అంటే మాత్రం చటుక్కున గుర్తుపట్టేస్తారు. అవును ఆ మహానటి సావిత్రే, ఈ జన్మకు చివరి మజిలీ అయిన ఆ అంపశయ్య మీద జీవం ఉండి కూడా నిర్జీవంగా పడివుంది.

జీవం ఉన్నప్పుడు, జీవం ఉండీలేనట్లు ఉన్న ఇప్పుడూ, ఎప్పుడూ సావిత్రిని చూడటానికి వచ్చిపోయే జనానికి తెంపులేదు. అప్పుడు సావిత్రి దగ్గరకు వచ్చిన కారణాలు వేరు, ఇప్పుడు వేరు. ఒకప్పుడు తమ కలలరాణి, హృదయరాణి, నటనకి భాష్యం చెప్పిన మహానటి, నటీశిరోమణి, కలైమామణి, నడిగెయర్ తిలగమ్‌ని చూడటానికి వస్తే ,ఇప్పుడు విధి చేతిలో కొవ్వొత్తిలా కరిగిపోయి మంచానికి అతుక్కుపోయి, పేరుకు మాత్రమే మిగిలి ఉన్న సావిత్రిని చూడటానికి వస్తున్నారు.

ఆ జన సమూహంలో వినవస్తున్న మాటలు .....

" 'పెరిగి విరిగితి, విరిగి పెరిగితి, కష్టసుఖముల సారమెరిగితి' అని ఏనాడో అన్నాడు మహాకవి గురజాడ. కాస్త ఆ వాక్యాన్ని అటుదిటు ఇటుదటు చేసి 'విరిగి పెరిగితి, పెరిగి విరిగితి, కష్టసుఖముల సారమెరిగితి' అంటే మన మహానటికి ఇంకా సరిగ్గా సరిపోతుంది" అన్నాడు ఈనాటి మహాకవి ఒకరు.

"ఆమె ఎవ్వరిని నమ్మలేదు, కనుకనే అందరూ ఆమెకు దూరం అయ్యారు" అన్నది ఒక నటి.

"సావిత్రికి ఉన్న పంతం, మొండితనం నేను ఎవరిలోనూ చూడలేదు, ఆమెను ఈ స్థితికి చేర్చింది ఆ పంతమే" అన్నారొక దర్శకుడు.

"అన్నిటినీ తానే శాసించింది, ఒక్క తాగుడును తప్ప, అందుకే ఇలాగయ్యింది" అన్నారొక నిర్మాత.

"అబ్బా! ఏమి జన్మరా తండ్రీ!" అన్నాడు ఇంకో నటుడు.

'ఏమి జన్మరా!' అనుకునే ఈ జన్మ సావిత్రికి 1936లో జనవరి 4న గుంటూరు జిల్లా చిర్రావూరులో మొదలైంది. భగవంతుడు అందరికీ రాసినట్లే సావిత్రికీ ఒక తలరాత రాశాడు. కాకపోతే అది కొంచెం తలదన్నే రాత. "అమ్మాయ్ సావిత్రీ ! నీ కథలో రెండు పార్శ్వాలు వుంటాయి. నీవు గడపబోయే జీవితం మానవాళికే ఒక పాఠం, నీవు నటించే జీవితం అంత కంటే గొప్ప పాఠాలు" అని చెప్పి సాగనంపాడు. ఇది ఆమె జన్మరహస్యం. భూమిమీద వచ్చి పడ్డాక ఈ జన్మ రహస్యాలు ఎవరికీ గుర్తు వుండనివ్వడు ఆ భగవంతుడు. ఇక్కడ ఒక్కొక్కళ్లు ఒక్కొక్క మిష మీద బ్రతకటమే. ఏదో ఒకటి పొందటానికి పరుగే. అది పేరు కోసమే కావచ్చు, డబ్బు కోసమే కావచ్చు, ప్రేమ కోసమే కావచ్చు. అందరిలాగే సావిత్రి కూడా పరిగెత్తింది. సరిగ్గా ఇదే వరుసలో పరిగెత్తింది. సావిత్రి విషయంలో విధి విలాసం ఎలా వుందంటే ఒక్క పేరు తప్ప మిగతా రెండు దొరికినట్లే దొరికి విడిచి పోయాయి. వాటి కోసం మళ్లీ పరుగు పెట్టక తప్పలేదు.

సావిత్రి తల్లి పేరు (అల్లాడ) సుభద్రమ్మ. తండ్రి నిశ్శంకర గురవయ్య. గురవయ్యది గుంటూరు జిల్లా తెనాలి దగ్గర చింతలపూడి గ్రామం. సుభద్రమ్మది అదే జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామం. గురవయ్య వ్యవసాయం, రైసు మిల్లులు కట్టే వృత్తిలో వుంటూ, హరికథలు చెప్పే ప్రవృత్తిలో వుండేవారు. 1934లో వీరిద్దరికి ఒక ఆడపిల్ల పుట్టింది. 'మారుతి' అని నామకరణం చేశారు. 1935లో సుభద్రమ్మ మళ్లీ గర్భం దాల్చగా ఆమె పుట్టింటికి చేరుకుంది. చిర్రావూరులో రెండో బిడ్డ పుట్టగా 'సావిత్రి' అని నామకరణం చేశారు. బిడ్డ పుట్టిందని తెలియగానే గురవయ్య వచ్చి చూసుకున్నారు. 'మళ్లీ ఆడపిల్లేనా' అనుకున్నా, కళాకాంతులతో తూగుతున్న చిన్నారి సావిత్రిని చూసి మురిసిపోయారు. తిరిగి చింతలపూడి వెళ్లారు. కుటుంబాన్ని చూసుకోవటానికి చిర్రావూరు అప్పుడప్పుడూ వస్తూపోతూ ఉన్నారు. కచ్చితంగా ఎన్నిసార్లు వచ్చారో చెప్పలేంగాని సరిగ్గా సావిత్రికి ఆరునెలలు నిండగా ఆయన టైఫాయిడ్‌తో చనిపోయారనే వార్త వచ్చింది. సుభద్రమ్మ పిల్లలతో బయలుదేరి వెళ్లి భర్తని ఆఖరిచూపు చూసుకోగల్గింది.

గురవయ్య వెళ్లిపోయిన పదిహేను రోజులకు ఎటువాళ్లటు వెళ్లిపోయారు. ఇల్లంతా ఖాళీ అయింది. భర్త కుటుంబం నుంచి సుభద్రమ్మకు ఆమె పిల్లలకు అక్కడే ఉండి బతుకుబండిలాగే ఆదరణ లభించలేదు. భర్త తాలూకు ఆస్తి ఆమె దాకా రాలేదు. అడిగి

తీసుకునే శక్తి ఆమెకు లేదు, ఆమె వెనుక నిలబడి అడిగే మనిషీ లేదు. ఆ ఊరిలో ఆఖరి ప్రయత్నంగా, ఒకరోజు సుభద్రమ్మ సావిత్రిని, మారుతిని తీసుకొని దిబ్బకు వెళ్లింది. అప్పటికే ఆ దిబ్బ మీద కొంతమంది పని చేస్తున్నారు. కరణం కూడా ఉన్నాడు. వీళ్లను చూసి దగ్గరకు వచ్చాడు.

"ఏంటి సుభద్రమ్మా ఇంట్లో పని వదిలేసి ఇటు వచ్చావు? నీ ఔదు చేయికి ఇంకో రెండు చేతులు తోడా" అని అడిగాడు.

"నేను పని చేయటానికి రాలేదు. అడగటానికి వచ్చాను. మీరు నా దిబ్బ ఎందుకు కలుపుకుంటున్నారు?" అరిచింది సుభద్రమ్మ.

"నీ పెనిమిటి చేసిన అప్పుకు ఈ దిబ్బ సరిపోయింది. వాడు రాసిచ్చిన కాగితాలు నా దగ్గర వున్నాయి, పంచాయితీ పెట్టమంటావా?" తిరిగి అరిచాడు కరణం.

సుభద్రమ్మ ఇంకో మాట మాట్లాడకుండా అక్కడ నుంచి వచ్చేసింది. ఇక ఆ ఊరిలో లాభం లేదనుకుంది. తోడికోడలు ఇంటికి వెళ్లి పుట్టింటికి వెళ్తున్నానని చెప్పింది.

"అంతే కదమ్మా, పెనిమిటి పోయాక ఇక పుట్టిల్లేకదా గతి" అంది తోడికోడలు. నీ బాధ్యత మాది కానేకాదు, ఇక్కడ మాకు బరువెందుకు అనే అర్థాలు స్ఫురింపచేస్తూ.

సుభద్రమ్మ, మారుతి, సావిత్రిలు చిర్రావూరు చేరుకున్నారు. సుభద్రమ్మ తండ్రి రత్తయ్యకు మిలటరీలో ఉద్యోగం. అందుచేత ఆయన, ఆయన భార్య రత్తమ్మ ఎక్కడో ఉత్తర భారతదేశంలో వున్నారు. చిర్రావూరులోనే ఇంకో అక్క అన్నపూర్ణమ్మ కూడా కాపురం అయినా సుభద్రమ్మ కుటుంబానికి అక్కడ జరుగుబాటు కాలేదు. 'ఒక తల్లి బిడ్డలు అర్థం చేసుకుంటారు కాని, వాళ్లని కట్టుకున్నవాళ్లు అర్థం చేసుకోరుకదా' అనిపించింది సుభద్రమ్మకు. చిర్రావూరులో చింతలపూడి కన్నా రోజులు భారంగా గడుస్తున్నాయి. అప్పటికే బెజవాడలో ఉంటున్న తన అక్క దుర్గాంబ తన దగ్గరకు వచ్చేయమని ఎన్నోసార్లు కబురుపెట్టింది. చిర్రావూరులో అస్సలు లాభం లేదనుకుని తీర్మానించుకున్నాక, అక్కాబావకు వూరు విడిచి వెళ్తునట్లు తెలియపర్చింది. మర్నాడు మళ్లీ బట్టలు సర్దటం మొదలుపెట్టింది. అప్పటికి సావిత్రికి మూడేళ్లు, మారుతికి అయిదేళ్లు.

"అమ్మ మనల్ని దూరంగా తీసుకుపోతుంది. గుర్రం బండి ఎక్కిస్తుంది. రైలు కూడా ఎక్కిస్తుంది" అనుకుంటూ "ఎక్కడికమ్మా? ఎక్కడికి?" అని మారాం చేయసాగారు పిల్లలు. సుభద్రమ్మ గట్టిగా అరిచింది "కాసేపు మూల కూర్చోండి పోయి". ఉలిక్కిపడ్డారు ఇద్దరూ. చెరో మూలకెళ్లి పోయారు. సుభద్రమ్మ పోపుపెట్టె తిరగేసి దాంట్లో వున్న చిల్లర డబ్బులు తీసుకుంది. చివరికి ఒక తాబేలంతటి తాళం తీసుకుని బయటకు వచ్చేసింది.

సావిత్రికి ఆకలి మొదలైంది. "అక్కా అకలే, అన్నం కావాలి" అని అక్కను అడిగింది. ఇద్దరూ నీరసంగా తల్లి వైపు చూశారు."అమ్మా ఆకలి" అరిచింది సావిత్రి. మారుతి కూడా నసిగింది.

సుభద్రమ్మ ఒక్క క్షణం ఆలోచించి, పక్కింటికి తీసుకెళ్లింది. లోపల ఎక్కడో దొడ్లో వుంది రత్తమ్మ. సుభద్రమ్మ స్నేహితురాలు రత్తమ్మ.

వీళ్లను చూడగానే "సుబ్బా! ఎక్కడికే, ఎక్కడికో బయలుదేరినట్లు వున్నావు?" అని అడిగింది రత్తమ్మ .

సుభద్రమ్మ సమాధానం చెప్పలేదు.

"రత్తాలూ! వీళ్లకి తింటానికి ఏమన్నా వుంటే పెట్టవే, పొద్దున తింటమే వీళ్లు" అంది సుభద్రమ్మ.

"వుండు సద్దన్నం వుంది వీళ్లిద్దరికీ పెట్టేస్తా. నీకు కాస్త పొయిమీద వేస్తా వుడుకుద్ది."

"వద్దు రత్తాలూ వద్దు. నేను చీకటి పడే లోపల బండ్ల దగ్గరకెళ్లాలి" అని వారించి, "నువ్వు వచ్చి కూర్చో, కాసేపు మాట్లాడాలి" అంది సుభద్రమ్మ.

సుభద్రమ్మ చాలా విషయాలు చెప్పింది రత్తమ్మకి. "ఇంతకీ... ఎక్కడికి ప్రయాణం?" అడిగింది రత్తమ్మ.

"ఇంకెక్కడకి దుర్గాంబ దగ్గరికి, బెజవాడకు."

"బెజవాడకా ! దుర్గాంబ దగ్గరకా?" ఆశ్చర్యపోయింది రత్తమ్మ.

"అవును మరి దుర్గాంబ దగ్గరకే. ఇంకెక్కడికి వెళ్లను? చూస్తూనే ఉన్నావుగా అక్క ఒక్కతే ముగ్గుర్ని పోషించలేదు కదా. ముందు దాని దగ్గరికి వెళ్లి, అక్కడా వీలు కాకపోతే అప్పుడు ఆలోచిస్తా" నిట్టూర్చింది సుభద్రమ్మ.

"బియ్యం పొయ్యిమీద వేసుంటే ఈ పాటికి వుడికేది. నువ్వు కాస్త తినేదానివి వాళ్లు కడుపు నిండా తినేవాళ్లు" అంది రత్తమ్మ. వాళ్లలా మాట్లాడుకుంటుండగానే మారుతి కాస్త అన్నం మిగిల్చి సుభద్రమ్మకని తీసుకొచ్చింది.

"ఇంకేం సుబ్బా ,ఈ ఇద్దరూ ఉండగా నీకేమి బాధమ్మా? నిన్ను చక్కగా చూసుకుంటారు. ఇంకోసారి ఆలోచించు సుబ్బా, దుర్గాంబే ఇంకొకళ్ల మీద ఆధారపడి బతుకుతుంది. మీరు ముగ్గురు అక్కడ ఎట్లా?"

"ఏం చేయను రత్తాలు. ఈ వూరిలో ఎలా పొట్ట నిండేది?"అంది. అలా అంటున్నప్పుడు ఆమె కనుకొనల్లో నీళ్లు నిలిచాయి.

"నేను లేనా సుబ్బా ,నువ్వు ఏ ఇబ్బంది పడకు. ఇబ్బంది అనుకున్నప్పుడు నా దగ్గరకు వచ్చేయి" భరోసా ఇచ్చింది రత్తమ్మ, సుభద్రమ్మ మీద చెయ్యివేసి.

"తప్పకుండా వస్తా రత్తాలు" అని కళ్లుతుడుచుకుని బయలుదేరింది సుభద్రమ్మ.

"ఇప్పుడు ఏమీ తినకుండా వెళ్తున్నావ్ అదే నా బాధ."

"చీకటి పడేసరికి బండ్ల దగ్గరకు చేరుకుంటే బాగుంటుంది కదా,తర్వాత ఉత్తరం ముక్క వేస్తా " అంది సుభద్రమ్మ.

"ఉత్తరం కాదు ఒకసారి వచ్చి పో."

"అలాగే వస్తానే. వుంటామరి. ఇల్లు ఒక కంట కనిపెట్టు. కాసిని ఎచ్చాలు అవీ ఇవీ వున్నాయి. తీసుకొని వాడుకో."

"ఏంటోనే పిల్లలు మీరు వెళ్లేటప్పుడైనా మీకు కడుపునిండా అన్నం పెట్టలేకపోయాను" బాధపడింది రత్తమ్మ.

సుభద్రమ్మ, రత్తమ్మ ఒకరినొకరు విడవలేక విడిచారు. సుభద్రమ్మ వూరినంతా ఒక్కసారి కలయ చూసుకుంది. అప్పటి వరకు గుండెల్లో గూడుకట్టుకున్న బాధ ఒక్కసారిగా బయటికి వచ్చింది. "అయిపోయింది రత్తాలూ, ఈ ఊరితో నాకు రుణం తీరింది" బావురుమంటూ రత్తమ్మ మీద పడిపోయింది. తేరుకొని బయలుదేరింది.

బెజవాడ చేరుకునేసరికి రాత్రి అయ్యింది. సుభద్రమ్మ, దుర్గాంబ అప్పటికే నిద్రపోయిన సావిత్రిని, మారుతిని బండిలోంచి దించి ఇంట్లో పడుకోబెట్టారు. అక్కాచెల్లెళ్లు ప్రొద్దున్నే లేచేసరికి ఓ కొత్త గదిలో వున్నారు. గది చాలా చిన్నది. అటుపక్క ఓ వంటగది. వంటగది దాటగానే దొడ్డి. నలుగురు కలసి పక్కపక్కన పడుకున్నారంటే చాప పరిచినట్లు సరిగ్గా సరిపోయేది వాళ్లకు. అది వాళ్ల అమ్మ దుర్గాంబ వుండే ఇల్లు. వాళ్ల పెదనాన్న వచ్చినప్పుడు మాత్రం వాళ్లు ఏ పక్కింటికో వెళ్లేవాళ్లు. ఒక్కోసారి చిర్రావూరు కూడా వెళ్లేవాళ్లు. సుభద్రమ్మకు బెజవాడలో పొట్ట పోషించుకునే పని ఏమీ లేదు. దుర్గాంబ కూడా ఇంట్లోనే. ఇక దుర్గాంబ భర్త తెచ్చే డబ్బులే ఆధారం. ఆయన పేరు కొమ్మారెడ్డి వెంకట్రామయ్యచౌదరి. కారు డ్రైవర్. గోగినేని పెద్దబ్బాయి, చిన్నబ్బాయి అనే పెద్ద వ్యాపారస్థుల దగ్గర కారు నడపడం, ఇంకా తక్కిన ఆఫీసు పనులు చేస్తుంటాడు. ఆయన అప్పుడప్పుడు నెలల తరబడి డ్యూటీ మీద పోయేవాడు. అప్పుడు వీళ్లకు పస్తులు తప్పేవికాదు. శుచి శుభ్రం లేని వీధి, నలుగురిమీద ఎంత శుభ్రంగా వుంచాలన్నా వీలుగాని నాలుగు అడుగుల గది, పస్తులు, డబ్బులు అరువు అడగటం, ఇది సావిత్రి బ్యాక్‌గ్రౌండ్, హంబుల్ బ్యాక్‌గ్రౌండ్. కాని ఈ సంగతి చెప్పుకోవటానికి సావిత్రి ఏనాడు సిగ్గుపడలేదు. దాచేందుకూ ప్రయత్నించలేదు. కాని, ప్రతి విషయం, ప్రతి

వస్తువు, ప్రతి ఆలోచన, కాలంతో పాటు మారుతాయి. ఈ రోజు నచ్చింది రేపు ఏవగింపు కలిగిస్తుంది. ఈ బ్యాక్‌గ్రౌండ్ విషయంలో కూడా సావిత్రి కాలంతో పాటు మారింది.

1953లో 'దేవదాసు' తర్వాత సినిమా పత్రికలు సావిత్రి గురించి లోతుగా, విపులంగా ప్రశ్నించినప్పుడు సావిత్రి తన గత జీవితం కప్పిపుచ్చే ప్రయత్నం చేయలేదు. కాని 1959 నుంచి ఒక కఠినమైన నిర్ణయం తీసుకుంది. ఏ పత్రికా తన బ్యాక్‌గ్రౌండు గురించి రాయకూడదని. ఆ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందంటే....

సావిత్రి 1959లో ఒకసారి విజయవాడ వచ్చింది. అప్పుడు తనతోబాటు 'మాంగల్యబలం' విజయోత్సవ సంబరాలు తాలూకూ ఆ సినిమా యూనిట్ ఉంది. కొంత తీరిక చేసుకొని సావిత్రి, సూర్యారావుపేటలో తాను ఉన్న ఇంటిని, ఇరుగు పొరుగువారిని చూసుకోవటానికి వచ్చింది. తీరా వచ్చేసరికి అక్కడకు విలేఖరులు కూడా చేరుకున్నారు. కుశలప్రశ్నలు పూర్త య్యాక, కలం, అట్ట చేత పుచ్చుకున్నారు. అంటే ఇంటర్వ్యూ మొదలవుతుందన్నమాట. సావిత్రి ఇప్పుడు చెప్పిన విషయాలు అవసరాన్ని బట్టి వాళ్లు ఎప్పుడో ఒకసారి పత్రికల్లో రాసేస్తారు. వాళ్లు అవీ ఇవీ అడుగుతున్నారు.

ఇంతలో వెనక నుండి ఒక గొంతు గట్టిగా వినిపిస్తున్నది. "నా తల్లి ఎన్ని కష్టాలు పడింది, ఎన్ని కష్టాలు పడింది, ఎన్నని చెప్పను......."

అందరూ అటువైపు తిరిగి చూశారు. ఇంకెవరు రాజ్యం పిన్ని. సావిత్రి బెజవాడలో ఉన్నన్ని సంవత్సరాలు రాజ్యం, సావిత్రి కుటుంబం ఇరుగుపొరుగు వాళ్లు. 'రాజ్యం పిన్ని' అని పిలిచేది సావిత్రి. రెండు కుటుంబాలు స్నేహంగా ఉండేవి. 'అహా నేను కష్టాలు పడ్డానని ంత బాధ పడుతుంది రాజ్యం పిన్ని' అనుకుంది సావిత్రి.

ఇంత వరకు బాగానే వుంది.ఆ తర్వాత...

"వాళ్లకు ఇంట్లో మెతుకు అన్నం లేకపోతే నేను పెట్టా. వాళ్ల ఇంట్లో ఎచ్చాలకి డబ్బులు లేకపోతే నేను ఇచ్చా. పాపం బడికి పోవటానికి కూడా డబ్బులు లేకపోయాయి" అంటూ చెప్పుకుపోతుంది. కాస్త అటూ ఇటూగా ఇవన్నీ నిజాలే. కాని నిష్ఠూరమైన నిజాలు. నలుగురిలో ఇబ్బంది పెట్టే నిజాలు. నిజాలు ఇలా పలుపలురకాలుగా ఉంటాయని విడమర్చి చెప్పింది రాజ్యం పిన్ని. చాముండి దగ్గర నుంచి కూడా సంకేతాలు అందాయి సావిత్రికి. అప్పటికే ఇంగ్లీషు బాగా వంటపట్టడంతో వాళ్లకి ఇంగ్లీషులో స్థిరంగా చెప్పింది అవేమీ రాసుకోవద్దని.అప్పట్నుంచి సావిత్రి చిన్నప్పటి ఆర్థిక పరిస్థితి గురించి రాసే సాహసం ఏ పత్రికా చెయ్యలేదు.

ఇక్కడ రాజ్యం పిన్ని ప్రదర్శించిన హావభావాలు గురించి కూడా కాస్త చెప్పుకోవాలి. సావిత్రిని ఆ మునుపటి పిల్లలాగా చూడలేక పోయింది. డబ్బు, హోదా, స్థాయి, అసలు మనిషిని మార్చటం తర్వాత మాట, అవతల మనిషి ఎలా మారుతుందో నిలువెత్తు నిదర్శనం రాజ్యం పిన్ని. సావిత్రి దగ్గర కూర్చోలేక పోతుంది ,నుంచోలేక పోతుంది. ఏదో పని ఉన్నట్లు లోపలికి వెళుతుంది, మళ్లీ బయటకు వస్తుంది. అది నవ్వో ఏడుపో తెలియని నవ్వు. సావిత్రి వచ్చినందుకు సంతోషిస్తుందా, ఇబ్బంది పడుతుందా అంటే ఇబ్బందే పడుతుంది. 'రాజ్యం పిన్ని తనను ఎత్తుకున్నంత పని చేస్తుంది. తనను ముద్దులతో ముంచెత్తి దిష్టిమీద దిష్టి తీస్తుంది' అని ఊహించింది సావిత్రి. 'కాని ఏంటిది రాజ్యం పిన్నికి ఏమయింది' అని మధనపడుతుండగా చాముండి సైగ చేసింది, ఇక వెళితేనే అందరికీ మంచిదని.

మళ్లీ వెనక్కి వెళితే, సుభద్రమ్మ కుటుంబం బెజవాడలో స్థిరపడింది. అక్కాచెల్లెళ్లు ఇద్దరూ కస్తూరిబాయి మెమోరియల్ స్కూల్‌లో చేరారు. వీళ్లు బడికివెళ్లే దోవలో ఒక డాన్స్ స్కూలు వుండేది. బడికి వెళ్లేటప్పుడు తిరిగి వచ్చేప్పుడు నాట్యం చేసే పిల్లల్ని చూసేది సావిత్రి. సంవత్సరాల తరబడి చూసినందుకో ఏమో లేక వాళ్ల నాన్న వారసత్వమో కాని, సావిత్రిలో కూడా ఆ లయ వచ్చేసింది. ఎవరూ నేర్పకుండానే 8 ఏళ్లకే నాట్యగత్తెల లాగా మెడ తిప్పటం వచ్చేసింది.

అడక్కుండానే సావిత్రికి దేవుడు ఇచ్చిన వరాల్లో మొదటిది, చూడగానే కనిపించేది వర్చస్సు. సావిత్రిలో ఒక గ్రేస్ వుండేది. సావిత్రి నేరేడుపండంత నలుపయినా శరీరం కాంతిని వెదజల్లేది. కళ్లల్లో జీవం ఉట్టిపడేది. పెద్ద పెద్ద కళ్లతో ముఖం చాలా కళగా వుండేది. ఆ చిన్న వయసులోనే చూసిన వారెవ్వరూ సావిత్రి మీద నుంచి చూపు మరల్చుకునేవారు కాదు. ఒకటికి రెండు సార్లు మళ్లీ వెనక్కి తిరిగి చూసేవారు. బుగ్గలు పట్టుకొని లాగేవారు. బడిలో ఏ పనన్నా చేసుకురావాలంటే పంతుళ్ల దగ్గరకైనా, అబ్బాయిల దగ్గరకైనా సావిత్రినే ముందుకు నెట్టేవారు. సావిత్రి ఆ పని సాధించుకొచ్చేది. ఈ వయసులో సావిత్రిలో వచ్చి చేరిన లక్షణం ఒకటేమిటంటే, అందరూ తన అందాన్ని పొగడటంతో తన అందం మీద విపరీతమైన నమ్మకం. ఈ నమ్మకం సావిత్రికి బలాన్ని ఇచ్చింది, కాస్త గర్వం కూడా ఇచ్చింది.

ఇక్కడ ఒక్క మాట. సావిత్రి తన అందాన్ని దేనికీ పణంగా పెట్టాల్సిన అవసరం రాలేదు. ఎందుకంటే సావిత్రిది ఫర్వాలేదు అనిపించే అందం కాదు. ప్రత్యేకమైన అందం. సావిత్రి కంటే అందమైన వాళ్లు ఉండరని కాదు, కచ్చితంగా వుంటారు. సావిత్రి సమకాలీనులలోనే వుండి ఉంటారు. కాని సావిత్రి నడిచిన దోవలో మాత్రం అదృష్టవశాత్తు వాళ్లు ఆమెకు పోటీ కాలేదు. అందుచేత సావిత్రి రారాణిగా వెలుగొన్నది.

మళ్లీ సావిత్రి తొమ్మిదో ఏటికి వస్తే, వాళ్ల ఇంటి సందులో ఇద్దరు అబ్బాయిలు వుండేవారు. సావిత్రి కన్నా పదేళ్లు పెద్ద అయి వుండవచ్చు. పేర్లు కృష్ణమూర్తి, చౌదరి. ఈ పేద సావిత్రిని, పొగరుబోతు సావిత్రిని సమూలంగా మార్చిన వాళ్లలో మొదటి చెప్పుకోవలసిన పేర్లూ వీళ్లవే.

వీళ్లిద్దరి చూపులు ఎప్పుడూ సావిత్రి మీదే. ఇలా ఓర చూపులు చూసే వాళ్లని సావిత్రి అస్సలు వదిలేదికాదు. ఇంకా ఆటపట్టించేది. 'బావగారు' అని పిలిచేది. సావిత్రికి ఈ అలవాటు చాలా కాలందాకా వుండిపోయింది. ఒక్కసారి ఈ పేరుతో పిలిస్తే ఎప్పుడూ సరదాగా అలాగే పిల్చేది. ఇక అవతల వాళ్లు తిరిగిన మెలికలు వూహించుకోవచ్చు.

చలాకీగా వీధి అంతా కలయతిరిగే సావిత్రిని కృష్ణమూర్తి, చౌదరిలు సావిత్రిని పిలుస్తూ ఉండేవారు. సావిత్రి వాళ్లకు పొగరుగా సమాధానం చెపుతుండేది. "రాను పో" అనేది. వాళ్లిద్దరూ సావిత్రి పొగరులో కూడా ఆమె అందాన్ని చూసుకొని మురిసిపోయేవారు కాని కోపగించుకునేవాళ్లు కాదు. వాళ్ల ఇంటి తలుపుతట్టి 'బావగారు' అని గట్టిగా కేక పెట్టి కవ్విస్తూ ఉండేది. చౌదరి ఒకరోజు సావిత్రి ఇంటికి వచ్చాడు.

చౌదరిని చూడగానే, సుభద్రమ్మ "ఏంటి బాబు, సావిత్రి మీ ఇద్దరిని బాగా ఆటపట్టిస్తుందంటగదా" అంది.

"ఫర్వాలేదండి. మీకో విషయం చెపుదామని వచ్చాను..... మీరు సావిత్రికి డాన్స్ నేర్పించండి. అమ్మాయికి మంచి నాట్యగత్తెకు కావలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. ఎత్తు మాట అటుంచండి అమ్మాయికి గ్రహించే శక్తి కూడా చాలా మెండు. చాలా పైకి వెళ్తుంది" అని తాను చాలారోజులుగా చెప్పాలనుకున్నది చెప్పాడు.

సుభద్రమ్మకి అర్థం కాలేదు. 'డాన్స్ నేర్చుకొని పైకి వెళ్లటం ఏమిటి... ఏ పైకి' అన్నట్టు ఒకసారి పైకప్పు వైపు చూసింది.

"నా స్నేహితుడు డాన్స్ స్కూల్ నడుపుతున్నాడు. అక్కడ నేర్చుకున్న అమ్మాయిలందరూ నాటకాల్లో వేషాలు వేస్తూ బాగా సంపాదిస్తున్నారు. పేరుకు పేరు, డబ్బుకు డబ్బు తెచ్చుకుంటున్నారు. వాడి దగ్గరికెళ్లినప్పుడల్లా నేను ఆ అమ్మాయిలను గమనిస్తూ ఉంటాను. వాళ్లకెవరికీ మన సావిత్రి తీసిపోదు. అందుకని సావిత్రికి డాన్స్ నేర్పించండి" ప్రాధేయపడ్డాడు చౌదరి.

"డబ్బు, పేరు దేవుడెరుగు నాయనా, అభం శుభం తెలియని ఆడపిల్లను జనం మీదకి, ఊళ్లమీదికి పంపించలేం కదా. ఇక వెళ్లు" అంటూ వాకిలి వైపు నడిచింది.

చౌదరి బిత్తరపోయాడు, సుభద్రమ్మ వైపు చూస్తూ వాకిలి వైపు నడుస్తున్నాడు. అప్పుడే లోపలికి వస్తున్న వెంకట్రామయ్యచౌదరిని గుద్దుకున్నాడు.

"ఏమిటి అబ్బాయ్, ఏంటి ఇటు వచ్చావ్? వెళ్తున్నావే? రా కూర్చో..." అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"ఊరికేనండీ...." నసిగాడు చౌదరి.

"వచ్చిన విషయం ఏమిటో చెప్పు" నువ్వు చెప్పకుండా కదలటానికి వీల్లేదు అనే ధోరణిలో అడిగాడు వెంకట్రామయ్యచౌదరి.

" సావిత్రిని డాన్స్‌లో చేర్పించమని సుభద్రమ్మ గారికి చెప్పటానికి వచ్చానండి."

"చెప్పావా లేదా?"

"చెప్పానండీ."

"ఏమంది సుభద్రమ్మ?"

"వద్దన్నారండి."

"నేను అవునంటున్నాను పో."

ఆనందం కంటె ఆశ్చర్యం ఎక్కువ కనిపించింది చౌదరిలో.

"అయితే రేపు వుంటారు కదండీ, నేను వచ్చి నా స్నేహితుడి డాన్స్ స్కూలుకి తీసుకు వెళ్తానండి."

"దోవ చూపటం కోసం అయితే నువ్వు రానవసరం లేదు, నేను ఇప్పుడు అక్కణ్ణుంచే వస్తున్నా" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

చౌదరి మారు మాట్లాడలేదు. సంతోషంగానే వెళ్లాడు.

దుర్గాంబ వెంకట్రామయ్యచౌదరికి మంచినీళ్లు తీసుకొచ్చింది. అవి తాగిన తర్వాత, "ఏం సుభద్రమ్మా ,నీకు డాన్సు గురించి ఏం తెలుసని వద్దని చెప్పావు. దానికీ డాన్సు ఇష్టమేకదా!" అంటూ తిట్టినంత పనిచేశాడు.

"ఎదుగుతున్న పిల్లకదా అని" సుభద్రమ్మ సణిగింది.

"నేనక్కడనుంచే వస్తున్నా, అంతా ఎదుగుతున్న పిల్లలు, ఎదిగిన పిల్లలే నేర్చుకుంటుంది వాళ్లు గాక నీలాంటోళ్లు నాలాంటోళ్లు వెయ్యరు కదా డాన్సు. వీళ్లు నేరుగా నాటకాల్లోకి వెళ్లి, ముండలు ఎంత సంపాదిస్తున్నారనీ" అన్నాడు.

ఆ చివరి మాటకు సుభద్రమ్మ గతుక్కుమంది. 'ఓ పక్క డాన్సు అని పొగుడుతున్నాడు మళ్లీ ముండలు అంటున్నాడు' అనుకుంది.

"నేను అంతా కనుక్కొచ్చా. రేపే వెళ్లిచారొచ్చు." ఇంకేమీ మాట్లాడేందుకు లేదన్నట్లు వెంకట్రామయ్యచౌదరి లేచాడు. ఇంక సుభద్రమ్మ కుటుంబం పక్క ఇంట్లోకి జారుకున్నారు.

తరువాత రోజు పొద్దున్నే వీళ్ల దగ్గరకి దుర్గాంబ వచ్చింది. "ఏమిటీ ఇంకా తయారు కాలేదా" అంది.

"ఏమిటే మీ ఆయన .... ఒక పక్క ముండలు అంటాడు, అక్కడికే తీసుకువెళ్తానంటాడు" అంది చిరాగ్గా సుభద్రమ్మ.

"అయ్యో నువ్వు అది పట్టుకు కూర్చున్నావా? ఆయన మాట తీరే అదికదా. నాకంతా చెప్పాడులే. నాటక సమాజాలు నాటకాల మీద, డాన్సుల మీద బాగా సంపాదిస్తున్నాయట, అమ్మాయిలు ఎంత బాగా చేస్తే అంత బాగా గిరాకీఅట. డాన్సంటే ఏవో పిచ్చిడాన్సులు కాదు 'రామాయణం', 'మహాభారతం', 'హరిశ్చంద్రుడు' అట్లాంటి కథలకు డాన్సులు. దీని అదృష్టం బాగుండి, అన్నీ బాగుంటే ఇది మనకు తిండి పెట్టదూ!" అంది దుర్గాంబ.

అదేంటో దుర్గాంబ అన్నట్టుగానే ఇక్కడ నుండి సావిత్రికి అన్నీ బాగానే వున్నాయి. మరి సావిత్రికి బాగోనిది ఎప్పుడు? చాముండిలాంటి మార్గదర్శకులు తనకు దూరం అయినప్పుడు.

శిష్లా పూర్ణయ్య శాస్త్రి దగ్గర నృత్యం నేర్చుకోవటానికి ఆ రోజు బయలుదేరింది సావిత్రి. భారతదేశ చలనచిత్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిన రోజది. నటనకు పర్యాయపదమైన నటీశిరోమణి తొలి అడుగు అది.

సావిత్రి, మారుతీలతోబాటు రోజూ సుభద్రమ్మ కూడా డాన్స్ తరగతులకు వచ్చేది.

ఓ పది రోజులు తర్వాత మాష్టారు సుభద్రమ్మతో "సుభద్రమ్మగారు, మీ చిన్నమ్మాయి కేమి ఢోకా లేదు. బాగా గ్రహించేస్తుంది, మీ పెద్దమ్మాయి మీరుంటే చూపంతా మీవైపే. అందుచేత మీరు రాకుండా ఉంటే బాగుంటుంది" అని అన్నారు.

ఆ తర్వాత సుభద్రమ్మ వెళ్లటం మానేసింది.

చౌదరి ఎప్పుడూ వస్తూనే వుండే వాడు. అప్పుడప్పుడు చౌదరితో కలిసి కృష్ణమూర్తి బావగారు కూడా వచ్చేవాడు.

డాన్స్ నేర్చుకోవటం ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. సంవత్సరం తిరిగే లోపల ప్రదర్శనలు ఇవ్వగలిగిన స్థాయికి చేరుకుంది సావిత్రి.

1946లో బెజవాడలోని రామ్మోహన గ్రంథాలయంలో మొదటి నృత్య ప్రదర్శన ఇచ్చింది సావిత్రి. ఆ ప్రదర్శనను సావిత్రి తల్లి, అమ్మ, వెంకట్రామయ్యచౌదరి, రాజ్యం పిన్ని, ఇంకా ఇరుగు పొరుగు వారంతా వచ్చిచూశారు. ఎంతో బాగా చేసింది సావిత్రి. అంతా

మెచ్చుకుంటుంటే సుభద్రమ్మ పొంగిపోయింది. తన పెనిమిటి కూడా ఉండి ఉంటే ఎంత బాగుండేది అనుకుంది. అది మొదలు బెజవాడ, బెజవాడ పరిసర ప్రాంతాల్లోను సావిత్రి ప్రదర్శనలు ఇస్తూనే ఉంది. సంక్రాంతి, శివరాత్రి, శ్రీరామనవమి, నవరాత్రులకు, ఇంకా ఇతర సాంస్కృతిక కార్యక్రమాలకు శిష్ట్లా పూర్ణయ్యశాస్త్రి ఆయన శిష్యులతో ఆయా సందర్భాన్ని బట్టి నృత్యాలు వేయించేవారు. ఇలా ఒక సంవత్సరం గడిచింది. నృత్యంలో ఎంతో పట్టు సాధించింది సావిత్రి. ఇక విధి తన పనిలో భాగంగా సావిత్రిని అరుణోదయ నాట్యమండలికి పరిచయం చేసింది.

సుంకర కనకయ్యగారి 'అరుణోదయ నాట్యమండలి' సావిత్రిని, సావిత్రి జీవితాన్ని మార్చేసిన సంస్థ. సావిత్రిని బాహ్య ప్రపంచానికి పరిచయం చేసిన సంస్థ. దక్షిణ భారత సినిమాకి ఒక వజ్రాన్ని తెచ్చి ఇచ్చిన సంస్థ.

ఒకరోజు నృత్యం సాధన చేస్తుండగా ఇద్దరు పెద్దమనుషులు వచ్చారు.

పూర్ణయ్యశాస్త్రి మాష్టారు కూర్చోమని సైగ చేశారు. కూర్చున్న వాళ్లు అందరిని గమనిస్తున్నారు. వాళ్లకి డాన్స్ బాగా తెలుసులావుంది.

ఒక అంకం పూర్తయిన తర్వాత "అమ్మాయిలు మీరు కాసేపు ప్రక్కన నుంచోండి, ఈ అతిథులు ఎవరో మీకు చెప్తాను" అన్నారు మాస్టారు.

"మాష్టారు, రండి ఇక్కడకి రండి" అంటూ వారిని పిలిచారు.

"వీరిద్దరూ 'అరుణోదయ నాట్య మండలి' అని ఒక గొప్ప నృత్య సంస్థను నడుపుతున్నారు. వీరు మన తెలుగు దేశమంతా తిరిగి నృత్య ప్రదర్శనలు ఇస్తూ వుంటారు. ఈ రోజు మీలో వాళ్లకి నచ్చిన వాళ్లని వాళ్ల ట్రూప్‌లో చేర్పించుకుని, మీ చేత ప్రదర్శనలు ఇప్పించి, మీకు తగిన పారితోషికాలు ఇస్తారు" అన్నారు.

"అయితే డాన్స్ చేసి చూపించమా?" అంది లీల అనే ఒక అమ్మాయి.

"అవసరం లేదమ్మా. ఇందాక మీరు సాధన చేస్తున్నప్పుడు వాళ్లు చూశారు" అన్నారు పూర్ణయ్యశాస్త్రి.

"అదేదో ముందే చెప్తే నేను సరిగ్గా చేసేదాన్ని కదండీ" పేలింది లీల.

"అవును.... ముందు చెపితే వాళ్లు ఎవరో? ఎందుకు వచ్చారో? అని ఆలోచించకుండా డాన్స్ చేసే వాళ్లం కదా" అంటూ గర్జించారు మిగతావాళ్లు.

మాస్టారు నవ్వుకున్నారు, 'నిజమే కదా' అనుకున్నారు. 'వీళ్ల జీవితాలని మార్చే విషయం ఇది. వీళ్లకి చెప్పకుండా వుండటం తప్పే' అనే నిర్ణయానికి వచ్చి,

"సరే అమ్మాయిలూ, చాలా తప్పయిపోయింది. ఇదిగో ఇప్పుడు మీరు మళ్లీ చేయండి, రండి" అని కర్ర కొట్టడం మొదలు పెట్టారు మాస్టారు.

అంతలోకి ఆ వచ్చిన వాళ్లు "శాస్త్రిగారు, ఇదుగోండి ఈ అమ్మాయిని పక్కన పెట్టండి, మిగతావాళ్ల చేత చేయించండి" అన్నారు సావిత్రిని చూపుతూ.

అందరూ ఆశ్చర్యపోయారు. అమ్మాయిల మొహాల్లో రంగులు మారిపోయాయి.

"పిల్లలూ, వాళ్లు ఇంకా ఒక్కళ్లని తీసుకుంటారు. సావిత్రి ఎలాగూ వెళుతుందని నాకు ముందే తెలుసు. మీ అందరి మీద దేనిలో చూసినా సావిత్రి ఒక మెట్టు ఎక్కువే" అన్నారు పూర్ణయ్యశాస్త్రి.

ఆ తర్వాత వాళ్లు అందరిని చూసి చివరకి ఇద్దరిని తీసి, వాళ్లిద్దరినీ తరచితరచి చూసి, చివరకి లీలని తీసుకున్నారు.

ఈ విషయం ఇంట్లో చెప్పి, సావిత్రిని వాళ్ల పెదనాన్నని తీసుకురమ్మన్నారు.

ఆ మర్నాడు సావిత్రి వెంకట్రామయ్యచౌదరిని వెంటబెట్టుకొని పూర్ణయ్యశాస్త్రి దగ్గరకు వచ్చింది.

"ఏంటి పూర్ణయ్యశాస్త్రిగారు, మా అమ్మాయిని వాళ్లు ఎంచుకున్నారటగా?" అడిగాడు వెంకట్రామయ్యచౌదరి.

"అవునండి! మీరు ఒక్కసారి వాళ్లకి కనిపించండి" అన్నారు పూర్ణయ్యశాస్త్రి.

"ఒక్కసారి ఏంటి? ఈ రోజు మూడోసారి నేను కలిసి వస్తుంది వీళ్లని."

"అన్నిసార్లు ఎందుకు కలవాల్సి వచ్చిందండి? ఒకసారి వూరికే కనిపిస్తే సరిపోతుందిగా" కుతూహలంగా అడిగారు పూర్ణయ్యశాస్త్రి.

"ఆ... వూరికే కనిపిస్తే సరిపోతుంది, దాని చేత వూరికే డాన్సులు చేయించి వూరికే పంపేస్తారు" వెటకారంగా అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"వాళ్లని డబ్బులు అడిగారేంటి కొంపదీసి. వాళ్లు ఎంతో కొంత కచ్చితంగా ఇస్తారండి."

"ఎంతో కొంత నాకెందుకు. దీని డాన్సు ఉంటేనే డేరా నిండేది. అంతటి దానికి ఎంతో కొంత ఇస్తే నేనెందుకు వూరుకుంటా? పంపించనని చెప్పివచ్చా."

"కొంప ముంచావు కదయ్యా" తల కొట్టుకున్నారు పూర్ణయ్యశాస్త్రి.

"సావిత్రిని పంపిస్తే కదా, నీకైనా నాకైనా ఏదైనా దక్కేది, ఆదిలోనే హంసపాదైతే ఎట్లాగయ్యా?"

"మళ్లీ నీక్కూడా వాటానా?"

"నాకు వాటా అంటూ ఏమి వుండదండీ... పిల్ల మొదటిసారిగా ప్రదర్శన ఇచ్చిన తర్వాత నాకు తాంబూలం, దక్షిణ ఇస్తారు. ఇటు వైపు మీరు తృణమో, ఫణమో ఇవ్వక పోరు కదా?" అన్నారు పూర్ణయ్యశాస్త్రి.

"నా వైపు నుంచి అటువంటి ఆశలు పెట్టుకోకు" మొహమాటం లేకుండా అనేశాడు వెంకట్రామయ్యచౌదరి.

"అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినా తిననివ్వదు అంటే ఇదే. వెంకట్రామయ్యచౌదరి గారూ, ఇప్పుడు మీరు డబ్బులు అడిగే పరిస్థితిలో లేరు. మీరు సావిత్రిని ఇవ్వనంటే లీలతో చేయిస్తారు. అదీ గాక, వాళ్లు అస్సలు ఇవ్వమని ఏం అనడంలేదు కదా. నా మాట వినండి, కాస్త ఓపిక పట్టండి. అమ్మాయి ఓ రెండు ప్రదర్శనలు ఇచ్చిందంటే బిడియం పోతుంది, ఇంకా రాటు తేలుతుంది. అప్పుడు మీరే అడుగుదురుకాని" బతిమిలాడారు పూర్ణయ్యశాస్త్రి.

"దానికసలు బిడియం ఎక్కడుంది, నీ దగ్గర బిడియపడిందా? ఈ ఊళ్లో ప్రదర్శన ఇచ్చేటప్పుడు బిడియపడిందా?"

"నాదగ్గర అంటే వాళ్ల అమ్మ మొదటి నుంచీ వస్తూ ఉంది. పిల్లలంతా తెలిసిన వాళ్లు. ఇక ప్రదర్శనలంటే వాటన్నింటికి వాళ్ల అమ్మ, ఆమ్మతో సహా అందరం దగ్గర ఉన్నవాళ్లం. అయినా పిల్ల స్టేజిమీద ఉన్నప్పుడు బిడియపడ్తుంది. కాస్త బిగుసుకు పోతుంది. స్టేజిమీద వందలమంది ముందు చేయాలి. ఎవరైనా తప్పకుండా భయపడతారు. నేను ఎంత మందిని చూడలేదు. పైగా నా స్వానుభవము కూడా అదే" అన్నారు పూర్ణయ్యశాస్త్రి.

"నీవెక్కడ గురువ్వయ్యా బాబూ! అది భయపడదో అన్నా కూడా నువ్వు దానికి భయం నేర్పించేటట్లున్నావ్."

"నామాట వినండి. అమ్మాయిని వాళ్ల ట్రూప్‌లో చేరనివ్వండి. అమ్మాయి భవిష్యత్తు పాడుచేయద్దు" అని ప్రాధేయపడ్డారు మాష్టారు.

కాసేపు ఆలోచించాడు వెంకట్రామయ్యచౌదరి.

"సరే, నువ్వు చెపుతున్నావుగా, దీనిని ఇవ్వకపోతే ఇంకోదాంతో చేయిస్తారని, సరేకానీ, దీనినే లోపలికి పంపించి రెండు మూడు ఆటలు కానిచ్చి ఆ తర్వాత చెప్తా వాళ్ల సంగతి" అని సమాధానపడ్డాడు వెంకట్రామయ్యచౌదరి.

"హమ్మయ్య, అరుణోదయ నాట్యమండలికి మంచి నాట్యగత్తె దొరికింది" అన్నారు పూర్ణయ్యశాస్త్రి మాష్టారు. "అమ్మాయ్! సావిత్రి! నువ్వు ఇంకో మెట్టు ఎక్కేశావమ్మా! ఈ మాష్టారుని మాత్రం మర్చిపోవద్దు" అన్నారు సావిత్రితో.

'అరుణోదయ నాట్యమండలి' సావిత్రిని, సావిత్రి స్థితిగతులను సమూలంగా మార్చి, తన 30 ఏళ్ల పబ్లిక్ లైఫ్‌కి పునాది వేసిన సంస్థ. ఇంకా తెలిసీ తెలియని వయస్సుల్లో సావిత్రిలో వున్న పొగరు స్థిరపడిపోయే సమయంలో సావిత్రికి ఈ అనంతలోకంలో తన స్థాయి ఏంటో తెలియ చెప్పిన సంస్థ.

సావిత్రికి అరుణోదయ నాట్యమండలి ప్రదర్శనల ద్వారా వచ్చిన పేరు అంతా ఇంతా కాదు. సావిత్రిని చూడటానికే జనం వచ్చేవాళ్లు. అతి త్వరలోనే అరుణోదయ నాట్యమండలిలో ముఖ్యమైన నాట్యగత్తె అయింది సావిత్రి. రాధాకృష్ణ అనే ఒక నృత్య రూపకంలో సావిత్రి వేసే కృష్ణుడు వేషం ఎంతో బాగా ఉండేది. సావిత్రికి పేరు తెచ్చిన ఇంకో నృత్యరూపకం పాములవాడి నృత్యం. ఈ గుర్తింపుతో సావిత్రి కళ్లకు బైర్లు కమ్మాయి. ఒకసారి రాజమండ్రిలో ప్రదర్శనకు వెళ్లారు. ఆ రోజు తన మండలి అంతా ఎప్పుడూ లేనంత హడావుడిగా ఉంది. డేరా ఎప్పుడో నిండిపోయింది.

"ఏంటే లీలా ! వీళ్లందరూ నిన్ను,నన్ను చూడడానికేనా వచ్చింది" అడిగింది సావిత్రి.

"నన్ను ఎందుకు కలుపుతావులే నీతో, నేనింకా గ్రూప్ డాన్సేగా, నువ్వు ఎంచక్కా సోలో అయిపోయావు" అంది లీల.

'ఏదోలేవే మాటవరసకి కలుపుకున్నాను నిన్ను' మనసులో అనుకుంది సావిత్రి.

సావిత్రి తన మేకప్ వేసుకుంటుండగా ఒక ముసలతన్ని కుర్చీతో సహా తెచ్చి కూర్చోబెట్టారు.

'ఈయన కూడా నన్ను చూడటానికే వచ్చాడా ఏంటి' అనుకొని, నవ్వుకుంది సావిత్రి.

ఆయన అలా వచ్చీరాగానే, ఎనౌన్సుమెంటు వినిపించింది. సావిత్రి పరుగున స్టేజి మీదకి వెళ్లింది.

"ఇప్పుడు మీరు అంతా ఎదురుచూస్తున్న ఘడియ రానే వచ్చింది. ఇప్పుడు ప్రసిద్ధ రంగస్థల నటులు......" అంటూ ఏవో చెప్పుకు పోతున్నారు, కాని సావిత్రి మాత్రం స్టేజి మీదకి వచ్చేసింది.

ఎప్పుడూ అయితే సావిత్రి రాగానే ఈలలు చప్పట్లుతో డేరా మారుమ్రోగిపోయేది. ఈసారి అలా ఏమీ జరగలేదు, సావిత్రికి ఆశ్చర్యమేసింది. పైగా అందరిలో ఏదో అసహనం, 'మధ్యలో ఈ పిల్ల ఏంటిరా బాబు' అన్నట్లు. సావిత్రికి చాలా చిన్నతనంగా అనిపించింది. తల ఎత్తుకోలేక పోయింది. అంత మేకప్ మీద కూడ సావిత్రి మొహం ఎర్రబారింది. ఉక్రోషం తన్నుకొచ్చింది. వీళ్లు ఎదురు చూస్తున్నది వేరే వారి కోసమని అర్థమయింది. వెనక్కి తిరిగి



వెళ్లబోయింది. సావిత్రి స్టేజి దిగే లోపల అంతకుముందు చూసిన ముసలాయన్ను అదే కుర్చీలో పైకి తీసుకువచ్చారు. ఆయన వచ్చీరాగానే ఎంతో మంది పైకి వచ్చి ఆయనకు నమస్కారం చేసుకున్నారు. ఆయన దాకా రాలేకపోయిన వాళ్లు, దూరం నుంచి చూస్తూ, ఆయన్ను ఒక్కసారి చూడ గలిగితే చాలు అన్నట్లు తరిస్తున్నారు. సావిత్రికి అంతు పట్టలేదు. 'ఎవరీయన? ఇంతమంది భక్తులేంటి ఈయనకి?' అనుకుంది. జనం బారులుతీరి వస్తున్నారు, సావిత్రి చూస్తూండి పోయింది. ఆ జనాలు సావిత్రిని అటుఇటూ తోస్తున్నారు.

అంతా సద్దుమణిగాక, ఆయనకు మైకు ఇచ్చారు. "మీరు అంతా నాకు ఎంతో భక్తితో నమస్కరించారు. మీరు మీ భక్తి సమర్పించింది నాకు కాదు, నాలో ఉన్న కళకి. ఈ కళ నాలో ప్రవేశపెట్టిన ఆ భగవంతుడికి, నేను నిమిత్తమాత్రుడ్ని. ఈ కళ నాలో ప్రవేశపెట్టి మిమ్మల్ని సన్మార్గంలో రంజింపచేసే అవకాశం ఇచ్చిన ఆ భగవంతుడికి నేను ఎప్పుడూ కృతజ్ఞుడిని" అన్నారాయన.

ఆయన పద్యాలు పాడటం మొదలు పెట్టారు. అంత వయస్సయినా కాని మరుపు రాలేదు. పైగా గొంతులో స్పష్టత, పట్టు పోలేదు. పద్యాలు పాడిన తర్వాత, పాటలు మొదలు పెట్టారు. కాళ్లు పనిచేయక పోయినా, ఆయన చేతులు ముద్రలు ప్రదర్శిస్తూ నృత్యం చేస్తున్నాయి.

ఆయన పాటకు లయగా సావిత్రి అంతరాత్మ నృత్యం చేయసాగింది. ఆయన అభినయిస్తున్న ముద్రలు సరిగ్గా చేయలేక పోయింది. ఆయన స్వరంలోనే అన్ని వాయిద్యాలు వినిపిస్తున్నాయి. సావిత్రికి ఆ క్షణం తెలిసొచ్చింది, నాట్యం అంటే తాను వేసే కుప్పిగంతులు కాదని, తను ఈ కుప్పిగంతులు వేసి తనను తాను మోసం చేసుకోవటమే కాకుండా చూడటానికి వచ్చే ప్రేక్షకులని కూడా మభ్యపెడుతుందనిపించింది. తనకు నాట్యంలో తెలిసింది చాలా తక్కువ, నేర్చుకోవల్సింది అనంతమని, అది తన జీవిత కాలంలో నేర్చుకోలేదేమోననిపించింది.

ఆ దెబ్బతో సావిత్రి ఒదిగిపోయింది. ఈ సంఘటన సావిత్రి మీద బలమైన ముద్ర వేసింది. ఆ రోజు నుంచి అంతర్ముఖి అయింది. ట్రూప్‌లో వున్నప్పుడు గట్టిగా ఎవరినైనా అరుద్దామన్నా ఆ ముసలాయన గుర్తుకు వచ్చి నెమ్మదించేది. నిదానంగా సావిత్రి గర్వం అణిగింది. ఆ తర్వాత తెలిసింది సావిత్రికి, తన గర్వం దించిన వ్యక్తి నాట్య నాటకరంగంలో ప్రఖ్యాతుడయిన శ్రీ ముంజులూరి కృష్ణారావు అని. 'ఎంతటి మనిషి దిగి రావల్సి వచ్చింది తన గర్వం అణచివేయటానికి' అనిపించింది సావిత్రికి.

కాని తర్వాత సావిత్రి దగ్గరకు చేరిన డబ్బు, కీర్తి, నటన పై తనకున్న పట్టువల్ల తనలో ఒక అధికారం వచ్చిచేరింది. అందువల్ల తనే కొన్ని చోట్ల చొరవ తీసుకోవటం వంటివాటిని

చూసి సావిత్రికి లేని గర్వం, తాను వదిలేసిన గర్వం తనకు మళ్లీ ఆపాదించిన సందర్భాలు కోకొల్లలు.

సావిత్రి కాస్త అణగి మణిగి వుండటం మంచిదయ్యింది. ఎందుకంటే ముందు ముందు నాటకరంగంలో ఎంతో గొప్ప నటులు తనకు తారసిల్లారు. అప్పటికే వున్న సీనియర్లు ఎవరూ అందుకోలేని కళానిధులు అయితే, తనకంటే పది సంవత్సరాలు పెద్దయిన వాళ్లు కూడ గొప్పవాళ్లే. ఈ రెండో కోవకు చెందిన వాళ్లే సినీ కళాకారులయ్యారు.

సావిత్రి సినీరంగ ప్రవేశం ఎలా జరిగిందో తెలుసుకోవాలంటే సావిత్రి నాటక రంగంలోకి ఎలా వచ్చిందో తెలుసుకోవాలి.

ఒక్క వర్షాకాలం తప్ప మిగతా రోజులన్నీ ట్రూప్‌తో పాటు తెలుగుదేశమంతా ప్రదర్శనలకు తిరుగుతుండేది సావిత్రి. ఈ ట్రూప్ ప్రముఖ పట్టణాలన్నిటిలో ప్రదర్శనలిచ్చేది. వీరి ప్రదర్శనలకు నోచుకోని చిన్న చిన్న వూర్లలో ఆయా వూరి వాళ్లు పట్టుపట్టి తీసుకెళ్లేవారు, ప్రదర్శనలిప్పించుకునే వారు.

వెంకట్రామయ్యచౌదరి సావిత్రితో పాటు టూర్‌కి బయలుదేరడుగాని, ఏదో ఒక వూర్లో సావిత్రికి దర్శనమిచ్చేవాడు. ఒకసారి విజయనగరంలో ప్రదర్శనలిస్తుండగా ముందు వరుసలో సావిత్రికి కనిపించాడు. సంస్థ నుంచి డబ్బు తీసుకుపోయేవాడని ఆ తర్వాత తెలిసేది సావిత్రికి. సావిత్రి డబ్బు గురించి ఎప్పుడూ పట్టించుకునేది కాదు. తనకు ఎంత ఇస్తున్నారో కూడ తెలిసేదికాదు. అసలు వాళ్ల అమ్మకు ఇచ్చేవాడా? అనే ఆలోచన కూడా సావిత్రికి రాలేదు అప్పట్లో.

ఇంకోసారి తిరుపతిలో దర్శనమిచ్చాడు.

"మీ పెదనాన్న డబ్బుల కోసం వచ్చినట్లున్నాడే!" అంది లీల.

"పొద్దాకల డబ్బులు గొడవేనేంటి మా పెదనాన్నకి, నన్ను చూడటానికి వచ్చాడు" అంది సావిత్రి.

ఎదురుగా కూర్చొని డాన్స్ చూశాడుగాని ఆ తర్వాత సావిత్రికి కనిపించలేదు.

'లీల దగ్గర నా పరువు తీసేశాడు' అనుకుంది సావిత్రి.

మిగతా వాళ్ల సంగతి ఎలా ఉన్నాగాని సావిత్రికి మాత్రం ఇలా ఊళ్లు తిరగటం, ప్రదర్శనలివ్వటం ఎంతో సరదాగా అనిపించేది. మంచి స్నేహితురాలయిన లీల సావిత్రికి ఎప్పుడూ తోడుగా ఉండేది. స్వతహాగా సావిత్రి చాలా చలాకి పిల్ల. కృష్ణమ్మ ప్రక్కన పుట్టినందుకో ఏమో కాని ఆ కృష్ణమ్మలాగా ఎప్పుడూ, గలగల మాట్లాడుతూ తిరుగుతూనే ఉంటుంది. ఆపైన ప్రతి ప్రదర్శన వెనకాలే పొగడ్తలు. ఆకలి అయ్యీ అవ్వంగానే భోజనం తయారు.

ట్రూపు ఏ వూరిలో వుంటే ఆ వూరి వాళ్లు ట్రూపు సభ్యులను ఎంతో ఆదరించేవారు. ఒకసారి దుగ్గిరాలలో ఆ వూరు పెద్ద మనిషి, వాళ్ల అమ్మాయితో సహా వచ్చి వాళ్ల ఇంటికి తీసుకువెళ్లి భోజనం పెట్టారు. తర్వాత రోజు కూడా వాళ్ల ఇంట్లోనే స్నానాలు చేశారు. ఆ ఇంటి అమ్మాయి ట్రూపులో అమ్మాయిలందరినీ 'అక్కా', 'అక్కా' అని పిలుస్తూ వాళ్లని అంటిపెట్టుకుని తిరిగింది. ఇలాంటి అనుభవాలు, విశేషాలు ఒక్క ఊరిలోనే ఎన్నెన్నో. ఒక్క ట్రిప్పు తిరిగి వస్తే, ఇంటికి వచ్చిన తర్వాత అందరికి చెప్పటానికి ఎన్ని విషయాలు వుండేవో సావిత్రికి.

★ ★ ★

ఆంధ్రదేశంలో ఒక్క అరుణోదయ నాట్యమండలే కాదు, ఇంకా చాలా సంస్థలు ప్రదర్శనలు ఇచ్చేవి. ఒక ట్రూప్‌ని తయారు చేసుకొని వాళ్లని పోషించి తిప్పగలిగిన వాళ్లు ప్రదర్శనలిచ్చి డబ్బులు సంపాదించుకుంటున్నారు.

ఒకరోజు ఒక అందమైన యువకుడు అరుణోదయ నాట్యమండలికి వచ్చి ఒక నాటాకానికి తగిన అమ్మాయిలు కావాలన్నాడు. ఇలా ఎవరొచ్చినా, ముందు పిలిచేది సావిత్రినే..

"ఈయన జగ్గయ్యగారు. మంచి కళాకారుడు, కళాపోషకుడు కూడా. వాళ్ల నాటకానికి నిన్ను తీసుకెళ్లటానికి వచ్చారు" అన్నారు సుంకర కనకయ్య.

"అయ్యా !ముందు చూడనివ్వండి. అమ్మాయి ఎంత మాత్రం సరిపోతుందో" అంటూ జగ్గయ్య కంగారు పడ్డాడు. సావిత్రి ఒక చూపు చూసింది. దాని అర్థం అతనికి అవగతమయింది.

"అమ్మాయ్! నాటకానికి ఒక అమ్మాయిని ఎంచుకోవాలంటే పెళ్లికోసం పెళ్లిచూపులు చూసినంత. పెళ్లికూతురు మాట, నడక చూసుకుంటామా, ఇదీ అంతే. ఏదీ ఒక అంకం వేసి చూపించమ్మా" అన్నాడు వచ్చిన జగ్గయ్య.

సావిత్రి సత్యభామ అంకం చేసి చూపింది.

అప్పుడప్పుడు ఆయనకేసి సత్యభామ విరుపులు విరుస్తూ అంకం పూర్తిచేసింది.

ఆయన మాట్లాడబోతుండగానే...

"బావగారూ, నచ్చానా ...... ?" అంది

"అమ్మా ,ఎంత గడుసు పిల్లండి?" అన్నాడు జగ్గయ్య

"నీ నృత్యం కంటె నీ గడుసుతనం నచ్చింది. గడుసుదనంతో ఈ సత్యభామ పాత్రని ఇంకా మెప్పించవచ్చు" అన్నాడాయన.

"బావగారూ, నేను మాత్రం ఇంతవరకు నాటకం వేసి యెరుగను. నాకు వచ్చింది నృత్యనాటికలు మాత్రమే" అంది సావిత్రి.

"నాకా పేరు ఖాయం చేశావా ఏమిటి, వినేవాళ్లు ఏమనుకుంటారు?"

"మీకూ నాకూ ఏమీలేనప్పుడు వినేవాళ్లు ఏమనుకుంటే ఏమి బావగారు?" అంది సావిత్రి.

"అబ్బో కాస్త గడుసుకాదు మహా గడుసు."

"సరేనండీ మాష్టారు, ఈ అమ్మాయి మాకు కరెక్టుగా సరిపోతుంది. ఇంకో అమ్మాయి కావల్సి వస్తుందండి."

"మా లీల వుందండీ" ఠక్కున అంది సావిత్రి.

"ఆవిడా నీ శిష్యురాలయితే సరే, ఇక చూడనక్కరలా. సరేనండీ మాష్టారు, అంతా రూఢీ అయిపోయింది. రేపు మా సంస్థకు తీసుకురండి. సాధన మొదలు పెడదాం. ఆ మిగతా విషయాలు కూడా మాట్లాడుకుందాం" అన్నాడు జగ్గయ్య.

"ఆ మిగతా విషయాలు అన్నారు చూడండీ, అవి మాట్లాడటానికి నేను సరైనవాడిని కాదు" అని ఇంకా చెపుతూనే ఉన్నారు కనకయ్య.... అంతలో జగ్గయ్య "మీరు కాదా? కొంపదీసి ఆ విషయాలు కూడా ఈ గడసరితోనే మాట్లాడాలా?" అన్నాడు.

"ఆ విషయాలేమీ ఈ పిల్లకు పట్టవండీ పాపం, వెంకట్రామయ్యచౌదరి అని వాళ్ల పెదనాన్న వస్తాడు, ఈ అమ్మాయి విషయం చెప్పీచెప్పగానే మీ మీద డేగలాగ వచ్చి వాలతాడు. నన్ను ముప్పుతిప్పలు పెట్టాడు. మాట్లాడితే అమ్మాయిని తీసుకెళ్లి పోతానంటాడు. మామూలు డబ్బుకి కాంట్రాక్టు రాయనంటాడు. నేను ముందు కాంట్రాక్టు తీసుకోలేదు. చూద్దాం అసలు ఏ మేరకు ఈ అమ్మాయి నెట్టుకొస్తుందా అని, తీరా చూస్తే ఈ అరుణోదయ నాట్యమండలి నెట్టుకురావటానికి ఈ అమ్మాయి అత్యవసరం అయిపోయింది. ఇక నా బాధలు ఎవరి చెప్పుకోను?" అన్నారు.

"ఈ అమ్మాయికి చెప్పలేదా? ఆ మాత్రం మిమ్మల్ని కాపాడలేక పోయేదా?"

"పాపం ఏమాటకి ఆ మాట చెప్పుకోవాలి. ఈ అమ్మాయికి నాటకరంగానికి పనికొచ్చే అన్ని కళలూ వున్నాయి. నాట్యం, గానం, అనుకరణ, అందం, వర్చస్సు, కాని వట్టి బోళాపిల్ల ఇంకేవీ పట్టవు. నాట్యం దాని సాధన. ఇవి అయిపోతే ఇక పరాచకాలు, కబుర్లు,చిన్నపిల్లతో ఏమని చెప్తాను నా బాధలు, పైగా తన వాళ్లమీద. అందుకని నా బాధలు నేనే పడ్డాను."

"అమ్మా ఇంత కథ వుందా ఈ పిల్ల వెనుక! సరే, రానీయండి అతగాడిని, నేను కట్టుదిట్టమైన కాంట్రాక్టు రాయించేసేస్తాను. సరేనమ్మాయ్, రేపు మీ మాష్టారుతో కలిసి, మీ పెదనాన్న ,నువ్వు మా సంస్థకు రండి" అంటూ లేచాడు జగ్గయ్య.

"సరే బావగారు, వస్తాం" అంది సావిత్రి.

నవ్వుకుంటూ వెళ్లిపోయాడు జగ్గయ్య.

సావిత్రి సినిమా రంగంలోకి రావటానికి ప్రత్యక్షంగా దోహదం చేసింది ఈ నాటకరంగమే. ఇక్కడ అందరూ సినిమాల్లో వేషాలు కోసం వువ్విళ్లూరుతున్నవాళ్లే, సావిత్రిని జగ్గయ్య నాటకాల్లో ప్రవేశ పెట్టాక, ఎన్నో నాటికలు చేసింది. మళ్లీ అదే ఊర్లు తిరగటం. ఈ ఊర్లన్నిటికీ సావిత్రికి తోడు ఒక ట్రంకుపెట్టె ఇంకా లీల. జగ్గయ్య నాటక సంస్థలో చేస్తున్నప్పుడు 1948లో కాకినాడలో అఖిల భారత నృత్య,నాటిక పోటీలు, ఉత్సవాలు జరిగాయి. జగ్గయ్య ట్రూపుతో సావిత్రి కూడా పోటీలకు కాకినాడ చేరుకొంది. అక్కడ సావిత్రి, పాములవాడి నృత్యం, ఇంకా 'బాలరాజు' సినిమాలో అంజలిదేవి అభినయించిన 'తీయని వెన్నెలరేయి' అనే పాటను కూడా అభినయించింది. ఇవి రెండు కూడా ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులు కోరికమేర రెండోసారి కూడా సావిత్రి చేత ఆ నృత్యాలు చేయించారు. సావిత్రిని మళ్లీ నృత్యం చేయమన్న వారిలో ప్రేక్షకులే కాదు, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పృథ్వీరాజ్ కపూర్ కూడా ఉన్నారు. ఆ పోటీలలో సావిత్రి మొదటి బహుమతి గెలుచుకుంది. పృథ్వీరాజ్ కపూర్ బహుమతి ప్రదానం చేశారు. అంతకంటే గొప్ప బహుమానం ఏమిటంటే, పృథ్వీరాజ్ కపూర్ స్వయంగా సావిత్రిని మెచ్చుకోవటం.

సావిత్రిని పక్కన కూర్చోబెట్టుకొని "బేటీ, చాలా బాగా చేశావు. నీకు మంచి ఫుట్‌వర్క్ ఉంది, కీపిట్ అప్" అన్నారు.

"ఈ అమ్మాయికి మంచి భవిష్యత్తు ఉంది" అని సావిత్రి సంస్థ వారితో కూడా చెప్పారు. ఈ ఉత్సవాల్లోనే సావిత్రికి దుక్కిపాటి మధుసూదనరావు పరిచయమయ్యారు. ఆయన తన 'ఎక్సెల్షియర్ క్లబ్'ని ఆ ఉత్సవాలకు తీసుకొచ్చారు.

సావిత్రి అన్ని నాటక సంస్థలతో పనిచేసింది. యన్.టి.రామారావు నడిపే 'నేషనల్ ఆర్ట్ థియేటర్' సంస్థలో చేసే అవకాశాలు వచ్చాయి. ఇంకా దుక్కిపాటి మధుసూధనరావు సంస్థలో కూడా నాటకాలు ఆడింది.

సావిత్రి అన్ని నాటక సంస్థలతో పని చేసిందంటే, దానికి కారణం వాళ్ల పెదనాన్నే.

వెంకట్రామయ్యచౌదరి ఒకరోజు జగ్గయ్య దగ్గరకి వచ్చాడు. "ఏమిటండీ ఒంటిచేత్తో మీ సంస్థను నడిపిస్తుంది, ఇంతటి అందమైన పిల్ల ఇంకేదైన నాటక సంస్థలో వుందా చెప్పండి? దీని పేరు చెపితే కదా జనాలు వస్తుంది, అలాంటి పిల్లకు జీతంభత్యం పెంచరా?"

గరకీ తిండి



నృత్యప్రదర్శన ఇస్తున్న పదకొండేళ్ల సావిత్రి

ఫోటో సౌజన్యం : సుంకర కనకయ్యగారి పుస్తకంలోనుంచి



1948 కాకినాడలో నాటకోత్సవాలు

పృథ్వీరాజ్ కపూర్‌తో సావిత్రి, నిర్మలమ్మ తదితరులు

A C. No. 91132

"నాకు ఆదాయం వస్తే అలాగే ఇస్తా. నాకే రానప్పుడు నేనేమి ఇవ్వను? ఏదన్నా సినిమా వచ్చిందా, ఆ చుట్టు పక్కల నాటకాలు ఆడటానికి లేదు. ఇంకెక్కడైనా నాటకం ఆడామా, మొదలు పెట్టకముందు డబ్బు ఇచ్చి వచ్చేది సగం, మొదలయ్యాక తీరిగ్గా డేరాలో చూరేది మిగతా సగం. ఇక నాకు వచ్చేది ఎంత నీకు ఇచ్చేది ఎంత?"

"నేను కాంట్రాక్టు రాయనిది దేనికి? మీరు పెంచకపోతే దీన్ని ఇంకో చోటుకి తీసుకువెళ్లడానికే."

అలా సావిత్రిని మారుస్తూనే ఉన్నాడు వెంకట్రామయ్యచౌదరి. నాటకాలకి డబ్బులు బాగా రాలుతున్న మాట నిజమే. కాని అప్పుడు నాటకాల్లో వున్నవాళ్లెవరికీ నాటకరంగం నిలబడుతుందన్న నమ్మకం లేదు.

సరిగ్గా సావిత్రి నాటకాల్లోకి వచ్చినప్పుడు సినిమాలు బహుళ ప్రజాదరణ పొందుతున్నాయి. "ఇంక నాటకాలు ఎవరు చూస్తారురా నాయనా, అందుచేత మనము ఇక డేరా ఎత్తేయటమే" అనే మాటలు వచ్చేశాయి. నాటకాలు ఆడేవారందరి చూపు సినిమాల వైపే. పైగా సినిమా వాళ్లు అడపా దడపా నాటక సంస్థల దగ్గరకొచ్చి నటులను చూసుకుని తీసుకువెళ్లేవారు. అందరి మదిలో ఒకటే ఆలోచన.... 'కాస్త అటు ఇటుగా నాటక రంగం మూతపడవలసిందేగా, ఇది మూత పడేదాకా నేను ఇక్కడెందుకు కూర్చోవడం, అందుకే నేనే ముందు సినిమాల్లోకి వెళతాను' అని.

★★★

'నవభారత నాట్యమండలి'

ప్రొప్రైటర్: కె.వి.చౌదరి. నృత్య దర్శకులు: కోట సుబ్రహ్మణ్య శర్మ.

ఒక టూర్ నుంచి ఇంటికి వచ్చేసరికి, ఇంట్లో ఈ బానర్ కట్టివుంది.

"ఇదేంటమ్మా? ఇది ఎవరిదీ మన ఇంట్లో వుంది" అడిగింది సావిత్రి.

"ఎవరిదో కాదే తల్లీ , మనదే. మీ పెదనాన్న ఈ నాటక సంస్థ స్థాపించాడు. ఇక నిన్ను ఎవరి సంస్థలలోనూ వెయ్యనివ్వడంట!" చెప్పింది దుర్గాంబ.

'ఇదేంటి అందరూ నాటక రంగం నుంచి చల్లగా జారుకుంటుంటే ఈయన ఏకంగా నాటక సంస్థనే స్థాపించాడు?' అనుకుంది సావిత్రి.

"చూడవే ఆ డ్రైవరు ఉద్యోగం మాని మరీ ఈ పని మీద తిరుగుతున్నాడు, నిన్ను నమ్ముకుని ఈ పని చేస్తున్నాడు. ఆ చిన్నబ్బాయి గారు ఇప్పటికి ఓ పదిసార్లయినా మనిషిని

పంపించారు మీ పెదనాన్న కోసం. ఈయన వెళ్లితేనా? ఇక నువ్వేనే మా అందరకీ తిండి పెట్టేది" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకుంది దుర్గాంబ.

'ఇంత సాహసానికి ఒడికట్టాడా మా పెదనాన్న' అనుకుంది సావిత్రి.

ఒక డ్రామా కంపెనీ నడపటం అంటే ఏమిటో ప్రత్యక్షంగా మూడు సంవత్సరాలు చూసింది సావిత్రి. దానికి ఎంతో ఓపిక కావాలి. అలాంటిదేది వెంకట్రామయ్యచౌదరి దగ్గర లేదు. అంత మందితో వ్యవహారం నడిపేటప్పుడు ఓపిక చాలా అవసరం. ఒక్కళ్లు అలిగినా నాటకం స్టేజి ఎక్కదు. ఇదంతా వెంకట్రామయ్యచౌదరి వల్ల కాదు. కాని స్వానుభవం అయితే కాని తత్వం బోధపడదన్నట్లు ఆయనకు ఇప్పుడు ఎవరేం చెప్పినా బేఖాతరే.

మొత్తానికి ఒక ముహూర్తం నిశ్చయించాడు. మొదటి నాటకం కనుక అందరినీ సౌమ్యంగా ఒప్పించి, వాళ్లు అడిగినదానికి తప్పక, తలవంచి అందరనీ ఒక తాటి మీదకి తెచ్చి మొదటి నాటకం బెజవాడలోనే ఆడించాడు. దీనికి ఆయన యజమానులు మానికొండ వాసులు పెద్దబ్బాయి, చిన్నబ్బాయి వచ్చారు. వాళ్లని మర్యాద చెయ్యలేక ఇటు నాటకాన్ని, అటు కలెక్షన్లని చూసుకోలేక వెంకట్రామయ్యచౌదరి సతమతమయ్యాడు.

ఎలాగో నాటకం అయ్యింది.గోగినేని పెద్దబ్బాయి, చిన్నబ్బాయిలకు సావిత్రిని చూపటానికి వాళ్లను వెంటబెట్టుకొచ్చాడు వెంకట్రామయ్యచౌదరి. సావిత్రిని పరిచయం చేశాడు.

ఆ తరువాత నాటకం ఎప్పుడు వేయగలుగుతాడాని ఎదురు చూసింది సావిత్రి. మనసులో మాత్రం చాలా ఉత్సుకతగా వుంది. వెంకట్రామయ్యచౌదరి కాళ్లు కాలిన పిల్లిలా తిరుగుతూనే వున్నాడు. రోజూ ఎవరినో ఒకరిని తిడుతూనే ఇంట్లోకి వచ్చేవాడు. "ఛీ... ఛీ వీళ్లని నమ్ముకొని ఎంత డబ్బు తగలేశాను.... ఎంత డబ్బు తగలేశాను. వీళ్లని నమ్మి విగ్గులు, డ్రస్సులు, రంగులు ఎన్ని కొన్నాను. ఇప్పుడు వేషం గట్టనంటారా, ఎలాగట్టరో నేనూ చూస్తాను. వాళ్లని చంపి, వాళ్ల శవం చేతయినా ఏయిస్తా."

ఇలా రోజుకి ఒకళ్లని తిట్టడమేగాని వాళ్లతో ఇంకో నాటకం వేయించలేక పోయాడు.

ఒకరోజు అనుకోకుండా జగ్గయ్య సావిత్రి ఇంటికొచ్చాడు.

జగ్గయ్యను చూడగానే వెంకట్రామయ్యచౌదరికి తెలిసొచ్చింది, ఈ రంగంలో తనలో లేనిది ఆయనలో వున్నది ఏమిటో! ఆయనకు డబ్బుండీ, కళవుండీ, కళాపోషణ, కళాకారుల పోషణ చేస్తుంటే, వెంకట్రామయ్యచౌదరి ఏదీలేకుండానే కళల మీద తనను పోషించుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

ఆయన్ను చూడగానే వెంకట్రామయ్యచౌదరి చూపులు కిందకి వాలాయి.

"రండి జగ్గయ్యగారు! రండి కూర్చోండి. ఏంటి స్వయంగా మీరే వచ్చారు?"

"మీ అమ్మాయిని తీసుకెళదామని, బుచ్చిబాబు గారి 'ఆత్మవంచన' నాటకం ఉంది."

"తీసుకెళ్లండి. అంతా ముందే ఇచ్చి."

అవాక్కయ్యాడు జగ్గయ్య. "ఇంత జరిగినా మీరేమీ మారనట్టువుందే."

"ఎందుకు మారలా, ఇంకా గట్టిపడ్డానుగా."

ఎరక్కపోయి వచ్చి ఇరుక్కు పోయినందుకు జగ్గయ్య తలపట్టుకున్నాడు.

వెంకట్రామయ్యచౌదరి అడిగినంత ఇవ్వక తప్పలేదు.

1948లో బుచ్చిబాబుగారి నాటకం వేస్తున్న రోజుల్లో నాటకరంగం నుంచి సినిమా రంగానికి వలసలు ఉధృతంగా వున్నాయి. నాటక రంగానికి చెందిన ప్రతి వ్యక్తి నటుడయినా, మేకప్‌మేన్ అయినా, ప్రొప్రయిటర్ అయినా దర్శకుడు అయినా సినిమా రంగంలో వారి వారి స్థానాల్లోకి వెళ్లటానికి ప్రయత్నం చేస్తున్నారు.

'కాని ఎందుకో మా పెదనాన్నకి సినిమా రంగం మీద ఇంకా కన్ను పడలా' అని సావిత్రి అనుకుంది పాపం, తనని సినిమాల్లో చేర్పించే ప్రయత్నాలు వెంకట్రామయ్యచౌదరి ఎప్పుడో మొదలుపెట్టాడని తెలియక.

1948లో కాకినాడలో పరిచయమైన లగాయతు దుక్కిపాటి మధుసూధనరావు ఎన్నోసార్లు అన్నారు సావిత్రితో "వెళ్లమ్మా, నువ్వు కూడా ప్రయత్నం చెయ్యమ్మా. ఇక్కడ చేసేదే అక్కడాను, కాని పేరులోగాని డబ్బులోగాని ఈ రంగం దిగదుడుపే. నేను మద్రాసు వెళ్తూనే ఉంటాను. మాతో ఎప్పుడైనా వద్దువు కాని. నీ వయస్సు పిల్లలు అక్కడా వున్నారమ్మా, కాని నీ అంత అందం, చలాకీతనం ఎవరికీ లేదు, నేను చూస్తూనే వున్నాను కదా. అప్పుడైతే ఏ కలకత్తానో, బొంబాయో, కొల్హాపూరో వెళ్లాల్సి వచ్చేది కాని, ఇప్పుడు అదృష్టవశాత్తు మన మద్రాసుకే స్టూడియోలు వచ్చాయి. మన తెలుగువాళ్లే చాలా మంది వున్నారు అక్కడ."

చివరికి ఒక రోజు "మా పెదనాన్నకు చెప్పి చూస్తానండి" అంది సావిత్రి సాలోచనగా.

ఆ రోజు ఇంట్లో పెదనాన్నతో చెప్పింది. ఆయన తాపీగా విన్నాడు. ఇది ఆయనకు కొత్త విషయం కానట్టు. "అమ్మాయ్ నిన్ను వాళ్లు చేర్పించేదేంటి. నేను చేర్పిస్తాను. మళ్లీ మేమే చేర్పించాము అనే గొప్ప. మళ్లీ అక్కడా కమిషన్లు. ఇక నువ్వు సినిమా నటివి. దానికి ఏమి అవసరమో ఆ కసరత్తులు చేసుకో, మిగతా విషయాలన్నీ నేను చూస్తూనే ఉన్నా. ఈ విషయాలేమి మీ నాటకం వాళ్లతో చెప్పకు" అని అన్నాడు.

వెంకట్రామయ్యచౌదరి చాలాసార్లు ఆఫీసు పని మీద మద్రాసు వెళ్లి వచ్చాడు. సావిత్రి నాటకాల్లో చేరిన తర్వాత తెలుగు సినిమా రంగం మీద ఒక కన్ను వేసి ఉంచాడు. పైగా అతని యజమానులు అయిన గోగినేని సుబ్బయ్యనాయుడు ఉరఫ్ మానికొండ పెద్దబ్బాయి, ఉరఫ్ మైకా కింగ్ స్వయంగా స్టూడియోలకి వెళుతూండటం వలన, డ్రైవర్ అయిన వెంకట్రామయ్యచౌదరి కూడా స్టూడియోలు, అక్కడి వాతావరణం స్వయంగా చూసే అవకాశం లభించింది. సావిత్రిని సినిమాలలో చేర్చే ఆలోచన అతనికి ఎప్పుడో వచ్చింది.

"దుర్గాంబ! ఎప్పుడు కుదిరితే అప్పుడు నేను సావిత్రిని తీసుకొని మద్రాసు వెళ్తాను. దాని బట్టలు సర్ది వుంచండి" అని చెప్పి బయటికి వెళ్లిపోయాడు.

సుభద్రమ్మ అన్నీ వింటూనే వుంది. వెంకట్రామయ్యచౌదరి వెళ్లీ వెళ్లగానే దుర్గాంబ మీదకు లేచింది.

"దాన్ని తీసుకొని మీ ఆయన ఊర్లు తిరగటం ఏమిటి? ఆడపిల్ల పక్కన ఆడోళ్లం ఉండనవసరంలేదా? అదింకా పుష్పవతి కాలేదు. ఎప్పుడైనా అవ్వొచ్చు. అలాంటి పిల్లని ఎక్కడెక్కడికో తీసుకెళ్తానంటాడేమిటి?"

"అవునే నిజమే, తీరా అక్కడకి వెళ్లింతర్వాత పుష్పవతి అయితే?" ఆలోచనలో పడింది దుర్గాంబ."వెళితే గిళితే ఏమన్నావుంటే మనము కూడా వెళ్దాము" అని తీర్మానించింది.

వెంకట్రామయ్యచౌదరి నేరుగా ఆయన యజమాని గోగినేని పెద్దబ్బాయి దగ్గరకు వెళ్లాడు.

"ఇక మనం తొందరపడాలి అయ్యగారు. లేకపోతే వాళ్లే తీసుకెళ్లేటట్లు ఉన్నారు. ఆఖరు నిమిషంలో పేరు వాళ్లు కొట్టేసుకునేటట్లు ఉన్నారు" అన్నాడు.

"అంతదాకా రానివ్వటం ఎందుకు? నువ్వే వెళ్లు అమ్మాయిని తీసుకొని" అన్నారు పెద్దబ్బాయి.

"అందుకే ఒక్కసారి మద్రాసు వెళ్లి సినిమా ప్రయత్నం చేసి వస్తాను."

"అయినా ఒక్కసారి వెళ్లి వస్తే కుదరదురా, అక్కడే వుండి ప్రయత్నాలు చెయ్యాలి" అన్నారు.

"మొన్న నా నాటక సంస్థ పుణ్యమా అని వున్న డబ్బంతా ఆవిరయ్యిందండీ. మీరు ఇప్పుడు కాస్త దయదలిస్తే కాని రైలుబండి ఎక్కే పరిస్థితి లేదండి'' అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"రైలు బండి ఎందుకురా మన కారు మళ్లీ మద్రాసు వెళ్లాలిగా, ఖాళీగా వెళ్లడం ఎందుకు? దానిలో అమ్మాయిని తీసుకొనివెళ్లు. నాకు తెలిసిన ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు చాలామంది ఉన్నారు.

వెళ్లి వాళ్లని కలవండి. నేను పంపించానని చెప్పు.తలా ఒక ఉత్తరం రాసిస్తా , వెళ్లిందగ్గరల్లా చూపించండి. ఫోను ఉన్న వాళ్లకి ఫోను చేసి చెపుతాను" అని కాసేపు ఆలోచించి,

"అక్కడ ఎక్కడ వుంటారు మీరు?" అని కూడా అడిగారు పెద్దబ్బాయి.

"ప్రస్తుతానికి ఏమి అనుకోలేదండి. మీదగ్గరకు రావటమే మొదలు."

"సరే ప్రస్తుతానికి మన ఆఫీసు గదిలో వుండండి."

అట్లా సావిత్రి మద్రాసు ప్రయాణం కావటానికి సర్వం సిద్ధం చేసుకొని ఇంటికి చేరాడు వెంకట్రామయ్యచౌదరి.

వెంకట్రామయ్యచౌదరి వచ్చేసరికి దుర్గాంబ, సుభద్రమ్మ వాళ్ల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సరే అనక తప్పింది కాదు వెంకట్రామయ్యచౌదరికి.

సావిత్రి ఒప్పుకున్న నాటకాలు పూర్తి చేసేసరికి ఇంకో రెండు నెలలు పట్టనే పట్టింది.

రెండు నెలల తర్వాత వెంకట్రామయ్యచౌదరి గోగినేని పెద్దబ్బాయి దగ్గరకు వెళ్లాడు. ఆయన కారు ఇస్తానన్న విషయం గుర్తుచేసి ఇంకా ఆయనిచ్చే డబ్బులు, సిఫారసు ఉత్తరాలు తీసుకుందామనుకున్నాడు.

రెండు నెలలు ఆలస్యమయ్యేసరికి సిఫారసు ఉత్తరాలు చేరవలసిన వాళ్ల ఇళ్లకి చేరిపోయాయి. ఇక సావిత్రి వెళ్లి వాళ్లని కలవటమే తరువాయి. ఫోన్‌లు చెయ్యాల్సిన వాళ్లకి ఫోన్‌లు చేసి చెప్పారు. కారు ఇస్తాను, వుంటానికి గది ఇస్తానన్న మాట కూడా మార్చనే లేదు ఆయన. ధనవంతులై ఉండి సొంత లాభం కొంతమాని ఇతరులకు సహాయం చేసే సదుద్దేశం వున్న వాళ్లు గోగినేని పెద్దబాయి, చిన్నబ్బాయి. సావిత్రి త్వరగా మద్రాసు చేరి తద్వారా సినీరంగ ప్రవేశం చేయటానికి కారణమైన వాళ్లలో సువర్ణాక్షరాలతో లిఖించ తగ్గపేరు మానికొండ వాసులు గోగినేని పెద్దబ్బాయి మరియు చిన్నబ్బాయి గార్లది.

1948వ సంవత్సరం మొదటి సారిగా సావిత్రి మద్రాసు బయలుదేరింది. సావిత్రికి అప్పుడు పన్నెండేళ్లు.థర్డ్ ఫారమ్ వరకు చదివింది.ఇక చదువుని అటక ఎక్కించినట్లే.

పక్కింటి రాజ్యం పిన్ని ఎదురురాగా కోటి ఆశలతో వెంకట్రామయ్యచౌదరి, ఆదుర్దాతో సుభద్రమ్మ, దుర్గాంబలతో బయలుదేరింది సావిత్రి.

ఒక రోజంతా ప్రయాణం. ఈ రోజు ఉదయాన్నే బయలుదేరితే మరుసటిరోజు ఉదయానికి చేరతారు. రాత్రి ఒకచోట బస. సుభద్రమ్మ సీటు కవరుమీద ఒక దుప్పటి వేసి సావిత్రిని కూర్చోబెట్టింది. ఎప్పటి కప్పుడు సావిత్రిని గమనించటమే సుభద్రమ్మ పని. మొత్తానికి సుభద్రమ్మ భయపడిందల్లా మద్రాసు చేరేలోపలే అయ్యింది.

మద్రాసులో మొదటి అయిదు రోజులు వెంకట్రామయ్యచౌదరి పెద్దబ్బాయి ఇచ్చిన సిఫారసులు అన్నిటి దగ్గరకి తిరిగాడు.

ఆ తర్వాత సావిత్రిని తీసికెళ్లి చూపాడు. సావిత్రి స్టూడియోలు చూడటం అదే మొదలు. చాలా చిత్రంగా అనిపించాయవి. పెద్ద పెద్ద గదులు. ఎత్తైన గదులు. అక్కడే ఒక పక్క జమీందారు ఇల్లు ఉంటుంది. అటుపక్కనే రైతు ఇల్లు ఉంటుంది. ఎంత మంది మనుషులో, అందరూ ఏదో పని మీద అటు ఇటూ తిరుగుతూ వుంటారు. ఆ పెద్దగది నుండి బయటికి వచ్చామా అంటే ఒక మాయాలోకం నుండి వచ్చినట్లే. బయట నుంచి చూస్తే ఏమి అనిపించదు. కాని లోపల అంతా మాయాలోకం. మామూలు మనిషి రాజు అయి గర్వించే లోకం, ఆయన ముందు భయం నటించే జనం.

"పెదనానా ఆ పెద్ద గదులు భలే ఉన్నాయ్. సినిమా అంతా వాటిలోనే తీస్తారా? మరి పొలాలు, బస్‌స్టాండ్, రైళ్లు, ఇవన్నీ ఏవి? అవి ఎట్లా చూపిస్తారు" అడిగింది సావిత్రి అమాయకంగా.

"వాటిని పెద్ద పెద్ద గదులు, దేరాలు అనరు, ఫ్లోర్స్ అంటారు" ఆ రెండో ప్రశ్నకి సమాధానం చెప్పలేదు. బహుశా అప్పటికి ఆయనకీ తెలియదేమో.

ఇంకోరోజు జెమిని స్టూడియోకి వెళ్లారు. అక్కడ ఫోటోలు తీయించుకొని పేరు, అడ్రస్ ఇచ్చి వెళ్లమన్నారు. అక్కడ ఫోటోలు తీయడానికి ఒక అందమైన యువకుడు ఉన్నాడు. చూడగానే తెలుస్తుంది బాగా చదువుకున్నవాడని. అతని పేరు గణేష్. సావిత్రిని, వెంకట్రామయ్యచౌదరిని మర్యాదగా లోపలికి ఆహ్వానించాడు. కూర్చోమని చెప్పి అతని కెమెరా ఏర్పాట్లు చేసుకున్నాడు.

"మీరు ఎక్కడి నుంచి వస్తున్నారు?" అని అరవంలో అడిగాడు.

"బెజవాడ నుంచండీ" అని అరవంలో చెప్పాడు వెంకట్రామయ్యచౌదరి.

"మీ అమ్మాయికి నాట్యంలోకాని, నాటకాల్లోకాని పరిచయం ఉందా?" మళ్లీ అడిగాడు గణేష్.

"చాలా ఉందండి" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి. సావిత్రి ఆ తర్వాత తనే పాడుతూ కూచిపూడి నాట్యం చేసి చూపించింది.

సావిత్రి వైపు మెచ్చుకోలుగా చూశాడు గణేష్.

ప్రతి ఫోటోకు సావిత్రిని నవ్వు ముఖం పెట్టమన్నాడు. "మీరు నవ్వితే చాలా బాగున్నారు. నవ్వండి" అనేవాడు. నాలుగు భంగిమలలో ఫోటోలు తీశాడు.

ఇక వెళ్తుండగా "ఒక్కమాట,మీరు వెళ్లే ప్రతి స్టూడియోలో నాలాగా ఫోటోగ్రాఫర్‌లు ఉండరు, మీరు కలిసే దర్శక నిర్మాతలకు మీ ఫోటోలు ఇస్తే వాళ్ల దగ్గర మీ ఫోటోలు ఉంటాయి, కాబట్టి వాళ్లకు మీరు గుర్తుంటారు " అన్నాడు.

"నువ్వు తీసిన ఫోటోలు ఇస్తావా బాబు?" ఆతృతగా అడిగాడు వెంకట్రామయ్యచౌదరి.

"నేను ఇవి ఇవ్వకూడదండీ. నాగరాజారావుగారని స్టిల్‌ఫోటోగ్రాఫర్ వున్నారు. అయన దగ్గరకు వెళ్లండి. ఒక పాతిక కాపీలు దగ్గర పెట్టుకోండి. కలిసిన వాళ్లందరికీ ఒక రెండు ఫోటోలు, ఫోటో వెనుక అడ్రసు రాసి ఇచ్చి వెళ్లండి" అన్నాడు.

సావిత్రికి అయితే ఆ అరవ దేశంలో ఇతను అపద్బాంధవుడిలా కనిపించాడు. 'అతను చెప్పింది నిజమే కదా, వాళ్లకి ఫోటోలు ఇస్తే చూస్తూ వుంటారు. గుర్తు వుంటుంది. ఒక్కసారి మొహం చూపించి వస్తే మర్చిపోతారు కదా' అనుకుంది.

అతన్ని కృతజ్ఞతా భావంతో చూసి అక్కడనుండి వచ్చేశారు.

ఆ తరువాత గణేష్, సావిత్రి ఫోటోలు ఫైల్ చేసి పెట్టి 'అవకాశమిస్తే మంచి నటిగా రాణించే సూచనలు కనిపిస్తున్నాయి' అని నోటు కూడా పెట్టాడు.

సావిత్రి, వెంకట్రామయ్యచౌదరి సరాసరి నాగరాజారావు దగ్గరకు వెళ్లారు. ఆయన మర్నాడు ఫ్రెష్‌గా రమ్మన్నారు. మూడు రకాల డ్రస్‌లు తీసుకొని రమ్మన్నారు.

ఆ రోజు నాగారాజారావు పని అయినతర్వాత ఇక పెద్దబ్బాయి ఆఫీసులో వున్న గదికి వచ్చేశారు.

సుభద్రమ్మ, దుర్గాంబ పాపం ఏమి పనిలేక వీళ్ల కోసం ఎదురు చూస్తూ నీరసించారు, వాళ్ల అవస్థ అంతా ఇంతా కాదు. వీళ్లకు వంటా వార్పు కూడా లేదు. బయట తెచ్చుకొని తింటమే. స్నానం కానిచ్చి నిద్రకు ఉపక్రమించింది సావిత్రి.నిద్రపట్టేదాకా సావిత్రికి జెమిని స్టూడియోలో చూసిన ఆ ఫోటోగ్రాఫర్ గురించే ఆలోచన.' అందగాడు, చదువుకున్నవాడు, ఎంత మర్యాదగా ప్రవర్తించాడు'. అందగాళ్లని, చదువుకున్న వాళ్లని, మర్యాదస్తులని విడివిడిగా సావిత్రి చూసే ఉంది. ఈ మూడింటిలో ఏ రెండు లక్షణాలతో ఉన్నవాళ్లు కూడా తనకు తెలుసును. ఈ మూడు లక్షణాలు ఒక్కరిలోనే ఉన్నవాళ్లని, అసలు చూడలేదని కాదు. అలాంటి వాళ్లని కూడా చూసింది. మరి ఎందుకు మనసుకి వేరే ఆలోచనలు ఏమిలేనట్టు ఇతని ఆలోచనలే వస్తున్నాయి. అతని రూపం కూడా సావిత్రి కన్నుల లోంచి పోనంటుంది. ఇక నిద్రాదేవతకు చోటు లేక ఆగింది. నాగారాజారావు స్టూడియోలో గోడకు వివిధ సైజుల్లో

ఫొటోలు ప్రదర్శించినట్లు సావిత్రి మది గోడల నిండా అతని రూపులే. 'ఏమిటి చాలా వింతగా వుంది. తను ఒక్క మగ మనిషి గురించి ఇంత సేపు ఆలోచించటమా? అందరూ తనను ఒకటకి రెండు సార్లు వెనక్కి తిరిగి చూస్తారే కాని, తాను ఎప్పుడు ఎవరి గురించి ఆలోచించలేదే'. సావిత్రికి తన పరిస్థితి చూసి నవ్వొచ్చింది. ఆ నవ్వు తనకే కాదు, సుభద్రమ్మకు కూడా వినిపించింది.

"ఏంటే ఆ ఫొటోలు తీసే ఆయన బాగా నవ్వాలన్నాడేమిటి?" అంది సుభద్రమ్మ.

"అవునమ్మా! అతను నేను నవ్వితే చాలా బాగుంటానని కూడా అన్నాడు" అంది సావిత్రి.

రెండు వాక్యాలూ ఫొటోగ్రాఫర్లు అన్నవే, కాకపోతే మొదటిది రేపు సావిత్రి ఫోటోలు తీయబోయే ఫొటోగ్రాఫరుది అయితే, రెండోది సావిత్రి మదిలో ముద్రించుకు పోయిన ఫొటోగ్రాఫర్‌ది.

ఆ తరువాత రోజు నాగరాజారావు దగ్గర స్టిల్స్ ఇచ్చింది సావిత్రి. ఆయన రెండు రోజులు ఆగి రమ్మన్నారు. వెంకట్రామయ్యచౌదరి అయనతో మాట కలిపాడు, సినిమాల్లో సావిత్రికి అవకాశం గురించి. "ఇప్పుడు వున్న వాళ్లని లెక్కలోకి తీసుకుంటేనండి, అందరూ పెద్దవాళ్లయిపోయారు. లేదా పెద్దవాళ్లకింద జమవేసుకోవటానికి ఎక్కువ సమయం పట్టదు. కాంచనమాల ఒక్కతే చాలా అందగత్తె కాని వెళ్లిపోయింది, వెళ్లి కూడా ఆరు సంవత్సరాలు అయింది. ఇక రాక పోవచ్చు. శాంతకుమారి ఇంకా ఎన్నాళ్లు వుంటారు హీరోయిన్‌గా అనేది అనుమానమే. కన్నాంబ పని హీరోయిన్‌గా అయిపోయింది. జి. వరలక్ష్మికి అంత గ్లామర్ లేదు. లక్ష్మీకాంతం, రాజమ్మ, కనకం, పుష్పలత, యస్. వరలక్ష్మి, మాలతి వీళ్లందరూ ఇప్పటి వాళ్లు. ఇప్పుడు వస్తున్న వాళ్లలో మీ అమ్మాయి కున్న అందం,వర్చస్సు ఎవ్వరికీ లేదండి. అవకాశం రావాలి, అది వచ్చినప్పుడు భయపడి జార విడుచుకుంటే మళ్లీ అవకాశం రావటం చాలా కష్టం. అవకాశం రావాలంటే అన్నీ కలసి రావాలి. వీళ్లు ఎవరూ మీ అమ్మాయికి పోటీకి రాగల అందగత్తెలు అయితే కారు కాని అదృష్టవంతులు అయితే కావచ్చు. ఇప్పుడు ప్రయత్నాలు చేస్తున్నవాళ్లలో జానకి, వాళ్ల చెల్లెలు కృష్ణకుమారి చెప్పుకోదగ్గవాళ్లు. లక్ష్మిరాజ్యం, సూర్యప్రభ, శ్రీరంజని, పుష్పలత అందగత్తెలే, పర్వాలేదు."

ఇది విని వెంకట్రామయ్యచౌదరి నిండుగా నిట్టూర్చాడు. "అయ్యా! అమ్మాయికి అంతా బాగుందంటే ఇంతగా నిట్టూర్చారేమండీ" అన్నారు నాగరాజారావు.

"అవతల ఎల్లుండి వస్తానండీ" అంటూ బయలుదేరాడు వెంకట్రామయ్యచౌదరి.

దారిలో సావిత్రి, వెంకట్రామయ్యచౌదరిని "అదృష్టం అంటే ఏమిటి పెదనానా?" అని అడిగింది. సావిత్రికి దాని అర్థం చూచాయగా తెలిసినా, ఇందాక నాగరాజారావు చెప్పిన

సుదీర్ఘమయిన లెక్చర్ విన్నాక, వెంకట్రామయ్యచౌదరి నిట్టూర్పులు చూసిన తర్వాత దానికి వేరే అర్థం వుందేమో అనుకుంది.

వెంకట్రామయ్యచౌదరి ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు.

"అదృష్టం అంటే అన్నీ కలిసి రావాలి" పరధ్యానంగా అన్నాడు.

"అన్నీ కలిసిరావటం అంటే?"

"అందరూ నువ్వే కావాలి అనుకోవటం."

అలా చెప్పి రెండు అడుగులు వేసిన వాడల్లా ఠక్కున వెనుక్కు తిరిగి,

"ఇదిగో అమ్మాయ్! నీకు ఇదే చెప్తున్నా, అందరూ నువ్వే కావాలి అనుకునే రోజు రావాలి, నీకేం తక్కువ? నా శ్రమంతా వృధా చేయకు. నాకేం పనిలేక నీతో పాటు తిరుగుతున్నాననుకున్నావా? మనకి ఇక్కడ పనికాకపోతే అంతా మొహం మీద నవ్వుతారు. నువ్వు సినిమా హీరోయిన్ అయి తీరాల్సిందే. నేను కారు డ్రైవర్‌గా ఎల్లకాలం వుండదలచుకోలేదు, నా కింద నలుగురు డ్రైవర్లు వుండాలి" అని మనసులో మాట బయటికి కక్కేశాడు వెంకట్రామయ్యచౌదరి.

ఆ తర్వాత సావిత్రి స్టిల్స్ తీసుకొని తెలిసిన ప్రొడ్యూసర్లు, తెలియని డైరెక్టర్‌లు, స్టూడియో యజమానులు ఇలా అందరి దగ్గరకు వెళ్లి, ఒక్క నాలుగు ఫొటోలు తప్ప మిగతా వన్నీ ఇచ్చారు.

వెంకట్రామయ్యచౌదరి ఎక్కడ అడిగినా నాగరాజారావు చెప్పిన మాటలే చెపుతున్నారు. సావిత్రికి మంచి భవిష్యత్తు వుంటుందని. కొంతమంది ప్రొడ్యూసర్ల దగ్గర డైరెక్టర్ల దగ్గర డాన్స్‌లు, నటన చేసి చూపేది సావిత్రి. సావిత్రి తెలివితేటలు,చురుకుదనం చూసి పనికొచ్చే పిల్లేనని అనుకునేవాళ్లు. సావిత్రి ఉప్పొంగి పోయేది. ఇక సావిత్రి తాను సినిమా యాక్టర్ అయిపోయిందని అనుకుంది. ఇక సినిమానే జీవితం అనుకుంది. సినిమాల్లో చేరాలన్న కోరిక ఇంకా బలపడింది.

ఈ మొదటిసారి మద్రాసు వచ్చి తెలుసుకున్నది ఏమిటంటే 'ఇప్పుడు తీస్తున్న సినిమాలకి నటీనటులు బుక్ అయిపోయారు. ఆ సినిమాలు పూర్తవటానికి ఒక సంవత్సరం పట్టొచ్చు. తరువాత తీయబోయే సినిమాలకే ఈ అమ్మాయి గురించి ఆలోచిస్తాం. అవసరమైతే కబురు పెట్తాం' అని. దీనికి ఎంత సమయం పట్టొచ్చు అంటే, ఏమో రెండు నెలలు పట్టొచ్చు, నాలుగు నెలలు పట్టొచ్చు లేదా సంవత్సరాలే పట్టొచ్చు. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే జెమినీ సంస్థలో కొత్తమంగళం సుబ్బు, ఆర్. నాగేంద్రరావుగార్లు 'లాభం లేదు, అటూ ఇటూ





1948లో నిశ్చల ఛాయగ్రాహకుడు
శ్రీ నాగరాజారావు తీసిన స్టిల్స్





కాని వయసు' అని ఎలా సావిత్రిని తిరస్కరించారో, అలానే చాలా చోట్ల సావిత్రికి తన చిన్న వయస్సు ప్రతిబంధకం అయ్యి కూర్చుంది.

ఇక ఈ మద్రాసులో చేసేదేమీలేక, వెంకట్రామయ్యచౌదరికి పెద్దబ్బాయి దగ్గర చేసేపనులు వున్నాయి గనుక, తిరిగి బెజవాడ రైలు ఎక్కారు.

వెంకట్రామయ్యచౌదరి బీడి మీద బీడి కాలుస్తూ గాఢంగా ఆలోచిస్తున్నాడు. సావిత్రిని ఎలాగైనా హీరోయిన్‌ను చేయాలి అనే తాపత్రయం కంటే తొందర ఎక్కువ కనబడుతోంది ఆయనలో. ఎవరైనా, "ఇదిగో సావిత్రికి వేషం ఉంది" అని ఇప్పటికిప్పుడు చెప్తే, బెజవాడ వెళ్తున్న రైలును మళ్లీ మద్రాసుకు మళ్లించేలా ఉన్నాడు.

దాదాపు నెల తర్వాత ఇంటి ముఖం పడ్తున్నందుకు దుర్గాంబకు ఆనందంగా ఉంది.సావిత్రి గండం గట్టెక్కినందుకు సుభద్రమ్మ కూడా ప్రశాంతంగా వుంది.

ఇక తను సగం సినిమా హీరోయిన్ అయిపోయినట్టే అనుకుంది సావిత్రి. 'ఈ సారి వాళ్లు కబురు పెడతారు, అప్పుడు నేను నటించేస్తాను అప్పటికి పూర్తి సినిమా హీరోయిన్ అయిపోతాను' అని అనుకుంటుంది సావిత్రి.

రైలు కూతకూస్తూ టకాటకామంటు వెళ్తోంది. అప్పుడే సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఎర్రటి గుండ్రటి ఆకారం వీరి కిటికీలోంచి కనిపిస్తుంది. వీళ్లతోపాటే ప్రయాణిస్తోంది. వీళ్ల నలుగురి చూపులు ఆ ఇంపైన దృశ్యం మీద పడ్డాయి. ఆ దృశ్యాన్ని చూస్తున్న నలుగురు ఒకరినొకరిని చూసుకొని చిరునవ్వుతో పలకరించుకున్నారు. మళ్లీ సూర్యుడి మీదకి చూపు మరల్చింది సావిత్రి. ఆ గోళంలో మిగతా ముగ్గురికీ సావిత్రి హీరోయినై వెలిగిపోవడం కనిపించిందోమోగాని, సావిత్రికి మాత్రం మళ్లీ ఆ మొదటి ఫొటోగ్రాఫరే కనిపించాడు.

ఆ తెల్లారి ఇంటికి చేరారు. ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. మద్రాసు, సినిమా, అనే మాట ఎవరూ ఎత్తట్లేదు. కాని అందరి మనస్సుల్లోను వున్న ఆలోచన అదే. మద్రాసు వెళ్లేదాకా, సావిత్రికి వెంటనే సినిమాలో ఒక వేషం వస్తే బాగుంటుందనుకొని వెళ్లారు. తీరా అక్కడ మనుషులు, వాళ్ల హడావిడి, వాళ్ల మాటతీరు చూస్తే,'అమ్మో ఇక్కడ వేషం వెంటనే దొరకటం అంత సులువు కాదుకాని నెమ్మదిగానైనా రాబట్టాలి' అని వెనక్కొచ్చారు. వెంటనే వేషం రానందుకు కాస్త చిరాగ్గా వున్నా పరిస్థితులను బట్టి పోవాలి కాబట్టి అందరూ సర్దుకు పోయారు. అదృష్టవశాత్తు సావిత్రి కోసం కాచుకు కూర్చున్న నాటక సంఘాలు ఇంకా వున్నాయి. ఆశ్చర్యకరంగా ఈసారి ఈ నాటక సంఘాలలో సావిత్రిలాగా సినిమా ప్రయత్నాలు చేస్తూ ఆ ప్రయత్నం ఫలించక, మళ్లీ బ్రతుకుతెరువు నీవే అంటూ వచ్చినవాళ్లే ఎక్కువ వున్నారు.

సావిత్రి ఇంటికి వచ్చిందని తెలియగానే లీల పరిగెత్తుకు వచ్చేసింది.

"సావిత్రి చెప్పవే, మద్రాసు ఎట్లావుంది. అక్కడ పెద్ద పెద్ద స్టూడియోలు వుంటాయటగా! చెప్పవే, ఏమన్నా షూటింగ్‌లు చూశావా? నాగేస్రావుని చూశావా?"

"నాగేస్రావుని చూడలా, షూటింగ్ చూడలా. ఆ మిగతా రెండు చూశా" అంది సావిత్రి నింపాదిగా.

పూస గుచ్చినట్లు అంతా లీలకు చెప్పేదాకా సావిత్రికి తనివి తీరలా, సావిత్రి నోటి నుండి వినేదాకా లీలకు అంతే.

"ఏమో లీలా, మా పెదనాన నన్ను సినిమాలకే అంకితం చేసేటట్టున్నాడు. సినిమా ఛాన్స్ ఎలాగయినా సరే రావాల్సిందేనని తీర్మానించాడు. సినిమాల్లో వేషాలు రాకపోతే నన్ను ఏదో ఒక నాటకాల కంపెనీకి అమ్మేసేలా వున్నాడు. సరే కాని, నాకేమన్నా వేషాలు వున్నాయా మాకు ఇప్పుడు డబ్బులు అన్నీ అయిపోయాయి అక్కడ" అంది దీనంగా సావిత్రి.

"లేకేమే, కనకయ్యగారితో సహా,జగ్గయ్య,పుండరీకాక్షయ్య అందరూ నీకోసమే కాచుకు కూర్చున్నారు."

"హమ్మయ్య" అనుకుంది సావిత్రి.

"ఇప్పుడు 'బలిదానం' అని కొత్త నాటిక వచ్చింది. దాంట్లో అపర్ణ అనే ముఖ్యపాత్ర నీకోసమే ఎదురుచూస్తోంది" చెప్పింది లీల.

సావిత్రి ట్రూపు ఇంకోసారి వూళ్లమీదకి బయలుదేరింది. ఈసారి ట్రిప్‌లో సావిత్రిని చాలా గౌరవంగా చూడసాగారు. హఠాత్తుగా సావిత్రి సీనియరైపోయింది. ప్రతివాళ్లు మద్రాసు సంగతి అడగటమే. రెండు నెలలకు మళ్లీ బెజవాడ చేరుకుంది ట్రూపు.

ఒకరోజు కొత్త నాటిక సాధన చేస్తుండగా హార్మోనియం మాస్టారు వస్తూ హార్మోనియంతో పాటు ఓ వార్త మోసుకొచ్చారు. "అక్కినేని నాగేశ్వరరావుగారు, బెజవాడలోనే వున్నారు. దుర్గా కళామందిరం గెస్టు హౌస్‌లో వున్నారు. కాని ఎవ్వరినీ చూడటానికి రానివ్వటం లేదు. ఇప్పటికే చాలా గుంపు చేరుకుంది. సాయంత్రం జైహింద్ టాకీసులో 'బాలరాజు' 100 రోజుల పండగట, అందరూ ఇంక అక్కడే చూసుకోవాలి" అని.

సావిత్రి కళ్లు, లీల కళ్లు మెరుపుతో సహా కలుసుకున్నాయి. "మనము ఎట్లాగయినా సరే వెళ్లి నాగేశ్వరరావుని చూడాలి" అంది సావిత్రి.

"ఎలానే, మన వల్ల ఏమవుతుంది? ఆ గుంపుల్లో ఆడపిల్లలము మనము ఎలా వెళ్తాము?" అంది లీల.

"గట్టిగా ప్రయత్నం అయితే చేద్దాం. సాయంత్రం నాలుగు గంటలకల్లా మా ఇంటికి వచ్చేయ్ వెళ్దాం" అంది సావిత్రి.

"సరే ప్రయత్నిద్దాం" అంది లీల.

నాలుగున్నర కల్లా జైహింద్ టాకీసుకు చేరుకున్నారు. లోపలకి వెళ్లకుండా ద్వారం దగ్గర నుంచున్నారు. కారు దిగేటప్పుడు కనిపిస్తారు కదా అప్పుడే చూసేద్దామని. వీళ్ల లాగా తెలివైన వాళ్లు ఎంతోమంది చేరుతున్నారు ద్వారం దగ్గరకి. లీల, సావిత్రి మొహం మొహం చూసుకున్నారు. జనం పెరిగి పోతూనే వున్నారు. వీళ్లు చేరిన ఓ గంటకి అక్కడ జన సముద్రం అయింది.

"వెళ్లిపోదామే ఏం లాభం లేదు" అంది లీల.

సావిత్రి వెనక్కి తిరగదలచుకోలేదు. "నాగేశ్వర్రావును చూసి తీరాల్సిందే.మనము చూడబోయేది సినిమా హీరోనే... అందమైన హీరోనే. హీరోని చూసే అవకాశం ఎదురుగా వుంటే వదులుతావంటే?" అంది సావిత్రి.

"ఎదురుగా ఎవరున్నది తెలుస్తూనే వుంది గదే. ఈ జనాన్ని చూస్తుంటే నాకు భయం వేస్తుంది తల్లి, నేను వెళ్లి అదిగో.. ఆ చెట్టు కింద వుంటాను. నీ పని అయిపోయిం తర్వాత రా" అని లీల దూరంగా వెళ్లిపోయింది.

ఇంతలో నాగేశ్వరరావు కారు రానేవచ్చింది. ద్వారం దగ్గరకి వచ్చేసరికి జనం చూట్టూ మూగేశారు. అయినా నెట్టుకుంటూ దూరుకుంటూ ఒక్కసారి చూడగలిగింది సావిత్రి.ఆయన్ని ఎక్కడో ఇంతకు ముందే చూసిన స్ఫురణ వచ్చింది. ప్రక్కన జన సమూహాన్ని మరిచింది. అంతే ఎవరో ఒక తోపు తోశారు. పక్కనే ఉన్న మురుగుకాలువలో పడిపోయింది. మళ్లీ ఇంకోసారి చూడాలనిపించినా ఆ కంపుతో వెళ్లలేక పక్కకి జరిగిపోయింది.

ఆలోచించగా బుర్ర వెలిగింది.. సావిత్రి మద్రాసులో ఒక స్టూడియోలో ఈ మనిషిని చూసింది..

అంతలో లీల సావిత్రిని వెతుక్కుంటూ వెళుతోంది. "లీల ... లీల .." అని కేక వేసింది సావిత్రి.

లీల అనుమానంగా దగ్గరకి వచ్చింది. బురదతో నిండిన సావిత్రి మొహంలో మొహం పెట్టి చూసి సావిత్రేనని నిర్ధారించుకొని,

"ఏమిటీ ఈ అవతారం, నేను ముందే చెప్పా వద్దని" అని పగలబడి నవ్వింది.
తన పరికిణితో తుడవటం మొదలుపెట్టింది. తుడిచినంత సేపు నవ్వుతూనే ఉంది.











"సరే గానీ లీలా నీకో విషయం చెప్పాలి. నేను ఈయన్ని మద్రాసులో కూడా చూశానే, కాని అప్పుడు నాకు నాగేశ్వర్రావు అని తెలియదే" అంది సావిత్రి.

"అయితే సావిత్రి నువ్వు షూటింగ్ కూడా చూశే వుంటావే. ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటూ ఉండి ఉంటారు,కాకపోతే వాళ్లని చూసి నువ్వు ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటున్నారులే అనుకొని వుంటావు" అంది లీల.

"అదొక్కటే కాదే, నేను నటించేసి కూడా వుంటానే, డైరెక్టర్‌లు చేసి చూపించమన్నప్పుడు నేను చేస్తున్నప్పుడు, నన్ను షూటింగ్ తీసేశారేమో, ఏదన్నా సినిమాలో కనిపిస్తానేమో చూద్దామే" అంది ఠక్కున సావిత్రి.

కాసేపు ఒకళ్లనొకళ్లు చూసుకున్నారు. ఇద్దరూ వేళాకోళం ఆడుతున్నారని తెలుసుకొని నవ్వుకున్నారు.

1948 అంతా, చకోరం చంద్రకిరణాల కోసం ఎదురు చూసినట్లు, సావిత్రి సినిమా వాళ్లనుంచి పిలుపు కోసం ఎదురు చూడటంతో సరిపోయింది.' ఎవరు వచ్చి తనను మద్రాసు రమ్మంటున్నారని చెపుతారా? ఏ టెలిగ్రాం వచ్చి తనను మద్రాసు తీసుకుపోతుందా?' అని ఎదురు చూడటమే.

1949లో ఆ ఘడియ రానే వచ్చింది. 'అగ్నిపరీక్ష' అనే సినిమాకు నటి కావాలని సావిత్రిని పరీక్ష చేసి సరిపోతుందో లేదో చూసుకుంటామని కబురు పంపారు. డబ్బు కూడా పంపారు. ఇంక దేనికి ఆలస్యం సావిత్రి, వెంకట్రామయ్యచౌదరి, దుర్గాంబ రైలు ఎక్కేశారు.

ఆ చిత్రంలో ప్రతినాయిక లాంటి ఒక ముఖ్య పాత్ర వ్యాంప్ తరహాలో వుంటుంది. రాకుమారుడైన హీరోని లోబరచుకోవాలి. ఆ రోజు సావిత్రికి మేకప్ వేసి ఒక సీన్ చెప్పి చెయ్యమన్నారు. సావిత్రి బాగా చేసింది. కాని వాళ్లకి ఒక చిన్నపిల్ల చేస్తున్నట్లు వుందిగాని, ఒక యుక్త వయసులో ఉన్న యువతి ఒక మగాడిని వలలో వేసుకుంటున్నట్లు వాళ్లకి ఏ మాత్రం అనిపించ లేదు. ఒక చిన్న పిల్ల బాగా నటించినట్లు డాన్స్ చేసినట్లు వుంది. అప్పటికే సావిత్రికి ఒళ్లు బాగా పెంచారు. కాని మొహంలో పసితనం మాత్రం పోగొట్టలేక పోయారు.

"పుయ్యవయ్యా, అది అంతా పుయ్" పక్కనే వుండి వెంకట్రామయ్యచౌదరి మేకప్ పైన మేకప్ వేయించాడు. మేకప్‌మెన్ చేతిలో ఓ 50 రూపాయలు పెట్టి జాగ్రత్తగా వేయించాడు. వాళ్ల దగ్గర అప్పటికే వున్న ఫౌండేషన్ అంతా వేశారు. కాని వాళ్లు సావిత్రికి వయసు తీసుకురాలేక పోయారు.

చివరకు ఇంక డైరెక్టర్ మాణిక్యం వచ్చి "అమ్మాయ్ లాభం లేదు. నువ్వు మంచి నటివేనమ్మా. అందులో సందేహం లేదు. అందగత్తెవి కూడా. నీకు మంచి భవిష్యత్తు వుంది. కాని నువ్వు ఈ పాత్రకి ఇంకా చిన్నపిల్లవు" అన్నారు. సావిత్రికి ఏడుపు తన్నుకు వచ్చింది. ఏడుస్తూ సెట్ నుంచి గ్రీన్‌రూమ్‌కి వచ్చేసింది.

ఏడ్చి ఏడ్చి సోలిన మొహంతో, పెద్దబ్బాయివాళ్ల ఆఫీసు దారి పట్టారు. వెంకట్రామయ్య చౌదరి గంభీరంగా వున్నాడు. ఏదో పోగొట్టుకున్న వాడిలా వున్నాడు.

ఆ మర్నాడు "నేను స్టూడియోలకి వెళ్లి వస్తాను దుర్గాంబ" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"దీనినీ తీసుకువెళ్లండి" అంది దుర్గాంబ.

"దాని మొహం చూశావూ.. ఇంకా వుబ్బే వుంది. నేను వెళ్లి వస్తాను" అంటూ వెళ్లి పోయాడు.

"మీ పెదనాన్నకు నిన్ను ఎట్లాగయినా యాక్టర్ చేయాలనే పాపం, నిన్నటి దానికి ఆయన నీరసపడి పోయాడు. నీకు అన్నీ వుండి కూడా, కలిసిరావటం లేదు. అదృష్టం ఇంకా మన తలుపు తట్టలా!" అంది దుర్గాంబ.

'అదృష్టం.. కలిసి రావటం... ఎక్కడ విన్నాను?' ఆలోచించింది సావిత్రి. 'ఆఁ... నాగరాజారావు గారి దగ్గర. ఆయన ఆ రోజే ఎంతో చక్కగా చెప్పారు, అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లు .... అవకాశం వచ్చినప్పుడు జారవిడుచుకోకూడదని... అన్ని కలిసి రావాలని, ఇక ఆ ఘడియ కోసం చూడటం తప్ప చేసేదేమీ లేదేమో, మరి పెదనాన ఎక్కడకి వెళ్లినట్టు' అనుకుంది సావిత్రి.

ఇప్పట్లో తనకు అవకాశాలు రావని తీర్మానించుకొని చేతులు ఎత్తేసింది సావిత్రి. కాని వెంకట్రామయ్యచౌదరి మాత్రం అంత సులువుగా వదిలేటట్టు లేదు. ఆయన తన కోసం పడే కష్టం చూస్తుంటే, ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా తాను సినిమా హీరోయిన్ అయిపోయి ఒక కారు కొనిచ్చి, ఒక డ్రైవరును కూడా పెట్టి, తన పెదనాన్నని కారు డ్రైవర్ కాకుండా కారు యజమానిని చేయాలని సంకల్పించుకుంది సావిత్రి.

వెంకట్రామయ్యచౌదరి వచ్చేసరికి రాత్రయ్యింది. సావిత్రి నిద్రపోలేదు. చిరాగ్గా వచ్చాడు, కుర్చీలో కూలబడ్డాడు. సావిత్రి ఎదురుగా చాపమీద కూర్చుని ఉంది. సావిత్రిని కింద నుండి పైకి ఎగాదిగా చూస్తున్నాడు. "ఏంటి లోపం?" అన్నట్టు. సావిత్రి ఆడతనం ఆ చూపులని తట్టుకోలేక పోయింది. లేచి అమ్మ దుర్గాంబ దగ్గరకు వెళ్లిపోయింది.

భోజనం చేస్తూ అసలు మాట బయట పెట్టాడు వెంకట్రామయ్యచౌదరి. "దీనికి తిండి ఎక్కువ పెట్టండి. నెయ్యి, మీగడలు ఎక్కువ పెట్టండి" అని.

"దీని తిండేమన్నా తక్కువా ఏంటి?" అడిగింది దుర్గాంబ.

"అందుకే చెప్తున్నా నెయ్యి, మీగడలు ఎక్కువ పెట్టండి. ఎవరిని అడిగినా, పిల్లకి టాలెంట్ వుందండి, కాకపోతే వయస్సే అటు ఇటు కానిది, అటు చిన్నపిల్లాకాదు ఇటు పెద్దదీ కాదు అని, అందుకే దీన్ని చిన్నదాన్ని ఎట్లాగూ చేయలేము, చేసినా ఉపయోగము లేదు, అందుకని కాస్త వొళ్లు చేయిద్దాం."

సావిత్రి ఫక్కున నవ్వింది. సావిత్రి చిన్నప్పట్నుంచి బొద్దే, కాకపోతే ఇప్పుడు కాస్త సాగింది. అందువల్లే ఇప్పుడే జీవితంలో మొదటిసారిగా సన్నగా కనిపించటం.

"ఇదిగో అమ్మాయ్, నన్ను ముప్పుతిప్పలు పెడుతున్నావు. రేపు నువ్వు సినిమాల్లో చేరి సంపాదిస్తున్నప్పుడు నీ ముక్కుపిండి మరీ వసూలు చేసుకుంటా ఇవన్నీ" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"అంత కష్టమేమీ పడనక్కరల్లా, అదే ఇస్తుంది" అంది దుర్గాంబ.

"నీకు కారునీ, డ్రైవర్‌నీ కొనిస్తా పెదనానా" అంది సావిత్రి ఠక్కున.

"అదిగో చెప్పానా" అంది దుర్గాంబ.

ప్రస్తుతానికి తయారవుతున్న సినిమాలలో సావిత్రికెలాంటి పాత్రలు లేవని తెలుసుకొని, కలవాల్సిన వాళ్లని కలిసి, అర్జీలు పెట్టుకొని, స్టేషనుకు బయలుదేరారు.

"పెదనానా ఒకసారి ఆ జెమిని స్టూడియోలో ఫొటో తీసే అబ్బాయిని కూడా కలసి వద్దాం" అంది సావిత్రి.

వెళ్లేవాడల్లా వెనక్కి తిరిగి సావిత్రి వైపు తీక్షణంగా చూశాడు. "ఇంత మంది చెయ్యలేనిది వాడేమి చేస్తాడు" అన్నాడు.

దుర్గాంబ వైపు తిరిగాడు, "మీవాళ్లలో నీ తరువాత అందగత్తె ఇదే. దీనికి వయస్సొచ్చింది లగాయతు మనసు మగాళ్ల మీదకి వెళుతోంది. అతగాడు అందగాడులే. కాస్త కనిపెట్టి వుండండి దీన్ని" అన్నాడు.

సావిత్రి నాలుక కరుచుకుంది. మద్రాసు వచ్చాం గదా ఇంకొక్కసారి అతనిని చూద్దాం అని ఆశపడింది. 'అమ్మో! పెదనాన పసిగట్టేశాడు. జాగ్రత్తగా వుండాలి ఈయనతో' అనుకుంది సావిత్రి.

ప్రొద్దున్నే బెజవాడ చేరుకునేసరికి ఇంట్లో లీల వుంది. "ఏంటీ లీలా నేను వెళ్లిందగ్గర నుంచి ఇక్కడే కాచుకు కూర్చున్నావా ఏంటి?" అడిగింది సావిత్రి.

"అంతే అనుకో, ఇన్ని రోజులు రోజుకొకసారి మీ ఇంటికి వచ్చి చూసే వెళ్తున్నా. ఈ రోజు దుర్గగుడికి వెళ్లి వస్తున్నా, నీ సంగతి కనుక్కుందామని వచ్చా. చెప్పు ఈ సారి ఏమైంది. నటించేశావా, కెమేరా ముందు నుంచుంటే భయం వేసిందా? చెప్పవే" అంది ప్రశ్నల మీద ప్రశ్నలు వేస్తూ.

సావిత్రి సంచి చంకలోనే వుంది. దించనైనా లేదు. నీరసంగా వాళ్ల అమ్మ వైపు చూసింది. కాస్త లీల విషయంలో సాయం చేయమన్నట్లు.

ఇక వాళ్ల అమ్మ అందుకుంది. చంకలో సంచితోపాటు "లీలా నువ్వుండమ్మా, కాస్త కాళ్లు మొహం కడుక్కోనీ, అది ఇప్పుడేగా వచ్చింది. కాఫీ, టిఫిన్‌లు అయిన తర్వాత తీరిగ్గా మాట్లాడుకోవచ్చు" అంది.

లీల కూర్చుంది.

సావిత్రి లోపలకి వెళ్లింది.

సావిత్రి లోపలకి వెళ్లీ వెళ్లటంతో, దుర్గాంబని చేయి పట్టుకొని లాగి కూర్చోబెట్టుకున్నారు, సుభద్రమ్మ, లీల, ఏం జరిగిందీ చెప్పమని.

దుర్గాంబ జరిగిన ఉపద్రవం అంతా చెప్పుకొచ్చింది.

"దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదంటారు ఇదేనేమో" అంటూ డీలా పడిపోయింది సుభద్రమ్మ.

"ఆఁ... ఇప్పటికింకా దేవుడు వరమివ్వలేదు. పూజారి కరుణించాల్సిన అవసరమూ రాలేదు" అంటూ లేచింది దుర్గాంబ వాళ్ల దగ్గరకు వస్తున్న సావిత్రిని చూసి.

"ఏయ్ లీలా నాటకాల సంగతి ఏంటి, నాకేమైనా పాత్రలు వున్నాయా?"

"ఎందుకు లేవే? నేను మంచి ఉపాయం పన్నాను. నీ పాత్ర అన్నిటిలో నేను వేసేస్తున్నాను. నువ్వు ఎప్పుడు వేస్తానంటే ఆ పాత్ర నీకు ఇచ్చేస్తాను. ఆ తర్వాత ప్రాముఖ్యం గల పాత్ర నాకిస్తే చేస్తాను. లేకపోతే వూరుకుంటాను. అయినా నువ్వు ఇంకా ఎన్నాళ్లు నాటకాల్లో వుంటావులే, ఇంకో నాల్రోజులు తిరిగితే నీ పాత్రలు నావికావూ?" అంది స్వచ్ఛమైన మనస్సుతో లీల.

కళ్లతోనే ధన్యవాదాలు తెలిపింది సావిత్రి.

ఆ కళ్లు చెప్పదలచుకున్న భావాన్ని అద్భుతంగా చెపుతాయి. లీల ఆ ధన్యవాదాలని అందుకొంది.

"లీలా... నీకు మద్రాసు నుంచి ఏమి తెచ్చానో తెలుసా!"

"ఏమి తెచ్చావు?"

"మేము సముద్రంకి వెళ్లినప్పుడు నీకోసం గవ్వలు ఏరుకొచ్చానే, ఎన్ని ఏరానో తెలుసా ...."

"ఏవేవి చూపించు... మనము వాటితో దండ కట్టుకోవచ్చు" అంది లీల ఉత్సాహంగా.

"రేపు దుర్గ గుడికి వెళ్దాం. చాలా రోజులయింది అమ్మవారిని దర్శించుకుని. ఈ సారి గట్టిగా మొక్కాలి. అమ్మవారు దయదలచంది పనులు అయ్యేటట్లు లేవు. అక్కడ నుండి భ్రమరాంబ గ్రంధాలయానికి కూడా వెళ్లి 'రూపవాణి' చదివి వద్దాం. ఆ తర్వాత నాటకమండలికి వెళ్దాం. సరేనా?" అంది సావిత్రి.

"అబ్బో సినీనటి సావిత్రిగారికి రేపు రోజంతా తీరిక వుండదన్నమాట. ఇప్పుడే ఇంత బిజీ అయితే రేపు మద్రాసులో ఎంత బిజీనో" అంది లీల ఆటపట్టిస్తూ.

నవ్వుకుంది సావిత్రి. "ఎంత బిజీ అయినా నిన్ను మర్చిపోనులేవే" అంది.

లీల సంతోషించింది.

1948లో మొదటిసారి మద్రాసు వెళ్లివచ్చిన తర్వాత నుండి సావిత్రికి వాళ్ల పెదనాన్న 'రూపవాణి', సినీ పత్రిక చదవటం అలవాటు చేశాడు. చదవటం అలవాటు చేశాడు అనడం కన్నా నిర్బంధం చేశాడు అంటేనే కరెక్టు. 'రూపవాణి' తొలి తెలుగు సినిమా పత్రిక 1930ల లోనే ప్రారంభమైంది. పాఠకులలో గొప్ప ఆసక్తిని రేపే విధంగా రచనలు వుండేవి.

మచ్చుకి నాగయ్య గురించి, 'నాగయ్య కాదు త్యాగయ్య' – అని ఆయన 'త్యాగయ్య' సినిమా వచ్చిన తర్వాత ఆయన్ని శ్లాఘిస్తూ వ్రాసిన వ్యాసం హెడ్డింగ్ అది.

'ఇవి సినిమా హాళ్లా లేక జర్మన్ కాన్‌సెంట్రేషన్ కాంప్‌లా' అని, కనీస సౌకర్యాలు లేని అప్పటి సినిమా హాళ్ల గురించి వ్యాసం. 'కాంచనమాల మళ్లీ వస్తోంది'..... ఇలా చాలా ఆసక్తికరంగా వుండేవి. పైగా విరివిగా సినిమా బొమ్మలు. 'రూపవాణి' పత్రిక సావిత్రికి ఎంతో ఉపయోగపడింది. సావిత్రి ప్రతి వ్యాసం క్షుణ్ణంగా చదివి, తనకు ఉపయోగపడేవి ఏమన్నా వుంటే తెలుసుకునేది.

1950వ సంవత్సరం రానే వచ్చింది. సినిమా ప్రయత్నాలు మొదలుపెట్టి రెండేళ్లు నిండాయి. ఇక వెనక్కి తగ్గే పనేలేదు. విజయమో, వీరస్వర్గమో తేల్చుకోవలసిందే. సావిత్రి వెనక్కు తగ్గుతానన్నా తన పెదనాన్న వూరుకోడు. చిందు లేస్తాడు. తాట తీస్తాడు. అయినా

సావిత్రికి కూడా వెనక్కి తగ్గే ఆలోచన లేదు. ఎందుకంటే ఈ రంగం తనకు ఒకళ్లమీద ఆధారపడకుండా తిండి పెట్టినందుకు అనుకుంటే పొరపాటే. నాటక రంగంలో సావిత్రిని ఆకర్షించింది, తనకు వచ్చిన గుర్తింపు. 'రూపవాణి' పత్రికల్లో చూస్తూనే వుంది సినిమా తారలకు ఎంత గుర్తింపు వస్తుందో. నాటకాలు తనకు ఎంత డబ్బు ఇస్తున్నాయో చిన్న సావిత్రికి తెలియనే తెలియదు. కాకపోతే ఈ నాటకరంగం అనే ఒక వ్యాపకం తన కుటుంబాన్ని ఇంకొకళ్లని అరువు అడక్కుండా చేశాయని మాత్రం మనసులో నాటుకుపోయింది. ఇక సినిమాల్లో తనకు ఎంత డబ్బు వస్తుందో ఇంకో రెండు మూడేళ్ల దాకా కూడా తెలిసిరాలేదు, బోళా సావిత్రికి.

ఒకరోజు పెద్దబ్బాయి ఒక ముఖ్యమైన కబురు చెప్పారు వెంకట్రామయ్యచౌదరికి. "దోనేపూడి కృష్ణమూర్తి విజయవాడ వాస్తవ్యులు, సినిమా తియ్యటానికని, ఆరు నెలలు క్రితం వెళ్లారు. అప్పటి నుంచి మద్రాసులోనే ఉంటున్నారు. ఆయన్ను కలవండి, నాకు దగ్గిర బంధువు, మీకు తప్పక సాయపడతాడు" అని దాని సారాంశం.

వెంకట్రామయ్యచౌదరి ఆలోచనలో పడ్డాడు. 'ఇప్పటికి రెండుసార్లు వెళ్లాము, వచ్చాము, కాని మనకు ఇంత దగ్గరయిన మనిషిని నేను ఎలా కలవలేకపోయాను. ఆయన 6 నెలలు నుంచి అక్కడే వుంటున్నాడు. అంటే నేను అక్కడ నుండి రాగానే ఈయన అక్కడికి వెళ్లిపోయాడు. ఇలా వస్తూ పోతూవుంటే సినిమాలు ఎట్లాగూ రావు, ఇటు నాటకాలకు కూడ కాకుండా పోతుంది. లాభం లేదు. ఇక అక్కడే వుండి తేల్చుకోవలసిందే' అనే నిర్ణయానికి వచ్చాడు.

అది మార్చి 1950. ఇక తయారి మొదలు పెట్టాడు. చింతలపూడిలో ఇల్లు అమ్మించి, దుర్గాంబ, సుభద్రమ్మల పొలం అమ్మించి కాస్త డబ్బులు పోగేశాడు.

గోగినేని పెద్దబ్బాయి, చిన్నబ్బాయిగార్ల దగ్గరకు వెళ్లాడు. "అయ్యగారు, ఈసారి గట్టిగా అక్కడే వుండి ప్రయత్నిద్దాం అనుకుంటున్నా, అక్కడే చిన్న ఇల్లు తీసుకుంటాను. నన్ను మీరు బొత్తిగా వదిలేయకుండా, తక్కువ తిరుగుడు వుండే పని ఇప్పించండి, మీ మేలు మరువను" అంటూ అర్జీ పెట్టుకున్నాడు.

గోగినేని పెద్దబ్బాయి, చిన్నబ్బాయిలకు మైకాకింగ్స్ అని పేరు. వాళ్లకి మైకా గనులేకాదు బంగారు గనులు కూడా వున్నాయి. ఓ నాలుగు తరాలు కాళ్ల మీద కాళ్లు వేసుకొని కూర్చొని తిన్నా తరగని ఆస్తి. ఎంతోమందికి సాయపడతారు. వాళ్ల ఆస్తిలో ఒక్కరోజు లెక్కపెట్టగలిగినంత డబ్బు తీసినా వాళ్లకి ఏ మాత్రం తేడా రాదు. పైగా ఆ డబ్బుతో ఎంతో మంది లబ్ధిపొందుతారు.

వీళ్లిద్దరూ కూడా సావిత్రి ప్రతిభా పాటవాల గురించి విన్నారు. వినటమేకాదు స్వయంగా చూశారు కూడా. ఒక్క ఆంధ్రదేశమే కాకుండా దక్షిణ భారతదేశాన్ని చుట్టివచ్చారు. పైగా

స్వయంగా సినీనటులని కూడా చూశారు. వారు గట్టిగా నమ్మినదేమనగా, సావిత్రి చాలా అందమైనది. వీళ్లు అందమైన వాళ్లనీ చూశారు. కాని సావిత్రిలో బ్రహ్మాండమయిన తేజస్సు వుంది. అది లాంతరు పెట్టి వెదకి చూసినా మద్రాసు కోడంబాకంలో ఎవరిలోనూ కనపడదు.

సావిత్రి సినిమాల్లోకి వెళ్లి పెద్దతార అయినప్పుడు, 'ఆ అమ్మాయి మీ ద్వారా వెళ్లింది' అన్న పేరు చాలు వాళ్లకి. సావిత్రి, సావిత్రి కుటుంబం చూపాల్సిన కృతజ్ఞత చాలు.

వెంకట్రామయ్యచౌదరి పెట్టిన అర్జీని,పెద్దబ్బాయి చిన్నాబ్బాయి సహృదయంతో మన్నించారు. "అలాగేరా వెళ్లు. రోజూ ఆఫీసులో కనిపించు. జీతం తీసుకో, మీ అమ్మాయి నీకు సంపాదించి పెట్టేదాక నాదగ్గర చెయ్యి" అన్నారు.

"మరి అయ్యగారూ!..." గొణిగాడు వెంకట్రామయ్యచౌదరి.

"ఏంటీ .... ఇప్పుడేమైనా డబ్బు కావాలా?"

"డబ్బు కాదయ్యగారు .... మన మద్రాసు ఆఫీసులో వాడని మారిస్ మైనర్ కారు వుంది.మీరు సరేనంటే అది నేను వాడుకుంటాను. కారు వుంటేనే స్టూడియోల్లోకి తక్కున రానిస్తున్నారు, లేకపోతే నెట్టేసినంత పనిచేస్తున్నారు" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"ఆ కారు బాగా ట్రబుల్ ఇస్తోంది అనుకుంటా."

"నేను బాగు చేయిస్తా అయ్యగారు."

"సరేలే అయితే అలాగే వాడుకో" అన్నారు చిన్నబ్బాయి.

1950 మే 5న మద్రాసు బయలుదేరింది సావిత్రి కుటుంబం. స్టేషన్‌కి ఆప్తులందరూ వచ్చారు. లీల కుటుంబం,రాజ్యం పిన్ని,ఇంకా ఇరుగు పొరుగు, డాన్స్ మాష్టారు పూర్ణయ్య శాస్త్రి, చౌదరి, కృష్ణమూర్తి, సుంకర కనకయ్య, సహనటులు, ఎంతోమంది వచ్చారు.

ఇంతమంది వచ్చేసరికి ఉబ్బితబ్బిబ్బయిపోయింది సావిత్రి.

లీల కళ్లనీళ్లు పెట్టుకుంది.

"సావిత్రీ నువ్వు సినిమాల్లో నటించి, గొప్ప నటివైనప్పుడు ఇంత కంటే ఎక్కువ జనం వస్తారు. పూలమాలలు పట్టుకొస్తారు. ఫొటోగ్రాఫర్లు వస్తారు" అన్నాడు కృష్ణమూర్తి.

"అవేమీ వద్దులే బావగారు నేను సినిమాల్లో చేరకుండా తిరిగివస్తే నా సామాన్లు దించటానికి మీరు వుంటే చాల్లే" అంది గడుసుగా.

"అమ్మాయ్ సావిత్రి నువ్వు సినిమాల్లోకి వెళ్లింతర్వాత మమ్మల్ని మర్చిపోకూడదు" అన్నాడు సావిత్రిని డాన్స్‌లో చేర్పించిన చౌదరి.

చౌదరి కేసి చూసి నవ్వింది సావిత్రి.

ఆ ముగ్ధ మనోహర సౌందర్యమైన నవ్వులో మమేకమయ్యాడు చౌదరి.

"పెట్టిపుట్టావు సావిత్రి, చాలా అందంగా వుంటావు నువ్వు" అంటూ తెలియకుండానే సావిత్రి చేతి మీద చెయ్యి వేయబోయాడు. సావిత్రి చౌదరి చేయి పడేలోపే తన చేయి తీసేసుకుంది.

మత్తు వదిలింది చౌదరికి, సిగ్గుపడ్డాడు.కిటికీ దగ్గర నుంచి వెనక్కి వెళ్లాడు.

బండి కదిలింది.

"ఇదిగో ముగ్గురమ్మాయిలూ, ఇక ఇదే మీరు బెజవాడని చూడటం. ఇక వెనక్కి వచ్చేది లేదు. తాడోపేడో అక్కడే" మనస్సులో వున్న సంకల్పాన్ని బయటపెట్టాడు వెంకట్రామయ్యచౌదరి.

సావిత్రి కూడా 'అంతే, అంతే' అనుకుంది. 'ఈసారి తల వాల్చుకుని బెజవాడ వచ్చే ప్రసక్తేలేదు విజయమో వీరస్వర్గమో అక్కడే' అనుకుంది.

మళ్లీ అదే సూరీడు కొండల చాటుకి దిగుతుండగా, కోటి ఆశలతో సావిత్రి మద్రాసు బయలు దేరింది.

★ ★ ★

మద్రాసులో దోనేపూడి కృష్ణమూర్తి సావిత్రిని చూసి సరిపోతుందని అనుకొని, 'సంసారం' ప్రొడ్యూసర్ రంగనాథ్ దాస్ దగ్గరకు, ఇంకా డైరెక్టర్ ఎల్.వి. ప్రసాద్ దగ్గరకు తీసుకువెళ్లారు.

దోనేపూడి కృష్ణమూర్తి వీళ్లకి బాగా పరిచయమున్నవారు. ఆయన గట్టిగా సిఫారసు చేయగా సావిత్రిని ఆ సినిమా హీరోయిన్ పాత్ర అయిన 'కమల'గా తీసుకోవడానికి నిశ్చయించారు.

1950 మే 17న సావిత్రి జీవితాంతం గుర్తుంచుకున్న రోజు. మొట్టమొదటి సారిగా కెమేరా ముందు నటించబోతోంది. అంతకుముందు 'అగ్నిపరీక్ష'కు కూడా మేకప్ వేసుకొని కెమేరా ముందు నటించింది. కాని కెమేరా వెనక నుండి చూసినప్పుడు ఆ పరీక్ష తప్పింది. కాని ఈ రోజు మేకప్ టెస్ట్, ట్రైల్‌లు కాదు ,ఏకంగా షూటింగ్ కోసం అంతా రెడీ అయ్యింది.

మే 17న స్టూడియో గడపకి మొక్కి దుర్గని తలుచుకుంటూ లోపలకి వచ్చింది సావిత్రి. ముందు వెంకట్రామయ్యచౌదరి వచ్చాడు. వెనక వాళ్ల అమ్మ, ఆమ్మ లేరు. వెంకట్రామయ్యచౌదరి వాళ్లని వద్దన్నాడు. "మీరొచ్చి దాన్ని కదిలించొద్దు, విసిగించొద్దు" అన్నాడు. దా ం తో వాళ్లు ఇంట్లో వుండిపోయారు.

గ్రీన్‌రూంలో అడుగుపెట్టింది మొదలు సావిత్రికి తన శరీరంపైన, తన ఆలోచనలపైనా తనకు సహజంగా వుండే అధికారం పోయింది. మొహం మేకప్‌మేన్ అధీనంలోకి వెళ్లిపోయింది. ముందుగా కాస్ట్యూమ్స్ వాళ్లు వేసుకురమ్మని కాస్ట్యూమ్స్ ఇచ్చారు. బట్టలు వేసుకునేటప్పుడు కూడా ఒక ఆడమనిషి వుండనే వుంది. చాలా సిగ్గుపడింది సావిత్రి. "కానీయమ్మా నేను ఆడదాన్నేగా" అంది ఆవిడ.

"నేనూ ఆడదాన్నే కదా.. అందుకనే సిగ్గు" అంది సావిత్రి.

కాస్ట్యూమ్ వేసుకొచ్చి మేకప్ కుర్చీలో కూర్చుంది. కూర్చుందో లేదో ఒకళ్లు చేతులు పట్టుకున్నారు, గాజులు ఎక్కించటానికి. కాళ్లు ఒకళ్లు తీసుకున్నారు పట్టీలు వెయ్యటానికి. 'మీ దుంపతెగ ఒకటి తర్వాత ఒకటి వెయ్యొచ్చుగా' అనుకుంది సావిత్రి.

ఇంతలో ఎవరో 'కమలా', 'కమలా' అంటూ కేక వేస్తున్నారు. ఇక్కడ ఎవరో 'కమల' వుందనుకుంది సావిత్రి.

ఇంతలో ఒక పెద్దాయన వచ్చి, "ఈ సినిమాలో నీ పాత్ర పేరేమిటమ్మా?" అని అడిగాడు సావిత్రిని.

"కమల అండీ" అంది సావిత్రి.

"పాత్ర పేరు గుర్తు వుంది కాని, నువ్వు ఇంకా పాత్రలో లీనం కాలా, లేకపోతే ఏంటమ్మా, ఇందాకటినుంచి 'కమలా' 'కమలా' అని పిలుస్తున్నానా, పలకవేం?"

విస్తుపోయింది సావిత్రి.

"ఇవిగో డైలాగ్ పేపర్లు, చదువుకో" అని ముందు పెట్టివెళ్లాడు.

గ్రీన్‌రూంలోకి ఇంతకు ముందు చూడని వాళ్లు ఎవరెవరో వస్తున్నారు, మొహాన్ని అటు ఇటు చూస్తున్నారు. అక్కడ ఉన్న వాళ్లకి సూచనలు ఇచ్చి వెళ్తున్నారు. ఒకళ్లు అయితే అక్కడున్న ఆడమనిషిని పిలిచి, ఆమెకి చెవిలో ఏవో చెపితే, ఆమె వచ్చి సావిత్రి పమిట కాస్త సరిచెయ్యటం. ఇది మరీ ఇబ్బందిగా వుంది సావిత్రికి.

"అంతా రెడీనా? డైరెక్టరు గారు పిలుస్తున్నారు" అంటూ పిలుపు వచ్చింది.

నటించటానికి మొట్టమొదటిసారిగా కెమేరా ముందుకొచ్చింది, మన మహానటి సావిత్రి.

ఒక్కసారి చుట్టూతా పరికించి చూసింది. చుట్టూ ఎంతో మంది వున్నారు. అందరి చూపులూ తనవైపే. పెదనాన్న కనిపించాడు. "నటించలేక పోయావో చూడు నీ పని చెప్తాను"

అన్నట్లు వున్నాయి ఆయన చూపులు. వెంటనే చూపు మరల్చుకుంది. డైరెక్టర్ వైపు చూసింది, "నువ్వు చేయవలసింది చాలా వుంది. అప్పుడే డీలా పడిపోయావేంటి? నా ప్రతిభ నీకు తెలియదు, నాక్కావాల్సింది నీ దగ్గర నుంచి రాబట్టేస్తా" అన్నట్టు వుంది ఆ చూపు.

దోనేపూడి కృష్ణమూర్తి కూడా వున్నారు. "బాగా భయపడి పోతున్నట్లున్నావు. నా మాట నెగ్గించు తల్లీ" అన్నట్టుంది ఆయన చూపు.

ఆరోజు కొన్ని సన్నివేశాలు తీశారు. ఎవరికీ సంతృప్తిగా లేదు. అసలు చేసిన సావిత్రికే సంతృప్తిగా అనిపించలేదు. తాను నాటకాల్లో చేస్తున్నంత ధైర్యంగా చేయలేక పోయింది.

'ఈరోజే చేయలేక పోయాను. రేపు నాగేశ్వర్రావుతో చేయాలి. పైగా డాన్స్, ఇలా జంకితే ఎలా' అనుకున్నది.

ఇంటికి వెళ్లీ వెళ్లగానే అమ్మతోనూ, ఆమ్మతోను అంది, "మీరిద్దరూ నన్ను 'కమలా'... 'కమలా'... అని పిలవండీ" అని, వాళ్లిద్దరూ ఎందుకూ అని అడక్కుండానే "సరేనమ్మా" అనేశారు.

ఆ తర్వాత ఓ గదిలో తలుపు వేసుకుని చాలాసార్లు సాధన చేసింది తన పాత్రని. 'ఇప్పుడు నాగేశ్వర్రావు పక్కన, అమ్మో జనాలు ఒక్క చూపుకోసం, చొక్కాలు చింపుకొని విరగబడే ఆ నాగేశ్వర్రావు పక్కన నుంచోబోతున్నాను.' ఈ తలపుతోనే వెన్నుపూసలో వణుకు వచ్చింది సావిత్రికి.

వాళ్లమ్మ పక్కనుంటే సావిత్రికి కొండంత ధైర్యం. కాని వాళ్ల పెదనాన్న వాళ్లిద్దరినీ రావద్దన్నాడు. దుర్గాంబ జవదాటినా, సుభద్రమ్మ మాత్రం వెంకట్రామయ్యచౌదరి మాట జవదాటదు. తనకు, తన పిల్లలకు ఆశ్రయం యిచ్చినందుకు, సావిత్రి కోసం ఆయన పడుతున్న తపనకి, ఆమెకు ఆయన మీద వున్న మర్యాద అది.

ఆ మాటే ఆ మర్నాడు వెళ్లబోయేముందు పెదనాన్న ముందు అంది సావిత్రి.

"అక్కడ నీచుట్టూ వున్న జనం చాల్లేదా నీకు?" అరిచాడు.

ఒకే ఒక్క అరుపు, వెంకట్రామయ్యచౌదరిది ఇంక మళ్లీ సావిత్రి కాదుకదా ఎవరూ మాట్లాడలేదు. భయంతోనే స్టూడియోకి వచ్చింది సావిత్రి. ఎప్పుడూ ఇంతగా భయపడలేదు. మొదటి షెడ్యూల్ కంటే ఎక్కువయిందీ భయం. 'అమ్మో నాగేశ్వర్రావు, నాగేశ్వర్రావు' అంటూ జపం చేసుకుంటూ వచ్చింది.

రెండవ షెడ్యూలు మొదలైంది.

ఇంకో 15 రోజులు షూటింగ్ జరిగింది. ఎక్కువగా రీటేక్‌లే. ఒక్కో రోజు అయితే దర్శకుడు అలసిపోయేవాడు. ప్రొడ్యూసర్ ఖర్చు అవుతున్న రీళ్లు చూసి నీరుకారి పోయేవాడు.

ఒకరోజు సీన్ నాగేశ్వరరావుతో, అతను పల్లెటూరి బైతు. సావిత్రి మాంఛి హుషారైన పట్నంపిల్ల. నాగేశ్వరరావు మీద మీదకి పోయి అతగాడ్ని ఏడిపించాలి.

సావిత్రికి సీన్ వింటేనే ఏడ్చినంత పనైంది. నాగేశ్వరరావును ఏడిపిస్తూ నటించటం మాత్రం తనవల్ల కాలేదు.

ఇక దర్శక-నిర్మాతలు లాభం లేదనుకున్నారు. మొదటి నుండి కూడా బెరుకుగానే చేస్తుంది. సినిమా అంతా ఇలా చేస్తే నిర్మాతకి ఇదే మొదటి సినిమా, ఇదే చివరి సినిమా అవుతుందనే భావనకి వచ్చారు.

సావిత్రికి, ఆమె పెదనాన్నకి ఈ విషయమే చెప్పారు. 'అగ్నిపరీక్ష'లో పాత్ర లక్ష్మీకాంతంకి ఇచ్చినట్లు ఈ 'సంసారం'లో 'కమల' పాత్రని పుష్పలతకి ఇచ్చారు.

ఇన్నాళ్లు కష్టపడింది కాబట్టి నిరుత్సాహపరచకుండా సినిమాలో కనిపించేటట్టు ఏర్పాటు చేశారు దోనేపూడి కృష్ణమూర్తి. అందువల్ల మన మహానటి సావిత్రి మనకు ఒక చిన్నపాత్రలో, కమల చెలికత్తెలలో ఒకతిలాగా కనిపిస్తుంది. 'టక్కు టమారం బండి, టంకీలా బండి' అనే పాటలో కనిపిస్తుంది. 'నువ్వు అచ్చం హీరో నాగేశ్వరరావులా వున్నావే' అనే డైలాగు ఒకటి చెపుతుంది.


మొత్తానికి ఆశాభంగం కాకుండా, గుడ్డిలో మెల్లలా ఒక్క షాట్‌లోనయినా న్ననిపించుకుంది సావిత్రి.

"అమ్మాయిని స్టూడియోల్లో, మనుషుల మధ్య బాగా తిప్పండి. షూటింగ్‌లు చూపించండి, భయం తగ్గుతుంది" ఓ అమూల్యమైన సలహా ఇచ్చారు దోనేపూడి కృష్ణమూర్తి.

"మరేం బాధపడకండి నేనెట్లాగూ సినిమా తీయబోతున్నాను. హీరోయిన్ వేషం ఇచ్చి చూద్దాం, ఇలాగే భయపడిందా, ఇంకేదన్నా వేషమన్నా తప్పకుండా ఇస్తాను" అని కూడా అన్నారు దోనేపూడి కృష్ణమూర్తి.

సావిత్రి, వెంకట్రామయ్యచౌదరి స్టూడియోలోంచి బయటికివచ్చి కారు ఎక్కారు. సావిత్రి ముందు సీటులో కూర్చుంది "పెదనానా అమ్మ వుంటే నేను భయపడేదాన్ని కాదు" అంది.

"ఆడలేక మద్దెల మీద పడిందట నీలాంటిదే ఒకతి. ఇంకా నయం మా నాన్న వుంటే నాగేశ్వరరావునే గడగడలాడించేదాన్ని అనలేదు" అరిచాడు వెంకట్రామయ్యచౌదరి.



సినీరంగ ప్రవేశం చేసిన తొలినాళ్లలో బెరుకు బెరుకు సావిత్రి.
శాంతకుమారి, ఏ.ఎన్.ఆర్లతో



ఆ తరువాత భయం లేని సావిత్రి. గుమ్మడి, రమణారెడ్డి, ఎస్.వి.ఆర్లతో

రేపు ప్రొద్దున్నేలే, వేరే స్టూడియోలకి వెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టాలి. ఇక ఒక్క హీరోయిన్ వేషం కోసం చూడకుండా ఎక్స్‌ట్రా వేషాలు ఉన్నా వేసెయ్. భయం పోతుంది. ఒక వక్క వాళ్లతో పాటు ఎగురుతూ హీరోయిన్‌గా ప్రయత్నించు'' అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"రేపు వద్దులే పెదనానా ఎల్లుండి నుంచి వెళ్దాం చిరాగ్గా వుంది" అంది సావిత్రి.

"వీపు విమానం మోత మోగుద్ది" గర్జించాడు చౌదరి.

"ఒక్కరోజు ఆలస్యం చేస్తే ఒక సినిమా పోతుంది, ఒక సినిమా పోయిందంటే ఒక సంవత్సరం పోయినట్టే. ఇక నీకు వయసు అయిపోయి, అదిగో మళ్లీ వచ్చే ఆ కాంచనమాల లాగా తయారవుతావ్, ఏ పాత్రకి సరిగ్గా సరిపోక" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

ఆ తర్వాత రోజు ప్రొద్దున్నే నిజంగానే సావిత్రి వీపు విమానం మోత మోగింది.

సుభద్రమ్మ మనస్సు చివుక్కుమంది. ఎదిగిన కూతుర్ని, నిద్రపోతున్న దాన్ని అంత దెబ్బ వేసేసరికి, బావగారి ముందు మాత్రం అభ్యంతరం చెప్పలేకపోయింది.

మళ్లీ స్టూడియోల చుట్టూ తిరగటం మొదలయ్యింది. వాళ్ల పెదనాన్న చిన్నబ్బాయిగారి పనుల మీద తిరగాల్సి వచ్చింది. ఇప్పుడు చాలా నచ్చింది సావిత్రికి. తనను ప్రొద్దున్నే ఏదో ఒక స్టూడియోలో దించి, ఆయన పనిమీద వెళ్లిపోయేవాడు. సాయంత్రాలు వస్తే వచ్చేవాడు లేకుంటే తనే, థౌజండ్ లైట్స్ ఏరియాలో షాహి మొహమ్మద్ రోడ్‌లో ఉన్న వాళ్ల ఇంటికి చేరేది. పెదనాన్న పక్కన లేకపోవటంతో స్వాతంత్ర్యం వచ్చింది సావిత్రికి. మన దేశానికి బ్రిటీష్ వాళ్లనుంచి స్వాతంత్ర్యం కోసం అన్ని సంవత్సరాలు ఎందుకు పోరాడారో, దాని అవసరం ఏమిటో అప్పుడు అర్థమయింది సావిత్రికి.

'హమ్మయ్య, అసలు వూపిరి పీల్చుకోనిచ్చేవాడా, ఆఖరుకు నాకు తెలియకుండానే నా శ్వాస ఆయన అనుమతి కోసం చూస్తునట్లు ఆగిపోయేది, బిగుసుకు పోవాల్సి వచ్చేది. నేను త్వరత్వరగా హీరోయిన్ అయిపోయి డబ్బు సంపాదిస్తే ఈయనగారు గులాంగిరులు ఆపేస్తారన్నమాట. నాకూ హీరోయిన్ అవ్వాలనే వుంది. దానికి అనుకూలమైన వాతావరణం ఆయన కల్పించాలి కదా. నన్ను హడలకొట్టే వాళ్లలో ఈయనే మొదటివాడు' అనుకుంది సావిత్రి.

'ఇంకొన్నాళ్లు ఆ చిన్నబ్బాయిగారి దగ్గరే పనివుంటే బాగుండు' అని కూడా అనుకుంది.

పెదనాన్న లేకుండా తాను తానులా వుండటం చాలా బాగుంది సావిత్రికి. ఎక్స్‌ట్రా ఆర్టిస్టులు, తనలా వేషాలు కోసం తిరిగేవాళ్లు, అంతా ఒకే వయస్సువాళ్లు. ఇక కబుర్లే

కబుర్లు. వంటపని లేకుండా కాంటీన్‌కెళ్లి ఫుల్‌గా తింటం. అప్పుడప్పుడు వెంకట్రామయ్య చౌదరి సరిగ్గా తినే సమయానికి కాంటీన్‌కు చేరుకునేవాడు, "ఎక్కువ తినకు" అని హెచ్చరించేవాడు. "నువ్వు వెయ్యాల్సింది హీరోయిన్ వేషం, వాళ్ల అమ్మ వేషం కాదు" అనేవాడు. సావిత్రి ఎత్తు లావు మీద ఆయనకి అంత నమ్మకం. అయినా తిండి విషయంలో సావిత్రి తన మాటే వినదు.

ఇలా స్టూడియోలు చుట్టేస్తూ ఉన్నప్పుడు ఒకసారి దుక్కిపాటి మధుసూధనరావు ఎదురుపడ్డారు. "ఏమ్మా 'సంసారం'లో నువ్వు లేవని తెలిసి చాలా బాధ వేసింది. పోనీలేమ్మా మొదటి ప్రయత్నమే కదా...." అని చెప్తూనే ఉన్నారు, సావిత్రికి ఏడుపు వచ్చేస్తోంది.

"అయ్యో ఏడవకు తల్లీ! ఇంకా సినిమాలు లేవా? మేమంతా లేమా? ప్రయత్నిస్తూ ఉంటే అవకాశం తప్పకుండా వస్తుంది. నువ్వు బాధపడకు" అని ఓదార్చారు.

ఆ తర్వాత సావిత్రి ఈ విషయంలో ఎప్పుడూ ఏడవలేదు. పట్టుదల తెచ్చుకొంది. "నేను నటనకు ఎందుకు పనికిరాను?" అని తనను తాను ప్రశ్నించుకుంది. ఎడమచేతి పిడికిలి బిగించింది, మొండి ధైర్యంతో ముందుకే వెళ్లసాగింది.

సావిత్రికి చాముండి పరిచయమైంది ఈ సమయంలోనే. ఈ చాముండి ప్రస్తావన ఇప్పటికే రెండుసార్లు వచ్చింది. ఈ చాముండి ఎవరూ? చాముండికి సావిత్రి అంటే ప్రాణం. ఏదో పూర్వ జన్మబంధం, ఆత్మబంధం తనను సావిత్రివైపు లాగుతుందని చాముండి విశ్వాసం. చాముండికి సావిత్రి బాగా తెలుసు. సావిత్రి మనస్సులో ఎప్పుడు ఏముంటుందో కూడా తెలుసు. చేయబోయేది తప్పయితే ఒక్కమాట చెప్తుంది. "ఈ పని నువ్వు చెయ్యబోవట్లేదు" అంతే మంత్రం చదివి మందుజల్లినట్టు సావిత్రి ఆపని వైపు వెళ్లదు. సావిత్రికే అంకితమిచ్చుకుంది చాముండి తన జీవితాన్ని.

మొదట్లో సావిత్రి అందం చాముండిని కట్టిపడేస్తే తరువాత ఆమె బోళాతనం, అతి మంచితనము, ఆమెను విడవనివ్వలేదు, ప్రత్యేకంగా తనకంటూ ఒక పని, వ్యాపకం లేని చాముండి సావిత్రి దగ్గరే వుండటానికి నిశ్చయించుకుంది. ఆమెను వెన్నంటి వుండి కాపాడుతానని.

చాముండి సావిత్రికి ఎప్పుడూ అర్థం కాలేదు. అర్థం చేసుకునే తీరిక వుండేది కాదు. పైగా అర్థం చేసుకోవాల్సిన అవసరం రాలేదు. తీరా అర్థం అయ్యేసరికి అంతా అయిపోయింది.

'చాముండి చుట్టూ ఏదో వుంది' అనుకునేది సావిత్రి.

మొదటిసారిగా చాముండిని వాహిని స్టూడియోలో చూసింది. ఎందరో ఎక్స్‌ట్రాల్లో తనూ ఒక్కతి. అందరికంటే పెద్దది, అంగుళం పైఎత్తులో ఉండేది. అందమైనది కాదు.

A C. No. 91132

కాని అంతులేని ఆత్మవిశ్వాసం. ఎక్స్‌ట్రాలు అందరూ హీరోయిన్లు అవ్వటానికి పోటీపడుతుంటే తను మాత్రం నిశ్చలంగా ఉండేది. దేనికోసం పోటిపడేది కాదు. అందరూ స్టూడియోలోంచి ఒక దారిన వెళితే చాముండి మాత్రం లోపలి దారి నుంచి వెళ్లేది. 'అదిగో అక్కడే ఉంది, చాముండి చుట్టూ ఉన్న రహస్యం' అనుకునేది సావిత్రి.

ఇదీ.... సావిత్రి–చాముండీల స్నేహానికి, ప్రేమకి ఉపోద్ఘాతం.

మళ్లీ సావిత్రి సినీ ప్రయత్నాల దగ్గరకు వస్తే, అన్ని స్టూడియోలు తిరుగుతోంది. కె.వి.రెడ్డి విజయ సంస్థ కోసం 'పాతాళభైరవి' తీస్తున్నారు అని అప్పటికే అందరికీ తెలుసు.

అది 1950వ సంవత్సరం. 'పాతాళభైరవి' షూటింగ్ 1950, ఫిబ్రవరిలో మొదలైయింది. 'నాలుగు డాన్స్ బిట్లు వున్నాయి, డాన్సర్ల కోసం చూస్తున్నారు, అందరినీ టెస్ట్ చేస్తున్నారు' అని తెలియవచ్చింది సావిత్రికి. ఆ ప్రయత్నంలోనే వాహిని స్టూడియోకి చేరుకుంది సావిత్రి.

డాన్స్ మాష్టారు పసుమర్తి కృష్ణమూర్తి అందరిచేత ఒక్కో డాన్స్ ఒక నిమిషం పాటు చేయించి కె.వి.రెడ్డికి చూపుతున్నారు. చలాకీగా అందరిలో ఎత్తుగా వదుపుగా వున్న సావిత్రి ఆయన కంట్లో ఇట్టే పడింది. అంతకు ముందు కూడా కె.వి.రెడ్డి కంట్లో పడటానికి చాలా ప్రయత్నాలు చేసింది సావిత్రి, అవి ఆయన గమనించక పోలేదు. అందరివీ ఒక రౌండు అయింతర్వాత, కె.వి.రెడ్డి పసుమర్తికి మళ్లీ వస్తానని చెప్పి వెళ్లారు. సావిత్రి కూడా ఆయన వెనకే బయటికి దారి తీసింది. తీరా బయటికి వచ్చేసరికి ఆయన ఎటు వెళ్లారో తెలియలేదు. అటు ఇటు కలియ తిరిగింది. ఒక చోట అక్కినేని నాగేశ్వరరావు ఎవరితోనో మాట్లాడుతూ కనిపించారు. నమస్కారం చెప్పింది. ఆయన ప్రతి నమస్కారం చేసి మళ్లీ మాటల్లో పడిపోయారు. ఆయన మాట్లాడతారేమో అని అశ పడింది సావిత్రి. 'వీళ్లు ఎందుకు అందరితో మాట్లాడరు, ఈయనే గనుక ఆ 'సంసారం' సెట్ మీద నాతో మాటలు కలిపి వుంటే నేను అంత భయపడేదాన్ని కాదు కదా. నేను హీరోయిన్ అయినప్పుడు అందరితో మాట్లాడి వాళ్లకి భయం లేకుండా చేస్తా' అనుకుంది ఆనాడే సావిత్రి. తరువాత అలానే చేసింది కూడా. కె.వి.రెడ్డి మళ్లీ కనిపించారు. ఆయన వెనకే దారి తీసింది. ఆయన పసుమర్తి దగ్గర ఆగారు. సావిత్రిని చూపిస్తూ "ఈపిల్ల బాగా తెలివి గల పిల్లలాగా వుందే" అన్నారు.

"డాన్స్‌లో గూడా దిట్ట" అన్నారు పసుమర్తి కృష్ణమూర్తి .

"సరే ఒక డాన్స్‌కి ఈ అమ్మాయిని తీసుకోండి. మిగతావాళ్లని కూడా సెలక్టు చేసుకోండి" అని చెప్పి వెళ్లారు.

ఆ మాటలన్నీ సావిత్రికి వినిపించాయి. చాలా సంతోషపడింది. మొహం వెలిగిపోయింది.

పసుమర్తి పిలిచారు. "ఓహో విషయం తెలిసిందన్నమాట. సరే అయితే రేపట్నించే రిహార్సిల్స్" అన్నారు.

'హమ్మయ్య' అనుకుంది సావిత్రి.

అనుకున్న పని అయింది. మేనెల షూటింగ్ తర్వాత ఆగష్టులో మళ్లీ కెమేరా ముందుకు రాబోతోంది. పెదనాన్న కోసం ఎదురు చూసింది. ఆయన రాగానే విషయం చెప్పేసింది, ఆయన విన్నాడు. భుజం తట్టలేదు. మొహం గంభీరంగా పెట్టి "సరే అమ్మాయ్ నువ్వు వెళ్లు, నేనా మిగతా విషయాలు కనుక్కొని వస్తా" అన్నాడు.

సావిత్రి ఒక్కతే ఇంటికి వెళ్లిపోయింది.

తర్వాత రోజు ఇద్దరూ వాహినీకి వచ్చారు.

"చెప్పింది అర్థమయిందా? వెళ్లి అడుగు ఆయన్ని, సోలో సాంగ్ అడుగు పో" అని చెప్పి వెంకట్రామయ్యచౌదరి సావిత్రిని కె.వి.రెడ్డి దగ్గరకు పురమాయించాడు.

ఆయన ఉద్దేశం ప్రకారం సావిత్రికి ఇచ్చింది లాంగ్ షాట్‌లోను, మరొకరుతోను తీయబోయే పాట. సోలో సాంగ్ ఉండగా, ఫోకస్ అంతా సావిత్రి మీదే వుండే ఆస్కారం వున్నప్పుడు, ఆ పాటకే ఎందుకు వెళ్లకూడదు అని.

సావిత్రి యాంత్రికంగా తలవూపి కె.వి.రెడ్డి దగ్గరకు బయలు దేరింది.

ఇంకా రెండు అంగల్లో కె.వి.రెడ్డి దగ్గరకు వెళుతుంది అనగా చాముండి భుజం తట్టి వెనక్కి పిలిచింది.

"ఏంటీ.. మీ పెదనాన చెప్పినట్లు చేయటానికి వెళ్తున్నావా?" అని అడిగింది.

'ఊఁ...' అన్నట్లు 'నీకెలా తెలుసు అన్నట్లు', రెప్పపాటులో రెండు భావాలు ఒకదాని తర్వాత ఒకటి అన్నట్లు, ఒకేసారి అన్నట్లు, కాని రెంటి అర్థాలు ఎదుటివాళ్లకి స్పష్టంగా తెలిసేటట్లుగా చూసింది. ఇది సావిత్రికి దేవుడు దగ్గరుండి ఏరికోరి తనలోకూర్చిన వరం. ఇహలోక భాషలో కళ్లతో చూపే ఆ భావ ప్రకటన సావిత్రికి వెన్నతో పెట్టిన విద్య.

ఆ చూపులకు కాసేపు చాముండి ముగ్ధురాలైంది. "అక్కడ మీ పెదనాన పచార్లు చూస్తున్న వాళ్లందరికీ అర్థమవుతుందిలే. కె.వి.రెడ్డి గారు నువ్వు పుట్టినప్పుడు నుండి సినిమాలు తీస్తున్నారు. ఆయనకి తెలుసు నువ్వు దేనికి బాగా సరిపోతావో. పైగా నీకు ఇచ్చిన ఐటమ్‌లో నువ్వు చేయబోయేది డాన్స్ డైరెక్టర్ ప్రక్కన, ఆయన్ని మెప్పించావంటే ఆయన నిన్ను బాగా రికమెండ్ చేస్తారు. అనవసరంగా కెలక్క వచ్చిన దారిన వెళ్లు" అని గట్టిగా చెప్పింది.

"మరి పెదనానకు ఏమి చెప్పను?"

"రెడ్డిగారిని అడిగాను, ఇవ్వనన్నారు అని చెప్పు."

"అయన వచ్చి రెడ్డిగారినే అడిగితే?"

"అయనకు అంత వుంటే ఆయనే వెళ్లి అడిగేవాడు, నిన్ను పంపించకుండా" అంది చాముండి.

అలా చాముండి సావిత్రిని సరైన దారిలో పెట్టింది. "నీ పాత్ర ఇదీ అన్న తర్వాత ప్రొడ్యూసర్‌ని కాని, డైరెక్టర్‌ని కాని నాకు ఈ పాత్ర వద్దు ఆ పాత్ర చేస్తాను అని అడక్కూడదు" అని విడమర్చి చెప్పింది.

"చేస్తే ఆ పాత్ర చెయ్యి లేకపోతే మానెయ్. అంతేకాని ఇతరుల పాత్రలు లాక్కోవటానికి ప్రయత్నించకు" అంది. "ఈ విషయంలో సూర్యకాంతంని చూసి నేర్చుకో" అని కూడా చెప్పింది.

ఇది మొదలు సావిత్రికి చాముండి చాలా దగ్గర అయ్యింది.

చాముండి చెప్పినట్లే జరిగింది. పసుమర్తి కృష్ణమూర్తితో డాన్స్ షూటింగ్ జరిగింది. రానంటే రానే' అనే పాటకి. చాముండి చెప్పినట్లే కె.వి.రెడ్డి, పసుమర్తిలు అంతా తెలిసే తీసుకున్నారు. ఆ పాటను అందరూ చేయలేరు. ఆ డాన్స్ సీక్వెన్సుకు మంచి ఫుట్‌వర్క్ కావాలి,పాటలో వెంట వెంటనే భావ ప్రకటనలు చాలా ఉంటాయి. అలగటం, కోపగించుకోవటం, చాటున ముసిముసిగా నవ్వుకోవడం, ఇలా వరసగా ఉంటాయి. చాలా బాగా డాన్స్,నటన చేయగలగిన వాళ్లే దాన్ని చేయగలరు. సావిత్రి ప్రతిభను చూసి ఈ పాటకి సావిత్రిని తీసుకున్నారు.

ఈ పాట షూటింగ్ అయిన రెండు రోజులకే సావిత్రికి గుర్తింపు వచ్చింది. ఇతర స్టూడియోలకి ఎక్కడకి వెళ్లినా "'పాతాళభైరవి' పిల్లా, 'రానంటే రానే' పిల్లనా, పసుమర్తిగారు చెప్పారు నువ్వు బాగా చేశావని, గొప్ప టాలెంట్ వున్నదానివని. మా సినిమాలో నిన్ను వేసుకోవాల్సిందే, కాని ప్రస్తుతం అందరూ బుక్ అయ్యారమ్మా వచ్చే సినిమాలో చూద్దాం" అంటూ చావు కబురు చల్లగా చెప్పేవారు. కాని సావిత్రికి తెలుసు వీళ్లందరూ మర్యాద కోసం అన్న మాటలని. ఒక ఆడపిల్ల వచ్చి అడిగిందే అని చెప్పిన మాటలు. తను ఇటురాగానే తనని మర్చిపోతారు. కాని కోన ప్రభాకరరావు అనే నటుడు,దర్శక-నిర్మాత మాత్రం చిన్న నిడివి గల వ్యాంప్ రోల్ ఇచ్చారు 'రూపవతి' అనే సినిమాలో, అది కూడా 1951లో 'పాతాళభైరవి' తర్వాత రిలీజు అయింది. ఇక తీయబోయే సినిమాల కోసం ఎదురు చూస్తూ

స్టూడియోల చుట్టూ తిరగటమే పని. సావిత్రి కొన్ని స్టూడియోలు తిరిగితే వాళ్ల పెదనాన్న కొన్ని స్టూడియోలు తిరిగేవాడు. చాముండి ఎక్కువ విజయ-వాహినిలోనూ, ఏ.వి.యమ్‌లోనూ కనిపించేది. చాముండికి జరుగుతున్న విషయాలన్నీ చెప్పేది సావిత్రి.

ఇలా స్టూడియోలు తిరుగుతూ అందరికీ నేనొకదాన్ని వున్నాను అని గుర్తుచేస్తూ ఇంటికి చేరుకునేది సావిత్రి. 'నాకీ చిల్లర వేషాలు కాకుండా, ఒక మంచిపాత్ర ఎప్పుడు వచ్చేది?' అని లోలోన మధనపడేది.

1951, మార్చి 15న 'పాతాళభైరవి' విడుదల అయింది. తర్వాత 100 రోజులు కూడా పూర్తి చేసుకుంది. నాగిరెడ్డి, చక్రపాణి, కె.వి.రెడ్డి 'పాతాళభైరవి' విజయోత్సవాలను విజయవాడలో జరిపించ తలచారు. యన్.టి.ఆర్, మాలతి, యస్.వి.ఆర్, సి.యస్.ఆర్ ఇలా ముఖ్యపాత్రధారులంతా విజయవాడ వెళ్లడానికి నిశ్చయమయింది.

"అమ్మాయ్ సావిత్రి నువ్వు కూడా వచ్చెయ్, అక్కడ కూడా నీ డాన్స్ వేద్దువుగాని" అన్నారు కె.వి.రెడ్డి సావిత్రితో.

"సరేనండి" అంది సావిత్రి. 'లీల, చౌదరి వీళ్లందరూ నన్ను ఈ గొప్ప గొప్ప వాళ్ల మధ్య చూసి ఎంతో మురిసిపోతారు. విజయవాడలో నేను తెలిసిన వాళ్లందరూ నన్ను చూస్తారు' అనుకుంటూ సంబర పడిపోతూ వెనక్కి తిరిగింది.

తిరగ్గానే అక్కడ చాముండి వుంది.

"ఏమిటీ విజయవాడ వెల్దామనే" అంది.

"కె.వి.రెడ్డి గారు రమ్మన్నారు, వెళ్లకపోతే బాగుండదు కదా" అంది సావిత్రి.

"నువ్వు ఇక్కడ చేయాల్సిన పనులు వున్నాయి, నువ్వు వెళ్లటం లేదు" అంది.

"ఆయన పిలిచిన తర్వాత వెళ్లకపోతే ఎట్లా?"

"నీ దగ్గరకు ఎవరైనా వచ్చి ఇదిగో టిక్కెట్ రేపే బయలుదేరాలి అని చెపితే అప్పుడు బయలు దేరు. అందాక మర్చిపో ఈ సంగతి" చెప్పేసింది చాముండి. నిట్టూర్చింది సావిత్రి.

'చాముండి చుట్టూ ఏదో వుంది, అన్నంతపని నిజంగా చేస్తుంది. ఇక్కడ నేను చేయాల్సిన పనులేమున్నాయి. విజయవాడకు కె.వి.రెడ్డి, రామారావుతో పాటు వెళ్లి వుంటే వాళ్లు బాగా పరిచయం అయ్యేవారు, ఎప్పుడైనా నన్ను రికమండ్ చేసేవారు' అనుకొంది సావిత్రి.

"ఏంటి కె.వి.రెడ్డి నిన్ను రమ్మనలేదు" అని వెంకట్రామయ్యచౌదరి నసుగుడు.

'పాతాళభైరవి' యూనిట్ విజయవాడకు బయలుదేరి వెళ్లిపోయింది.

ఒక విషయం గమనించింది సావిత్రి. తనతోపాటు ప్రయత్నాలు మొదలుపెట్టిన వాళ్లలో కొంతమంది ఎవరిదో ఒకరి అండ దొరకపుచ్చుకొని పాత్రలు తెచ్చుకోగలుగుతున్నారు. ఇలా తను ఒక్కతే, పెదనాన్న ఒక్కడే వేరు వేరుగానైనా, కలిసికట్టుగానైనా ఎవరిని బతిమిలాడుకున్నా పెద్దగా ప్రభావం లేదు అనిపించింది. దోనేపూడి కృష్ణమూర్తి వున్నారా అంటే వున్నారు, కాని ఆ 'సంసారం' దెబ్బతో తనను ఎవరికన్నా రికమెండు చేద్దామన్నా భయపడుతున్నారు.

'ఆ చంద్రకుమారి నా తర్వాతే వచ్చింది. ఖాళీగా లేకుండా ఏదో ఒక రోల్ చేస్తూనే వుంది. మెల్లమెల్లగా పైకి వెళుతోంది. ప్రస్తుతానికి సెకండ్ హీరోయిన్ అంటే చంద్రకుమారే. రేపో మాపో హీరోయిన్ అయి కూర్చున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఒక్క చంద్రకుమారి ఏమిటి? అందరూ పైకి పైకి పోతున్నారు. నాకూ ఎవరో ఒకరి అండ లేకపోతే ఎలాగా? ఆ యూనిట్‌తో వెళ్లినా వాళ్లు బాగా పరిచయమయ్యే వారు' ఇలా ఆలోచిస్తున్న సావిత్రికి రోషం వచ్చింది. వెళ్లటం వెళ్లటం వాహిని స్టూడియోకి వెళ్లింది. చాముండి దగ్గరకు వెళ్లింది. "నాకు ఇక్కడ చేసే పనులు వున్నాయన్నావుగా చెప్పు ఏం చెయ్యాలో" అంది.

"ఇప్పుడే వస్తాను వుండు" అని మళ్లీ అదే లోపలికి వెళ్లింది. అటు వైపు ఎక్స్ట్రా వాళ్లు చూడటానికైనా సాహసించరు.

చేతిలో ఒక ఫైలు పట్టుకొని వచ్చింది. "ఇది విజయా వాళ్ల తరువాత సినిమా. బెజవాడ నుంచి రాగానే మొదలుపెడతారు. రెండవ హీరోయిన్‌గా నిన్ను తీసుకున్నారు. ఈ కథను, పాత్రలను అర్థం చేసుకో. వాళ్లు ఎన్నో రోజులు అక్కడ వుండరు. 15 రోజుల లోపలే తిరిగి వస్తారు. ఈ లోపల నువ్వు చేయవలసిన పని ఇది. గదిలో కాకుండా ఎక్స్ట్రాల అందరి ముందు చేసి, పూర్తిగా భయం లేకుండా చేసుకో" అంది చాముండి.

"ఈ స్క్రిప్టు నా చేతికి ఎలా వచ్చిందంటే" అని భయంగా అడిగింది సావిత్రి.

"చాముండి ఇంకా దొంగతనాలకు దిగలా" అంది సూటిగా చూస్తూ .

సావిత్రి భయపడిపోయింది, "అబ్బే అదిగాదు నా వుద్దేశం నాగిరెడ్డి,చక్రపాణి గార్ల స్క్రిప్ట్ నా దాకా రావటం ఏమిటా అని, మామూలుగా అయితే రాదు గదా?"

"ఇది నా గొప్ప కాదు, స్క్రిప్టు మామూలుగా అయితే నీకు 15 రోజులు తర్వాత కచ్చితంగా వచ్చేది. నేను కాస్త ముందు తీసుకువచ్చాను అంతే. భయపడకుండా చేస్తే నీకు ఇదే పెద్ద పాత్ర అవుతుంది. ఇక ఇక్కడ నుండి ఇంతకంటే తక్కువ పాత్రలు చేయనవసరం లేదు. బెజవాడ పోనివ్వలేదని కోపం వచ్చిందా?" అని అడిగింది చాముండి.

"వచ్చింది. ఇందాకటి దాకా కూడా వుంది. ఇప్పుడే పోయిందిలే" అంది సావిత్రి గోముగా. అలా కోపం నటిస్తూ సావిత్రి ఎంత ముద్దుగా ఉంది... చాముండి అలా చూస్తూనే ఉంది.

విజయోత్సవాలు ముగించుకుని 'పాతాళభైరవి' యూనిట్ వచ్చేసింది. వాళ్లు వచ్చీరాగానే చక్రపాణి దగ్గరకి వెళ్లింది. "ఏమ్మా, బాగున్నావా? చాముండి ఇచ్చిన స్క్రిప్టు బాగా చదివావా? అర్థం చేసుకున్నావా?" అడిగారు ఆయన.

"చదివానండి. మీ ట్రిప్ బాగా జరిగిందాండి. మా ఊరు బాగుందా?" అడిగింది ఉత్సాహంగా సావిత్రి.

ఈసారి ప్రక్కనున్న కె.వి.రెడ్డి అందుకున్నారు "మీ వూరు బాగుందమ్మా. నిన్ను అడిగానని చెప్పమంది. కాని నీలాగా డాన్స్‌చేసే వాళ్లు ఎవరూ లేరమ్మా మీ వూళ్లో."

"కొంపదీసి నన్ను అక్కడకి పంపించేస్తారా ఏమిటి?"

"లేదు లేదు, ఎక్కడికి వెళ్లినా అడుగుతున్నారు, పసుమర్తితో చేసిన అమ్మాయి ఎవరూ అని. నీతో పాటు ఆ నలుగురు డాన్స్ చేశారు కదా? అందరూ నీ గురించే అడుగుతున్నారు కాని, ఆ మిగతా అమ్మాయిలెవ్వరినీ అడగలేదు అంటే... నీలో ఏదోవుంది. అందుకే నీకు ఈ సినిమాలో ఓ పాత్ర ఇచ్చారు చక్రపాణి. పైగా చాముండి ఆయన పీక పట్టుకున్నంత పని చేసింది. ఈ సారి బిడియం లేకుండా చెయ్యి. దీనిలో వున్నది డాన్సే కాదు నటన కూడా, అందుకే జాగ్రత్త" అని ఆయన వెళ్లిపోయారు.

"దీంట్లో నా పాత్ర ఏంటండీ" చక్రపాణిని అడిగింది.

"హీరోయిన్ పాత్ర ఇవ్వలేదమ్మా నీకు. నీకింకా అంత అనుభవం లేదుకదా, దాంట్లో వున్న సావిత్రి పాత్రే ఈ సావిత్రి పాత్ర" అన్నారు చక్రపాణి.

సావిత్రి చాలా సంతోషించింది. స్క్రిప్ట్ బాగా చదివింది, స్క్రిప్ట్ అంతా గుర్తే. సావిత్రి పాత్ర గుర్తు తెచ్చుకుంది. పూర్తి నిడివిగల పాత్ర.

ఆ వెంటనే చాముండి గుర్తుకు వచ్చింది. 'చాముండి చెప్పిందా నా గురించి, ఎంత సాయంచేసింది. ఇప్పటి దాకా నాకు ఎవరూ లేరనుకున్నాను. హమ్మయ్య నాకు చాముండి వుంది' అని తృప్తి పడింది సావిత్రి.

అది 1951 ఆగస్టు నెల.

1950 మే మొదలు సావిత్రి 'సంసారం'లో ఒక చిన్న పాత్ర, ఆ తర్వాత 'పాతాళభైరవి'లో డాన్స్ చేసింది. అది ఆగష్టు నెలలో. 1950 ఆగష్టు నుంచి 1951 ఆగస్టు దాకా సావిత్రి

చేసిందల్లా స్టూడియోలు చుట్టూ తిరగటమే. వెంకట్రామయ్యచౌదరి ప్రయత్నంవల్ల ఒక్క 'రూపవతి' అనే సినిమాలో ఒక వ్యాంపు రోల్ వేసింది. నటనకు ఆస్కారం వున్న పాత్రేగాని ఎక్కువ నిడివి లేని పాత్ర. 1951లో 'పాతాళభైరవి' తర్వాత 'రూపవతి' రిలీజ్ అయ్యింది. ఆ సినిమా పెద్దగా ఆడలేదు. ఆ సినిమాను ఎవరు పట్టించుకోలేదు. ఇక ఆ సినిమాలో చిన్న పాత్ర వేసిన సావిత్రిని ఏం పట్టించుకుంటారు. అందుకని సావిత్రికి ఒక సంవత్సరం పాటు 'పాతాళభైరవి పిల్ల', 'రానంటే రానే పిల్ల' అనేవి పరిచయ వాక్యాలు అయ్యాయి. కాకపోతే 'రూపవతి' సినిమా సావిత్రికి కెమేరా ముందు భయం వీడటానికి తోడ్పడింది.

ఆ సంవత్సరకాలంలో సావిత్రి తిరగని స్టూడియో లేదు. నిరుత్సాహపడని రోజూ లేదు. ఇంట్లో పెదనాన్న వత్తిడి చాలా ఎక్కువగా వుండేది.

"ఏమమ్మాయ్ ఇంక బెజవాడ పోదామా?" అని కర్కశంగా అనేవాడు.

గొంతులోతూ దిగి ప్రయత్నాలు చేస్తుంటే దెప్పిపొడుపులు. సావిత్రి కూడా దెప్పటమో, విసుక్కోవటమో జరిగి, "సరే వెళ్లిపోదాం" అంటే మూర్ఖంగా తీసుకు వెళ్లిపోయే రకం.

ఇంకోసారి, "అమ్మాయ్ సుబ్బరంగా కారు నడుపుకునే వాడిని, రోడ్డు మీద పడేశావ్. నీ చేత కారు కొనిచ్చుకొనే దాకా వదలను నిన్ను. ఏదీ ఆ సూచనలేవీ కనిపించటం లేదే?" అనేవాడు.

ఎన్నోసార్లు సావిత్రి, "అమ్మా ఈరోజు ఏదో ఒక సినిమాలో బుక్ అయ్యే వస్తానే" అని శపథం చేసినట్లు పోయేది. కాని ఆశాభంగమై వచ్చేది.

పెదనాన్న లేకపోతే అమ్మ చేరదీసేది. ఆయన వుంటే మంచం ఎక్కి దుప్పటి కప్పుకొని బాధపడేది.

మరుసటిరోజు చాముండికి కనిపించేది. చాముండికి బాధలు చెప్పుకొని ఓదార్పు పొందేది. 'చాముండీ ,నా ఇంట్లో నువ్వు కూడా వుంటే బాగుండు నన్ను ఓదార్చటానికి' అనుకునేది.

మొత్తానికి 1951 ఆగష్టులో సావిత్రి ప్రతిభ, చాముండి,చక్రపాణికి సావిత్రి మీద ఉన్న నమ్మకం ఇవన్నీ కలిసి సావిత్రికి అన్నింటికంటే పెద్ద అవకాశం వచ్చేలా చేశాయి.

"అమ్మాయ్ ,నీకు వేషాలు ఎలా పట్టాలో బొత్తిగా జ్ఞానం లేకుండా పోతోంది. ఆ హీరోయిన్ వేషం అడగాలి. నేను చేసి చూపగలను అని చేసి చూపించాలి. ఆ హీరోయిన్‌గా సెలెక్ట్ చేసిన ఆవిడ వయసు ముదిరిపోయింది. ఆవిడనెట్లా తీసుకున్నారు? ఆమెకున్నంత తెలివితేటలు నీకు లేకపోయినయి" అంటూ వెంకట్రామయ్యచౌదరి కసుర్లు విసుర్లు.

"ఇప్పుడు అనుకొని ఏమి లాభం? నీకు కచ్చితంగా సంవత్సరం ముందే చెప్పా. అప్పుడే చెప్పా. ఆ డాన్స్ కాదే, ఇంకో డాన్స్ అడుగు అని. నువ్వు అప్పుడే ఆ పని చేసివుంటే నీకు 'రూపవతి' లోనే మంచి పాత్ర వచ్చేది. ఇప్పుడు హీరోయిన్ పాత్రే వచ్చేది."

"పద రేపు నేను కూడా వచ్చి నాగిరెడ్డిగారిని అడుగుతాను" అని ముక్తాయించాడు.

సావిత్రి భయపడిపోయింది.'రాకరాక వచ్చిన మంచి రోల్. విజయా సంస్థ వాళ్లు ఇచ్చింది. అంత పెద్దోళ్లని ఈయన అడుగుతాడా? వాళ్లు తలచుకుంటే నేనేమైపోతాను' అనుకుంది.

ఆ రాత్రి నిద్రే లేదు సావిత్రికి. "చాముండి, చాముండి" అని కలవరింత. తెల్లారగానే సావిత్రికి అరుపులతో సుప్రభాతం వినిపించింది. సుభద్రమ్మ త్వరగా సావిత్రి చేతిలో బట్టలు పెట్టి స్నానానికి పంపించింది. ఇవ్వాళ చేయాల్సిన పని సావిత్రికి సుతారమూ ఇష్టం లేదు, కాని తాను అశక్తురాలు. ఏమీ అనలేదు.

సావిత్రి, వెంకట్రామయ్యచౌదరి విజయ-వాహిని స్టూడియోకి చేరుకున్నారు. ఇక సావిత్రి షూటింగ్ ఇక్కడే కాబట్టి చాముండి ఈ స్టూడియోకే వచ్చింది. విషయం చెప్పింది సావిత్రి.

"సరే అదిగో ఆఫీస్‌రూంలోనే ఉన్నారు, వెళ్లండి" అంది తాపీగా చాముండి.

"అదేంటి చాముండీ పంపిస్తున్నావు?"

"వెళ్లు.... వెళ్లిం తర్వాత నీకే తెలుస్తుందిగా."

"ఇంక ఈ స్టూడియోతో నాకు సెలవైందా."

"నేను అలా కానిస్తానా సావిత్రి?"

"అయితే నాకు ఈ సినిమాతో ఇక సెలవా?"

"నేను లేనూ?" అభయమిచ్చింది చాముండి.

"అలా కూడా అవ్వదా?" అయితే నాకు హీరోయిన్ రోల్ ముందుగానే ఖాయం చేశావన్నమాట."

"అబ్బో! అమ్మాయి గారికి ఆశ బానే ఉంది.....అదేం కాదులే, లోపలికి వెళ్లు, నీకే తెలుస్తుంది" అంది చాముండి.

"ఇది కూడా కాదా.రేపే షూటింగ్ మొదలు అయితే ఈరోజు ఇలా అడగడం తప్పుకదా..."

"నువ్వు వెళ్లు. మీ పెదనాన ఆఫీస్‌రూం దగ్గర ఎదురు చూస్తున్నాడు.అక్కడే తెలుస్తుంది నీకు " అని నెట్టింది.

సావిత్రి బెరుకు బెరుకుగా ఆఫీస్ రూంలోకి నడిచింది. నాగిరెడ్డి ఎదురుగా కన్పించారు.

"ఏంటీ, పెదనాన్న, చిన్నది కలిసి వచ్చారు" అన్నారు నాగిరెడ్డి.

"ఏమీ లేదండీ మంచి రోల్ ఇచ్చారు, కృతజ్ఞత చెపుదామని" అని మొదలుపెట్టాడు వెంకట్రామయ్యచౌదరి.

అప్పటిదాకా పేపర్ వెనక ఉన్న మనిషి పేపర్ తీసి "మీకు ఇచ్చిన రోల్ సరిగ్గా చేసి, మా మెడకు రోలుబండ కాకుండా అయితే, మేమే కృతజ్ఞులం" అన్నాడు.

ఇద్దరూ అటువైపు చూశారు. ఇంకెవరు చక్రపాణి. ఇద్దరి గుండెలు ఆగినంత పనయ్యింది.

"అమ్మాయ్ లోపల రిహార్సిల్సు జరుగుతున్నాయి. నువ్వేం చేస్తున్నావ్ ఇక్కడ, వెళ్లు" అన్నారు చక్రపాణి.

సావిత్రి వెంటనే గదిలోంచి మాయమైంది. చక్రపాణి ముందు నోరు మెదపలేక, కదలలేక నానా అవస్థలుపడి వెంకట్రామయ్యచౌదరి ఎలాగోలా బయటపడ్డాడు.

ఒక్కమాట అడగటానికి మాత్రం సావిత్రి బయట ఎదురు చూసింది.

వెంకట్రామయ్యచౌదరి రాగానే "పెదనానా అడిగేవా?" అంది.

"ఏంటి అడిగేది, ఆ కట్టె, కొట్టె, తెచ్చె మనిషిని. ఈ సారికి ఇట్లా కానియ్యి" అంటూ వెళ్లిపోయాడు వెంకట్రామయ్యచౌదరి. సావిత్రి నవ్వుకుంది.

1951 ఆగస్టులో 'పెళ్లి చేసిచూడు' సినిమా షూటింగ్ మొదలైంది.

' 'విజయ' వారు సావిత్రిని సెకండ్ హీరోయిన్‌గా చేశారు. అదీ ఎల్.వి. ప్రసాద్ గారి డైరెక్షన్‌లో' అన్ని స్టుడియోల్లో గుప్పుమందీ వార్త.

పైగా 'విజయ' వారు రషెస్‌ని దాచిపెట్టరు. రెండు మూడు షెడ్యూళ్లు అయిన వెంటనే అందరికీ చూపేవాళ్లు. చూసేవారిలో ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఉండేవాళ్లు. వీరి దృష్టి ఎక్కువగా కొత్త ఆర్టిస్టుల మీద ఉండేది. నచ్చితే సంప్రదించేవారు.

ఇలా రషెస్ చూసినవారికి సావిత్రి ఫర్వాలేదనిపించింది. పూర్తిగా బెరుకు పోనప్పటికి ఆమె రూపురేఖలు, అందమైన, స్వచ్ఛమైన నవ్వు అందరినీ ఆకట్టుకున్నాయి.

'పెళ్లి చేసి చూడు' షూటింగ్ జరుగుతుండగా ఒక షాట్‌గ్యాప్‌లో జి.వరలక్ష్మి, సావిత్రి కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అప్పుడు బాయ్ ఒకడు కాఫీ తీసుకొచ్చాడు. అతడు తెలియక తీసుకొచ్చాడో, తెలిసే తీసుకొచ్చాడో కాని జి.వరలక్ష్మికి కప్పు-సాసర్‌లో కాఫీ

ఇచ్చాడు, సావిత్రికి స్టీల్‌గ్లాస్‌లో ఇచ్చాడు. జి.వరలక్ష్మి అది గమనించి అతన్ని మందలించింది. "ఇద్దరు ఆర్టిస్టులకి కాఫీ తెస్తున్నప్పుడు ఇద్దరికీ సమానంగా తేవాలి, ఇదేంటి? ఒకళ్లకి కప్పు, ఒకళ్లకి గ్లాసు, పో.. పోయి మార్చుకురా" అంది.

"ఒక కప్పే ఉందండి" అన్నాడు బాయ్.

"సరే అయితే ఆ గ్లాసులోది సాసరులో పోయి నేను తాగుతా, కప్పు సావిత్రికి ఇవ్వు" అంది. అట్లాగే చేశాడు బాయ్. జి. వరలక్ష్మి సాసరులో సావిత్రి కప్పులో కాఫీ తాగారు.

జి. వరలక్ష్మి కనబరిచిన ఈ సుహృద్భావానికి ఆమె వైపు చూస్తూ కళ్లతోనే కృతజ్ఞత, ఆనందం వ్యక్తం చేస్తుండగా....

"రేపు నువ్వు పెద్దతారవైనప్పుడు మేమెట్లాగు క్యారెక్టర్ ఆర్టిస్టులం అవుతాము, అప్పుడు మా పరిస్థితి ఇందాకట్లాగా కాకుండా చూడు" అంది జి.వరలక్ష్మి.

నవ్వుకుంది సావిత్రి.' 'పెద్దతార' అసలు అవుతానా?' అనుకుంది.

'అవ్వకుండా మాత్రం వదిలిపెట్టేది లేదు' అని సంకల్పించుకుంది.

సావిత్రి 'పెళ్లి చేసి చూడు' షూటింగ్‌లో వుండగానే వెంకట్రామయ్యచౌదరి ఇల్లు చక్కబెట్టుకుంటూ వచ్చాడు. నాలుగు సినిమాలలో సావిత్రిని బుక్ చేయించాడు. ఆయన ఎవరి కాళ్లా వేళ్లా పడలేదు. అందరూ ఆయన్ని వెతుక్కుంటూ వచ్చిన వాళ్లే, సావిత్రి కోసం. వీళ్లలో 'ప్రియురాలు' సినిమా ప్రొడ్యూసరు దోనేపూడి కృష్ణమూర్తి. ఈయన వేషం గట్టిగా ఇప్పిస్తానంటేనే ముచ్చటగా మూడోసారి మద్రాసు రైలు ఎక్కింది. 1950లో ఆయన సిఫారసు చేయగా ఈ 'సంసారం'లోకి అడుగిడింది. ఆ 'సంసారం' జారిపోవడం మొదలు, ఈయన నేనిస్తానమ్మా 'ఛాన్స్' మద్రాసులోనే వుండండి, వెళ్లొద్దు అని అంటూనే వున్నాడు. ఈ నాటికి అంటే ఒక సంవత్సరానికి ఆయన సినిమా తీయడానికి నిశ్చయించుకున్నాడు. ఇంతకీ ఆయన అదృష్టవంతుడు, బిడియపడే సావిత్రి గట్టి సావిత్రి అయ్యేసరికి ఆయనకు సినిమా నిర్మించే అనుకూల వాతావరణం ఏర్పడింది. ఇటు సినిమాకి గట్టి సావిత్రి దొరికింది, మాట ఇచ్చినందుకు అది నిలబెట్టుకున్నవాడూ అయ్యాడు. 1951 ఫిబ్రవరి నుంచే 'రూపవాణి' సంచికలో ఈ సినిమా గురించి కాంపెయిన్ కూడా మొదలుపెట్టారు.

సావిత్రి తెరంగ్రేటం చేసింది ఈయన సినిమాతో కాకపోయినా, కనీసం రెండో సినిమా అయినా ఆయనది కాకపోయినా, ఎప్పుడు చెప్పినా ఆయన ద్వారానే సినిమాలకు పరిచయమయ్యాను అని చెప్పుకుంది. 1980లో చివరిసారిగా చెప్పుకున్నప్పుడు ఇదే మాట చెప్పింది.

దోనేపూడి కృష్ణమూర్తి అంటే సావిత్రికి కృతజ్ఞతా భావం అది. కాని వెంకట్రామయ్యచౌదరి మాత్రం మిగాతావారి దగ్గరనుంచి ఎంత పారితోషికం తీసుకున్నాడో, అంత డబ్బా దోనేపూడి కృష్ణమూర్తి దగ్గరనుంచి కూడా తీసుకున్నాడు.

1951 ద్వితీయార్థంలో సావిత్రి బుక్ అయిన సినిమాలు 'పల్లెటూరు', 'ఆదర్శం', ప్రియురాలు', 'శాంతి' ఇంకా 'సంక్రాంతి'.

ఇక సావిత్రి ధ్యాస అంతా నటన మీదే. షాట్ షాట్ కి తనను తాను సవరించుకునే పనే.

'పెళ్లి చేసి చూడు' విజయావారి సొంత సినిమా కాబట్టి,స్టూడియోలో బయటివారి సినిమాలకు ఇబ్బంది లేకుండా వాటికి ప్రాముఖ్యత ఇస్తూ, ఈ సినిమాని కాస్త మెల్లగా తీస్తున్నారు.

'శాంతి'లో కూడా సావిత్రిది మంచి పాత్రే. 'శాంతి'లో తన పాత్ర షూటింగ్ ఎప్పుడో అయిపోయింది. అన్నింటికంటే ముందు 'శాంతి' నిర్మాణమే అయ్యేటట్లు వుంది.

'సంక్రాంతి'లో ముగ్గురు అన్నదమ్ములలో చివరివాడయిన చంద్రశేఖర్ భార్యగా వేషం దొరికింది. అది చిన్నపాత్రే.

ఇక 'ఆదర్శం' సినిమాలో తీసుకున్నారే కాని ఇంకా పాత్ర ఏమిటో చెప్పలేదు.

1952 జనవరిలో చాముండి ఒక వార్తతో వచ్చింది. తాను ఒక ముఖ్య విషయమై మద్రాసు విడిచి వెళ్తుందని.

"చాముండి వెళ్లిపోతున్నావా? నన్ను ఈ నడిసముద్రంలో వదిలేసి వెళుతున్నావా? ఒక్క 'శాంతి' సినిమా తప్ప ఇంకో సినిమా రిలీజ్ అవుతుందనే నమ్మకం వుందా?"

"ఏంటి సావిత్రీ, వీళ్లంతా వేలకువేలు పోసి సినిమా తీసి విడుదల చెయ్యకుండా ఇంట్లో పెట్టుకోటానికి అనుకుంటున్నావా?"

"అలానే వుంది చూస్తుంటే. నువ్వూ చూస్తున్నావుగా. 'పెళ్లి చేసి చూడు' ఇంకా కాలేదు. 'పల్లెటూరు' కాలేదు, 'ప్రియురాలు' కాలేదు, 'సంక్రాంతి' కాలేదు, ఏది అయ్యింది? ఇదిగో ఇప్పటికి 'శాంతి' ఒక్కదాని నిర్మాణం పూర్తయింది."

"అన్ని షూటింగ్‌లు అవుతూనే వున్నాయి కదా? ఒకటి తర్వాత ఒకటి అన్నీ రిలీజ్ అవుతాయి."

"ఇవి అయ్యేసరికి నా పని అయిపోయేట్లు వుంది."

"అంత తొందరేంటి సావిత్రి నీకు? నటన మీద దృష్టి పెట్టుకో, నువ్వు రాటుదేలే కొద్దీ సినిమాలు వచ్చి పడతాయి."

"నువ్వు లేకుండా ఎలా వస్తాయి చామూ!" అడిగింది సావిత్రి.

ఈ ముద్దు పేరుకి చాముండి పులకించిపోయింది. బయటికి మాత్రం నవ్వింది.

"సావిత్రి ఎవరైనా ఎవరి పేరైనా ఎప్పుడు చిన్నది చేస్తారో తెలుసా?"

"తెలుసు. మరి నా మీద నీకు ప్రేమ లేదా?, నా పేరు చిన్నది చెయ్యలేదుగా నువ్వు"

చాముండి నవ్వి వూరుకుంది.

"అవునులే ప్రేమే వుంటే నన్ను ఈ నడి సముద్రంలో వదిలేసి వెళతావా?"

"నేను వెళ్లక తప్పట్లేదు సావిత్రి. ఈ సమస్య నేను పుట్టినప్పట్నుంచి వుంది. నాతోపాటే పెరిగింది. ఇప్పుడు తుంచకపోతే తెగదు. ఇంకా పెద్దదయి కూర్చుంటుంది."

"సరే అయితే మళ్లీ ఎప్పుడొస్తావ్?"

"చెప్పలేను సావిత్రి."

"రెండు వారాలు... మూడు వారాలు...? చాముండి మాట్లాడలేదు.

"నెలలా? ఎన్ని నెలలు పడుతుంది?"

"12 నెలల నుంచి 24 నెలల దాకా .... ఎన్ని నెలలన్నా పట్టొచ్చు."

"సంవత్సరాలా? అసలు వస్తావా చామూ?"

"నీకోసం.. నీ ఈ పిలుపు కోసం తప్పకుండా వస్తా. అసలు రాలేకపోతే ఎప్పుడో ఒక్కసారైనా నిన్ను చూట్టానికి వస్తా."

"నీ వాలకం చూస్తుంటే అసలు వచ్చేట్టు లేవు".

"నువ్వు నన్ను వదిలి వెళుతున్నావు అనే బాధ ఎట్లాగూ ఉంటుంది. కాని నా సినిమాల పరిస్థితి ఏంటీ చామూ. ఈ ఫీల్డ్‌లో నేనసలు ఉంటానా ?వూడిపోతానా? నాతోపాటు వచ్చిన వాళ్లు నాలాగా ఒకటి అర సినిమాల్లో చేసి వెనక్కి పోయిన వాళ్లని ఎంత మందిని చూడలేదు. నా పరిస్థితి ఏమిటి? కొంతమందికి బాగా అవకాశాలు వస్తున్నాయి అంటే వాళ్లకి ఎవరో ఒకరిద్దరి అండ వుంది. ఇప్పుడు దాకా నువ్వు వున్నావని ధైర్యంగా వున్నాను. నువ్వు వెళ్లిపోతే ఎలా?"

"నేను నీకేమి ఛాన్స్ ఇప్పించాను సావిత్రి? చెప్పు. ఏదైనా నావల్ల వచ్చిన పాత్ర వుందా నీకు? నీ ప్రతిభ మీద నువ్వు తెచ్చుకుందేగాని."

"లేదు చాము! ఏదో చేస్తావు నువ్వు. పోనీ ఛాన్సులు ఇవ్వలేదే అనుకుందాం, ఛాన్సులు పోకుండా ఆపింది నువ్వే కదా."

"నేను లేకపోయినా ఇక్కడ అందరికీ చెప్పి వెళతాను" అంది చాముండి.

"మనిషి వుంటే ఒకలాగ వుంటుంది. లేకపోతే ఒకలాగ వుంటుంది చామూ."

"సరే ఒకపని చేయి. నీకంత అనుమానం అయితే ఫలానా వాళ్లు ఫలానా సినిమా తీస్తున్నారు అని నాకు ఉత్తరం వెయ్. నేను ఇక్కడి వాళ్లకి మళ్లీ ఉత్తరం వేస్తా."

"ఉత్తరం ఎక్కడికి?"

"సిలోన్‌కి."

"నువ్వు వెళుతున్నది సిలోన్‌కా. అదేదో గుంటూరు అన్నట్లు చెప్పావే. నేను సిలోన్‌కి ఉత్తరం రాసి, అది నీకు చేరి, నువ్వు మళ్లీ రాసినది ఇక్కడకు చేరేసరికి ఆ సినిమా నిర్మాణం కాస్తా అయిపోతుంది."

ఇద్దరు నవ్వుకున్నారు.

"నీ నవ్వు కోసం ఒక సంవత్సరం ముందుగా వచ్చేస్తానులే"

"అప్పటికి గాని నేను ఏడుస్తూ ఉండను."

"నువ్వు ఎప్పుడూ ఏడవకు సావిత్రి, నేను తట్టుకోలేను."

"జాగ్రత్తగా వుండు. ఇక్కడ మగవాళ్లకి అస్సలు చనువు ఇవ్వకు. నిర్మాత రమ్మన్న టైమ్ కంటే ముందే రా సెట్స్‌కి. ఒక నిర్మాతకు ఇచ్చిన టైమ్ ఇంకొక నిర్మాతకు ఇవ్వకు. ముందుగా నువ్వే డేట్, టైమ్‌లు చెప్పకు. నీకా టైమ్‌లో ముందుగానే బుక్ అయివుంటే తప్ప. విజయ వాళ్లని మాత్రం వదలకు. వాళ్లు తీసే సినిమాలు అన్నీ తమిళంలోకి డబ్ చేస్తారు, లేదా వాళ్లే తీస్తారు. తమిళంలో కూడా ప్రయత్నాలు చేస్తూ ఉండు" అంటూ చెప్పుకొచ్చింది చాముండి.

తమిళ సినిమా అనగానే సావిత్రి కళ్లు మెరిశాయి.

"చామూ, నీకు తమిళ వాళ్లు అంతా బాగా తెలుసా?"

"ఊ. అట్లట్లా తెలుసు అందరూ.... చూస్తే గుర్తు పట్టేస్తాను."

"జెమిని స్టూడియోలో గణేష్ అనే అతను వుంటాడు తెలుసా నీకు?" వెంటనే అడిగింది.

"నువ్వు జెమినికి ఎప్పుడు వెళ్లావు?"

"భలే ప్రశ్న వేశావులే. స్టుడియోలకి తిరగడం తప్ప ఇంకేం పని వుంది నాకు? 'పాతాళభైరవి' పాటలో డాన్స్ తరువాత ఒక సంవత్సరం పాటు చేసిన డాన్స్ ఇదే కదా!"

"ఇప్పుడు అతనెందుకు గుర్తుకొచ్చాడు నీకు?" అడిగింది చాముండి.

"నువ్వు తమిళ సినిమా అన్నావుగా అందుకని గుర్తుకొచ్చాడు."

సావిత్రికి తెలియకుండానే బుగ్గలు ఎరుపెక్కుతున్నాయి. చాముండి చూపులు తీక్షణం అవుతున్నాయి.

"తమిళ సినిమా అనగానే అతడే గుర్తుకు రావడానికి అతనేమన్నా హీరోనా? ప్రొడ్యూసరా? డైరెక్టరా?"

సావిత్రి తలెత్తి చూసింది. చాముండి తీక్షణంగా చూస్తూనే వుంది. తప్పు చేసిన దానిలా చటుక్కున చూపులు వాల్చింది సావిత్రి.

"ఏంటి అలా చూస్తున్నావు? బాగుంటాడు కదా, అందుకని ఒకసారి గుర్తుకొచ్చాడు, అంతే".

"ఇప్పుడు దాకా గుర్తు పెట్టుకున్నది చాలు, ఇంక తుడిచెయ్. తమిళ సినిమా అంటే గుర్తుకు రావాల్సింది, తమిళ భాష నేర్చుకునేది ఎలా అని. ఇందాకే చెప్పాను, నీకు తెలియని మగవాళ్లతో చనువుగా వుండకని".

"సరే సరే. తప్పకుండా అలాగే వుంటాను, ఇంకేమన్నా మాట్లాడు."

"రేపు ఏమైనా తెలుస్తుందేమో నేను ఎప్పుడు వెళ్లేది.రేపూ ఇక్కడే కలుసుకుందాం" అని చాముండి వెళ్లిపోయింది. "రేపు ఇంకో ముఖ్య విషయం చెప్పాలి నీతో" అని వెళుతూ వెళుతూ అంది.

1952 ఫిబ్రవరిలో 'పెళ్లి చేసి చూడు' విడుదలయ్యింది. బాగా ఆడుతోంది. ప్రజలకు కూడా తెలిసింది సావిత్రి అనే బూరెబుగ్గల,చేపకళ్ల సుందరి ఒకతి వుందని. జనమేకాదు, సినిమా తీయాలనుకున్నవాళ్లు, స్టూడియోల్లో వుండి కూడా సావిత్రి సౌందర్యాన్ని గమనించని వాళ్ల నాలుక మీద కూడ సావిత్రి పేరు నానింది.

'పెళ్లి చేసి చూడు'కి ముందే 'శాంతి' విడుదలయ్యింది. దాంట్లో చంద్రకుమారి తర్వాత ముఖ్య పాత్ర సావిత్రిది. 'పెళ్లి చేసి చూడు' చూసిన తర్వాత 'ఎవరా పాలుగారే బుగ్గల చిన్నది' అనుకుంటూ, 'శాంతి'లో కూడా ఉన్నదని గుర్తెరిగి మళ్లీ 'శాంతి'ని చూడటానికి వెళ్లినవాళ్లు లేకపోలేదు.

'పెళ్లి చేసి చూడు' లో సావిత్రికి వస్తున్న గుర్తింపును చూసి చివరి నిమిషంలో పీపుల్స్ ఆర్టు ప్రొడక్షన్ వాళ్లు అనగా 'పల్లెటూరు'ని నిర్మిస్తున్న వాళ్లు ఒక ముఖ్యమైన మార్పు చేయ

నిశ్చయించుకున్నారు. టైటిల్ కార్డుల్లో లేడి ఆర్టిస్టుల దగ్గర అంతకు ముందు, మొదట ఉన్న 'టి.జి. కమలాదేవి' పేరు తీసి 'సావిత్రి' పేరు వేసుకున్నారు.

మొదటిసారిగా 'పల్లెటూరు' సినిమాలో మొదటి పేరుగా వచ్చింది సావిత్రి పేరు. సావిత్రి ఆ సినిమాని పదిసార్లు సినిమా హాల్‌లో చూసుకుంది. పదిసార్లు వెళ్లింది, తన పేరు మొదటిన చూసుకోవటానికే. లీలకి ఉత్తరం వ్రాసి అది చూడటం మర్చిపోవద్దంది.

'సంక్రాంతి' షూటింగ్‌లో ఉన్నప్పుడు చాముండి వచ్చింది. షాట్‌గ్యాప్‌లో సావిత్రి వచ్చింది. "ఏదో ముఖ్య విషయం అన్నావుగా చెప్పు" అంది.

"ఇది ఇప్పుడు చెప్పేది కాదు. చాలా ముఖ్యమైనది. షూటింగ్ అంతా అయిన తర్వాత చెపుతాను" అంది. చాముండి చేతిలో ఒక పుస్తకం వుంది. ఇంకా ఒక ఫైలు కూడా వుంది. "ఊఁ.. నాకు తెలుసు మళ్లీ ఏదో ఒక సినిమా ఛాన్స్ పట్టుకొచ్చావు నాకు" అంది సావిత్రి.

అవునన్నట్లు నవ్వింది చాముండి.

చాలా సంతోషపడింది సావిత్రి.

'అయ్యో! ఇదేంటీ ఏడుపు సీను లాగావుందే? అనవసరంగా ఇప్పుడు సావిత్రి 'మూడ్' మార్చానే' అనుకుంది చాముండి.

సావిత్రి అలా సెట్ లోకి వెళ్లిందో లేదో ముఖంలో మార్పు వచ్చేసింది. డైలాగ్ పేపరు ఒకొక్కసారి పై నుంచి కిందికి పరికించేసేటప్పటికి, ఏడుపు కళ్లలో కనిపించింది.

'షాట్ రెడీ' అనగానే అభినయం చేసింది.


'బంగారు తల్లి' అనుకుంది చాముండి.

షూటింగ్ అవ్వగానే నేరుగా చాముండి దగ్గరకు వచ్చింది సావిత్రి. "చెప్పు చామూ ఏంటి?"

"ఇది చక్రపాణిగారు తర్జుమా చేసిన దేవదాసు నవల. ఇది బాగా చదువు. ఇది ఒకసారి చదివితే నీకు అర్థం కాదు, సరిగ్గా నాలుగుసార్లు చదువు. డి.యల్.గారు దేవదాసు తీద్దామనుకుంటున్నారు. పాటలు కూడా రాయించారు. రికార్డింగ్ కూడా అయిపోయింది. చదువుకో అద్భుతమైన పాటలు. ఈ కథకి, ఈ పాటలకి నన్ను పెట్టి తీసినా బ్రహ్మాండంగా ఆడుతుంది ఈ సినిమా."

"అదేంటి జానకిని అనుకుంటున్నారు కదా ఈ సినిమాకు. ఆ అమ్మాయిని ఏం చేశావ్?"

"నేనేమి చెయ్యలేదు. ఈ సినిమా సంగీత దర్శకులు సుబ్బరామన్ హఠాత్తుగా చనిపోయే




11-7-1951, 'ఆంధ్రపత్రిక' నుంచి







1952 ఫిబ్రవరి వినోదిని,రూపవాణి, పత్రికల నుంచి



1952 ఏప్రియల్ 'వినోదిని' పత్రిక నుంచి



1952 సెప్టెంబర్ 'రూపవాణి' పత్రిక నుంచి



1952 జనవరి 'రూపవాణి' పత్రిక నుంచి 'శాంతి'లో చంద్రకుమారి,సావిత్రి



'పల్లెటూరు' షూటింగ్ సమయంలో



**1952** జనవరి 'వాహిని' స్టూడియోలో జరిగిన సంక్రాంతి కార్నివల్‌లో
విచిత్ర వేషధారణలో ఎల్.వి. ప్రసాద్, సావిత్రి, జోగారావు






చూపుల సుందరాంగి
'ఆదర్శంలో'లో సావిత్రి



'ఆదర్శం'లో రామశర్మ, సావిత్రి



అబ్బ! ఎంత కొంటెగా నవ్వుతోందామె!
'ఆదర్శం' లో సావిత్రి

**1952 జూన్, జులై, సెప్టెంబర్ 'రూపవాణి' పత్రికల నుంచి**




1952 ఆగస్టు 'భారతి' పత్రిక నుంచి




1952 జులై 'రూపవాణి' పత్రిక నుంచి



1952 జనవరి 'రూపవాణి' పత్రిక నుంచి 'శాంతి'లో సావిత్రి

సరికి ఈ సినిమాని ఆపి 'శాంతి' తీశారు. ఈ లోపల 'శాంతి' తీసేసరికి జానకి బిజీ అయిపోయింది. పైగా నిన్ను 'శాంతి'లో చూశారు, ఇప్పుడు ఫైనల్‌గా నిన్ను అనుకున్నారు."

"చూశావా చామూ, నువ్వు ఉంటేనే కదా నాకు సినిమాలు వస్తుంది. ఇలా వెన్నంటి ‌.కరు లేకపోతే ఎలా?"

"సరే నా ప్రయాణం రేపే. నీకు మాత్రం ఈ 'దేవదాసు' గ్యారంటీ. ఈ 'దేవదాసు' ౨డుదలయిన తర్వాత నేను నీకు లేకపోయినా సినిమాలు వస్తాయి. ఈ రోజు నేను వెళ్లేదాకా ాముందు నుంచి కదలకు" అంది చాముండి.

"ఓ పందెం వేసుకుందాం, నేనే వెళ్తానన్నాననుకో నేను ఓడిపోయినట్లు, నువ్వు వెళ్తావన్నావనుకో నువ్వు ఓడిపోయినట్లు, నువ్వు ఓడిపోయావనుకో నేను నిన్ను సిలోన్ వెళ్లనివ్వను."

"నువ్వు చిన్నపిల్ల కంటే కూడా అన్యాయం సావిత్రి. చంటి పిల్లవు. నేను వెళ్తున్నానని బాధ లేకుండా జోకులు వేస్తున్నావ్."

"ఛ! అంతమాట అనకు చామూ. నాకు నువ్వు వెళ్తుంటే ఒక్క బాధే కాదు గుండె దడ కూడా."

ఇద్దరు చాలాసేపు స్టూడియో వెనక తోటలో కూర్చున్నారు. సూర్యుడు కొండల వెనక్కి వెళ్లబోతున్నాడు.

ఇద్దరు పెద్దగా మాట్లాడిందేమీ లేదు. సావిత్రే అప్పుడప్పుడు మాట్లాడింది. చాముండి బాధగా చూస్తూ ఉండిపోయింది.

చాముండి చెప్పిన ఒక్కమాట "నేను వస్తే మూడు నెలలలోపే వస్తాను. మూడు నెలలు దాటాయి అంటే ఎప్పుడు వస్తానో చెప్పలేను."

పూర్తిగా చీకటి పడేలోపే చాముండి లేచింది.

"నువ్వు ఓడిపోయావు చామూ" అంది సావిత్రి.

"ఇంతటి విలువైన దాన్ని వదిలి వెళ్తున్నందుకు నిజంగానే నేను ఓడినదాన్ని" అంది చాముండి.

"నన్ను ఎందుకంత ఆకాశానికి ఎత్తేస్తావు" అడిగింది సావిత్రి.

"నువ్వు అక్కడనుంచి వచ్చిన దానివే" సమాధానం చెప్పింది చాముండి.

"ఇక వెళ్లిరానా?"

చేతిలో చేతులు వేసుకున్నారు. ఒక్కసారిగా ఒకరి కౌగిలిలో ఒకళ్లని బంధించుకున్నారు. ముద్దులు పెట్టుకున్నారు. సావిత్రికి ఆ కౌగిలిలో ఒక భద్రతా భావం అనిపించింది. చాముండిని వదల బుద్ధి కాలేదు.

★★★

నరసూ స్టూడియోలో 'ప్రియురాలు' ముహూర్తపు పూజ కోసమని వచ్చింది సావిత్రి. దోనేపూడి కృష్ణమూర్తి ఈ సినిమాలో నీకు కచ్చితంగా పాత్ర వుంటుంది అన్నారే కాని ఏ పాత్రో ఇంకా చెప్పలేదు. అసలు ఇస్తారో లేదోనని సావిత్రి భయాలు సావిత్రికి వున్నాయి.

నరసూలో చూసేసరికి జగ్గయ్య కనిపించాడు "బావగారూ మీరేమిటి ఇక్కడ" అని అడిగింది.

"అమ్మ దొంగా! ఇప్పుడు దొరికావు, ఎక్కడ ఏ స్టూడియోలో కనిపిస్తావా అని చూస్తున్నాను. నీ 'పాతాళభైరవి' డాన్స్ చూశానులే."

"సరే మా సినిమా సెట్ల మీదకి వచ్చారే, ఇక్కడ నేనేమీ డాన్స్ చేయటం లేదే మీరు చూట్టానికి."

"పోనీ నేను చేస్తున్నాను. నువ్వు చూడు. ఈ సినిమాకి హీరో మనమే" అన్నాడు జగ్గయ్య.

"నేను రెండు సంవత్సరాలనుంచి పడికొట్టుకుంటున్నా ఇక్కడ. నాకే ఇంకా వేషం వుందో లేదో తెలియదు. మీరు తెనాలి నుంచి నేరుగా ఇక్కడకు వచ్చినట్లున్నారు, అప్పుడే మీకు వేషం, అందులోనూ హీరోగా.... ఇదేమన్నా మీ నాటకాల ట్రూప్ అనుకున్నారా?" అంది సావిత్రి.

"కరెక్టుగా చెప్పావు, నా ట్రూపే, త్రిపురనేని గోపిచంద్ మనవాడే, దోనేపూడి కృష్ణమూర్తి గారు కూడా మనవాళ్లే, నీకు ఈ సినిమాలో పాత్ర కావాలా, ఈ సినిమా నిండా మీ ఆడవాళ్ల పాత్రలే ఎక్కువ."

"అవును బావగారు, ఎలా అయినా ఓ పాత్ర ఇప్పించరూ" అని జగ్గయ్య చేతులు పట్టుకుంది.

"ఆగు అయితే, ఇప్పుడే వస్తాను" అని జగ్గయ్య ఆఫీసురూమ్‌కి వెళ్లాడు. ఒక పది నిముషాల్లోనే బయటికి వచ్చాడు.

సావిత్రి ముందు నిలబడి, నడుము మీద రెండు చేతులు వేసుకొని, "అమ్మా.. కంతిరి పిల్లా.. నన్ను ఇంత ఆటపట్టిస్తావా? నీకు ముందుగానే రోల్ ఉందని చెప్పలేదే?"

"హమ్మయ్య" మనసులో అనుకొంది సావిత్రి.

"నాకు నిజంగా తెలియదు బావగారు, నేను వున్నాననీ.. ఇదుగో ఇప్పుడే తెలుసుకోవటానికి వచ్చాను, మీరు ఎదురయ్యారు."

'నన్ను ఫూల్‌ని చేశావోయ్!"

"క్షమించండి బావగారు, నిజంగా తెలియదు నాకు."

"సరేలే మరదలు పిల్లవని వదిలేస్తున్నాను."

"బావగారూ మీరు ఈ చిత్రంలో బాగా నటించి హిట్ చేసి నాకు కాస్త ఈ ఫీల్డ్‌లో చోటివ్వండి".

"నీకా తల్లీ, సగం దూరేశావు. ఇంకో అంగవేస్తే పూర్తిగా దూరిన దానివైపోతావు. నేనే తాడు బొంగరం లేనివాడిని, ఎంబ్రియో స్టేజ్‌లో వున్నవాడిని" అన్నాడు జగ్గయ్య.

★★★

సావిత్రి 'దేవదాసు' చదవటం మొదలు పెట్టింది.

"ఈ ఏడుపు పాత్ర ఎందుకు నీకు. ఈ ట్రాజెడీ కథ ఎందుకు? గ్లామర్ పాత్రలు చేసుకోక" వెంకట్రామయ్యచౌదరి అరుపులు.

"వాళ్లు శుభమా అని నన్ను వెతుక్కుంటూ వచ్చారు. పైగా ఎవరూ లేకుండా ఈ సినిమాలో ఒకే ఒక్క హీరోయిన్ నేనే అయితే వద్దాంటావేమిటి పెదనానా?" సావిత్రి అరిచినట్లుగానే ఉంది వెంకట్రామయ్యచౌదరికి.

'దీనికి నా ప్రయత్నం లేకుండానే సినిమాలు వచ్చేస్తున్నాయ్. పైగా ఎంచుకోవటంలోనన్నా నా సాయం అడగట్లేదు' అని సాలోచనలో పడ్డాడు వెంకట్రామయ్యచౌదరి.

1952లో మొదటగా 'శాంతి' విడుదలయ్యింది. ఆ తర్వాత 'పెళ్లి చేసి చూడు'. ఇవి ఆడుతూ వుండగానే 'పల్లెటూరు' విడుదలయ్యింది.

ఒక్క సంవత్సరంలో ఎంత మార్పు. గత జనవరిలో ఏమీలేదు. అసలు తనను పలకరించిన వారే లేరు.ఇప్పుడో ఏకంగా మూడు సినిమాలు విడుదలయ్యాయి. ఈ సంవత్సరంలోపే విడుదల కావటానికి ఇంకా మూడు సినిమాలు తయారవుతున్నాయి అవి 'సంక్రాంతి','ఆదర్శం' 'ప్రియురాలు'.

1952 మార్చిలో 'దేవదాసు' మొదటిసారిగా చదవటం పూర్తిచేసింది. మళ్లీ చదవాలనిపించింది. ఈసారి భావుకత అర్థం చేసుకోవటానికి, ఒక్కొక్క అంశాన్ని మళ్లీ మళ్లీ

చదివింది. దేవదాసుకు, పార్వతికి వాళ్ల మధ్య ప్రేమ ఉందని తెలియదు. వాళ్లకి చిన్నప్పట్నుంచీ ఒకరి మీద ఒకరికి అనురాగం ఏర్పడింది. యుక్తవయసులో ప్రేమించటం అనేది ఆకర్షణ మాత్రమే. సంఘానికి, కుటుంబానికి కట్టుబడి పార్వతి పెళ్లి చేసుకుంటుంది. కాని తనలో దేవదాసు మీద ఉన్న అనురాగం మాత్రం చావదు. దేవదాసూ అంతే. పార్వతి దూరం అయిన తర్వాత గాని తాను పోగొట్టుకున్నది ఏమిటో తెలిసిరాలేదు. ఎవరూ దారి చూపేవారు లేక, ఏమీ చెయ్యటానికి లేక పార్వతిని మరువలేక, దరిచేరలేక, అన్నింటినీ మరిపించే మత్తు దరిన చేరతాడు. ఇక్కడ పార్వతిని కట్టిపడేసింది వారి మధ్య అనురాగం, పార్వతికి పెళ్లైపోయిందిగదా అని దేవదాసు పార్వతిని మరువలేదు. చివరివరకూ కూడా ఆమె భావాలకి అనుగుణంగానే నడుచుకున్నాడు. దేవదాసుకి తోడుగా చంద్రముఖి పార్వతి దగ్గరకు వస్తానంటే పార్వతి మరోలా భావిస్తుందని వారిస్తాడు. కడదాకా పార్వతి అంటే అనురాగం. మనసా వాచా పార్వతికే అంకితమయ్యాడు.

ఇలాంటి అనురాగం గురించి తెలుసుకొని సావిత్రి ఎంతో ఆలోచించింది, రోజుల తరబడి ఆలోచించింది.

'ఇప్పటి సినిమా ప్రేమలో కొట్టుకుపోతున్నారు జనం. లైటు వేసి వెతికినా అలాంటి అనురాగం దొరకదే' అనుకుంది.


మొత్తం మీద ఈరోజుకి 'దేవదాసు' నవలని ఆరో సారి చదవటం పూర్తిచేసింది. ఇంకా రెండు రోజులు మధనపడ్డ తర్వాత, 'ఎవరినైనా ఇష్టపడితే ఇలాగే ఇష్టపడాలి కడదాకా. మధ్యలో వచ్చే పరిస్థితులవల్ల ప్రేమ, అనురాగం తగ్గకూడదు. అవతల వాళ్లు మళ్లీ మన దారిలోకి వస్తారు' అని సంకల్పించుకుంది.

ఇంకొక్క రోజు 'దేవదాసు' గురించి ఆలోచించింది సావిత్రి. ఇక గుండె లోతుల్లోంచి ఇలా తీర్మానించుకుంది..... 'నేనూ ప్రేమిస్తాను, దేవదాసులానే ప్రేమిస్తాను. భగవంతుడా నా సినిమా జీవితం మీద ఒట్టు, నాకే గనుక ఈ 'దేవదాసు' సినిమా బాగా ఆడి పేరు తెచ్చి మరిన్ని సినిమాలు వస్తే, నేను దేవదాసులాగా ప్రేమకు అంకితమై పోతాను.'

మళ్లీ అనుకుంది'సినిమాల మీద ఒట్టు ఎందుకు, సినిమాలు వచ్చినా, రాకపోయినా నేను దేవదాసులా ప్రేమిస్తాను.'

'దేవదాసు' షూటింగ్ మెదలవ్వకముందే సావిత్రి 'దేవదాసు'లో మునిగి పోయింది.

సుభద్రమ్మ గమనిస్తూనే వుంది. సావిత్రిలో చాలా మార్పు కనిపిస్తుంది. ఎప్పుడూ చలాకీగా తిరిగే సావిత్రి తనలో తాను వుండి పోతుంది. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడటం లేదు. చుట్టూరా మనుషులు వుంటే 'దేవదాసు' పుస్తకం తీసుకుని కూర్చునేది. అది చూసి ఎవరూ



ఉగాది అభివందనములు

భారతలక్ష్మి ప్రొడక్షన్సు

విశాలాంధ్ర ప్రజానీకానికి ప్రసాదించే అభ్యుదయ

సాంఘిక చిత్రం

"ప్రియురాలు"

(తెలుగు)

★

కథ, సంభాషణలు, దర్శకత్వం : గోపీచంద్

కెమెరా : బి. సుబ్బారావు బి. ఎ.

ప్రొడ్యూసర్ : డి. కృష్ణమూర్తి

గోకులకృష్ణా ఫిలింసు రిలీజు


★

వివరములకు :

భారతలక్ష్మి ప్రొడక్షన్సు, 7. గ్రిఫిత్ రోడ్, మద్రాసు 17

Rupavani April '51

**1952 ఫిబ్రవరి,ఏప్రియల్ రూపవాణి పత్రికల నుంచి**











తనని పలకరించకూడదని ఈ పని చేస్తుంది. నిద్రరాక పోయినా, నిద్రపోయే సమయం కాకపోయినా చీకటి పడగానే నిండుగా దుప్పటి కప్పుకొని పడుకునేది. లోపల నిద్రపోవటం లేదు అని కచ్చితంగా తెలుసు సుభద్రమ్మకి.

'ఎంత పాత్రలో లీనమైతే మాత్రం ఇలానా? లాభం లేదు' అనుకుంది సుభద్రమ్మ. ఇలా అనుకుంటూ వుండగా 'ఆంధ్ర పత్రిక'లో ఒక అమ్మాయి ఫోటోను చూసి, ఆ ఫోటోను మళ్లీ మళ్లీ చూసింది. ఎక్కడో చూసిన జ్ఞాపకం. 'ఆ గుర్తొచ్చింది. ఈ అమ్మాయి ఆ అమ్మాయే' అనుకుంది. సావిత్రి కోసం చూసింది. దుప్పట్లో ముసుగు తన్నివుంది. అప్పుడు పగటి పూట, ఆ రోజు ఆగష్టు 15, 1952. స్వాతంత్ర్యదినోత్సవం కావటం వల్ల ఆ రోజు షూటింగ్‌లు అన్నింటికి సెలవు.

ఈ నెపం మీదనైనా సావిత్రిని కాస్త ఈ లోకంలోకి తీసుకొద్దామని సావిత్రిని పిలవటం మొదలు పెట్టింది.

"అమ్మాయ్ ఇటు చూడు, అమ్మాయ్ సావిత్రి, చూడు. ఈ అమ్మాయి ఆ దుగ్గిరాల ఽమ్మాయి కదూ. ఈ అమ్మాయి కూడా సినిమాల్లో వచ్చేసినట్లుందే" అంది.

సావిత్రి లేచొచ్చింది. దుగ్గిరాల అంటే నాటకాల రోజులు. 'అప్పటి అమ్మాయ్ అంటే )వరూ' అనే కుతూహలంతో వచ్చింది.

ఆ ఫోటోని చూసింది. అవును ఆ అమ్మాయే అప్పుడు స్నానాలకి వాళ్ల ఇంటికి తీసుకు వెళ్లి, వాళ్ల ఊళ్లో వున్న అన్ని రోజులు నాటకాల వాళ్లతోనే వుంది. జమున అని వుంది పేరు.

"అవునమ్మా ఆ అమ్మాయే అయి వుంటుంది. స్టూడియో వాళ్లను అడిగి అడ్రసు కనుక్కొని, తీసుకురమ్మని కారు ఇచ్చి పంపిస్తాను " అంది సావిత్రి.

'హమ్మయ్య ఈ లోకానికి వచ్చింది' అనుకుంది సుభద్రమ్మ.

సాయంత్రం అయ్యేసరికి ఇంటి చుట్టూ వున్న చిన్నపిల్లలంతా సావిత్రి చుట్టూ చేరారు. మువ్వన్నెల పేపరు జెండా ఒకటి టేబుల్ మీద పెట్టి, అందరి చేత సాల్యూట్ కొట్టించి అందరికీ మిఠాయి బూంది పంచుతుండగా, జమున వచ్చింది. కుశల ప్రశ్నలు అయిపోయిం తర్వాత,

"మనము అప్పుడు అనుకోలేదు కదూ, ఇలా సినిమా వారమవుతామని" అన్నది సావిత్రి.

"అవునండి" అంది జమున.

"అండీ ఏంటి 'అక్కా' అని పిలువు".

చాలా సంతోషించింది జమున, "అలాగే అక్కా" అంది.

"అందరూ మిమ్మల్ని ఎంత మెచ్చుకుంటున్నారో తెలుసా, మీ అందానికి, అంతా పాదాక్రాంతులై పోతున్నారు. ఇప్పటిదాకా వినటమేగాని, వాళ్లు అనుకునేది ఎంత నిజమో ఇప్పుడే చూస్తున్నాను. లంగావోణీలో మీరు ఎంత ముద్దొస్తున్నారో. నాకంటే ఎంతో చిన్నగా అనిపిస్తున్నారు కాని పెద్ద పనులు చేస్తున్నారు."

ఈ చివరి మాటకి మనస్సు చివుక్కు మంది సావిత్రికి. ప్రస్తుతానికి అందరూ మెచ్చుకోవటమే మిగిలింది. 'దేవదాసు' తప్ప పెద్దపాత్రతో ఇంకే సినిమా లేదు. అదీ చాముండి వలన అని సావిత్రి నమ్మకం. ఇంకా 'ఆదర్శం', 'ప్రియురాలు', 'సంక్రాంతి' విడుదల కావాల్సి వున్నాయి.

చాముండి వస్తానన్న మూడు నెలలు ఎప్పుడో అయిపోయాయి. ఉత్తరం కూడా లేదు. మోడరన్ థియేటర్సు సుందరంని ఒకసారి అడిగితే "చాలా కష్టం అమ్మా ఇప్పుడల్లా రావటం, ఒక సంవత్సరం కచ్చితంగా పడుతుందమ్మా" అన్నారు.

నీరుకారిపోయింది సావిత్రి. తన పరిస్థితి ఏంటి అనుకుంది.

మొదట్లో అందరికీ వుండే భయమే ఇది. కానీ సావిత్రి పరిస్థితి వేరు. ఇంట్లో సినిమాలు లేకపోతే పెదనాన్న వైపు నుంచి వచ్చే వత్తిడి తట్టుకోలేనిది.

సరే అన్నీ మానేసి వెళదామా అంటే, వెళ్లి అక్కడేం చెయ్యాలి పొట్టకోసం.

అందుకే చాముండి తరువాత ఎవరూ లేరన్న భావన చాలా క్రుంగదీసింది సావిత్రిని.

★★★

1952 సెప్టెంబరులో 'దేవదాసు' మొదటి షెడ్యూలు అయ్యింది. 'దేవదాసు' షూటింగ్‌లో ఒకరోజు, సావిత్రి దుఃఖంతో తలుపుకేసి తల బాదుకునే సన్నివేశం చిత్రీకరణ జరుగుతోంది. పార్వతి దుఃఖంలో, సావిత్రి ఎంతగా లీనమయిందంటే దర్శకుడు 'కట్ ' అన్నాసరే సావిత్రి అలాగే తల తలుపుకేసి కొట్టుకుంటూనే వుంది. ఈ దృశ్యాన్ని ముందు తెలుగులో తీసి, తర్వాత తమిళంలో తీశారు. రెండో సారి కూడా సావిత్రి తనను తాను మర్చిపోయి, దుఃఖం పట్టలేక షాట్ అయిపోయినా కూడా తల బాదుకుంటూనే వుంది. చాలా సేపటివరకు కూడాను మామూలు మనిషి కాలేకపోయింది. దర్శకులు వేదాంతం రాఘవయ్య, నాగేశ్వరరావు సావిత్రిని ఒకచోట కూర్చోపెట్టి విశ్రాంతి తీసుకోమన్నారు. సావిత్రి పార్వతి పాత్రను, పార్వతి బాధను,

ఎంత బాగా అర్థం చేసుకుందో, పార్వతి పాత్రలో సావిత్రి ఎలా పరకాయ ప్రవేశం చేసిందో చూసి, పదహారేళ్ల చిన్న వయసులో సావిత్రికున్న ప్రతిభను చూసి, ఆశ్చర్యపోయారు అందరూ.

'దేవదాసు' షూటింగ్ జరుగుతున్న సమయంలోనే, ఒక తమిళ సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అది 'మనంపోల్ మాంగల్యమ్.'

ఒకరోజు "అమ్మాయ్ ఆ అరవ సినిమా డబ్బులు ఇంకా ఇవ్వలేదే ప్రొడ్యూసరు" అని అడిగాడు వెంకట్రామయ్యచౌదరి.

"అవి నా దగ్గరే వున్నాయి పెదనానా."

"ఏది ఇలా తీసుకురా, చాలా ఖర్చులున్నాయి."

"ఎంత తీసుకురాను?"

"మొత్తం ఇవ్వు కారు కొనాలి".

"ఒకటి వుందిగా?"

"అది ఇంట్లో వాళ్లకి, నీకు వదిలేస్తాను. నేను ప్లీమోత్ కొనుక్కుంటాను" అన్నాడు వెంకట్రామయ్యచౌదరి.

"మీకు ఎందుకు?" అని మాత్రం అడగలేక పోయింది సావిత్రి. డబ్బులు తీసుకొచ్చి ఇచ్చింది.

లెక్క వేసుకున్నాడు వెంకట్రామయ్యచౌదరి.

అతనికి మూడు వంతులే వచ్చింది.

"ఈ డబ్బుతో కారు రాదు కద పెదనానా?"

"అప్పు చేయాల్సిందేనమ్మా" అంటూ ప్యాంటు జేబులో డబ్బు కుక్కుకుంటూ వెళ్లాడు.

'సావిత్రి మారుతోంది. నాదగ్గరకు రావాల్సిన డబ్బులు ఆగి పోతున్నాయి. ఇది దీని ధైర్యం కాదు. వెనుక ఎవరో చెప్తున్నారు. ఎవరూ? లాభం లేదు. ప్రొడ్యూసరు ఇచ్చిన దాంట్లో మూడు వంతులు నా చేతిలోకి వచ్చింది. ఇంకొన్ని రోజులు ఆగితే ఒక్క వంతు నా చిల్లర ఖర్చులుకి ఇచ్చి మూడు వంతులు అట్టిపెట్టుకుంటుంది' ఆలోచనలో పడ్డాడు వెంకట్రామయ్యచౌదరి.

ఈ విషయాన్ని చాలా ఆలోచించిన పిదప ఒక ఉపాయం తట్టింది.

ఒకరోజు ప్రొద్దున సావిత్రి లేచేసరికి బాగా పొద్దెక్కింది. ముందు గదిలో చాలామంది మాటలు వినిపిస్తున్నాయి. 'ఏంటా హడావుడి?' అని వెళ్లి చూస్తే తన అక్క మారుతికి మేకప్ వేస్తున్నారు.

సుభద్రమ్మ పరుగున వచ్చి సావిత్రికి చెప్పింది. "అమ్మాయ్ నీకు చెప్పే టైమ్ లేకపోయింది, మీ అక్కను కూడా సినిమాలో చెర్పించాలని మీ పెదనాన్న అనుకుంటున్నారే."

"మంచిదమ్మా.... అయితే నాకు పోటీ అన్నమాట" అంది సావిత్రి.

ఈ ప్రయత్నాలు ఎందుకో తెలుస్తూనే ఉన్నాయి సావిత్రికి. అక్క మేకప్ అవసరం లేనంత తెల్లగా వున్నా ఎందుకో సినిమాల్లో రాణించలేదనిపించింది. తన పేరు చెప్పుకొని కొన్ని ప్రయత్నాలు చేసినా అవేమి ఫలించలేదు. వెంకట్రామయ్యచౌదరి చాలా నిరుత్సాహపడ్డాడు.

1953 కూడా వచ్చింది. 1953 ఏప్రియల్లో 'దేవదాసు' షూటింగ్ అయిపోయింది. 'దేవదాసు' ప్రీవ్యూకి ఒకరోజు ఎన్నుకున్నారు. దానికి సినిమా ప్రముఖులంతా వచ్చారు. సావిత్రి సకుటుంబంగా వచ్చింది.

ఆ చిత్రాన్ని చూసి అందరూ కదిలిపోయారు. వెంకట్రామయ్యచౌదరికి కూడా కాసేపు మాటలు రాలేదు. అందరూ సావిత్రిని అభినందించటానికి తన్నుకున్నంత పనిచేశారు. సావిత్రికి ఎంతో టాలెంటు వుంది అని చెప్పిన చిత్రం అది. తెలుగు హీరోయిన్లు ఎవరూ అంటే సావిత్రితో చెప్పటం మొదలు అవ్వటానికి ఇది ఆరంభం.

అందరూ అభినందించి వెళుతున్నారు. కాని సావిత్రి చూపులు మాత్రం దూరంగా వున్న గణేష్ వైపు అప్పుడప్పుడూ వెళ్తున్నాయి. అతను కనిపించకపోతే వెతుక్కుంటున్నాయి. వెంకట్రామయ్యచౌదరి ఈ విషయాన్ని స్పష్టంగా గమనించాడు. 1953, జూన్ 26 'దేవదాసు' విడుదలయింది. ఆ సినిమాని గొప్ప కళాఖండంగా తీర్చిదిద్దినందుకు పాటల రచయిత దగ్గరనుండి అందరికీ పేరు వచ్చింది. మొదట్లో ముద్దులొలికే చలాకీ పడుచు లాగా కనిపించిన సావిత్రి ఆ తర్వాత పూర్తిగా బరువైన సీన్లు, ఏడుపు సీన్లు చేసిన సావిత్రి ఎక్కడా మించకుండా మెలోడ్రామా అనిపించకుండా సహజంగా చేసింది అనుకున్నారు.

1953 'దేవదాసు' విడుదలైంది మొదలు చాలా అవకాశాలు వచ్చాయి.

మళ్లీ విజయ ప్రొడక్షన్స్ వారి 'చంద్రహారం' అనే సినిమాకు బుక్ చేసుకుంది.

1953లోనే సావిత్రి హిందీ చిత్ర పరిశ్రమకు కూడా పరిచయమయ్యింది. యస్.యస్.వాసన్ అనే తమిళ దర్శక-నిర్మాత 'బాలనాగమ్మ' సినిమాని హిందీలో

తెయిదిలచుకున్నారు. ఈ సినిమాలో సావిత్రికి 'సంగు' పాత్రనిచ్చారు. సావిత్రికి హిందీ డైలాగులు వేరొకరు డబ్బింగ్ చెప్పారు. ఈ సినిమా పేరు 'బహుత్ దిన్ హుయే' దీనిలో హిందీ నటి మధుబాల ముఖ్యపాత్రధారి.

1954లో 'అర్ధాంగి' షూటింగ్‌లో ఒక సీన్‌లో బంగారు నగలతో సావిత్రిని అలంకరించాలి. మొదట గిల్ట్ నగలతో అలంకరించారు. ఆ మేలిమి బంగారం మీద గిల్ట్ నగలు వెలవెల పోయాయి.

"డైరెక్టరు గారూ, లాభం లేదు. నా కోడలి మీద మీ గిల్ట్ నగలు నిలవలేవు. నా నగలు తీసుకొస్తాను" అంది శాంతకుమారి, భర్త, ఆ చిత్ర దర్శకుడు కూడా అయిన పుల్లయ్యతో.

"అవును. అమ్మాయి మీద అసలు ఆనలేదు ఇవి, వెళ్లి తీసుకురా" అన్నారు పుల్లయ్య.

శాంతకుమారి వెళ్లి తన బంగారు ఆభరణాలన్నీ తెచ్చింది. సావిత్రికి అలంకరిస్తుండగా...

"అత్తయ్యా, నేను వీటిలో ఒక్క నగనైనా కొనుక్కోగలనా?" అని అడిగింది సావిత్రి అమాయకంగా.


"ఒక్కటేమిటే వీటికి పదింతలు నగలు కొనగలవు నువ్వు. భవిష్యత్తు అంతా నీదే కదే. నీలాంటి అందగత్తెగాని, నటిగాని ఉందా ఇప్పుడు" అంది శాంతకుమారి.

ఆమె మాటలు అక్షరసత్యాలు అయ్యాయి. ముందు ముందు సావిత్రి ఇంట్లో ఒక పనివాడు తోటపని చేసుకున్నట్లో, ఇంకో పనివాడు ఇల్లు శుభ్రం చేసుకున్నట్లో, ఒక కంసాలి ఇంట్లో ఉండిపోయి నగలు చేస్తూ ఉండేవాడు. సావిత్రికి నగలు బరువుగా ఉండటం ఇష్టం. మేలిమి బంగారంతో గట్టిగా ఉండే నగలు చేయించుకునేది. తనతోపాటు అక్క మారుతికి కూడా అలాంటి నగే చేయించేది.

'అర్ధాంగి'లో అత్యుత్తమ నటన ప్రదర్శించింది సావిత్రి. 'దేవదాసు' కంటే మించిపోయింది. ఆ చిత్రం షూటింగ్ జరుగుతున్నప్పుడు "నీ నటన చూస్తుంటే కడుపు నిండిపోతుందమ్మా" అంది శాంతకుమారి.

1954 'మిస్సమ్మ' షూటింగ్ జరుగుతోంది. ఎదురుగా బాగా ఎరిగిన మొహం ఒకటి కనిపించింది సావిత్రికి. ప్రాణం లేచొచ్చింది. 'చాముండి! హమ్మయ్య వచ్చేశావా... అమ్మో ఎన్ని విషయాలు వున్నాయి చాముండికి చెప్పటానికి' అనుకుంటూ "చామూ" అంటూ పరిగెత్తుకు వెళ్లింది సావిత్రి.

"వచ్చావా చామూ, మంచిపని చేశావు" అంది. కానీ, చాముండి ఎంతగానో ఎదురు చూస్తున్న ఆ కౌగిలి లేదు. ఆ మునుపటి ముద్దులు లేవు. చాముండి వచ్చినందుకు మాత్రం మనస్ఫూర్తిగా సంతోషించింది. అందులో మాత్రం అనుమానం లేదు.



'దేవదాసు' సెట్ మీద పార్వతిగా.
1953 'కినిమా' పత్రిక నుంచి






H.M. రెడ్డి సమర్పించు...
రోహిణీ వారి...
ప్రతిజ్ఞ
...దర్శకత్వం...
వై. ఆర్. స్వామి M.A


జంపన - నంది
వారి
మేనరికం
స్టూడియో
వాహిని
దర్శకత్వం



"బుగ్గలు కందేయా నాయనా" అని అంజలి సానుభూతి కనబరుస్తూంటే వసంత బిత్తరపోతూంది. "పరదేశి"లో

డి. వీరాస్వామి, విశాఖపట్నం.

ప్ర:—పెండ్లికాకుండా 20 సంవత్సరాలలోపున్న మన తెలుగు తారలలో ఎవరేనా వున్నారా?

జ:—లేరు! ఎనీ మ్యాట్రిమొనీ?

◆ ◆ ◆

యం. యల్. భాషా, భీమవరం.

ప్ర:—శాంతా ప్రొడక్షన్స్ వారి "అనార్కలీ" ఎంతవరకూ వచ్చిందండీ?

జ:—సలీంని పెళ్ళాడడానికి బయల్దేరింది!

◆ ◆ ◆

జి. ప్రియనాథం, పూనా.

ప్ర:—ప్రతి రూపవాణిలో సావిత్రి బొమ్మ తప్పనిసరిగా యుండుటకు కారణమేమి?

జ:—అనేక చిత్రాలు సావిత్రి మయంగా వున్నందున!

మిద్దె సత్యనారాయణ, గోకవరం.

ప్ర:-హాస్యంలో రేలంగి గొప్పా? లేక శివరావా?

జ:—రేలంగి!

। । ।

పాలెపు విశ్వాలు, చీరాల.

ప్ర:—త్రిశంకు స్వర్గం అంటే ఏమిటి?

జ:—రాజాజీ పరిపాలన!

। । ।

ఓ. విఠల్‌రావు, వరంగల్.

ప్ర:—నిర్మాత, హీరో, దర్శకుడు ఐన రాజారావుగారి పేరు ఇంతకు ముందు పత్రికలలో వినలేదు. "పుట్టిల్లు" నిర్మాణానికి అన్ని ఛాన్సులు ఎలా లభించేయి?

జ:—అదృష్టం!

। । ।

[illegible], [illegible].

ప్ర:—మన తెలుగు సినీమా [illegible] [illegible] కాకుండా వున్న తారలెవరేనా వున్నారా?

జ:—"[illegible]" [illegible] "[illegible]" [illegible]!

। । ।

జి. [illegible] రామారావు, [illegible].

ప్ర: [illegible] సినీమా [illegible] గురించి ఎంతవరకూ తెలుసు?

జ:-ఏం? తెలియాలని కాస్త్రుమా?

◆ ◆ ◆

[illegible]బాబు, [illegible].

ప్ర:—ఆగష్టు రూపవాణి వెనుక పేజీమీద సూడు గుర్రాల బీడీల ప్రకటనలో "సురయ్యా" బొమ్మ వేసినారు కదా! సురయ్యా బీడీలు కాలుస్తుందా? మరి దాని అర్థం?


జ:-మరి ఆ గుర్రాలని "సురయ్యా" పెంచుతూందా అని అడగరేం?

◆ ◆ ◆

కె. రామమోహనరావు, మద్రాసు.

ప్ర:—[illegible] సినీమా తారను ప్రేమించినట్లు కథ వ్రాస్తే మీ పత్రికలో వేస్తారా?

జ:—ఆడతారా? మగతారా?



నిర్మాత:—అయితే మీకు చాలా మంది ఫైనాన్సర్లు తెలుసునన్నమాట?

శ్రోత:—తెలియడం ఏమిటి? రేపు వుదయం నాలుగులక్షలు [illegible] చేయిస్తా! సధ్యా ఒక బీడీ వుంటే ఇవ్వండి!

రూపవాణి

42

1953 రూపవాణి పత్రిక నుంచి

## 1954 జూలై కినిమా పత్రికలో కొమ్మారెడ్డి సావిత్రి పాఠకుల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు

### నేనిప్పుడు నటిస్తున్న చిత్రాలు:

జనతావారి "పరివర్తన"; జంపన & నందివారి "మేనరికం" (తెలుగు) "కుడుంబం" (అరవం); జెమినీవారి "బహుత్ దిన్ హుయే" (హిందీ); విజయవారి 'మిస్సమ్మ' (తెలుగు), "మిస్సియమ్మ" (తమిళం); మోడరన్ థియేటర్స్‌వారి 66 వ చిత్రం (తమిళం); వినోదా "కన్యాశుల్కం", ఏ.వి.ఎమ్. వారి "వదినె" (తెలుగు), "చెల్లపిళ్లై" (తమిళం).

### నేనింతవరకు నటించిన చిత్రాలు:

"సంసారం," "పాతాళభైరవి," "శాంతి," "పెళ్లి చేసి చూడు" (తెలుగు, తమిళం), "ప్రియురాలు," "రూపవతి," "సంక్రాంతి," "పల్లెటూరు," "ఆదర్శం," "బ్రతుకుతెరువు," "దేవదాసు" (తెలుగు, తమిళం), "పరోపకారం" (తెలుగు, తమిళం), "పెంపుడు కొడుకు" (తెలుగు, తమిళం), "ప్రతిజ్ఞ" (తెలుగు, తమిళం), "చంద్రహారం" (తెలుగు, తమిళం), "మనం పోల మాంగల్యం" (తమిళం), "జ్యోతి" (తెలుగు, తమిళం).

### ఎస్.బి.ఎస్. ప్రసాదరావు, బి. ఎస్.సి. క్లాస్, కాకినాడ

ప్ర: దయచేసి మీరు త్వరగా ఒక ప్రొడ్యూసర్ అయ్యి, మాలాంటి ఉత్సాహవంతులైన కళాభిమానులకు సినిమా రంగంలో తగిన ప్రోత్సాహం కలిగిస్తారని ఆశించవచ్చునా?

జ: ప్రొడ్యూసర్ కాదలచుకోలేదు.

ప్ర: ఇంతవరకు మీరు నటించిన చిత్రాలలో ఏ పాత్రకైనా న్యాయము చేకూర్చానని చెప్పగలరా?

జ: చెప్పగలను.

### జి.బి. మన్న & పి.ఎన్.కె. పెదనింద్రం

ప్ర: నేను మీకొక రిస్టువాచ్ బహుమతి ఇవ్వాలనుకొనుచున్నాను. అది మీకు చేరేవిధం ఏలాగు?

జ: పోస్టు విధంగా.

**పొక్కునూరి మల్లికార్జునరావు, విజయవాడ-2**

ప్ర: జనతావారి "పరివర్తన" కథ, ఆత్రేయ --- "పరివర్తన" నాటకం ఒకటేనా?

జ: కాదు, దానికీ, దీనికీ చాలా తేడా వుంటుంది.

ప్ర: "పరివర్తన"లో హీరో ఎన్.టి. రామారావా? లేక నాగేశ్వరరావా?

జ: రామారావు

ప్ర: మీరు సినిమా రంగంలో చేరింది కేవలం ధనాపేక్ష కోసమా? లేక కళోపాసనకా?

జ: రెండింటి కోసం.

**నీలాపురం సాదక్ హుస్సేన్, కడప**

ప్ర: "పెంపుడు కొడుకు" డైరెక్టరు అయిన ప్రసాద్ గారిదని నేను, కాదని నా మిత్రుడు వాదించుకుంటున్నాము. మీరు ఎవరితో ఏకీభవిస్తారు?

జ: "పెంపుడు కొడుకు" చిత్రం ప్రసాద్ గారిది కాదు. ఆయన చిత్రానికి దర్శకుడు మాత్రమే.

ప్ర: కె.వి. చౌదరికిని, కె.వి. రెడ్డికిని ఏమైనా సంబంధము ఉందా?

జ: సినిమాల వరకు వారు స్నేహితులు.

**దాసరి యాకోబు, కలవచర్ల, తూ.గో. జిల్లా**

ప్ర: మీరు ఏ సినిమాలోనైనా స్వంతముగా పాటలు పాడారా?

జ: లేదు.

ప్ర: "బ్రతుకు తెరువు" లో మీకు ఉన్న తలవెంట్రుకలు మీ తలవేనా లేక కంపెనీవా?

జ: ఇంకా నయం! మీ ముఖమేనా, లేక కంపెనీ ముఖమా అని అడిగారు కాదు.

ప్ర: నేను "కినిమా"కు 15 నెలలనుండి ప్రశ్నలు పంపుతున్నాను. కాని, నన్ను నిరుత్సాహపరచి ఎవ్వరూ కూడా సమాధానాలివ్వడం లేదు. దయయుంచి దీనికైనా సమాధానాలిస్తారా?

జ: 15 నెలలనుండి "కినిమా"కు పంపిన ప్రశ్నలు ఇలాంటివేనా సోదరా!

**పి. సంజీవరెడ్డి, వద్యారం**

ప్ర: "కినిమా" గురించి మీ అభిప్రాయమేమిటి సెలవిస్తారా?

జ: మంచి ఆదర్శాలుగల పత్రిక.

ప్ర: మీ ఆటోగ్రఫీ తీయించి పంపుతారా?

జ: ఆటోగ్రఫీ తీయించడం ఏమిటి సోదరా?

**ఎమ్. ఆనందరెడ్డి, 479 పంటవీధి, తిరుపతి**

ప్ర: మీకు వివాహము జరుగక మునుపే మీ చెల్లిగారైన మారుతి వివాహము చేసుకొనుటకు కారణమేమి?

జ: మారుతి మా చెల్లికాదు.... ఆమె మా అక్కయ్య.

ప్ర: యువరాజు వేషమునకు ఎన్.టి. రామారావు తగినవారని నా ప్రియమిత్రుడు కె. రామ్మూర్తి రెడ్డియు, ఏ. నాగేశ్వరరావు తగినవారని నా ప్రియసోదరుడు టి. రామచంద్రారెడ్డియు వాదములాడుచున్నారు. అందులకు నేను వారి పర్సనాలిటీని చూచి వారికి యిష్టమైన వారిని తీసుకొందురని నా అభిప్రాయము చెప్పితిని. ఇందులో మీరు ఎవరితో ఏకీభవిస్తారు?

జ: మీతో ఏకీభవిస్తాను.

ప్ర: మేము మీతో కలసి మాట్లాడవలసియున్నది. మేము మీ యింటికి వచ్చిన గౌరవించెదరా? అగౌరవించెదరా? మీ అడ్రసు తెలుపవలసినదిగా కోరుచున్నాను.

జ: అగౌరవించే అలవాటు నాకు లేదు. తప్పకుండా మీతో మాట్లాడతాను. అడ్రసు 11, వైద్యరామయ్యర్ వీధి, త్యాగరాయనగర్, మదరాసు-17

**గంధి రామారావు, పార్వతీపురం**

ప్ర: "దేవదాసు" చిత్రంలో పాత్రను మీరు పోషించలేక పోయారు. భావాలను వ్యక్త పరచడంలో చాలా లోపాలున్నాయ్. తప్పు మీదా లేక దర్శకునిదా?

జ: తప్పు నాదే కావచ్చు.

**ఆర్.ఎస్.మూర్తి, 14/35 ఆచారివీధి, నెల్లూరు**

ప్ర: మీరు "పెంపుడు కొడుకు" చిత్రములో బావిదగ్గర పూలచెట్లకు నీరుపోయుచు, పాడినపాట హిందీ చిత్రము "ఆన్"లోని పాటను అనుకరించినట్లు తలుస్తాను. నిజమేనా?

జ: నిజమే.

ప్ర: మీరు హిందీ చిత్రములలో గొప్ప నటీమణుల నటనను చూచి అలాగే, అనుకరిస్తూ నటిస్తారని విన్నాను నిజమేనా?

జ: అలాంటి అలవాటు లేదు.

**మిస్ ఆర్.బి. ప్రభావతి, నాజర్‌పేట, తెనాలి**

ప్ర: నీకెట్టి పాత్రయనిన అభిమానము మెండు?

జ: శక్తి సామర్థ్యాలుగల ఏ పాత్రనైనా అభిమానంతో నటిస్తాను.

ప్ర: అట్టిపాత్ర నీవిప్పటివరకు వేసిన ఏ చిత్రములోనైనా గలదా?

జ: కలదు.

ప్ర: సినీనటులు రాజకీయవేత్తలయి, రాజకీయవేత్తలు సినీ నటులయినచో నప్పుడు భావి భారత పరిస్థితి యెట్లుండును?

జ: తలక్రిందులుగా నుండును.

ప్ర: మీ నటీనటులకు డబ్బు విలువ, కష్టములనుభవించుట సహనము మొదలగునవి తెలియునా?

జ: తెలియును.

ప్ర: నీవు వేసిన చిత్రములలో నేవేవి శతదినోత్సవములు చేసుకొన్నవి?

జ: "పెళ్లిచేసిచూడు", "దేవదాసు", "బ్రతుకుతెరువు", "ప్రతిజ్ఞ".

**కాండ్రేగుల అప్పారావు, అనకాపల్లి**

ప్ర: మన చిత్రనిర్మాతలలో అనేకులు తమ స్వార్థము కొరకు పనిచేస్తున్నారని కొందరి అభిప్రాయం. కొంత వరకూ ప్రజాహితము కొరకే పనిచేస్తున్నారని నా అభిప్రాయం. దానికి మీ సమాధానం?

జ: రెండింటికీ పనిచేస్తున్నారు.

ప్ర: సినిమాలవలన మనదేశపు నవయువతీ యువకులలో ఎట్టి చైతన్యము రేకెత్తినదో తెలుపగలరా?

జ: ప్రతివాళ్లూ సినిమాలలో చేరాలనే చైతన్యం....

### సి.ఎస్. రాములు & బి.ఆర్.రెడ్డి. ఆదోని

ప్ర: మీరు నాగేశ్వరరావుతో ప్రస్తుతము చాలా చిత్రాలలో నటించుచున్నారు. కారణం?

జ: నిర్మాతలు మమ్మల్నిద్దర్నీ బుక్ చేయటమే కారణం.

ప్ర: మీరు నటించిన మొదటి చిత్రం "సంసారం" అని నేను, కాదని నా స్నేహితుడు వాదించుకుంటున్నాము. యిందులో ఎవరిది తప్పు?

జ: మీ స్నేహితుడిది తప్పు.

ప్ర: కనకతారలో నటించిన కన్నాంబ మొదటి చిత్రమేది?

జ: "కినిమా" వారిని అడిగి తెలుసుకోండి.

### పొన్నలూరి శ్రీరామచంద్రమూర్తి, ఉరవకొండ

ప్ర: పార్వతీ! మీకు మాటయిచ్చి దేవదాసు మిమ్ము చేరకుండగనే మరణించాడేం? ఆఖరికి మీ భర్త మీకు దేవదాసు దర్శనముకూడ లేకుండా చేశాడేం? ఎందుకో తెలియజేస్తారా?

జ: ఈ సందర్భంలో శరత్‌చంద్రబాబు వుంటే ఎంత బాగుండేది!.

### డి.ఎమ్.ధర్, రాజమండ్రి

ప్ర: మీకు నేను వెనుక ఒక ఉత్తరము వ్రాయగా, దానికి జాబు వ్రాయకపోవుటకు కారణము తెల్పెదరా? ఒక ప్రముఖ ఆంగ్ల సినీవార పత్రిక 'యింటర్‌వ్యూ'లో "సినిమా ప్రేక్షకుల అభిప్రాయములమీదనే ఆధారపడుచుందును. దినమునకు ముప్పదివరకు ఉత్తరములకు సమాధానములిస్తూ యుంటాను" అని చెప్పితిరిగదా! ఇందులోని ఆంతర్యమేమి?

జ: తీరిక ఉన్నంతవరకూ జవాబులు వ్రాస్తూంటాను.

### వడ్డాది పాపారావు, మచిలీపట్టణము

ప్ర: పాఠకులు పంపిన ప్రశ్నలకు మీరు సమాధానాలు ఇస్తారా లేక సంపాదకులకు కూడా ఏమైన బాధ్యత వుంటుందా?

జ: ఈ జవాబు నేనే ఇస్తున్నాను.

**పి. కృష్ణాజీరావు, ఏలూరు**

ప్ర: మీరు యికమీదట విజయవారి చిత్రాలలో నటిస్తారండి?

జ: ఏమండీ అంత సందేహం కలిగింది?

ప్ర: మీరు, భానుమతి ఇద్దరు కలసి నటించిన చిత్రం ఏదైనా వున్నదా అండి ?

జ: ఇంతకుముందెప్పుడూ నటించలేదు. ఇకముందు నటించనున్నాము. ("మిస్సమ్మ"లో)

ప్ర: విజయవారి "చంద్రహారం"లో "వలపుపాట వినగానె" అన్న పాట మీదేనండి?

జ: కాదు... కోమల పాడింది.

**పసుపులేటి పద్మ, వావిలవలస**

ప్ర: "పెళ్లి చేసి చూడు" లో జోలపాట జి. వరలక్ష్మి, మీరూ కలిసిపాడేరా? లేక ఎవరైనా పాడేరా?

జ: జి. వరలక్ష్మిగారూ, సరస్వతీ దేవిగారూ పాడారు.

ప్ర: మీరూ కృష్ణకుమారీ కలసి ఎందులోనన్నా నటించారా?

జ: ఆ...నటించాం. ("ప్రియురాలు")

**ఎమ్.ఎస్. ఆర్. గోపాల్, గద్వాల్**

ప్ర: నన్ను మరిచిపోయావా సిస్టర్?

జ: మరచిపోలేదు బ్రదర్ !

**ఎల్.కె. వెంకటరమణ, భీముడువీధి, నౌపడా**

ప్ర: మీ అక్క మారుతి, మీ నాన్నగారి మొదటి భార్య కుమార్తె అని నేను, కాదని నామనస్సు వాదించుకుంటున్నాము. ఏది నిజము?

జ: మీ మనస్సు చెప్పేదే నిజం.

**వసంతవాడ భారతమ్మ, గుడివాడ**

ప్ర: సోదరీ నీయొక్క వివాహమునకు నేను రావచ్చునా?

జ: తప్పకుండా....

ప్ర: నాకు కబురు పంపెదవా?

జ: జ్ఞాపకముంటే...

## హెచ్.శ్రీనివాసరావు, రామచంద్రపురం

ప్ర: మీరేదో హిందీ చిత్రాలలో నటిస్తున్నారని విన్నాను. నిజమేనా సోదరీ ?

జ: నిజమే.

ప్ర: నిజమే అయితే మీకు హిందీవచ్చా?

జ: ఓ !

ప్ర: పార్వతి పాత్రవల్ల మీరు తెలుసుకున్న విషయాలేమైనా ఉన్నవా?

జ: అటువంటి పాత్రలు నటించటమంటే పెద్ద పరీక్షలకు కూర్చున్నంత పని ఔతుందని...

ప్ర: "దేవదాసు" లో "పార్వతి" చనిపోయిందీ లేనిదీ కచ్చితంగా తెలుపలేదు. అసలింతకూ "పార్వతి" చనిపోయిందా లేదా?

జ: "దేవదాసు" చనిపోయిన తరువాత "పార్వతి" వున్నా ఒకటే లేకపోయినా ఒకటే.

ప్ర: నటీనటులకు దర్శకుడు ముందుగా కథంతా చెప్తాడా? లేక వారివారి పోర్షన్లకు మటుకే తెలియజేస్తారా?

జ: కొంతమంది కథ చెబుతారు; మరి కొంతమంది పోర్షన్లవరకే చెబుతారు ; మరికొందరు ఏమీ చెప్పరు.

ప్ర: మీరు "దేవదాసు"లో నటించే ముందు శరత్‌బాబు 'దేవదాసు' ను చదివారా?

జ: చదివాను-ఆరుసార్లు.

ప్ర: మీరెంతవరకు చదువుకున్నారు? మీకు వ్రాయను, మాట్లాడను ఎన్ని భాషలొచ్చు?

జ: థర్డ్ ఫారంవరకు చదువుకున్నాను. తెలుగు, తమిళం, హిందీ మాట్లాడటంవచ్చు.

## వారణాసి నరసింహమూర్తి, పార్వతీపురం

ప్ర: ఇప్పటివరకు మీరు నటించిన పాత్రలలో సహజంగా అత్యుత్తమంగా నటించిన పాత్ర ఏది?

జ: "పెళ్లి చేసి చూడు" చిత్రంలోని సావిత్రి పాత్ర.

1954లో జరుగుతున్న షూటింగలన్నిటికి చాముండిని రమ్మనమంది సావిత్రి. 'అర్ధాంగి', 'మిస్సమ్మ', 'సంతానం', 'వదిన' వీటి షూటింగ్‌లు ఎక్కడ జరుగుతుంటే అక్కడ జంటగా ఇద్దరూ కనిపించారు. ఎడతెగని కబుర్లు చెప్పుకుంటున్నారు. ప్రతి స్టూడియోలోనూ చాముండికి కనిపించిన ఇంకొక కామన్ సీన్...... గణేష్ ఉరఫ్ జెమిని గణేష్ ఉరఫ్ జి.జి. సావిత్రి వున్న ప్రతి స్టూడియోలో దర్శనమిస్తున్నాడు. వాళ్ల చూపులు కలుసుకుంటున్నాయి. ఆ కళ్లు ఏవో వూసులాడుకుంటున్నాయి. చాముండి అంతా గమనిస్తూనే వుంది.

చాముండి సావిత్రి నటనను కూడా గమనిస్తోంది. ఎంతో పరిణితి సాధించింది. ఇప్పుడు ఎంతో ఆత్మ విశ్వాసంతో చేస్తుంది. డైరెక్టరు చెప్పింది శ్రద్ధగా వింటుంది. పక్కకు వచ్చి మననం చేసుకుంటుంది. షాట్‌కి రెడీ అయిపోతుంది. అక్కడ ఆ పాత్ర మేరకు ప్రాణం పోస్తుంది.

★★★

"ఏంటి చామూ మీ సిలోన్ ఎలావుంటుందేంటి? ఇన్నిరోజులు వుండొచ్చావు".

"ఎలా వున్నా నీకంటే బాగా కాదులే."

"మరి నాకెప్పుడు చూపిస్తావ్ మీ సిలోన్ని?"

"వచ్చే నెలలోనే నువ్వు వెళ్లబోతున్నావ్."

"అదెలా" ఆశ్చర్యంగా అడిగింది సావిత్రి.

"విక్టోరియా మహారాణి సిలోన్ వస్తుంది,అందుకని అక్కడ చాలా ప్రోగ్రాములు వుండబోతున్నాయి.మనదేశపు సినిమా తారలందరినీ కూడా ఆహ్వానించారు.వాళ్లలో నువ్వు కూడా వున్నావు."

"నువ్వు వచ్చీరాగానే నా పని పెట్టుకున్నావా చామూ?"

"నేను చెయ్యాల్సింది పెద్దగా ఏమిలేదు,నువ్వు ఇప్పుడు పెద్ద తారవి సావిత్రి.అందరూ సావిత్రి... సావిత్రి ..అంటుంటే నాకెంత ఆనందంగా ,ఆశ్చర్యంగా వుందో తెలుసా?"

"నువ్వు కూడా నాతో వచ్చేయ్."

"వద్దులే ఇక్కడ నీ పనులు చూస్తూ వుంటాను."

"నువ్వు చూడనవసరంలేదు...." అని అన్నది, మళ్లీ హడావుడిగా "అంటే ఇక్కడంత పనులేమి లేవని"అని దిద్దుకుంది.



'అర్ధాంగి' 1955 సావిత్రితో ఏ.ఎన్.ఆర్.





చాముండికి మొదటిసారిగా తన అనుమానం గట్టిపడింది.

వాహిని స్టూడియోలో జరగాల్సిన 'మిస్సమ్మ' షూటింగ్ ఇంకా మొదలు కాలేదు. హీరోయినైన భానుమతి పదకొండుగంటలైనా ఇంకా రాలేదు. నిర్మాతలైన నాగిరెడ్డి, చక్రపాణి దర్శకుడైన ఎల్.వి. ప్రసాద్ చాలా చిరాగ్గా, కోపంగా వున్నారు. ఒక్క ఆడమనిషి కోసం అందరూ ఎదురుచూడటం వాళ్ల అహాన్ని దెబ్బతీసింది. 'మిస్సమ్మ'లో 'మేరి' పాత్రకు భానుమతికున్న ఇమేజ్ మాత్రమే కాకుండా ఆమె స్వభావం కూడా సరిగ్గా సరిపోతుందిగనుక ఆమెను తీసుకున్నారుగాని లేకపోతే వీళ్లకు వున్న 'కోల్డువార్స్' వీళ్లకున్నాయి. అవి మరొక్కమారు తెరమీదకి రాబోతున్నాయి. ప్రొద్దున్నే తొమ్మిది గంటలకు మొదలవ్వాల్సిన షూటింగ్ మధ్యాహ్నం ఒంటిగంట అయినా ప్రారంభం కాలేదు. ఈ సినిమాకు సంబంధించిన నటులు, సాంకేతిక నిపుణులు ఎప్పుడో ఏడుగంటలకే వచ్చేశారు.

సావిత్రి, చాముండి మాట్లాడుకుంటూ కూర్చున్నారు. "సావిత్రి నీకు ఇప్పుడిప్పుడే హీరోయిన్ రోల్స్ వస్తున్నాయి అనుకుంటే 'విజయ' వాళ్లు మళ్లీ సెకండ్ రోల్ ఇచ్చారేమిటి?" అని అంది చాముండి.

"అవును చామూ నాకు కాస్త బాధ వేసింది. కానీ ఇచ్చింది విజయా వాళ్లు, సెకండ్‌గా చేస్తుంది సీనియర్ ప్రక్కన అందుకనే ఒప్పుకున్నా. అబ్బా! ఇంకా ఎంతసేపు ఈ ఎదురుచూపులు?"

"నేను కనుక్కుని వస్తా ఆగు" అంటూ చాముండి చక్రపాణి ఆఫీసుకు వెళ్లింది.

అంతలోకి భానుమతి రానేవచ్చింది. భానుమతి తను చక్రపాణికి రాసిన ఉత్తరంలో తను ఈ రోజు వరలక్ష్మి వ్రతం చేసుకోవటం వలన షూటింగ్‌కి మధ్యాహ్నం రెండు గంటలకి రాగలుగుతుందని రాసింది. ఇప్పుడు అయింది ఒంటిగంటేగనుక కనిపించిన వాళ్లతో మాట్లాడుతూ నిదానంగా వస్తోంది. తనతో మాట్లాడిన వాళ్లందరూ చెప్పుకొచ్చారు దర్శక – నిర్మాత త్రయం ఎలా ఎందుకు అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. 'అదేంటి...' అనుకుంటూ వడివడిగా చక్రపాణి ఆఫీసులోకి వచ్చింది. చాముండి అక్కడే ఉంది.

భానుమతిని చూడగానే వాళ్ల అక్కసంతా ఎళ్లగక్కుతూ "ఏమ్మా, వరలక్ష్మి వ్రతం ప్రసాదం తీసుకుని వచ్చావా?" అని అడిగారు ఎల్.వి.ప్రసాద్.

"కార్లో వుందండీ.... వస్తుంది. అయినా మీరేంటి ఇలా! నేను ఉత్తరంలో రాశానుగదా రెండింటి నుంచి షూటింగ్ మొదలుపెట్టుకుందామని, అన్నట్లుగానే ఒంటిగంటకే వచ్చేశాను. నేను టైమ్ అంటే టైమే. మరి మీరెందుకు నాకోసం ప్రొద్దుట్నుంచి చూడటం?"

"ఎందుకంటే నీ ఉత్తరం నీతోపాటే ఇప్పుడే వచ్చిందిగనుక."

"అంటే ఏమిటి మీ ఉద్దేశం నేను వచ్చి, ఆ ఉత్తరం మీ ముందు పెట్టించాననా, భానుమతికి ఆ అవసరం లేదు. నిన్ననే మా అసిస్టెంట్‌తో పంపించాను. మీరు లేకపోతే మీ టేబుల్ మీద పెట్టానని చెప్పాడు. మీకు చూసుకోవటం రాక నన్ను అంటారేమిటి?"

"ఆ చేసుకునే పూజేదో కాస్త ముందుచేసుకుని రావచ్చుగా."

"పూజలు, వ్రతాల గురించి మీకేం తెలుసండీ? వాటికి కొన్ని ముహూర్త బలాలుంటాయి."

"ఈ ఒక్క పూజతో సరిపెడతావా, ఇంకా వుంటూనేవుంటాయా?"

"ఒక్క పూజతో మోక్షం వస్తుందటండీ?"

"అయితే నువ్వు మాకు మోక్షం ప్రసాదించు" అన్నారు చక్రపాణి.

భానుమతి ఎక్కువ సేపు ఆలోచించలేదు. "మీ ఇష్టం. మీకు ఇప్పుడే ఇక్కడే మోక్షం ప్రసాదిస్తున్నాను. నన్ను వెతుక్కుంటూ వచ్చింది మీరు. నా ప్రొడక్షన్‌లకు సరిపడా టైమే నాకు దొరకట్లా, అయినా అడిగారని ఒప్పుకున్నా, ఇక వెళ్లి నా పని నిరాటంకంగా చేసుకుంటాను" అంటూ బయటికి వెళ్లిపోయింది భానుమతి.

ఆఫీసుబాయ్‌ను ఉద్దేశిస్తూ, "సావిత్రికి 'మేరి' కాస్ట్యూమ్స్ ఇచ్చి, వేసుకుని కనిపించమను" అన్నారు చక్రపాణి.

చాముండి ఈ సంభాషణంతా విన్నది. ఇక అక్కడనుంచి మాయమై సావిత్రి ముందు ప్రత్యక్షమైంది. సావిత్రిని లాక్కుంటూ గ్రీన్ రూమ్‌లోకి తీసుకువెళ్లింది. ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవుతోంది చాముండి.

"ఏంటి చామూ? ఏంటీ సంతోషం? ఏమయింది? ఇక్కడికి తీసుకొచ్చావేంటి?"

చాముండి విషయం చెప్పేలోపే కాస్ట్యూమ్స్ ఇన్‌ఛార్జ్ వచ్చి "మీరే వచ్చేశారా! ఇదిగోండి ఈ మేరి కాస్ట్యూమ్స్ వేసుకొని చక్రపాణిగారు మిమ్మల్ని కనిపించమన్నారు" అని మేరి కాస్ట్యూమ్స్ ఇచ్చాడు.

అవి తీసుకొంటూ ఆశ్చర్యంగా చాముండి వైపు చూసింది సావిత్రి.

"చూశావా ఇప్పుడేనా నిన్ను సెకండ్‌గా చేసినందుకు బాధపడ్డాము. హమ్మయ్య! నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికైనా నువ్వేంటో తెలుసుకున్నారు వాళ్లు" అంది చాముండి.

సావిత్రి లంగాఓణీ నుండి మేరీ కాస్ట్యూమ్స్ అయిన చీరలోకి మారి దర్శక నిర్మాతలకు కనిపించింది. వాళ్లు సావిత్రిని మేరి పాత్రకు ఖాయం చేశారు.

సంతోషంగా తిరిగి వచ్చి చాముండికి చెప్పింది. "అక్కడ ఏమైంది చామూ? భానుమతి వెళ్లిపోయిందేమిటి?"

"ఆ ఏముంది? ఆమె వ్రతఫలం నీకు దక్కింది" నవ్వుతూ అంది చాముండి.

అలా సావిత్రికి 'మిస్సమ్మ'లో టైటిల్ పాత్ర లభించింది. ఇప్పటిదాకా సావిత్రి చేసిన పాత్రలో జమునను తీసుకున్నారు.

★ ★ ★

1954లో ఏ.వి.యం ప్రొడక్షన్స్ వారి 'వదిన' షూటింగ్ మొదలయ్యింది. దీన్ని తమిళంలో కూడా ఒకేసారి తీస్తున్నారు. అంతకు ముందు 1951 లో 'పెళ్లి చేసి చూడు' తమిళంలో తీసినప్పుడు సావిత్రికి తమిళం డబ్బింగ్ చెప్పారు. ఆ తరువాత వచ్చిన కొన్ని తమిళ సినిమాలలో తనే చెప్పుకుంది.

అందుకని ఈ సినిమా సమయానికి సావిత్రికి తన తమిళం ఫరవాలేదు అనిపించి "నేనే చెప్పుకుంటానండి నా డబ్బింగ్" అంది. ఏ.వి.యం వాళ్లు "సరే చూద్దాం" అన్నారు.

తీరా డైలాగ్స్ వినేసరికి ఏ.వి.యం వాళ్లకి సావిత్రి తమిళం నచ్చలేదు. మళ్లీ సావిత్రి ఎడమచేయి పిడికిలి బిగించింది.

'నాకు తమిళం రాదంటారా? చూడండి ఇక' అనుకుంది.తమిళం నేర్చుకోవటానికి ఇంట్లో ఒక మాష్టారుని పెట్టుకుంది.చిన్న దినపత్రికలనుంచి పెద్ద పెద్ద గ్రంధాలు చదివేదాక పట్టు సడలించలేదు.

1954లో 'వదిన' కు తమిళ వెర్షన్ అయిన 'చెల్లపిళ్లై' అనే సినిమానే సావిత్రికి డబ్బింగ్ చెప్పవలసి వచ్చిన చివరి తమిళ సినిమా.

ఆ తరువాత సావిత్రి తమిళం ఎంత బాగా నేర్చుకుందంటే మద్రాస్‌లో ఒక సినిమా ఫంక్షన్‌లో వేదిక మీద నుంచి మొదట తమిళంలోనే మాట్లాడి ఆ తరువాత తెలుగులో మాట్లాడింది. అక్కడి వారు "సావిత్రికి తెలుగు కూడా వచ్చా?" అని ఆశ్చర్యపోయారు. "తెలుగు అమ్మాయే కదా మరి" అంటే "తెలుగు అమ్మాయా?" అని ఆశ్చర్యపోయి "ఈ అందగత్తె మా తమిళ అమ్మాయి కాదా?" అని బాధ పడిపోయారు కూడా.

★ ★ ★

ఇంటి దగ్గర వెంకట్రామయ్యచౌదరి కాళ్లు చేతులు ఆడటం లేదు. చేతికి చేరుతున్న డబ్బుకీ ఇంట్లో అవుతున్న ఖర్చులకీ లెక్క సరిపోవటంలేదు.

A C No. 91132

సావిత్రి మునుపటి సావిత్రి లాగా లేదు. భయపడటం లేదు. ఏదన్నా గట్టిగా మాట్లాడితే అతన్నే ఇంటి నుండి బయటకు పొమ్మనే లాగుంది. అసలు మనిషే మారిపోయింది. కోపం ఎక్కువవుతుంది. ఇంట్లో వాళ్లు ఏమాత్రం తప్పు మాట్లాడినా, తప్పు చేసినా చీల్చి చెండాడుతోంది.

సావిత్రి సంపాదనతో కాలుమీద కాలు వేసుకొని కూర్చోవచ్చు అనుకున్నాడు వెంకట్రామయ్యచౌదరి. ఆ డబ్బులు వడ్డీలకు తిప్పుదామనుకున్నాడు. తోటలు కొని, పళ్లు పండించి వ్యాపారం చేద్దామనుకున్నాడు. రెండు ఎకరాలు కొన్నాడు కూడా. నిర్మాతలు దర్శకులు అంతా తన చుట్టూ తిరుగుతారు సావిత్రి తేదీల కోసం అనుకున్నాడు. కాని ఇప్పటి పరిస్థితులు చూస్తుంటే ఆయన తల తిరుగుతోంది. సావిత్రి సంపాదనను నమ్ముకుని నాలుగయిదు చోట్ల పెట్టుబడులు పెట్టాడు. వాటికి ఇంకా చెల్లించాల్సిన వాయిదాలు వున్నాయి. అవి చెల్లిస్తేకాని అవి పూర్తిగా అతనివి కావు. ఈ సమయంలో సావిత్రితో పేచీ పెట్టుకొని లాభం లేదని నిర్ణయించుకున్నాడు. దుర్గాంబ ద్వారా సుభద్రమ్మ దగ్గరికి విషయం తీసుకెళ్లి చెప్పినా పెద్దగా ప్రయోజనం వుండటం లేదు. 'ఈ డబ్బుకి ఎక్కడ గండి పడుతోందబ్బా' అనుకుంటున్నాడు.

చూచాయగా, స్నేహితురాలు అయిన జమునని అడిగి చూశాడు. చాముండిని అడిగాడు. ఎక్కడా సరైన సమాధానము రాలేదు. ఇంకా చాలామందిని అడుగుతూనే వున్నాడు.

★ ★ ★

"చామూ, రేపు షూటింగ్ మోడరన్‌లో సుందరంగారి దగ్గర, నువ్వు ఎక్కడ వుంటావు" అడిగింది సావిత్రి.

"నువ్వు ఎక్కడ వుంటే అక్కడే" అంది చాముండి.

"నా అసిస్టెంటువి అవ్వదల్చుకున్నావా ఏమిటి?"

"కరెక్టు, ఇంక నాకు వేరే పనిలేదు. అన్ని పనులకు గుడ్‌బై చెప్పివచ్చా సిలోన్‌లో. ఇక నీ పనే నాకు" అంది చాముండి.

సావిత్రి సంతోషించలేదు.

"రేపు ఎక్కడ వుంటావు" అని విసుగ్గా అంది.

"ఇప్పటిదాకా చెప్పిందేంటి?" చాముండి కూడా విసుక్కుంది.



మిస్సయిన మిస్సమ్మ. దర్శకుడు ఎల్.వి. ప్రసాద్‌తో భానుమతి



ద్విభాషా హీరోలతో బస్సెక్కనున్న కొత్త మిస్సమ్మ



తెలుగు 'మిస్సమ్మ' 1955



తమిళ్ 'మిసియమ్మ' 1955



'మిస్సమ్మ' షూటింగ్‌లో మార్కస్ బార్ట్‌లీ, ఎన్.టి.ఆర్.,
ఎల్.వి. ప్రసాద్, చక్రపాణి



'మిస్సమ్మ'లో 'ఏమిటో ఈ మాయ' పాట చిత్రీకరణలో మార్కస్ బార్ట్‌లీతో

"అయితే అక్కడే వుంటావన్నమాట" అంది అదోలా.

సావిత్రి మోడరన్ స్టూడియో చేరేముందే చాముండి కూడ చేరుకుంది. 'మహేశ్వరి'అనే తమిళ సినిమా షూటింగ్ జరగాల్సివుంది. ఈ సినిమాలో హీరో జి.జి. కాబట్టి అతను కూడా వచ్చాడు.

సావిత్రి ఎప్పుడు చలాకీగా అటు ఇటు తిరుగుతూనే వుంటుంది. కాని జి.జి. వుంటే సావిత్రి మోము ఇంకా విరబూస్తుంది. అంతా గమనిస్తోంది చాముండి.

టి.ఆర్. రఘునాథ్ డైరెక్టు చేస్తుండగా, 'సుందరంగారు త్వరగా రమ్మన్నారు' అని కబురు వచ్చింది. "పనిమీద వుంటే రమ్మంటారేమిటి, తర్వాత వస్తానన్నానని చెప్పు" అన్నారు టి.ఆర్.రఘునాథ్.

"ఈ పని ఆపమంటున్నారండీ."

"ఎందుకు?"

"అది చెప్పటానికే మిమ్మల్ని రమ్మంటున్నారండీ."

అందరూ నిశ్చేష్టులై నిలబడిపోయారు.

రఘునాథ్ సుందరం గదిలోకి వెళ్లారు.

"ఎంత పెద్ద స్టార్ అయినా, ఎంత పెద్ద ఆర్టిస్టు అయినా నా స్టూడియోలోకి అడుగుపెట్టినప్పుడు వాళ్లు ఈ స్టూడియో రూల్స్‌కి అనుగుణంగా నడచుకోవాలి. వాళ్లిద్దరూ హద్దులు మీరారు. ఇది నేను భరించలేను. దయచేసి పేకప్ చేయండి. మీరు కాబట్టి, మీకు రావాల్సిన డబ్బంతా ఇచ్చేస్తాను, ఇక వెళ్లండి"అన్నారు సుందరం.

"అసలు ఏమయిందండీ?"

"చెప్పాను కదండీ సావిత్రి, జి.జి ప్రేమకలాపాలు చేసుకునే స్థలం కాదు నా స్టూడియో" అన్నారు కోపంగా సుందరం.

రఘునాథ్ ఆశ్చర్యపోయారు. లోపలేం జరుగుతున్నదో అందరికీ ఉత్కంఠగా వుంది. ఒక్క చాముండినే లోపలకి వెళ్లే ధైర్యం చేసింది. విషయం విన్నది. "మీరు పొరపడి వుంటారు" అన్నది.

"వాళ్లని పిలువు .వాళ్లతోనే చెప్పిస్తాను" అన్నారు సుందరం.

"సుందరంగారు, దయుంచి నాకోసం ఈ ఒక్కసారి ఆ అమ్మాయిని వదిలేయండి" ప్రాధేయపడింది చాముండి.

ఆలోచనలో పడ్డారు సుందరం. ఆయన డిసిప్లిన్ అంటే డిసిప్లినే. ఆయన డిసిప్లిన్‌కు కొన్ని ఉదంతాలు....

ఒకసారి ఒక తమిళ సినిమాలో భానుమతి, యం.జి.ఆర్ నటించాల్సి వుంది. యం.జి.ఆర్ ఇంకా సెట్స్‌కి రాలేదు. యం.జి.ఆర్‌లా ఫిజిక్ ఉండే ఆఫీసుబాయిని తీసుకొని ఆరోజు షూటింగ్ అంతా జరిపించేశారు. అంతా పూర్తయిన తర్వాత "ఆ ఫిల్మ్‌ని ఎక్కడ పెట్టను" అని ప్రొడక్షన్ మేనేజర్ అడిగాడు. "అదంతా చెత్త బుట్టలో వెయ్యండి" అన్నారు.

"అదేమిటి ఇంత షూటింగ్ తీసి.... ఇంత ఖర్చుపెట్టి, నష్టం కదండి" అన్నాడు ప్రొడక్షన్ మేనేజర్.

"నా స్టాఫ్ వూరికే కూర్చొని, వాళ్లు చెప్పుకునే పిచ్చాపాటి కబుర్లే నాకు ఎక్కువ నష్టం. వాళ్లకు ఏదో పని ఉండాలని ఈ రీల్ తీయించాను, పని అయిపోయింది. ఈ రీల్ కాల్చేయండి, ఇంకా ఎం.జి.ఆర్ అకౌంట్ సెటిల్ చేసేయండి. అతను ఈ సినిమాలో ఇక చేయనవసరం లేదు" అన్నారు.

ఒకసారి ఒక ప్రముఖ నటి, స్టూడియోకి వచ్చిన దగ్గర నుంచి "నన్ను తొందరగా పంపించండి, ఇంకో నిర్మాతకి కాల్‌షీట్స్ ఇచ్చానండి" అంటూ వుంది.

ఆ రోజు కాల్‌షీట్ పూర్తిగా సుందరంకే ఇచ్చింది. కాని తొందరగా పంపించమని అడుగుతోంది. ఆ నటిని రూములో పెట్టి తాళం వేశారు సుందరం.

ఆ తర్వాత వచ్చి "ఇంకెప్పుడూ ఇట్లా చేయకు, ఒక నిర్మాతకి ఇచ్చిన కాల్‌షీట్ ఇంకో నిర్మాతకి ఇవ్వకు. ఇప్పుడు ఆ నిర్మాత ఎంత ఇబ్బంది పడతాడో నాకు తెలుసు అందుకనే నిన్ను ఇప్పుడు పంపిస్తున్నాను" అని చెప్పి కారు ఇచ్చి పంపించారు.

ఎంత పెద్ద స్టార్ అయినా ఈయన చెప్పిన సమయానికి రావలసిందే. ఒకసారి యస్.వి.రంగారావు కోసం అనుకున్న టైమ్‌దాకే వెయిట్ చేశాడు కారు డ్రైవర్. ఆ తర్వాత ఆయన స్వయంగా వుండమన్నా ఉండలేదు.ఆ విషయమే యస్.వి.ఆర్, సుందరంని అడిగితే, "ఆ డ్రయివర్ మీ కోసం ఆగితే అతడి ఉద్యోగం పోతుంది" అన్నారు.

ఇంకా, జగ్గయ్య ఒకసారి షూటింగ్‌లో వుండగా స్టూడియోలో స్మోక్ చేశాడు.'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' అనే ఆ సినిమాకి అదే చివరిరోజు. ఆయన స్టూడియో డిసిప్లిన్‌కి విరుద్ధంగా స్మోక్ చేసినందుకు, సినిమా అంతా కాంతారావుతో మళ్లీ షూట్ చేశారు.

అట్లాంటి సుందరం ఆలోచించి, "నా స్టూడియోలో ఇవి పనికిరావని చెప్పు" అన్నారు మెత్తబడుతూ.

రఘునాథ్ "హమ్మయ్య" అనుకున్నారు.

మెల్లగా "థాంక్స్ తల్లీ" అని చెప్పారు చాముండికి.

బయటికి వచ్చాక, చాముండి సైగ చేయగా సావిత్రి వచ్చింది, ఇంకో గదిలోకి తీసుకువెళ్లింది.

"ఏంటి నువ్వు చేసిన పని, నువ్వు చాలా తప్పు చేసినట్లు మాట్లాడుతున్నారు."

"అయ్యో ఏంటో చాముండి, అలా అయిపోయింది."

"పాపం నావల్ల ఆయనకు కూడా ఇబ్బంది కలిగిందా?"

"అసలు ఏమయింది?"

'నీకు ఇంకా అసలు సంగతి తెలియలేదా?' అన్నట్లు చూసింది సావిత్రి.

"నీకాయన డిసిప్లిన్ గురించి తెలుసుకదా? ఆయనకు అంతగా కోపం వచ్చే పని ఏంచేశావ్?"

"ఏదో అయిపోయిందిలే చామూ!"

"ఆయన్నేమీ అనలేదు కదా.."

"రఘునాథ్‌గారిని ఏమి అనలేదులే."

"అబ్బా ఆయన్ని కాదు చాము. ఆయన్ని..."

"ఏయన్ని?"

"గణేష్ గారిని"..

"అతడ్ని 'ఆయన' 'ఆయన' అంటున్నావేమిటి, చాలా రోజుల నుంచి చూస్తున్నా, ఏమిటి కథ? నన్ను నిన్న ఇక్కడికి రావద్దన్నంత పనిచేశావు. ఏంటి కథ ?" సూటిగా అడిగింది చాముండి.

"చామూ చెపుతాను రా, ఇప్పటి దాకా ఎవ్వరికీ చెప్పలేదు చాము, అమ్మకు కూడా చెప్పలేదు".

"ఏంటది?"

"నేను ఆయన్ని పెళ్లి చేసుకున్నాను చామూ."

చాముండికి నోట మాట రాలేదు. నిశ్చేష్టురాలైంది. మాట పడిపోయింది. సావిత్రి పిలిచి చూసింది. కదలిక లేదు. కదిలించింది, చాముండి కింద పడిపోయింది.

"సుందరం గారూ" అంటూ అరుచుకుంటూ బయటకు వచ్చింది. సపర్యలు చేసినా చాముండి కోలుకోలేదు.

వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

"ఏం చేశావు నా తల్లిని?" సుందరం అడిగారు.

"నేనేం చేయలేదండి. మాట్లాడుకున్నాం అంతే" అంది సావిత్రి.

"ఏం మాట్లాడావు? ఏమన్నా అనరాని మాటలు అన్నావా? నా తల్లి ఎంతో ధైర్యవంతురాలు, ఎప్పుడూ కంట తడి పెట్టి కూడా ఎరుగదు" అన్నారు సుందరం.

"ఈ రోజు ఎవరూ పలకరించవద్దు, రేపు రండి" అన్నారు డాక్టర్లు.

'సావిత్రి చాముండిని పడేటట్లు కొట్టింది.'

'వీరిద్దరికీ జి.జి. మీద ఉన్న ఆకర్షణే కారణం.'

'జి.జి. మీద సావిత్రికి వ్యామోహం వద్దని వారించిన చాముండి.'

'సుందరంగారి డిసిప్లిన్ దెబ్బకి సావిత్రి అసిస్టెంట్ హోంఫట్'.

తెలిసీ తెలియక పత్రికలు, స్టూడియోల్లో చర్చించుకుంటున్న విషయాలు ఇవి.

మర్నాడు పొద్దున్నే చాముండి దగ్గరకు వచ్చింది సావిత్రి.

ఇంకా పడుకునే ఉంది కాని పైకప్పు వైపు చూస్తూ తీక్షణంగా ఆలోచిస్తోంది.

ఆ ఆలోచన తన గురించే అని తెలుసు సావిత్రికి. చాముండి చెయ్యి తీసుకొని నొక్కుతూ కూర్చుంది.

తల తిప్పి చూసింది చాముండి.

కన్నీరు జలజలా రాలాయి.

సావిత్రికి ఆ కన్నీరు ఎందుకో అర్థం కాలేదు. తనకు చెప్పకుండా పెళ్లి చేసుకున్నందుకా?

ఏదో మాట్లాడాలనుకుంటుంది.కాని మాట ఇంకా పెగలటం లేదు.

కాసేపటికి... "అన్ని తెలిసే చేసుకున్నావా? ఇంతమంది ఉన్నా నిన్ను ఎవరూ ఆపలేదా?" అంది చాముండి.

సావిత్రి గంభీరురాలైంది. సమాధానం చెప్పదలచుకోలేదు.

"నువ్వు ఒకళ్లు చెపితే వినటమనేది దాటిపోయావు సావిత్రి" అంది చాముండి భారంగా.

"అవును ఇంతమంది ఉన్నారు, ఇంతమంది ఉండి, వాళ్లందరినీ నేను సాయం అడిగి, లేదని చెప్పించుకున్న తర్వాతే నిర్ణయించుకున్నాను. నువ్వు వెళ్లిన తర్వాత మా పెదనాన నన్ను ఎన్ని తిప్పలు పెట్టాడని.... నా పారితోషికం అమాంతంగా పెంచేశాడు. నెలకు నాలుగు వందలు, తీసుకునేదాన్ని అలాంటిది సినిమాకి ఇరవై వేలు అడగటం మొదలుపెట్టాడు. అసలు నన్ను ఇంకో సినిమాకి బుక్ చేసుకుంటారో లేదోనన్న అనుమానం వచ్చింది. చేతిలో ఉన్న సినిమాలైనా పూర్తి చేస్తానో లేదోనన్న పరిస్థితి. ఆయన నా తండ్రి కాదు అని రాసినందుకు 'రూపవాణి' పత్రిక మీద కేసు వేశాడు. ఆయనకి నిర్మాతలతో, దర్శకులతో గొడవలు, నాకు ఆయనతో గొడవలు. నన్ను కొట్టటం, తిట్టటం, నేనేదో బడికెళ్లే పిల్లనైనట్లు, ఈ సినిమానే చెయ్యి, ఆ సినిమా చెయ్యొద్దు అని బెదిరింపులు. నేను సంపాదిస్తున్న డబ్బంతా నేరుగా ఆయన చేతుల్లోకే. తిరిగి నేనే ఆయన్ని అడుక్కోవాల్సొచ్చేది. అందరూ ఉండి కూడా ఒంటరినయ్యాను. అందుకే... నాకు తోడుకోసం నా తరపున ఉండే మనిషి కోసం... ఇలా చేశాను" అంది సావిత్రి.

"ఒక్క ఆడమనిషికైనా చెప్పి ఉంటే... నువ్వు చేయబోయే పని..."

"అమ్మకు చెపితే కచ్చితంగా పెదనాన దగ్గరకు వెళ్తుంది, ఆయన ఏమైనా చేస్తాడా? పెళ్లి ఆపుతాడు. ఇదిగో ఇప్పుడు నీకు చెప్పాను. ఎంత పనయిందో చూడు."

చాముండి బాధగా మొహం తిప్పేసుకుంది.

'సావిత్రి... కొట్టింది...' 'సావిత్రి.... చాముండి కొట్టుకున్నారు...' 'సావిత్రి తోసింది... జి.జి.యే..కారణం... ఇద్దరికీ జి.జి. కావాల్సి వచ్చాడు'.

'సుందరం చాముండిని జి.జి.కి... ఇచ్చి పెళ్లి చేస్తానన్నాడు.సావిత్రి సుందరం సినిమాలు చెయ్యను పో అంది...'

ఇలా రకరకాలుగా వినిపించసాగాయి.

వెంకట్రామయ్యచౌదరికి చాముండి దగ్గరకు వెళ్లే ధైర్యం అస్సలు లేదు.ఎందుకో జి.జి. మీదే చాలా అనుమానం వచ్చింది.

సావిత్రి అతగాడిని 1948లో చూసింది మొదలు ఏనాడూ మరువలేదు. 'మనంపోల్ మాంగల్యం' ఇతనివల్లే వచ్చింది అని అందరూ చెప్పుకుంటున్నారు. తమిళ్‌లో ఒక విషయం స్ఫురణకొచ్చింది వెంకట్రామయ్యచౌదరికి. ఆ సినిమా 1953లో విడుదలైన తర్వాత వచ్చిన దీపావళి రోజున సావిత్రి క్రొత్తచీర, తెల్లచీర కట్టుకుంది. అంతకుముందే అందరూ అడిగారు, ఈ చీర ఎప్పుడు కొన్నావని. అతికే సమాధానమేదో ఒకటి చెప్పింది.

అది తెల్లచీర, పండుగ పూట ఎందుకు కట్టుకోవడం అన్నా కూడా అదే కట్టుకుంది. మామూలుగా అయితే సావిత్రి ఇలాంటి సెంటిమెంట్‌ను పాటిస్తుంది.

తను కింద ఉన్నాడు. మేడపైన సావిత్రి ఉంది. బహుశా బాల్కనిలో ఉందేమో.

జి.జి. వచ్చాడు, ఆశ్చర్యమేసింది వెంకట్రామయ్యచౌదరికి, అప్పట్లో జి.జి. తన ఇంటికి రావటమేమిటి అని, తన కోసం అయిఉండదు. ఏదన్నా పని ఉంటే సావిత్రి కోసమే రావాలి. సావిత్రి కోసమైనా ఇంటిదాకా ఎందుకు రావాలి. అనుమానం అప్పుడే కలిగింది. పైగా జి.జి. తాను ఇంట్లో ఉన్నందుకు చాలా ఇబ్బంది పడ్డాడు.

సావిత్రి గురించి అడగనైనా లేదు. 'మనంపోల్ మాంగల్యం' బాగా ఆడుతోందని వాళ్లిద్దరికి బాగా పేరు వచ్చిందని చెప్పాడు. కాసేపుండి వెళ్లాడు, మళ్లీ వచ్చాడు. ఏదో పక్కవీధిలో తన స్నేహితుడు ఇంకా రాలేదు అతని కోసమే చూస్తున్నాను అన్నాడు. ఇంకా కాసేపు కూర్చుని వెళ్లాడు. ఆ తర్వాత వెంటనే ఫోన్ వచ్చింది.

సావిత్రి దానికోసమే కాచుకు ఉన్నట్లు ఫోన్ ఎత్తింది. ఏదో చాలా మాట్లాడుతోంది. ఇటు ప్రొడ్యూసర్‌తో కాదు, డైరెక్టర్‌తో కాదు, తోటి నటీనటులతో కూడా కాదు. ఇంకా ఎవరితోనో మాట్లాడుతుంది. కాసేపు ఆగి ఫోన్‌లో నమస్కారం కూడా చేసింది. 'ఎవరబ్బా అవతల? ఎవరన్నా గురువుగారా?' అనుకున్నాడు వెంకట్రామయ్య చౌదరి.

ఆ సంఘటన స్పష్టంగా ఇప్పుడు మరొక్కసారి గుర్తొచ్చింది వెంకట్రామయ్యచౌదరికి.

'నిజమే ఉన్నదంతా వీళ్లిద్దరి మధ్యే ఉంది. ఏదో ఉంది. ఏదో ఉండటమేమిటి, ఒక ఆడదానికి మగాడికి మధ్య ఏముంటుంది? అదే ఉంది. ఏది ఉంటే నాకేంటి? అదేదో ఉండటంవల్ల నాకు ఆర్థికంగా నష్టం వచ్చింది. ముందు ఆ ఉన్నదేంటో కనుక్కొని ఇప్పుడైనా తుంచటం సాధ్యమైతే ఆ పని చేస్తాను' అనుకున్నాడు.

మొదటి ప్రయత్నం మొదలుపెట్టాడు.

"అమ్మాయ్ సావిత్రి... అందరూ ఇంటిపేర్లతో సహా వేయించుకుంటున్నారు. నువ్వు కూడా ఇకనుంచి కె. సావిత్రి అని వేయించుకో" అన్నాడు.

"పెదనానా హీరోయిన్‌లు ఎవరూ ఇంటిపేరు వేయించుకోవట్లా పెళ్లైన తర్వాత అవి ఎట్లాగూ మారుతాయి గదా అని."

"పెళ్లైన తర్వాత ఆ ఇంటి పేరు పెట్టుకుందువులే".

"నాకిష్టం లేదు పెదనానా."



కలంగిని ఊరి తీస్తానంటోంది వరలక్ష్మి! బహుశా ప్రేమించు దున్నా శేశా? "కోరికం"లో

యూలకంగా అనుకున్న పాటికి చిత్రం పూర్తికాక, పూర్తయిన తరవాత విడుదలై విజయంగాక, అప్పుల వాళ్ళతో వేగలేని నిర్మాత మార్కెట్లో పలుకుబడిని పోగొట్టుకుంటున్నాడు.

పరిశ్రమ పతనానికి ముఖ్యకారకులైన ఈ మేనేజర్లని నిర్మాత రాత్రించడుకు కనిపెడుతున్నాడు!

పరిశ్రమ పదికాలాలపాటు నిలబడిందికి నిర్మాతని క్షేమంగావుంచి, తాను బ్రతకడం ధర్మంగాని, దోపిడీ చేసి, వారి వారి రాసలీలల్లో రాత్రింబవళ్లు పరిశ్రమ ధనాన్ని దుర్వినియోగం చెయ్యడం ధర్మంగాదు!

నిర్మాతలు కేవలం కళ్లు మూసుకున్నారా? అంటేలేదు. ఈ ప్రొడక్షన్ పతులు ఆటలు సాగడానికి కొంత వరకూ నిర్మాత అనువుగా వుండటమే కారణం! ప్రతి మానవుడికీ ఏదో "వీక్ నెస్" వుంటుంది! ఫిలిం ప్రొడ్యూసర్ అంటే కనీసం లక్ష "వీక్ నెస్" లుంటాయి! ఆ లోపాలన్నీ ఈ పతీగాళ్లకి తెలుసు!

26

నిర్మాత "వీక్ నెస్"ని ఆధారంగా చేసుకొని, వీళ్లు ఆడింది ఆటగా పాడింది పాటగా చెలామణీ చేయించుకుంటున్నారు.

నేటి చిత్రాలన్నీ అఖండ అపజయంతో తిరిగి వస్తున్నాయంటే, పరిశ్రమదార్లు "పాపర్లు" ఔతున్నారంటే, ప్రబల కారణం ఒకటే కనిపిస్తూంది.

క్రమబద్ధమైన ప్రొడక్షన్ విధానం ఒక్క నిర్మాతా అవలంబించకపోవడమే.

అసలు ప్రొడక్షన్ ఆఫీసులు నామకార్థం వున్న వేగాని, అక్కడికి ఎవరు వెళ్లినా, సమాధానం చెప్పేందికి తగిన నాథుడెవడూ వుండడు.

కాదూ, పొంగకంలేని ఇటువంటి నిర్మాణ సంస్థలమీద లేనాం వేట కనీసపు ఎక్ట్రాకి కూడా "చిన్న చూపు" కలుగుతూందంటే సరియైన ఆర్గనైజేషన్, మేనేజిమెంటు లేకపోవడమే! ఈ విధానమే పరిశ్రమని నాశనంచేస్తూంది.

## నిర్మాతలకి హెచ్చరిక!

నిన్న మొన్న టివరకూ నెలకు మూడు వందలు తీసుకుని నటించే సావిత్రి ఈ నాడు చిత్రానికి 20 వేలు డిమాండు చేస్తూందట! ఇరవై వేలు తీసుకునే "అర్హత" సావిత్రికి వున్నదా లేదా అనే విషయం అప్రస్తుతం! "కళ"కి విలువలేదుగా! సావిత్రి విలువ అమూల్యం కావచ్చు! అసమాన్యం కావచ్చు.

కాని నిర్మాత లింకా "స్టారు వేల్యూ" మోజుమీద సావిత్రివంటి తారలను ఇరవై లేక వలభై వేలిచ్చి బుక్ చేసుకోడం ప్రస్తుత ఆర్థిక ప్రతిష్టంభన దృష్టిలో అది పరిశ్రమకు క్షేమంకాదు.

విడుదలైన అనేక చిత్రాలు దెబ్బతిన్నాయి. అనేకమంది నిర్మాతలు నిలువునా కూలిపోయేరు! మార్కెట్లో ధనంలేకా, వున్నది కదలకా, నిర్మాణంలోవున్న చిత్రాలు మీన మేషాలు లెఖపెడుతున్నాయి.

ఇటువైని మొత్తం చిత్రం ఒక లక్షా, లేదా, లక్షన్నర రూపాయల్లో ముగించుకున్న వారే ధన్యుడు.

రంగంలో అనేకమంది నూతన తారలు అసంఖ్యాకంగా వున్నారు. సావిత్రి కూడా నిన్నటివరకూ నూతన తారే.

"స్టారు వేల్యూ" మోజు మీద నిర్మాతలు ఆమె కోరినంత ధనమిచ్చి బుక్ చేసుకునేటంత అగత్యమైన పరిస్థితులు ఏమీ కనబడ్డంలేదు.

ఇంతవరకూ ఈమె నటించిన చిత్రాల్లో ఒకటేనా "బాక్సాఫీస్ హిట్" అనిపించుకున్నదున్నదా? అలాంటప్పుడు అనవసరంగా ఈమెకు

రూపవాణి



## వెంకట్రామయ్యచౌదరి, సావిత్రి

"స్టార్ వేల్యూ"ని మాత్రం కట్టబెట్టి, వేలంవెర్రిగా అందరూ బుక్ చేసి సమయానికి చిత్రం విడుదలచేయలేక బాధ పడటం దేనికి?

నేటి పరిశ్రమ అనేక విధాలుగా తారుమారైంది. ప్రస్థానం నుండీ తారాపథంలో వెలుగుతూన్న తారలతో నిర్మించిన చిత్రమైనా విజయవంతం కావడంలేదు. కనీసం పెట్టుబడి ధనమైనా తిరిగి రావడంలేదు. జెమినీ, ఏ. వి. యం. వంటి ఆర్థిక పుష్టిగల స్టూడియోలే తమ సిబ్బందిని తగ్గించి వేస్తూంటే, ఆర్థికంగా పరిశ్రమ ఎంత చితికి పోయిందో ఆలోచించండి.

తారలవల్లే చిత్రాలు విజయవంతమౌతాయనే పాత నమ్మకానికి స్వస్తిచెప్పాలి. అందుకు నిదర్శనం మీ బాక్సాఫీసులే! లక్షలకి లక్షలు తారలకోసం వ్యయపరచి పరిశ్రమని శాశ్వతంగా గంగలో కలపకండి.

## చౌదరిగారు ఆత్మపరీక్ష చేసుకోవాలి!

సావిత్రిని సినీమారంగంలో ప్రవేశపెట్టడానికి మీరు ఎన్ని బాధలు పడ్డారో ఒక్కసారి వెనక్కుతిరిగి చూసుకోడం చాలా అవసరం! ప్రప్రథమంగా "మోహిని"లో ఈమె ప్రదర్శన ముఖచిత్రం ప్రచురించిన తరవాతనే సావిత్రికి పిలుపు వచ్చింది. కాని అనేక అడ్డంకులు రావడంతోనే,

రూపవాణి

"పబ్లిసిటీ" అగత్యం లేని నన్ను సత్యాన్ని గ్రహించిన చౌదరిగారు సావిత్రితోకలిసి "రూపవాణి" కార్యాలయానికి ఎన్నిసార్లు వచ్చి వెళ్ళేరో లెఖ్ఖలేదు. ఉగాది సంచికలో సావిత్రి ఫోటోకోసం నమ్మలో వుండగా ప్రార్థనలో మా ప్రెస్‌కి ఆతృతగా ఎన్నిసార్లు విజయం చేసేరో జ్ఞాపకం వుంచుకోవాలి.

ఆవేదన, ఆతృత, అమాయకంగా వుండటం సహజం! ఒక తార ముందుకు రావాలంటే ఎంత ప్రయాసవుందో, ఎంత పలుకుబడికావాలో, చౌదరిగారికి బాగా తెలుసు.

కాస్త పైకి రాగానే పాత విషయాలని మరచిపోవడం సహజమేమైనా, అది పరిశ్రమకిగాని వ్యక్తులకిగాని ఏనాడూ హానిచెయ్యవు. తమకే కీడు కలుగుతుంది.

సావిత్రి "తార" కాకపూర్వం చౌదరి, నిర్మాతలకు చూపించిన అనుకువగాని సుహృద్భావంగాని నేడులేవు. వుంటే కేవలం స్టూడియోలో తన మోటారు డ్రైవర్ల కోసం చేసే అగత్యం ఎందుకు పట్టింది? జి. వరలక్ష్మి చెయ్యి చేసుకునే అవకాశం ఎందుకు కలిగింది? పైకి రావడంలో ఎంత కష్టంవుందో, వచ్చిన తరువాత ఆ స్థానం నిలుపుకోవడంలో కూడా అంత కష్టంవుంది. అందేవరకూ కాళ్లూ అందినతరవాత జుట్టూ పట్టుకునే స్వభావం మంచిదికాదు.

నేటి సినీమా పరిశ్రమ, వ్యవస్థలు, పరిస్థితులు, ఎలా వున్నాయో ఒకసారి సింహావలోకనం చేసుకోవడం చౌదరికి, సావిత్రికీ చాలా ముఖ్యం. ఇరవై వేలకి తక్కువ తీసుకుంటే తమ హోదాకి లోటుకావచ్చు! నిర్మాత క్షేమం మీ క్షేమం అనీ, చిత్ర విజయమే మీ విజయమనీ, పరిశ్రమ మనుగడే మీ పురోగమనమనీ గ్రహించాలి.

లక్షరూపాయలు తీసుకునే బెంగాల్ కోకిల కన్నన్ బాల, కాంట్రాక్టులులేక గతసంవత్సరంలో 5 వేల రూపాయలిచ్చే నిర్మాతవున్నాడా అని అటుమటించింది.

అదృష్టంగా సావిత్రికి ఇంకా ఎంతో అనుభవం కావాలి! ఒక్కసారి రేటు ఇరవై వేలకి పెంచి, నిర్మాతని ఆర్థిక సమస్యలో పెట్టి ఉభయులూ దెబ్బతినడంకన్నా, ఇద్దరికీ కష్టంలేని సామాన్య ప్రతిఫలంతో క్రమంగా ముందుకు రావడం మంచిదిగాని, ఒక్కసారి మీదకెగిరి క్రిందకి పడిపోవడం అటు పరిశ్రమకూ ఇటు ఆర్టిస్టుకీ క్షేమంకాదు.

నూతనంగా తారాపథానికి వచ్చే తారలంతా పై అంశాలని గమనించాలి.

పరిశ్రమలో కాలుపెట్టించిన పడిన కష్టాలని విస్మరించి పరిశ్రమకే "ప్రెసిడెంటు"గా మారి కూర్చోకూడదు.

27



**ఫిడేలు పిల్ల మోత పుట్టిస్తోంది!**
**ఎందరి హృదయ తంత్రులు తెగేయో! 'ఆదర్శం' లో సావిత్రి**

చౌదరిలాంటి వ్యక్తులకు బుద్ధి చెప్పేందుకు పరిశ్రమలో వరలక్ష్మి వంటి స్పోర్టివ్ లేడీ వుండాల్సిందే.

నామకార్థపు తండ్రి చౌదరి ప్రవర్తనకు సావిత్రి లోలోపలే పరితపిస్తోందనీ, విడాకులిచ్చి స్వాతంత్ర్యం సంపాదించనున్నదని తాజా వార్త.

సావిత్రి సంపాదన మీద బ్రతికే చౌదరి అంత సులువుగా ఆమెను వదలిపెట్టడని, దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకుందికి ప్రయత్నిస్తున్నాడనీ, మరి కొన్ని వార్తలు.

"పెరుగుట విరుగుట కొరకే" అన్నట్టు తారాపథం నుండి పతనమయేందుకు సావిత్రికి అట్టే కాలంపట్టదు.

ఆంతరంగిక వ్యవహారాలు ఎలావున్నా,

అయాచితంగా వచ్చిన కీర్తిని తారాపథాన్ని సావిత్రి నిలుపుకుంటుందని ఆశిస్తా.

'రూపవాణి' పత్రిక నుంచి

ముందుగానే వెనుక నించోబెట్టుకున్న దుర్గాంబ, సుభద్రమ్మ అందుకున్నారు.

"ఏమ్మా! పెదనాన్న నీకు తండ్రి లాంటి వాడు, అలా వేసుకోవడంలో తప్పేంటి" అంది సుభద్రమ్మ.

సావిత్రి మనసా వాచా కర్మణా కట్టుపడిపోయింది చేసుకున్నవాడికి. 'పెళ్లి అయిన తర్వాత భర్తది కాకుండా ఇంకో ఇంటి పేరు పెట్టుకోవడమేమిటి? అంటే భర్త లేనట్టేగా' ఇలా ఊహించుకొని చాలా డీలా పడిపోయింది.

గది తలుపులు వేసుకొని, చాముండికి ఫోన్ చేసింది. "చాముండీ! నాకు ఒక పనిచేసి పెట్టు, ఆయన దగ్గరికి వెళ్లి ఓ విషయం చెప్పాలి చామూ ప్లీజ్...."అంది.

"చాముండి దొంగతనాలకైనా దిగుతుంది కాని అతగాడి దగ్గరకు వెళ్లదు."

"ఏడ్చావులే, నేనింత ఆదుర్దాగా చెపుతుంటే నిష్ఠూరంగా చెప్తావే, అసలు విషయం కూడా వినవే."

"విషయం ఏంటో చెప్పు."

"నన్ను 'కన్యాశుల్కం' సినిమాకు కె.సావిత్రి అని వేసుకోమంటున్నాడు పెదనాన."

"వేసుకో, లేకపోతే అనుమానమొస్తుంది. వచ్చినా ఫర్వాలేదులే అంటే నీ ఇష్టం."

"ఎలా వేసుకోను, ఆయనకు ఏమని చెప్పను?"

"ఆయన అడిగితే గదా, చూసినా కూడా పట్టించుకోడు. నేను హామీ ఇస్తున్నా. ఆయనకి ఉన్నవీ లేనివి అన్నీ నువ్వు కల్పించుకొని బాధపడిపోక, అనవసరంగా మీ పెదనానతో పోట్లాట పెట్టుకోకు. నిన్ను నమ్ముకున్న నిర్మాతలు పోతారు".

"నీకు నా బాధ పట్టటం లేదు చాముండి, నిర్మాతల బాధలు పట్టించుకుంటున్నావు."

"సావిత్రి ప్రస్తుతం మీ పెదనాన చెప్పింది చెయ్యి" అని గట్టిగా చెప్పింది చాముండి.

గత్యంతరం లేక పి. పుల్లయ్యకి ఫోన్ చేసి విషయం చెప్పింది సావిత్రి.

వెంకట్రామయ్యచౌదరి కూడా విన్నాడు. మొదటి పరీక్ష నెగ్గింది. 'అయితే పెళ్లి దాకా రాలేదన్నమాట. వట్టి ఆకర్షణన్నమాట. దీన్ని మొగ్గలోనే తుంచివేయాలి' అనుకున్నాడు.

సావిత్రి తర్వాత రోజు 'కన్యాశుల్కం' సెట్స్ మీద ఉంది, అక్కడికి చాముండి వచ్చింది. చాలా చిరాగ్గా ఉన్న సావిత్రిని చూసింది.

"పని మీద మనసు పెట్టు ఈ కాస్త దానికి నీ పాతివ్రత్యానికి భంగం కాదులే" అంది చాముండి.

ఈ లోపల అసిస్టెంటు డైరెక్టరు విశ్వేశ్వరరావు వచ్చి, "మేడమ్... మీ చేతి గాజుల వరుస నిన్న వేసుకున్నలాగా లేదండి. ఈ వరుసలో వేసుకోండి" అని చెప్పారు. సావిత్రి విచిత్రంగా చూసింది నాలుగు గాజుల వరుసని, ఇంత ముఖ్యమైనదా అన్నట్టు. "ఇదేమన్నా కలర్ పిక్చరా?" అని అడిగింది.

మీరు మార్చుకోవలసిందే అనే ధోరణిలోనే... మార్చుకోకపోతే బ్లాక్ అండ్ వైట్ సినిమా అయినా ఎలా తేడా కనిపిస్తుందో చెప్పారు విశ్వేశ్వరరావు.

సావిత్రి చిరాకులో ఉండి "షాట్‌కి ముందు మార్చుకుంటానులెండి" అంది.

షాట్‌కి అంతా రెడీ అయింది, డైరెక్టర్ పుల్లయ్య 'రెడీ' చెప్పారు. అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు వెంటనే 'కట్ 'చెప్పారు. అందరూ ఆశ్చర్యపోయారు. పుల్లయ్య గట్టిగా, "ఇటురా.. నువ్వా నేనా డైరెక్టర్? ఏంటి నేను రెడీ అన్నాను కదా, అంతకు ముందుదాకా ఏం చేశావ్... ఇప్పుడు కట్ అనటానికి" అని అరిచారు.

విశ్వేశ్వరరావు సావిత్రి గాజులు విషయం చెప్పారు.

"ఏమ్మా, మార్చుకుంటానని మార్చుకోలేదేం, అతడు చెప్పాడు గదా?"

సావిత్రికి అప్పుడుగాని గుర్తు రాలేదు గాజుల విషయం. మారు మాట్లాడకుండా గ్రీన్‌రూమ్‌కు వెళ్లిపోయింది.

అక్కడే ఉంది చాముండి. గాజులు తీస్తుంటే ఏడుపొచ్చినంత పనైంది సావిత్రికి.

"చాముండి నువైనా గుర్తు చేయొచ్చు కదా. అందరిలో ఎంత తలవంపు. నాకేదో మనసు బాగోలేదు ఈరోజు, నీకేమైంది?"

"నాకూ అంతే, షాక్ నుంచి ఇంకా తేరుకోలేదు తల్లీ."

"ఆ అసిస్టెంట్ డైరెక్టర్ ఏమనుకుంటాడు? నాకు పొగరు అనుకుంటాడు."

"ఆ మాత్రం పొగరు లేకపోతే ఎలా? ఇప్పుడు సింగిల్ స్టార్ కూడా కాదు డబుల్ స్టార్‌వి."

"చామూ ఈ స్టార్ వాల్యూ వల్ల నేనేమి పొగరును దరిచేరనివ్వలేదు. పొద్దున్నే లేవగానే నేను గుర్తు చేసుకునేది అదే. నటన, అందం, నాకు దేవుడు ఇచ్చిన వరాలు. వాటిని అడ్డుపెట్టుకొని కాని పనులు చేసి వాటికి తుప్పు పట్టించను" అంటూ పరిగెత్తుకుంటూ సెట్‌కు వెళ్లిపోయింది.

1955, జులైలో 'కన్యాశుల్కం' విడుదలయ్యింది. రాబడిపరంగా కాస్త వెనకబడినా అంతా బ్రహ్మాండమైన కళాఖండం అని మెచ్చుకున్నారు. సావిత్రి నటనా వైదుష్యాన్నంతా బయటపెట్టిన సినిమా. సావిత్రికి తరవాత వచ్చిన సినిమాలకు భిన్నంగా ఈ చిత్రంలో సావిత్రి ఏడవదు. అందరినీ ఏడిపిస్తుంది. సావిత్రి ఏడిస్తే చూడలేనివాళ్లకు ఈ సినిమా చూపించాలి.

1955లో విడుదలయిన సినిమాలన్నీ బ్రహ్మాండమైన సినిమాలే. ఒకటి తర్వాత ఒకటి హిట్‌లు. సావిత్రి... సావిత్రి... సావిత్రి... నిర్మాతలు, దర్శకులు, హీరోలు, ప్రజలు అందరికీ సావిత్రి జపమే.

వెంకట్రామయ్యచౌదరికి కూడా సావిత్రి జపమే.

సావిత్రి, జి.జి. ప్రేమలో పడ్డారని, సావిత్రి సినిమా వ్యవహారాలన్నీ అతనే చూస్తున్నాడనీ, త్వరలో పెళ్లి చేసుకుంటారని అందరూ అనుకుంటున్నారు.

కాని వెంకట్రామయ్యచౌదరి చక్కబెట్టుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయి. 1955లో ఒక రాత్రి భోజనాలు అయ్యి అందరూ కూర్చున్నప్పుడు "అమ్మాయ్ సావిత్రి నువ్వు పెళ్లి ఏమన్నా చేసుకోదల్చుకున్నావా..." అని మొదలు పెట్టాడు వెంకట్రామయ్యచౌదరి.

సావిత్రి మాట్లాడలేదు. "నీకు ముప్ఫై ఏళ్లు వచ్చేదాకా పెళ్లి చేయదలచుకోలేదు" అన్నాడు ఆయనే మళ్లీ.

"నా పెళ్లి మీరు చేసేదేమిటి? ముప్ఫై ఏళ్ల వరకు నేనెందుకు చేసుకోకుండా ఉంటాను. నా ఇష్టం వచ్చినప్పుడు నేను చేసుకుంటాను" అంది సావిత్రి.

"అవునే నా ఇష్టం వచ్చినట్టు నేనూ మిమ్మల్ని ఆ చిన్నతనంలోనే వదిలేస్తే ఈపాటికి పాచిపనులు చేస్తుండేవాళ్లు".

"నువ్వు కారు తోలుతూ ఉండేవాడివి" ఠక్కున బదులిచ్చింది సావిత్రి.

వెంకట్రామయ్యచౌదరికి అహం దెబ్బతింది.

"ఇంట్లో పెట్టుకొని, డాన్స్ నేర్పించి, సినిమాల్లోకి తీసుకొచ్చాననే విశ్వాసం కూడా లేదే నీకు."

"విశ్వాసం ఎందుకు లేదు. చాలా ఉంది. ఇప్పటికి కూడా అన్ని విషయాలు నావే అంటే ఎట్లా" స్థిరంగా అంది సావిత్రి.

"అవును... నిన్ను ఇంత దాన్ని చేశాను గనుక, నిన్ను పెళ్లిచేసి పంపించేంత వరకూ నాదే అధికారం" హూంకరించాడు వెంకట్రామయ్యచౌదరి.

"అధికారం లేదు, వంకాయ లేదు" అంది తాపీగా సావిత్రి, లేచి గదిలోకి వెళ్లబోయింది.

వెనక నుంచి పిడిగుద్దులు పడ్డాయి వీపు మీద "అమ్మా... అమ్మా" అని అరిచింది. ఆ అరుపులకు పక్కనే ఉండి వింటున్న పరివారమంతా వచ్చి వెంకట్రామయ్యచౌదరిని ఆపారు.

అందరిని విదిలించుకొని సావిత్రి చంపలు వాయించి వచ్చాడు. "నువ్వు ఎవరి అండ చూసుకొని ఇలా పెట్రేగి పోతున్నావో నాకు తెలుసే, ఆగు తుపాకి తీసుకువచ్చి నిన్ను, వాడిని కాల్చి పడేస్తాను" అంటూ లోపలికి వెళ్లాడు.

అందరూ వారిస్తూ లోపలికి వెళ్లారు.

"ఈయన గన్ కూడా కొనిపారేశాడా నా డబ్బుతో, దాంతో నన్నే కాలుస్తాడా" వెర్రిదానిలాగా అరుస్తూ కారెక్కి నేరుగా జి.జి. ఇంటికి వెళ్లింది. అప్పుడు రాత్రి పదకొండున్నర.

మొదటి భార్యతో ఉన్నాడు జి.జి. సావిత్రిని చూడగానే అదిరి పడ్డాడు. అప్పటికే వీళ్ల కథ మొదటి భార్య దాకా చేరింది.

పెద్దగా ఎరగనట్లు, "ఏమిటి ఇలా అర్ధరాత్రి వచ్చారు, ఇటు నుంచి ఏమైనా వెళుతున్నారా?" అని అతి మర్యాదగా అడిగాడు.

"మా పెదనాన చంపుతానని బెదిరిస్తున్నాడండీ, ఇంట్లో పెద్ద గొడవయ్యింది" అంది పైకి పైకి వస్తూ.

జి.జి. దూరం జరుగుతూ "అయితే వెళ్లి పోలీసు కంప్లయింట్ ఇవ్వండి వాళ్లే చూస్తారు" అంటూ బయటకు దారి చూపాడు.

అంతలో అతని మొదటి భార్య అలిమేలు కలగచేసుకుని, "అర్ధరాత్రి పూట ఇంకెక్కడికి పంపిస్తారు వంటరిదాన్ని, రేపు వెళుదువులే సావిత్రి, రా పడుకో" అంది.

ఒక గది ఇచ్చింది అలిమేలు. సావిత్రి నిద్రపోయే లోపల ఒక నిర్ణయానికి వచ్చి పడుకుంది.

★ ★ ★

సుభద్రమ్మ చేతిలో సావిత్రి ఫోటో ఉంది. "నేను నమ్మను బావగారు, తల్లిని నాతో చెప్పకుండా అది ఇంత పని చేయదు".

"అదే అంటోంది నేను కూడా, నీకు చెప్పకుండా చేయదు, నీకు కచ్చితంగా తెలుసు".

"మీ మీద ఒట్టు బావగారు".



**1955 'కన్యాశుల్కం' డా॥ గోవిందరాజుల సుబ్బారావుతో**



'కన్యాశుల్కం' సెట్ మీద

"నా మీద ఎందుకులే తల్లీ, నీ కూతురు సగం ముంచింది మిగతా సగం నువ్వు ముంచేద్దువు కాని".

"నా పిల్లల మీద ఒట్టు, నాకు నిజంగా కనీసం ఇష్టపడుతున్నానని కూడా చెప్పలేదండి".

"ఇంకేం మిగిలింది అది చెప్పటానికి. అన్నీ ఈ ఫోటోనే చెపుతుందిగా."

"ఎంతపని చేసింది" బాధ పడింది సుభద్రమ్మ.

మధ్యాహ్నానికి ఇంటికి చేరుకుంది సావిత్రి. తన కోసమే అన్నట్టు అందరూ ముందు గదిలో కూర్చున్నారు.

లోపలికి వచ్చీరాగానే సుభద్రమ్మ ఫోటో చూపించింది. "ఇదా అమ్మా... నేను లక్స్ సబ్బుకి ఇచ్చిన పోజ్, బాగుంది కదూ" అంది.

"మరి ఇదేంటీ?" అని ఫోటోని వెనక్కి తిప్పింది.

వెనుక...... తన సంతకం ఉంది 'సావిత్రి గణేష్' అని. సావిత్రి నాలుక కరచుకుంది.

"ఈ ఫోటో బయటకి ఎలా వచ్చింది, నా గదిలో ఉండాలే" అని ఎగిరింది.

"నా గదిలోకి వెళ్లి నా వస్తువులు కదిలించింది ఎవరమ్మా?" అంది కోపంగా.

"ముందు ఈ గణేష్ ఎవరో చెప్పవే?"

"ఇంత ఆరాతీసిన వాళ్లకి ఆ మాత్రం తెలియలేదా?"

"వాళ్లు ఏదో అంటున్నారు లేవే, నువ్వు చెప్పు సరిగ్గా, ఎవరీ గణేష్?"

"ఎవరేమిటమ్మా, గణేష్ అంటే జి.జి. గారే".

"ఆయన్ని నేను పెళ్లి చేసుకున్నాను".

"ఆc...పెళ్లి చేసుకున్నావా?"

"ఆc... 52 లోనే చేసుకున్నాను".

ఢడేల్‌మని శబ్దం వినిపించింది. సావిత్రి వాళ్ల అమ్మ వైపు చూసింది. ఆమె అక్కడ లేదు. కింద పడిపోయి ఉంది. స్పృహ తప్పింది.

అప్పటికప్పుడు కార్లో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

మెల్లమెల్లగా ఒకరి తర్వాత ఒకళ్లు అందరూ వస్తున్నారు పలకరింపుకు.

"నేను పెళ్లి చేసుకున్నాను అంటే అందరూ ఇలా పడిపోతారేంటి చాముండీ...." అడిగింది సావిత్రి.




జూన్ 1956 'సినిమా రంగం' పత్రిక నుంచి

చాముండి ఏమీ మాట్లాడలేదు. పెదాల మధ్య నవ్వు ఆపుకోలేక మొహం కప్పేసుకుంది.

"ఏంటి చామూ, నీకు నా అవస్థ చూస్తుంటే నవ్వొస్తుందా?"

"నీ అవస్థ దురవస్థ కాదు సావిత్రి. మీ సినిమాలో లాగా, నిన్నొకచోట, అతగాడిని ఒకచోట పెడితే దురవస్థ. అవేమీ లేకుండా ఎంచక్కా పెళ్లి చేసుకుంటిరి. అతడి తెలివో నీ తెలివో కాని పెళ్లి కూడా రిజిస్టర్ చేయించితిరి."

"నీ కాళ్లు అక్కడిదాక్కూడా వెళ్లాయా?"

"ఆం..." అంది చాముండి.

అంతలోకి దుర్గాంబ వచ్చింది వీళ్ల దగ్గరకు, "నీకు బుద్ధిలేకపోతే అతగాడి బుద్ధి ఏమైంది? రెండో పెళ్లి వాడెందుకే నీకు, నీకేం ఖర్మే?"

"నువ్వు చేసుకోలా రెండో పెళ్లివాడిని. నువ్వు చేసినదానికన్నా ఘోరమా ఇది" కడిగేసింది సావిత్రి.

"నాకు గతిలేక చేసుకున్నానే?"

"నేనూ గతిలేకే చేసుకున్నాను."

"నీకు గతిలేక అంటావేమిటే? నీకేం తక్కువే? ఒక అందం తక్కువా? ఆస్తి తక్కువా?" ఇంకా ఏవేవో అనేసి వెళ్లిపోయింది.

"చాముండీ ఇక నేను వీళ్లతో వేగలేను. నాకవసరం లేదు. వాళ్లు వాళ్ల హద్దులు మీరుతున్నారు" తన నిర్ణయాన్ని బయటపెట్టింది సావిత్రి.

'పెళ్లి చేసుకున్న సావిత్రి – జి.జి.కి మూడో భార్యగా వెళ్లిన మన తెలుగింటి ఆడపడుచు' ఇవి పత్రికల్లో శీర్షికలు.

1956లో ఒకరోజు సావిత్రి, జి.జి. ప్రెస్ వాళ్లందరినీ పిలిచి వాళ్లిద్దరూ కలిసిదిగిన ఫోటోలు కూడా ఇచ్చి పబ్లిక్‌గా తన పెళ్లి అనౌన్స్ చేసింది. ఇక కలిసి ఉండబోతున్నట్లు ప్రకటించింది.

పత్రికా ప్రతినిధులకు బోలెడన్ని సందేహాలు. జి.జి.కి ఒక భార్య ఉంది, ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని సావిత్రికి తెలుసా. తప్పకుండా తెలిసే ఉంటుంది. అయినా చేసుకుంది. పోనీ హిందూ మ్యారెజెస్ యాక్ట్ కింద రెండోపెళ్లి నేరం అని తెలుసా. తప్పకుండా తెలుసు. కాని హిందూ మ్యారెజెస్ యాక్ట్ అమల్లోకి వచ్చింది 1955లో,1955కు ముందు జరిగిన పెళ్లిళ్లకు ఈ చట్టం వర్తించదు.అందుకని ఈ చట్టం గొడవ కూడా లేదు.



**1956లో పత్రికలకు విడుదల చేసిన ఫోటోలు**



సరే రెండవది, పుష్పవల్లితో కూడా ఇతనికి పెళ్లయిందని తెలుసా ఈవిడకి. ఇలా ముగ్గురితో ఒకేసారి కాపురం చేస్తే ఎవరికీ అభ్యంతరం లేదా?

అదేదో కాంట్రాక్ట్ మ్యారేజ్ వీళ్లది అని వినవస్తుంది. అటువంటిదేమైనానా?

ఒక ఆడపిల్లని ఇలా పదిమందిలో నిలదీయటం ఇష్టం లేక సావిత్రి చెప్పింది, వాళ్లు చూసింది మాత్రమే రాసుకొని వెళ్లారు.

1952లో 'మనంపోల్ మాంగల్యమ్' నిర్మాణంలో ఉన్నప్పుడు, ఒక గుడిలో సావిత్రి, జి.జి.తో తాళికట్టించుకుని, దండలు మార్చుకున్నారు. శాస్త్రోక్తంగా పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకున్న సావిత్రి, తిరుపతిలో పెళ్లి చేసుకోవటానికి బయలుదేరింది. సావిత్రి తరఫున దుర్గాంబ తోడుగా వెళ్లింది.

★★★

"ఏమ్మా చాముండీ, ఆరోజు నేను వీళ్లని ఆదుకోపోతే వీళ్లు ఏమయ్యేవాళ్లు. నేను ఉద్యోగం మానుకొని చెప్పులు అరిగేటట్లు దీనికోసం తిరిగాను. నా సంపాదన వదులుకున్నాను. పెళ్లానికి పుస్తె కూడా చేయించలేకపోయాను. అది సంపాదించిన దాంట్లో నాకు కచ్చితంగా హక్కు ఉంది. కుక్కకి పారేసినట్లు రెండు బిస్కెట్ ముక్కలు పారేస్తే ఊరుకునేది లేదని చెప్పు నీ దోస్త్‌కి, అన్నీ ఆలోచించి లెక్కకట్టి ఇవ్వమను"వెంకట్రామయ్య చౌదరి చాముండి దగ్గర అర్జీ పెట్టుకున్నాడు.

"ఆఖరికి దాన్ని అడుక్కోవాల్సి వస్తోంది. నా తరుపు మాట్లాడడానికి కూడా ఎవరూ లేరు" అంటూ సుభద్రమ్మ వైపు కొరకొరా చూశాడు.


"అదేంటి బావగారు మిమ్మల్ని ఒంటరిగా వదిలేస్తానా? నా అక్క, మీరు, డబ్బు రాగానే పరాయి వాళ్లయ్యారా? నేను మాట్లాడతాను దానితో" అంది సుభద్రమ్మ.

చాముండి సావిత్రి బట్టలన్నీ సర్దింది. సర్దటం అయిం తర్వాత ఫోన్ చేసింది స్టూడియోకి. సావిత్రి వచ్చింది. బ్యాగ్‌లు అన్నీ కారులో పెట్టించింది. "అమ్మా నువ్వు బయలుదేరు, నువ్వు సర్దుకోలేదేం" అంది.

"ఎలా వస్తానమ్మా వీళ్లందరినీ వదిలి, అక్కడికి ఎందుకులే. వస్తూ పోతూ ఉంటాను," 'నువ్వు వెళ్లిరామ్మా 'అనబోయిందల్లా వెంకట్రామయ్యచౌదరిని చూసి "నువ్వు వెళ్లు" అంది.

"సరేనమ్మా! నన్ను వదిలేయకు, వెళ్లొస్తాను" అంటూ కదిలింది సావిత్రి.

దుర్గాంబ, మారుతి బయటకి వచ్చి సాగనంపారు. వెంకట్రామయ్యచౌదరి లోపలికి వెళ్లిపోయాడు.



తిరుపతిలో పెళ్లి చేసుకున్న తరువాత అక్కడ తీయించుకున్న ఫోటోలు



1956లో అభిరామపురంలోని నాలుగో వీధిలో 400 రూపాయలకు ఇల్లు అద్దెకు తీసుకొని దాంపత్య జీవితం మొదలుపెట్టారు సావిత్రి, జి.జి..

సుభద్రమ్మ ఉంటున్న ఇంటి అద్దె సావిత్రే చెల్లించేటట్టు.., అదే ఇంట్లో వెంకట్రామయ్య చౌదరి కుటుంబం కూడా కొనసాగేటట్లు.. ఆయన పెట్టిన పెట్టుబడులు అన్నీ పూర్తయ్యేటట్లు చూసి, అవన్నీ అతనికి చెందేటట్లు, సుభద్రమ్మ, మారుతి దగ్గర ఉన్న విలువైన వస్తువులు కూడా సావిత్రికి వెంటనే తెలియకుండా వెంకట్రామయ్యచౌదరికి పోయేటట్లు...... ఎందుకంటే తర్వాత ఎట్లాగు తల్లిని, అక్కను తప్పకుండా చూసుకుంటుంది, వాళ్లకు మాత్రం ఒక్కసారి సెటిల్‌మెంట్ చేసిందటే ఇక మళ్లీ పెద్ద ఆస్తులు ఇచ్చే ప్రసక్తి ఉండదు కనుక..ఇలా ఒప్పందం కుదిరింది.

వరుసగా మూడురోజులు సావిత్రి షూటింగులకు సెలవు పెట్టింది.

చాముండి స్టూడియోల్లో వట్టిగానే పచార్లు చేయసాగింది.

"ఏమ్మా ఇక నువ్వు వెళ్లరాదు. ఇంక నువ్వేమి అవసరం ఆ అమ్మాయికి" అన్నారు సుందరం, చాముండితో.

"మాస్టారు మీకు తెలియదా, నా అవసరం అంతా ఇప్పుడే సావిత్రికి, ఇప్పుడు సావిత్రి వెళ్లమన్నా నేను వెళ్లను. చిన్నపిల్ల, పసిపిల్ల, నీటి బుడగను చేతిలోకి తీసుకుంది" అంది చాముండి.

★★★

1956లో 'మాయాబజార్' షూటింగు 'వాహిని'లో జరుగుతోంది. పొద్దునే ఏడు గంటలకల్లా సావిత్రి 'వాహిని'కి వచ్చేసింది. వాహినిలో షూటింగు మొదలైంది. మేకప్ వేసుకొని కె.వి.రెడ్డితో ఆరోజు మొదటి సీను గురించి తెలుసుకుంటోంది. ఇంకో గంటకి మిగతా టెక్నీషియన్లు, ఆర్టిస్టులు వచ్చారు.

సావిత్రి సెట్‌లోకి అడుగుపెట్టింది మొదలు అందరి చూపులు సావిత్రి వైపే. వీరంతా సావిత్రిని తన్మయత్వంతో చూస్తారు. ఆరాధనతో చూస్తారు. ఆమె మొహం మీద కదలాడే భావాలతో వీరు మమేకమై పోతారు. సావిత్రి నవ్వితే, వాళ్లకు తెలియకుండానే నవ్వేస్తారు. సావిత్రి ఆశ్చర్యం ప్రకటిస్తే వీళ్ల ముఖ కవళికలు అలానే మారిపోతాయి.

అలా చూస్తూ ఉన్న వాళ్లలో మార్కస్ బార్ట్లీ ఒకరు. పక్కన చక్రపాణితో చెప్తున్నారు. "చక్కన్నగారు, నేను ఎంతమందిని చూడలేదు? కొంతమంది అందంగావుంటారు, కాని నటన ఉండదు. కొంతమందికి నటన ఉంటుందిగాని, అందం ఉండదు. కొంతమందికి

శారీరకంగా లేదా మానసికంగా ఏదో ఒక లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కానీ సావిత్రి మాత్రం అన్ని కోణాల్లోనూ అనుగుణమైన నటి. ఐ హ్యావ్ నెవర్ కాట్ హర్ ఎట్ ఎ రాంగ్ యాంగిల్."

చక్రపాణి అక్కడ నుంచి కళాదర్శకుడైన మాధవపెద్ది దగ్గరకు వచ్చారు. మాధవపెద్ది ముందు 'మాయాబజార్' సెట్టింగ్‌ల స్కెచ్‌లు చాలా ఉన్నాయి. కాని అప్పుడు మాత్రం ఒక ఫుల్‌స్కేప్ సావిత్రి స్కెచ్‌ను గీస్తున్నారు. దూరంగా ఉన్న సావిత్రిని చూస్తూ.

"నువ్వు కూడా సావిత్రి జపమేనా నాయనా" అనుకుంటూ మళ్లీ మార్కస్ బార్ట్‌లీ దగ్గరకు వచ్చి ఏవో మాట్లాడుతున్నారు. "ఏంటి చక్కన్నగారు సావిత్రి పెళ్లి చేసుకుందటగా? నౌ ఐ హ్యావ్ కాట్ హర్ ఎట్ ఏ రాంగ్ యాంగిల్" అన్నారు మార్కస్ బార్ట్‌లీ, విజయవారి ఆస్థాన కెమెరామెన్.

ఆ రోజు షెడ్యూల్ పూర్తయింది. "అమ్మాయ్ సావిత్రి ఒక చిన్న పార్టీ ఉంది" అన్నారు కె.వి.రెడ్డి.

"దేనికి బాబాయి గారు"?

"మన స్వరాజ్యలక్ష్మి వెళ్లిపోతోందమ్మా! ఇంకా పుష్పలత, లక్ష్మీకాంత, రాజ్యం, మాలతి ఇలా రిటైర్ అయినవాళ్లు, అవుతున్నవాళ్లని కూడ మనకు తోచినంతలో కాస్త డబ్బు రూపంలో ఇచ్చి సాగనంపుదామని పార్టీ అరేంజ్ చేశాం".

"చాలా మంచిది బాబాయి గారు, అయితే నా పారితోషికం తీసుకోండి. నేను చక్కన్న గారికి చెప్తాను మీకు ఇచ్చేయమని."

"అయ్యో పారితోషికం అంతా ఎందుకమ్మా దాంట్లో కొంచం తీసుకుంటాలే. ఇంకా మిగతావాళ్లు కూడా ఇస్తారుగా".

"ఫరావాలేదండీ, తీసుకోండి, స్వరాజ్యలక్ష్మికి నా తరుఫున ఎక్కువ ఇవ్వండి" అంది సావిత్రి.

సావిత్రికి ఈ డబ్బు ఒక లెక్కలోకి రాదు. ఇటు తెలుగు అటు తమిళంలోనూ సినిమా మీద సినిమా చేస్తుంది. స్టూడియో, ఇల్లు మళ్లీ స్టూడియో, ఇక ఇదే పని. రోజుకో ఐదువేల రూపాయలు డబ్బు వచ్చి పడటమే. ఇంత డబ్బు రావడంతో స్వతహాగా జాలిగుండె అయిన సావిత్రి ఏదైన మంచిపనికి ఎక్కువగా డబ్బులు ఇచ్చేసేది. స్టూడియోల్లో, ఆఫీస్ బాయ్‌లు మొదలు, లైట్ బాయ్‌లు, అసిస్టెంట్‌లు ఇలా దిగువన పనిచేసే వాళ్లంతా సావిత్రిని ఆర్థిక సహాయం అడిగేవాళ్లు. కాదనకుండా వీళ్లందరికీ వెయ్యి, రెండువేలు ఇచ్చేది. ఇలా చేసిన సహాయాలకి ఒక అంతు లేదు, లెక్క లేదు.

ఓ ఆదివారం, ఆ నటీమణులను సాగనంపే రోజు వచ్చింది. అప్పటి నటీమణులు చాలామంది వచ్చారు. సావిత్రిని చూడగానే అందరూ లేచారు. కూర్చుండిపోయిన ఒక్క నటి కూడా అందరూ లేచినందుకు తప్పదన్నట్లు లేచింది. కొంతమంది ఆరాధనతో లేస్తే, కొంతమంది, సావిత్రికి వాళ్లు అందుకోలేనంత టాలెంట్ ఉన్నందుకు, ఆ టాలెంట్‌ని గౌరవిస్తూ లేచారు. "ఇది సావిత్రి యుగం తల్లీ, ఆమె తలచుకుంటే ఆమె సినిమాలో సెకండ్ హీరోయిన్ రోల్ అయినా వస్తుంది. ఆమెతో పోటీ పడటం అనవసరం" అనుకుంటూ ఇంకొంతమంది లేచారు.

మొత్తానికి అందరూ లేచి నిలబడ్డారు.

సావిత్రికి రెండో శ్రేణికి చెందిన నటీమణులు ఫలహారాలు అందించారు. ఖాళీ అయిన ప్లేటు సైతం వాళ్లు తీసుకున్నారు. ఇది సావిత్రి ప్రాభవానికి మొదలే. ఆ ఫంక్షన్‌లో ఎంతోమంది నటీమణులు ఉన్నారు. అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టేవాళ్ల దగ్గర నుంచి స్థిరపడ్డవాళ్లు, కన్నాంబ లాంటి సీనియర్లు ఉన్నారు. అందరూ ఆడవాళ్లయినా అందరి చూపులు సావిత్రి మీదే. ఆవిడ కళ్ల దగ్గర నుండి, అలా ముక్కు దగ్గరకు, అక్కడ నుండి పెదవుల దగ్గరకు వెళ్లాయి వారి చూపులు. చివరకు ఎక్కడ ఆగాలో తెలియక తికమక పడుతున్నాయి వారి చూపులు. ఆ మోహంతోపాటు ఆ ఐదడుగుల అరంగుళాల నిండైన విగ్రహం ఈ ఆడవాళ్లనే కట్టి పడేసింది.

"ఏకై వచ్చి మేకై కూర్చుంది" ఒక మూల నుంచి వినిపించింది. సావిత్రి నవ్వుకుంది.

"వీళ్లందరూ ఇళ్లకు వెళ్లిపోతున్నారన్నా, నేను సీనియర్‌నై ఉండి ఈవిడ సినిమాల్లో సెకండ్ రోల్ వేయాల్సివస్తుందన్నా కారణం ఈవిడ కాదూ" అంది ఇంకో నటి.

"ఆమేమన్నా మిమ్మల్ని నెట్టేసిందా, ప్రొడ్యూసర్‌లు, డైరెక్టర్‌లను కాకాబట్టి మిమ్మల్ని సినిమాలోంచి తీయించేసిందా, ఆ అమ్మాయికున్నవి మీకేమన్నా ఉన్నవా? ఒక నాలుగోవంతయినా ఉందా మీకు" అంది ఒక హాస్యనటి.

"కనీసం మర్యాదైనా లేదు మీకు. ఆ అమ్మాయిని ముందు కూర్చోబెట్టుకొని వినిపించేటట్లు మాట్లాడుతున్నారు" అని అరిచింది.

కె.వి.రెడ్డి వచ్చి కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. వెళ్లిపోయేవాళ్ల అందరి గురించీ ఆయన మాట్లాడారు. అందరినీ శాలువాతో సత్కరించి, పట్టుబట్టలు పెట్టారు. ఆ తరువాత వెయ్యినూటపదహారులు చదివించారు.

చివరలో "ఈ కార్యక్రమానికి దాదాపు మూడొంతులు డొనేట్ చేసిన సావిత్రి తాను చెప్పొద్దని వారించినా కృతజ్ఞతలు చెప్పకుండా ఉండలేకపోతున్నాను" అన్నారు.

అప్పటిదాకా నిష్ఠూరాలాడిన నటీమణులు నోరొళ్లబెట్టారు. వాళ్లల్లో కొంతమంది ఇచ్చిన విరాళం ఇప్పుడు వాళ్లు తిన్న టిఫిన్‌లకు, కాఫీలకు సరిపోయి ఉంటుంది.

తరువాత రోజు 'మాయాబజార్' షూటింగ్‌లో ఉండగా "ఎందుకు బాబాయి గారు వాళ్లకి నా విరాళం గురించి చెప్పారు, మీరు మంచి ఉద్దేశానికే చెప్పారు గాని వాళ్లు తరువాత ఎన్నెన్ని మాటలు అన్నారో తెలుసా" అంది సావిత్రి కె.వి.రెడ్డితో.

"వాళ్ల మాటలకేంగానీ, గుప్తదానాలు వద్దమ్మా, ఇది గుప్తదానాలు చేసే కాలం కాదు.కనీసం తీసుకున్న వాళ్లకన్నా తెలియాలి కదా ఇచ్చిందెవరో" అన్నారాయన.

"ఏమో బాబాయ్‌గారు, నాకు ఇష్టం ఉండదు" అంది సావిత్రి.

ఆరోజు 'మాయాబజార్'లో 'నీ కోసమే నే జీవించునది' పాట చిత్రీకరణ జరుగుతోంది.

అమ్మాయ్ సావిత్రి "నువ్వు ఈ చరణాలకి ఏడవాలమ్మా. గ్లిజరిన్ తీసుకో" అన్నారు కె.వి.రెడ్డి.

"మీరు మర్చిపోతున్నారు, నాకు గ్లిజరిన్ అవసరం లేదు" అంది సావిత్రి.

"సరే అయితే."

"ఎన్ని కన్నీరు చుక్కలు కార్చాలండి?" అడిగింది సావిత్రి.

ఆశ్చర్యంగా చూశారు కె.వి.రెడ్డి.

"ఎన్ని చుక్కలు కావాలంటే అన్నే కార్చగలవా?"

"ఏ కంటిలోనుంచి కావాలో ఆ కంటిలోనుంచే కార్చగలను కూడా, చెప్పండి ఏ కంటి లోంచి ఎన్ని చుక్కలు కావాలి" ధీమాగా అడిగింది సావిత్రి.

ఈ సంభాషణ జరుగుతుండగా అందరూ పోగయ్యారు. యస్.వి.రంగారావుకి తెలుసు సావిత్రి అలా చేయగలదని.

"అమ్మాయ్, పందెం వేయమంటావా?" అని సావిత్రిని ఉసిగొల్పుతూ అన్నారు యస్.వి. రంగారావు.

"అలాగేనండి, ఏ పందెం" అంది సావిత్రి.

"సరేనా రెడ్డిగారు?" అని కె.వి.రెడ్డిని కూడా తయారుచేశారు.

"పందెం కాస్తున్నాం,పందెం ఏంటో చెప్పండి" అడిగారు కె.వి. రెడ్డి.

"మీ తరువాత సినిమాలో కూడా హీరోయిన్‌గా నన్నే తీసుకోవాలి" అంది సావిత్రి.

సావిత్రి శ్రేయోభిలాషులు ఈ మాటకి తలకొట్టుకున్నారు.

యస్.వి.ఆర్ సావిత్రిని పక్కకు తీసుకెళ్ళి, "ఎక్కడ వెర్రిబాగులదానివే, నువ్వు లేకుండా విజయా వాళ్లు సినిమాలు తీస్తారా? తీయరు. పారితోషికం పెంచమని చెప్పు" అన్నారు.

"అలా ఎలా చెప్పనండీ. నేను గెలుస్తానని కచ్చితంగా తెలిసినప్పుడు, అడ్వాంటేజ్ తీసుకోవడం బాగుండదండీ."

"అందుకనే చెప్తున్నాను, నువ్వు గెలుస్తావని తెలుసు కదా. నేను చెప్పింది చెయ్".

సావిత్రి ఆలోచించింది "నేను అలా చెయ్యలేకపోతున్నానండీ" అంది.

"పిచ్చిదానా, సరేపో" అని కసిరారు యస్.వి.ఆర్.

"ఏంటమ్మా! తండ్రీ కూతుళ్ల ముచ్చట్లు? పందెంకు సయ్యా?" అన్నారు సెట్‌లో ఉన్న ఒకళ్లు.

"పక్కకెళ్లి గ్లిజరిన్ పూసుకొచ్చారేమోనండీ" అన్నారు ఇంకొకళ్లు.

సావిత్రి వచ్చి "బాబాయ్‌గారు, నేను రెడీ" అంది.

"సరేనమ్మా, అంత నమ్మకంగా చేస్తానంటున్నావుగా అందుకని నేను షాట్ కూడా రెడీ చేసుకుంటాను, నువ్వు విరహంతో ఏడుస్తూ ఉంటావు. అభిమన్యుడు వచ్చి ఓదారుస్తాడు. అప్పుడు కెమెరా కుడిచేతివైపు ఉంటుంది. కాబట్టి కుడి కన్నులోంచి మూడు చుక్కలు తెప్పించు. మూడే మూడు. ఎడమ కన్నులోంచి వచ్చినా ఫర్వాలేదులేమ్మా, షాట్ కానిచ్చెయ్."

"ఎడమ కన్నులోంచి రావండీ."

ఒక్కసారి సావిత్రిని చిత్రంగా చూసి, వెళ్లి షాట్‌కి రెడీ అయ్యారు కె.వి.రెడ్డి.

రెండు నిమిషాలు తీసుకుంది సావిత్రి మూడ్‌లోకి రావటానికి. అందరూ ఉత్కంఠతో చూస్తున్నారు.

సావిత్రి కళ్లనే చూస్తున్నారు. కుడి కన్ను, ఎడమ కన్ను మార్చి మార్చి చూస్తున్నారు.

ఏడుపు నటిస్తూ సావిత్రి కుడి కంటి నుంచి సరిగ్గా మూడు చుక్కలే కార్చింది. ఆ తర్వాత కన్నులలో నీరు ఇంకిపోయినట్లు కన్నీరు ఆగిపోయాయి కాని, కంటిలో తడి ఉంది. కన్నీటి చుక్కలు మాత్రం రాలేదు,ఎడమ కంటినుంచైతే అస్సలు చుక్క కారలేదు.

అందరూ ఆశ్చర్యపోయారు.

దర్శక పితామహుడు కె.వి.రెడ్డి కుర్చీలోనే ఉండిపోయారు. "ఏంటో ఉంది, ఏంటో ఉంది ఈ అమ్మాయిలో అని అనుకుంటూ ఉంటాను, ఈ అమ్మాయిలో ఉన్నదేదో ఇప్పుడు

తెలిసింది నాకు, అందరూ నటిస్తారు, సావిత్రి జీవిస్తుంది" అప్రయత్నంగా మనసులో మాట బయటికి వచ్చింది.

1956లో నిర్మాణంలో ఉన్న చిత్రాలు 'వినాయకచవితి', 'భలే అమ్మాయిలు', 'తోడికోడళ్ళు', 'కుటుంబ గౌరవం', 'ఎం.ఎల్.ఏ.', 'మాయాబజార్'.

'తోడికోడళ్ళు' సినిమాలోనే మొదటిసారి పి.సుశీల సావిత్రికి పాటలు పాడింది. అది మొదలు సావిత్రి తన అన్ని సినిమాలకీ వీలయినంత వరకు ఆమే పాడాలని నిర్మాతలకు చెప్పేది. పాటలలో మంచి సాహిత్యం వుంటే, ఆ పట్టు ఇంకా గట్టిగా వుండేది.

'తోడికోడళ్ళు' షూటింగ్ జరుగుతున్నప్పుడు కన్నాంబ సావిత్రి నటనా పటిమను చూసి ముచ్చట పడింది. సావిత్రి నొసటన ముద్దాడి "నువ్వేనమ్మా నా నటవారసురాలివి" అని అంది.

★★★

ఒక ఆదివారం జి.జి. ఉండడని తెలుసుకొని చాముండి సావిత్రి ఇంటికి వచ్చింది.

సావిత్రి తరుపున మొదటి చుట్టం చాముండి. చాలా సంతోషించింది సావిత్రి. అతిథికి చేయాల్సిన మర్యాదలన్నీ మనస్ఫూర్తిగా చేసింది. కుశల ప్రశ్నలయిన తర్వాత చాముండి ఒక పేపర్ సావిత్రి ముందు పెట్టింది. అందులో ఇలా ఉంది......

1952 – సావిత్రి, జి.జి. పెళ్లి.

1954 – జి.జి.కి, పుష్పవల్లికి పుట్టిన మొదటిబిడ్డ. పేరు భానురేఖ.

1955 – ఇటీవలే ఈ ఇద్దరికీ పుట్టిన ఇంకో అమ్మాయి. పేరు రాధ.

హాస్పిటల్‌కు సంభందించిన రికార్డుల్లో జి.జి. సంతకాలు ఉన్నాయి.


'ఏంటివి' అనుకుంటూనే సావిత్రి చూసింది.

క్షుణ్ణంగా చదివింది. రెండోసారి కూడా చదివింది. మొహం మీద ఎలాంటి భావాలు లేవు.కాస్సేపు అంతా నిశ్శబ్దం.కొంచం సేపటి తర్వాత..

"నన్నేం చేయమంటావు చాముండి ఇప్పుడు" అంది.

"ఇవేమీ నాకు ఇంతవరకూ తెలియనట్లు నటించమంటావా, తెలిసీ తెలియనట్లు నటించమంటావా? లేకపోతే ఇప్పుడే తెలిసింది, అయితే ఏం చేద్దాం అని నిన్ను అడగమంటావా?"






'సుందరి నీవంటి దివ్యస్వరూపం' పైన నర్తిస్తూ, క్రింద పాడుతూ


27 విడుదల
విజయ వారి
మాయా బజార్
కె. వి. రెడ్డి, B.Sc.
వాహినీ




తెలుగు 'మాయాబజార్' 1957



తమిళ్ 'మాయాబజార్' 1957



'భలే అమ్మాయిలు' 1957



1957 'తోడికోడళ్ళు' కన్నాంబతో



నోరెళ్లబెట్టింది చాముండి. చాముండికి రెండో షాక్ ఇచ్చింది సావిత్రి.

"మళ్లీ పడిపోకు" అని వారించింది సావిత్రి.

ఆ అరుపుతో ఈ లోకంలోకి వచ్చింది. వెంటనే ఆ పేపర్లు తీసి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకొని "ఇంక బయలుదేరుతాను. మీ పతిదేవులు వస్తాడేమో" అంది.

"కూర్చో చామూ! రాకరాక వచ్చావు, ఇంకేదైనా చెప్పు."

ఆశ్చర్యంగా చూసింది చాముండి. 'వేడివేడి కబుర్లు తీసుకువస్తే ఇంకా వేరేదేమైనా చెప్పాలా?' అనుకుంది.

"అన్నీ తెలిసినదానివి ఇంక నేనేమి చెప్పను నీకు" అంది పైకి.

"చామూ! ఇవన్నీ కలిసి ఉండకముందే. ఇప్పుడు చూడు నా ప్రేమతో ఆయనలో ఎంత మార్పు తెస్తానో."

"కలిసి ఉంటేనే ప్రేమా" అడిగింది చాముండి.

"చామూ, మీరేమనుకుంటున్నారు. మేమిద్దరం సరిగ్గాలేమనా? అలాంటిదేమీలేదు. అందుకనే నిన్నూ, అమ్మనీ వచ్చి మాతోపాటు ఉండమంటున్నది, అప్పుడు మీరే చూద్దురు."

"మీ అమ్మ చూసినా నేను చూడలేనులే తల్లీ మీ ఆయన్ని, మీ ఆయనతో నిన్ను" అంది చాముండి.

"చాముండీ, నీకు ఎందుకో ఆయనంటే ద్వేషం. ఆయన తప్పేమీ లేదే. నేనే ప్రేమించాను అతన్ని."

చాముండి నమ్మలేదు, కరగలేదు.

"సరేలే చామూ, ఈ మాటలకేంగానీ, ఆ ఇంట్లో ఉన్నప్పుడు అయితే స్టూడియో నుంచి వచ్చేదాన్ని, తినేదాన్ని, పడుకునేదాన్ని. ఇప్పుడు అలా కాదు చామూ, ఇంట్లో పెద్దదిక్కు ఎవరైనా ఉంటే బావుంటుంది. అమ్మని ఇక్కడికి వచ్చేయమన్నానని చెప్పు" అంది.

"మీ అమ్మ ఇక్కడికి రావాలంటే గట్టి కారణం కావాలి. నువ్వు తొందరగా ఒక పిల్లాడినో, పిల్లనో కనిస్తే అందరం వస్తాం."

"పిల్లాడే కావాలి చామూ. ఆయనకు ఇప్పటి దాకా ఆడపిల్లలే. నేనయినా మగపిల్లవాడిని ఇవ్వాలి."

"నువ్వు అన్నీ ఆల్ట్రానే సావిత్రి. ఆఖరికి పాతివ్రత్యంలో కూడా ఆల్ట్రా పాతివ్రత్యమే. అదృష్టవంతుడు మీ ఆయన నువ్వు దొరికినందుకు. అప్పుడు ఈ ఇల్లు సరిపోదేమో?"

"మీరు వస్తానంటే అప్పటిదాకా ఎందుకే, ఇప్పుడే ఇల్లు కట్టిస్తాను."

"మంచిది. తొందరగా కట్టించు. నువ్వు చేసిన పని ఎంత ఇష్టం లేకున్నా నిన్ను విడిచి నేనుండలేను" అంది చాముండి.

"ఎంత ఘాటు ప్రేమయో..." అంటూ పాట అందుకుంది సావిత్రి. "అబ్బ ఎన్నిరోజులకి మనసులో ఒక్క మాట, కాదు రెండు మాటలు బయటికి వచ్చాయి" అంది సావిత్రి.

"నువ్వు ఎప్పుడూ సంతోషంగా ఉండాలి సావిత్రి" అంది చాముండి మనస్ఫూర్తిగా.

"అమ్మని ఒక్కసారి రమ్మని చెప్పు. నువ్వు తీసుకురా" అంది సావిత్రి.

★★★

1957లో రిలీజ్ అయిన సినిమాలన్నీ సావిత్రికి అమోఘమైన పేరు తెచ్చిపెట్టాయి. ఇటు తెలుగు ప్రజలు, అటు అరవవాళ్లు ఆమె అసమాన నటనకు, సౌందర్యానికి దాసోహం అన్నారు. నిర్మాతలు సావిత్రి కాదన్నాకే ఇంకో నాయిక కోసం వెళ్లేవారు. హీరోలు 'సావిత్రి అయితేనే మేము ఈ సినిమా చేస్తాం' అనేవారు.

ఆ సంవత్సరం నుంచి సావిత్రికి వచ్చిన పారితోషికం ఇద్దరు అగ్రహీరోలు తర్వాత, హీరో అనిపించుకున్న వారందరి కంటే కూడా ఎక్కువే.

డబ్బు కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతోంది. లెక్కపెట్టే తీరిక లేదు, ధ్యాస లేదు. అన్నీ తెచ్చి బీరువాలో పడేసి, ఆ బీరువా తాళం ఎప్పుడూ నడుముకు పెట్టుకునేది. బీరువాలో డబ్బు సర్దడానికి దాంట్లో ఉన్న బట్టలు బయటికి తీయాల్సి వచ్చేది. అలమారలు కూడా చాలకపోవడం వల్ల చిరాకేసేది. ఒకసారి ఆ డబ్బు, బయట ఉన్న బట్టలు చూసి ఇక ఇల్లు కట్టుకోవడానికి నిశ్చయించుకుంది. 1957లో టి.నగర్‌లోని హబీబుల్లారోడ్‌లో ఒక ఇల్లు కట్టడం మొదలైంది.

ఒక ఆదివారం సుభద్రమ్మ, మారుతి, చాముండి వచ్చారు.

"అమ్మా ఇల్లు కాగానే మీరందరూ వచ్చేయాలి. మిమ్మల్ని దృష్టిలో పెట్టుకునే ఇల్లు కట్టిస్తున్నాను. మీకు విడివిడిగా గదులు కట్టిస్తున్నా" అంది సావిత్రి.

"లేదులేమ్మా. మీ పెదనాన కోపం ఇంకా తగ్గలా. ఆయన కోసం కాకపోయినా అమ్మ కోసమైనా మనం తగ్గాలి. నువ్వు కన్న తర్వాత ఆ నెపంతోనైనా వచ్చేస్తాను."

"ఇంకెందుకు కోపం, ఆయన కొన్న ఆస్తులన్నీ వచ్చాయిగా? ఎన్ని కొనిపించాడో తెలుసా అమ్మా?"

"పోనీలేమ్మా మనకు లేకపోతే గదా" అంది సుభద్రమ్మ.

★★★

1957, 1956 కంటే బిజీ.

'అప్పుచేసి పప్పుకూడు', 'ఇంటిగుట్టు', 'కుటుంబగౌరవం', 'కార్తవరాయుని కథ' షూటింగ్ అవుతున్నాయి, పైగా ఇంటిపని.

1958, మార్చి 1న టి.నగర్‌లో హబీబుల్లా రోడ్‌లో సావిత్రి కొత్త ఇల్లు గృహప్రవేశం జరిగింది. తెలుగు, తమిళ సినిమా పరిశ్రమ యావత్తు ఆ రోజు సావిత్రి ఇంటికి తరలి వచ్చింది. కేరళ నటుడు ప్రేమ్‌నజీర్ కూడా వచ్చాడు. తన ఇంటి ముందు రోడ్ కాకుండా అటు రోడ్డు, ఇటు రోడ్డు కూడా కార్లతో నిండిపోయింది. అతిధులు తెచ్చిన బహుమతులతో కింద హాలు అంతా నిండిపోయింది. రంగురంగుల లైట్లు, తమని తాము ఎంతో తీర్చిదిద్దుకున్న తారలతో సావిత్రి ఇల్లు స్వర్గ రూపం దాల్చింది. గృహప్రవేశం అయిన తర్వాత రోజు సాయంత్రం కమలా లక్ష్మణ్ నృత్య ప్రదర్శన. ఆ తర్వాత యస్.బాలచందర్ వీణ కచేరి. సావిత్రి ఆయన కచేరికి ఆద్యంతం తాళంవేస్తూ కూర్చునే ఉంది. తోడు పద్మిని కూడా ఉంది. అక్షరాలా 1500 మందికి విందు. సావిత్రి ఎవరినీ విడిచి పెట్టలేదు. అందరినీ స్వయంగా వెళ్లి పిలిచింది. తనని మొట్టమొదట ఫోటోలు తీసిన నాగరాజారావు దగ్గర నుంచి 'అగ్నిపరీక్ష'కు మేకప్ వేసి వేసి అలసిన మేకప్‌మెన్ దాకా అందరినీ పిలిచింది.

ఎప్పటినుంచో సావిత్రి మీద గుర్రుగావున్న వెంకట్రామయ్యచౌదరి, పిలవగా గృహప్రవేశానికి వచ్చాడు. అప్పటినుంచి వెంకట్రామయ్యచౌదరి, దుర్గాంబ సావిత్రి ఇంటికి వచ్చిపోతూ వుండేవాళ్లు.

అందరికీ సమానమైన మర్యాదలు చేసింది. వచ్చిన ఆడవాళ్లకి కంచిపట్టు చీరలు పెట్టి మరీ పంపించింది సావిత్రి.

ఇంత ఖర్చు చూసి సుభద్రమ్మ, చాముండి నెత్తి నోరు బాదుకున్నారు. ఆ రోజే నిర్ణయించుకున్నారు, ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సావిత్రి పక్కన చేరాలని.

హడావుడి అయింతర్వాత "సావిత్రీ, నా గది ఏదో చెప్పు, రేపే వచ్చేస్తున్నా" అంది చాముండి.

"అదిగో చూడు నేను పై నుంచి చూడగానే నువ్వు కింద కనిపిస్తావు. ఆ ఎదురుదే నీ గది" అంది సావిత్రి.

"చాలా థాంక్స్! రేపే నేను రావటం".

"అలాగే, హారతి పట్టుకొని రెడీగా ఉంటాను" అంది సావిత్రి.

సావిత్రి ఇల్లు తన ఇష్టానికనుగుణంగా తీర్చిదిద్దుకుంది. రోడ్డు మీద మెయిన్‌గేట్ దగ్గరి నుంచి ఇంటికి రావటానికి లాన్‌ల మధ్యనుండి రోడ్డు ఉండేది. కారులో అరనిమిషం ప్రయాణం. ఆ దోవకి అటూఇటు పెద్ద చెట్ల పొదులు, తనకు ఇష్టమైన పూలచెట్లన్నీ నాటించుకుంది, ముఖ్యంగా మల్లెపొదులు. ఇంట్లో ప్రతిగదిలో అత్యంత ఖరీదైన పెయింటింగ్‌లు, పర్షియన్ కార్పెట్లు కొన్నది.

"మద్రాసులోకల్లా నీ ఇల్లే చాలా ప్రశాంతంగా ఉంటుంది సావిత్రి" అనేవారు ఏ.యన్.ఆర్.

ఇంటిముందు చాలా స్థలం వదిలేశారనిపిస్తుంది కాని ఇంటి వెనకాల ఇంతకు మూడింతలు వుంటుంది. ఇంటి ప్రక్కన ఖాళీ స్థలంలో బర్రెల చావిడి, ఎప్పుడు నాలుగైదు పాడిగేదెలు వుంటాయి. సావిత్రి వీటి పాలతోనే చిక్కనైన కాఫీ తాగుతుంది. గేదెలు ఈనినప్పుడు జున్ను ఇష్టంగా తింటుంది. చిక్కని పాలతో స్వీట్స్ ఇష్టపడుతుంది. చావిడికి ఎదురుగా కారుషెడ్స్ వున్నాయి. బైటకు వెళ్లే కారులు బైటే వున్నా, ఇంకా నాలుగైదు కారులు షెడ్‌లో వుంటాయి. ఈ రెండిటికి మధ్య సర్వెంట్ క్వార్టర్స్ వున్నాయి. సావిత్రి ఆస్థానంలో ఎప్పుడూ వుండే పనివాళ్లు; చాకలి, దర్జీ, తోటమాలి, వంటమనిషి, గొడ్ల పనివాడు, కుక్కల్ని చూసుకునేవాడు, ఇంటి పనులు చూసేవాడు, ఇంకా ముగ్గురు డ్రైవర్లు.

టి.నగర్‌లోని హబీబుల్లా రోడ్‌లో కనిపించినంత మేర సావిత్రి సంపద తాండవిస్తుంది. 1958లో కట్టిన ఇంటికి ఇరువైపులా కూడా స్థలం కొన్నది. స్థలాన్ని మొత్తం నాలుగు భాగాలు చేసింది. ఒక భాగం మినహా మూడు భాగాల్లో బంగ్లాలు కట్టించింది. ఒక బంగ్లాలో తను వుంటూ మిగతా రెండు అద్దెకు ఇచ్చింది.

★★★

1958, ఏప్రిల్ 20 నుంచి మే 10 దాకా ఊటిలో 'మాంగల్యబలం' షెడ్యూల్. సావిత్రికి అదే మొదటిసారి ఊటి చూడటం. యూనిట్ అంతా ఉంది. అక్కినేని నాగేశ్వరరావు, సూర్యకాంతం, యస్.వి.ఆర్, కన్నాంబ, రేలంగి ఇంకొంతమంది ఉన్నారు.

ఒక్కరోజు షూటింగ్ అయిందో లేదో ఊటిలో వర్షాలు మొదలయ్యాయి. వచ్చింది అవుట్‌డోర్ షూటింగ్‌కి, ఇంకేం షూటింగ్ అవుతుంది? ఎవరికివాళ్లు లోపల ఉండిపోయి టీ తాగుతూ వేడివేడి వంటకాలు తింటూ హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. అందరూ ఎంతో సంతోషంగా కాలం గడుపుతున్నారు.

సూర్యకాంతం యూనిట్‌లో ఓ కొత్త కుర్రాడిని పిలిచింది. "అబ్బి ఇటురా, ఇదిగో ఇదేంటో చెప్పు" అని చేతులు చూపించింది.

"వేయించిన వేరుశనగపప్పులు అండీ" అన్నాడాబ్బాయి.

"ఇప్పుడు చూడు నేనేం చేస్తానో" అని కుడిచేత్తో ఒక పప్పు ఎగరేసి నోటితో పట్టుకుంది. "నువ్వు చేయగలవా ఇట్లాగా?" అడిగింది.

"అదేం గొప్పండి నేనూ చేయగలను" అన్నాడు.

"ఇది గొప్పని నేననలేదురా, నేను ఎడమ చేత్తో కూడా చేసి చూపిస్తా, అదిరా నా గొప్ప, చూడు" అని, ఎడమ చేత్తో కూడా ఎగరేసి నోట్లో వేసుకుంది. కుడిచేత్తో కంటే ఎడమచేత్తోనే ఇంకా ఎత్తు ఎగరవేసుకుంది.

"చూశావా! ఇప్పుడు అక్కడ మన హీరోయిన్ ఉంది చూడు, ఆ అమ్మాయి చేత కూడా చేయిస్తాను చూడు."

"ఆ అమ్మాయి కూడా ఎడం చేత్తో ఎగరేయగలుగుతుంది. పో నువ్వు వెళ్లి ఆ అమ్మాయి చేతిలో పప్పులు పెట్టు నేను ఈ లోపల మంత్రం వేస్తా పో" అంది.

అతడు సావిత్రి దగ్గరకొచ్చి "మేడమ్... మేడమ్..." అని అన్నాడు. సావిత్రి కళ్లు మూసుకొని సోఫాలో తూలుతూ ఉంది. అక్కడే ఉన్నా కూడా మనసు మనసులో లేదు. అతని పిలుపుకు నీరసంగా లేచి, "ఏంటి?" అని అడిగింది. అతను సూర్యకాంతం వైపు చూపి వేరుశనగపప్పులు చేతిలో పెట్టాడు.

"సావిత్రి, ఏదీ నీ ఎడమచేత్తో వాటిని గాలిలో ఎగరేసి నోటితో పట్టుకుతిను" అంది. "గాలిలో ఐతే ఎగరేస్తాకాని తినను. నాకు తినబుద్ధి కావటంలేదు అంది."

"సరే అయితే, కాని."

సావిత్రి ఎడమచేత్తో ఎగరేసింది, నోట్లో పడిన తర్వాత తీసేసింది.

"చూశావురా అబ్బి నా మంత్రం ఎలా పనిచేసిందో."

"నువ్వు ఎడమచేత్తో చేయగలవా, వెయ్యలేకపోతే చెప్పునీకు మంత్రం వేస్తాను" అంది.

"మీరు మంత్రం వేయకుండానే అలా చేయగలనండీ" అని వాడూ ఎడమచేతి వాటంవాడు అవటం వల్ల వేసి చూపాడు.

"ఓరి భడవా! పరువు తీశావు కదరా!" అంటూ నవ్వుకుంది సూర్యకాంతం. మిగతావారందరు కూడా నవ్వారు. ఇలా సరదాగా కాలక్షేపం చేస్తున్నారు. సావిత్రి మామూలుగా అయితే ఇలాంటి వాటికి ముందు ఎత్తున ఉండేది. కాని ఆరోజు పొద్దుటున్నుంచి ఏంటోలా ఉంది. అంతటి వర్షంలో కూడా గొంతు తడి ఆరిపోతోంది.

సూర్యకాంతం చూస్తూనే ఉంది. చిరుతిండి బాగా ఇష్టపడే సావిత్రికి ఆ వేడివేడి రుచికరమైన వాటిని తినబుద్ధి కావటం లేదు. పైగా అంత చలిలోనూ చల్లని పానీయాలు తాగాలనిపిస్తోంది. అస్సలు బాగోలేదు.

"సావిత్రీ, నా అనుమానమే నిజం" అంది సూర్యకాంతం.

"అయితే అదేనంటావా అక్కా?"

"అదో కాదో ఇక నువ్వే చెప్పాలనుకో, నిన్ను చూస్తే మాత్రం నాకు అదే అనిపిస్తుంది".

"అదే కావచ్చక్కా".

"నువ్వు రూఢీ చేశావంటే ఇంక అనుమానపడనక్కరలా, వర్షం తగ్గిం తర్వాత డాక్టర్ దగ్గరికి వెళ్దాం. అందాకా నువ్వు పడుకో పో" అని లోపలికి పంపించింది.

ఆ తరువాత డాక్టర్ దగ్గరకు వెళ్లి రూఢీ చేసుకుంది సావిత్రి. తల్లి కాబోతున్నందుకు చాలాచాలా సంతోషించింది.

హోటల్‌కి రాగానే మద్రాస్‌కి మూడు ఫోన్‌కాల్స్ బుక్ చేసింది. ఒకటి భర్తకు, రెండోది అమ్మకు, ఆ వెంటనే చాముండికి కూడా చెప్పింది. వాళ్లందరికి చెప్పేశాకగాని సావిత్రి కుదుటపడలేదు.

ఆ మర్నాడు సాయంత్రానికల్లా సుభద్రమ్మ, చాముండి ఊటి వచ్చేశారు.

"ఆయన కూడా వస్తే బాగుండేదమ్మా" అంది సావిత్రి.

"నీకు మాకు ఇది మొదటిది. ఆయనకు ఐదోది" అంది చాముండి. గుర్రున చూసింది సావిత్రి.

"చాముండికి బాగా చులకనైపోయానమ్మా నేను" అంది.

ఈ వార్త తెలుసుకొని నిర్మాతల గుండె గుభేలుమంది. 'ఎన్నో నెల' అని వాకబు చేసుకున్నారు. 'రెండో నెల అని తెలుసుకున్నారు. ఎవరికి తోచిన దగ్గరకు వాళ్లెళ్లి, మూడు నెలల గర్భిణి ఎలా ఉంటుంది, నాలుగు నెలల గర్భిణి ఎలా ఉంటుంది, గర్భిణి ఎగరొచ్చా, పరిగెత్తొచ్చా అని వాకబు చేసుకున్నారు. 'మాంగల్యబలం' డైరెక్టర్ ఆదుర్తి సుబ్బారావు వెంటనే మళ్లీ షెడ్యూల్స్ వేసుకొని సావిత్రి పాత్ర ఒక్క నెలలో పూర్తయేలా ప్లాన్ చేసుకున్నారు.



త్వరలో మాతృమూర్తి కానున్న సౌభాగ్యవతి సావిత్రికి సీమంతోత్సవం అక్టోబర్ నెలలో ముచ్చటగా జరుపబడినది.

**'కినిమా' పత్రిక అక్టోబర్ 1958 నుంచి**











"నా ప్రియమైన పరిమళం!"
LUX
TOILET SOAP


సినిమా రంగ
ఇంటిగుట్టు

# సావిత్రికి పుత్రికోదయం

ఈ సంచికలో పాఠకులకు ఒక శుభ వార్తను అందజేయ గలుగుతున్నందుకు సంతోషిస్తున్నాము.

సినిమా తారలను గురించి ఎటువంటి వార్తలనైనా పరమాసక్తితో, ఆత్రంగా వినేందుకు ఉబలాట పడే వారసంఖ్యాకులీనాడు. అట్టి వారందరికీ ఈ వార్త ఉపయోగ పడవచ్చునే మా నమ్మకం.

ఈ నెల 2 వ తేదీ తెల్లవారు జామున 5 గం॥ 10 నిముషాలకు మైలాపూరులో సెయింట్ ఇసబెల్లా హాస్పటల్లో సావిత్రి ఆడపిల్లను అతి కష్టంమీద, ప్రసవించింది. ప్రసవించే వరకూ సావిత్రి చాల కష్టపడిందనీ తెలుస్తోంది. బిడ్డకూడా క్షేమంగానే వుందిప్పుడు.

ఆమెకు శుభాకాంక్షలతో పాటు చిరంజీవికి మా ఆశీస్సులను అందజేస్తున్నాము.

—సంపాదకుడు.



రామచంద్రా ప్రొడక్షన్స్ సమర్పించు మరకత వారి 'ఇల్లాలి అదృష్టమే ఇంటికి భాగ్యం'లో సావిత్రి.

**'చిత్రసీమ' డిసెంబర్ 1958 పత్రిక నుంచి**





సావిత్రి  ఆరో నెల వచ్చేదాకా నటించింది.

'మాంగల్యబలం'తో పాటు, 'నమ్మినబంటు'  'బండరాముడు', 'భాగ్యదేవత' పూర్తి చేసిన తర్వాత ఇక నటించటానికి వీలు లేకపోయింది. సావిత్రికి కావలసిన వంటంతా చాముండియే చూసుకునేది. బలమైన ఆహారం ఇవ్వసాగింది. పళ్లు, పళ్లరసాలు రోజు యిచ్చేది.

"చామూ! నన్ను ఇంత లావు చేస్తే ఎలాగే, తర్వాత సినిమాల్లో కూడా అమ్మ పాత్రలు వేయాల్సి వస్తుందేమో" అంది సావిత్రి.

"ప్రసవం తర్వాత కూడా ఇలానే ఉందామనే, ఆరు నెలల్లో తగ్గించేస్తా" తన ప్రణాళిక బయటపెట్టింది  చాముండి.

ఇంకో నాలుగు నెలలు చాలా సరదాగా గడిపింది. జీవితంలో హాయిగా గడిపిన రోజులవి. చాలా హాలీవుడ్ సినిమాలు చూసింది. వాటిలో తన ఆరాధ్య నటీనటులయిన సూసన్ హేవర్డ్, సోఫియా లారెన్, షిర్‌లీ మాక్‌గ్రిన్‌లను పదేపదే చూసి, వారి నటనను విశ్లేషించుకొంది. మల్లెపూలు మాలలు కట్టుకుంది. రోజూ చాముండితో కలసి వంటలు చేసుకుంది. బీచ్‌లు తిరిగింది. జనం గుర్తుపడితే ఎంతో తెలివిగా తప్పించుకునేది. సావిత్రి అక్కని అని చెప్పేది. ఆ లావు చూసి నిజమేననుకునేవారు. 1958, డిసెంబర్ 2న సావిత్రి చక్కని ఆడపిల్లను ప్రసవించింది.


తనకు మొదటి అవకాశం, ఆ  తర్వాత అవకాశం మీద అవకాశం ఇచ్చి సినీ ఫీల్డ్‌లో ఉండేందుకు అన్నివిధాల దోహదం చేసిన విజయా సంస్థ మీద కృతజ్ఞతా భావంతో అమ్మాయికి 'విజయ' అని పేరు పెట్ట తలచుకుంది. ఇంకా తన ఇష్టదైవమైన మైసూర్ చాముండేశ్వరిదేవి పేరు కూడా పెట్టదలచి 'విజయ చాముండేశ్వరి' అని నామకరణం చేసింది. పిల్ల కూడా సావిత్రి అంత కళగా ఉంది. సావిత్రి ప్రసవించిందని తెలియగానే అందరూ వచ్చారు చూడటానికి. పాపకు బంగారం దగ్గర నుంచి బట్టలు, బొమ్మలు అన్నీ తీసుకొచ్చారు. ఒక సంవత్సరందాకా పాపకు ఏమీ కొనాల్సిన అవసరం వచ్చేట్టు లేదు అవన్నీ చూస్తే.

'ఏమ్మా అమ్మాయ్ పుట్టిందని, 'విజయ' అని పెట్టేశావన్నమాట. తప్పించుకున్నావు. అబ్బాయి పుడితే జూనియర్ కె.వి.రెడ్డి అని పెట్టించేవాడిని నేను" అన్నారు కె.వి.రెడ్డి.


"ఏమయ్యా ముందు అవకాశం ఇచ్చింది నేను కదా. నీ పేరు ఎలా పెట్టుకుంటావ్?" అడిగారు యల్.వి.ప్రసాద్.

"మీరు ఇలా కొట్టుకుంటారనే సావిత్రి అమ్మాయ్‌ని కనేసింది" అన్నారు చక్రపాణి.

"అమ్మాయ్ సావిత్రి! నీ రంగు అయితే రాలేదమ్మా మాకు సంతోషం" అంది సూర్యకాంతం.



తెలుగు 'అప్పుచేసి పప్పుకూడు' జనవరి 1959




తమిళ్ 'కడన్‌వాంగి కల్యానమ్' సెప్టెంబర్ 1958




**తెలుగు 'కార్తవరాయుని' కథ 1958**



**తమిళ 'కత్తవరాయన్' 1958**



'మాంగల్యబలం' 100 రోజుల వేడుక విజయవాడలో



'విమల' 1960

"మొహంలో కళ అంతా మా అక్కదేగా" అంది జమున.

ఆ రోజే అడిగేశారు నిర్మాతలు షూటింగ్‌కి మళ్లీ ఎప్పుడు వస్తావని. " రెండు నెలలు అయితే కచ్చితంగా రానండి" అంది సావిత్రి.

"రెండు నెలల తరువాత అయినా కచ్చితంగా రామ్మా, ఆ తరువాత మా ప్రాజెక్ట్‌లు పెండింగ్‌లో పెట్టలేము" అన్నారు నిర్మాతలు.

వెళుతూ... వెళుతూ... చాముండి దగ్గర ఆగి, "అమ్మాయ్, నువ్వు ఎంత శ్రద్ధగా సావిత్రిని లావు చేశావో అంతే శ్రద్ధగా మళ్లీ సన్నపడేట్లు చేసి పంపు, నీకు పుణ్యం ఉంటుంది తల్లీ" అని ప్రాధేయపడ్డారు.

'బరువు ఎలా తగ్గాలి' అనే పుస్తకాలు కూడా ఇంటికి పంపించారు కొంతమంది నిర్మాతలు.

ఇక సుభద్రమ్మ వచ్చేసినట్లే సావిత్రి ఇంటికి.

"అమ్మా! మా అమ్మాయి పనులు మీరు ఎవ్వరూ చెయ్యొద్దు, నేనే చూసుకుంటాను" అంది సావిత్రి.

"బందాదేదాకా గుడ్డిది కూడా చూడగలదు. ఆ తర్వాత ఉంటుంది అసలు కథల్లా. అప్పుడు, అమ్మో! పిల్లను సాకటం కంటే నా పనే సుఖం అనుకొనిపోతావు" అంది సుభద్రమ్మ.

"చూద్దాం చూద్దాం" అంది సావిత్రి.

"రోజు పొద్దున రెండు గ్లాసులు పళ్ల రసం, మధ్యాహ్నం రెండు చపాతీలు, పళ్ల రసం, రాత్రికి అన్నం" సావిత్రి ఇకనుండి తినవలసిన మెనూ చెప్పింది చాముండి.

ఆ మెనూ విని సావిత్రికి కళ్లు తిరిగాయి.

"చామూ! ఇంత తక్కువతో ఎలానే? ఒక పక్క నేను పిల్లను కూడా చూసుకోవాలి."

"నువ్వు కళ్లతో చూసుకో, మిగతా పనులు మేం చూసుకుంటాం" అంది చాముండి.

"అసలు నేను ఇంతకంటే లావు తగ్గను చామూ, అసలు నా వంటితీరే ఇంత. అసలు నన్ను మొదటినుంచీ సన్నగా ఉండడం ఎరుగుదువా?" అడిగింది సావిత్రి.

"అదీ చూద్దాంగా, నీకు తోడుగా నేను డైటింగ్ చేస్తానుగా."

"ఈ ప్రపంచం అంతా డైటింగ్ చేసినా నేను తినకుండా ఉండలేను కదే, నాకు ఇష్టమైన చేపలకూర తినకుండా ఉండగలనా? నావల్ల కాదే."

"వారానికి ఒకసారి పెడతాను" అంది చాముండి.

సావిత్రి ఎంత లావు నుంచి ఎంత సన్నబడిందో 1960లో విడుదలైన సినిమాలన్నీ చెప్తాయి. 1958లో నిర్మించబడ్డ 'భాగ్యదేవత'లో ఎంత లావున్నది, ఆ తరువాత 1961లో నిర్మించబడ్డ 'కలసివుంటే కలదు సుఖం'లో ఎలా ఉన్నది చూస్తే సావిత్రి ఎంత లావు తగ్గింది అర్థమవుతుంది. ఇందుకుగాను సావిత్రి ఎంతో కృషి చేసింది. ఎంతో పట్టుదలతో వ్యాయామం చేసింది. ఆహారం చాలా తక్కువగా తీసుకుంది, అందులోనూ తనకు ఇష్టమైన స్వీట్‌లు, ఐస్‌క్రీమ్‌లు అస్సలు ముట్టలేదు.

'నమ్మినబంటు', 'వెంకటేశ్వర మహత్యం', 'విమల', 'అభిమానం', 'మామకు తగ్గ అల్లుడు', 'మా బాబు', 'కుంకుమరేఖ', 'చివరకు మిగిలేది', 'దీపావళి'.....

ఇలా తన కోసం ఆగి, పెండింగ్‌లో పడిన ప్రాజెక్ట్‌లు,కొత్తగా మొదలయిన సినిమాలు ఇటు తెలుగులోనూ అటు తమిళంలోనూ కలిపి 1960 సంవత్సరంలో సావిత్రి సినిమాలు 22 విడుదలయ్యాయి. అది ఎంతో గొప్పగా చెప్పుకున్నారు అటు ప్రేక్షకులు, ఇటు సినీవర్గాలు కూడా.

"ఆ పెండింగ్ ప్రాజెక్ట్‌లు అన్నీ వచ్చిపడి అన్ని అయినాయ్. లేకపోతే సంవత్సరానికి నాకెన్ని సినిమాలు వస్తాయో ఆమెకు అంతే వస్తాయి" అని పెదవి విరిచారు ఇద్దరు ముగ్గురు హీరోయిన్‌లు.

'1948... 1958... పది సంవత్సరాలు' సావిత్రి ఒక్కసారి వెనుతిరిగి చూసుకుంటే 'ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చింది. 12 ఏళ్ల దానిలాగా వచ్చి 22 ఏళ్లది అయ్యింది. విజయవాడలో ఒకళ్లని చూడటానికి తోపుడుకు గురైనది, ఈరోజు తనని చూడటానికి జనం తోసుకునే పరిస్థితి. చంటిపిల్లలా వచ్చి చంటిపిల్లను ఒళ్లోకి తెచ్చుకుంది. బెరుకు బెరుకుగా నటించే తను, నటన అంటే సావిత్రిది అనే స్థాయికి వచ్చింది.'

సావిత్రికి నటన పుట్టుకతో వచ్చిన విద్య, వెన్నతోపెట్టిన విద్య అనుకుంటే పొరపాటే. తను ఈ స్థాయికి రావటానికి ఎంతో కృషి చేసింది. సీన్ సీన్‌కు తనని తాను సరిచేసుకుంటూ షెడ్యూల్ షెడ్యూల్‌కి తన తప్పులు సవరించుకుంది. ఈ క్రమంలో మానసికంగా ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంది, శ్రమించింది. ఉదాహరణకు మెట్లు ఏ పద్ధతిలో దిగాలి, ఏ అనుభూతికి ఎట్లా దిగాలి అనే దానికి మెట్లు లెక్కలేనన్ని సార్లు ఎక్కిదిగి తనను తాను సవరించుకుంది. డైలాగులు ఎన్నో సార్లు ఎన్నో రకాలుగా పలికి మాడ్యులేషన్‌లో తనకు తానే సాటి అనిపించుకుంది.

సావిత్రికి పుట్టుకతో వచ్చినవి మంచితనం, క్షమాగుణం అనుకున్నా అదీ పొరపాటే అవుతుందేమో! పుట్టుకతో అవి వచ్చినవో లేదో మనకు తెలియదు కానీ, శరీరాన్ని ఏపుగా పెంచుకున్నట్టు మంచిని కూడా బుద్ధిపూర్వకంగా పెంచుకుంది.

తుంచలేకపోయినవి కోపం, మొండితనం, అందరిని నమ్మటం, దానధర్మాలు. చివరకు ఇవన్నీ కలిసి తనను తుంచేశాయి.

తన వృత్తిలో మాత్రం కోపానికి, మొండితనానికి, పిడివాదానికి, ఎదుటివారి పొగడ్తలకు, లాలనలకు చోటిచ్చేది కాదు.

"తలపోయినా సరే కర్తవ్య నిర్వహణ నుంచి వైదొలగక వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నామన్న భావన ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. ఆ ధైర్యమే లోకంలో అనేక విజయాలకు నాంది పలుకుతుంది" అన్నది సావిత్రి విశ్వాసం, ఆచరణ.

1959కి సావిత్రి ఒక తార. ఎవ్వరికీ అందని ఎత్తులో ఉన్న తార. దక్షిణ భారతదేశంలో పామరుడి నుంచి రాజకీయ నాయకులదాకా సుపరిచితమైన వ్యక్తి. ఉత్తర భారతదేశంలో బొంబాయి, కలకత్తాలలో సినీవర్గంలో గొప్ప గుర్తింపు ఉన్న నటి.

ఇవన్నీ తనకు ఆ దుర్గాదేవి వల్ల ప్రాప్తించినందుకు, ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నిశ్చయించుకుంది. ఎప్పటికప్పుడు తనను, తన ప్రవర్తనను బేరీజు వేసుకునేది. తనకు వచ్చిన అపారమైన సంపద ప్రజలు రూపాయి రూపాయి వేసుకొని టికెట్ కొనగా వచ్చిన డబ్బని తన నమ్మకం. అందుకని ప్రజలకు ఉపయోగపడే సత్కార్యాలకు వెనకాముందు ఆలోచించకుండా దానం చేసేది. ఆ సంవత్సరంలో విజయవాడలో 'హనుమంతరాయ గ్రంథాలయం'కి ఆర్థిక సహాయం చేసింది.

తెలుగు సినీపరిశ్రమ సావిత్రిని నెత్తిమీద కూర్చోబెట్టుకుంది. ఎంతో అపురూపంగా చూసుకునేది. అసలు కష్టపడనిచ్చేది కాదు. 1958లో 'నమ్మినబంటు' షూటింగ్‌లో ఒక కుండ మోయాలి.

"ఒట్టిది మోయమ్మా!" అని దుక్కిపాటి మధుసూధనరావు అంత పెద్దమనిషి చెప్పినా సావిత్రి కుండని నీళ్లతో నింపుకుంది.అప్పటికి వట్టి మనిషి కూడా కాదు.

"వట్టికుండకి, నిండుకుండకి తేడా ఎంతో స్పష్టంగా కనిపిస్తుంది కదండీ" అంది.

"నిజమేనమ్మా!" అన్నారు దుక్కిపాటి, సావిత్రి(అ)నే (నిండుకుండని) చూస్తూ.

ఈ 'నమ్మినబంటు' షూటింగ్ ఒక నెల రోజులు వరుసగా కారంచేడులో జరగాల్సివుంది. ఇలావెళ్తున్నాను అని తెలియగానే, సావిత్రికి చాలా సంతోషమేసింది. ఎప్పటినుంచో మనసులో వున్న తన కోరిక తీరబోతుందనుకుంది.వెంటనే సుభద్రమ్మతో, "అమ్మా నేను ఈ షూటింగ్ నుంచి వచ్చేటప్పుడు నీకు మాంఛి బహుమతి తీసుకొస్తానే"అంది.

"ఏం బహుమతే అమ్మాయ్, చీరాల నుంచి నేత చీరలు తీసుకొస్తావా? వేటపాలెం నుంచి జీడిపప్పు తీసుకొస్తావా?"

"అవేం కాదమ్మా..నాన్నను తీసుకొస్తానమ్మా.."

ఒకసారి చిత్రంగా చూసి,నిట్టూర్చింది సుభద్రమ్మ."ఇరవైరెండేళ్ళు... మీ నాన్న పోయి,దండలో పూలు రాలుతున్నట్లు ,ఆయన రూపు మెల్లమెల్లగా నాకు గుర్తు లేకుండా పోయింది, మీ నాన్న ఇలా వుంటారు అనే వూహ తప్ప ఆ కచ్చితమైన రూపు నాకు ఎంత ప్రయత్నించినా గుర్తుకు రావటంలేదు. నువ్వయితే వూహ తెలిసి ఆయన్ను చూడలేదు.కాని ఆయన వచ్చినప్పుడల్లా నిన్ను ఒళ్లోకి తీసుకొని దించేవాడు కాదు,మళ్లీ రానేమో అన్నట్టు....అలానే అయింది చివరకు.తీసుకురామ్మా....తీసుకురా...మీ నాన్న ఫోటో తీసుకురా.మీ నాన్న ఆయన అన్నదమ్ములు అందరూ ఒకసారి గుంటూర్లో తీయించుకున్నారట,ఆ ఫోటో మా పెదబావ ఇంట్లోనే గోడకి వేలాడుతూ వుండేది.అది తీసుకువస్తే, నా కన్నా నువ్వే ఎక్కువ సంతోషించేది."

కారంచేడులో తనకు ఎప్పుడు తీరిక దొరుకుతుందా అని ఎదురు చూసింది సావిత్రి. ఒక ఆదివారం షూటింగ్‌కు సెలవైన రోజు సావిత్రి వాళ్ల నాన్న వూరు చింతలపూడి బయలుదేరింది. సావిత్రి ఒక కారులో బయలుదేరగా, తనకి తోడుగా ఒక నలుగురితో ఇంకో కారు బయలుదేరింది. కారంచేడు నుంచి చింతలపూడికి దాదాపు మూడు గంటలు ప్రయాణం. సావిత్రి చింతలపూడికి వస్తున్నట్లు అక్కడవారికి ఎవ్వరికి ముందుగా చెప్పలేదు.ఏ ఒక్కళ్లకి చెప్పినా చాలు, అసలు సావిత్రి ఊరిలోకి వెళ్లటమే కనాకష్టమైపోయేది. చింతలపూడి చేరుకున్న తర్వాత, తన పెదనాన్న, బాబాయిల ఇళ్లు వాకబు చేసుకుంటూ వాళ్ల పెదనాన్న ఇంటికి చేరుకుంది.వచ్చింది సినిమా తార అయిన సావిత్రి, పైగా వాళ్ల ఇంటి పిల్ల అయినందువల్ల గురవయ్య కుటుంబం చాలా గర్వపడింది,సంతోషించింది.ఇంట్లోకి రాగానే సావిత్రి చేసిన మొదటి పని, గోడల మీద ఫోటోలను చూడటం.సుభద్రమ్మ చెప్పిన ఫోటో లాంటిదేది కనిపించలేదు. "మా నాన్నగారి ఫోటో వుండాలట కదా, అది తీసుకువెళ్దామని వచ్చాను"అంది.

"మీ నాన్న పుటోనామ్మా....వుండాలమ్మా,ఎక్కడవుందో...." అన్నాడు సావిత్రి పెదనాన్న.

"అయితే ఆ ఫోటో ఎక్కడుందో మీకు తెలియదా?" నిరాశపడింది సావిత్రి.

"ఎక్కడికి వెళ్లిద్ది? ఏ మొచ్చుపైనో ఎక్కడో వుండే వుంటుంది,నువ్వు అన్నం తినే సరికి ఇంట్లోవున్న పటాలన్నీ తీసుకొచ్చి నీ ముందు పెట్టం?" అన్నాడాయన.

'హమయ్య' అనుకుంది సావిత్రి. ఆశ చిగురించింది. భోజనం చేస్తుందేగాని, ధ్యాసంతా నాన్న ఫోటో మీదే వుంది.

భోజనం అవ్వగానే ముందు రెండు ఫోటోలు ఇచ్చారు.అవి రెండూ కూడా ఇద్దరి ఆడపిల్లలవి.

"వీళ్లు మీ చెల్లెళ్లమ్మా, పెద్దయినప్పుడు లంగావోణి ఏసి, పూలజడేసి పుటో లాగించానమ్మా."

"ఏమయ్యా ఆ అమ్మాయంత ఆదుర్దాగా మద్రాసునుంచి వాళ్ల నాన్న పుటో కోసం వస్తే నువ్వు చూపించేది మీ పిల్లల పుటోలటయ్యా" అరిచాడు, అక్కడకు చేరుకున్న ఆ ఊరి మునసబు.

"ఇప్పటికి దొరికిన పటాలు ఇవేనయ్యా, అటక పైకి ఎక్కించాను, వెతుకుతున్నారు" అన్నాడు సావిత్రి పెదనాన్న.

సావిత్రి మనసు ఆశ-నిరాశల మధ్య ఊగిసలాడుతుంది. వెతగ్గా వెతగ్గా ఒక గంటకు, ఓ నలుగురు మగవాళ్లు వున్న ఫోటో ఒకటి కిందకి దించారు. సావిత్రి ఆత్రంగా చూసింది. "దీంట్లో మా నాన్న ఎవరు?" అని అడిగింది.

వాళ్ల పెదనాన్న ఆ ఫోటో తీసుకొని చూసి, "ఈ పుటో మా అన్నదమ్ములది కాదమ్మా, ఇది మీ అమ్మ అన్నదమ్ములదమ్మా" అన్నాడు.

నీరసపడింది సావిత్రి.

"బాగుంది సంబడం, అమ్మాయ్, నువ్విక్కడే వుండు, మీ వాళ్ల ఇళ్లన్నిట్లో వెతికించుకొస్తాను" అంటూ పైపంచ నడుముకి బిగించుకుని బయలుదేరాడు మునసబు.

సావిత్రికి మళ్లీ ఆశ పుట్టించాడు మునసబు.గోధూళి లేస్తున్న వేళ మునసబు దుమ్ము,ధూళి,బూజుతో వొళ్లంతా నిండిపోయి, తల వేలాడేసుకొచ్చాడు.

తీవ్ర నిరాశకు లోనయింది సావిత్రి. నాన్నని చూడలేదనేగాని ఆయన్ను ఎప్పుడూ తలచుకుంటూనే వుంది. కష్టాలొచ్చినప్పుడు 'నాన్నా నువ్వే కనుక వుండి వుంటే నాకీ కష్టాలు వుండవు కదా 'అనుకుంది,తను బాగా వృద్ధి లోకి వచ్చినప్పుడు తలచుకుంది. 'నాన్న నువ్వు లేకపోవటం ఒక్కటే పెద్ద లోటు' అని.

ఇక వెళతానని చెప్పి బయటకువచ్చింది, బయట తనను చూడటానికి జనం పోగయ్యారు.ఆగకుండా కారు ఎక్కేసింది.

"ఈ సినిమావాళ్లకి మరీ బడాయి కాకపోతే, కాసేపు ఆగితే వాళ్ల సొమ్మేంపోయిద్ది? ఆమెను సూట్టానికని ఎప్పట్నుంచి వున్నాం ఇక్కడ?" అంటూ గుంపులో ఒక గొంతు విసుక్కుంది,మొత్తం గుంపు అభిప్రాయాన్ని తెలియచేస్తూ.

కారు ఊరిసెంటరుకి రాగానే, అప్పటిదాకా ఆపివున్న కన్నీళ్లు, రెండు కళ్ల వెంటా నిండుగా కారినయ్ సావిత్రికి.

★ ★ ★

ఒకసారి దర్శకులు రామినీడు ఒక కథ తెచ్చారు.

"ముందు ఒక నటి దగ్గరకు వెళ్లాం, పారితోషికం కుదరక మానుకోవాల్సి వచ్చింది. మీకంటే మంచినటి అని వెళ్లలేదు. డబ్బు పరంగా మాకు పరిమితులు ఉన్నాయి. అందుకని ఆ నటి దగ్గరకు వెళ్లాము. మేము అనుకున్న పరిమితిలో కుదరలేదు" అన్నారు.

"నేను మీ కథ విన్నాను. ఆ నటి చెప్పింది. నాకు కథ బాగా నచ్చింది. నాకు పారితోషికం పైన పట్టింపు లేదు. మంచి చిత్రం తీద్దామన్న మీ ఉద్దేశం గొప్పది. నేను తప్పకుండా చేస్తాను" అంది.

ఈ చిత్రం సెట్స్ మీద ఉండగా ఒక మధ్యాహ్నం సావిత్రి ఇంటికి ఫోన్ వచ్చింది. "సావిత్రి మూర్ఛపోయింది. ఇంటికి తీసుకువస్తున్నాము" అని సుశీలా పద్మనాభన్ అనే స్నేహితురాలు చెప్పింది.

శోక ఘట్టాల్లో నటించవలసివచ్చినప్పుడు, ఏడవవలసివచ్చినప్పుడు దర్శకుడు 'కట్' అని చెప్పిన తర్వాత కూడా సావిత్రికి ఏడుపు ఆగదు. ఇలాంటి 'ఎమోషనల్' దృశ్యాల్లో నటించిన తర్వాత, బాగా బలహీనత కలగడం,నరాలు వణకడం వంటివి జరుగుతూ వుంటాయి సావిత్రికి. అందుకని సావిత్రి అలాగే ఇంటికి వెళ్లిపోయి మేకప్ అయినా తీసుకోకుండా, భోజనమైనా చెయ్యకుండా మంచం మీద పడి నిద్రపోతుంది. సావిత్రి ఇంటికి వచ్చి అలా పడుకుందంటే,తను శోక దృశ్యంలో నటించినట్లు ఇంట్లో వాళ్లకి అర్థమయిపోతుంది, ఇక ఎవరూ తనని లేపరు.

కాని ఈసారి ఏకంగా మూర్ఛపోయింది అంటే సుభద్రమ్మ, చాముండి భయపడిపోయారు. చాముండి అయితే మరీను. తన కట్టుదిట్టమైన డైటింగ్ వల్ల ఓపిక లేక పడిపోయింది అనుకుంది. సావిత్రి వచ్చేదాక మనసు మనసులో లేదు ఇద్దరికి. తీరా సావిత్రి వచ్చేసరికి బాగానే ఉంది. కారులో మామూలుగానే వచ్చింది, కాకపోతే చాలా నీరసంగా వుంది.

"అదేంటి నువ్వు పడిపోయావన్నారు?" అని అడిగారు ఇద్దరు.

"పడింది, లేచింది" అంది వెనకే ఉన్న సుశీలా పద్మనాభన్.

"ఈరోజు సీన్‌లో సావిత్రి బాగా బాధపడటం, ఏడవటం నటించాలి. అలా చేస్తూ మూర్ఛ వచ్చి పడిపోయింది."

"అంత జీవించకపోతే నటించి వదలచ్చుకదమ్మా" అంది చాముండి.

"నాకు వాళ్లు డబ్బు ఇస్తుంది జీవించటానికే... పాత్రకు ప్రాణం పోయటానికి, నటించి వదిలేయటానికి కాదు" అంది సావిత్రి.

"వీళ్లు నీకు డబ్బులు ఇచ్చింది తక్కువే కదా, కాస్త తగ్గు తల్లీ. ఈ సినిమా అంతా ఇలా శోకాలే కదా" అంది చాముండి.

"అంతా కాదులేవే, చివరిలోనే" అంది సావిత్రి.

"సుభద్రమ్మగారూ ఇది మొదటిసారి కాదు మీ అమ్మాయి ఇలా మూర్ఛపోవడం. ఒక తమిళ సినిమా షూటింగ్‌లో కూడా ఇలానే నటిస్తూ మూర్ఛపోయింది. అప్పుడు హాస్పిటల్‌కు తీసుకెళ్తుంటే స్పృహ వచ్చింది" అంది సుశీలా పద్మనాభన్.

ఇప్పుడు షూటింగ్ జరుగుతున్న ఈ చిత్రమే 1960లో విడుదలైన 'చివరకు మిగిలేది'. సావిత్రికి తన అన్ని పాత్రల కన్నా ఈ సినిమాలో 'పద్మ' పాత్ర చాలా నచ్చిన పాత్ర. తెలుగులో చిత్ర నిర్మాణం జరుగుతూ ఉండగానే ఆ సినిమా తమిళ హక్కులు కొన్నది.

"కొనేవాళ్లకు ఎట్లాగూ బుద్ధి లేదు. ఆ ఇచ్చేవాళ్లు ఎలా ఇచ్చారు. ఇది వ్యాపారాత్మక సినిమా కాదు, కళాత్మక సినిమా అని వారే చెప్పారు. తెలుగులోనే ఎట్లా ఆడుతుందో తెలియదు మరి తమిళ హక్కులు నీకు ఎట్లా కట్టబెట్టారు? నువ్వు అడిగితే మాత్రం వారించకుండా కట్టబెడతారా? పైగా పారితోషికం సగానికి సగం చేసుకున్నావు. ఆమాత్రం విశ్వాసం లేకపోయిందా వాళ్లకి? వాళ్లు అడిగినంత ముట్ట చెప్పావు. ఇంత తొందరెందుకు. సినిమా విడుదల కాకముందే వాళ్లు లాభాల్లో పడిపోయివుంటారులే" శివాలెత్తింది చాముండి.

"నిజమే తొందరపడ్డాను, ఆయన కూడా ఇదే అన్నారే" అంది సావిత్రి.

"మీ ఆయన కూడా ఇలా అన్నాడా? అయితే నేను ఇలా అంటాను. చాలా మంచి పనిచేశావు సావిత్రి. సినిమా వ్యాపార ధోరణిలో కొట్టుకుపోతున్న ఈ తరుణంలో నువ్వు చేసిన పని ఒక చుక్కాని వంటిది. నీలాంటి అగ్రనటీమణులు సినిమాలలో కళాత్మక విలువలు

కాపాడటానికి కంకణం కట్టుకోవాలి. మీ తోడ్పాటుతోనే సినిమా ఒక కళ లాగా విలసిల్లేది. నువ్వు చేసిన పని శ్లాఘనీయం, ప్రశంసనీయం" అని ఏకధాటిగా అంది చాముండి.

"ఛీ! త్రాష్టురాలా! ఎప్పుడు అర్థం చేసుకుంటావే ఆయన్ని?" అంది సావిత్రి.

'అదొక వ్యర్థం' అనుకుంది మనసులో చాముండి.

★★★

1961లో....

"ఏంటీ నాకు రోల్ లేదా? అన్నపూర్ణవాళ్ల సినిమాలో నాకు వేషం లేదా? బలే జోకు వేశావు సెక్రటరీ, ఫోను కలుపు మాట్లాడతాను".

"ఎవరికి చేయను" అడిగాడు సెక్రటరి.

"మధుసూధన్‌రావు గారికి ఫోన్ చెయ్యి".

ఫోన్‌లో ఆయన కలిశారు. నేరుగా మాత్రం అడగలేకపోయింది. మొహమాట పడింది. "ఒక ముఖ్య విషయం మాట్లాడాలి. మీరు అక్కడే ఉండండి వస్తాను" అని చెప్పి వెంటనే బయలుదేరింది.

"అనవసరమండీ, నేను క్షుణ్ణంగా తెలుసుకున్నాను. మీరు అడిగి లేదనిపించుకోవద్దు" బతిమాలాడు సెక్రటరి.

"అదే నేను కనుక్కొని వస్తాను కదా" అని అరిచేసరికి మిన్నకున్నాడు.

వాహినిలో ఉన్నారు దుక్కిపాటి. సావిత్రి వస్తుంటే బి.ఎన్. రెడ్డి ఎదురయ్యారు. "ఏంటమ్మా! ఏ ఫ్లోర్‌కి" అన్నారు. అప్పటికే నోరు మెదపలేకపోయింది సావిత్రి. మొహం ఎర్రబారింది.

బి.ఎన్. రెడ్డి కంగారు పడ్డారు. "ఏంటమ్మా ఏమన్నా జరిగిందా?" అన్నారు.

"ఏమీ లేదండి, అన్నపూర్ణా వాళ్ల పిక్చర్‌లో నేను లేనటకదండి నిజమేనా?" అడిగింది సావిత్రి.

"అదా సంగతి తల్లీ. నేను ఇంకా హడలిపోయాను. అవునమ్మా నువ్వు లేవు".

"ఎందుచేతనండీ? నేనేమన్నా రెమ్యునరేషన్ పెంచానా? టైం లేదన్నానా?హఠాత్తుగా నాకేమి తక్కువయిందండీ నన్ను తీసేయటానికి?"

"నీకేమి తక్కువ కాలేదమ్మా. వాళ్ల పాత్రకి నీ స్టేటస్ ఎక్కువ అనుకున్నారు."

"ఈ సావిత్రి పాత్రల్లో ఎలా ఇమడగలదో వాళ్లకు తెలియదాండి?"

"ఇప్పుడు పరిస్థితులు వేరమ్మా. ఇమేజ్, స్టేటస్ అనేవి వచ్చిపడ్డాయి చూడూ..."

"లేదండీ నేను వేషం వేసి తీరాల్సిందే..."

"లేదమ్మా అనవసరంగా గొడవపడకు. అన్నీ ఖరారు అయిపోయాయి" అన్నారు బి.ఎన్.రెడ్డి.

సావిత్రికి రోషం పొడుచుకువచ్చింది, ఏడ్చేటట్లు ఉంది.

బి.యన్.రెడ్డి సావిత్రిని ఆఫీసురూమ్‌కు తీసుకెళ్లి కూర్చోబెట్టి, దుక్కిపాటిని పిలిపించారు. బి.యన్.రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్నారు దుక్కిపాటి.

"సారీ అమ్మా! నిన్ను ఇంత బాధిస్తుందనుకోలేదు, కథకు అలా కావాల్సి వచ్చింది."

"ఇది నా సంస్థ అనుకున్నాను" అంది సావిత్రి.

"నీ సంస్థే తల్లి ,ఈసారికి వదిలేయ్. మళ్లీ ఈ తప్పు జరక్కుండా నేను చూస్తా" అన్నారు దుక్కిపాటి.

కన్నీటితోనే తిరిగి వెళ్లింది సావిత్రి. జరిగింది చాముండికి చెప్పింది.

★★★

వృద్ధ కళాకారులకు ఆర్థిక సహాయం అందజేయడానికి సినీ కళాకారులంతా ఒక నిధి ఏర్పాటు చేయ నిశ్చయించుకున్నారు. ఆ పనిని గాయని సుశీలకు అప్పగించారు. సుశీల సావిత్రి ఇంటికి చేరుకుని విషయం చెప్పింది.

"మీతోనే మొదలు పెట్టాను సావిత్రి" అంది సుశీల.

"చాలామంచిది" అంటూ పక్కనే ఉన్న హ్యాండ్‌బ్యాగ్ లోంచి చేతికి నిండుగా ఎంత వస్తే అంత తీసి ఇచ్చేసింది. లెక్కపెట్టనేలేదు. సుశీల ఆశ్చర్యపోతూ తీసుకుంది. లెక్కలేదు కదా అని లెక్కపెట్టడం మొదలు పెట్టింది. ఆమెకు లెక్క తెలియక సతమతమౌతోంది.

సావిత్రి ఇచ్చింది తక్కువేమో ఇంకాస్త ఇస్తే ఏంపోతుంది అని సతమతమౌతోంది. "చాముండి లోపల అలమారలో కాస్త డబ్బు వుండాలి తీసుకురా" అంది.

చాముండి అంతా చూస్తూనే వుంది. లోపలికి వెళ్లినట్లు వెళ్లి తిరిగివచ్చి," అక్కడేమీ డబ్బులేదు సావిత్రి" అని చెప్పింది.

"లేదు చాము, అక్కడే వుండాలి మళ్లీ చూడు" అంది.

చాముండి మళ్లీ వెళ్లి, తిరిగివచ్చి అదే సమాధానం చెప్పింది.

"అదేమిటి వున్నాయంటే లేదంటావు" అంటూ లేవబోయింది.

ఈసారి చాముండి సుశీలవైపు చూసి "అరె! లేవని చెప్తున్నాను కదా!" అంది.



మంజీరా వారి
చివరకు మిగిలేది!
చె. రామినీడు
వి. పురుషోత్తమరెడ్డి








వెండితెర వెన్నెల సంతకాలు





# సావిత్రి దస్తూరి





సుశీలకు విషయం అర్థమయింది. "సావిత్రీ! ఇప్పటికి లెక్క తేలింది. 15 వేలు ఇచ్చావు. మిగతా వారంతా ఇచ్చేది కలిపితే అనుకున్నంత అవుతుంది, చాలా థాంక్స్, వెళ్లొస్తాను" అంటూ బయలుదేరింది.

సుశీలను సాగనంపి లోపలికి వచ్చేసరికి చాముండి ఎదురుగా నుంచుంది. ఎందుకు నుంచుందో సావిత్రికి తెలుసు. "పోనీలేవే వృద్ధ కళాకారులకట" అంది.

"నువ్వు వృద్ధురాలివైనప్పుడు నీకేమైనా మిగిలేటట్లు చూసుకో."

నవ్వొచ్చింది సావిత్రికి.

"అప్పుడు వీళ్లంతా వుండరూ? చేసిన దానధర్మాలు వూరికే పోతాయా?" అంది.

★★★

1961, జులైలో సావిత్రి రెండవ విదేశీ ప్రయాణం చేసింది. ఫిలింఫేర్ అవార్డ్స్ ఫంక్షన్‌కి ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ వెళ్లవలసి వచ్చింది. ఎంతో ఆసక్తిగా గమనించింది ఆ దేశాల ఆచారవ్యవహారాలని. ఈ దేశాలన్నింటిలో కూడా తనకున్న అభిమానులను చూసి ఆశ్చర్యపడింది, ఆనందించింది .మద్రాసు తిరిగి రావటానికి,కౌలాలంపూర్ విమానాశ్రయానికి వచ్చినప్పుడూ ఎందరో అభిమానులు వచ్చి పలుకరించారు.ఇంకా ఎందరో దూరం నుంచి చూస్తున్నారు.దూరంగా నిల్చుని వున్నవాళ్లలో ఒక అమ్మాయి సావిత్రి వైపు చూస్తూ ,చెయ్యి వూపుతూ ఏడుస్తుంది.ఎందుకు ఏడుస్తుందోనని సావిత్రి ఆదుర్దా పడి,చెయ్యి వూపి ఆ అమ్మాయిని దగ్గరకు రమ్మని పిలిచింది.సావిత్రి దగ్గరకు వచ్చి ఆ అమ్మాయి ఇంకా బావురుమంది.

"ఏమిటమ్మా ఏం జరిగింది?" ఇంకా ఆదుర్దాగా అడిగింది సావిత్రి.

"మిమ్మల్ని చూడాలని ఎంత కాలంగానో అనుకుంటున్నాను, ఇవాళ్టికి ఆ అవకాశం వచ్చింది.మిమ్మల్ని దగ్గరనుంచి చూడాలని,మీతో మాట్లాడాలని అనుకుంటే కుదరలేదు, అందుకనే ఏడుస్తున్నాను" అని చెప్పింది ఆ అమ్మాయి. సావిత్రి ఆ అమ్మాయిని ఓదార్చి, పక్కన కూర్చోబెట్టుకొని మాట్లాడింది. కాస్సేపయిన తర్వాత, "అక్కా, నా జ్ఞాపకార్థం ఇది వుంచండి" అని తన వేలిన వున్న వుంగరం తీసి సావిత్రి వేలికి తొడిగింది.సావిత్రి ఎంత వద్దన్నా, ఆ అమ్మాయి అంత పట్టుపట్టింది. మళ్లీ ఏడవటం మొదలుపెట్టింది.ఇక చేసేదేమిలేక సావిత్రి ఉంగరం తీసుకుంది.ఆ అమ్మాయి ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఎక్కడో మలేషియాలో కూడా తన మీద ఇలా అభిమానం పెంచుకుంటున్నందుకు సావిత్రి కూడా ఆనందంతో ఉప్పొంగిపోయింది.

★★★

అంతకుముందు ఊటీ వాతావరణం నచ్చినా,ఊటీలో వీలుకాకపోయినందున అలాంటి వాతావరణమే ఉన్న కొడైకెనాల్‌లో ఇంకో బంగ్లా కట్టించుకుంది సావిత్రి. ఆ బంగళాని ఎవరి పేరు మీద పెట్టాలి అనే మీమాంస వచ్చింది.

సావిత్రి, జి.జి., సావిత్రి సెక్రటరి, జి.జి. సెక్రటరి, చాముండి ఇంకా ఇద్దరు ఉన్నారు.

"సెక్రటరి పేర పెడదాం సావిత్రి. నీ పేరున ఉండటానికి చాలా లిటిగేషన్స్ ఉన్నాయి" అన్నాడు జి.జి.

"అలాగే కానివ్వండి" అంది బుద్ధిగా సావిత్రి.

"సావిత్రి పేరు కాకుండా ఎవరో పేరు పెట్టడమయితే నాపేరు పెట్టండి" అంది చాముండి.

"ఇది నీకనవసరమైన విషయం. నువ్వు మధ్యలో మాట్లాడకు. ఎవరి పేరు మీద పెట్టాలో నాకు తెలుసు" అన్నాడు జి.జి.

"సావిత్రి పేరు మీద ఎన్ని ఆస్తులు ఉన్నాయని మీరు వేరే పేరు పెట్టమన్నారు. ఎన్ని ఆస్తులైనా ఉండవచ్చు. వాటికి సరైన పన్నులు కడితే చాలు" అంది చాముండి.

ఈసారి జి.జి. సెక్రటరీ అందుకున్నాడు. "నీకు ఇవి అనవసరం. ఒకసారి చెప్పారు కదా సారు, నోరు మూసుకొని బయటికి నడువు, పనిదానివి పనిదానిలా ఉండు" అన్నాడు.

"సెక్రటరీ!" కోపంగా అరిచింది సావిత్రి.

"ఏంటి ..... ఆ మాట కొస్తే మీరే పనివాళ్లు. అది కాదు, ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి. మీరు వెళ్లండి ఇక్కడ నుంచి" అని అరిచింది.

జి.జి. సెక్రటరి వెళ్లబోయాడు. "ఇంకో మాట, ఆ బిల్డింగ్ నా పేరు మీదే పెట్టండి" అంది సావిత్రి.

ఈ లోపల చాముండి కూడా వెళ్లిపోయింది.

వెంటనే సావిత్రి చాముండి గదిలోకి వెళ్లింది. చాముండి అలమారలు తీస్తోంది. అలమార లోపల చెక్కల మీద సావిత్రి ఫోటోలు ఉన్నాయి.

"అబ్బో లోపల ఎంత ప్రేమో. ఇంత ప్రేమ ఉన్న దానివి అప్పుడు వెళ్లకుండా ఉంటే నిన్నే చేసుకునేదాన్నిగా. ఏం చాముండీ కోపం వచ్చిందా?"

"లేదు, నువ్వు తిట్టావుగా అతన్ని. నీ డబ్బు ఏమవుతుంది అనేది సంవత్సరంలో ఒక్కరోజు అయినా పట్టించుకో. నువ్వు కొన్న ఆస్తులు ఎవరి పేరు మీద ఉన్నాయి, నీ పేరు మీద ఎన్ని ఉన్నాయి అనేది ఒక్కసారి చూసుకో సావిత్రి. ఊరికే సంపాదించడం కాదు. అవి గట్టిగా నిలిచేటట్టుగాగూడా చూసుకోవాలి."

"సరే తప్పకుండా చూద్దాం" అని బయటికి వచ్చేసరికి జి.జి బయటికి వెళుతూ కనిపించాడు.

★★★

"చాముండి చూడు ఆ రోజు ఆ సినిమావాళ్లని ఆడిపోసుకున్నావు. చూడు, 'చివరకు మిగిలేది' చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'రాష్ట్రపతి అవార్డు' వచ్చింది. నాకు మద్రాసు ఫిల్మ్ ఫాన్స్ అసోసియేషన్ వాళ్లు "బెస్ట్ యాక్ట్రెస్" అవార్డు ఇచ్చారు. అట్లాగే రామినీడు గారికి కూడా "బెస్ట్ డైరెక్టర్" అవార్డు ఇచ్చారు."

"చాలా సంతోషం. ఈ శుభసందర్భంలో నీ తమిళ హక్కులు తిరిగి వాళ్లు కొంటారేమో కనుక్కో" అంది చాముండి.

"ఇంకా సంగతి వదిలేయ్. చూడు, మన తెలుగువాళ్లు ఇవ్వలేనిది ఈ అరవవాళ్లు ఇచ్చారు. కనీసం ఈ సినిమాకు కూడా కాకపోతే ఇంక దేనికి ఇస్తాయి, ఆంధ్రప్రభుత్వం, సంఘాలు. కనీసం ప్రభుత్వమైనా వ్యాపారాత్మక ధోరణిని వదలకపోతే ఇలాంటి సినిమాలు ఎలా నిలబడతాయి?" ప్రశ్నించింది సావిత్రి.

1961 అంతా 1960 కంటే చాలా బిజీగా ఉంది. తెలుగు సినిమా స్వర్ణయుగంలో, ఆ సంవత్సరం అతి కీలకమైనదీ, శిఖరాగ్రానికి చేరువైయిందీ అని చెప్పవచ్చు. ఏవిధంగా చూసినా గొప్ప కళా సంపద ఎగసిపడుతున్నది. గొప్ప కథలు తయారయ్యాయి. పాటల్లో గొప్ప సాహిత్యం ఉప్పొంగింది. మనస్సుని ఆహ్లాదపరిచే గొప్ప సంగీతం రూపొందించబడింది. గొప్ప నటి కావాలనుకున్న వాళ్లు సావిత్రిని వదలలేదు.

1961లో సావిత్రి ఉన్న ఆరు తెలుగు సినిమాల నిర్మాణం జరుగుతోంది. సావిత్రి సంపద కూడా అదే రీతిలో పెరుగుతోంది. తనకు ఇంత ఇవ్వండి అని అడగడం ఏనాడో మానేసింది. 1955 తర్వాత నిర్మాతలు ఇలా అనేవాళ్లు "ఆ నటికి ఇంతిస్తున్నాము, మీకు ఆమె కంటే ఓ పదివేలు ఎక్కువ ఇస్తున్నాం." అలా నటీమణుల మీద చాలా ఎక్కువే ఇచ్చేవాళ్లు. అయితే 1960లకి వచ్చేసరికి హీరోయిన్‌లతో పోల్చటం మానేసి "హీరోకి ఇంత ఇస్తున్నాం, మీకు ఇంత ఇచ్చుకుంటాం" అనేవారు.

1961లో నిర్మాణంలో ఉన్న 'ఆరాధన' సినిమాకి ఏ.యన్.ఆర్ తరువాత ఎక్కువ పారితోషికం తీసుకున్నది సావిత్రే, తరువాత ముఖ్యపాత్రలో జగ్గయ్య ఉన్నాకూడా. తమిళ సినిమా 'పాశమలర్' నుంచి తమిళ సినిమాలకు లక్ష రూపాయలు తీసుకోవటం మొదలైంది.

ఇదే సమయంలో వాహినీ స్టూడియో పక్కనే ఆరెకరాలు పొలం కొని తన మరో అమ్మ అన్నపూర్ణమ్మ అబ్బాయి కుటుంబాన్ని వ్యవసాయం చేయమని పెట్టింది.

సావిత్రి సంపదలానే ఖర్చులు కూడా ఎక్కువే. ఖర్చుల్లో సింహభాగమైన నగలు, చీరలు పక్కనపెడితే, ఆ తర్వాత దానధర్మాలకు ఎక్కువ ఖర్చు చేస్తుంది. ఇంట్లో కూడా ఖర్చు ఎక్కువే. ఇంట్లో సావిత్రి కుటుంబసభ్యులు కాకుండా, పూటకి ఒక పదిహేనుమంది భోజనానికి వుంటారు. దగ్గర చుట్టాలు సరేసరి, చాలామంది ఏదో బీరకాయ పీచు చుట్టరికం పట్టుకొని వచ్చి సావిత్రి ఇంట్లో తిష్టవేస్తారు. వీళ్లందరికి వంటవాడు కట్టెలపొయ్యి మీద వండుతాడు. ఇంట్లోవాళ్లకి మాత్రం సుభద్రమ్మ గ్యాస్‌పొయ్యి మీద వండుతుంది. పచారిసామాను పెద్దపెద్ద పది కేజీల డబ్బాల్లో వస్తాయి. పది కేజీలు జీడిపప్పులు వచ్చాయంటే, పదికేజీలు ఆవాలు కూడా వచ్చేస్తాయ్.

సావిత్రిని ఆల్ ఇండియా లెఫ్ట్ హాండర్స్ అసోసియేషన్‌కి గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. సంస్థ సభలో ప్రసంగిస్తూ ఇలా అన్నది "గుండె ఎడమవైపు వుంటుంది. కాబట్టి మా ఎడమ చేతి వాటం వాళ్ల నైజం కూడా గుండెకు హత్తుకు పోయేలా వుంటుంది. మేము చేసే పనులలో నీతి, నిజాయితి, దయాగుణం వుంటాయి." ఈ పై మాటలకు ఒక తార్కాణం. ఒకసారి ఇంటికి ఇద్దరు అమ్మాయిలను తీసుకొచ్చింది. వయస్సులో వున్నారు, నాజుగ్గా వున్నారు. హాల్లో కూర్చోబెట్టింది.

ఎవరు వీళ్లు అన్నట్లు చూశారు సుభద్రమ్మ, చాముండి.

"వీళ్లు సినిమాల్లో చేరడానికి ప్రయత్నం చేయటానికి వచ్చారు. వీళ్లది గుంటూరట." అని చెప్పి స్నానం చేయడానికి వెళ్లింది.

"ఇక నీ చేతిలో పడ్డారుగా, సినిమాల్లో చేరినట్లే" అని అదోలా అంటూ వెళ్లిపోయారు సుభద్రమ్మ, చాముండి.

వచ్చిన వాళ్లు ఇద్దరు ఒకరి మొహం ఒకరు చూసుకుని బిక్కమొహాలు వేశారు.

సావిత్రి స్నానం చేసి వచ్చింది.

"ఏమైనా తిన్నారా" అని అడిగింది.

"తిన్నామండి" అన్నారు.

"ఇప్పుడు చెప్పండి ఇంట్లో చెప్పే వచ్చారా?" అని అడిగింది సావిత్రి.

వారి దగ్గరినుంచి సరైన సమాధానం లేదు.

"అంటే నేరుగా ఒక సినిమాలో కనిపించేసి మీవాళ్లందరినీ ఆశ్చర్య పరుద్దామనుకున్నారా?"

వాళ్ల మౌనం 'అవును' అన్నట్లు వుంది.

"మీకు ఈ ఫీల్డ్‌లో తెలిసిన వాళ్లెవరూ లేరనుకుంటా?"

"అవునండి ఎవరూ లేరు" అన్నారు వాళ్లు.

"ఎప్పుడు వచ్చారు మద్రాసుకు ?"

"10 రోజుల పైనే అయింది."

"ఎక్కడ వుంటున్నారు ?"

"రెండు రోజులు తెలిసిన వాళ్ల ఇంట్లో వున్నామండీ, ఆ తరువాత నుంచి హోటల్లో వుంటున్నామండి."

"ఎవరన్నా అవకాశం ఇస్తామన్నారా?"

వాళ్ల మౌనమే సమాధానం.

"ఇంకా ఎన్నాళ్లు ఉండదలుచుకున్నారు ఇక్కడ? డబ్బులు వున్నాయా మీ దగ్గర? ఇక్కడ బాగానే వున్నారా మీరు? మీకు నచ్చిందా ?" అని అడిగింది సావిత్రి.

ఆ ఇద్దరమ్మాయిలు కళ్ల నీళ్లు పెట్టుకున్నారు.

ఎదురుగా వున్న టీపాయ్ మీద వున్న 'సినిమా రంగం' పత్రిక తీసుకుంది సావిత్రి. దానిలో పదిమంది వర్ధమాన తారలు పేర్లు చదివింది. "కనీసం మీరు ఈ పుస్తకం దాకైనా రాలేదు. మీకు ఎలా అవకాశాలు వస్తాయనుకున్నారు? ఇప్పటి రోజులు వేరమ్మా, మా రోజులు వేరు. మా రోజుల్లో టాలెంట్ వుండి కాస్త అందం వుంటే చాలు అవకాశాలు ఇచ్చేవారు. అప్పటి మనుషులలో చాలా చిత్తశుద్ధి వుండేది. ఇప్పుడు టాలెంట్‌తో పనిలేదు అందం కావాలి. మీరు పెద్ద అందగత్తెలు కారు, సరే ఎలాగో ఒక సినిమాలో చేస్తారు. ఆ తరువాత పరిస్థితి ఏంటి? మీరు ఎన్ని సినిమాల్లో చేయగలుగుతారు? అనుభవం మీద చెబుతున్నాను. వుంటే ఇదే ఫీల్డ్‌లో వుండిపోవాలి. అలాకాకుండా ఏ రెండు మూడు సినిమాల్లోనే చేసి మళ్లీ మీ ఇళ్లకి వెళితే అక్కడ జనం మిమ్మల్ని ఎలా చూస్తారో ఒకసారి ఊహించుకోండి."

"ఇప్పుడు నేను చెప్పిన వర్ధమాన తారలలో ఇప్పటికే ఇంటికి వెళ్లిపోయిన వాళ్లు వున్నారు. నామాట విని ఇళ్లకు వెళ్లండి. మీకు ఇష్టమైన వేరే ఉద్యోగాలు చేసుకోండి. లేకపోతే పెళ్లి చేసుకోండి. మళ్లీ ఇటువైపు రావద్దు. నామాట వినండి" అని చెప్పి వెనక్కి చూసేసరికి, చాముండి ఒక చేతిలో డబ్బుతో, ఇంకో చేతిలో ఒక బుట్ట పళ్లు, రెండు చీరలతో రెడీగా వుంది.

సావిత్రి వాళ్లకి బట్టలు పెట్టి, ఖర్చులకు డబ్బులు ఇచ్చి, కారు డ్రైవర్ సుబ్బారావుని పిలిచి, "సుబ్బారావు వీళ్లని గుంటూరు వెళ్లే ట్రైన్ ఎక్కించు. టి.సి.కి నేను పంపించానని చెప్పు. మధ్యలో ఎక్కడా దిగకుండా చూడమని చెప్పు. నేరుగా గుంటూరులోనే దిగేది. మీరు ఇంటికి వెళ్లిం తర్వాత నాకు ఫోన్ చేసి చెప్పండి క్షేమంగా చేరినట్లు" అని సాగనంపింది వాళ్లని.

సినీ తళుకులు చూసి ఆకర్షితులైన ఎంతో మంది అమాయకులైన అమ్మాయిలను ఇలా కాపాడి డబ్బులు ఇచ్చి మరీ తిరిగి పంపించేది సావిత్రి.

★★★

సావిత్రి లేకుండా అన్నపూర్ణా వాళ్లు తీసిన 'ఇద్దరు మిత్రులు' 100 రోజుల ఫంక్షన్‌కి సావిత్రిని ఒక అతిథిగా వచ్చి అందరికీ మొమెంటోలు ఇవ్వమన్నారు.

"ఇలాగైనా సరే మా తప్పుని మన్నించు " అన్నారు మధుసూదనరావు.

"అయ్యో ఎంత మాటండీ, అది నా అదృష్టంగా భావిస్తాను" అంది సావిత్రి.

ఒక చార్టెడ్ ప్లేన్‌లో, యూనిట్ సభ్యులు అందరూ హైదరాబాద్ బయలుదేరారు. హైదరాబాద్‌కు చేరుకునే గంటదాకా ఇక సందడే సందడి.

"ఇదుగోండి నేను నాటకాలు వేసేరోజుల్లో ఇలానే అందరము కలిసి బస్సుల్లో, రైళ్లలో వెళ్లేవాళ్లం. ఎంతో సరదాగా ఉండేది ఇప్పటిలాగే" అంది సావిత్రి.

"చూశావా సావిత్రి అప్పటికి ఇప్పటికి నువ్వు ఎంత ఎత్తు ఎదిగావో" అన్నారు ఒకళ్లు.

'నిజమే చాలా ఎత్తు, ఆకాశమంత ఎత్తు' అనుకుంది సావిత్రి.

'రక్తసంబంధం' దర్శకులు వి.మధుసూధనరావు, నిర్మాత డూండేశ్వరరావు మొదట నాగేశ్వరరావును సంప్రదించగా "హీరో హీరోయిన్లుగా ప్రజల హృదయాల్లో నాటుకు పోయిన మేము అన్నా చెల్లెళ్లుగా చేస్తే ప్రజలకు గిట్టదండి." అని నాగేశ్వరరావు అనేసరికి వారిద్దరు ఎన్.టి.ఆర్. దగ్గరకు వచ్చారు. ఎన్.టి.ఆర్. రెండో ఆలోచన లేకుండా సావిత్రికి అన్నగా చేస్తానన్నారు.

వాహినిలో విజయావారి 'గుండమ్మ కథ' షూటింగ్‌లో ఒక పాట చిత్రీకరణ జరుగుతోంది. ఆ పాటలో సావిత్రి పెదవులతో శృంగార భావాన్ని వెలిబుచ్చటం ఆశ్చర్యం వేసింది అందరికీ. ఆ సీన్ చిత్రీకరణ జరుగుతుండగా మాట అలా అలా పాకి ఎంతోమంది వచ్చారు చూడటానికి. ఆ తరువాత సావిత్రిని చాలా ప్రశంసించారు కూడా.

"ఏమిటి ఇంత మంది పోగయ్యారు ఇక్కడ" అంది ఒక సీనియర్ నటి.

"మా అక్కయ్యను చూడటానికి" అంది ఇంకో సహనటి.

"మీ అక్కయ్యను ఇప్పుడు చూసేది ఏముంది. గత పదేళ్ల నుంచి చూస్తున్నాముగా?"

"అదిగో అటు చూడండి ఎంతమంది అభినందిస్తున్నారో!"

"ఎందుకని?"

ఎందుకో చెప్పింది ఆ సహనటి.

"వోస్ ఇంతేనా, నేనూ చేసి చూపిస్తాను చూడు" అంటూ పెదవులు తిప్పసాగింది.

దూరం నుంచి చూసిన చక్రపాణి వడివడిగా వచ్చి "ఏంటమ్మా పెదాలు అలా తిప్పుతున్నావు కొంపదీసి పక్షవాతం ఏమన్నా రాలేదు కదా?" అన్నారు.

"అక్కయ్యా మీ వల్ల కాదు, ఇక ఆపండి. జనాలు భయపడిపోతున్నారు" అంది వస్తున్న నవ్వును ఆపుకుంటూ ఆ సహనటి.

'ఆత్మబంధువు' షూటింగ్ అంతా కూడా హైదరాబాద్ 'సారధి' స్టూడియోలోనే జరిగింది.

ఆ తరువాత మళ్లీ 'చదువుకున్న అమ్మాయిలు' షూటింగ్ కోసం హైదరాబాద్‌కు రావాల్సొచ్చింది. 'వాహిని' స్టూడియో స్ట్రైక్‌లో ఉండటం చేత హైదరాబాద్ 'సారధి' స్టూడియోలో షూటింగ్ చేయవలసి వచ్చింది. అప్పటి మంత్రులు చెన్నారెడ్డి తదితరులు "షూటింగ్ ఇక్కడే చేయండి, మీకు ఖర్చు ఎక్కువైతే ఆ ఖర్చుని ప్రభుత్వం భరిస్తుంది" అన్నారు.

ప్రభుత్వం భరిస్తుంది అని హామీ ఇచ్చినా కూడా సావిత్రి ఎక్కువ ఖర్చుపెట్టించ తలచుకోలేదు. 'సారధి' స్టూడియోలో ఉన్న రూంలో ఉంటానికే నిశ్చయించుకుంది. సావిత్రే ఉండటంతో ఇక మిగతావారు తప్పక ఉండాల్సి వచ్చింది.

ఇలా సావిత్రి తరచూ హైదరాబాదు రావాల్సొచ్చేది. వచ్చినప్పుడు హోటళ్లను ఇష్టపడేది కాదు. స్టూడియోల్లోనూ, గెస్ట్‌హౌస్‌ల్లోనూ ఉండేది. ఆ తర్వాత సావిత్రి అక్క మారుతి కుటుంబం హైదరాబాద్ తరలి వచ్చింది.ఇక వారి ఇంట్లోనే ఉండిపోయేది.

★★★

సావిత్రికి రోజుకి బోలెడన్ని అభిమానుల ఉత్తరాలు వస్తుంటాయి. ఇవి 'పెళ్లి చేసి చూడు' సినిమా తర్వాత నుంచి వచ్చేవి. ఆ తర్వాత ఏడాది ఏడాదికి వాటి సంఖ్య రెట్టింపు అవుతూ వచ్చేది. మొదట్లో వుండే ఉత్సాహం కొద్దీ సావిత్రినే ఆ ఉత్తరాలకి జవాబు రాసేది.ఆ తర్వాత ఉత్తరాలు చదివేదిగాని జవాబు రాసే తీరికగానీ ఓపికగానీ వుండేవి కావు. చాముండి

తన ఇంటికి చేరిన తర్వాత ఆ ఉత్తరాల పనంతా చాముండి చూసుకుంటుంది. మూస ధోరణి ఉత్తరాలకు సావిత్రి ఆటోగ్రాఫ్ చేసిన ఫోటో ఒకటి పంపిస్తుంది.కొంతమంది వీరాభిమానుల ఉత్తరాలు ఇలా కింద వాటిలా వుంటాయి.... ఒక రోజు చాముండి ఈ ఉత్తరాల పని చూస్తుండగా...

"ఇదిగో సావిత్రి నీ అభిమాని లక్ష్మి అమ్మానాన్నలు రాశారు, పెళ్లికి నిన్ను గట్టిగా రమ్మని అడుగుతున్నారు. నువ్వు వస్తేనే పెళ్లి చేసుకుంటానని పట్టుపట్టిందట వాళ్ల అమ్మాయి,నువ్వు ఫలానా రోజుల్లో రాగలవని చెప్తే అప్పుడే ముహూర్తం పెట్టుకుంటారట."

"నేను రాలేనని, తాళిబొట్టు పంపిస్తానని రాయమన్నాను కదా."

"ఆ ఉత్తరం వాళ్లకి అందిన తర్వాతే ఈ ఉత్తరం రాసింది."

"అయ్యో పాపం! నా గురించి ఎంత ఇబ్బంది వాళ్లకు,నా కోసం కుదిరిన పెళ్లి ఆపుకోవటం దేనికి? సరే చాము నాకు తీరిక వున్న రోజేదో రాయి వాళ్లకు"అంది సావిత్రి.

"ఇది ఎవతో నాకు సవతి, తీరా నువ్వు అక్కడికి వెళ్లినతర్వాత నిన్నే చేసుకుంటా నంటుదేమో! జాగ్రత్త తల్లీ!" అంటూ తర్వాత ఉత్తరం తీసుకుంది చాముండి.

"నిజమేనే" అంటూ గట్టిగా నవ్వింది సావిత్రి.

సావిత్రిని ఎవరి పెళ్లికన్నా పిలిస్తే, వాళ్లు పేదవారైతే బంగారపు తాళిబొట్టు ఇస్తుంది.కాస్త స్థితిమంతులైతే వెండి బిందెలు బహుమతులుగా ఇస్తుంది.తన చుట్టాల్లో అయితే ఏకంగా బంగారపు నగల సెట్లే ఇచ్చేస్తుంది.

★★★

నటి పద్మిని పెళ్లి రిసెప్షన్‌కి సావిత్రి వెళ్లింది. అక్కడ సోఫాలో కూర్చొని కాలుమీద కాలువేసింది. రెండు పాదాల మీద నుంచి చీర తొలిగి పాదాల మీద ఆభరణాలు తళుక్కున మెరిశాయి. అందరూ ఆశ్చర్యపోతూ చెవులు కొరుక్కున్నారు. దూరం నుండి అందరూ తన కాళ్లనే చూసి గుసగుసలాడటం గమనించింది సావిత్రి. చనువు వున్నవాళ్లు దగ్గరకు వచ్చి "సావిత్రి! కాళ్లకు బంగారం పెట్టావా?" అని అడుగుతూ ఆశ్చర్యపోసాగారు. అప్పటికిగాని సావిత్రికి తెలిసిరాలేదు, తన బంగారపు మెట్టెలు, పట్టీలు జనాన్ని అంతగా ఆశ్చర్యపరుస్తాయని. వారు ఆశ్చర్యపోయే విధానం, "కాళ్లకు బంగారమా? లక్ష్మి దేవిని కాళ్లకా?" అని అడుగుతుంటే కాసేపు సావిత్రికి 'తప్పుచేశానా?' అనే అనుమానం వచ్చింది.

కాళ్లకు బంగారు ఆభరణాలు పెట్టుకోవటం బహుశా సావిత్రితోనే మొదలైవుంటుంది. మరి సావిత్రి సంపాదన అటువంటిది. వున్న డబ్బును ఏం చేయాలో అర్థంకాక కావాల్సినన్ని

బంగారపు నగలు చేయించుకున్నా కూడా బంగారం మిగలడంతో కాళ్లకు కూడా చేయించుకుంది. సావిత్రిని చూసి మూడవ రోజుకు ఇతర నటీమణులు ఆమెను అనుకరించారు.

'నర్తనశాల'లో 'జననీ శివకామిని, జయ శుభకారిణి, విజయరూపిణి' అనే పాట కోసం రూపొందించిన అమ్మవారి విగ్రహం చూసి తన్మయురాలయింది సావిత్రి. ఆ పాటను మనస్ఫూర్తిగా దుర్గకి తన భక్తిభావన అంతా మొరపెడుతూ పాడింది. ఆ పాట షూటింగ్ అయిన తర్వాత నిర్మాత అయిన లక్ష్మీరాజ్యం దగ్గరకు వెళ్లి "లక్ష్మీరాజ్యం గారు, మీకు అవసరం లేదు అనుకుంటే ఆ విగ్రహాన్ని మా ఇంటికి పంపించరూ" అని అడిగింది.

"నీ దుర్గ భక్తి నాకు తెలియందా. ఆ ఇంద్రకీలాద్రే మీ ఊరు. తప్పక తీసుకొని వెళ్లు" అన్నారు ఆమె. శ్రద్ధాభక్తులతో ఆ విగ్రహాన్ని తన ఇంటికి తీసుకువచ్చి పూజామందిరంలో ప్రతిష్ఠించుకుంది సావిత్రి.

ఎప్పుడో 1953 తర్వాత మళ్లీ 1962లో హిందీ సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. దక్షిణాదిన సావిత్రి, ఉత్తరాదిన మీనాకుమారి, బెంగాల్‌లో సుచిత్రాసేన్ వీరంతా సమకాలీనులు. పైగా నటనా కౌశల్యంలో లబ్ధప్రతిష్ఠులు. ముగ్గురు ముగ్గురే. వీళ్లలో ఎవరిదైనా ఒక సినిమా హిట్టయితే, ఉదాహరణకి తెలుగులో సావిత్రి నటించిన 'మిస్సమ్మ' హిట్టయితే దానిని హిందీలో కాని, బెంగాలీలోగాని పునర్నిర్మించేవారు. ఓపిక వుంటే అసలు నిర్మాత దర్శకులే తీసేవారు. లేకుంటే హక్కులు అమ్మేవారు. ఇలా రీమేక్స్ చేస్తున్నప్పుడు అసలు సినిమాని ఇప్పుడు చేయబోయే వారికి చూపేవారు. అలాగ సావిత్రి సినిమాలు మీనాకుమారి, మీనాకుమారి హిందీ సినిమాలను సావిత్రి, వీరిద్దరి సినిమాలను సుచిత్రా సేన్, సుచిత్రాసేన్ సినిమాలు వీరిద్దరు అలా చూసుకుని మూలకథ తెలుసుకునే వారు. ఈ పద్ధతిన సావిత్రి ఖ్యాతి బొంబాయి, కలకత్తా చేరుకుంది. సావిత్రి అంటే మీనాకుమారికి, సుచిత్రాసేన్‌కు ఎంతో గౌరవం, అభిమానం. సుచిత్రా సేన్ నటించిన 'మమత' చిత్రం చూసి అందులో సుచిత్రాసేన్ చూపిన నటనకు సావిత్రి పరవశురాలైంది. ఆ పాత్ర తనుకూడా నటించి చూసింది.

సావిత్రి మీనాకుమారిని 'మీనాదీది' అని పిలుస్తుంది. వీరిద్దరికి 1956 నుండి బాగా పరిచయం. అప్పుడు హిందీలో 'మిస్సమ్మ' సినిమాను 'మిస్ మేరి' గా హిందీలో తీస్తున్నారు. హిందీ వెర్షన్‌లో జి.జి. హీరో. మీనాకుమారి సావిత్రి పెదవుల్ని "టాంటలైజింగ్‌లీ ఇర్‌రెసిస్టెబుల్" అని అంటుంది. మద్రాసు వచ్చినప్పుడల్లా మీనాకుమారి సావిత్రి చిత్రాలు చూస్తుంది. 'ఆమె నటన చూసినప్పుడు నా నటనా సామర్థ్యం గురించి నాకే సందేహం వస్తుంది. ఆమె అభిమానులలో నేనూ ఒకతెను' అని అన్నది.

1962 లో కిషోర్‌సాహు అనే ప్రముఖ దర్శక నిర్మాత యొక్క "ఘర్ బసాకే దేఖో" అనే సినిమాలో ఒక ముఖ్య పాత్ర పోషించింది సావిత్రి . ఆ తర్వాత సంవత్సరం దేవిశర్మ అనే హిందీ దర్శకుడు మీనాకుమారి దగ్గరకు వెళ్లి తన చిత్రం 'గంగా కీ లెహరే' లో నటించాలని అడగ్గా " నేను చాలా బిజిగా వున్నానండి ,నన్నడిగితే మాత్రం ఆ పాత్రకు సావిత్రి బాగా సరిపోతుంది. ఆమెను తీసుకోండి" అని అన్నది.

"ఆ మద్రాసు వారితో చాలా కష్టమండి. డైలాగులు అరుస్తూ వుంటారు. మనకి సరిపడదు" అన్నాడు దేవిశర్మ.

"ఈ అమ్మాయి అందరి మద్రాసు వాళ్లలాంటిది కాదు. ఎలా చేయమంటారో అలా చేయగలదు. అంతెందుకు మీ భార్యకు కూడా బాగా తెలుసు సావిత్రి గురించి. నామాట కాకపోయినా మీ ఆవిడని అడిగి చూడండి" అని నమ్మకంగా అంది మీనాకుమారి.

ఆ తరువాత దేవిశర్మ ఆయన భార్య అభిప్రాయం కూడా తీసుకున్నాడు. ఆమె అప్పటికే సావిత్రి సినిమాలు చూసింది కాబట్టి సావిత్రినే తీసుకోమంది.

"మీనాకుమారికి తులతూగే నటి ఈవిడ. ఇంకా మీనాకుమారిలో లేని అందం, వర్చస్సు ఈమెలో వుంది. తప్పకుండా సావిత్రిని తీసుకోండి" అని భర్తతో అంది.


సావిత్రి బొంబాయి వచ్చి హిందీలో డైలాగ్‌లు చెప్పేదాకా కూడా దేవిశర్మ కుదుటపడలేదు.

సావిత్రికి ఈ మారు హిందీలో డబ్బింగ్ చెప్పవలసిన అవసరం రాలేదు. సావిత్రి హిందీ ఉచ్చారణ,యాస హిందీ వాళ్లలానే వుంది.

'గంగా కీ లెహరే' లో హీరో ధర్మేంద్ర. రెండవ హీరో కిషోర్‌కుమార్.

1963 లో 'ఘర్ బసాకే దేఖో,' 1964 లో 'గంగా కీ లెహరే' బాగా ఆడాయి. సావిత్రికి వెంటనే చాలా అవకాశాలు హిందీ సినిమాల్లో వచ్చాయి.

"ఆ బొంబాయి నచ్చలేదు, వాళ్ల తిండీ నచ్చలేదు. ఒక ఉప్పు ఉండదు, కారం ఉండదు. చప్పిడి తిండి. మొన్న నాలుగు నెలలు తినలేక చచ్చాను. ఒకసారి నా వల్లకాక మద్రాసు నుండి చికెన్ కూర ఫ్లైట్‌లో తెప్పించుకుని మరీ తిన్నాను. జాతీయ స్థాయిలో పేరు, ఎక్కువ డబ్బు వస్తుంది కాని, వీళ్లు సినిమాలు చాలా నెమ్మదిగా తీస్తారు. సంవత్సరాలు పడతాయి ఒక్కో సినిమాకి. నాకు మద్రాసులో అవకాశాలు లేకపోతే కదా, ఇక్కడి అవకాశాలు గురించి ఆలోచించేది. మద్రాసులోనే నాకు తీరిక వుండదు. పైగా నా కుటుంబాన్ని వదిలి నెలలు తరబడి ఇక్కడ వుండవలసిన అవసరం లేదు నాకు" అని చెప్పుకొచ్చేది సన్నిహితులతో, ఎవరైనా హిందీ సినిమాలు చేయొచ్చుగా అని అడిగితే.




'బహుత్ దిన్ హుయె' 1954



'ఘర్ బసాకే దేఖో'లో
మెహమూద్‌తో 1963



'గంగా కీ లహరె'లో
ధర్మేంద్రతో 1964




మీనాకుమారితో



'బలరామ్ శ్రీకృష్ణ' 1968








'ఇద్దరు మిత్రులు' శతదినోత్సవానికి ప్రత్యేక విమానంలో మద్రాసునుంచి హైదరాబాదుకు వచ్చిన నటీ నటులు



'ఇద్దరు మిత్రులు' విజయోత్సవాలు



1961లో మలేషియాలో







గాయని పి. సుశీలతో





తెలుగు 'రక్తసంబంధం' 1962



తమిళ్ 'పాశమలర్ '1962



తెలుగు 'గుండమ్మకథ' 1962




తమిళ్ 'మనిథన్ మారవిల్లాయ్' 1962





**'బంధ పాశం' 1962**



**'కై కొడుత దైవం' 1964**

1963లో రిలీజ్ అయిన తెలుగు సినిమాలు, 'చదువుకున్న అమ్మాయిలు', 'తోబుట్టువులు', 'నర్తనశాల'.

'నర్తనశాల' ఆఫ్రో ఏషియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు పోటి విభాగానికి ఇంకా ప్రదర్శనకు భారత దేశం తరుపున ఎంపికైంది.

★ ★ ★

1963లో నిర్మాణంలో ఉన్నవి 'మూగ మనసులు', 'డాక్టర్ చక్రవర్తి', 'పతివ్రత', 'పూజాఫలం'.

"అమ్మా! రాజమండ్రి వెళ్తున్నాను, గోదావరిలో షూటింగ్. చాముండీ! పాప జాగ్రత్త" అని అప్పగింతలు చెప్పింది సావిత్రి.

"ఎందుకో నాకూ రాబుద్దేస్తోంది సావిత్రి. నువ్వు గోదావరికి వెళుతున్నావు అన్న దగ్గరనుంచి. నాకేంటో మనసులో బాగోలేదు. అక్కడ జాగ్రత్తగా ఉండు. నదిలో ఈతలు కొడతాననకు. మొన్న మైసూర్ వెళుతూ చెట్టు ఎక్కి చింతకాయలు కోసినట్టు" అంది చాముండి.

"అలాగే, అమ్మా అటు నుంచి వడ్డివారిపాలెం వెళతాను. అక్కడ స్కూల్ ఓపెనింగ్ ఉంది. ఆరోజుకి నువ్వు వచ్చేయి. మన చుట్టాలు అందరూ అక్కడ చేరుతారు" అంది.

"ఆ స్కూల్ కట్టడానికి 25,000లు ఇచ్చావు.దానాలు చేసేటప్పుడు ముందు వెనకా కాస్త ఆలోచించాలమ్మాయ్!" సుభద్రమ్మ హితవు చెప్పింది.

"ఇది స్కూల్‌కి అమ్మా. నేను ఇచ్చింది తక్కువే, మిగతా డబ్బులు ప్రభుత్వం, ఊరివాళ్లు వేసుకొని కట్టిస్తున్నారు. పెద్దామ్మ, పెదనాన్న ఇంకా చుట్టాలందరూ ఐదు ఎకరాలు ఇస్తున్నారు. మనం చదువు చెప్పించిన వాళ్లం అయితే మంచిదేకదమ్మా" అంది సావిత్రి.

"అక్కడ ఎవరయినా ఇంకా చందాలు అవీ ఇవీ అడిగితే ఇవ్వకు. దీనికి చెక్ బుక్కులు, డబ్బు ఏమీ ఇవ్వకు చాముండీ" అంది సుభద్రమ్మ.

"మరచిపోయా, మొన్న అప్పారావు వాళ్ల అత్త మనవి రెండు సెట్టులు పట్టుకుపోయింది. మద్రాసులో పెళ్లి, పెట్టుకొని ఇచ్చేస్తామని పట్టుకెళ్లింది. వడ్డివారిపాలెంలో కనిపిస్తే అడగాలి."

"ఏ సెట్లమ్మా".

"అవేనే రాళ్ల సెట్లు".

"ఆ రాళ్ల సెట్లు ఎంతవుతాయి లేమ్మా? దానికి అడగటం దేనికి? వాళ్లే ఇస్తారులే".

"ఛ! ఇదీ దీని వరస" అనుకుంది సుభద్రమ్మ.

గోదావరిలో షూటింగ్ జరుగుతోంది. 'మూగ మనసులు'లో 'ఈనాటి ఈ బంధం మేనాటిదో' అనే పాట చిత్రీకరణ జరుగుతోంది.

నాగేశ్వరరావు ఒక చరణం అభినయించి సావిత్రివైపు చూడాలి. ఆయన అభినయించారు. సావిత్రి వైపు చూశారు. కాని సావిత్రి అక్కడ లేదు. అప్పటికే జారి గోదావరిలో పడిపోయింది. భయపడి పోయింది. ఊపిరి ఆడటం లేదు. చుట్టూ నిండుగా నీళ్లు. నీళ్లు తాగేస్తోంది. ఈదగా ఈదగా పడవ అంచున కొక్కెంలాంటిది తగిలింది. దాన్ని పట్టుకొని వేలాడింది. అంతలోకి నాగేశ్వరరావు కేకలు వేయడంతో పడవను ఆపారు, నాగేశ్వరరావు చేయి అందివ్వగా పైకి లేచింది. వెంటనే అవుట్‌డోర్ యూనిట్ బస్‌లోకి తీసుకెళ్లి ఒక దుప్పటి కప్పారు. సావిత్రి షాక్‌లో ఉంది. ఆరోజుకి షూటింగ్ ఆపేశారు. తేరుకున్న తరువాత "అమ్మో!ఇంకొంచెం ఉంటే మునిగిపోయి పైకి పోయేదానిగా. అమ్మో నా పాప" అనుకుంది. ఆ వెంటనే రాజమండ్రికి వచ్చేశారు యూనిటంతా. అక్కడ నుంచి ట్రంక్‌కాల్ బుక్‌చేసి చాముండికి చెప్పింది.

"అందుకే సావిత్రి నా మనసు ఏమి బాగోలేదన్నది. రేపట్నుంచి ఇంకా జాగ్రత్తగా ఉండు. ఈ షూటింగు అయిన తర్వాత ఎప్పుడూ ఏ షూటింగ్‌కి గోదావరి వైపు వెళ్లకు" అంది.

★★★

ఒకసారి సావిత్రి, "చాముండీ! విజయవాడలో తోటలు కొన్నాం తెలుసుకదా. వాటిలో ఏమి పండుతున్నాయో ఒకసారి ఫోన్ చేసి కనుక్కో" అంది .

"ఇంత హఠాత్తుగా అవెందుకు గుర్తుకొచ్చాయి" అడిగింది చాముండి.

"ఆ మధ్య రాజమండ్రి నుంచి వడ్డివారిపాలెం వెళ్తుంటే గుర్తొచ్చింది. నాకు కూడా తోటలు ఉండాలని, అస్సలు అప్పుడుదాకా గుర్తులేదు. మళ్లీ మర్చిపోయాను. ఇదిగో మళ్లీ ఇప్పుడు గుర్తొచ్చింది."

"ఆ మధ్య రాజమండ్రి నుంచి వడ్డివారిపాలెం వెళ్లావు అంటే 1963 జనవరిలో, ఇప్పుడు 1963 డిసెంబర్ ఇంత ముఖ్య విషయం ఒక సంవత్సరానికి గాని నీకు గుర్తు రాలేదన్న మాట. పోనీలే ఇప్పుడన్నా గుర్తొచ్చింది. ఎప్పుడు కొన్నావు?"

"గుర్తు లేదు".

"కనీసం దానికైనా నీ పేరు పెట్టావా? కచ్చితంగా పెట్టి ఉండవు.ఎందుకంటే నీ పేరే ఉంటే కచ్చితంగా ఏదో ఒక రూపేణ నీకు దాని గురించి ఏదో ఒక ఉత్తరం వచ్చేది".



మోము మీద పాదరసంలా కదిలే హావభావాలు
'కుంకుమ రేఖ' సినిమాలో ఒక పాటలోని దృశ్యాలు



మోము మీద పాదరసంలా కదిలే హావభావాలు
'మంచి మనసులు' సినిమాలో ఒక పాటలోని దృశ్యాలు



పండు వెన్నెల వంటి నిండైన నవ్వు



వెన్నెల విరజిమ్మే నవ్వు



"అవును చామూ! భలే కనిపెట్టావు".

"ఎవరో అమ్మ తరఫువాళ్ల పేరు మీద ఉండవచ్చు".

"ఒక్కసారి బెజవాడలో వీరన్నగారికి ఫోన్ చేస్తే ఆయనకు తెలిసుండవచ్చు".

"సరే ఇక నాకు వదిలేయ్ నేను కనుక్కుంటాను".

"అట్లాగే చాముండి, విజయవాడ దగ్గర గంగూరులో విజయా స్పిన్నింగ్ మిల్స్ ఉండాలి గదా దాని సంగతి కూడా కనుక్కో".

"సరే."

తర్వాత సినిమాల ప్రసక్తి వచ్చింది.

"అయినా అన్నపూర్ణా వాళ్లు జనాన్ని అడిగితే 'డాక్టర్ చక్రవర్తి'లో వేషాలు ఎవరు వేస్తే బాగుంటుందనేది, ఆ ఏడుపు రోల్‌కు ఏకగ్రీవంగా నిన్నే ఎంచుకున్నారెందుకు జనాలు?" అడిగింది చాముండి.

"నువ్వు ఏ సినిమాలో ఇంతగా ఏడవలేదే".

"అంత హెవీ రోల్, ఇంత హెవీ మనిషిని సమర్థవంతంగా పోషిస్తాననేమో" అంది సావిత్రి.

"సరేలే ఎప్పుడూ ఈ సినిమాల గోల ఎందుకే. అవునుగానీ చాముండి నీ గురించి చెప్పు. నేనెప్పుడూ అడగలేదు. నువ్వూ ఎప్పుడూ చెప్పలేదు. సుందరం, ఏ.వి.యం.చెట్టియార్ వీళ్లంతా నీకెలా తెలుసు. మీ ఊరి గురించి చెప్పు."

"నా గురించి ఇంకెప్పుడైనా చెప్తాను. నీ గురించి చెప్పు వింటాను" అంది చాముండి.

"నాకు కారు రేస్ అంటే బాగా ఇష్టం చాముండి. షోలిగర్ కారు రేసుల్లో వరసగా మూడు సార్లు కప్పు గెలుచుకున్నాను.కానీ ఆయనెందుకో కారు రేస్‌లు వద్దన్నారు, మానేశాను. రేస్‌లంటే గుర్తొచ్చింది చాముండి, మొన్న ఒక అరవ ప్రొడ్యూసర్‌తో వస్తున్నా, నన్ను హార్స్ రేసింగ్‌కి తీసుకెళ్లాడు. నేను పందెం కాయను నాకు ఇష్టం ఉండదు, అంటే బలవంత పెట్టాడు. అతని డబ్బునే తీసి పెట్టాడు, 200 రూపాయలు. నన్ను కనీసం గుర్రాన్నైనా ఎంచుకోమన్నాడు. నాకు నచ్చిన ఒక రంగు రంగుల గుర్రం మీద పెట్టాను. చివరకు అదే గెలిచింది. నాకు వెయ్యి రూపాయలు వచ్చాయి.

"మంచిదేగా అయితే."

"ఇంకా మంచిది జరిగింది, ఏంటంటే , ఆ ప్రొడ్యూసర్ మొదటి నుంచి మన సినిమాకు ఏ పేరు పెడదామండీ అనీ అడుగుతూనే ఉన్నాడు. ఆలోచిస్తాను అని చెపుతున్నా. ఈ 1000 రూపాయలు గెలిచేసరికి నాకు ఒక ఆలోచన వచ్చింది. అదే ఆయనకు చెప్పాను. మన సినిమాకు 'వెయ్యి రూపాయల నోటు' అనే పేరు సరిపోతుందని, ఆయన ఆలోచించి కరెక్ట్‌గా సరిపోతుందనుకున్నాడు. చూడు ఆ సినిమాని, 'ఆయిరమ్ రూపాయ్' అని తమిళ్‌లో ఉంటుంది."

"ఇంకా తెలుసా... నాకు వర్షంలో ఆడటమంటే ఎంతో ఇష్టం. మా బెజవాడలో వర్షం పడితే చాలు లీలా, నేను ఒకళ్లనొకళ్లను కలుసుకోడానికి బయలుదేరేవాళ్లం. ఎక్కడో అక్కడ ఎదురుపడేవాళ్లం. వాళ్లింటికో మా ఇంటికో చేరి వర్షంలో ఆడేవాళ్లం." కాసేపు సావిత్రి ఏమీ మాట్లాడలేదు. కొంచెం సేపు తరువాత "అసలీ మద్రాసులో వర్షం పడదేమే?" అని అడిగింది.

అలా మాట్లాడుతునే ఉంది సావిత్రి. ఆ మాటల్లో ఎప్పటిలాగా సంతోషం లేదు. మనసు ఎక్కడో ఉంచి మాట్లాడుతోంది. అంతలోకి జి.జి.వచ్చాడు. ఎప్పుడూ సంతోషంగా ఎదురు వెళ్లేది, ఆరోజు నీరసంగా వెళ్లింది.

అంతా గమనిస్తూనే ఉంది చాముండి, ఏదో జరగరానిది జరుగుతోంది. సావిత్రి మానసికంగా చాలా మారిపోతుంది. సినిమాలే ఊపిరిగా బతికిన సావిత్రి సినిమాల మీద అంత ధ్యాస చూపటం లేదు. సినిమాలు తక్కువైనా బాధపడటం లేదు. సినిమాలు కాకుండా ఇంకా ఏదో మనసు నిండా ఆవరించి ఉంది.

అది ఏమిటో ఊహించటం పెద్ద కష్టమేమి కాదు చాముండికి. 'తొందరగా గొడవలు సమసిపోతే బాగుండు, మళ్లీ హుషారుగా ఉంటుంది సావిత్రి' అనుకుంది చాముండి.

ఒకరోజు 'డాక్టర్ చక్రవర్తి' షూటింగ్‌కు వెళ్తూ తూలింది. చాముండి, సుభద్రమ్మ పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టారు.

"ఏమే! కడుపులో అబ్బాయి పడ్డాడా ఏమిటి" అడిగింది సుభద్రమ్మ.

"డాక్టర్‌ను కలిసి చెపుతాలే అమ్మా" అని వడివడిగా వెళ్లిపోయింది.

★★★

1964 లో... "మేము ఆంధ్ర యువతి మండలి, హైదరాబాద్ నుంచి వస్తున్నాము. మీకు గజారోహణం చేయించి పురవీధుల్లో తిప్పి చివరకు రవీంద్రభారతిలో 'మహానటి'

అనే బిరుదుతో సత్కరించదలిచాము. మీ వారిని కూడా ఆహ్వానిస్తున్నాము. ఆయన కూడా మీతోపాటు గజారోహణం చేస్తారు" అని వారి ప్రతిపాదన చెప్పారు.

అది విని జి.జి. "ఏనుగులంటే నాకు భయమండీ, అయినా ఏనుగే ఎందుకంట? ఏ బస్సో, కారో మీద కూర్చోబెట్టి తిప్పవచ్చు కదా, ఏనుగులకి విసుగొస్తే పిచ్చివాటిలా పరిగెత్తుతాయట కదా" అంటూ భయపడిపోయాడు.

"గొప్పవారిని ఏనుగుమీద ఊరేగించడం ఆనవాయితి, శ్రీకృష్ణదేవరాయలు తన అష్టదిగ్గజాలను ఏనుగులమీద ఊరేగించేవారు. మీరు భయపడే ఏనుగులు అడవిలో వుండే ఏనుగులు, ఇప్పుడు మీరు ఎక్కబోయే ఏనుగుని అన్ని పండుగలకు ఊరేగిస్తారు. దీనికి జనం మధ్య నడవటం అలవాటే, పైగా మావటివాళ్లు తప్పకుండా వుంటారు. మీకు ఏ భయం అవసరం లేదు" అన్నారు ఆంధ్ర యువతి మండలి వారు.

మార్చి నాలుగున సావిత్రి దంపతులు హైదరాబాద్ చేరుకున్నారు. ఆరవ తేదీనాడు, వారి ఇరువురిని గజారోహణం చేయించి, పబ్లిక్ గార్డెన్స్ నుంచి రవీంద్రభారతి లోపల వరకు తీసుకువెళ్లారు.

జి.జి. భయపడుతున్నాడు, సావిత్రి మాత్రం ఎలాంటి జంకు లేకుండా ఏనుగెక్కి కూర్చుంది. దంపతులు ఇద్దరు అంబారిలో కూర్చోగా ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డితో సహా ఇంకొందరు మంత్రులు, అధికారులు, అభిమానులు ముందు నడిచారు. సావిత్రి తన ముఖ్యమైన మిత్రులను కూడా పిలిచింది, ఈ సన్మానంలో పాల్గొనమని. తాను గజారోహిణియై వుండి కింద ఎంతోమంది ప్రముఖులు నడుస్తూ వుంటే, జీవితంలో మొదటిసారిగా గర్వపడింది.

ఆ తర్వాత రవీంద్రభారతిలో 'మహానటి' అనే బిరుదుతో సత్కరించారు. ఆనాటినుంచి మహానటి అంటే సావిత్రి. సావిత్రి అంటే మహానటి.

మద్రాసుకు వచ్చిన తరువాత, "అమ్మా నువ్వు రాలేదు కాని, ఆ సన్మానం ఎంత బాగా జరిగిందో తెలుసా! ఏనుగు మీద కూర్చుంటే నేను నిజంగా మహారాణినే అయినట్లు అనిపించింది."

"నువ్వు మహారాణివే తల్లీ, మకుటంలేని మహారాణివి ఈ ఉభయ రాష్ట్రాలకి" అంది సుభద్రమ్మ.

"ఇంతకీ మీరిద్దరూ ఎక్కారు కదా, ఆ ఏనుగు ఎలా వుంది ?" అడిగింది చాముండి.



**1964లో హైదరాబాద్‌లో గజారోహణం**



**1964 ఏప్రిల్‌లో ఉత్తమ చలనచిత్రాలకు బహుమతుల ప్రదానోత్సవంలో అప్పటి ప్రధాని నెహ్రూతో**



**1955లో మద్రాస్ ఫిలిమ్ ఫ్యాన్స్ అసోసియేషన్ వారు 1953 సంవత్సరానికిగాను ఉత్తమ తమిళ నటి అవార్డు బహూకరిస్తూ**



అప్పటి రాష్ట్రపతి శ్రీ రాధకృష్ణన్‌తో





అన్నాదురైనుంచి పొన్నాడై స్వీకరిస్తూ



కామరాజ నాదార్‌తో




మే 1958లో గుడివాడలో 20వ ఆంధ్ర నాటక కళాపరిషత్ మహాసభలో సన్మానం పొందిన దర్శకుడు పి. పుల్లయ్య, సావిత్రి, నాట్యదర్శకుడు వెంపటి పెద్ద సత్యం



1964లో ప్రొద్దుటూరు రాయల నాటక కళాపరిషత్ వారి సన్మానం



మద్రాస్ శ్రీనివాస గాంధీ నిలయం వారి సన్మానం



హీరో జయశంకర్ నిర్వహించిన సావిత్రి సన్మాన సభలో మనోరమతో



'కిన్నెర ఆర్ట్ థియేటర్స్' వారి సన్మానం



మద్రాస్ 'కళాసాగర్' వారి సన్మానం



ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్‌కు లాల్‌బహదూర్ శాస్త్రికి నిలువుదోపిడి ఇస్తూ



ఇందిరాగాంధీతో



నటి జమునను పెళ్లికూతురుగా అలంకరిస్తూ



జమున పెళ్లి రిసెప్షన్‌లో






'మనిషి చేసిన బొమ్మలతో దేవుడు చేసిన బొమ్మ'



ఎమ్.జి.ఆర్. శివాజీలతో



స్టార్ క్రికెట్ ఆడుతూ శివాజిగణేషన్‌తో



శివాజిగణేషన్‌తో

"అది ఏనుగే దానికేమవుతుంది?" అంది సావిత్రి.

"అది ఏనుగైనా ఎక్కింది ఇద్దరు గానుగలు కదా" అంది చాముండి నవ్వుతూ.

సావిత్రి, సుభద్రమ్మ కూడా నవ్వుకున్నారు.

సావిత్రిని తనని ఎవరైనా 'నువ్వు లావు' అన్నా, 'ఇంక లావు తగ్గవా' అన్నా చాలా చిరాకుపడుతుంది, కోపగించుకుంటుంది. అన్నవాళ్లు ఆప్తులైతే తప్ప .

ఇదంతా జి.జి. విన్నాడు.

ఆ తర్వాత సావిత్రితో "చాముండికి చాలా అలుసు ఇస్తున్నావు నువ్వు అనవసరంగా నెత్తికెక్కించు కుంటున్నావు" అని అన్నాడు.

అదే సంవత్సరంలో వెనువెంటనే జరిగిన ఇంకో సన్మానం ప్రొద్దుటూరు 'రాయల నాటక కళాపరిషత్' వారిచే చేయబడింది. ఏప్రియల్‌లో ఈ పరిషత్తు సావిత్రికి బంగారు కంకణం తొడిగింది. మహాకవి శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి సావిత్రిని సత్కరించారు.

1964లో ఆఫ్రో ఏషియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'నర్తనశాల' నిర్మాత శ్రీమతి లక్ష్మీ రాజ్యం,కళాదర్శకులు టి.వి.ఎస్.శర్మ , ఎస్.వి. రంగారావులతో పాటు సావిత్రి ఇండోనేషియా రాజధాని జకార్తా చేరుకుంది. ఇది సావిత్రికి మూడవ విదేశీ యాత్ర. కళాదర్శకులు టి.వి.ఎస్.శర్మకు ఈ ఫెస్టివల్‌లో 'బెస్ట్ ఆర్ట్ డైరెక్టర్' అవార్డు వచ్చింది.

"సావిత్రి ఆనాడు మీ అమ్మవారి విగ్రహం చూసి తన్మయురాలయినప్పుడే మీకు ఈ అవార్డు ఖాయమయింది శర్మ గారు" అన్నారు లక్ష్మీరాజ్యం. సావిత్రికి ఇంకా సంతోషాన్ని ఇచ్చిన విషయం ఏంటంటే, తనకు తండ్రి సమానుడైన ఎస్.వి. రంగారావుకు 'నర్తనశాల' లోని కీచక పాత్రకు, ఈ ఫెస్టివల్‌లో 'బెస్ట్ యాక్టర్' అవార్డు వచ్చింది.

★★★

1964లో ప్రొడక్షన్‌లో ఉన్నవి యస్.వి. రంగారావు దర్శక-నిర్మాణంలో 'నాదీ ఆడజన్మే', హాస్యనటుడు పద్మనాభం నిర్మిస్తున్న 'దేవత', 'మనుషులు మమతలు', 'సుమంగళి'.

యస్.వి.ఆర్. సావిత్రి లేకుండా సొంత సినిమా తీయరు. సావిత్రి ఆయనకు కూతురుతో సమానం. సావిత్రికీ అంతే, ఆయనంటే అమితమైన గౌరవం. ఈ బాంధవ్యం ఎప్పటిదో. 1950లలో చిన్నపిల్ల సావిత్రి చలాకీగా, అమాయకంగా తిరిగే రోజు నుంచి ఉన్న బాంధవ్యం. సావిత్రి రెండో సినిమా 'పెళ్లి చేసి చూడు'లో సావిత్రికి తండ్రిగా వేషం వేశారు. అప్పుడే ఆయన వేలు పట్టుకు తిరిగేది. ఆ వెంటనే మూడో సినిమా 'పల్లెటూరు'లో ఆయన విలన్



వెండితెర సామ్రాజ్ఞి





జకర్తాలో జరిగిన ఆసియా - ఆఫ్రికా ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా నాటి ఇండోనేషియా అధ్యక్షుడు శ్రీ సుకర్నోతో 'నర్తనశాల' టీమ్ లక్ష్మీరాజ్యం, సావిత్రి, రంగారావు


నేడే చూడండి
రాజ్యం పిక్చర్స్...
నర్తనశాల

వేషం వేసినప్పుడు సావిత్రిని బలాత్కరించే సీన్ ఉంటుంది. అది చేయటానికి ఆయన మనసు అంగీకరించక చాలా కష్టపడాల్సి వచ్చింది. అటువంటిది ఆయనకు సావిత్రికి ఉన్న అనుబంధం. అందుచేత ఆయన సావిత్రి లేకుండా సినిమా తియ్యరు. పైగా ఆయన సబ్జెక్ట్‌కి కూడా సావిత్రి అంతటి నటి కావాలి. ఆ పాత్ర నల్లగా కూడా ఉంటుంది. సావిత్రి కూడా నలుపే కాబట్టి "సావిత్రి... యస్.వి.ఆర్. బాగా తెలివిగలవారు. నీకు మేకప్ వేయకుండా ఆ కాస్త ఖర్చు మిగుల్చుకుంటున్నారు" అని హాస్యమాడేవారు సన్నిహితులు.

పద్మనాభం 'దేవత'లో ముందుగానే పెళ్లి అయిన జంటను చూపిస్తారు. ఇక 'సుమంగళి' ఏ.ఎన్.ఆర్‌తో చివరి సినిమా అని అప్పుడే అనుకున్నారు అందరూ. సావిత్రి వొళ్లు నాగేశ్వరరావుని మించిపోయింది. ఇక ఆమె పక్కన నుంచొని మెప్పించగలిగింది ఒక్క ఎన్టీఆరే.

సావిత్రికి ఆలోచన వచ్చిందో రాలేదో కాని చాముండికి ఖరాఖండిగా తెలిసింది సావిత్రి హీరోయిన్ యుగం అయిపోయింది, ఇక హీరోయిన్‌గా సినిమాలు మెల్లమెల్లగా తగ్గుతాయని. సీనియర్ అయిన అంజలీదేవి దగ్గరకు వెళ్లింది.

సావిత్రికి ముందు ముందు ఎలాంటి రోల్స్ వస్తాయి. అలాంటి పరిస్థితులను ఆమె ఎలా తట్టుకోగలదు అని అడిగింది.

"చాలా ఇబ్బంది పెట్టే కాలం. సంధికాలం. నేను తట్టుకోలేకపోయాను. ఎంత ప్రశాంతంగా ఉండాలనుకున్నా మనసు బాగుండేది కాదు. నిదానంగా సమాధానపరచుకో గలిగాను. మా తరం ఆలోచనా ధోరణికి సావిత్రి తరం ఆలోచనా ధోరణికి చాలా మార్పు ఉంది. పైగా సావిత్రికి తొందర ఎక్కువ. గత సంవత్సరమే చాలా బిజీగా ఉండి ఇప్పుడు చేతిలో ఏమీలేక, ఉన్నా కూడా చిన్న రోల్స్, ఆ చుట్టూవున్న వాళ్ల చులకన చూపులు, అవికాస్త ఇబ్బంది పెడతాయి. కాని సావిత్రిని సీనియర్‌లే చులకనగా చూడరు. ఇంక పిల్లకాయలు ఏమి చూస్తారు. తనలో న్యూనతాభావం లేకపోతే ఈ సంధికాలం గట్టెక్కవచ్చు. నాకు మెల్లగా వదిన రోల్స్ వచ్చాయి. తర్వాత అంటే, ఇప్పుడు తల్లి రోల్స్, అత్త రోల్స్ ఇస్తున్నారు. తర్వాత తర్వాత బామ్మ రోల్స్ కూడా ఇస్తారేమో."

అవును సావిత్రి తట్టుకోలేదు, తాను ఖాళీగా ఉండటం ఏమాత్రం సహించదు. జి.జి. సరదాగా ఈ రోజు ఖాళీయేనా అన్నా ఆమెకు రంగులు మారిపోతాయి మొహం మీద.

సావిత్రిని ఎలాగైనా సన్నం చేసి పాత్రలు ఆగకుండా చూడాలి అనుకుంది. అదే మాట అంజలీదేవితో కూడా చెప్పింది.

"అవునూ ఈమధ్య ఎందుకు అలా లావెక్కితూనే ఉంది."

"నేను మాత్రం బాగా కచ్చితంగానే తిండి పెడతానండి. ఎక్కువ తిననివ్వను."

"భలేదానవు దొరికావులే మొత్తానికి. ఇంకొక్కమాట సావిత్రి మొహం ఉబ్బుతోంది. ఎక్కువ తాగుతోందా? మామూలుగా అయితే హీరోయిన్‌లు బీరు తీసుకుంటారు. సావిత్రి ఇంకో మెట్టు ఎక్కినట్లు ఉంది."

ఎంత డైటింగ్ చేయించినా లావు, ఒకసారి తూలింది. మొహం ఉబ్బింది, తాగుతుందా? అన్ని ఒకదాని వెంట ఒకటి చాముండి మెదడులోకి వచ్చాయి. అన్నీ అతికినట్లు సరిపోయాయి. హతాశురాలైంది చాముండి.

ఉబ్బటం తను గమనించింది. ఎక్కువ నిద్రపోవటం వల్ల అనుకుంది. 'ఎందుకు తాగుతుంది' అనుకొని బాధపడింది.

'ఛ! ఛ! సావిత్రి ఎందుకు తాగుతుంది. తనకేం అవసరం వచ్చింది. ఉచ్ఛనీచాలు తెలియదా తనకు' అనుకుంది. 'ఇక గట్టిగా గమనించాలి' అనుకుంది.

1964 'సుమంగళి' షూటింగ్ జరుగుతుంది. సావిత్రి, ఏ.ఎన్.ఆర్. మీద కొన్ని ముఖ్యమైన దృశ్యాలు చిత్రీకరిస్తున్నారు.

ఒక సీన్‌లో ఏ.ఎన్.ఆర్. చెప్పిన డైలాగ్ తీరు సావిత్రికి నచ్చలేదు. ఆయన ఒంటరిగా వున్నప్పుడు ఇలా చెప్పింది.

"నాగేశ్వరరావుగారు ఇలా చెప్పి చూడండి" అని, తను అనుకున్న పద్ధతిలో చెప్పి వినిపించింది.

ఏ.ఎన్.ఆర్. సావిత్రి చెప్పినదానిని అవగాహన చేసుకొని, "సావిత్రి నువ్వు చెప్పినతీరు ఎంత బాగుందంటే నేను కాదు అనటానికి కూడా వీలు లేకుండా వుంది. అలాగే చెప్తాను ఈ డైలాగ్" అన్నారు.


ఆ సీన్ అద్భుతంగా వచ్చింది.

"అందుకే నిన్ను సీసపుముక్క అనేది" అన్నారు ఏ.ఎన్.ఆర్ సావిత్రిని మెచ్చుకోలుగా.

ఇదే 'సుమంగళి' షూటింగ్‌లో ఇంకోరోజు సావిత్రి, నాగేశ్వరరావు వ్యధాభరిత పరిస్థితుల్లో ఒకరి నొకరు త్యాగం చేసే సన్నివేశం చిత్రీకరణ జరుగుతోంది.


అప్పుడు డైరెక్టర్ ఆదుర్తి సుబ్బారావుతో "చీకటి గదిలో పాత్రలపై చిరు వెలుగు వుంటే పాత్రల నీడలు గోడల మీద పడతాయి. ఆ నీడల మీద కెమేరా ఫోకస్ చేస్తే అప్పుడు పాత్రలు మాట్లాడుకుంటూ వుంటే చాలా ఎఫెక్టివ్‌గా వుంటుంది"అని చెప్పింది సావిత్రి.


ఆదుర్తి సుబ్బారావు ఆలోచించి ఆ సీన్‌ని అలాగే డైరెక్ట్ చేశారు. ఆ సీన్ సినిమాలో బ్రహ్మాండంగా వచ్చింది. ఇందుకనే కాదు, సుబ్బారావు అంతకు ముందు నుంచే అనేవారు...





**1964 రాజమండ్రిలో**





**1964** రాజమండ్రిలో ఆదుర్తి సుబ్బారావు సన్మాన సభ

"సిట్యుయేషన్ చెప్పేసి డైలాగ్ ఇచ్చేస్తే సావిత్రికి వేరే డైరెక్టర్ అవసరం లేదు, తనకు తానే డైరెక్టర్ అయిపోతుంది" అని.

'మనషులు మమతలు'లో జయలలిత స్విమ్‌సూట్‌లో కనిపిస్తుంది. ఇది కొత్త తరానికి బలమైన సంకేతం.

1964లో సావిత్రికి సినిమాలు ఎందుకు తగ్గినయ్? ఇది చాముండిని వేధిస్తున్న ప్రశ్న. అదే అడిగింది సావిత్రిని.

"నేనే తగ్గించుకున్నానే, ఎట్లాగు అబ్బాయి కావాలనుకుంటున్నాను కదా."

"కాదు నువ్వు లావెక్కుతున్నావు."

"దానికి నేనేమీ చెయ్యలేను. నా వంటి తీరే అంత. హీరోయిన్‌గా నేను ఎన్ని చేయలేదు. ఇప్పుడు కాస్త తక్కువయ్యాయి అంతేగా. అసలు రాకుండా పోలేదుగా. ఇలా వస్తూనే ఉంటాయి తక్కువయినా" సమర్థించుకుంది సావిత్రి.

"ఆ తక్కువవటం నేను భరించలేను. అందులోనూ నువ్వు లావెక్కటం వల్ల, లాభం లేదు. నిన్ను ఇంకా వంచాలి".

"చామూ! ఆ పని మాత్రం చేయకే, తల్లి కావాలసినదాన్ని."

"తల్లి అయినప్పుడు చూసుకుందాంలే" అంది చాముండి.

1964లో సావిత్రిని వెతుక్కుంటూ వచ్చిన సినిమాలు రాసిలో తక్కువైనా వాసిలో ఎక్కువైనవి.

'సగానికి సగం ఎందుకు తగ్గాయి. చాముండి ఆలోచించసాగింది. మొహంలో అందం ఏ మాత్రం తగ్గలేదు. లావు సంగతికి వస్తే 1962లో హిట్ సినిమాలకంటే పెద్దగా లావు లేదు. మరి ఎందుకు తగ్గుతున్నట్లు?'

కొత్త అమ్మాయిలు దూసుకువస్తున్నారు. హీరోయిన్‌లు నాజూకుగా ఉండాలంటున్నారు నిర్మాతలు. ఇది ఒక కారణం కావచ్చు. కథల తీరు మారుతోంది. కథానాయికలు నటించాల్సిన తీరు మారుతోంది. ఆ తీరులో సావిత్రిని నటించమని అడిగే బుద్ధి కూడా కలగదు నిర్మాతలకు, దర్శకులకు. అడగాలన్నా ధైర్యం చేయలేరు. ఇవన్నీ సరైనవే అయినా చాముండి కుదుటపడలేదు.

★★★

'దేవత' సినిమా అడ్వాన్సు ఇవ్వటానికి పద్మనాభం వచ్చారు. ముందుగానే చెప్పింది "నాకు మూడో నెల అండీ, మీరు తొందరగా పూర్తి చేయగలనంటే అడ్వాన్సు తీసుకుంటాను" అని.

"తప్పకుండా చేయగలను" అన్నారు పద్మనాభం.

అడ్వాన్స్ ఇవ్వబోతుండగా ఒక వంద రూపాయలు నోటు కింద పడిపోయింది.

"పద్మనాభం గారు మీ 'దేవత' మీకు కనక వృష్టి కురిపిస్తుంది" అంది సావిత్రి.

సావిత్రి అన్నట్లే 'దేవత' చాలా మంచి హిట్ అయింది.

ఈసారి అబ్బాయి పుట్టాలని ఎన్నో మొక్కులు మొక్కింది సావిత్రి. తిరుపతి కొండకు నడిచివస్తానని మొక్కుకుంది. గురువాయూర్ వస్తానని మొక్కుకుంది. మైసూరు చాముండేశ్వరిదేవిని మొక్కుకుంది.

' 'పుట్టబోయేది ఎవరా అని అంత టెన్షన్ పడవద్దు, మంచిది కాదు" అని చాముండి వారింపు.

ఐదోనెల కల్లా చేతిలో ఉన్న సినిమాలు పూర్తిచేసింది. మళ్లీ తీరిక, ఈ తీరిక అంత హాయిగా లేదు సావిత్రికి.

మల్లెపూల మాలలు కడుతూ కూర్చొంది. సావిత్రి పూలమాలలు ఎలా కడుతుందంటే పూలు అమ్ముకునేవారికి దీటుగా కడుతుంది. అంతే అందంగా, అంతే వేగంగా కడుతుంది.

"ఏమే చాముండి ఈయన ఈమధ్య ఇంకా టింగురంగడు అయిపోతున్నారు. నేను కాస్త ఖాళీగా వున్నాకదా! నాతో కాస్త సమయం గడపొచ్చు కదా!" అంది సావిత్రి.

"మీ ఆయన ఇప్పుడేమిటి తల్లి ! ఎప్పటినుంచో టింగురంగడే. నీకు కాస్త సమయం చిక్కి ఇప్పుడే నువ్వు చూస్తున్నది" అంది చాముండి.

"అంతేలే మరి ఆయన టింగురంగడు అయినందుకే కదా నేను దొరికింది ఆయనకు" అంటూ నిట్టూర్చింది సావిత్రి. భర్త యొక్క నిరాదరణను కొన్నాళ్లు ఇలా సమాధానపరచుకునేది. కాని రానురాను జి.జి.కి తన పట్ల ఉండాల్సిన వైవాహిక విధేయత కనపర్చనప్పుడు తన కోపాన్ని, అశక్తతను వ్యక్తపరచడానికి వేరే మార్గం చూసుకుంది సావిత్రి.

★★★

ఒకరోజు విజయను తీసుకుని కారులో షాపింగ్‌కి వెళ్లింది. తిరిగి వచ్చేటప్పుడు కొత్త కారులో వచ్చింది. బట్టల షాపులో ఉన్నప్పుడు కొత్త కారు వచ్చింది అని తెలిస్తే అప్పటికప్పుడు కొనేసుకొచ్చింది. దానితో ఇప్పటికి ఆరు కార్లు సావిత్రికి. గారేజ్ పట్టటం లేదు. ఇంటి బయట కూడా కార్లే.

తన గారాలపట్టి, ముద్దుల విజయ ఏ కారులో వెళ్దామంటే ఆ కారులో షికారుకు వెళ్లేవారు. అన్నీ ఏ.సి కార్లే.

సావిత్రి ఇంటి ముందు ఎప్పుడూ జనం ఉండేవారు. ఆడవాళ్లు సైతం పడిగాపులు కాసేవాళ్లు సావిత్రిని చూడటానికి.

తమిళనాడులో ప్రజలు తిరుపతి వెళ్లడానికి బస్సులు మాట్లాడుకునేవారు. ఏ జిల్లా నుంచి వచ్చినా, ఆ బస్సుల్లో మద్రాసు వచ్చి సావిత్రి ఇంటి ముందు ఆపుకొని, ఆవిడ దర్శనం చేసుకొని ఆ తర్వాత తిరుపతి ప్రయాణం అయ్యేవారు.

సావిత్రి ఇంటి ముందు ఇంకోరకం జనం ఉండేవాళ్లు. వీళ్లని మొగ్గలోనే తుంచేస్తే పోయేది. సావిత్రి స్వతహాగా అలా చేయలేక, సావిత్రి తరఫున అలా చేసేవాళ్లు లేక వీళ్ల గోల చాలా ఉండేది. సావిత్రి ఇంట్లో ఉంది అని తెలిస్తే చాలు, ఎవరెవరో వచ్చి ఏదో నెపం మీద డబ్బులు సాయం అడిగేవారు. వాళ్లు ఎవరు ఏంటీ అని కూడా అడిగేది కాదు. హ్యాండ్‌బేగ్‌లోంచి చేతికి ఎంతవస్తే అంత తీసి ఇచ్చేది. లెక్క కూడా పెట్టేది కాదు. ఇలా ఎంతమందికి లెక్కలేనంత డబ్బు ఇచ్చిందో లెక్కే లేదు. వీటిలో చాలామటుకు అపాత్రదానాలు కూడా కావచ్చు.

కాని ఇతరులను ఆదుకున్న దానాలు తక్కువేమి కాదు. ఒకసారి ఒక అబ్బాయి సావిత్రి షూటింగ్‌లో వుండగా వచ్చాడు.నమస్కరించి "మీ ఫ్యాన్ ని" అన్నాడు.కూర్చోమంది. కాస్సేపు మాట్లాడిన తర్వాత, "నేను పై చదువులకు విదేశం వెళ్తున్నాను. నాకు స్కాలర్‌షిప్ వచ్చింది. ఐతే, వెళ్లడానికి నాకు విమానం ఖర్చులు మీరు భరించాలి.లేకపోతే వెళ్లలేను" అన్నాడు. ఆ అబ్బాయి అలా అడిగేసరికి ఆశ్చర్యపడింది సావిత్రి. నిజమేనా ఇతను చెప్పేది అనుకుంది. "మీ పెద్దవాళ్లని తీసుకురా" అని చెప్పి పంపించింది.మరుసటి రోజే తల్లిదండ్రులని వెంట పెట్టుకువచ్చాడు.వాళ్లది ఒకప్పుడు ఉన్న కుటుంబమే అని,తర్వాత బాగా చితికిపోయిందని,ఆ అబ్బాయి చాలా తెలివైనవాడూ, అతనికి స్కాలర్‌షిప్ వచ్చిన మాట నిజమేనని తెలుసుకుని, సావిత్రి అతని విమాన ఖర్చులకి డబ్బులు ఏర్పాటు చేసింది.

ఇంకోసారి విశాఖపట్టణం నుంచి శ్రీనివాస్ అనే కుర్రాడు ఇంటికి వచ్చాడు. సెవెన్త్ ఫారంలో బాగా మార్కులు వచ్చాయని, తనకు చదువుకోవాలని వుందని, మెడిసిన్ చదవాలని వుందని చెప్పాడు. పేదరికం అడ్డు వస్తున్నందుకు చదువుకోలేక పోతున్నానని అన్నాడు. అన్నీ చెప్పాడు కాని మొహమాటపడి డబ్బు అడగలేకపోయాడు. అయితేనేం మన అమ్మాయిగారు అడిగేశారు. "మెడిసిన్‌కి ఎంత ఖర్చుఅవుతుంది బాబు?"

"50 వేల వరకు అవుతుందండి " అన్నాడు.

"నేను ఏర్పాటు చేస్తాను బాబు బాగా చదువుకుంటావా?" అని అడిగింది. అన్నట్లే డబ్బు ఏర్పాటు చేసింది. ఆ అబ్బాయి సావిత్రి కాళ్లకు మొక్కి కృతజ్ఞతలు తెలిపాడు.

ఆ అబ్బాయి అటు వెళ్లీవెళ్లగానే, "ఇంతమంది డబ్బున్న వాళ్లు వుండగా నీ దగ్గరకే అందరు వస్తారెందుకమ్మాయ్?" అడిగింది సుభద్రమ్మ.

"నేను సహాయం చేస్తానని తెలిసి" అంది సావిత్రి.

"ఏమి సహాయాలే తల్లి ! ఎవరు కూడా తలకు మించిన సహాయాలు చేయకూడదే. తింటూ కూర్చుంటే కొండలే కరుగుతాయంటారు. నువ్వు ఇలా దానాలు చేస్తూ పోతే నీకు మిగులుతాయా?"

"అమ్మా ,మనం ఏ స్థాయి నుంచి ఏ స్థాయికొచ్చామో గుర్తు చేసుకో. ఈరోజు మనకు ఇంత వుంది కాబట్టి వున్నదాంట్లో కాస్త ఇవ్వగలుగుతున్నాం. మనం ఇచ్చిన దానితో ఒక కుటుంబం నిలబడుతుంది అంటే మంచిదే కదా. అయినా మనకు ఇచ్చింది ప్రజలే కదా! వాళ్ల డబ్బు మీద మనం ఎదిగి వారికి సహాయం చేయకపోతే ఎలాగ?"

"ఏది కూడా శ్రుతి మించకూడదమ్మాయ్! ఈ డబ్బు సహాయాలు కూడా అంతే. అసలు నీలాగ ఇంకో హీరోగాని, ఇంకో హీరోయిన్‌గాని చేస్తున్నారా?"

"వాళ్లూ చేస్తున్నారు. చేయకపోతే నాలాంటి వాళ్లని చూసి చేస్తారు. జనం నుంచి తీసుకున్న డబ్బుని జనానికి కచ్చితంగా ఏదో రూపంలో వెనక్కు ఇవ్వాలి. అది ఒకరు చెప్తే చేసేది కాదు. అది మా కనీస ధర్మం."

"ఇప్పుడు ఒక్క నిముషంలో యాభైవేలు ఇచ్చావు. నీకా డబ్బు సంపాదించటానికి ఎన్ని నెలలు పడుతుంది?" అడిగింది సుభద్రమ్మ.

కాసేపు ఆలోచనలో పడింది సావిత్రి. "అమ్మా! అలసిపోయాను. నిద్రపోతాను" అంటూ జారుకుంది.

సుభద్రమ్మ తలపట్టుకుంది. "భగవంతుడా! ఎవరు చెపితే వింటుంది ఇది" అంటూ బాధపడింది.

సావిత్రి షాపింగ్‌కు వెళ్లేటప్పుడు కూడా, బీరువా తెరిచి చేతికి ఎంత డబ్బు వస్తే అంత హ్యాండ్‌బ్యాగ్‌లోకి కుక్కేసుకునేది. ఆ తరువాత ఎంత ఖర్చయిందో చూసుకునే వ్యాపకం, తీరిక రెండూ కూడా ఉండేవి కాదు. చాలాసార్లు డబ్బులు తన అక్క మారుతికి ఇచ్చి, ఫలానా నగ తెమ్మని చెప్పేది. అది చూసే తీరిక కూడా ఉండేది కాదు.

సావిత్రి అభిమానులందరూ  తన నుంచి డబ్బులు ఆశించేవారే కాదు, సావిత్రికి పెట్టే అభిమానులు కూడా వున్నారు. 'రక్త సంబంధం' విడుదలైన తర్వాత ఒక వయసుమళ్లిన వ్యక్తి సావిత్రిని చూడటానికి ఇంటికి వచ్చాడు.సావిత్రిని చూడగానే బావురుమని ఏడ్చాడు.సావిత్రికి ఏమి అర్థం కాలేదు.

"ఏమిటి ....ఎందుకలా ఏడుస్తున్నారు? ఏం జరిగింది?అని అడిగింది.

"క్షమించండమ్మా ....మిమ్మల్ని చూడగానే ఏడుపొచ్చింది.నేను 'రక్త సంబంధం' సినిమా చూశాను. అందులో మీ పాత్ర చూసిన దగ్గర్నుంచి మిమ్మల్ని చూడాలన్న కుతూహలం ఎక్కువైంది. ఇన్నాళ్లూ రావడానికి వీలు కలగలేదు, ఇప్పటికి నా కోరిక తీరింది. అమ్మా! మీలాంటి చెల్లెలు నాకు లేదే అని నాకు దిగులు.అందుకనే...." అంటూ ఉండగానే అతని గొంతు గాద్గదికమైంది.పైపంచతో కళ్లు వత్తుకున్నాడు. అది చూసి సావిత్రికీ ఏడుపు వచ్చింది. బాధపడుతున్నవాళ్లని చూస్తే, తనకీ బాధ వేస్తుంది.సావిత్రి నైజం చిన్నప్పట్నుంచి ఇంతే.

ఆ వచ్చిన వ్యక్తి ఓ పాకెట్ సావిత్రి ముందు పెట్టి, "అమ్మా, అభిమానపూర్వకంగా నేను తెచ్చిన ఈ చిన్న కానుకని కాదనకుండా స్వీకరించండి" అంటూ పాకెట్ విప్పి, అందులోంచి ఒక చీర,పసుపు,కుంకుమ,పువ్వులూ సావిత్రికి ఇవ్వబోయాడు.

"ఎందుకు మీకీ శ్రమ? అభిమానం వుంటే చాలదు?" అంది సావిత్రి వాటిని తీసుకోకుండా.

"శ్రమేం లేదమ్మా, నా చెల్లెలకు నేను ఇవ్వడంలో శ్రమేముంది? తీసుకోండి" అంటూ చేతిలో పెట్టాడు.

సావిత్రి తన అభిమానులకు సాయం చేసింది లెక్కకు లేని వేల రూపాయల్లో అయితే తనకు అభిమానులు అభిమానపూర్వకంగా ఇచ్చింది కొన్ని వందల రూపాయల్లో. కాని సావిత్రి ఏనాడు ఈ లెక్కలు వేసుకోలేదు. డబ్బు కన్నా మంచి, మర్యాద, మానవత్వం విలువైనవని నమ్మింది సావిత్రి.

ప్రతి మనిషి బుద్ధిపూర్వకంగా వృద్ధి చేసుకునే లక్షణాలు కొన్ని అయితే, అంతర్లీనంగా వుండిపోయే లక్షణాలు కొన్ని. సావిత్రికి అటువంటి అంతర్లీనంగా వున్న లక్షణాలు ఏమిటంటే... మొహమాటం, బోళాతనం, అమాయకత్వం, 'ఆబ్సెన్స్ ఆఫ్ మైండ్'.... అయోమయంగా వుండటం. ఈ లక్షణాలు ఏదోఒక రూపేణ బయటపడేవి.అలాంటి సందర్భం ఒకటి ఏమిటంటే..... ఒకరోజు తన అభిమానినంటూ, మద్రాసులో స్థిరపడ్డ జపాను అమ్మాయి ఒకరు సావిత్రి ఇంటికి వచ్చింది.సావిత్రి సినిమాలు అన్నీ చూస్తానని చెప్పింది. ఇలా కాసేపు మాట్లాడిన తర్వాత ఆ అమ్మాయి ఒక కోరిక కోరింది.

"మీ చేత్తో నాకు టీ ఇవ్వాలి, ఏమి అనుకోవద్దు" అన్నది.

"తప్పకుండా ఇస్తాను" అంటూ వెంటనే వెళ్లి టీ పెట్టుకు తీసుకొచ్చింది,బోళాసావిత్రి. ఎంతో ఉన్నత స్థితిలో ఉన్న సావిత్రి, తనకు తెలియనివాళ్ల కోసం తానే టీ పెట్టుకువచ్చే

అవసరంలేదు. సున్నితంగా తిరస్కరించి, చుట్టూవున్న పనివాళ్లకి చెప్పవచ్చు, కాని సావిత్రి అలా చేయటానికి ప్రయత్నించలేదు కూడా.

★★★

1964లో హైదరాబాద్‌లో ఒక పెద్ద బంగ్లా కొన్నది. అది సావిత్రి బంగ్లాగా పేరుపడింది. ఇక హైదరాబాద్ ఎప్పుడు వచ్చినా అందులోనే వుండేది. అదే సంవత్సరంలో విజయవాడలో కూడా రెండు ఇళ్లు కట్టించుకొంది. అవి కూడా సావిత్రి బంగ్లాలుగా పేరుపడ్డాయి.

★★★

1965 ఆగస్టు 18న సావిత్రి పండంటి మగబిడ్డను ప్రసవించింది. బాబు పుట్టినందుకు ఎంతో సంతోషించింది సావిత్రి. ఆ రోజు సావిత్రిలో చూసిన ఆనందం 'పెళ్లి చేసి చూడు'లో అవకాశం వచ్చినప్పటి సంతోషం కనిపించింది చాముండికి.

బాబు బారసాలకి పెద్ద పార్టీ ఇచ్చింది. ఆ పార్టీలో సావిత్రికున్న నగల సెట్ల వూసు వచ్చింది. సావిత్రి బీరువా తెరచి సెట్లన్నీ బయటకు తీయనారంభించింది. చాముండి తెలుసుకొని పైకొచ్చేసరికి అన్నీ డబుల్‌కాట్ బెడ్ నిండా ఆరబోసి ఉన్నాయి. ఒక బంగారం కొట్టుకు ఏమాత్రం తీసిపోదు. గది నిండా అతిధులు ఉన్నారు. పనివాళ్ళు వాళ్లకి ఏదోఒకటి అందిస్తూ తిరుగుతూనే ఉన్నారు. అతిధులు నగలన్నీ చూస్తున్నారు. చూసినవన్నీ అక్కడే పడేస్తున్నారు. అన్నీ చూడాలని వాళ్లకి ఆతృత. చూడటానికి బోలెడు ఉన్నాయి. సావిత్రి గదిలోనే లేదు. వస్తూ పోతూ ఉంది. ఆ బంగారాన్ని బంగారంలా చూడటంలేదు సావిత్రి. మామూలు చీరలు వదిలేసినట్లు వదిలేసి వచ్చింది. చాముండి కింద పనులన్నీ వదిలించుకొని వచ్చి అక్కడే ఉంది. ఆ గది సావిత్రి బెడ్‌రూం. అప్పుడు గమనించింది సావిత్రి బట్టలు ఉండే దగ్గర సీసాలు. చాముండి పనివాళ్లని పంపించేసింది. అంతలోకి అతిధులు మొదట చూసిన ఒక సెట్ లేదని గమనించారు, పోయిందని నిర్ధారించారు.

గదిలోకి వచ్చిన పనివాళ్లు ముగ్గురే. పోయిందని వెంటనే తెలిసింది కాబట్టి తీసుకొచ్చి సావిత్రి ముందు పెట్టారు. మూటముల్లె సర్దుకొని ఆ మనిషి వెళ్లిపోవటమే అని అందరూ అనుకున్నారు. కానీ ఆ మనిషి కాళ్లావేళ్లా పడటంతో క్షమించేసింది సావిత్రి.

★★★

"నీ తోటల్లో ఎవరో కౌలు చేసుకుంటున్నారు. వాటి సొంతదారులకు మనకీ ఎటువంటి సంబంధమూ లేదు. నువ్వు ఎవరి పేరునయితే ఆ తోటలు పెట్టావో వాళ్లు నీకు తెలియకుండా అమ్మేశారు. ఇక ఆ తోటలకు మనకు రుణం ఎప్పుడో తీరిపోయింది."

ఇది చాముండి సావిత్రికి కొడుకు పుట్టిన తర్వాత, ఆ సంబరాలు సద్దుమణిగిన తర్వాత సావిత్రి చెవిలో వేసిన వార్త.

"నాకు నువ్వు కడుపుతో ఉన్నప్పుడే తెలిసింది. కాని అలాంటప్పుడు చెప్పకూడదని చెప్పలేదు."

"ఇలా ఎలా చేస్తారు చాముండి వీళ్లు? ఏమనుకుంటున్నారు?"

"నీ దగ్గర బోల్డంత డబ్బుంది. నీకు ఎంత పోయినా అది లెక్కలోకి రాదు" అని.

"ఛ! ఛ! ఏమి మనుషులే తల్లి."

"ఇకనైనా జాగ్రత్తగా ఉండు."

"మరి ఆ మిల్లు సంగతి ఏం చేశావ్?"

"అది ఎప్పుడో మూతపడిపోయింది."

"మామూలుగా నీకు నెలనెలా రావాలి డబ్బులు, కాని నువ్వే వాళ్లకి నెలనెల ఇస్తున్నావు. ఖాళీగా కూర్చుని తింటానికి."

"నేను నెలనెలా ఎక్కడిస్తున్నాను?"

"నెల నెల అడిగితే నీకు గుర్తొస్తుంది. అందుకని ఆరు నెలలకు ఒక్కసారి వచ్చి ీసుకుపోతున్నారు. అక్కడ కాస్త డబ్బు చేసుకోగలిగినా వాళ్లు తీసేసుకుంటున్నారు".

"అందుకని ఒక్కోసారి సంవత్సరానికి కూడా వస్తున్నారు. ఒక ఇండస్ట్రి పెట్టావు అంటే అది నీకు తిండి పెట్టాలి, అంతేకాని నువ్వు దాన్ని పోషిస్తున్నావూ అంటే నీ పరిపాలనా దక్షత ఎటువంటిదో తెలుసుకోవచ్చు!"

"పరిపాలనా దక్షతా, నా మొహమా. అది నాకు ఆ ఛాన్స్ ఇవ్వలేదు కదే. సరే ఇప్పుడేం చేద్దాం?"

"అది అక్కడ నువ్వు ఇక్కడ ఉండి దాన్ని చూసుకోవటం అనేది కుదరదు. దాన్ని అమ్మేయ్. నీ కళ్ల ఎదురుగా ఒక స్థిరాస్తి తీసుకో. నీ పేరే పెట్టు లేకపోతే పిల్లల పేర్లు పెట్టు."

"అలాగే చేద్దాం చాముండి. అది అమ్మేసేయ్."

"అది మీ చుట్టాల పేర ఉంది. అతనికి కబురు పెట్టు రమ్మని. ఇందు కోసమని చెప్పొద్దు. ఒకేసారి అన్ని డాక్యుమెంట్లు తెచ్చిపెట్టి ఆ ఒక్కపూటలో సంతకాలు అన్ని కానిచ్చేద్దాం. కాకపోతే ఈ లోపల మనం ఆ మిల్లును ఎవరైనా కొనేవారిని చూడాలి."

"పోనీలే చామూ ఆ తోటలని ఏమీ చేయలేకపోయాం. కనీసం ఇదైనా మిగుల్చుకుందాం" అంది సావిత్రి.

★★★

1965 డిసెంబర్ నుంచి మళ్లీ షూటింగ్‌లు మొదలు పెట్టింది. 1965లో నిర్మాణంలో ఉన్నవి 'భక్తపోతన', 'మనసే మందిరం', 'మొనగాళ్లకు మొనగాడు', 'శ్రీకృష్ణపాండవీయం', 'నవరాత్రి'.

ఏ.ఎన్.ఆర్‌తో 'సుమంగళి'నే చివరి సినిమా అనుకున్నారందరూ, కాని 'నవరాత్రి' పూర్తిగా రొమాంటిక్ చిత్రం కాదు, నటన ప్రధానమైన చిత్రం కనుక మళ్లా సావిత్రే చేయవలసి వచ్చింది. పైగా సావిత్రి ఈ సినిమాకు సహనిర్మాత కూడా. సావిత్రి మొదటిసారిగా ఈ సినిమాతో నిర్మాత అయ్యింది. 'విజయచాముండేశ్వరి కంబైన్స్' పేరున ఈ చిత్రానికి సహనిర్మాత అయ్యింది. ఈ సినిమాలో సావిత్రి ఒక పాటకూడా పాడింది.

'మనసే మందిరం' డైరెక్టర్ శ్రీధర్ అరవతను. ఈ సినిమా కూడా మొదటే పెళ్లయిన వారి కథ. గొప్ప మానసిక సంఘర్షణ గల పాత్ర, అందుకే సావిత్రి.

1966లో సావిత్రి నోములపంట సతీష్ తీవ్ర అనారోగ్యానికి గురైయ్యాడు. సావిత్రి బాధ ఇంతా అంతా కాదు, తను మొక్కని దేవుడు లేడు. సరైన తిండి తినటం లేదు, కంటికి సరిపడా కునుకూ లేదు. మద్రాసులోని డాక్టర్లందరికి చూపించినా కూడా లాభం లేక పోయింది. అందుకని వెల్లూరు తీసుకువెళ్లారు. అక్కడ శస్త్ర చికిత్స చేస్తామన్నారు. శస్త్ర చికిత్స అయిన తర్వాత, ఒక రోజు చాముండి ఫోను చేసింది. "సావిత్రి... ఇద్దరు నిర్మాతలు వచ్చారు, నిన్ను బుక్ చేసుకోవటానికి, ఏమని చెప్పను?"

"ఈ పరిస్థితుల్లో సినిమాలేంటి చాము?"

"దేవుడి దయవల్ల అంతా బాగానేవుంది కదా."

"ఇప్పుడు నటించే ఓపికా లేదు, ధ్యాస లేదు."

"అట్లా అనకు, వచ్చినవి వద్దనటము ఎందుకు, ఒప్పేసుకో, అయినా వాళ్లు మొదలు పెట్టడానికి ఇంకా నెలలు పట్టిద్ది."


"రోలేంటి?"

"అదేంటి అలా అడుగుతున్నావు, హీరోయినే..."

"అబ్బా ఏమి హీరోయినే తల్లీ....నన్ను చెట్టుల వెనక, పుట్టల వెనక, సోఫాల వెనక దాచలేక చస్తున్నారు."

"వాళ్లకు తెలిసింది కూడా నీకు తెలియలేదు."

"ఏంటది?"



చిన్నారి విజయతో






విజయతో



చిన్నారి సతీష్‌తో












సతీష్ పుట్టిన రోజు పండుగ







సతీష్, విజయలతో



మారుతి, సుభద్రమ్మలతో







అక్క మారుతితో




సావిత్రి కొడైకెనాల్ బంగ్లా ముందు, దేశంలోనే రెండో కలర్ ఫోటో స్టూడియో విజయవాడలో ప్రారంభించిన వీరన్న గారి కుటుంబంతో.



జి.జి. మొదటి భార్య అలిమేలు పెద్ద కూతురు పెళ్లిలో



తెలుగు 'నవరాత్రి' 1966



తమిళ్ 'నవరాత్రి' 1966

"మేలిమి బంగరు మెలిక తిరిగినా,విలువ తరిగేనా.... ఒప్పేసుకో.. ఇంకో పది రోజుల్లో నువ్వు, సతీష్ ఆనందంగా తిరిగి వస్తారు."

"నీ తొందర చూస్తుంటే ఈ వ్యవహారంలో నీ చేయి పడినట్లువుందే."

"నా సిఫార్సా? మహానటికి, నటీ శిరోమణికి, కలైమామణికి, నడిగెయర్ తిలగమ్‌కు, గజారోహిణికి, నా సిఫార్సా? ఎవరి నటన, అందము చూసి విదేశీయులు ముగ్ధులయినారో, దేశీయులు ప్రణమిల్లారో, ఎవరి హావభావాలకు ప్రకృతి పరవసిస్తుందో, ఎవరి వర్చస్సు ముందు వజ్రకాంతి వెలవెల పోతుందో, ఎవరి నటనా వైదుష్యం చూస్తూ కాలం అలా నిల్చుండి పోతుందో.....అట్టి సావిత్రికి నా సిఫార్సా?"

ఇప్పటికే సావిత్రి గట్టిగా నవ్వుతుంది. నవ్వి నవ్వి "అబ్బా...చామూ.. ఎంత నవ్వించావే" అంది.

"నిన్ను ఇలా నవ్వటం చూసి ఎన్నాళ్లయిందో..... మరి వాళ్లకు మాటిచ్చేయమంటావా?"

"నీ చేయి పడినతర్వాత వద్దంటానా?"

"అదిగో మళ్లీ అదే మాట! ఒక ఆర్టిస్టుగా,ఒక మంచి మనిషిగా నువ్వు ఎవరెస్టు శిఖరం మీద వున్నావు సావిత్రి, ఇవే నీకు శ్రీరామరక్ష ,ఇవే నిన్ను అజరామరం చేస్తాయి" అంది చాముండి.

★★★

1966లో ఆదుర్తి సుబ్బారావు ఇల్లు అమ్మే సమాచారం పట్టుకొచ్చింది చాముండి.

"విజయా స్పిన్నింగ్‌మిల్స్ అమ్మేసి ఈ ఇల్లు కొను, మన సంపద మన కళ్లముందు ఉంటుంది" చాముండి సూచించింది. అందుకు సావిత్రి సరేనంది.

విజయ స్పిన్నింగ్‌మిల్స్ ఎవరి పేరు మీద ఉందో వారిని పిలిచి అప్పటికప్పుడు సంతకాలు పెట్టించి విజయ స్పిన్నింగ్ మిల్స్ కొనేవాళ్ల దగ్గర నుంచి డబ్బులు తీసుకొని, ఆ చుట్టంచేత డబ్బులు తీసుకొన్నట్టు సంతకాలు చేయించుకొని వెంటనే ఆ డబ్బులు తీసుకెళ్లి ఆదుర్తి సుబ్బారావుకి ఇచ్చింది సావిత్రి.

అలా సావిత్రికి మద్రాసులో నాలుగో బంగళా ఏర్పాటైంది.

గృహప్రవేశానికి అందరినీ పిలిచారు. వచ్చిన అతిథులు ఆశ్చర్యపోయారు. మగ అతిథులు అయితే ఆశ్చర్యంతోపాటు ఆనందించారు కూడా. ఎందుకంటే గృహప్రవేశం అంటే మామూలుగా ఉండే పూజలు లేవు. పూర్తిగా మందు పార్టీ ఏర్పాటు చేశాడు జి.జి.

ఆ తరువాత రోజు జి.జి సావిత్రిని పిలిచి "నిన్నటి పార్టీకి చెక్కు ఇవ్వాలి, వాళ్లు వచ్చారు నీ చెక్కు ఇవ్వు" అన్నాడు."ఒక్క నిమిషం ఇస్తాను" అని నదుంకు ఉన్న బీరువా తాళం తీసి, బీరువా తెరిచి, చెక్కుబుక్కు తీసింది.

"అయ్యో! ఇదేంటి చెక్కు బుక్ నిండా లిప్‌స్టిక్ అంటింది. అవును ఇది ఎప్పుడు అయ్యింది? ఒక్క చెక్కు కూడా వాడటానికి లేదే. క్యాష్ అంతా మొన్న ఖర్చులకే అయిపోయింది. ఇపుడేం చేద్దామండి?" అని గాబరా పడింది.

"దీనికి అంతా కారణం ఆ చాముండినే "అన్నాదు జి.జి.

"అయ్యో! అది అసలు ఈ గదిలోకి రాదండి".

"దానికి అదీ, ఇదీ అని ఏమీ లేదు.చెయ్యాలనుకుంటే ఏ పనైనా చేస్తుంది".

"ఇప్పుడేం చేద్దాం?"

"దీని అర్థమేమిటంటే అంత ఖర్చు పెట్టాను కదా, దీనికంతటికి నేనే కట్టాలి అని."

"అదేం మాటండి అలా మాట్లాడుతున్నారు?"

కోపంతో ఊగిపోతున్నాడు జి.జి. "ఇంకో మాట, నువ్వు చెపితే చేస్తుందో లేక తానే చేస్తుందో నాపైన గూఢాచారి పనులు కూడా చేస్తుంది".

"మీరు చెపుతున్నవేమీ నాకు తెలియదు" అంది సావిత్రి.

"చెపుతా మీ ఇద్దరికి అర్థమయ్యేలా చెపుతా" అని తన చెక్‌బుక్ తీసుకొని వెళ్లిపోయాడు.


★★★

1966లో ప్రొడక్షన్‌లో ఉన్నవి 'కంచుకోట', 'నిర్దోషి', 'ప్రాణమిత్రులు', 'ఉమ్మడి కుటుంబం.' చాలా ఖాళీ ఉంటుంది సావిత్రికి. ఇప్పుడుగాని చుట్టూ ఉన్న మనుషుల గురించి ఆలోచించే తీరిక దొరకలేదు.

భర్త ధోరణి అంతుచిక్కటం లేదు. రాకపోతే రెండు మూడు రోజులు అస్సలురాడు. తర్వాత ఎక్కడ ఉన్నారు అని అడిగితే అలమేలు ఇంటిలో అని జవాబు చెప్తాడు. రెండిళ్ల పూజారి కనుక ఆ సమాధానానికి మిన్నకుండాల్సిందే. తను ఖాళీగా ఉందిగదాని తనతో కాస్త సమయం గడిపే ప్రయత్నం చేయటం లేదు. తనతో గడపలేనంత బిజీ ఏమీ కాదు జి.జి. అయినా ఎప్పటిలానే పొద్దున్నే వెళ్లిపోతున్నాడు. వస్తే రాత్రికి ఎప్పుడో వస్తున్నాడు. ఇంట్లో పిల్లలతో సరిపోతుంది సావిత్రికి. కానీ భర్త గురించి మనసు చాలా కల్లోలంగా ఉంది. 1961 ప్రాంతంలో వృత్తిలో కూడా సావిత్రి ఎంతో ఉన్నత స్థితిలో వున్నప్పుడు, జి.జి.




వెండితెర సామ్రాజ్ఞి



ఘంటసాలతో





ఒకే చోట చేరిన రెండు  అద్భుతాలు



ాన వృత్తిలో కూడా క్రింది స్థాయికి చేరాడు.అతనిలో న్యూనతాభావం చేరింది. ఎప్పుడూ ండే బాధలకు తోడు మరిన్ని బాధలు, కష్టాలు తోడయ్యాయి సావిత్రికి.వీటన్నిటినీ ఎదుర్కొంది,ప్రతిఘటించింది.ఇప్పుడు 1967లో తనకు సినిమాలు తగ్గినా, తనే కావాలని ర్గించుకున్నా , తనలో పెద్దగా మార్పు లేకపోయినా, భర్త మాత్రం ఆ పెడదోవనే ఉన్నాడు.

ఒకరోజు చాముండి సావిత్రి చేతిలో ఒక విజిటింగ్ కార్డ్ పెట్టింది. దానిలో 'మిత్రాగణేష్' క్లాసికల్ డాన్సర్ అని, అడ్రస్సు, ఫోన్ నెంబరు ఉంది.

"ఎవరు ఈవిడ, నాకెందుకు ఈ కార్డు?" అని అడిగింది.

"చదువు తెలుస్తుంది" అంది చాముండి. సావిత్రి చదివింది.

"ఎవరు ఈవిడ?"

"మీ ఆయన్ని అడిగితే కరెక్ట్‌గా చెప్తాడు."

"వద్దులే చామూ! వదిలెయ్ అనవసరంగా గొడవెందుకు. నువ్వు అంటేనే ఆయన చిందులు తొక్కుతున్నారు".

"నువ్వు ఇలా వదిలేస్తే కాదు, ఆవిడ ఎవరో తేల్చు".

"వద్దులేవే ఇప్పుడు గొడవలు,అసలే అమ్మకు ఆరోగ్యం సరిగ్గా లేదు, ఆమెను బాధ పెట్టటం ఎందుకు ఈ గొడవలతో?"

"సరే, కందకు లేని దురద కత్తిపీటకెందుకు" అనేసి వెళ్లిపోయింది చాముండి.

కాని సావిత్రి మనసు మనసులో లేదు.

ఆరోజు సావిత్రి ఎంత వద్దనుకున్నా అడగకుండా వుండలేకపోయింది.

ఫలితం.... సావిత్రికి తీవ్ర మనస్తాపం. చాముండి చెపుతూ వస్తున్నది నిజమే.

"సావిత్రీ! నువ్వు నిర్ణయించుకో, నువ్వు ఎవరినో ఒకరిని నమ్ము. నన్నన్నా నమ్ము, దాన్నన్నా నమ్ము" అన్నాడు జి.జి.

"అయ్యో అదేంటండీ, నేను మిమ్మల్ని నమ్మకపోవటం అంటూ ఏమీ లేదు" అంది సావిత్రి.

"ఈ ఇంట్లో నేనైనా ఉండాలి... అదైనా ఉండాలి. ఇప్పుడే తేల్చుకో" అన్నాడు జి.జి.

"నేను చెప్పేవన్నీ నిజాలు కాదు అని నిరూపించమను" ధైర్యంగా వచ్చింది చాముండి.

కాసేపు ఆలోచించాడు జి.జి.

"నేను ఒక నిజం చెప్పనా, నీకో రోగం ఉంది. నువ్వు కాపురాలు చేయవు, ఇంకొకళ్లని చేసుకోనివ్వవు" అన్నాడు.

"మీకూ ఒక రోగం ఉంది. అదేంటో నేను చెప్పనా..." అంది చాముండి, ఏమాత్రం బెదురు లేకుండా.

జి.జి సావిత్రి వైపు చూశాడు. "చూశావా... నువ్వు దీనికిచ్చిన అలుసు, నన్నే ఎదిరిస్తుంది. ఇంక నేనుండలేను ఇక్కడ. సావిత్రి! ఈ మనిషి ఇంట్లో లేదు, అన్నప్పుడే నేనిక్కడకు వస్తాను" అంటూ చరచరా బయటకి వెళ్లాడు.

సావిత్రి తలపట్టుకుని కుర్చీలో కూర్చుండిపోయింది.

చాముండి గదిలోకి వెళ్లి బట్టలు సర్దుకొని వచ్చేసింది.

"వెళ్తున్నాను సావిత్రి" అంది. ఆశ్చర్యంగా చూసింది సావిత్రి. "నేను వెళ్లమన్నానా చామూ?" అంది దీనంగా.

"నువ్వు వెళ్లమన్నంత మాత్రాన నేను వెళతానా ఏమిటి? ఆయనకు చెప్పు నన్ను పంపించేశావని. ఆయన్ని ఎక్కువ బయట వదిలేస్తే నీకే నష్టం."

"ఇంకొక్క ప్రయత్నం చేస్తాను చామూ."

"చెయ్యి కానీ ఆ ప్రయత్నంలో నీ ఆరోగ్యం పాడు చేసుకోకు" అంది.

ఇది అయిన చాలారోజులు వరకూ సావిత్రి ముభావంగానే ఉంది. ఓ పక్క వాళ్ల అమ్మ మంచం మీద ఉంది. అయినా ఆవిడ ధ్యాసే లేదు.

★★★

1967లో ప్రొడక్షన్‌లో ఉన్నవి యస్.వి. రంగారావు 'బాంధవ్యాలు', జి. వరలక్ష్మి 'మూగజీవులు', ఎన్.టి. రామారావు 'ఉమ్మడి కుటుంబం', 'బలరామ్ శ్రీకృష్ణ' అని హిందీ సినిమా, 'తల్లిప్రేమ'. అన్నీ తెలిసినవాళ్ల, సీనియర్‌ల సినిమాలు, సీనియర్ల కథలు. సావిత్రి హీరోయిన్ యుగం అయిపోయింది. అదొక స్వర్ణ యుగం. సావిత్రి హీరోయిన్‌గా ఉన్న ప్రతి సినిమా ప్రేక్షకులకు ఆమె అందం, నటనాశక్తి చూపే సుందర స్వాప్నిక కాలం.

ఈ సంవత్సరంలో మళ్లీ ఇంకో హిందీ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. చంద్రకాంత్ దర్శకత్వంలో 'బలరామ్ శ్రీకృష్ణ' అనే సినిమా. ఈ సినిమాని హిందీ నుంచి తెలుగులోకి, కన్నడంలోకి, తమిళంలోకి డబ్ చేసి విడుదల చేశారు.

ఇంట్లోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తూ ఉన్న సావిత్రికి తన సెక్రటరీ ద్వారా ఒక ప్రపోజల్ వచ్చింది. తానే ఎందుకు నిర్మించి దర్శకత్వం చేయకూడదు అని, కాని సావిత్రి తిరస్కరించింది.




'ఉమ్మడి కుటుంబం' 1967



'నిర్దోషి' 1967



'గుండమ్మ కథ' 1962



'తల్లి ప్రేమ' 1968

## విజయ చిత్ర పత్రిక నుంచి

### కొత్త సంవత్సరంలో కొత్తవారికి మహానటి సావిత్రి సూచనలు

ఇప్పుడొస్తున్న వారిలో చాలామందికి సినిమాల పట్ల, నటనపట్ల ఉత్సాహం వుంది. చాలా తొందరగా 'తార' గా పేరు తెచ్చుకోవాలన్న ఆశ, ఆరాటం ఉన్నాయి. మంచిదే. కాని , చిత్ర రంగంలో రాణించడానికి ఇవిమాత్రమే ఉంటే సరిపోతుందా?

కొన్ని చిత్రాలలో కనిపించే, కొత్త అమ్మాయిలను, వారి అసభ్య వస్త్రాలంకరణను చూసినప్పుడు,'వీళ్లే ఇలాంటి దుస్తులు ధరించి, 'సెక్సీ'గా కనపడి, జనాన్ని వెర్రెక్కించేలా చేస్తే తారలమై పోతామని అనుకుంటున్నారా? లేక దర్శకులే వీళ్ల బలహీనతలను ఆధారంగా చేసుకుని, అలా చిత్రాలలో కనిపించేలా చేస్తున్నారా ?' అన్న అనుమానం కలుగుతోంది?

ఇదేం వైపరీత్యం? ఇదెక్కడి కొత్త 'విప్లవం'? చిత్రాలలో కొత్త ధోరణులు, విప్లవాత్మకమైన మార్పులు రావాలి, నిజమే... కాని అవయవాలను ప్రదర్శించడంలోను, అసభ్యంగా నటించడంలోను చూపించాలా ఈ విప్లవధోరణి?

చలనచిత్రరంగంలో ఆరోగ్యకరమైన పోటీ వుండాలి. కాని ఈ పోటీ ఏ విషయంలో? నటనా సామర్థ్యంలోనా? లేక అంగాంగ ప్రదర్శనలోనా?

కొత్తగా వస్తున్నవారికి నేను ఎప్పుడూ చెప్పేది ఒకటే. కేవలం అవయవ సౌష్టవాల్ని ప్రదర్శించడం ద్వారా, నటీమణిగా పేరు తెచ్చుకోవడం అసాధ్యం. వారు తమ ప్రజ్ఞను నటనలో కనబరచాలి. పాత్రోచితమని అనిపిస్తే, 'గ్లామరస్'గా కనిపించడంలో తప్పులేదు. కాని ఎట్టి పరిస్థితులలోను అసభ్య స్థాయికి దిగజారకూడదు !

మొదట తాము ధరించిన పాత్ర ఏమిటి? ఆ పాత్ర ప్రవర్తన ఎలా వుండాలి? అన్నది క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. తెలియని అంశాలను తెలుసుకుని, ఆ పాత్రను, ఆ పాత్ర స్వభావాన్ని వీలవుతూ నటించాలి.

అప్పుడే ఏ పాత్రను ధరించినా ఆ పాత్రకు న్యాయం జరుగుతుంది. నటనను వృత్తిగా స్వీకరించడం జరిగింది కాబట్టి అదొక బాధ్యతగా భావిస్తూ, ఆ బాధ్యతా నిర్వహణ సక్రమంగా జరగడానికి ఏకాగ్రతతో కృషి చేయాలి. 'చాలా తొందరగా డబ్బు సంపాదించాలి. కారు కొనాలి. బంగళా కొనాలి' అన్న విషయాల్లో చూపే ఆసక్తి, ఆత్రుత నటన పట్ల చూపించకపోవడం, సాటివారిని చూసి ఈర్ష్యపడటం, ఎవరైనా సలహాలు చెబితే 'ఆ... వీళ్లకేం తెలుసు?' అని నిర్లక్ష్యంగా చూడడం వంటి ధోరణులు పురోగమనానికి ఆటంకాలుగా పరిణమిస్తాయి. మరో విషయం : కొత్తవారు పొగడ్తలకు పొంగిపోకూడదు. సద్విమర్శలను వాళ్లుహృదయ పూర్వకంగా ఆహ్వానించాలి. ముఖ్యంగా

సమయనియమాన్ని పాటించాలి. ఇతర నటీనటులు ఎవరు వచ్చినా రాకపోయినా, తాము మాత్రం షూటింగ్ వేళకు సరిగ్గా హాజరుకావాలి.

క్రమశిక్షణ, నటనలో రాణించడానికి తగిన శ్రద్ధ, చిత్త శుద్ధి ఉన్నప్పుడు కొత్తవారు తమ భవిష్యత్తుకు తామే మంచి బాటను ఏర్పరచుకోగలుగుతారని నా నమ్మకం.

స్వర్గీయ పండిత నెహ్రూజీని కలుసుకోవాలని నేను చాలాసార్లు అనుకునేదాన్ని. అవార్డు తీసుకోడానికో, ఇతర ప్రభుత్వోత్సవాలలో పాల్గొనడానికో చాలాసార్లు ఢిల్లీ వెళ్లినా, ఆయనను కలుసుకోవడం కుదరలేదు. ఢిల్లీ వెళ్లడం ప్రారంభించిన పదకొండవ సంవత్సరంలో నా కోరిక తీరింది. నెహ్రూజీ సోదరీమణి శ్రీమతి విజయలక్ష్మితో నాకు కొద్ది పరిచయం వున్నది. ఆ పరిచయాన్ని పురస్కరించుకొని నేను శ్రీమతి విజయలక్ష్మితో "భయ్యాజీని (నెహ్రూజీని వారు అలా పిలిచేవారు) ఒక సారి చూడాలని వుంది" అన్నాను. "తప్పకుండా" అంటూ శ్రీమతి విజయలక్ష్మి పండిట్ నన్ను నెహ్రూజీకి పరిచయం చేశారు. "ఈమె శ్రీమతి సావిత్రి. దక్షిణ భారతదేశంలోని ఒక గొప్ప నటీమణి" అన్నారు శ్రీమతి విజయలక్ష్మి. నెహ్రూజీ నన్ను చూసి చిరునవ్వు నవ్వుతూ "ఓ!" అని ఆంగ్లంలో కుశలప్రశ్న వేశారు. నేను హిందీలో సమాధానం ఇచ్చాను. "అరె! మీకు హిందీ తెలుసునన్నమాట" అన్నారాయన ఆశ్చర్యంగా. తెలుసు అన్నాను. తర్వాత పది నిమిషాలపాటు మా మధ్య హిందీలోనే సంభాషణ జరిగింది.

"మీ సినిమా పరిశ్రమ ఎలావుంది?" అని అడిగారు.

"బాగుంది. ప్రోత్సాహకరంగానూ, అభివృద్ధికరంగానూ వుంది" అన్నాను నేను.

"గుడ్. శ్రద్ధతోనూ, చిత్తశుద్ధితోనూ కృషి చేస్తే ఏ పరిశ్రమ అయినాసరే. ముందంజ వెయ్యక తప్పదు" అన్నారు నెహ్రూజీ.

నేను అవునన్నాను,నెమ్మదిగా తల ఆడిస్తూ.

"మీరు చిత్రాల్లో ఎలాంటి పాత్రలు ధరిస్తూ వుంటారు? ఎలాంటి పాత్రలంటే మీకు ఇష్టం?" అన్నారాయన.

"సాత్వికమైన పాత్రలు, శాంత స్వభావం గల చక్కని పాత్రలూ ధరిస్తూ వుంటాను. ఆ పాత్రలంటేనే నాకు ఇష్టం. ఎటువంటి పాత్రనయినా నా శక్తిమేరకు కృషి చేసి చక్కగా నటించడానికి ప్రయత్నిస్తూ వుంటాను" అన్నాను. ఆయన సంతోషించారు. నెహ్రూజీ ఎప్పుడూ ఉత్సాహంగా, కళకళలాడుతూ వుండేవారు. కాని ఆ రోజు మాత్రం ఏదో కలతగా వున్నట్టు నాకు ఆయన ముఖంలో గోచరించింది.

"మీ ఆరోగ్యం..." అన్నాను నేను జంకుతూ.

"నా ఆరోగ్యానికేం? చాలా బాగుంది " అన్నారాయన.

ఆ మహనీయునికి కృతజ్ఞతా వందనాలర్పించి, సెలవు తీసుకుని వచ్చేశాను.

ఈ సమావేశం జరిగి ఒక నెలరోజులు గడిచింది. మా పాపతో నేను కొడైకెనాల్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాను. ఆరోజు, ఒక కాన్వెంట్ స్కూలువారి ఉత్సవంలో పాల్గొని వారు ప్రదర్శిస్తున్న చిన్న చలనచిత్రాన్ని చూస్తున్నాను. హటాత్తుగా ప్రదర్శన నిలిచిపోయింది. భారత ప్రధాని శ్రీ నెహ్రూజీ దివంగతులైనారన్న పిడుగులాంటి దుర్వార్త ప్రకటింపబడింది. నేను దిగ్భ్రాంతురాలినయ్యాను. కొద్ది క్షణాల పాటు స్పృహతప్పినట్టు ఫీలయ్యాను. ఆవేదనతో, బాధతో లేచి, వసతికి వెళ్లిపోయాను. దిగులుగా, ఒంటరిగా కూర్చున్నాను. నెల రోజుల కిందట జరిగిన ఆ సంఘటన కళ్లముందు మెదిలింది.

ప్రపంచం గర్వించదగ్గ ప్రముఖ వ్యక్తి; భారతనేత; మహనీయులైన ఆ మూర్తి ఇక కనిపించరు. ఒక్కసారి దుఃఖం పెల్లుబికింది. కళ్లవెంట జలజలా అశ్రువులు రాలాయి. ఎంతసేపో అలా వుండిపోయాను.

ఇహ, అక్కడ వుండబుద్ధికాలేదు. 'హాలిడే' కాన్సిల్ చేసుకుని మద్రాసు వచ్చేయాలని నిశ్చయించుకున్నాను. కారు డ్రైవరు అనారోగ్యంగా వున్నాడు. కాలి మీద కురుపు వేసి బాధపడుతున్నాడు. అయినా అక్కడ వుండలేకపోయాను. డ్రైవరు వద్దంటున్నా వినకుండా, పాపాయిని తీసుకుని నేనే కారు నడుపుతూ మద్రాసు వచ్చేశాను.

నెహ్రూజీకి ప్రియమైనది గులాబిపువ్వు. ఆయన జ్ఞాపక చిహ్నంగా ఆ రకం గులాబి మొక్కను మా యింట నాటి, నాటినుంచీ పెంచుతున్నాను. ఏవైనా విశేష సందర్భాలు వస్తే మా అబ్బాయికి నెహ్రూజీ దుస్తులు (ఖద్దరు సుర్వా, షెర్వాణి) వేసి, టోపీ పెట్టి అలంకరిస్తాను.

**విజయ చిత్ర పత్రిక నుంచి**


నేను చూడాలని అభిలషిస్తున్నది... ప్రఖ్యాత నటీమణి సూసన్ హేవర్డ్‌ను.

సూసన్ హేవర్డ్ అంటే నాకు మొదట్నుంచీ చాలా అభిమానం. ఆమె నటించిన ఏ చిత్రాన్నీ నేను చూడకుండా వుండలేదు. నాదృష్టిలో ఆమె గొప్ప నటీమణి. ఎంతపని వున్నా, ఎంత తీరిక లేకపోయినా 'సూసన్ హేవర్డ్' నటిస్తున్న చిత్రం వచ్చిందంటే – ఎలాగైనా నేను చూడవలసిందే! ఆమెను కలుసుకోవాలనే కాంక్ష నాకు ఏనాటినుంచో వున్నది.

ఆవిడను నేను కలుసుకుంటే, "మీరూ నేనూ కలిసి 'యాక్టింగ్ స్కూలు' స్థాపించాలని నాకు పెద్ద ఉద్దేశం వుంది. మీరు ఎంతవరకు సహకరిస్తారు?" అని అడుగుతాను.


**విజయ చిత్ర పత్రిక నుంచి**







'చిన్నారి పాపలు' ముహూర్తపు పూజ 12-10-1967




డైరెక్టర్ సావిత్రి



లీల, రాజసులోచన, డైరెక్టర్ సావిత్రి



'చిన్నారి పాపలు' సెట్స్ మీద
డైరెక్టర్ సావిత్రి, జగ్గయ్య



క్లాప్ ఇచ్చిన జి.జి.

ఆ సమయానికి అది చాలా మంచి నిర్ణయం. ఎందుకంటే ఇంటిలో వాతావరణం సరిగ్గాలేదు. తనకు కావాల్సిన ప్రేమ, తోడు లేదు. మనసు ఆలోచనలతో మునిగిపోయి ఉంది. 'అంత ప్రేమించి పెళ్లి చేసుకున్నవాడు ఇప్పుడు అంత ప్రేమగా లేడెందుకు? వయసు పెరిగే కొద్దీ అనురాగం పెరగాలి కదా. కాని ఈయనకి అదేమి లేదేంటి? పైగా రోజుకో వినరాని మాట వింటున్నాను' ఇవీ సావిత్రి సంఘర్షణకు మూలాలు.

అంతకు ముందు సావిత్రి రెండవసారి కడుపుతో ఉన్నప్పుడు దుక్కిపాటి మధుసూధనరావు మాటల మధ్య "నువ్వు దర్శకత్వం చేయొచ్చు కదా, ఇప్పుడున్న దర్శకులంతా పెద్దవాళ్లయిపోయారు, కొత్తవాళ్లు వస్తే బాగుంటుంది" అన్నారు.

ఆ మాటలకి సావిత్రి గట్టిగా నవ్వి ఊరుకుంది. మధుసూదనరావు ఆ విషయం గురించి ఇక మాట్లాడలేదు. కానీ ఆరోజు నుంచి దర్శకత్వం గురించి ఆలోచించకుండా ఉండలేకపోయింది.

1967లో 'శ్రీమాతా ఫిల్మ్స్' అనే సంస్థ, వాళ్ల సినిమాకి డైరెక్షన్ చేయమన్నారు. ఆ సంస్థలో ఉన్నవాళ్లు అందరూ పెద్దమనుషుల భార్యలే.

అంతా విని "ఆయన్ని ఒక మాట అడిగి చెప్తాను" అంది.జి.జి. తన పట్ల విముఖంగా ఉన్నా సావిత్రి అతని పట్ల గౌరవం చూపుతూనే ఉంది.

అలాగ కొత్తగా డైరెక్షన్‌లోకి వచ్చింది సావిత్రి. తీరా డైరెక్షన్ ఒప్పుకున్నాక ఆ సంస్థవారు కంపెనీలో షేర్స్ తీసుకోమన్నారు. తనకే గాక, సుభద్రమ్మకు కూడా షేర్స్ కట్టబెట్టారు. 12-10-67న వాహినీ స్టూడియోలో ఆ సినిమా ముహూర్తపు షాట్ తీసింది సావిత్రి. ఆ సినిమా పేరు 'చిన్నారి పాపలు'.

'చిన్నారి పాపలు' చిత్ర నిర్మాణంలో సావిత్రికి జి.జి. నుంచి ఎట్లాంటి సహాయ సహకారాలు అందలేదు. ముహూర్తం షాట్‌కి మాత్రం క్లాప్ ఇచ్చాడు. ఆ తరువాత ఏమి జరుగుతుంది? ఎంత ఖర్చు చేస్తుంది, ఏమి పట్టించుకోలేదు. సావిత్రి తన పనుల్లో పూర్తిగా మునిగివుంటే అతను ఆయన పనుల్లో మునిగి వున్నాడు.

సావిత్రి అంతా తానై ఆ సినిమా సంగతి చూసుకుంది. హీరోయిన్ కాస్ట్యూమ్స్‌కి స్వయంగా వెళ్లి షాపింగ్ చేసింది. అదీ ఇదీ అని కాదు అన్నీ తానై, సినిమాకు తానే ప్రొడ్యూసర్ అన్నట్లు చూసుకుంది. మరి ప్రొడ్యూసరూ తానే అయింది. మరి సావిత్రికి పూర్తిగా అవగాహన అయ్యిందో లేదోగాని ఆ సినిమాకి తానే ప్రొడ్యూసర్ అయినట్లు. ఎందుచేతనంటే...

ఈ సంస్థలో పధ్నాలుగుమంది షేర్‌హోల్డర్స్ ఉన్నా వాళ్లు పోగేసిన డబ్బు సినిమా నిర్మాణానికి చాల్లేదు. ఫైనాన్సియర్లని తీసుకొచ్చారు.

# డైరెక్టర్ గా



# నటీమణి



# సావిత్రి




అభినేత్రి సావిత్రి, డైరెక్టర్ సావిత్రి అయింది. వివిధ చిత్రాల్లో విభిన్న భూమికలను ధరించడంతో కలిగిన అనుభవమూ, పెద్దల ప్రోత్సాహమూ, ఆమె అభిరుచి తనను డైరెక్టరును చేశాయని అంటుందామె. దర్శకత్వాన్ని చేపట్టడానికి ముందు జరిగిన విషయాన్ని, విశేషాన్ని (పక్క పేజీల్లో) ఆమె తెలియచేస్తున్నది.









కొన్ని సంవత్సరాల క్రితం మాట... దుక్కిపాటి మధుసూదనరావుగారు నన్నో మాట అడిగారు. "డైరెక్టర్ మధ్వారావుగారు బిజీగా వున్నారు. నువ్వు మా నెక్స్ట్ పిక్చర్ డైరెక్టు చేస్తావా?" అని. ఆ మాట విని వినగానే, నేను నవ్వడం ఆరంభించాను. పకపకమని నవ్వుతూనే వున్నాను.

"ఎందుకలా నవ్వుతావు? నేను హాస్యానికి అడగడంలేదు. సీరియస్‌గానే అడుగుతున్నాను." అన్నారాయన.

అప్పటికి నవ్వు ఆపుకోడం నా వల్ల కాలేదు. రాకపోతే ఏమిటి?—అనేక ఉత్తమ చిత్రాలు నిర్మించిన అన్నపూర్ణా అధినేత—చిత్రం డైరెక్టు చెయ్యమని నన్ను అడగడం ఏమిటి?— అందుకే ఆ నవ్వు. ఆ నవ్వులో ఎన్నో అర్థాలు నాకే కనిపించాయి.

మధుసూదనరావుగారి ప్రశ్నకు వేరేగా నేను సమాధానం ఇవ్వలేదు. నా నవ్వే సమాధాన మయిపోయింది. అంచేత ఆయన మళ్ళీ ఏమీ అనలేదు. వూరుకున్నారు.

ఆ రాత్రి నేను ఓ విషయం బాగా ఆలోచించాను. ఎందుకు నన్ను మధుసూదనరావుగారు అలా అడిగారు? ఒక చిత్రంలో నటించడం అంటే అలవాటయిన పని గాని, చిత్రాన్ని డైరెక్టు చెయ్యడం అంటే మాటలా? మరి ఎందుకలా అడిగారు? నా దగ్గర అంత సామర్థ్యం వుందా?— పైగా నాకేం అవసరం వుంది?.... ఆ ప్రశ్నలకేమీ సమాధానాలు దొరకలేదు....

ఆ తర్వాత మళ్ళీ ఆ విషయంపై నే నెప్పుడూ ఆలోచించలేదు.

అయితే, ... పేరు ... నటించానికి వెళ్ళేముందు—ఆనాటి ... పూర్తి ... గా ... మాట ... ఆలోచించుకోవాలి. అలా, ఆ సంభాషణలు ... వుంటే నాకో ఫీలింగ్ వచ్చేవి. 'ఈ షాట్‌లో తీస్తే బావుంటుందేమో.'

'ఇది వేరొక యాంగిల్‌లో తీస్తే ఎలా వుంటుంది?'

'దృశ్యం అంతంలో ఇలా వుంటే ... టిక్‌గా వుంటుందేమో' అనే భావాలు కలిగేవి. అయితే, షూటింగ్‌లో పాల్గొనేటప్పుడు ఆ డైరెక్టరుగారు నేను వివరంగా చిత్రీకరించేవారు. నేను అనుకున్నదానికి వారు తీసిన దానికి తేడా ఎలా వుందో చూసుకునేదాన్ని. ఒక్కోసారి నా వూహ తప్పనిపించేది. ఇంకోసారి నా వూహ అయితే, ఇంకా ఎఫెక్టివ్‌గా వుండేదేమో అనిపించేది. ఏమైనా, చిత్రానికి డైరెక్టర్ అంటే ఆయనదే అధికారం. ఒక్కొక్కరి అభిరుచులు ఒక్కోలా వుంటాయి. ఎవరి వూహ వాళ్ళది. ఎవరి భావాలు వాళ్ళవి. అంచేత నేనేమీ మాట్లాడేదాన్ని కాదు.

"నాకు ఈ సంభాషణ ఈ విధంగా కావాలి" అని డైరెక్టరుగారంటే అలాగే చెప్పేదాన్ని. కాని, మనసులో మాత్రం ... నా వూహ మెదిలేది. నా వూహలో తీసి వుంటే ఆ దృశ్యం ఎలా వుండేదో అని. అంతే. అయితే, అంతలో 'డైరెక్టర్‌ని కావాలి' అనే కోరికలేదు. ... వూహ. అలాంటి వూహలు అందరికీ కలుగుతాయి. అందరికీ కలిగినట్టే, నాకూ కలిగాయి.

ఆ రోజు మధుసూదనరావుగారు "డైరెక్టు చేస్తావా?" అని అడిగిన నాటి మాటల్ని ... డైరెక్టర్‌ని ... నేను అనుకున్న వూహలన్నీ ... మన్నారు. కాని, ఆ ... ధైర్యం చేసింది. డైరెక్టర్ అంటే ఎలాంటి బాధ్యతలు మొయ్యాలి? ఎలాంటి ... కలిగి వుండాలి?....

• • •

దుక్కిపాటి మధుసూదనరావుగారి పరిచయం ... పరోక్షంగా ఓ రోజు నా కోసం వచ్చారు.

"నేనో కథ విన్నాను ... అన్నారాయన. ... చెప్పమన్నాను.

"ఆడవాళ్ళకు ... ఒక చిత్ర ... దాన్ని ... ఆ చిత్రాన్ని ...

డైరక్టు చెయ్యాలి" అని అన్నారు ఆయిన. ధారేమిటోగా అనిపించింది. నాలో ఏం శక్తుందన్నా అని మళ్ళీ ఇలాంటి అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చింది?....

ఓ నిముషం నేను మాట్లాడలేదు. 'ఓ చిత్రం డైరక్టు చేసి చూస్తే?' అనిపించింది.

"ఒక్క నిముషం వుండండి వారిని అడిగి చెబుతాను" అని 'ఆయన'కు ఫోన్ చేశాను. 'ఏమండీ విషయం ఇలా వుంది. ఏం చెయ్యమంటారు?' అని అడిగాను, కొన్ని నిముషాల వరకూ ఫోన్‌లో ఏ మాటా వినిపించలేదు.

"ఏమండీ? ఏమంటారు?" అని మళ్ళీ అడిగాను.

ఓ క్షణం ఆగి, "ఒప్పుకో" అన్నారాయన. నా మనసు పొంగిపోయింది. ఆయన కూడా ఒప్పుకోమంటున్నారేమిటి?....

"అది కాదండీ....నాకూ...."

"నువ్వు చెప్పబోయేదేమిటో నాకు తెలుసు. నేనెలా డైరక్టు చేస్తాను? నాకు ఆ అనుభవం ఎక్కడిది? నాకేం చేతవుతుంది? అని అడగబోతున్నావు. నీ గురించి నీకు తెలీకు గాని, నాకు బాగా తెలుసు. ఒప్పుకో. నేను తర్వాత వివరంగా అన్ని విషయాలూ మాట్లాడుకుందాం" అని ఫోన్ పెట్టేశారు.

నేను కూడా ఫోన్ పెట్టేలోపలే, వకోటిగారు—"రాయా? వద్దా?" అని అడిగారు.

"ఆయన వప్పుకొంటా చూపించారు" అన్నాను.

"వెరీగుడ్. తక్కిన విషయాలన్నీ రేపొచ్చి మాట్లాడతాను డైరక్టరుగారూ!" అని చెప్పి వెళ్ళిపోయారు ఆయన—'డైరక్టరుగారూ' అన్న మాటను నేనెంత వరకూ అండర్‌లైన్ చేస్తా.

తర్వాత శ్రీమాతా పిక్చర్స్ వెలిసింది. 'చిన్నారి పాపలు' చిత్ర నిర్మాణం ఆరంభమైంది. నేను డైరక్టర్నయ్యాను. దీనికి మాది మహిళామండలి. సంస్థను నడిపే వారే కాక, టెక్నీషియన్స్ కూడా మహిళలే. వకోటినే కథ రాశారు; పి. లీల సంగీత దర్శకత్వం వహిస్తున్నారు; మోహన అనే అమ్మాయి కళా దర్శకత్వం వహిస్తోంది; రాజసులోచన నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. అసిస్టెంట్ డైరక్టర్‌గా కొప్పరపు సరోజిని పని చేస్తున్నారు.

"ముఖానికి మేకప్ లేకుండా, మీరు డైరక్టర్ హోదాలో షూటింగ్ కార్యక్రమాల్లో పాల్గొంటూ వుంటే మీకు ఎలా వుంది?" అన్న ప్రశ్నను చాలామంది అడిగారు.

నిజంగా చెప్పాలంటే — నాకేమీ కొత్త అని పించలేదు; కంగారూ పడిపోలేదు. నేను ఎలా డైరక్టు చేస్తానో చూడాలని మా సెట్టుకు చాలా మంది తెలిసినవారు వస్తూవుంటారు. ఈ కొత్త పనిలో నన్ను చూడటంవల్ల—వారు కొత్త ఫీల్ అయి వుంటారు.

ఇదివరకటిమాటే. నాకు వున్న అలవాటేమి టంటే—ఏ డైరక్టర్ దగ్గర పని చేస్తున్నా ఆయన టెక్నిక్ ఏమిటని గమనించేదాన్ని. కెమెరా ఎక్కడ పెడుతున్నారు? ఎలా చిత్రీకరిస్తున్నారు? ఎందుకు కెమెరా అక్కడ పెట్టారు?—మొదలైన విషయాలన్నీ ఆలోచిస్తూ నాకు నేనే ఆ విద్యానిన్ని గ్రహించేదాన్ని. అలాంటి ఆ కొద్ది అనుభవంతోనూ, మావారి ప్రోత్సాహంతోనూ పెద్దల ఆశీర్వచనాలతోనూ నేను డైరక్టర్ను అయ్యాను.

డైరక్టర్‌గా మొదటిసారి నేను సెట్టులో అడుగుపెట్టిన రోజున, బి. ప్రకాశరావుగారు, ఆదుర్తి సుబ్బారావుగారు, వి. మధుసూదనరావు గారూ మొదలైన వారంతా వచ్చి నన్ను అభినందించారు. నేను ఎలా పని చేస్తానో చూడాం అని వారంతా సెట్లో చాలాసేపు కూడున్నారు.

కృష్ణుడి విగ్రహాన్ని పెట్టి మొదటి షాట్ తీశాను; రెండు బొమ్మలతో రెండో షాట్ తీశాను; మూడో షాట్‌లో రోజారమణి, గాంధారి బొమ్మతో ఆడుకుంటున్నట్టుగా చిత్రీకరించాను.

ఓసారి జానకిగారు నటిస్తున్న దృశ్యం షూట్ చేస్తున్నాను. ముందు కెమెరాను కొంత దూరంలో పెట్టి షాట్ ఏర్పాటు చేశాను. అయితే, జానకి గారు నటించడం ఆరంభించిన తర్వాత, ఆమె ముఖ భావాలను కెమెరాలోంచి చూస్తే—కెమెరా ఇంకా ముందుకు పెట్టాలని భావించాను. అవిడకు దగ్గరగా కెమెరా పెట్టి చిత్రీకరించాను.

ఆ రోజు రాత్రి జానకి నాకు ఫోన్ చేశారు.

నన్ను అభినందిస్తూ...."నాకేమాత్రం కొత్త డైరక్టర్ దగ్గర పనిచేస్తున్నట్టు లేదు. అనుభవం గల డైరక్టర్ దగ్గర పనిచేస్తున్నట్టే వుంది" అన్నారామె. అలాగే, ఇమున కూడా చాలాసార్లు అంది. నాకేమిటోలా అనిపించేది—వాళ్ళు అలా అంటున్నప్పుడు.

డైరక్టు చెయ్యడం నటించడం కన్నా సుల భమా?....అని అనుకునేదాన్ని కొన్నాళ్ళు. కా, నటులకి నచ్చినటిని చాంట్లోవున్న బాధ్యతా, కష్టాలా అనుగాహన కాసాగాయి.

నటిగావుంటే—డైరక్టర్ చెప్పినట్టు చేస్తాము, మన పాత్రను మాత్రమే అర్థం చేసుకుంటాము. కథ, మన పాత్రా అర్థమయితే చాలు. తక్కిన పాత్రలను లోతుగానూ, విశదంగానూ పరిశీలించ నవసరం లేదు. షూటింగ్ జరుగుతున్నప్పుడు, ఓ షాట్‌లో నటించి, తర్వాత షాట్ వచ్చేవరకూ బయట ఏదో మాట్లాడుకుంటూ కూర్చోవచ్చు. లేదిమొలో పాటలు వినొచ్చు; అటూ ఇటూ తిరగొచ్చు—మళ్ళీ మనను పిలుచుకొచ్చేవరకు, మన మూడ్ మన దగ్గరే వుంటుంది. నటిగా వుంటే అలాంటి 'రిలాక్సేషన్' ఎంతో వుంటుంది. అయినా ఓ రోజంతా చిత్రంలో ఒక పాత్ర నటించి ఇంటికి వెళ్లేసరికి, ఏదోగా వుంటుంది. 'రెస్ట్‌లెస్'గా ఫీలవుతాము. మరి డైరక్టరయితే, అన్ని పాత్రలూ నటించాలి; అన్ని కోణాలూ చూసుకోవాలి. దృశ్యంలో ముందు వెనకలు, కంటిన్యుటీలు, చూసుకోవాలి. ఆయన తర్వాత, తర్వాత రోజు కార్యక్రమం చూసుకోవాలి. ఎడిటింగ్ చూసుకోవాలి. డైరక్టరుది ఎన్ని బాధ్యతలు?....

నటిగా మాత్రమే వున్నప్పుడు, అందులోని బాధలు, ఇబ్బందులూ కనిపిస్తాయి. డైరక్షన్ బాధలు అప్పుడూ అంతగా అర్థం కావు. మాట్లాడి, వినడానికే 'డైరక్టర్' అంటే బాగానే వుంటుంది. కాని—దీనా పనని చేస్తేనే గాని తెలిసిరావు.

ఏమైనా డైరక్టర్‌గా ఇది నా తొలి ప్రయత్నం. నేను అనుకున్న భావాలను తెరమీద ఎలా చెప్పగలిగానో, ఎలా డైరక్టు చేశానో చెప్పవలసింది రసజ్ఞులైన ప్రేక్షకులు. అయితే నేను ఇతర చిత్రాల్ని డైరక్టు చేస్తానా—ఇంకా చిత్రాలని డైరక్టు చేస్తానా అన్న విషయాలు ఇప్పుడే ఏమీ చెప్పలేను.

అయితే, చిత్రాల్లో నటించడం మానుకోలేను; మానను. నేను ఈ చిత్రంలో ఒక చిన్న పాత్ర ధరిస్తున్నాను. ఉత్సాహంకొద్దీ కాలోవున్న ఆర్తి కొద్దీ డైరక్టర్ను అయ్యాను. ఈ కొత్త అనుభవం లేకపోయినా, ఈ వర్కింగులో వున్న అనుభవంవల్ల—నేసి కాలను చేస్తాను. డైరక్టరయితే నటించరాదనీ, నటించేవారు డైరక్టరు కాకూడదనీ ఎక్కడా లేదుగా! ★

‘విజయ చిత్ర’ పత్రిక నుంచి

"వాళ్లెవరి ఆస్తులు వాళ్ల పేరున లేవండి, అందుచేత వాళ్ల పేరు మీద డబ్బు ఇవ్వలేము. మీరొక్క సంతకం చేయండి చాలు ఫైనాన్స్ చేస్తాము" అన్నారు ఫైనాన్సియర్లు.

సావిత్రి సంతకం చేయకపోతే సినిమా ఆగిపోయే పరిస్థితి. ఆ ఒక్కటే ఆలోచించి, ఇంకేమి ఆలోచించక సంతకం చేసేసింది.

ఆ ఫైనాన్సియర్‌కు సావిత్రి సంతకం ఒక్కటి చాలు. ఎందుకంటే సావిత్రి నిప్పు అని తెలుసువాళ్లకి. కొల్లేటరల్ సెక్యూరిటి కూడా అడగలేదు సావిత్రిని.

ఇదంతా ఒక కుట్ర. కంపెనీ భాగస్తుల దగ్గర ఆస్తులు లేక కాదు. వాళ్లు ఎవరూ డబ్బు పెట్టడానికి ఇష్టపడలేదు. వాళ్ల సినిమా స్టార్లు లేని సినిమా, మామూలు కమర్షియల్ కథలకు భిన్నం.ఎలా ఆడుతుందో అని అందరికీ అనుమానమే. అందరూ సావిత్రి మీదకు తోశారు. సావిత్రి బుట్టలో పడింది ఎప్పటిలానే.

సినిమా విడుదలవ్వడానికి అన్ని పనులు తన భుజస్కంధాల మీద వేసుకొని ఎంతో ఖర్చు చేసింది. విడుదలకు ముందు, విడుదల అయిన తర్వాత,తన డబ్బు లెక్కలేనంత ఖర్చు పెట్టింది (ఖర్చు పెట్టించారు). 1968లో చిత్రం విడుదలైంది. 100 రూపాయలకు 25 రూపాయలు తెచ్చిపెట్టింది.

చివరకు ఫైనాన్సియర్‌లు వచ్చి కూర్చున్నారు. సావిత్రి మిగతా షేర్‌హోల్డర్‌లకు ఫోను చెయ్యటం మొదలు పెట్టింది.

"అమ్మగారు ఇంట్లో లేరమ్మా."

"అమ్మగారు తిరుపతి వెళ్లారమ్మా."

"అమ్మగారు బాగోలేక పడుకున్నారమ్మా."

సావిత్రి, ఏ షేర్‌హోల్డర్‌కి ఫోన్ చేసినా ఇవే సమాధానాలు.

"మీరు మరొకసారి రండి, నేను ఈ విషయం వాళ్లతో మాట్లాడలేదు, మాట్లాడి కబురు చేస్తాను" అని ఆ రోజుకి వారిని పంపించింది.ఆ మరుసటి రోజు సావిత్రి షేర్ హోల్డర్‌లను కలిసింది.

"నాకేమీ తెలియదండి, ఆవిడ తీసుకోమంటే షేర్లు తీసుకున్నానంతే" అన్నది ఒకావిడ.

"అయ్యో దీంట్లో ఇన్ని లొసుగులు ఉన్నాయంటే నేను అసలు చేరేదాన్ని కాదు" అంది ఇంకో ఆవిడ.

"ఇప్పటికి మీరు కట్టేయండి వాళ్లకి, ఆ తరువాత మనం చూసుకుందాం" అన్నది అసలావిడ.

ఇక వాళ్లని అడగటానికే సిగ్గు వేసింది సావిత్రికి.

ఇక లాభం లేదనుకొని తన దగ్గర ఉన్న క్యాష్ కొంత, కొన్ని నగలు అమ్మగా వచ్చిన డబ్బుతో ఫైనాన్సియర్‌కు కట్టేసింది.

"చాముండీ! నువ్వుండి ఉంటే వాళ్ల ముక్కు పిండి వసూలు చేసుకొచ్చేదానివి" అనుకుంటూ మందు గ్లాసులో పోసుకొని తాగింది. గ్లాసు దించే సరికి ఎదురుగా చాముండి ఉంది. కాసేపు నిజమేనా అన్నట్లు చూసింది.

"నిజమేనన్నమాట నువ్వు తాగుతున్న విషయం" అంది చాముండి. "ఎందుకు ఇదొక అలవాటు చేసుకుంటున్నావు."

"అలవాటు ఎప్పుడో అయింది. అయినా చాముండీ, ఈ ఫీల్డులో తాగనివారెవరు?"

"అందరూ దీన్ని మందులాగా మితంగా తీసుకుంటున్నారు."

"నేనూ అంతే. కాస్త నిద్రపట్టడానికి తాగుతూవుంటాను."

"నువ్వు మంచినీళ్లలాగా తాగేస్తున్నావు. తాగితే ఆరోగ్యం పాడవటం తప్ప మంచేం జరగదు. నా మాట విని తాగకు."

"ఈరోజు వాళ్లు చేసిన పని తట్టుకోలేక తాగుతున్నాను. నీకిది తెలుసా వాళ్లు ఎంత పనిచేశారో."

"తెలిసే వస్తున్నా. డైరెక్షన్ అన్నావు బాగానే ఉంది. డబ్బులు పెట్టేదాకా ఎందుకు వెళ్లావు"?

"వాళ్లు మెల్లగా దించారే."

"నీ బుద్ధేమయింది?"

"అదే ఉంటే నా కథ ఇట్లా ఎందుకు ఉంటుంది?"

"అయిందేదో అయింది. ఇకనైనా డబ్బులు ఖర్చు చేసే పనులు చేయకు". ఇంకా చాలా విషయాలు మాట్లాడుతూ వుంది చాముండి,ఏమి మాట్లాడినా, అది సావిత్రి మనసు మందు మీద నుంచి మళ్లించటానికే. చివరకు ఆ సీసాలు గదినుంచి బయటకు పంపించి,"సరే మరి వెళ్లొస్తాను" అని తిరగగానే జి.జి. వస్తున్నాడు లోపలికి.

"మళ్లీ ఎందుకు వచ్చావు?" అరిచాడు జి.జి.

"క్షమించండి. ఆ సినిమా నష్టం వచ్చిందని తెలిసి వచ్చాను. దయచేసి డబ్బులు పోగొట్టుకునే పనులు చేయొద్దని చెప్పండి" అని కాళ్లు పట్టుకున్నంత పని చేసింది.

"నేను చెప్పింది అదే, వింటేనా."

"హమ్మయ్య" అనుకొని వచ్చేసింది.

ఇదే సినిమాను జి.జి. హీరోగా 'శ్రీ సావిత్రి ప్రొడక్షన్స్' బ్యానర్ మీద తమిళంలో మళ్లీ తీసింది. దానిపేరు 'కుళందై ఉళ్ళం' ఈ సినిమాకు కూడా తెలుగు సినిమాకు పట్టిన గతే పట్టింది.

ఈ రెండు సినిమాలు బాగా ఆడకపోయినా దర్శకత్వం బాగుందని చాలా మంది సినిమా పెద్దలు అన్నారు. పైగా 1968వ సంవత్సరానికిగాను, ప్రకటించిన నంది అవార్డుల్లో రెండవ ఉత్తమ చిత్రంగా 'చిన్నారి పాపలు' కు రజత నంది లభించింది. ఇంకనే.....' మళ్లీ ఎప్పుడు సినిమా తీస్తున్నావమ్మా? మళ్లీ తీస్తావా అసలు' అని అడుగుతున్నారు ప్రతివాళ్లు. సావిత్రి పక్కనే సైకోఫాంట్స్ కూడా ఎక్కువయ్యారు.

"మళ్లీ తీద్దాం, ఈసారి పెద్దస్టారులని తీసుకుందాం అండీ" అని చెవిలో ఒకటే రొద.

సరైన మార్గదర్శి ఉండి ఉంటే సావిత్రి మళ్లీ నిర్మాణంలోకి దిగేది కాదేమో. కాని ఖాళీగా వుండలేక కొంచెం, చుట్టూ ఉన్న భజంత్రీపరుల ఎగతోపుడు కలసి సావిత్రిని చిత్ర నిర్మాణం వైపు ఉసిగొలిపాయి.

వెంటనే తెలుగు 'మూగమనసులు' సినిమాని తమిళంలో నిర్మించదలచుకుంది. దానికి 'ప్రాప్తం' అని పేరు కూడా పెట్టింది.

సినిమా తీద్దాం అనుకున్నది మొదలు ఖర్చులు తయారయ్యాయి. ఎవరెంత లాక్కోగలిగితే అంత లాక్కోవటం మొదలు పెట్టారు. సావిత్రి లెక్కచూపమని అడగలేదు, మొహమాటం. వాళ్లకి తెలుసు అడగదని. ఇక ఇష్టం వచ్చినట్లు ఖర్చు చేస్తూ ఉన్నారు.

ఈసారి పనులు తన ఒక్కదాని వల్ల కాదనుకుని తన దగ్గరచుట్టాన్ని ఒకరిని సహాయంగా రమ్మంది. ఆయన తన ఉద్యోగానికి సెలవు పెట్టి వచ్చారు. వచ్చినదగ్గరినుండి చూస్తూనే వున్నారు...... ఇంట్లో నుంచి పోయే డబ్బుకు తెరిపి లేదు. ఈ ఇంట్లోకి లెక్కపెట్టుకోలేనంత డబ్బు వచ్చినప్పుడు కూడా ఆయనే సాక్షి. ఇప్పుడు, డబ్బు వచ్చినదానికంటే పోతున్న డబ్బు ఎక్కువగా వుంది. ఆయన సావిత్రిని దగ్గర కూర్చోపెట్టుకుని చెప్పారు. "అమ్మాయ్ సావిత్రి! ఒకటే బండగుర్తు నీకు. మీ ఆయన నీకీ పనుల్లో చేదోడు వాదోడుగా ఎందుకు వుండటం లేదో తెలుసా?"

సావిత్రి మాట్లాడలేదు. ఆలోచిస్తున్నది.

"మీ ఆయనతో పదేళ్ల సావాసంతో చెప్తున్నాను. మీ ఆయన డబ్బులు వచ్చే దగ్గరే వుంటాడు కాని డబ్బులు పోయే దగ్గర వుండడు. డబ్బులు పోయే పని కూడా చేయడు. నా

మాట విని ఈ డబ్బులు ఖర్చు అయ్యేపని మాను. ఈ సంగతులు నాకేమి అంతుపట్టడం లేదు. 64 కళలు వున్నట్లు సినిమా పూర్తి చేయాలంటే 64 శాఖలతో పని చేయాల్సి వస్తుంది. ఒకడు దానికి డబ్బంటాడు, ఒకడు దీనికి డబ్బంటాడు. డబ్బు పోతూనే వుంది. అంతా అయిన తర్వాత నీ సినిమా ఆడి డబ్బు తీసుకొస్తుందో లేదో తెలియదు. నామాట విని ఈ పనులు ఆపుకో" అన్నారు.

"మన డబ్బు గట్టిదైతే మన దగ్గరే వుంటుంది. మనకు రాసిపెట్టి వుంటే ఎక్కడికీ పోదు. నాకు ఊహ తెలిసిన దగ్గరినుండి నా దగ్గర ఒక్క అణాకాణి లేకపోయింది. తరువాత ఎంత డబ్బు వచ్చింది. ఇప్పుడూ అంతే, మనదైతే ఎక్కడికి పోదు" అంది సావిత్రి.

ఇంతే మొండిపట్టు. ఈ విషయంలో ఇంకా ఎంతమంది నెత్తీనోరు బాదుకున్నా సావిత్రి వినలేదు.

పైగా ముందుగానే యాక్టర్లందరికి అడ్వాన్సులిచ్చి కూర్చొంది. వాళ్ల కాల్‌షీట్స్ ఉన్నాయి తనదగ్గర. ఇక ఎవరు చెప్పినా వినేది కాదు.

ఆది నుంచి 'ప్రాప్తం' అవాంతరాలమయం అయిపోయింది. సినిమా షూటింగ్ మొదలై ఒక షెడ్యూలు తర్వాత ఆగింది. డబ్బు సర్దుబాటు చేసుకునేసరికి మరికాస్త ఆలస్యమైంది. ఈలోగా 'ప్రాప్తం' హీరో అయిన శివాజి గణేషన్ సినిమాలు రెండు వచ్చి ఫ్లాప్ అయ్యాయి.

తమిళ 'చిన్నారి పాపలు' తెచ్చిన నష్టాన్ని, 'ప్రాప్తం' సినిమాకు అవుతున్న ఖర్చులు పూడ్చటానికి ఆదుర్తి సుబ్బారావు దగ్గర నుంచి కొన్న ఇల్లు అమ్మేసింది.

"నేను ఇందుకా ఆ ఇల్లు కొనిపించింది" ఫోన్‌లో చాముండి బాధ.

"నాకేం తెలుసు చాముండి! ఆ సినిమాలు అలా పోతాయని. అసలు ఒకసారి సినిమా చూడు ఎంత బాగా తీశానో, వూరికే వచ్చిందనుకున్నావా నంది అవార్డు" సావిత్రి సమర్థించుకుంటూ అంది.

"ఇంక లాభం లేదు, నేను వస్తున్నాను, ఇలా వదిలేస్తే ఇప్పుడు ఉన్న ఇల్లు కూడా మిగిల్చేటట్లు లేవు. పైగా రోజూ విపరీతంగా తాగుతున్నావట. ఆగు నేను ఇప్పుడే వస్తున్నాను" అంది చాముండి.

"సరే రా! నేను ఎదురు చూస్తూ ఉంటాను" అని అంది. మందు పోసుకుంది, తాగేసింది.

అన్నట్లే చాముండి వచ్చేసింది. గేట్‌దాటి లోపలికి వచ్చింది.

డోర్ దగ్గర సెక్రటరీ ద్వయం, కొందరు బంధువులు కలిసి బయటికి నెట్టేశారు. చాముండి వస్తే వాళ్ల ఆటలు ఏమీ సాగవు అని తెలుసు.

అలా దూరంగా వెళ్లిపోయిన చాముండి ఒక నాలుగు నెలలు మళ్లీ సావిత్రి ఇంటి మొఖం చూడలేదు. ఫోనులు చేసి మాట్లాడేది. నాలుగు నెలల తరువాత ఒకసారి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎక్కడా సావిత్రి కనిపించలేదు. ఇంట్లో వారిని అడిగితే స్విమ్మింగ్ పూల్‌లో వుందని చెప్పారు.

"స్విమ్మింగ్‌పూలా!" ఆశ్చర్యపోయింది చాముండి. తనకు ఫోన్‌లో చెప్తూనే వుంది స్విమ్మింగ్‌పూల్ కట్టిస్తున్నానని. అప్పుడే చెప్పింది చాముండి, వాస్తు చూసుకొని కట్టించమని. కాని ఇంత త్వరగా కట్టిస్తుందని అనుకోలేదు. లేడికి లేచిందే పరుగు అన్నట్లు సావిత్రికి ఏదైనా ఆలోచన వచ్చింది మొదలు దానిని ఆచరణలో పెట్టే వరకు నిద్రపోలేదు. స్విమ్మింగ్‌పూల్ ఎక్కడా? ఎక్కడా?' అని వెతుక్కుంటూ వచ్చిన చాముండికి ఇంటి వెనక్కు రాగానే స్విమ్మింగ్‌పూల్‌లో నుంచి ప్రతిఫలించిన సూర్యకిరణాలు చాముండి కళ్లని కాసేపు గుడ్డివాటిని చేశాయి, తడబడి కింద పడిపోయింది.

"హాయ్ చాము! రా ఇటు, మళ్లీ కిందపడ్డావా? నీకు నా దగ్గర ఏమి క్రొత్తవి చూసినా, క్రొత్తవి చెప్పినా పడిపోవటమే పని. కళ్లలో కిరణాలు పడ్డాయి కదూ. ఈ స్విమ్మింగ్ పూల్‌తో అదొక్కటే సమస్య. కాసేపు కళ్లు మూసుకుని వస్తే హాయిగా ఆడుకోవచ్చు. రా నువ్వు కూడా దిగు" అంది సావిత్రి.

అప్పటికే కూతురుని, కొడుకుని స్విమ్మింగ్‌పూల్‌లో ఆడించుకుంటున్నది. తను చేపపిల్లలా ఈదుతుంది. చాముండి అంతా కలయచూసింది. అంతకు ముందువున్న లాన్‌లో, సావిత్రి ఎక్కువగా గడిపే లాన్‌లో ఈ స్విమ్మింగ్‌పూల్ వుంది.

సావిత్రి ఆటలైన తరువాత లోపలకొచ్చింది. సావిత్రి జుట్టు తుడుస్తూ మనసులోని భయాన్ని బైటపెట్టింది చాముండి. "సావిత్రి! నీవు చాలా తప్పు చోట స్విమ్మింగ్‌పూల్ కట్టించావు. ఈ ఇల్లు చూసుకుంటే ఈ ఇంటికి అది నట్టిల్లు. నువ్వు ఎక్కువ కూర్చునేది అక్కడే. నీ నిర్మాతలు, దర్శకులు నీతో మాట్లాడేది అక్కడే. నీకెన్నోసార్లు అక్కడ చెక్కులు ఇవ్వబడ్డాయి. అలాంటి చోట నువ్వు ఇంటికంటే పెద్ద వైశాల్యంలో గొయ్యి తీశావు. నట్టింట్లో గొయ్యి తీశావు. నీ గొయ్యి నువ్వే ..........." ఆగిపోయింది చాముండి.

సావిత్రి వెనక్కి తిరిగింది. నిజమా అన్నట్లు చూసింది, భయపడిపోయింది.

"అయితే ఇప్పుడు ఏంచేద్దాం?" అంది.

"అది మళ్లీ పూడ్చటమే మేలు."

"లక్షరూపాయలు పెట్టానే దీనికి."

"అయినా ఫరవాలేదు పూడ్చటమే మేలు" అంది చాముండి.

అంత ఖర్చు పెట్టినందుకు అంత ఇష్టపడి కట్టుకున్నందుకు సావిత్రికి స్విమ్మింగ్‌పూల్ ాద్భుబుద్ధి కాలేదు. వేరే సలహాలను అనుసరించి ఇంటికి స్విమ్మింగ్‌పూల్‌కి మధ్య పొడుగున ోడ కట్టించింది. సావిత్రి తీయించిన ఈ గొయ్యే, సావిత్రి పతనం ఆరంభమవటానికి ంకేతమని ఈ స్విమ్మింగ్‌పూల్ గురించి తెలిసిన వారందరూ నమ్ముతారు.

★★★

'ప్రాప్తం' సినిమా గురించి మాట్లాడటానికి చాముండి సావిత్రికి ఫోన్ చేసి "ఇప్పటికైనా మించిపోయింది లేదు, ఆ సినిమా ఆపెయ్యి" అని చెప్పింది.

"ఇప్పుడిక ఆపలేను చాముండి. అయినా, తాగకుండా నువ్వు ఏదో పని చూసుకోమన్నావు కదా!"

"ఆహా! అప్పటికేదో అసలు తాగనట్లు. నేను నిన్న మళ్లీ వచ్చాను నీకు తెలుసా?"

"వచ్చావా! ఎప్పుడు తెలియదే?"

"నువ్వు ఈ లోకంలో ఉంటేనేగా".

"నేనెందుకు లేను ఉన్నానుగా".

"ఇప్పుడు ఉన్నావా? ఇప్పుడూ తాగి ఉన్నావు."

"నీకెలా తెలుసు".

"తాగకు స్యావ్, తాగకు ప్లీజ్."

"స్యావ్, స్యావ్ ఏంటీ, వో.... పేరు చిన్నది చేశావా."

సావిత్రి - స్యావ్ చాలా బాగుంది. ఇంతకు ముందెన్నడు నన్నలా పిలవలేదే చామూ. నువ్వు నా సెట్స్‌కు రా, అక్కడ మళ్లీ పిలుద్దువు ఆ పేరుతో" అంది.

★★★

ఇద్దరు నిర్మాతలు సావిత్రి వద్దకు వచ్చి, "సావిత్రిగారూ! 'మాతృదేవత' అనే సినిమాను తీస్తున్నాము, దానికి మీరు దర్శకులు, హీరోయిన్ కూడా" అని అన్నారు.

మీరు హీరోయిన్ అన్నదాని కన్నా, మీరు దర్శకులు అన్నదానికి సావిత్రి చాలా సంతోషించింది. సినిమా మొదలయింది. ఒకరోజు నిర్మాతలు సావిత్రి ఇంటికి వచ్చారు. "సావిత్రి గారూ! మీరు ఫైనాన్షియర్లకు కాస్త గ్యారంటీ సంతకం పెట్టాలి. మామీద వాళ్లకి నమ్మకం లేక కాదు, అది ఒక పద్ధతి అంతే. గ్యారంటీయర్‌గా ఒకళ్ల సంతకం తీసుకుంటారు."

సావిత్రి వెంటనే పెట్టేస్తాను అనలేదు.

"మీకు మామీద నమ్మకం ఉంటే ఒక సంతకం పెట్టండి చాలు, మీ మీద నమ్మకంతో ఈ సినిమాని మీ చేతుల్లో పెట్టాము" అన్నారు.

ఈ మాటలతో చాలా మొహమాట పడిపోయింది సావిత్రి, అంతే సంతకాలు పెట్టేసింది.

సరిగ్గా ఇదే సమయంలో 'చిరంజీవి' అనే సినిమాక్కూడా ఇలానే చేసింది. తను దర్శకురాలై ఉండి నిర్మాతలకు గ్యారంటీ సంతకాలు పెట్టింది. సావిత్రి దురదృష్టమేమిటంటే తను మోసపోయాను అని తెలుసుకోక ముందే అలాంటి మోసపూరితమైన ఇంకో చర్యలో భాగమై పోయింది .

ఇంట్లో కనిపెట్టుకునే వారెవరూ లేరు. సుభద్రమ్మ రోగిష్టిదయింది. పైపైన చూసుకోగలదు అంతే. విశ్రాంతి తీసుకునే సమయమే ఎక్కువ. ఇంట్లో ఉన్న వాళ్లదే రాజ్యం అయింది. ఇంట్లో ఏమి ఉన్నది, ఏమి పోతుంది సావిత్రికి తెలియదు. తను ఒకరోజు పెట్టుకున్న బంగారపు వస్తువు రెండో రోజు కనిపించకపోతే ఇంకోటి తీసి పెట్టుకునేదిగానీ, అది ఏమయింది అనే ఆలోచన ఆమెకు ఉండేది కాదు. ఒక రోజు షావుకారు జానకి తను ఎప్పుడూ వెళ్లే బంగారపు కొట్లో వుండగా సావిత్రి ఇంట్లోని పనివాడొకడు సావిత్రి గాజులు అమ్ముతూ జానకికి పట్టుపడ్డాడు. షావుకారు జానకి, సావిత్రి ఒకసారి ఈ గాజులు ఒకే డిజైన్‌తో చేయించుకున్నారు కాబట్టి షావకారు జానకి ఆ గాజులని గుర్తుపట్టి,దొంగని పట్టగలిగింది.

'మాతృదేవత' సెట్‌లో ఉండగా చాముండి వచ్చింది. సావిత్రికి ప్రాణం లేచి వచ్చినట్లయింది. ఇప్పుడే వస్తానని చెప్పి, చాముండిని తీసుకొని గ్రీన్‌రూమ్‌లోకి వచ్చి గాఢంగా కౌగిలించుకుంది సావిత్రి. అప్పటిదాకా అల్లకల్లోలంగా ఉన్న సావిత్రి మనసు శాంతించింది. ఇలాంటి స్వాంతన కోసమే తన ఎదురుచూపులు. ఎప్పటి నుంచో ఈ స్వాంతన ఎండమావి అయింది. చాముండికి తెలుసు ఈ విషయం. అందుకని తను విడిపించుకునే ప్రయత్నం చేయలేదు. ఓదార్పుగా నిలుచుంది. తన బట్టల మీద తడి తగిలింది చాముండికి. సావిత్రిని విడిపించుకొని చూడగా సావిత్రి కన్నీరు కారుస్తుంది.

"ఛ ! ఛ ! ఏంటి ఇలా ఏడుస్తున్నావు? ఇంత పెద్ద నిర్మాత, దర్శకురాలవు. ఎన్.టి.ఆర్‌ని దర్శకత్వం చేస్తున్నావు".

"ఏమి నిర్మాతనులే చామూ! అంతా హరించుకుపోతోంది. అహాన్ని చంపుకోలేక తీస్తున్నాను. ఏటిలో మునిగివున్నాను. ఎదురీదే ధైర్యం కూడా లేదు. మొండిగా మునగటానికే నిశ్చయించుకున్నాను."

" 'కుళందై ఉళ్ళం'కి ఎంత ఖర్చు పెట్టావు?"

"ఆరు లక్షలకు కాని అంతా క్లోజ్ కాలేదు."

"నీ లాంటి స్టార్స్‌ని పెట్టి తీస్తేనే నాలుగు లక్షలు కాదు. నీకు ఆరు ఎందుకైంది సావిత్రి. నీ చుట్టూ ఉన్నవాళ్లు నిన్ను మోసం చేస్తున్నారు."

"పోనీలే మోసం చెయ్యటం కంటే మోసపోవటమే గౌరవం."

"నీలాంటి దానికి దేవుడు ఇలాంటి కష్టాలు ఇచ్చాడేంటి" అని బాధపడింది చాముండి.

"నువ్వు కూడా కష్టపెట్టక రేపు వచ్చేసేయ్" అంది సావిత్రి.

"అట్లా అనకు సావిత్రి నేను వచ్చేస్తాను. ఇక ఎవరు ఏమన్నా వచ్చేస్తాను. మీ ఆయన కాళ్లు పట్టుకునైనా వచ్చి నిన్ను చూసుకుంటాను" అంది చాముండి.

"ఆ అవసరం ఉండబోదులే. ఆయన రాజకుమారిని పెళ్లి చేసుకోబోతున్నారటగా నిజమేనా?"

మౌనం వహించింది చాముండి.

"చెప్పు చామూ."

"ఏమని చెప్పను. తెలియదని నటించనా? తెలిసీ తెలియనట్లు నటించనా? తెలుసు అయితే ఏం చేద్దాం అని అడగనా?"

ఒక్క క్షణం నివ్వెరబోయింది సావిత్రి. ఆ తర్వాత పెద్దగా నవ్వటం మొదలుపెట్టింది. ఆ నవ్వే ఏడుపుగా మారింది. కాసేపు కప్పిపుచ్చుకోవాలని ప్రయత్నించింది. తన చాముండి దగ్గర ఆ ప్రయత్నం అనవసరం అనిపించి ఏడవగలిగినంత సేపు ఏడ్చింది.

ఎప్పుడూ నిబ్బరంగా వుండే చాముండి కూడా బాధ ఆపుకోలేకపోయింది. "నేను పెళ్లి చేసుకున్నాను" అంటే అప్పుడు చాముండికి వచ్చిన ఏడుపు మళ్లీ చాముండిలో చూసింది సావిత్రి.

"అదేకదా ఆరోజు అందరూ మొత్తుకుంది" అంది చాముండి.

"పోనీలే చామూ! నువ్వు వస్తున్నావు కదా, అంతే చాలు. రేపు వచ్చేసెయ్."

"రేపు చాముండి వస్తుంది. సెక్రటరీ, నువ్వేకాదు ఎవ్వరూ అడ్డుచెప్పటానికి వీలు లేదు" అని చెప్పి మరీ ఆ రోజు ఇంట్లోకి వచ్చింది సావిత్రి.

తరువాత రోజు ఎంత ఎదురుచూసినా చాముండి రాలేదు. ఇక సెట్‌లో అందరూ వచ్చేసి ఉంటారని బయలుదేరింది. తర్వాత చాలా రోజుల వరకు చాముండి రాలేదు సరికదా, ఫోన్ లేదు, ఉత్తరం ముక్కా లేదు.

"చాముండిని చంపేశారా ఏంటీ వీళ్లు" అనుకుంది సావిత్రి.

"బతికి ఉంటే ఇన్ని రోజులూ ఫోన్ ద్వారానయినా నన్ను పలకరించకుండా వుండదు. లేదా వాళ్ల ఊరు వెళ్లిందా? నాకు చెప్పకుండా పోదే. అయినా చెప్పటానికి వచ్చినా వీళ్లు రానివ్వరు" అని సరిపెట్టుకుంది సావిత్రి.

'మాతృదేవత' చాలా మంచి హిట్. కాని సావిత్రికి మాత్రం ఆర్థికంగా దెబ్బ. సినిమా హిట్ కాని ప్రొడ్యూసర్ ఫట్ అనేది, చిత్తూరు నాగయ్య నిర్మాతై 'త్యాగయ్య', 'భాగ్యలక్ష్మి' తీసిన రోజుల నుంచి ఉంది. దానికి కారణం వారి అనుచరగణమే. చిత్తూరు నాగయ్య సినిమాలు తీసి కోలుకోలేని దెబ్బతిన్న సంగతులు ఆనాటి 'రూపవాణి' 'కినిమా' తదితర పత్రికలు కోడై కూశాయి. ఆ కూతలు సావిత్రికి ఆనాడు వినిపించినా ఈనాటికి మర్చిపోయింది. 'మాతృదేవత' అంత హిట్ కాకపోయినా 'చిరంజీవి' కూడా ఫర్వాలేదనిపించుకుంది. ఆయా చిత్రానికి పెట్టుబడులు పెట్టిన ఫైనాన్సియర్లకు, డిస్ట్రిబ్యూటర్లకు ఆ చిత్రాల తాలూకు లాభాలు అందలేదు. గ్యారంటి సంతకం పెట్టి నిర్మాత కాని నిర్మాతైన సావిత్రిని వదలలేదు వాళ్లు. మళ్లీ సావిత్రి ఆస్తులకు కాళ్లు వచ్చాయి. ఈసారి గుర్రపు కాళ్లు వచ్చాయి. 'మాతృదేవత', 'చిరంజీవి' నష్టం నుండి కోలుకోవటానికి ఇంట్లో విలువైనవన్నీ పోయాయి. వాహినీ స్టూడియో పక్కనున్న ఆరెకరాల పొలం అతితక్కువ ధరకు అమ్ముకుంది. ఇక బయటి సినిమాల్లో పాత్రలు చేయటం మొదలుపెట్టింది. 'కోడలు దిద్దిన కాపురం' అనేది చిట్టచివరి పెద్దపాత్ర. ఆ తర్వాత సినిమా సినిమాకి తన పాత్ర నిడివి తక్కువవుతూ వచ్చింది.

1970 మార్చి 18న సావిత్రి తల్లి సుభద్రమ్మ గతించారు. సావిత్రి అప్పటికే ఒంటరిదయ్యింది. తీవ్ర ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినా భర్త ఏమి ఎరగనట్లు ఉన్నాడు. ఇష్టం వచ్చినప్పుడు ఇంటికి వస్తూ, ఇష్టం వచ్చినప్పుడు పోతూ ఉన్నాడు.


సావిత్రి తల్లి రుణం తీర్చుకున్నట్లే. ఎందుకంటే సావిత్రి ఎదిగిన దగ్గర నుంచి సుభద్రమ్మ రాజమాతలా వెలిగిపోయింది. సుభద్రమ్మ సగం జీవితం దారిద్ర్యంలో గడచినా మిగతా సగంలో రాజభోగాలు అనుభవించింది.

ఒకరోజు హఠాత్తుగా చాముండి సావిత్రి ఇంటికి వచ్చింది.

"చామూ, అమ్మ పోయింది" అని ఏడ్చింది సావిత్రి.

"అమ్మ లేదని తెలిసి వచ్చావా? ఇన్నాళ్లదాకా నేను గుర్తు రాలేదా?" అడిగింది సావిత్రి.

"నువ్వు గుర్తు రాక కాదు సావిత్రి మా అమ్మకూడా మంచం పట్టింది. నేను మళ్లీ సిలోన్ వెళ్లాను. నీకోసమని మళ్లీ వచ్చాను. నేను ఎప్పుడైనా నీకు చెప్పకుండా వెళితే మా అమ్మకోసమే అనుకో." కాసేపు సావిత్రిని పరిశీలించింది.





అరుణోదయ పిక్చర్స్ దర్శకత్వం వహిస్తూ



'నిర్దోషి' సెట్స్ మీద




నటి చంద్రకళతో



1970 ఏ.ఎన్.ఆర్. చలనచిత్ర రజతోత్సవ సందర్భ సభ




చలం, శారద, జమున, వాణిశ్రీతో



**29-6-67, 'కంచుకోట' శతదినోత్సవం, విజయ టాకీస్, విజయవాడ**



**24-11-1969** గుడివాడలో శ్రీ బాలాజీ థియేటర్స్ ప్రారంభోత్సవ
సందర్భం  సావిత్రి, ఎన్.టి.రామారావు



'ప్రాప్తం' షూటింగ్‌లో







తమిళ్ 'ప్రాప్తం' 1971



తెలుగు 'మూగ మనసులు' 1964





మద్రాసు అశోక హోటల్‌లో జరిగిన 'శారద' శతదినోత్సవ వేదుక



**12-9-1971 విజయవాడ అలంకార్ థియేటర్‌లో**
**పి. పుల్లయ్య, శాంతకుమారిల షష్ఠిపూర్తి సందర్భం**



**19-07-70 నీలం సంజీవరెడ్డితో**






9-7-1971 'కన్నతల్లి' షూటింగ్‌లో







నటీమణి
సావిత్రి
సమర్పించు
ఔట్‌డోర్ యూనిట్
ఔట్ డోర్ షూటింగ్‌కు కావలసిన ఆధునిక సాధన సంపత్తి గల ఈ వ్యవస్థ అనుభవజ్ఞులచే నిర్వహింపబడుతున్నది. నిర్మాతలు తమ ఔట్ డోర్ షూటింగులు అల్ప వ్యయంతో అనల్ప సంతృప్తితో జరుపుకోడానికి ఇది ఒక సదవకాశం.
నటీమణి సావిత్రి సమర్పించు ఔట్ డోర్ యూనిట్.
వివరాలకు:
శ్రీ సావిత్రి ప్రొడక్షన్స్,
హబిబుల్లా రోడ్, మద్రాసు. 17
SRI SAVITRI PRODUCTIONS

"నీ మొహం చూస్తేనే తెలుస్తోంది, నువ్వు విపరీతంగా తాగుతున్నావని. ఎందుకలా ఆరోగ్యం పాడుచేసుకుంటావు? డబ్బు తగలేస్తావు?" అని చాముండి మందలించింది.

"వాడు మోసం చేశాడు, వీడు మోసం చేశాడు అని తాగిచావకపోతే ఉన్నవి చక్కదిద్దుకోవచ్చుగా" అంది.

"ఒకళ్లు మోసం చేశారని బాధపడి తాగే స్టేజి ఏనాడో అయిపోయింది. ఇప్పుడు నేను తాగకపోతే పిచ్చిదాన్ని అయిపోతాను. నిన్నటికి నిన్న ఆ ప్రొడ్యూసర్ దగ్గరకు వెళ్లాను నా 30 లక్షలు ఇవ్వమని. లేవన్నాడు, అదన్నాడు, ఇదన్నాడు, ఏదన్నా, అతనికి ఇచ్చే ఉద్దేశం ఉంటేనేగా? ఎప్పటినుంచి తెలుసు అతను నాకు, ఎంత పెద్దమనిషి? ఇలాంటివి తలుచుకుంటే పిచ్చెక్కక ఏమౌతుంది నాకు" అంది సావిత్రి.

★★★

"మేడమ్ మనం ఈసారి పూర్తి కామెడీ చేద్దాం. మీరు అన్ని రసాలు అందరిచేత రాబట్టారు. ఒక్క హాస్యరసం తప్ప. ఈసారి పూర్తి కామెడి చేద్దాం" అన్నారు చుట్టూ ఉన్నవాళ్లు.

హాస్యం అంటే బాగా ఇష్టపడే సావిత్రి ఈసారి కూడా సులువుగా బుట్టలో పడిపోయింది.

1970లో 'వింత సంసారం' అనే సినిమా నిర్మాణం, దర్శకత్వం చేపట్టింది.

ఒక వైపు 'ప్రాప్తం' సినిమా నిర్మాణం జరుగుతూనే ఉంది.

ఒకసారి 'ప్రాప్తం' యూనిట్ అంతా రాజమండ్రి చేరుకుంది. రాజమండ్రి చేరుకున్నాక గాని చాముండి అన్న మాటలు గుర్తుకు రాలేదు. "సావిత్రి, మళ్లీ గోదావరితో పెట్టుకోకు" అని ఆనాడే చెప్పింది.

'అమ్మో! జాగ్రత్తగా ఉండాలి' అని అనుకుంది. ఆరోజు సావిత్రి, చంద్రకళ ఇంకా యూనిట్‌లో కొంతమంది ఒక పడవ ఎక్కి నది మధ్యలో ఉన్న దీవికి వెళ్లారు. సావిత్రి దర్శకత్వం చేస్తోంది. కొద్దిసేపటికి దూరంగా ఉన్న తీరం మీద చెట్లు గట్టిగా ఊగనారంభించాయి. ఇసుక, దుమ్ము నల్లగా కమ్ముకొస్తోంది. లంగరువేసి ఉన్న పడవ కొట్టుకుంటూంది. నదిలో ఉప్పెన మొదలయింది. నీరు ఉధృతంగా కొట్టుకొస్తోంది. ఆ చిన్నదీవిని ముంచెత్తేటట్లున్నది. సావిత్రి రాబోతున్న ఉపద్రవాన్ని గ్రహించింది.

'అయ్యో! నావల్ల అందరూ ఆపదలో పడ్డారే' అనుకుంది.

వెంటనే అందరిని పడవ ఎక్కించేసి పడవ నడిపేవాళ్లను బయలుదేరమంది. "చాలా ప్రమాదం ముందుకు వెళితే" అని అన్నారు వాళ్లు. పడవతో ముందుకు పోవడానికి భయపడ్డారు.

"ఈ దీవి మీదే ఉంటే నీళ్లలో కొట్టుకుపోవడం తథ్యం, కాస్త ధైర్యంచేసి పడవలోనే ముందుకు పోతుంటే అదృష్టం బాగుంటే బతుకుతాం" అంది సావిత్రి.

అది నిజమేనని పడవ నడిపేవాళ్లు పడవని బయలుదేరదీశారు. అందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పడవని గట్టిగా పట్టుకుని ఎలాగో ఒడ్డుకు చేరారు.

"ఎంత సాహసం చేశారు" అన్నాడు ఒడ్డున ఉన్న శివాజీ గణేశన్.

ఈ షాక్‌లోంచి తొందరగానే తేరుకుంది సావిత్రి. చాముండి భయపడినంత జరిగింది అనుకుంది.

ఫోన్‌చేసి చాముండికి చెప్పింది.

"ఈ గండం గట్టెక్కావుగాని ఈ సినిమాని నీ దగ్గర పెట్టుకోకు, డిస్ట్రిబ్యూటర్లకి అమ్మేసెయ్యి" అంది చాముండి మనసులో ఉన్న భయం పూర్తిగా వీడక.

కానీ అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. సినిమా మొదలుపెట్టినప్పుడు వచ్చిన డిస్ట్రిబ్యూటర్లు, ఆ మధ్య శివాజీ గణేషన్ సినిమాలు ఫ్లాప్ అవటం మూలాన ఇప్పుడు రావటం మానేశారు.

ఈ సినిమా పూర్తి చేయటానికి ఎన్నో అప్పులు చేసింది. ఒకానొక సమయంలో సినిమాను [కొ]ంటానికి డిస్ట్రిబ్యూటర్స్ వచ్చారు, కాని లాభం వస్తుందనే నమ్మకంతో వాళ్లకు అమ్మలేదు. [అ]ప్పుడు అమ్మినా బాగుండేది.

ఈ చిత్ర నిర్మాణానికి మిగిలిన ఆస్తులన్నీ తాకట్టు పెట్టింది. ఒక్క తాను ఉండే ఇల్లు తప్ప.

1971 ఏప్రియల్‌లో 'వింత సంసారం', 'ప్రాప్తం' విడుదలై ఘోరంగా పరాజయం పాలైనాయి.

తను దర్శకత్వం వహించిన సినిమాలు బాగా ఆడాయి, నిర్మాతలకు డబ్బుతెచ్చిపెట్టాయి. కాని తాను నిర్మించి, దర్శకత్వం వహించిన సినిమాలు ఘోరంగా పోయేవి.

మరో విషయం ఏమిటంటే, తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి సినిమాలు తీయడం, ఒక భాషలో విజయవంతమైన సినిమాను వేరొక భాషలో తీయడం ఒకప్పుడు ఎలా లాభించిందో, ఇప్పుడు అదే పద్ధతి సావిత్రిని నష్టపరిచింది.

ఇంత కూరుకుపోయి ఉన్నదని తెలిసి కూడా 1972లో పి.వి. నరసింహారావు ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత మద్రాసు వచ్చినప్పుడు సవేరా హోటల్లో సినీ

ప్రముఖులంతా విందు ఇచ్చినప్పుడు, దేశ రక్షణ నిధికి ఆయనకు వేసిన దండను పాటపాడితే, ఆ ఫంక్షన్‌లో ఎంతోమంది ఉద్దండులు ఉన్నా, సావిత్రి ఆ దండను 36,000లకు పాడింది. తీరా ఇంటికి వచ్చిచూస్తే ఆ డబ్బు సమకూర్చే స్థితి లేదు. ఇంట్లో పైసా డబ్బులేదు. విలువైన వస్తువులు లేవు.మాట నిలుపుకోవటానికి అప్పు చేయాల్సివచ్చింది.

★★★

సావిత్రి జి.జి. మీద పంతానికి పోయింది.

అతడేనా తిరిగేది, నేనూ తిరుగుతాను అని పోటీకి పోయి ఆరోగ్యం ఎంత సహకరించకపోయినా 1973లో సినీతారల పిక్‌నిక్‌కు వెళ్లింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో కరువుకు డబ్బులు సమీకరించే పనిమీద వెళ్లింది. 1973లో పిక్‌నిక్‌కు వెళ్లినపుడు అంతా కోలాహలంగా ఉంది. తనూ చిన్నపిల్ల అవుదామని ప్రయత్నించింది. కాలేకపోయింది. మ్యూజికల్ చైర్స్ ఆడుతుంటే అలుపు, పరిగెత్తుతుంటే అలుపు. ఆరోగ్యం ఎంత దెబ్బతిన్నదో అప్పుడుగాని తెలిసిరాలేదు.

తనకన్నా పెద్దదయిన అంజలీదేవి గుంజీళ్లు తీయగలిగిందికాని తనవల్ల ఏమీ కాలేదు. 'ఏంటీ ఇలా అయింది' అని హాస్పిటల్‌కు వెళ్లింది.

"తాగుడు పూర్తిగా మానేయాలి. మీకు ఇప్పటికే షుగర్ బాగా ఉంది" అన్నారు డాక్టర్.

కానీ ఇంటికి వచ్చిందంటే తాగటమే పని.

★★★

ఏ.వి.యం స్టూడియోలో ఒకసారి చాముండికి, సావిత్రి ఇంట్లో పని చేసే వాళ్లలో ఇద్దరు కనిపించారు. వాళ్లల్లో ఒకడు కారు డ్రైవర్, ఇంకొకడు ఆఫీస్ పనులు చూసేవాడు. "ఇదేమిటి వీళ్లు ఇక్కడకు వచ్చారు" అనుకుంది.

వాళ్లు ఏదో చాలా హడావుడిగా వున్నారు. పైగా ఏదో ముఖ్యమైన పనిమీద వున్నట్లు కనిపించారు. ఆఫీస్ రూమ్‌లోకి వెళ్లి అడిగింది. "వీళ్లు సావిత్రి ఇంట్లో పనివాళ్లు కదా ! ఏంటి ఇక్కడ ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లులాగా తిరుగుతున్నారు?"

"వాళ్లు ప్రొడ్యూసరు, డైరెక్టర్‌లే మరి, కార్ డ్రైవర్ ప్రొడ్యూస్ చేస్తున్నాడు. ఆ వచ్చిన ఇంకో అతను డైరెక్టర్, అడ్వాన్సులు ఇచ్చి వెళ్లారు స్టూడియోకి" అన్నారు స్టూడియోవాళ్లు.

ఆశ్చర్యపోయింది చాముండి. "ఇంట్లో పనోళ్లు, వీళ్లు సినిమా తీయటం ఏమిటి?" అని పైకే అనేసింది.



**1972లో పి.వి.నరసింహారావు సన్మాన సభ**







శివాజి గార్డెన్స్‌లో తారల పిక్‌నిక్

"పనోళ్లే, కాని మహానటి సావిత్రి ఇంట్లో పనోళ్లు కదా" అన్నాడొకడు.

చాముండికి అర్ధమయిపోయింది. సావిత్రి ఇంట్లో పరిస్థితి ఎంత దిగజారిపోయిందో. 'ఇంట్లో పనివాళ్లు దొంగతనాలు చేస్తున్నారు. అందినవన్నీ తీసుకెళ్తున్నారు. ఇలా వచ్చినవి కాకపోతే వీళ్లు సినిమా తీయటమేమిటి?' అనుకుంది.

నేరుగా సావిత్రి ఇంటికి వచ్చింది చాముండి.

"నీకు నీ చుట్టూ ఏమవుతోందో ఏమన్నా తెలుస్తుందా?" అని అడిగింది.

సావిత్రి చెప్పే పరిస్థితుల్లో లేదు. అప్పటికి రెండు రౌండ్లు అయిపోయాయి. కాని ఇంట్లో జరుగుతున్నది ఇది....

ఆస్తుల్లో చాలావాటిని హుండి పద్ధతి మీద మార్వాడీలకు తాకట్టు పెట్టి వుంది. అదీ చాలా ఎక్కువ వడ్డీకి. మూడు రూపాయలు, ఆపైనే. సావిత్రికి ఇంట్లో ఖర్చు ఎక్కువ.పదేళ్ల క్రితం లెక్కలేనంత డబ్బు వచ్చేది కాబట్టి ఆ ఖర్చులకి సర్దుబాటు అయింది. కాని ఇప్పుడు సంపాదన అంతంత మాత్రమే. ఇంటి ఖర్చులు మాత్రం అలానే వున్నాయి. పైగా నెలనెలా వడ్డీలు కట్టుకోవాలి. ఎప్పుడైనా వడ్డీలకుగాని, అసలకుకాని ఎవరైనా నెత్తి మీద కూర్చుంటే అప్పటికప్పుడు హుండీ ఉపయోగించో, లేక ఇంకెవరి దగ్గరనుంచైనా సరే డబ్బు తెప్పించేది.
డబ్బు తేవటానికి పనివాళ్లని పంపిస్తుంది సావిత్రి.

"అతను ఎంత ఇస్తే అంత తీసుకురా" అంటుంది.

ఒక పనివాడు వెళ్తాడు. మార్వాడి దగ్గర 50,000 రూ.తీసుకుంటాడు. 30,000 సావిత్రికి ఇస్తాడు. 20,000 రూ. వాడి జేబులోకి వెళ్తాయి. సావిత్రికి మాత్రం ఇవి తెలియదు. అసలు తను పట్టించుకునే స్థితిలోనే లేదు. ఆ తెచ్చి ఇచ్చిన డబ్బులో సగంపైగా ఇంటి ఖర్చులకు వుంచుకునేది. మిగిలిన కొంచెం మార్వాడీలకు పంపించేది.

ఇలా పనివాళ్లు సావిత్రిని మోసం చేస్తూ ఒక సినిమా నిర్మించదగ్గ డబ్బు దొంగిలించ గలిగారు.

చాముండి ఇవన్నీ వివరంగా చెప్పటానికి వచ్చింది. కాని వినే స్థితిలో లేదు. అప్పటికే మత్తులోకి జారిపోయింది.

కొన్ని ఆస్తులైనా ఒక్కసారిగా అమ్మేసి, తెచ్చిన అప్పులు తీర్చేద్దాం అనుకుంది చాముండి. అలాగైనా వడ్డీల గోల లేకుండా చూద్దామని.

కాని సావిత్రి ఆస్తులు తనకే అర్ధం కానంత గందరగోళంగా వున్నాయి.

★★★

ఒకరోజు ప్రొద్దున్నే ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌లు వచ్చారు.

"మీకు చాలా నోటీస్‌లు పంపించాము. మీరు దేనికీ సమాధానం ఇవ్వలేదు. ఒకటి రెండు ఇచ్చినా కూడా అవి సరియైనవి కావు. మీ ఇల్లు సోదా చెయ్యటానికి వచ్చాం. మాతో సహకరించాలి" అన్నారు.

"నాకింకా ఏమి ఆస్తులున్నాయని? అన్నీ పోతే" అంది సావిత్రి.

"ఇప్పటి ఆస్తులు కాదు. గత ఐదు సంవత్సరాల నుండి మీరు ఎలాంటి టాక్స్ కట్టలేదు."

"గత అయిదు సంవత్సరాలూ అయితే ఇప్పుడు దాకా ఏం చేశారు?"

"మేము నోటీసులు పంపిస్తూనే ఉన్నాం, మీరు ఖాతరు చేయలేదు" అన్నారు ఆఫీసర్లు.

"నేను ఏ నోటీసులు చూడలేదే?"

"మీ ఇంటి నుంచి వచ్చిన అక్నాలెడ్జ్ చేసిన ప్రూఫ్స్ మా దగ్గర ఉన్నాయి"అన్నారు.

ఇల్లు అంతా సోదా చేశారు.

చాలా డాక్యుమెంట్లు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాలు, కాస్తో కూస్తో ఉన్న బంగారం, వెండి పట్టుకుపోయారు.

మర్నాడు పొద్దున్నే ఆఫీసుకు రమ్మన్నారు.

ఆ తరువాత రోజు ఉదయం పది గంటలకు ఆఫీసుకు వెళితే తిరిగి సాయంత్రం ఐదుకు గాని సావిత్రిని వాళ్లు వదలలేదు.

"నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఇన్ని గంటలు నేను కూర్చోలేను, నేను రేపు మళ్లీ వస్తాను" అంది.

"లేదు, మీ పని ఈ రోజు అయిపోవాలి మాకు" అన్నారు.

ఇలా రోజు అంతా తనని ఇబ్బంది పెట్టడం చాలా బాధించింది సావిత్రిని.

డబ్బు ఉన్నప్పుడు సావిత్రి టాక్స్‌లు కట్టకుండా ఉండటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. ఆతర్వాత డబ్బులేక కట్టలేకపోయింది. అసలు 8లక్షలు అయితే, దానికి వడ్డీలు కలిపి 30 లక్షలు టాక్స్ చూపించారు ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటువారు.

తనకి తలా తోక అర్థం కాలేదు ఆ ఇన్‌కంటాక్స్ లెక్కలు. "అత్తయ్యా!" అంటూ శాంతకుమారి దగ్గరకు వెళ్లింది. పుల్లయ్యకి చెప్పింది విషయమంతా. "నాకేమీ అర్థం కావటం లేదు. మామయ్యగారు అన్నీ మొదటి నుంచి మీరే చూసుకోండి" అంది.

"నేనున్నాగా అమ్మా, నేను చూస్తాలే" అన్నారు పుల్లయ్య.

'వింత సంసారం', 'ప్రాప్తం' సినిమాలు నష్టం తీసుకువచ్చాయని, ఆదాయపుశాఖవారు తనిఖీకి వచ్చారని తెలిసి, స్నేహితులు పలకరించటానికి వచ్చారు.

"మనకంతే ప్రాప్తం ఏం చేస్తాం?" అంటూ, మేకపోతు గాంభీర్యం ప్రదర్శించింది.

"ఆస్తులన్నీ పోయి ఈ ఒక్క ఇల్లూ, ఆ ఒక్క కారేనా ఉంది?" అని అడిగారు.

"అన్ని ఇళ్లు ఉన్నప్పుడు కూడా నేనున్నది ఒక్క ఇంట్లోనే, అన్ని కార్లు ఉన్నప్పుడు కూడా తిరిగింది ఒక్క కారులోనే కదా, ఇప్పుడూ అంతే, ఐ యామ్ ఆల్ రైట్. ఈ డబ్బు, మేడలూ–మిద్దెలూ, కార్లు నికరమా? మనతో వచ్చేవేవో వాటిని సంపాదించుకుంటే చాలు"అని తన నైజం ఏమిటో చెప్పకనే చెప్పింది.

★★★

హాస్పిటల్ అంతా హడావుడిగా ఉంది.

సావిత్రి ఒక నాలుగురోజుల నుంచి విపరీతమైన దగ్గుతో బాధపడిపోతూ ఉంది. నాలుగోరోజు దగ్గటానికి కూడా ఓపిక లేక స్పృహ తప్పింది. హాస్పిటల్‌కు తీసుకువచ్చారు.

"డాక్టర్ గారు త్వరగా రండి" అభ్యర్థించారు సావిత్రి చుట్టాలు.

"ఆగండీ మళ్లీ అదేగా, తప్పతాగి పడిపోవటమేగా. ఈ నెలలో సరిగ్గా ఇది ఆరోసారి తీసుకురావటం. అంతకంటే అర్జంట్ కేసులున్నాయి ఆగండి" అన్నారు డాక్టర్లు.

"అయ్యో! అంతమాట అనకండి. ఈసారి నాలుగు రోజులు నుంచి విపరీతమైన దగ్గు" అన్నారు చుట్టాలు.

డాక్టర్ వచ్చి నాడి పట్టుకుని చూసి... రూంలో జాయిన్ చేసుకున్నారు. పరీక్షలు చేశారు. కాలేయం బాగా దెబ్బతిందని తెలిసింది.

హాస్పిటల్‌లోనే నిశ్చయించుకుంది ఇక విజయకు పెళ్లి చేయాలని.

ఇక ఆలస్యం చేయకుండా 1973 డిసెంబర్ 5న తన మేనల్లుడు గోవిందరావుకి ఇచ్చి పెళ్లి చేసింది.

★★★

సావిత్రి ఉదయం 8 గంటలకు లేచింది. బాత్రూంకి వెళ్లివచ్చి, రాత్రి వేసుకున్న నైటీతోనే లాన్‌లో కూర్చొని, బ్లాక్ టీ తాగుతూ పేపర్లు చూసింది. ఆ తర్వాత స్నానానికి వెళ్లింది, ఎప్పటిలానే స్నానానికి ముందు వొళ్లంతా పసుపు రాసుకుంది. స్నానం చేసి వచ్చి

తయారవుతోంది, ఆ తర్వాత గంట తనని చూడ్డానికి వచ్చినవాళ్లతో గడుపుతుంది. ఇప్పుడు తను చేయబోయే పని అదే. ఇంతలోకి, బయట నుంచి అరుపులు వినిపిస్తున్నాయి. సుభద్రమ్మ ఎవరినో అరుస్తోంది. "సావిత్రి లేదన్నానుగదా, ఇక పొండి." సావిత్రి ఆ అరుపులు విని గదిలోంచి బయటకు వచ్చింది. సుభద్రమ్మ గుమ్మం తలుపులు వేసేస్తుంది. బయట తనని చూడటానికి వచ్చినవాళ్లని గమనించి, "ఏంటమ్మా బయటవాళ్లనుంచి తలుపులు వేసేస్తున్నావు?" అడిగింది సావిత్రి.

"నువ్వు లేవని చెప్పానులే, వెళ్లి నీ పని చూసుకో పో" అంది సుభద్రమ్మ.

"అదేంటమ్మా వాళ్లు ఎక్కడెక్కడినుంచో వస్తారు చూడటానికి" అంటూ బయటకు వెళ్లింది సావిత్రి. అలా బయటకు వెళ్లిందో లేదో 'అదిగో సావిత్రి... అదిగో సావిత్రి...' అంటూ ఆనందపు కేరింతలు చిచ్చుబుడ్డి వెలుగులా పైకెగిశాయి.బయటనుంచి వినవస్తున్న సావిత్రి మాటలు, నవ్వులు, వచ్చినవాళ్ల మాటలు, నవ్వులకి, లోపల సుభద్రమ్మ కుతకుతలాడుతోంది. సావిత్రి దాదాపు ఓ గంట దాకా వాళ్లతో గడిపి లోపలకు వచ్చింది.

"నువ్వు లేవని చెప్పాను కదా, నా పరువు తీయటానికి కాకపోతే నువ్వు బయటకు ఎందుకు వెళ్లినట్టు?" కోపంగా అరిచింది సుభద్రమ్మ. అభిమానుల ఆనందంలో మునిగిన సావిత్రి అప్పటికి కాని తెలుసుకోలేకపోయింది సుభద్రమ్మకు కోపం వచ్చిందని.సోఫాలో కూర్చొన్న సుభద్రమ్మ వెనక్కి వెళ్లి ఆమెను తన రెండు చేతులతో కౌగిలించుకుని తన మొహం సుభద్రమ్మ భుజం మీద పెట్టి, ఆమెకు ఒక ముద్దు పెట్టి,"ఊ.......సారీ అమ్మా ..." అంటూ లాలించింది. కరిగిపోయింది సుభద్రమ్మ.

"నువ్వూ మనిషివే కదే, ఏం చూస్తారే పొద్దాకల వీళ్లు?"

"నిజమేనమ్మా నేనూ మనిషినే,కాని ఈ మనిషిని చూస్తే వాళ్లు ఎంత సంతోషిస్తారో తెలుసా? ఎక్కడెక్కడనుంచో కష్టపడి వస్తారు పాపం, మన దగ్గర నుంచి ఏమీ ఆశించి రారు, మనం కనీసం టీ, కాఫీలు అయినా ఇవ్వం, అలా నా దగ్గర ఏమీ ఆశించకుండా కేవలం నన్ను చూసే అంత సంబరపడిపోతారు, అలాంటప్పుడు ఒక్కసారి కనిపిస్తే మనదేమిపోతుందమ్మా" అంది సావిత్రి. ఈ మాటలు అనగానే వెనుకనుంచి చప్పట్లు వినిపించాయి. ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. చాముండి చిన్నారి విజయ చేత చప్పట్లు కొట్టిస్తోంది. "కరెక్టుగా చెప్పావు సావిత్రి, ఆ రెండో మాట ఇంకా కరెక్టు....నీ దగ్గర నుంచి ఏమీ ఆశించకుండా కేవలం నిన్ను చూసి సంతోషించేది వీళ్లే!" అంది.

"ఇదొకటి మధ్యలో, పిల్లికి ఎలక సాక్షం లాగా.." విసుక్కుంది సుభద్రమ్మ.

ఆ తర్వాత గంట దర్శక నిర్మాతలు తదితర సినిమా వారితో మాట్లాడింది. తర్వాత షూటింగ్ ఎక్కడో ఆ స్టూడియోకి బయలు దేరింది. ఒక కారులో తను, ఇంకో కారులో తన మేనేజరు, ఒక ఆడమనిషి బయలుదేరారు. సావిత్రి తనతోపాటు చిరుతిండ్లు కూడా పెట్టుకుంది ఎప్పుడు ఖాళీ దొరికితే అప్పుడు తింటానికి. స్టూడియోకి కూడా తనను చూడటానికి అభిమానులు వస్తారు. వాళ్లందరికీ ఆటోగ్రాఫ్‌లు ఇచ్చింది, "సావి3" అని సంతకం చేసింది, తమిళంలో ఆటోగ్రాఫ్ ఇవ్వాల్సివస్తే, 'సావితిరిడి' అని రాస్తుంది. 'సావితిరిడి' అంటే ఒక గమ్మత్తయిన అర్థం వుంది తమిళంలో. సెట్స్ మీద అందరితో ఆప్యాయంగా ఉంది. స్వయంపాకం చేసుకునే జానకి దగ్గరకు పోయి "నాకూ మీ అన్నం పెట్టండి" అని మారాం చేసింది. షాట్‌గ్యాప్‌లో శివాజీ గణేశన్, రేలంగి, సూర్యకాంతం, హిందీ నటులు ఇలా ఏ ఒక్కరిని వదలకుండా అందరినీ అనుకరించింది.

తిరిగి ఇంటికి వచ్చేటప్పుడు కారు డ్రైవర్‌ని వెనుక కూర్చోబెట్టి కోడంబాకం నుంచి తన ఇంటివరకు రెడ్‌లైట్స్ దగ్గర కూడా ఆపకుండా స్పీడ్‌గా డ్రైవ్‌చేస్తూ వచ్చింది. సావిత్రి కారుకి ఒక ప్రత్యేకమైన హారన్ ఉంటుంది. అది వినిపించగానే రోడ్ మీద జనం 'సావిత్రి కారు' అనుకుని పక్కకు జరుగుతారు.

సాయంత్రం 'శ్రీనివాస గాంధీనిలయం' వారు సావిత్రిని తమ సంస్థకి గౌరవ అధ్యక్షురాలిగా ఎన్నుకున్న సందర్భంలో సన్మానం వుంది. ఇలా షూటింగ్ అయిన తరువాత ఏదో ఒక సన్మాన సభకాని, తనను అతిథిగా పిలిచిన కార్యక్రమంగాని, లేదా ఒక సినిమా 100 రోజుల పండుగకు అని, ఆంధ్రరాష్ట్ర పర్యటన గాని, ఇవేవీ లేకపోతే, ఏదైనా సినిమాకు వెళ్లటంగాని లేదా స్నేహితులతో ఏ హోటల్‌లోనో, ఎవరో ఒకరి ఇంట్లోనో కలుసుకోవటం గాని జరుగుతూంటుంది. ఇక రోజంతా ఖాళీ ఉండదు. రాత్రికి ఇంటికి చేరుకుని పడుకునేముందు మందు తీసుకుని నిద్రపోయింది.

ఇది 1964లో సావిత్రి జీవితంలో ఒకరోజు. కాని 1974 వచ్చేసరికి సావిత్రి మందుకు బానిస అయింది. ఏ.యన్.ఆర్. చెప్పిన సంభాషణలనే సరిదిద్దగలిగిన సావిత్రి ఇప్పుడు నాలుక మొద్దుబారి తన డైలాగ్ మాడ్యులేషన్ పూర్తిగా చెడగొట్టుకుని, ఎవ్వరికీ అవసరం లేనిదిగా అయిపోయింది.

1975లో సావిత్రికి శుభవార్త ఏంటంటే, మనవడు పుట్టాడు. విజయ పండంటి మగబిడ్డను కన్నది.

★★★

1977లో అన్నానగర్‌లో అద్దె ఇంటికి వచ్చేసింది. అద్దె అయిదు వందల రూపాయలు. రెండు గదులు, బయట పందిరి. పందిరి సగం సామాన్లు, షీల్డులుతో నిండిపోయింది. తనకు మిగిలిన ఒక్క ఫియట్ కారుకి పైకప్పు లేక ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ వుండేది. అయినా అది వున్నది పేరుకి మాత్రమే, కదిలేది కాదు, మెదిలేది కాదు. దాన్ని నమ్ముకోకుండా డబ్బు వుంటే టాక్సీలోనో, లేకపోతే బస్సులోనో వెళ్లేది. ఉన్న ఆస్తులు పిల్లల పేర ఏనాడో రాసేసింది. తన పేర వున్న కొద్ది ఆస్తులు ఆదాయపుశాఖ వారు సీజ్ చేశారు.

అదేంటోగాని గత మూడునాలుగేండ్ల నుంచి అందరూ సావిత్రిని 'సావిత్రమ్మ' అని పిలవటం మొదలుపెట్టారు. తనకంటే సీనియర్లయిన భానుమతిని భానుమతమ్మ అనటం లేదు, అంజలి దేవిని అంజలి దేవమ్మ అనటం లేదు. ఇలా 'సావిత్రమ్మ' అనటానికి, ఒక నటిగా, మానవత్వం వున్న మనిషిగా సావిత్రికి ఇచ్చే గౌరవం మొదటి కారణమయితే ఇప్పటి సావిత్రి రూపు కూడా గట్టి కారణం. బ్లడ్‌షుగర్ లెవెల్ పెరిగేకొద్దీ ఒళ్లు తగ్గటం మొదలైంది. ఎప్పుడూ లేనంతగా సన్నపడింది. మొహం కళావిహీనంగా అయింది. నలభైఏళ్లకే అరవైఏళ్లు దాటినదానిలా వుంది.

★★★

సావిత్రి అన్నానగర్ వచ్చిందని తెలియగానే చాముండి వచ్చేసింది. ఎవరెవరితో ఎందుకు, ఎట్లా గొడవపడి ఇల్లు విడిచివచ్చింది చెప్పింది సావిత్రి.

"నీకెప్పుడూ తొందరే సావిత్రి, నువ్వు పుట్టడమే ఆలస్యం, ఇక పుట్టిందగ్గర నుంచి అన్నీ తొందరే, వెనకా ముందు ఆలోచించకుండా చేస్తావు పనులు. అన్ని సౌఖ్యాలని వదిలేసి ఇక్కడ ఎలా వుందామని వచ్చావు?"

"అక్కడ అన్నీ వున్నాయని ఎవరేమన్నా పడివుండమంటావా? నా ఇంట్లో వాళ్ల పెత్తనం ఏమిటి?"

"అందుకని నీ సొంత ఇంటిని, డబ్బుని వదిలేసొస్తావా?"

"అక్కడ ఇంక డబ్బులు ఎక్కడున్నాయి?"

"పోని నీకు చేసిపెట్టడానికి పనివాళ్లన్నా వుండేవారు కదా?"

"ఈ ఇంటికి, నాకు చెయ్యటానికి నువ్వు ఒక్కదానివి చాలవా? ఏం నీక్కూడా బరువయ్యానా?"

చాముండి ఏమిమాట్లాడలేదు. కన్నీటితో సహా ఒక ఉత్తరం సావిత్రి చేతిలో పెట్టింది.

"చాముండి వెళ్తున్నావా? మొదటిసారి వెళ్లావు, మొదటి తప్పు చేశాను. రెండోసారి వెళ్లావు, స్విమ్మింగ్ పూల్ రూపంలో రెండో తప్పు చేశాను. అనుభవిస్తున్నాను. మళ్లీ వెళ్తావా? ఇంక ఇప్పుడేమి అవుతుందో? ఇంకేముందిలే చాము అవ్వటానికి అంతా అయిపోయినట్లు అనిపిస్తుంది. ఆ రోజులు ఇప్పుడు కలలా అనిపిస్తున్నాయి."

"ఆ కల మళ్లీ నిజమవుతుంది సావిత్రి. ఇప్పుడు ఏమయిందని? కొన్ని ఆస్తులు పోయాయి. కొంతమంది మనుషులు పోయారు, అంతేగా? నువ్వు కాస్త తాగుడు మానేయి. నీ ఆరోగ్యం బాగుంటుంది. అన్నీ వుండి ఆరోగ్యం లేకపోతే ఎలా సావిత్రి?"

"చెప్పటం తేలికే చాము, ఈ గుండెలో మంట ఎలాంటిదో నీక్కూడా చెప్పాలా? నీకు తెలియదా? నాకు డబ్బు పోయిందని బాధ కాదు. నేను నమ్మినందుకు తడిగుడ్డతో నా గొంతు కోశారు ప్రతి ఒక్కళ్లు. వాళ్లు వెళ్లినందుకూ నాకు బాధ లేదు. కాని వాళ్లు చేసిన పనిమాత్రం నాకు మింగుడు పడటం లేదు. అందుకే ఈ మందుని మింగుతున్నాను. వాళ్ల అందరికంటే నమ్మదగినదిదే. ఈ మందే కనుక తాగకపోతే నేను పిచ్చిదాన్నయి పోతాను. అప్పుడు చుట్టూవున్నవాళ్లు 'పిచ్చిది' అంటూ రాళ్లతో కొడతారు. అలా జరగకూడదనే నేను తాగుతున్నాను."

"నిన్నెవరు కొట్టకుండా నేను చూస్తాను, నువ్వు తాగడం ఆపు."

సన్నగా నవ్వింది సావిత్రి, "కొడతారంటే నిజంగా కొడతారని కాదు చాముండి, ఆరోగ్యం పాడుచేసుకోవాలని నాకూ లేదు. నేను మానేద్దాం అని ప్రయత్నించినా నాలో పేరుకున్న సంఘటనలు గుర్తొచ్చి మానేయలేక పోతున్నాను. నేనేం చేయను?" దీనంగా అడిగింది సావిత్రి.

తల పట్టుకొని కూర్చుండిపోయింది చాముండి.చాముండికి కూడా ఇక సావిత్రిని ఓదార్చే మాటలు కరువయ్యాయి."ఈసారి సిలోన్ నుంచి వచ్చిన తర్వాత ఈ ఇంట్లోనే వుండిపోతాను."ఇక తను చేయాల్సింది,చేయగలిగింది ఆ పనే అన్నట్లు చెప్పింది.

"ఆ పని చెయ్యి చాము" అంది సావిత్రి ఎంతో బాధ తన గుండెలమీద నుంచి దించబడినట్లు.

★★★

ఇక తాను జీవంపోసిన సినిమాలతోనే ఇప్పుడు తన జీవనరథం సాఫీగా సాగేది.

చిన్నపాత్రలైనా, పెద్దపాత్రలైనా తను ఖాళీగా లేకుండా, నటనను మానకుండా తన అవసరాలకు ఒకరిమీద ఆధారపడకుండా ఉండేందుకు నటిస్తూనే ఉంది.



మలయాళం సినిమా 'చలి' 1973



'తాయిగే తక్కమగ' కన్నడ సినిమా, 1978





'ప్రేమ - పగ' 1978

ఇప్పుడు తనే తనకు సెక్రటరీ. బాగా తెలిసినవాళ్లు అయితే తన సంగతి తెలిసి వేషాలు ఇస్తున్నారు. అలా చేతిలో సంపాదన ఉండేటట్లు చూసుకుంటోంది.

కానీ తాను అలవాటు పడ్డ ఖర్చులకు మాత్రం డబ్బు సరిపోయేది కాదు, ఇబ్బంది పడేది. 'వేలకు వేలు లెక్కలేకుండా దానాలు చేసిన తానా వెయ్యి రూపాయల కోసం చేయి చాచాల్సి వస్తోంది' అని ఎంతో కలత చెందేది. తన అవస్థ చూసి అడక్కుండానే ఇచ్చినవాళ్లు ఉన్నారు. అడగాల్సి వచ్చినపుడు అభిమానం అడ్డుపడి గొంతు పూడుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిల్లో కూడా సావిత్రి తనముందు చేయిచాపిన వాళ్లకి సహాయపడటం మానలేదు. సావిత్రి  పరిస్థితి తెలియక ఒకప్పటి తన కారు డ్రైవరు కూతురు వచ్చింది. వాళ్ల నాన్న పేరు చెప్పగానే గుర్తుపట్టింది సావిత్రి. పేదరికంలో వున్న ఆ పిల్ల సావిత్రి నుంచి డబ్బు ఆశిస్తుంది. సావిత్రి దగ్గర డబ్బు లేదు. ఆ పిల్ల అవసరం ఎలా తీర్చాలో తెలియక కాసేపు మధనపడింది. ఆ వెంటనే బీరువాలోంచి ఒక పట్టుచీర తీసి, ఇంటి ముందు వుండే ఒక తెలిసిన ఆటోవాడిని పిలిచి ఆ పట్టుచీర ఇచ్చి పంపించింది. అతను కాస్సేపటికి ఐదువేల రూపాయలు తీసుకొచ్చి  సావిత్రి చేతిలో పెట్టాడు. ఆ డబ్బంతా వెంటనే ఆ పిల్లకి ఇచ్చి, "ఇది తీసుకోమ్మా, నీ పెళ్లికి పనికొస్తాయి" అంటూ బొట్టు పెట్టి పంపించింది. ఇంతకి సావిత్రి చేసిన పనేంటంటే, తన పాతిక వేలు ఖరీదు, బంగారు జరీ వున్న పట్టుచీరని సెకెండ్‌హ్యాండ్ మార్కెట్‌లో అమ్ముకురమ్మని పంపించింది. ఆ చీరకు ఒక పదివేలు సునాయాసంగా వస్తాయి. మరి ఐదువేలే వచ్చాయి. సావిత్రికి డబ్బు విషయాల్లో ఈ షరా 'మామూలు' అయిపోయింది. ప్రక్కనేవుండి ఇదంతా గమనించిన ఓ వ్యక్తి "ఇలాంటప్పుడు కూడా ఇది అవసరమా? "అని అడిగాడు.

దానికి సావిత్రి "అదేంటి తమ్ముడూ! మనం మనుషలం, మనిషికి మనిషి  సాయపడకపోతే పాడు జీవితం ఎందుకు?ఎంతకాలం బతుకుతాం? మనం వున్నా పోయినా మనం చేసిన మంచి మిగిలిపోతుంది. అంతకుముందు ఫ్రీగా దానం చేసేసేదాన్ని, ఎవరైనా చీర చూసి బాగుందంటే, తీసుకోమనేదాన్ని. దానికంటే ఇది నయం కదూ" అంది. కాస్సేపు ఏమి మాట్లాడలేదు,  ఆలోచిస్తున్నట్లుగా కూర్చుండిపోయింది. ఇంకొంచం సేపటికి తనలో తాను మాట్లాడుకున్నట్లుగా, "ఎవరి అవసరాలైనా నేను తీర్చేదాన్ని గానీ, నా అవసరాలకు ఎవరూ ఉపయోగపడలేదు. దానికీ  ప్రాప్తం ఉండాలిగా" అనుకుంది.

ఒకసారి నటుడుగుమ్మడికి సుస్తిగా ఉందని తెలిస్తే ఆయనింటికి వెళ్లింది.

"రామ్మా కూర్చో. కులాసాయేనా" అన్నారాయన.

"బాగున్నాను అన్నయ్యా. మీరెలా ఉన్నారు. బాగోలేదంటగా?"

"ఏదో కాస్త నీరసం, జ్వరం, తీరికలేని షెడ్యూల్స్ కదమ్మా" అన్నారు.

కాసేపు మాట్లాడిన తర్వాత "సరే మీరు పడుకోండి నేను వెళ్లొస్తాను" అంది.

వెళ్తూ వెళ్తూ ఆయన దిండుకింద డబ్బు పెట్టి వచ్చేసింది.

ఆ తర్వాత ఆయన లేచి చూసుకొనేసరికి దిండు కింద రెండు వేల రూపాయలున్నాయి.

ఆయన వెంటనే ఫోన్ చేశారు.

"ఏంటమ్మా ఇది, నువ్వు రెండువేలు ఇవ్వకపోతే నాకు గడవదా... లేక నేనేమన్నా ఇవ్వమన్నానా?"

"లేదు అన్నయ్యా, అప్పుడు అవసరమై అడిగి తీసుకున్నాను. ఇప్పుడొక ప్రొడ్యూసర్ ఇస్తే తీసుకొచ్చి ఇచ్చాను. ఏంటో అన్నయ్యా, నాకు ఎవరి రుణం ఉంచుకో బుద్ధి కాదు, మరోలా అనుకోవద్దు" అంది.

"ఇలా రుణాలన్నీ తీర్చేకదమ్మా ఇలా అయ్యావు" అన్నారు గుమ్మడి.

నవ్వుకుంది సావిత్రి.

'నిజమే మరి ఏనాటి రుణాలో ఇవి' అనుకున్నది.

సావిత్రి కష్టాల్లో వుందని ప్రత్యక్షంగా చూడకపోయినా ఇతరత్రా విని, ఒక వీరాభిమాని రోజుకి ఒక వంద రూపాయలు క్రమం తప్పకుండా పంపేవాడు. సావిత్రికి అవి అక్కరకు వచ్చేవి. ఒకరోజు ఆ డబ్బు రాలేదు. సావిత్రి వొళ్లంతా కళ్లు చేసుకుని ఎదురుచూస్తోంది. సావిత్రి ఎదురుచూస్తోంది డబ్బు కోసం కాదు, ఇన్నాళ్లు క్రమం తప్పకుండా డబ్బు పంపించిన మనిషి, ఈ రోజు డబ్బు పంపలేకపోయాడు, అతనికి జరగరానిది ఏమైనా జరిగిందాని ఆందోళన పడుతూ ఏదైనా కబురు వస్తుందాని ఎదురుచూస్తోంది. సూర్యుడు నడినెత్తి మీదకువచ్చే దాకా చూసి చూసి లోపలకెళ్లింది. సాయంత్రం ఆ వీరాభిమాని సావిత్రి ఇంటికి వచ్చి తనని తాను పరిచయం చేసుకున్నాడు. తనకు డబ్బు పంపించే ఆసామి ఇతనేనని తెలుసుకుని చాలా ఆనందపడింది. "కూర్చో తమ్ముడూ... భోంచేశావా?" అని అడిగింది.

"మీతో కష్టసుఖాలు చెప్పుకుందామని వచ్చానక్కా"అని అన్నాడతడు.

"నాతోనా? నీకెంతసేపు ఓపిక వుంటే అంత సేపు చెప్పు, నేను రెడీ. కాస్త రైస్ పెట్టివస్తాను, పచ్చళ్లున్నాయి, తినేద్దాం. చికెన్ పచ్చడి, రొయ్యల పచ్చడి నువ్వెప్పుడైనా

తిన్నావా?" అని అడిగింది. తినలేదన్నట్లు మొహమాటపడుతూ తలవూపేడు. అన్నం వుడికింతర్వాత, అతడికి వెనకా ముందు చూసుకోకుండా వడ్డించేసింది. ఈ రోజునే కాదు, ఏరోజైనా భోజనం సమయంకి సావిత్రి ఇంట్లో ఎంతమందున్నా భోజనం చేయవలసిందే, తెలిసినవాళ్లకి తెలియనివాళ్లకి ఒకేలా వడ్డించడం సావిత్రికే చెల్లు. భోజనం అయిన తర్వాత అసలు సంగతి చెప్పుకొచ్చాడు. తన పాన్‌షాపు దివాళా తీసిందట. దానిమీద వచ్చిన డబ్బునే రోజూ సావిత్రికి పంపేవాడట. పైరెండు కారణాలవల్ల ఇంట్లో వాళ్లు అతన్ని తిట్టి కొట్టి "ఇప్పటి దాకా దేవతలాగా పూజించావు కదా, వెళ్లి ఆ దేవతనే అడుక్కో ఆదుకుంటుంది" అని అన్నారట. ఈ మాటలు విని సావిత్రి బాధతో, కోపంతో వూగిపోయింది.

"మళ్లీ వ్యాపారం మొదలుపెట్టడానికి నీకెంత కావాలి తమ్ముడు" అని అడిగింది.

"అయిదారువేలు సరిపోతాయి కాని నేనెక్కడనుంచి తేగలనంత" అంటూ బాధపడ్డాడు.

"నేనిస్తాను తమ్ముడూ నీకు! ఎంచక్కా వ్యాపారం చేసుకో, ఇకనుంచి నువ్వు నాకు డబ్బులు కూడా పంపనవసరం లేదు. నేను ఇంతవరకు ఎవరికీ ఋణపడలేదు, నీ ఋణం ఎలా తీర్చుకోవాలా అని ఆలోచిస్తూందేదాన్ని, భగవంతుడు నాకో అవకాశం ఇచ్చాడు. నువ్వు ఇక రేపు రా" అంది.

మరుసటి రోజు, ఒక గోనెసంచి నిండుగా తన వెండి షీల్డులన్నీ పెట్టి, తన కారులో మార్వాడీవాడి దగ్గరకు వెళ్లింది. సావిత్రిని చూడగానే మార్వాడివాడు వచ్చాడు, ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఆ గోనెసంచి మోసుకెళ్లిపోయాడు. సావిత్రికి ఎక్కువసేపు ఎదురుచూడటం అంటే చిరాకు. ఆ సంగతి మార్వాడీకి తెలుసు. తూకం వేసే సమయం కూడా తీసుకోకుండా ఒక పదివేలు తీసుకొచ్చి ఇచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత ఆ అభిమానికి, ఋణం తీర్చుకుంటున్నాన్న తృప్తితో అతనికి సహాయపడుతున్నాన్న తృప్తితో ఆ డబ్బంతా ఇచ్చింది.

మనిషిని బ్రతికించేదీ మనసుని బ్రతికించేదీ 'తృప్తి' అని సావిత్రి తృప్తి పడేది.

1978లో ఒకరోజు వెంకట్రామయ్యచౌదరి చనిపోయాడని వార్త వచ్చింది సావిత్రికి. కాని సావిత్రి వెళ్లేసరికే దహనక్రియలు అయిపోయాయి. ఇంకొంచం ముందు రాలేనందుకు చాలా బాధ పడింది. కర్మకాండలు తన డబ్బుతో చేయించి వెంకట్రామయ్యచౌదరి ఋణం కూడా సంపూర్ణంగా తీర్చుకుంది సావిత్రి. అప్పటికే పక్షవాతంతో బాధపడుతున్న దుర్గాంబను తన ఇంటికి తీసుకొచ్చింది.

1978లో ఒక చిత్రం చేస్తుండగా లంచ్ బ్రేక్ వచ్చింది. అందరికీ భోజనం అందిందా లేదా అని చూసుకునే బాధ్యత నిర్మాతది. అతని తర్వాత సెట్ మీద ఉండే ప్రొడక్షన్ మేనేజర్‌ది.

ఆరోజు లంచ్ బ్రేక్‌లో భోజనం క్యారేజీలు వచ్చాయి. అంతా కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ హాయిగా తింటున్నారు. సావిత్రి భోజనం గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఒక పక్క కూర్చుండి పోయింది.

ఒక్కసారి తన పాతరోజులు అప్రయత్నంగా గుర్తుకొచ్చాయి. తనకు ఒక ప్రత్యేకమైన గదిలో భోజనం ఉంచేవారు. ఆ గదిలోకి తన భోజనం అయ్యేదాకా ఇంకొక లేడీ ఆర్టిస్టునైనా రానిచ్చేవాళ్లు కాదు. తనే అందరినీ రానిచ్చేది. ఆప్యాయంగా అందరినీ పిలిచి తినిపించేది. 'అలాంటిది నాకేంటి ఈరోజు...' అనుకుంటుండగా....గుమ్మడి చూశారు... ఆయనకు అర్థమైంది పరిస్థితి... "రామ్మా భోంచేద్దాం" అని పిలిచారు.

"లేదు అన్నయ్యా నాకు ఆకలి లేదు" అంది.

"ఆకలి ఉన్నంత వరకే తిందువురా... అసలు నువ్వు ఇక్కడ నుంచోవటమే నాకు బాగోలేదు... రా తల్లీ" అని తీసుకెళ్లారు.

ఆయన తినేగదికి తీసుకెళ్లి తనతోపాటు భోజనం చేయించారు.

చిక్కిశల్యమైన శరీరాన్ని, కళాకాంతుల్లేని సావిత్రిని చూసి...ఇంద్రభోగాలతో తులతూగిన ఆ సావిత్రేనా ఇప్పుడు నా ముందున్న సావిత్రి అని అనుమానం వేసింది గుమ్మడికి. ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి.

"ఈ తరానికి ఏం తెలుసు ఈ వజ్రం విలువ" అనుకున్నారాయన.

కానీ ఈ తరంలో ఒక్కరు గుర్తించారు ఈ వజ్రాన్ని. ఆయనే దాసరి నారాయణరావు. ఆయన తీసిన ప్రతి సినిమాలో సావిత్రికి పాత్ర ఇచ్చారు. 'దేవదాసు మళ్లీ పుట్టాడు' అనే సినిమా ఐతే కేవలం సావిత్రి కోసమే తీశారు. ఆ తరువాత 'గోరింటాకు' అనే సినిమాలో కూడా ముఖ్యపాత్ర ఇచ్చారు.

"నా తమ్ముడు ఉన్నంతవరకు నాకేమి దిగులు లేదు" అనేది సావిత్రి.

ఇలాంటి అన్నయ్యలు, తమ్ముళ్లు, ఆదుకుంటున్న ఈ గడ్డు సమయంలో.......

"ఇది 'ఆరదగాయ'అని కన్నడ సినిమా, తెలుగులో కూడా తీస్తున్నాం, మైసూరు ప్రీమియర్ స్టూడియోలో షూటింగ్. మీరు రేపు కారులో బయలుదేరండి" అన్నారు ఆ సినిమా నిర్మాత.

మైసూరు అనగానే సావిత్రికి తన, విలువకట్టడం కష్టమైన ఇనప్పెట్టె గుర్తుకొచ్చింది. ఆ పెట్టెని నిండుగా తన నగలతో నింపి ఒక తోటి నటుని భార్యకు ఇచ్చింది జాగ్రత్త చేయమని.

ఎన్నిసార్లు ఆమెకు కబురు పంపించినా సరైన సమాధానం లేదు. ఇప్పుడు ఆమె అక్కడే ఉన్నట్లు తెలిసింది. అవకాశం వచ్చింది కనుక ఈసారి తనే స్వయంగా కలవాలని నిశ్చయించుకుంది. మైసూర్ ప్రయాణమైంది. మైసూర్ ప్రీమియర్ స్టూడియోలో షాట్‌గ్యాప్‌లో లక్ష్మి కనిపించింది.

"ఏమే లక్ష్మీ , నువ్వు నంబర్‌వన్ అటగా ఇప్పుడు, టాప్ హీరోయిన్‌వటగా, బాగా నటిస్తున్నావా" అని అడిగింది సావిత్రి.

"బాగా నటించగలిగేది మీరు. మీలా నటించటం మాకెలా సాధ్యం. మీలా ఒళ్లు పెంచగలగటం అయితే సాధ్యం" అంది లక్ష్మి.

"ఓసి గడుగ్గాయి నన్ను తిట్టావా? పొగిడావా?" అడిగింది సావిత్రి.

"అయ్యయ్యో ఎంతమాట? క్షమించడమ్మా. ఏదో వాగేశాను. అయినా మీరు ఎంత లావుగా ఉన్నా ఎంతో ముద్దుగా ఉండేవారు. చూడండి ఎలా పాడైపోయారో. ఏడుపొస్తోంది నాకు మిమ్మల్ని చూస్తే. మీరెందుకు సినిమాలు ప్రొడ్యూస్ చేసి మోసపోయారు. వాళ్లందరు మీ దగ్గర డబ్బు గుంజేశారటగా" అని అడిగింది నటి లక్ష్మి.

"లేదు లక్ష్మీ! నా ఉన్నతికి, అభివృద్ధికి, సుఖానికి అందరూ కారణాలే, కానీ నా ఈ పతనావస్థకు మాత్రం ఎవరూ కారణం కాదు, ఒకళ్లనని లాభం లేదు మనమే జాగ్రత్తగా ఉండాలి" అంది సావిత్రి.

"సరేకాని నాకు సిరంజి స్టెరిలైజ్ చేసి ఇవ్వు. ఇన్సులిన్ వేసుకోవాలి" అంది.

"నాకు ఇంజెక్షన్ చేయటం రాదుగా" అంది లక్ష్మి.

"ఇంత నోరుంది, సాగదీస్తే చెవివరకు వస్తుంది. ఇన్‌జెక్షన్ చేయ్యడం రాదట" అంది సావిత్రి కోపం నటిస్తూ.

"చెవి వరకు నోరు ఉన్న వాళ్లందరికీ ఇంజెక్షన్ చేయటం వచ్చా ఏమిటి? అలా అయితే ఇక డాక్టర్ ఎందుకు?" అంది లక్ష్మి.

"గయ్యాళి" అని ముద్దుగా కోపగించుకుంది సావిత్రి.

"సర్లే కాని, ఇలా జీవితమంతా మాట్లాడుతూ గడిపేయకు. అదిగో ఆ జానకి లాగా ఇతరుల కోసం జీవించకు. నన్ను చూడు, త్యాగం చెయ్యడంలో సుఖం ఉందని భావించి వెర్రిదానిలా ఇప్పుడు కష్టపడుతున్నాను. ఇవన్నీ నువ్వు చేయకే, నేను నీకు చెప్పేది ఇదే" అంది సావిత్రి.

ఆ రోజు షెడ్యూల్ అయిన తరవాత మైసూర్‌లోని హోటల్ రూమ్‌కి వచ్చేసింది. గడియపెట్టుకొని మంచంపై కాసేపు కూర్చొని ఇక తన వల్లకాక వెనక్కి పడిపోయింది. మొదటిసారిగా తన ఆరోగ్యం మీద అనుమానమేసింది. భయం మొదలైంది. 'నా వయస్సు వాళ్లందరు ఇంకా చెంగు చెంగున గెంతులేస్తున్నారు. అవకాశాలు రావాలేగాని మళ్లీ హీరోయిన్‌లా కూడా ముస్తాబవటానికి రెడీ. మరి నేనేంటీ ఇలా అయిపోయాను. రెండో ఆలోచన లేకుండా అమ్మమ్మ వేషాలు కూడా ఇచ్చేటట్లు ఉన్నారు. చేతితో మొహం తడుముకుంటుంటే అన్నీ బొమికలే తగులుతున్నాయి. ఒక్క మొహం ఏమిటి? ఆఖరుకు తొడమీద కూడా బొమికే తగులుతోంది. అంత ఒళ్లు ఏమైంది? మొదట్లో ఉన్న ఆ 'బొద్దు శశిరేఖ' ఏది. ఆ తర్వాత జనం పిలిచిన 'పిప్పళ్ల బస్తా' ఏది? ఆ వళ్లంతా ఎలా కరిగింది? అమ్మమ్మా... ఈ మందు ఎంత పని చేసింది! ఇప్పుడు మందు మానలేను. 'కన్యాశుల్కం'లో శ్రీశ్రీగారి పాటకు  చేసిన డాన్స్‌లో 'వ్యసనానికి బానిస నేనై' అనే లైను ఉంటుంది. అదేంటో నేనూ సరిగ్గా అలానే వ్యవసనానికి బానిసైపోయాను. ఇప్పుడు, బాధలు మరవటానికి తాగుతున్నావా బాటిల్ మరవలేక తాగుతున్నావా అంటే రెండింటికీ చెరిసగం మార్కులు వేయాలేమో?' ఇలా ఆలోచనలు సాగిస్తూవున్న సావిత్రికి, ప్రొద్దున ప్రీమియర్ స్టూడియోలో లక్ష్మితో అన్న మాటలు గుర్తుకొచ్చాయి "నా సుఖాలకి అందరూ కారణమే లక్ష్మీ, కానీ నా ఈ దుస్థితికి ఎవరూ కారణం కాదు".

'అవునా... ఎవరూ కారణం కాదా? అన్నింటికీ తానే కారణమా? ఆహహా ఏమి సెలవిచ్చాను. నిజమేననుకుందేమో పిచ్చిపిల్ల. నాకు ఈ మత్తు అలవాటు చేసినవాడు నా ఈ దుస్థితికి కారణం కాదా? నా ఆస్తులు కాజేసినవాళ్లు కారణం కాదా? నా నమ్మకాన్ని వమ్ము చేసినవాళ్లు కారణం కారా? నేను నిర్మాతనై సినిమాలు తీస్తున్నప్పుడు ఎవరికి అందిన డబ్బు వాళ్లు దోచుకున్నవాళ్లు కారకులు కారా? నా మీద ఇన్‌కంటాక్స్ కేసు బనాయించిన వారు కారకులు కాదా? నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా దరికిరాని వాళ్లు కారణం కాదా? అబ్బా ఎందుకీ నటన? ఎందుకీ అబద్ధాలు? నిజ జీవితంలో ఎప్పుడూ నటించటం చేతకాలేదు. ఇక ఇప్పుడంత అవసరమా ఈ నటనా?'

ఇప్పుడు... అప్పుడు... ఇప్పటికి అప్పటికి ఎంత తేడా. చాలా తేడా ఉంది, తల్చుకుంటేనే బాధ వేసింది. పోగొట్టుకున్నాకే వాటి విలువ తెలిసేది. డబ్బు పోగొట్టుకున్నందుకు సావిత్రి చాలా బాధపడింది. అది తలచుకుంటేనే బాధ వేస్తుంది. ఎంత ఆస్తి తనది! కోట్ల విలువ కల ఆస్తులు. ఇంకో నాలుగుతరాలు కాలు మీద కాలు వేసుకొని కూర్చొని తిన్నా తరగని

ఆస్తి. తన పిల్లలదాకా కూడా ఆగకుండా ఆవిరైపోయింది. తన పిల్లల సంగతి తర్వాత, తానే తడుముకోవాల్సి వస్తుంది. పొద్దున్నే లేచిన దగ్గర నుంచి కావాల్సింది డబ్బే. అది లేకుండా ఏమీ జరగదు.

ఇలా ఆలోచించుకుంటూ పోతూంది. ఎక్కడలేని అలసటంతా వచ్చిపడింది. షూటింగ్‌లో ఉన్నంతసేపే తన శరీరం తన ఆధీనంలో ఉండేది. ఆ షూటింగు అయ్యీ అవ్వగానే ఈ శరీరంలో మేమున్నాము అంటూ షుగరు, బిపి, బాధలు, చిరాకులు అసహనం అన్నీ ఒక ఉప్పెనలా బయటకు వస్తాయి.

వీటన్నిటికి సావిత్రి దగ్గర మందు లేకపోలేదు. అన్నిటికి ఒకటే మందు. కాకపోతే ఈ మందుతో ఒక్కటే గొడవ, రోగాలని ఇంకా పెంచుతుందిగాని తగ్గించదు. కాని సావిత్రికి నచ్చిన తన లోకానికి తీసుకుపోతుంది. 'ఆరోగ్యం పాడు చేయకుండా ఉంటే ఇది ఎంత మంచి మందు' అనుకొని గది అంతా కలయచూసింది. సావిత్రి తెచ్చుకున్నవి అయిపోయినట్లు ఉన్నాయి. శరీరాన్ని కష్టం మీద లేపుకుని సూట్‌కేస్ చూసింది. దానిలోను అయిపోయాయి. బాయ్ కోసం బెల్ మోగించింది. బాయ్ వచ్చాడు, తనకు ఏమి కావాలో ఓ చీటీలో రాసి ఇచ్చింది.

"ఇవేంటి మేడమ్ గారు?" అడిగాడు చీటి చూస్తూ.

"ఈ హోటల్‌లో బార్ వుంది కదూ, వాళ్లకు తెలుస్తుందిలే. తీసుకురా పో" అంది. వాడు నమ్మలేనట్లు చూశాడు.

'ఇలా ఉంటాయి బాబు కొన్ని జీవితాలు. నమ్మశక్యం కాకుండా' అనుకుంటూ తలుపేసుకుంది.' నమ్మశక్యం కానిది అంటే గుర్తుకొచ్చింది ఈ రోజు ఆత్మహత్య చేసుకుందంట శుభ . ఎంత మంచిపిల్ల. ఏమొచ్చి చేసుకుంది. ఏమొచ్చినా అవి నాకంటే పెద్ద బాధలా?' అనుకుంది సావిత్రి.

అంతలోకి బాయ్ తలుపు తట్టాడు. బాటిల్ తీసుకొచ్చి లోపల పెట్టాడు. "భోజనం తెమ్మంటారా?" అని అడిగాడు.

"నేను ఇప్పుడు స్నానానికి వెళ్తాను, ఓ పావు గంట ఆగి తీసుకురా" అంది.

స్నానం అయింది. భోజనం వచ్చింది. భోజనం చేసింది. బాయ్ వచ్చి అన్నీ తీసుకెళ్లాడు.

ఇక తన కార్యక్రమం మొదలుపెడితే కాని సావిత్రికి నిద్రపట్టదు. బాటిల్ అందుకోబోయింది. అంతలో బెల్ మోగింది. ఉలిక్కి పడింది. "మళ్లీ ఈ బాయ్‌కి ఇంతలోనే

ఏం పని వచ్చింది. అన్నీ తీసుకువెళ్లాడు కదా? ఏమి మరిచిపోలేదు కదా" అని విసుక్కుంటూ తలుపు తీసింది. అక్కడ హోటల్ బాయ్ కాదు అసిస్టెంట్ డైరెక్టర్ ఉన్నాడు.

ఏంటీ అనే అర్థంతో చూసింది. ఓ రెండు కవర్లు ఇచ్చి, "మేడమ్ ఈ రెండు కవర్లు మీ పేరు మీద ఈ రోజు ప్రీమియర్ స్టూడియోకి ఎవరో మద్రాసు నుంచి వచ్చిన వాళ్లు ఇచ్చారు. అర్జెంటేమోనని డైరెక్టర్ గారు ఇచ్చిరమ్మన్నారండి" అంటూనే గదిలోకి దృష్టి సారించాడు.

'ఓహో ఈవిడ గురించి నేను విన్నది నిజమేనన్న మాట' అని అనుకున్నాడు.

"సరే బాబు, థాంక్స్" అని చెప్పేసి డోర్ వేసుకుంది.

మళ్లీ మంచం మీద వాలిపోయింది. గుండెమీద ఆ రెండు కవర్లు పెట్టుకొని. 'ఎక్కడ నుంచి అబ్బా ఈ కవర్లు. నన్ను వెతుక్కుంటూ ఇంత దూరమొచ్చాయి' అనుకుంది. ఒక కవరు బాగా లావుగా ఉంది. రెండోది చాలా సన్నగా ఉంది.

ఈ రెండు కవర్లు మళ్లీ తనను వెక్కిరించాయి. 'లావు కవర్... సన్న కవర్... నేను అప్పుడు..... ఇప్పుడు. అప్పుడు... నాకు బాగా డబ్బు, ఆరోగ్యం ఉన్న రోజుల్లో... ఇప్పుడు... డబ్బు, ఆరోగ్యం పోయిన రోజుల్లో....'

ఇలా వైరాగ్యంలోకి వెళుతూంటే, ఆ లావు కవర్ మీద హాలీవుడ్ అడ్రెస్ కనిపించింది. 'ఇదేంటి హాలీవుడ్ అని ఉంది. హాలీవుడ్ నుంచి నాకేమైనా ఆఫర్సా... అయినా ఈ అవతారంతో నాకు ఇప్పుడు హాలీవుడ్ ఆఫర్స్ ఎవరిస్తారు. లేకపోతే 1960లో నన్ను ఎవరైనా చూసి అప్పుడు రోల్ ఇద్దామనుకొని లెటర్ రాస్తే అది మెల్లగా అమెరికా నుంచి ఇప్పటికి చేరుకుందా?' ఫ్రం అడ్రస్సు దగ్గర పేరు లేదు. అక్కడ ప్రశ్నార్థక గుర్తు ఉంది. 'ఎవరబ్బా ఇది, నాతో కావాలనే పరాచకాలు ఆడుతున్నారు' అనుకుంది.

ఇక రెండో కవరు చూసింది. చాలా సన్నగా ఉంది. అసలు లోపల ఏమన్నా ఉందా అనే అనుమానం వచ్చింది. వెనక్కి తిప్పింది 'చాముండి' అని ఉంది. ఆ పేరు చూసి చూడగానే చటుక్కున లేచి కూర్చుంది. ప్రాణం లేచివచ్చింది. గబగబా, జాగ్రత్తగా కవర్ చించింది.

నువ్వు మద్రాసు వచ్చే సమయానికి నీ ఇంటి ముందు కాచుకు కూర్చుంటాను.

ఇట్లు

చాముండి

'చాముండి... నా చాముండి. నన్ను నన్నుగా ప్రేమించిన చాముండి. నేను దాన్ని అసలు పట్టించుకోనప్పుడు నన్ను ప్రేమించిన చాముండి. ఇప్పుడూ అదే ప్రేమతో ఉన్న

చాముండి. నాకు తెలిసి చాముండి చాలా గట్టిమనిషి. చాలా ధైర్యవంతురాలు. అది నా పక్కనే ఉంటే నేను ఇంత గడ్డు పరిస్థితుల్లో ఉండేదాన్ని కాదు. కాని చాముండి కన్నా దైవం, దైవం కూర్చే విధి గట్టిది. అందుకనే చాముండిని నా దగ్గర నుంచి పంపేసి మరీ విధి దాని రాతనే జరిపించుకుంది. విధి రాతలు అయింతర్వాత ఇప్పుడు చాముండిని పంపిస్తుంది. చాముండి నా గురించి అంతా తెలిసే వస్తుంది. నా దగ్గర ఉండి నన్ను చూసుకోవడానికే వస్తుంది. అయినా అది ఈసారి వెళ్తానన్నా నేను దాన్ని వెళ్లనివ్వను. అది నన్ను చంటిపిల్లలా సాకుతుంది. ఇక నాకు ఏ బాధ ఉండబోదు' అనుకుంది.

ఈ ఆనందంలో తన చూపు ఆ సీసాల వైపు కూడా మళ్లలేదు. అప్పుడు అనిపించింది సావిత్రికి 'చాముండి వచ్చిన తర్వాత ఈ తాగుడు కూడా మానేస్తానేమో' అని.

ఇక సావిత్రి సంబరపడిపోతూ, తృప్తిగా రెండో కవరు తీసింది.

హాయ్,

నాకు తెలుసు హాలీవుడ్ నుంచి ఎవరై ఉంటారని ఆలోచిస్తూ ఉంటారు మీరు. నేను 'సూసన్ హేవర్డ్.. హాలీవుడ్ యాక్ట్రెస్ సూసన్ హేవర్డ్ని. నేను మీ అభిమానిని. నేను మీ అభిమానిని ఎప్పుడయ్యానని ఆలోచిస్తున్నారా? అసలు మీ గురించి నాకెలా తెలిసిందా అని ఆశ్చర్యపడుతున్నారా? వినండి చెప్తాను. కాదు కాదు చదవండి. 1962లో ఒకసారి ఇండియా వచ్చాను. నేనే కాదు నాతోపాటు మా డైరెక్టర్, ప్రొడ్యూసర్‌తో సహా ఎంటైర్ యూనిట్ ఉంది. షూటింగ్ నిమిత్తం బ్యాంకాక్ వెళ్లవలసి ఉంది. కాని మా ఫ్లైట్ వాతావరణం బాగోలేక కలకత్తాలోనే దిగింది. మేము దిగింది కలకత్తా, ఇండియా అనగానే మాకు గుర్తువచ్చింది సత్యజిత్ రే. వెంటనే ఆ ఓరియంటల్ జీనియస్‌ని చూడాలనుకున్నాము. ఎయిర్‌పోర్ట్ అఫిషియల్స్‌కు చెప్పగానే వారు సత్యజిత్ రేకి కబురు పంపారు. ఒక గంటలో సత్యజిత్ రే, సుచిత్రాసేన్ మరికొందరు మా హోటల్ రూంకు వచ్చారు. సుచిత్రాసేన్‌ని తన పిక్చర్స్ చూపించమన్నాను. తను అలా చెయ్యనంది, మీకు మీ నెక్స్ట్ ఫ్లైట్ ఎప్పుడైనా కావచ్చు. మీరు ఈ సమయాన్ని అత్యంత సద్వినియోగం చేసుకోవాలి. నన్ను మీరు ఎలాగూ చూశారు కనుక మీకు ఇప్పుడు మా దేశం గర్వించే ఒక నటీమణిని చూపిస్తాను, చూడండి అని ప్రొజక్టర్ మీద ఒక సినిమా చూపించింది. అది 'కన్యాశుల్కం' సినిమా.

**and with that I fell in love with you.**

'కన్యాశుల్కం'లో మధురవాణి పాత్ర ఒక అద్భుతమైతే, మీ నటనతో ఆ పాత్రకు జీవం పోసి, ఇంకో అద్భుతం సృష్టించారు. ఆ సినిమాలో మీరు రామప్పపంతులకి తాంబూలం

తినిపిస్తూ, లుబ్ధావధానులుకి మళ్లీ పెళ్లి చేస్తామంటూ పంపించేవరకూ మీరు చూపిన నటన నాకు ఎంతో నచ్చింది.

ఈ సినిమాలో మీ బాడీ లాంగ్వేజ్, ముఖంలో చూపించిన హావభావాలు మరియు కళ్లతో పలికించిన భావాలు అన్నీ అద్భుతాలే. మీ నటనలో బ్రహ్మాండమైన లయ ఉంది. మీ చూపు, ముఖ కవళికలు, శరీర కదలికలు అన్నీ ఒకే భావాన్ని వ్యక్తం చేస్తాయి. అందుకే మీ నటన పరిపూర్ణమైనదైంది. మీరు ఈ సినిమాలో ఒకచోట, ఒకేసారిగా నవ్విన నవ్వు నిడివి ఒక అర నిమిషం. నేను ఒక 20 సెకండ్స్ ఆపకుండా నవ్వటానికి ప్రయత్నించాను. ప్రతి 5 సెకండ్లకి నా నవ్వు ఆగిపోయేది. ఎంతో కష్టం మీద మళ్లీ నవ్వు తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇలా ప్రతి 5 సెంకడ్లకు నవ్వి, అతుకులు వేసుకుంటూ, ఓ అరనిమిషం నవ్వు పూర్తి చేయగలిగాను. అయినా నా అతుకుల నవ్వు మీ ఆణిముత్యాలతో సమానమా?

మీ ఈ నవ్వుని నేను రికార్డు చేసి పెట్టుకున్నాను. నాకు మీ నవ్వు స్ట్రెస్‌రిలీవరే కాదు, నన్ను ఉత్సాహపరిచేది, నటనలో నేను అందుకోవాల్సిన ఎత్తులు ఇంకా ఉన్నాయని గుర్తు చేసే పాఠాలు కూడా.

ఆ సినిమా ఆ రోజు అక్కడ చూసిన తరువాత ఆ ఫిల్మ్ తీసుకొని మరీ బ్యాంకాక్‌కు బయలుదేరాను. బ్యాంకాక్‌కు వెళ్లినా, అక్కడ నుంచి మళ్లీ అమెరికా వచ్చినా అసలు మిమ్మల్ని నేను మరిచిపోతేగా. సెట్స్ మీద ఉన్నా కూడా మీ అందం, మీ రూపు, మీ నవ్వు మనసులో మెదలుతూనే ఉన్నవి. అసలు బ్యాంకాక్ నుంచి మళ్లీ ఇండియా వచ్చి ఒక్కసారి మిమ్మల్ని కలిసి వెళదామనుకున్నాను. కానీ షెడ్యూల్స్ వల్ల కుదరలేదు. మళ్లీ వెళ్లే ఫ్లైట్ కూడా ఏదో కారణం చేత మళ్లీ ఇండియాలో దింపేస్తే బాగుండు అనుకున్నాను. అదిగో ఆనాటి నుంచి నేటి వరకు కూడా మిమ్మల్ని కలుసుకోలేక పోయాను. హాలీవుడ్ యాక్ట్రెస్‌ని కదా, మరీ ఈ ఫీల్డ్‌లో మన టైం మనచేతిలో ఉండదు. సెక్రటరీస్ చేతులలో, ప్రొడ్యూసర్ల చేతులలో ఉంటుంది. కానీ మీ సినిమాలు అన్ని తెప్పించుకున్నాను. సుచిత్రాసేన్‌ను మీ గురించి అడుగుతుంటాను. మీకో పాప, ఒక బాబు అని కూడా తెలిసింది. అన్నిటికీ మనసులోనే అభినందించుకున్నాను. సుచిత్రాసేన్ ఒక్కోరోజు అడిగేది నన్ను "మీ గురించి సావిత్రికి చెప్పేయమంటారా?" అని. నేను వద్దన్నాను. ఎందుకంటే మీకు నేను ఒకసారి ఎదురుబడి మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచేద్దామని అనుకున్నాను. ఒకసారి నాకు సుచిత్రాసేన్ మీరు నా సినిమాలు చూసి ఉన్నారని, మీకు నేను అభిమాన నటిని అని చెప్పింది. అది తెలిసి ఎంతో ఆనందించాను. ఉబ్బితబ్బిబ్బు అయిపోయాను. మీ అంతటి మహానటి నన్ను అభిమానించటం నా అదృష్టం.

మీ ప్రతి సినిమాని ఒక్కొక్కటి నాలుగైదుసార్లు చూశాను. ఇన్‌ఫ్యాక్ట్ మీ సినిమాలే నాకు స్ఫూర్తి. మీ నుంచి నేర్చుకోవటానకి ఎంతో ఉంది. కాని మీది ఇండియన్ కల్చర్. అందులోనూ మీకు వచ్చిన సాత్వికమైన పాత్రలు మా హాలీవుడ్ కల్చర్‌కి సరిపడవు. లేకుంటే హాలీవుడ్‌లో వాళ్లందరూ మరో సావిత్రిని చూసేవారు. అంటే నేను అంతగా మిమ్మల్ని ఇమిటేట్ చేస్తున్నానన్నమాట. అయినా ఈ బావిలో ఉన్న హాలీవుడ్ కప్పలకేం తెలుసు సావిత్రి అనే ఆణిముత్యం అంటే. నాకు ఒక ప్లాన్ ఉంది. నా నెక్ట్స సినిమా స్క్రిప్ట్ తీసుకొని మీ దగ్గరకు వచ్చి మీ చేత నా పాత్ర నటింపచేసి, నేను నేర్చుకొని వచ్చి ఇక్కడ నటిస్తే కచ్చితంగా ఆస్కార్ నాదేనని నాకు గట్టి నమ్మకం. కాని ఎక్కడ నాకు కుదరనేలేదు.

మీరు మీ కల్చర్‌కు తగ్గట్లు అమోఘమైన నటన ప్రదర్శించారు. ఎన్నని చెప్పను, మీకు గొప్ప పేరు తెచ్చిన 'దేవదాసు' సినిమా నుంచి మొదలు పెడితే మీరు 'దేవదాసు'లో చాలా గొప్పగా నటించారు. అది మీ మొదటి చిత్రాల్లోనిది అంటే నమ్మటం కష్టం. ఇక 'దేవదాసు' కొస్తే దానిలో ఒక పాటలో "నా ఎదుటే నీ బడాయి" అంటూ మురిపెంగా మీరు ప్రదర్శించిన రుకోపం అనితరసాధ్యం.

'దేవదాసు'లోనే, మీరు దేవదాసుకు ఏవో తింటానికి తెచ్చినపుడు "కళ్లు మూసుకో" అనేముందు నవ్వి తర్వాత డైలాగ్ చెప్తారు, అది చాలా గొప్పగా ఉంటుంది. ఆర్టిస్ట్‌లందరూ ఏడుపు సీన్ ఈజీగా చేసేయగలరు. కాని సుకుమారంగా చెయ్యగలగటం అనేది మాత్రం ఆర్టిస్ట్ యొక్క నటనా కౌశల్యం మీద ఆధారపడి ఉంటుంది. అది మీకు పుష్కలంగా ఉంది.

నేను మొదట 'మిస్సమ్మ' చూసి మీరు పొగరుబోతు పాత్రలు బాగా మెప్పించగలరు అనుకున్నాను. మీరు నిజంగానే కాస్త పొగరుగానే ఉంటారేమోనని అనిపించింది. కాని ఆ తర్వాత 'అర్ధాంగి' చూస్తే మీరు ఏ పాత్రనైనా చేయగలరనిపించింది. ఊరికే చేయటం కాదు ఆపాత్ర స్వభావాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తారు.

'మిస్సమ్మ' సినిమాలో మీరు చాలా ముద్దుగా ఉన్నారు. మీకు సీమంతం చేస్తున్న పాటలో మీకు నచ్చని హిందూ సాంప్రదాయాలు మీకు అన్వయిస్తుంటే, మీరు వాటిని భరిస్తూనే మరోప్రక్క మీకు కలిగిన అసౌకర్యాలను ప్రదర్శించడం చాలా హుందాగా ఉంది. ఆ పాటలోనే మీకు సీమంతం ఎందుకు చేస్తున్నారో తెలుసుకున్నప్పుడు, మీరు మీ ఆశ్చర్యాన్ని కళ్లతో కనబర్చిన తీరు అద్భుతం. మీరు కనుబొమ్మలు ముడవకుండా ముఖం చిట్లించకుండా మీ మొఖంలో భావాన్ని పరిపూర్ణంగా ప్రతిఫలింప చేశారు. పైన చెప్పుకున్న దృశ్యంలో

మీరు ప్రదర్శించిన అమాయకత్వం, ఆశ్చర్యం ఎంతో ముద్దొచ్చాయి. ఇక్కడే కాదు 'ఏమిటో ఈ మాయ' అనే పాటలో మీ మోము వెన్నెల ముద్ద.

అంత చిన్న వయసులోనే మీకు నటన మీద అంత పట్టు ఉన్నందుకు నేను ఆశ్చర్యపోయాను. మీ వయసు పెరిగే కొలది మీరు నటన మీద పట్టుని విడవలేదు. ఎప్పుడూ చేసే నటనే కదా అని మీరు రిలాక్స్ కాలేదు. ఎప్పుడూ అదే సాటిలేని అపురూపమైన నటనే ప్రదర్శించారు.

తర్వాత 'తోడికోడళ్ళు' తీసుకుంటే "ఆడుతు పాడుతు పనిచేస్తుంటే" పాటలో అనురాగాన్ని, మొహమాటాన్ని, పరవశత్వాన్ని కలిపి ఏకకాలంలో అభినయించటం మీకే చెల్లింది.

అటు తర్వాత 'దొంగరాముడు' 'చిగురాకులలో' పాటలో "ఎవరనినారో ఈ మాట వింటున్నాను నీ నోట" మిమ్మల్ని ప్రశంసించిన ప్రియుడి మాటలకు కేవలం పొగడ్తేనా నిజమా అనే అనుమానం ఆ వదనంలో ఎంత చక్కగా ప్రతిఫలింప చేశారో ఎంత చెప్పినా తక్కువే. విలన్‌ని కవ్విస్తూ పాడిన 'రావోయి మా ఇంటికి' పాటలో కృత్రిమపు కులుకులు, అతనిపై క్రోధం, కసి కలగాపులగంగా ప్రదర్శించటం ఇతరులకు సాధ్యం కాని విషయం.

ఇక 'మాయాబజార్' విషయానికొస్తే, ఎవరన్నారు మీరు మీ కెరియర్‌లో ద్విపాత్రాభినయం చెయ్యలేదని, ఒకే మనిషికి వేరువేరు వేషధారణ, వేరు వేరు ఉచ్చారణ ఇస్తేనే ద్విపాత్రాభినయనం ఔతుంది అనుకుంటున్నారు మీ వాళ్లు. కాని వాళ్లు గుర్తించారో లేదోగాని మీరు 1957లోనే గొప్ప ద్విపాత్రాభినయం చేశారు. భారతదేశ సినిమాలన్నింటిలోను అన్ని ద్విపాత్రాభినయాల మీద మీరు 'మాయాబజార్'లో చేసిన ద్విపాత్రాభినయం గొప్పది. రెండు పరస్పర విరుద్ధ స్వభావాలను ఒకేపాత్రలో మీరు మెప్పించిన తీరు అద్భుతం. ఈ సినిమాలోనే 'సుందరి నీవంటి దివ్యస్వరూపం' అనే పాటలో మీరు చేసిన నృత్యం, చిలిపి చేష్టలు ఎంతో ముచ్చటగా ఉన్నాయి.

మీ అన్ని సినిమాల్లో కెల్లా మీ శరీరాకృతి ఈ సినిమాలో ఎంతో చక్కగా ఉంది. 'మిస్సమ్మ'లో మీ చిన్నవయసు మీ మోములోను, శరీరాకృతిలో తెలిసిపోయింది కాని 'మాయాబజారు'కు వచ్చే సరికి మీ ముఖారవిందం సరేసరి, మీ శరీరాకృతి పరిపూర్ణత సంతరించుకుంది.

'మామకి తగ్గ అల్లుడు'లో మీ నటన నన్ను మరోసారి అబ్బురపరచింది. మీరు హాస్యపాత్రను కూడా అంతే సునాయాసంగా చేయగలుగుదురని నిరూపించుకున్నారు.

'మా బాబు'లో డాక్టరు మిమ్మల్ని, బాబుని ఇంటికి తీసుకువచ్చినపుడు, మీ సంభాషణలు, మీరు చూపిన భావప్రకటనలు అసమానం.

'చివరకు మిగిలేది'లో మీరు చూపిన మానసిక సంఘర్షణ నామనసును పిండేసింది. ఆ సినిమాలో నాకు 'పద్మ' అనే ఆవిడ బాధే కనిపించింది గాని సావిత్రి ఎక్కడా కనిపించలేదు.

'వెలుగు నీడలు', 'రక్తసంబంధం', 'ఆరాధన'లో కూడా మీ నటన అద్భుతం.

'గుండమ్మ కథ'లో మీరు అతి సౌమ్యవతిగా కనిపించడం నాకు ఆశ్చర్యమేసింది. నేను అప్పటిదాక చూసిఉన్న మీ పాత్రలు సౌమ్యమైనవే అయినా ఈ పాత్రలో ఎంతో లీనమై కనిపిస్తారు. మీరు నిజంగానే సౌమ్యులై ఉంటే తప్ప ఆ పాత్రను అలా మెప్పించలేరు అనిపిస్తుంది. కాని మీరు చాలా హుషారుగా ఉండే మనిషి అని తెలిసింది నాకు. అంత హుషారుగా ఉండే మనిషి అంత సౌమ్యంగా ఎలా చేయగలిగారంటే... మీరు గొప్ప నటులు కనుక. ఇదే సినిమాలో మీరు 'కోలుకోలోయన్న కోలో నాసామి' అనే పాటలో హమ్మింగ్ చేస్తారు. అది చాలా బాగుంది. అదే పాటలో హీరో మీ వెనక వస్తున్నప్పుడు మీరు వడివడిగా ...వడం, ఆ తీరును నేనేమని వర్ణించను? ఎంతచెప్పినా తక్కువే అవుతుంది. ఒక్క "మీరు ...వించారు" అనే పదం తప్ప.

మరలా ఇదే సినిమాలో 'కనులు మూసినా నీవాయె' అనే పాటలో శృంగార భావాన్ని పెదవులతో చూపించారు. పెదవులతో భావాన్ని చూపించడం ప్రత్యేకంగా శృంగార భావాన్ని, తన్మయ భావాన్ని చూపించడం అనేది నాకు తెలిసి మీ ఒక్కరిలోనే చూస్తున్నాను. ఈ పాటలో మీరు ప్రదర్శించిన హావభావాలు "నభూతో నభవిష్యతి".

'సిరిసంపదలు'లో 'వెండివెన్నెల జాబిలి నిండు పున్నమి జాబిలి' అనే పాటలో, పాటకి మధ్యమధ్యలో మీరు చూపిన హమ్మింగ్, నటన అమోఘం. ఈ పాటలో మీరు నటించలేదు, మీ కళ్లే నటించాయి, చూసిన వారిని మైమరపించాయి. మీ మోము నిజంగానే వెండివెన్నెల జాబిలి. ఆ కవి మిమ్మల్ని చూసే ఈ పాట రాసి ఉంటాడు.

'మూగ మనసులు'లో మిమ్మల్ని ప్రేమంటే ఏంటి అని అడిగినప్పుడు, మీరు చూపిన నటన అమోఘం. అప్పటి మిమ్మల్ని చూసి ఎంత మంది హృదయ తంతులు తెగివుంటాయో! ఈ సినిమా అంతటా మీ నటన సహజంగా కన్నా మిన్నగా ఉంది. మరింత అందంగా ఉంది.మీ నటనా నిఘంటువులో ఒక అపురూప ఘట్టం ఈ సినిమాలో వుంది.నేనేమైనా చేయగలనా అని అనుమానపడుతూనే ప్రయత్నించాను,కాని విఫలమయ్యాను. మీరు

'ముద్దబంతి పువ్వులో....' అనే పాటను పాడమని సైగ చేశారా, లేక ఆజ్ఞాపించారా, లేక అనుమతి ఇచ్చారా అనేది ముందుగా నాకు తెలిస్తే, మీరు చూపించిన భావాన్ని ఏమన్నా చేయగలుగుతానేమో, అప్పుడు కూడా చేయగలుగుతాను అని కచ్చితంగా చెప్పలేను. సరే, ఏ భావంతోనైనా కానివ్వండీ, సైగే కానివ్వండి, ఆజ్ఞే కానివ్వండి లేదా అనుమతి ఇస్తున్నాను అనుకొని ఆయా భావాలు పలికించ చూసినా, మీరు తల తిప్పకుండా, కేవలం, (ఇక్కడ కేవలం అనకూడదు) కళ్లతోనూ, పెదవులతోనూ ఆ భావాన్ని పలికించారు. నేను ఎంత ప్రయత్నించినా కేవలం కళ్లతోనూ పెదవులతోనూ నేను భావప్రకటన చేయలేకపోయాను, నా తల పాడమని అనుమతిస్తూ కాస్త కదులుతూనే వుంది.

'డాక్టర్ చక్రవర్తి'లో 'నీవులేక వీణ' అన్న పాటలో విరహాన్ని మీరు ప్రదర్శించిన తీరు అద్వితీయం. ఆపాటలో మీరు ప్రదర్శించిన హావభావాలు దర్శకుల మాటలకు అందని 'సటల్ ఫీలింగ్స్'. దర్శకుడు చెప్పలేకపోయినా మీరు ఆ విరహగీతాన్ని మీ ప్రతిభతో రక్తికట్టించారు.

ఇలా ఎన్నని వివరించను మీ నటనా కౌశల్యం గురించి, మీరు నటించిన ప్రతిపాత్ర ఒక వజ్రం.

మీ మోము మీద హావభావాలు పాదరసంలా కదులుతాయి. ఏ భావం వచ్చినా మీ మొహంలోని అందం మాత్రం చెదరదు. ఇంతకు ముందు చెప్పానో లేదో కాని, మీ ప్రతి అవయవం నటిస్తుంది. మీ ముక్కుపుటాలు నటిస్తాయి, మీ భుజాలు కూడా నటిస్తాయి. ఉదాహరణకి 'మాయాబజార్'లో "అహ నా పెళ్లంట" పాట. నేను గమనించిన ఇంకో ముఖ్యవిషయం ఏంటటే మీ గొంతు ఏ స్థాయికి వెళ్లినా కీచురాదు.

దురదృష్టవశాత్తు భారతదేశంలో సినిమాలను హీరోల పేరుతో సంబోధిస్తారు. కాని నాకు మటుకు మీరు నటించిన చిత్రాలన్నీ 'సావిత్రి చిత్రాలే.' నాకు సుచిత్రాసేన్ ఒకటికి రెండుసార్లు చెప్పారు, మొదట్లో మీరే కావాలి అన్న హీరోలు కొంతమంది ఆ తరువాత "అమ్మో! సావిత్రి వద్దు , ఆమె ఉంటే మేమేమి అనుతాము జనానికి" అని మీరున్న సినిమాలో నటించడానికి భయపడేవారని.

తెలుగువారు అదృష్టవంతులు, మీరు వాళ్ల గడ్డమీద పుట్టి వారు ఎంతో గర్వపడేలా చేశారు. నటులు అవ్వాలి అని అనుకునేవారికి ఒక విశ్వవిద్యాలయం అయ్యారు. మీరు ఒక్క భారతదేశానికే పరిమితం కాకపోయి ఉంటే, మీ ప్రతిభ యావత్ ప్రపంచంలో తళుకులీనేది.

నేను చివరిసారిగా చూసిన మీ సినిమా 'నవరాత్రి'. ఆ సినిమాలో పెళ్లికి ముందు సీన్‌లో హీరో మిమ్మల్ని రమ్మని సైగ చేస్తే మీరు రాననంటూ ముద్దుగా, మంకుగా, వెళ్లాలని ఉన్నా కూడా చిలిపి పంతంతో వెళ్లకపోవటం, ఆ తర్వాత వెళ్లి ఆనందాన్ని ప్రకటించే తీరు అమోఘం. ఇక్కడ మీ నటన, మీ అందాన్ని చూసి ఇక మిమ్మల్ని చూద్దామనే నిర్ణయానికొచ్చాను. అలాగే అనుకోవటంలోనే ఇంకో ఐదేళ్లు గడిచిపోయాయి. కాని ఇప్పుడు నేను వస్తున్నాను. మిమ్మల్ని చూడటానికి వస్తున్నాను. ప్రేమతో..

సూసన్ హేవర్డ్

ఈ ఉత్తరం చదివి ఉబ్బితబ్బిబ్బయిపోయింది సావిత్రి, కళ్లవెంట ఆనంద బాష్పాలు రాలాయి, భారత ప్రభుత్వం పద్మభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఇచ్చినంత, ఆస్కార్ అవార్డు వచ్చినంత సంతోషించింది.

ప్రపంచం పొగుడటం కొత్త కాదు సావిత్రికి. 1960లో 'నమ్మినబంటు' సినిమా స్పెయిన్‌లో శాన్‌సెబాస్టియన్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. అప్పుడే ఎంతోమంది విదేశీ ప్రముఖులు, సినీ దిగ్గజాలు, పామరులు సావిత్రిని మెచ్చుకున్నారు. 1961 ఫిల్మ్ ఫేర్ అవార్డుఫెస్టివల్‌కి వెళ్లినప్పుడు, 1960లో తన 'నమ్మినబంటు' సినిమా చూసిన వాళ్లు "మీరు మద్రాసు నుంచి వచ్చారు కదా, మీకు 'నమ్మినబంటు'లో నటించిన సావిత్రి తెలుసా?" అని తననే అడుగుతుంటే గర్వపడింది. ఆ తర్వాత జకర్తాలో జరిగిన ఆఫ్రో ఏసియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'నర్తనశాల' ప్రదర్శింపబడినప్పుడు కూడా సావిత్రి ఎన్నో ప్రశంసలు అందుకుంది.

అనుభవించాల్సినవన్నీ అనుభవించేసింది. ఇప్పుడు కొత్తగా తనను పులకింపచేసే విషయం లేదు. అన్నీ కోపంతో, కసితో వుసిగొల్పే విషయాలే. "అందరూ దుర్మార్గులు. నా దగ్గర నుంచి లాక్కున్నవాళ్లే. వీళ్లని ఎదిరించటానికి నా ఒక్కదానివల్ల కావటం లేదు. అందుకే ఈ మందు తోడు" అన్నట్లు ఉండేది.

కాని సూసన్ హేవర్డ్ ప్రశంసలు సావిత్రిని నిలువెల్లా పులకింపచేశాయి. తను భారతదేశంలో రెండు రాష్ట్రాల ప్రజలకు కలలరాణి అయితే, సూసన్ హేవర్డ్ ప్రపంచంలో నాలుగింట మూడువంతులమందికి కలలరాణి. లక్షలకొలది అభిమానులున్న తనకి సూసన్ హేవర్డ్ అభిమాన నటి. ఆమె నటించిన ఏ చిత్రం చూడకుండావుండలేదు. అభిమానానికి రెండు వైపులూ తెలుసు తనకి. ఒక వైపు తను హద్దులెరగని అభిమానానికి పాత్రురాలవుతూ

ఇంకో వైపు అంతే తీవ్రాభిమానాన్ని సూసన్ హేవర్డ్‌కి వుంచుకుంది. తన అభిమానులు తనని కలవాలని, మాట్లాడాలని, కరచాలనం చేయాలని ఎలా వుంటుందో తనూ సూసన్ హేవర్డ్‌ని కలవాలని ఎప్పట్నుంచో అనుకుంటుంది. ఒకసారి బొంబాయి వెళ్లినప్పుడు ఒక హిందీ తార 'దక్షిణభారత సూసన్ హేవర్డ్'గా తనని అభివర్ణించినప్పుడు, 'నాకేనా ఇంత పొగడ్త' అని పైకన్నా ఆ ప్రశంసకు లోలోన ఎంతో పొంగిపోయింది. మహానటి అని అనిపించుకున్న తానే అభిమానించే నటి తనను ఇంతగా మెచ్చుకోవటంతో సావిత్రి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

తన కనీస అవసరాలు తీర్చుకోవటానికే సమయం సరిపోతున్న ఈ గడ్డుకాలంలో, తన గత వైభవాన్ని దాదాపుగా మర్చిపోతున్న ఈ కాలంలో సూసన్ హేవర్డ్ ఉత్తరం తన మనసుని ఒక్కసారి ఆ గతించిన వైభవంలోకి తీసుకువెళ్లింది....

ఆడుతూ పాడుతూ వుండే చలాకీ పిల్లైన తనకి డాన్సు నేర్పించారు.ఆ డాన్సు బాగా చేస్తుంటే ప్రదర్శనలు ఇప్పించారు. ప్రదర్శనలు బాగా ఇస్తుంది గదాని నాటకాల్లోకి పంపించారు. చాలాబాగా నటిస్తుందని సినిమాల్లో చేర్చారు. ఇక ముప్పైఏళ్లు నిర్విరామంగా ఈ రంగంలోనే వుంది. జీవిత సారాన్నంతా ఇక్కడే చూసింది. ఎక్కడా లేని కుళ్లుకుతంత్రాలు ఇక్కడే చూసింది. ఇలాంటివి ఎన్నివున్నా తనమంచిని, వ్యక్తిత్వాన్ని చుక్కానిలా నిలుపుకుంది. ఇక్కడే ఆకాశమంత ఎత్తు ఎదిగింది. మొదట్లో తనని చూడటానికి విరగబడే జనాన్ని చూసి గర్వపడేది, కొద్దికాలం లోనే గర్వం అణిచేసుకుంది. డబ్బు రుచి చూసి చూసి దాన్ని పంచుకోవటంలోనే తృప్తి కనుగొంది. వృత్తిలో శిఖరాగ్రాలను చూసింది. మనిషిగా మంచికి మారు పేరయింది. భార్యగా కష్టాలను చవిచూసింది.

కాని ఈ కుతంత్రాలని ఎక్కువ కాలం ఎదుర్కొనలేకపోయింది. తన మెడలో వేయించుకున్న దండ, కందిరీగై నిలువెల్లా కుట్టడం ప్రారంభించింది. తనకు తాగుడు నేర్పినవాడి అదృష్టమేమిటంటే ఆ మందు అతనికి నిజంగా మందులానే పనిచేసింది. తనకేమో ఎంత తాగినా మనసులో వేదన చల్లారక ఆ మందులో మత్తు బిళ్లలు వేసుకుని, ఆ తర్వాత అదీ చాలక ఏకంగా డ్రగ్స్‌కే అలవాటుపడింది. అయినా శాంతి లేదు.తన బ్రతుకు తను బ్రతుకుదామని ప్రక్కకి వచ్చేసినా బాగుండేది. కాని నమ్మి దరిచేర్చుకున్నందుకు, అతనికి కట్టుబడివున్నందుకు ఏ మాత్రం విశ్వాసం, విధేయత చూపించనివాడి మీద వయస్సు,డబ్బు తెప్పించే పంతానికి దిగింది.ఆ పనిలో తానే నాశనమైంది. పర్యవసానం.... చివరకు మిగిలిన శల్యమైన ఈ మనసు.. శరీరం.

కొందరు 'చేతులారా చేసుకున్నదానికి ఎవరేం చేస్తారు' అన్నారు. తను మాత్రం తన ఈ స్థితికి కారణమయినవాడి అంతు చూస్తానని శపథం చేసింది. గుండె సెగలతో

భుగభుగలాడుతుంది. తన గతం తల్చుకుంటే జరిగేదిదే.గుండె మంటను చల్లార్చటానికి మందు కావాలి. ఇక మందు త్రాగటం మొదలుపెట్టింది. అది లేనిదే తనకు నిద్ర లేదు, శాంతి లేదు.

ఆ రెండు ఉత్తరాలను గుండెకు హత్తుకుంది. అనంతమైన తృప్తిని పొందింది.'తన జీవితంలో అతి ముఖ్యమైన విషయాలు తెలుసుకొనడంలో ఎంత ఆలస్యమైందో ,ఈ సూసన్ హేవర్డ్ ఉత్తరం తనకు చేరే విషయంలో కూడా అంతే ఆలస్యమయ్యింది.సూసన్ హేవర్డ్ క్యాన్సర్ బారిన పడకముందు రాసిన ఉత్తరమిది.అప్పుడు వస్తానంది.ఇప్పుడిక రాలేదు.ఒకవేళ వచ్చినా తనకి, ఇదే నువ్వు 'నవరాత్రి'లో చూసిన సావిత్రి అని చెప్తే నమ్ముతుందా? పాపం....తన రూపు చూసి రెండోసారి చస్తుంది' అనుకుంది.ఇక తనకు మిగిలింది చాముండి. 'చాముండి నువ్వైనా వుండు,నేను వస్తాను' అనుకుంది.

మళ్లీ బెల్ మోగింది. 'మళ్లీ ఎవరూ' అనుకుంటూ తలుపు తీసింది. ఎదురుగా తన నగలన్నీ ఇచ్చి దాచి పెట్టమన్న ఆ నటుని భార్య వుంది.

'హమ్మయ్య నాకు నా నగలు ఇవ్వడానికే వచ్చింది' అనుకుంది సావిత్రి. కుశల ప్రశ్నలు అయిన తర్వాత సావిత్రి అడిగింది, "ఏవి తెచ్చావా నా నగలు? ఇవ్వు".

"ఏ నగలు, ఏంటి ఇచ్చేది?" అంది ఆమె, భర్త నుంచి అబ్బిన నటనే కాబట్టి నటిస్తూ.

"ఏ నగలు అంటావేంటి? అప్పుడు నేను, '65లో షూటింగ్‌లో ఉండగా నీకిచ్చాను కదా జాగ్రత్త చేయమని."

"అది చెప్పటానికే వచ్చింది నేను, ఇంతకుముందు కూడా ఎవరితోనో కబురు చేశావు నగలు.....నగలు అనుకుంటూ. నువ్వు నాకు ఏ నగలు ఇవ్వలేదు. నా దగ్గర నీవి ఏవీ లేవు" అంది.

నివ్వెరపోయింది సావిత్రి. ఇంత మోసమా? ఎన్నో రకాలుగా తాను మోసపోయింది. నమ్మినవాళ్లు, నమ్మనివాళ్లు ఎంతోమంది మోసం చేశారు. ఇదీ ఇంకో నమ్మకద్రోహం. కాని ఈసారి తట్టుకోలేక పోయింది సావిత్రి. ఆశలన్నీ ఈ నగలమీదే పెట్టుకుంది. ఈ నగల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినప్పట్నుంచి అనుకుంటూనేవుంది, 'ఇవి చాలు నాకు, నన్ను మళ్లీ నిలబెట్టటానికి' అని. తీరా జంకు బొంకు లేకుండా ఆవిడ లేవనేసరికి తట్టుకోలేకపోయింది, అంతే.... శిలైపోయింది. ప్రాణం ఉందని చూసి సావిత్రిని పడుకోబెట్టి తలుపువేసేసి వెళ్లిపోయిందా నటుని భార్య.

ఆ గదిలో మాట్లాడినవే సావిత్రి చివరి మాటలు.

సావిత్రి అలానే పడిపోయి ఉంది. తెల్లవారింది... పొద్దెక్కింది... అయినా సావిత్రిలో ఉలుకు పలుకు లేదు. హోటల్ సిబ్బందికి అనుమానం వచ్చి చూశారు. మనిషిలో స్పృహ లేదు. నోటి నుంచి నురగ కారుతోంది. వెంటనే యూనిట్ సభ్యులకు తెలియచేశారు. వాళ్లు వచ్చి కారులో ఎక్కించుకొని బెంగుళూరుకి బయలుదేరారు. మొదట ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు, ఆ హాస్పిటల్ వాళ్లు సినీతార అని తెలియగానే చేర్చుకోమన్నారు. ఎందుకంటే అంతకు ముందురోజే శుభ అనే మలయాళ నటి ఆత్మహత్య చేసుకుంది. చివరి ఘడియల్లో ఆమెను ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. అక్కడ ప్రాణం పోయింది. ఆమె బంధువులు ఇక ఆ హాస్పిటల్ మీద దాడికి దిగారు, "మీరే చంపారు సరిగ్గా వైద్యం చేయకుండా" అని, వాళ్లకి తోడు పత్రికలు కుడా వంత పాడాయి. అందుకనే సావిత్రిని చేర్చుకోటానికి నిరాకరించారు. ఇంకా రెండు ప్రైవేటు హాస్పిటళ్లకు తీసుకువెళ్లినా కూడా వారు చేర్చుకోలేదు. అప్పటికే చీకటిపడింది, సావిత్రికి స్పృహలేక దాదాపు ఇరవైనాలుగ్గంటలు అవుతుంది. ఇక ప్రైవేట్ హాస్పిటళ్ల చుట్టూ తిరిగి లాభం లేదనుకొని బేరింగ్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు వెళ్లారు. వారు చేర్చుకున్నారు, కానీ బెడ్స్ లేవు. కింద ఒక దుప్పటి పరచి దానిమీద సావిత్రిని పడుకోబెట్టారు. ఒకళ్లిద్దరు తప్ప యూనిట్ సభ్యులంతా వెళ్లిపోయారు. మద్రాసుకు కబురు పెట్టారు. మద్రాసుకు వార్త చేరిన క్షణాల్లో చాముండికి కూడా వార్త తెలిసింది. అప్పటికప్పుడు విమానం ఎక్కేసింది.

బేరింగ్ హాస్పిటల్‌కు ముందుగా వచ్చినవాళ్లలో నటి లక్ష్మి ఒకరు. ఆమె వచ్చేసరికి కింద ఉన్న సావిత్రిని చూసి ఉగ్రురాలైంది. "ఒరేయ్, దుర్మార్గుల్లారా... రాక్షసుల్లారా... ఎవరిని తీసుకొచ్చి ఇలా పడేశారో తెలుసా మీకు? ఈ మాణిక్యం విలువ ఏమిటో తెలుసా?" అని అరిచింది.

వైద్యం చేయవలసిన హాస్పిటల్ వాళ్ల మీద అరవటం అసలుకే నష్టమని గుర్తెరిగి తనను తాను తమాయించుకొని ...

"అయ్యా! దయచేసి ఒక మంచం మీద ఆవిడను పడుకోబెట్టండి. మా అమ్మను ఇలా కటికనేలపై ఉంచకండి... ప్లీజ్. లేదంటే చెప్పండి మేము ఇద్దరం ఉన్నాం. మా ఒళ్లో పడుకోబెట్టుకుంటాం. ఇలాంటి దయనీయమైన పరిస్థితి సావిత్రమ్మకు రావాల్సిన అవసరం లేదు" అని బతిమిలాడుకొంది.

లక్ష్మి అభ్యర్థించగా సావిత్రికి త్వరగా మంచం ఏర్పాటైంది. నేలైనా... మంచమైనా... సావిత్రిలో ఉలుకు పలుకు లేదు. బాగా ఉన్ననాడే ఆమె స్వభావంలో ఇలాంటి తేడాలు లేవు. గాఢనిద్ర పోతున్న పసిపిల్లలా పడి ఉంది. ఎవరు శరీరాన్ని ఎటు తిప్పితే అటు తిరిగిపోతోంది. ఇప్పుడు బాగా ఉన్న స్థితి కానేకాదు, అసలు లేని స్థితి కాదు, ఉండీ, లేని స్థితి. కోమా అని తేల్చారు డాక్టర్లు. డా॥హండీ, డయబెటీస్ స్పెషలిస్ట్, పరీక్షలు చేసి ఆక్సిజన్ బ్రెయిన్‌కు వెళ్లటం ఆగిపోయిందన్నారు. బ్రెయిన్ సెల్స్ చాలావరకు డెడ్ అయ్యాయని అన్నారు.

బెంగుళూరు చేరుకున్నవారిలో మొదటి వ్యక్తి చాముండి. అర్ధరాత్రికల్లా బేరింగ్ హాస్పిటల్‌కు చేరుకుంది. చివరిసారిగా సావిత్రిని చూసినప్పుడు కూడా బొద్దుగానే ఉంది. కానీ అది వర్షం కురిసేముందు మబ్బులాగా ఒంటినిండా నీరు చేరివుంది. బోద ఒళ్లు. మొహమంతా ఉబ్బిపోయి ఉంది. ఎలాగోలా కాస్త లావుగా కనిపించింది. 'కానీ ఇప్పుడేంటి ఇంత సన్నబడిపోయింది...' అనుకుంది. నిస్తేజంగా ఉన్న సావిత్రిని చూసి నీరు కారిపోయింది. కళ్లనీరు ఏరులై పారుతోంది. సావిత్రిచేయి తన చేతిలోకి తీసుకొని "సావిత్రి... వచ్చాను చూడు. నేను చాముండిని. ఒక్కసారి చూడు" అంది. సావిత్రి కళ్లు తెరిచి కొంచెం సేపు చూసింది. తరువాత మాట్లాడ్డానికి ప్రయత్నించింది. "చా...చా..." అంది కాని అంతకుమించి మాట రావటం లేదు. ఆ పిలుపు కూడా కొంచెంసేపే. ఆ తరువాత చూపు మారిపోయింది.

ఆ తరువాత రోజు పొద్దున్నే పేపర్లు 'మహానటి సావిత్రి పరిస్థితి ఆందోళనకరం' అని ప్రచురించాయి. పేపర్లద్వారా ఫోన్‌లద్వారా అందరికి వార్త పాకింది. మలేషియాలో ఉన్న జి.జి.కి కూడా తెలిసింది, అక్కడనుండి బయలుదేరాడు. ఈ వార్తతో యావద్దక్షిణ భారతం కలత చెందింది. అందరూ కన్నీరు కార్చారు. మనస్ఫూర్తిగా సావిత్రిని మామూలు మనిషిని చేయమని భగవంతుణ్ణి వేడుకున్నారు.

ఆ తరువాత రోజు కూడా సావిత్రి కళ్లు తెరచి చూసినవాళ్లను పిలవ ప్రయత్నించింది. తన దగ్గరి వాళ్లందరిని గుర్తుపట్టి పిలవటానికి ప్రయత్నించింది. అంతే మళ్లీ నిస్తేజమై పోయేది. డాక్టర్లు ఆమె పరిస్థితిని చూసి చాలా నిరాశ చెందారు. అయినా కూడా పదహారు రోజులు బెంగుళూరులోనే ప్రముఖ డాక్టర్లందరూ, అందుబాటులో ఉన్న చికిత్సలన్నీ చేసి చూశారు. లాభం లేకపోయింది. ఈ పదహారు రోజులు బేరింగ్ హాస్పిటల్ ఒక సందర్శనా స్థలమైపోయింది. సావిత్రిని చూడ్డానికి, ఆమె బాగోగులు తెలుసుకోవటానికి వచ్చే జనంతో బేరింగ్ హాస్పిటల్ ఒక జనసముద్రమైపోయింది. తన ఊరు... తన రాష్ట్రం కూడా కాని చోట ప్రజలు తండోపతండాలుగా వచ్చి సావిత్రి ఆరోగ్యం కోసం చేస్తున్న ప్రార్థనలు చూస్తుంటే, ఇలా ఏ నటికైనా... ఏనాడైనా... జరిగిందా అనిపించింది. మరి ఇంతమంది వీరాభిమానులు,

ఇంతమంది చాముండిలు ఉండి కూడా సావిత్రికి ఇలా జరిగిందేమిటి? ఇంతమంది చాముండిలలో ఒక్క చాముండి సావిత్రి దగ్గరకు చేరుకోగలిగింది. అయినా విధి తన పంతమే నెగ్గించుకుంది.

బేరింగ్ హాస్పిటల్ ఒక తీర్థ స్థలంగా మారిపోయింది. ఈ తీర్థయాత్రకు వచ్చినవారిలో కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి గుండూరావు కూడా ఉన్నారు. ఇలా వాళ్లూ... వీళ్లూ... అని లేకుండా పేరున్నవాళ్లు, లేనివాళ్లు అందరూ సావిత్రిని చూసుకోవటానికి వచ్చేవాళ్లే. వారందరిది ఒకటే ప్రార్థన. "మా రాష్ట్రంలో పడిపోయిన సావిత్రి మళ్లీ మా రాష్ట్రంలోనే కోలుకోవాలి, ఇక్కడే షూటింగ్‌లో పాల్గొని వెళ్లాలి" అని.

కానీ లాభం లేకపోయింది. పదహారు రోజుల తరువాత 1980, మే 27న కోమాలోనే మద్రాసుకు బయలుదేరింది... బెంగుళూరు ప్రజల ప్రార్థనలు... కన్నీటివీడ్కోలు మధ్య. మద్రాసు వచ్చీరాగనే లేడీ వెల్లింగ్‌టన్ హాస్పిటల్‌లో చేర్చారు. డా॥ ఆర్.యస్.రాజగోపాల్ ఆమెకు ఇన్‌ఛార్జి డాక్టరుగా నియమితులయ్యారు. ఆయన నేతృత్వంలో ఒక బృందం ఏర్పడింది. అందులో ప్రముఖ న్యూరో సర్జన్ డా॥ శ్రీరామ్మూర్తి, డా॥ కల్యాణ్ రామన్, డా॥ అర్జున్‌దాస్ వీరంతా సావిత్రికి క్షుణ్ణంగా వైద్యపరీక్షలు చేశారు. వీరు ఇది మానసికమైన కోమా అని తేల్చారు. ఇలా సావిత్రి ఎన్ని సంవత్సరాలైనా ఉండవచ్చని అన్నారు.మళ్లీ మామూలు మనిషి అవుతుందని ఎవ్వరూ అనుకోవడం లేదు. చాముండికి ఇంకా ఆశ సావిత్రి కోలుకోగలదని. ఎందుకంటే తనకు తెలిసి ఇద్దరు కోమా నుంచి కోలుకున్నవారు ఉన్నారు.

ఇక ఆ తరువాత సావిత్రి ఇంటికి అనగా, అన్నానగర్‌లోని అద్దె ఇంటికి తీసుకొచ్చారు. సావిత్రిని బతికించుకోవాలనే తాపత్రయంతో ఒకపక్క ఇంగ్లీషు మందులు వాడుతూనే నాటువైద్యాలు, హోమియో, ఆయుర్వేద మందులు కూడా వాడుతున్నారు. అన్ని మతాలవారు వచ్చి ప్రార్థనలు జరుపుతున్నారు. విబూదులు పెడుతూ, తావీజులు కడుతున్నారు. అంతా చూస్తూనే ఉంది చాముండి. ఈ సపర్యలు సావిత్రి కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదు అనుకుంది. తాను రాలేకపోయినా సావిత్రికి డబ్బు పంపింది. ఎన్నోసార్లు యోగానంద్ ద్వారా పంపింది. అవి సావిత్రికి అవసరానికి అక్కరకు వచ్చాయని తెలుసుకొని సంతోషించింది.

'ఇక చేసేదేమీ లేదు. నేను ఎంతగానో ప్రేమించిన సావిత్రి మళ్లీ మాట్లాడగలుగుతుందో లేదో తెలియదు. మాట లేకపోయినా మనిషి ఉంది. నేను ఎడబాటైనప్పటి నుంచి ఊసులు చెప్పుకోవడానికి సావిత్రి ఇంకా ఉంది. పైకి స్పృహ లేకపోయినా నా మాటలు వింటుంది. నా స్పర్శ తనకు తెలుసు' అనుకుంది చాముండి.

సావిత్రికి శుశ్రూష చేసుకుంటూ తరించదలచుకుంది.

సావిత్రికి రెండు గంటలకు ఒకసారి పాలు, పల్చగా గంజి, గ్లూకోజ్ లాంటి ద్రవపదార్థాలు ముక్కునుండి ఉన్న ట్యూబ్‌ద్వారా పొట్టలోకి అందిస్తున్నారు.

"షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చి చూద్దాం" అన్నారు డాక్టర్లు.

"సరే ఇచ్చి చూడండి" అంది కుటుంబం.

"షాక్ ట్రీట్‌మెంటా..." నివ్వెరపోయింది చాముండి. "ఈ మనిషిలో ఇంకా ఏమి మిగిలి ఉందని షాక్ ట్రీట్‌మెంట్?" అని అడిగింది డాక్టర్ని.

"నిజమే... ఏమీ లేదు. కానీ, మరుగున ఏ కాస్త అవకాశమున్నా కణాలు ఉత్తేజింపబడతాయి" అన్నారు.

"ఈ షాక్ ట్రీట్‌మెంట్ అనేది ప్రయత్నాలన్నిటిలోనూ చివరిది" అని అన్నారు.

ఆ షాక్ ట్రీట్‌మెంట్ తనకు ఇచ్చినంత బాధపడింది చాముండి. మొదటిసారిగా షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు.

"ఏమైంది..." అని అడిగింది చాముండి.

"మీ సినిమాలలో లాగా ఒక్కసారి షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వగానే లేచి కూర్చోరమ్మా. షాక్ ట్రీట్‌మెంట్ అనేది ఒకసారి ఇచ్చి వదిలెయ్యరు. కొద్దిపాటి షాక్‌తో మొదలుపెట్టి పెంచుకుంటూ పోతారు" అన్నాడొక డాక్టర్. మొత్తం మీద తొమ్మిది షాక్‌ట్రీట్‌మెంట్‌లు ఇచ్చారు. మొదటిదానికి స్పందన లేకపోవడంతో మిగతావాటినన్నింటిని పెంచారు. అయినా ఏం లాభం లేకపోయింది. చెప్పుకోలేకపోయినా సావిత్రికి చాలా బాధ కలిగి ఉంటుంది. మామూలుగా ఉన్ననాడే వీటికంటే ఎక్కువ షాక్స్ తీసుకుంది. అప్పుడూ తట్టుకోలేక పోయింది. ఇప్పుడూ తట్టుకోలేకపోయింది.

1980, మే 10 – 1981, మే 10 , సరిగ్గా ఒక సంవత్సరం. అంటే మూడువందలా అరవై అయిదురోజులు, సావిత్రి కోమాలోకి వెళ్లి. పడుకొని ఉండటం వల్ల వీపంతా ఘోరంగా పుళ్లు పడింది.

వైద్యానికి అవుతున్న ఖర్చు చాలాభాగం సావిత్రి అన్నానగర్ వచ్చేసిన తరువాత సంపాదించుకున్న డబ్బే. అంతకు ముందు సంపాదించిన సంపద అంతా ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ జప్తు చేసింది. ఆమె బంగారం, వెండి ఆభరణాలు, షేర్లు, బ్యాంక్ ఎకౌంట్లు జప్తు చేశారు. అందుచేత వాటిల్లోంచి డబ్బు వాడుకోవటానికి లేదు. తాను అన్నానగర్ కు వచ్చేసిన తరువాత తాను సంపాదించిన డబ్బును వడ్డీలకు ఇచ్చి ఆ డబ్బు నెలకు సరిపోయేట్లు చేసుకుంది. ఇప్పుడు అవసరం కనుక ఆ డబ్బంతా తీసుకుని ఖర్చు చేయవలసి వచ్చింది.

దాసరి నారాయణరావు, విశ్వేశ్వరరావు గార్ల సినిమాలు నిర్మాణంలో వుండగా కోమాలోకి వెళ్లటం జరిగింది. వారు తమ సినిమాలలో సావిత్రి చేసినది కొద్ది పాత్రే అయినా, చేయవలసింది ఇంకా వున్నా సావిత్రి వైద్యానికి పనికివచ్చేందుకు పూర్తి పారితోషికం ఇచ్చారు.

రోజులు కదలిపోతూనే వున్నాయి. అంతటి మహానటి, మహామనిషి, అందరితో మర్యాదగా వ్యవహరించిన మనిషి, ఎందరినో వాళ్ల ఆపదలో తన డబ్బుతో ఆదుకున్న మనిషి, ఒకరికి కీడు తలపెట్టని మనిషి ఇలా మంచంమీద పడివున్నా, రోజు రోజుకు క్షీణించి పోతున్నా రోజులు మామూలుగానే కదిలిపోతున్నాయి. ఎవరి పనులు వారు నిర్విరామంగా చేసుకుపోతున్నారు. తన తోటి నటీనటులు ఏమీ జరగనట్లే పనులు చేసుకుపోతున్నారు. తనవల్ల లాభం గడించిన నిర్మాతలు, తనవల్ల బతికి బట్టకట్టిన నిర్మాతలు, మళ్లీ లాభాల వేటలో పడిపోయారు. వారికి తీరిక దొరికిన సమయంలో ఒక్కసారి వచ్చి చూసిపోతున్నారు. "ఇక చేసేదేముంది? ఏమిలేదు, అంతా భగవంతుని చేతిలోనే వుంది" అనే ఒక డైలాగ్ అని వెళ్లిపోతున్నారు.

చాముండికి ఎప్పటికి అంతు పట్టని విషయం ఏమిటంటే సావిత్రి హీరోయిన్‌గా ప్రజ్వలించిన రోజుల్లో మేము సావిత్రికి ఆప్తమిత్రులం, ఆప్తులం అని చెప్పుకున్నవారు చాలామంది వున్నారు. వీళ్లందరికి కాస్త ఆలస్యంగానైనా తెలుసు ఇన్‌కంటాక్స్ వారు ఆస్తులన్నీ జప్తు చేశారని, తనకు ఆస్తులు వున్నా వాడుకోలేదని, ఆ వెంటనే ఇంటినుండి బైటకు వచ్చిందని, డబ్బులకు కష్టపడుతోందని, ఒకరిద్దరిని అడిగిందని కూడా తెలుసు. సావిత్రి స్నేహితుల్లో చాలామందికి ఆమెను వాళ్ల ఇంటిలోనో లేక వాళ్లకు సంబంధించిన ఇళ్లలోనో వుండమనే చనువు వుంది. సావిత్రి అడిగేవరకు కూడా వుండకుండా తన చేతిలో డబ్బు పెట్టే చనువు వుంది. దగ్గర వుండి తను అతిగా త్రాగకుండా చూసుకోగలిగే చనువు కూడా వుంది. కాని ఎవరూ ఏమి చేయలేదు. చాముండి ఎవరినీ వదల్లేదు. అందరినీ అడుగుతూనే వుంది "మీరంతా ఏమయ్యారు" అని.

ఏమీ పట్టించుకోని వాళ్లు ఏమి సమాధానం చెప్తారు? తప్పించుకునే మార్గం వెతుకుతుంటారు.

"మేము సాయం చేస్తామన్నా పుచ్చుకోదు తల్లీ మీ సావిత్రి. అభిమానం ఎక్కువ" అంటూ ప్రశ్నించే చాముండిని దాటవేసేవాళ్లు.

ఒకనాడు తన చూపు ఒక్కసారి వారిమీద ప్రసరిస్తే చాలు అని దేశాధినేతల నుండి మామూలు ప్రజల వరకు ఎదురుచూసే ఆ చూపులు ఈనాడు వెర్రి చూపుల్లా వున్నాయి. కోటి భావాలు పలికించిన ఆ కళ్లలో ఎలాంటి భావము లేదు. కాంతితో తూగే ఆ శరీరము

నీలివర్ణంలోకి మారి ముట్టుకోవటానికే భయంగా వుంది. చూడముచ్చట గొలిపే ఆ నిండైన విగ్రహం మైనంలాగా కరిగిపోయి ఎముకలగూడు మిగిలింది. అభిమానులు కరచాలనం చేయాలనుకునే ఆమె చేతులు, మోచేతి వరకు గాజుల గలగలతో కళకళలాడిన ఆ చేతులు ఎండిన పుల్లముక్కల్లా వున్నాయి.

సావిత్రి ఎవరి పిలుపుకి ఎలాంటి స్పందన కనపరచటల్లేదు. ఆకలి వేసినప్పుడు మాత్రం అసహనంగా అరుస్తుంది. అప్పుడు ట్యూబు ద్వారా జావలాంటి పదార్థాలు ఎక్కిస్తున్నారు.

డా॥ తిరువూరి వెంకటేశ్వరరావు నూజివీడుకు చెందిన హోమియో డాక్టర్. సావిత్రికి అభిమాని. ఆ అభిమానంతో సావిత్రికి హోమియో వైద్యం చేయటానికి మద్రాసులోనే వుండిపోయారు. ఆయన "సావిత్రికి పాటలు అంటే ఇష్టం కనుక పాటలు వినిపిస్తే, పాటల తరంగాలు సావిత్రి మెదడులోకి వెళ్లి మెదడులో కల్లోలం కొంత సద్దుమణగవచ్చు. స్పృహలోకి రావటానికి అవకాశం వుంటుంది" అని రోజూ టేప్‌రికార్డర్‌లో పాటలు పెట్టేవారు.

'అంతా భ్రాంతి యేనా ......... జీవితానా వెలుగింతేనా' అనే పాట వస్తుంది.

చాముండి విచలితురాలయింది. 'అంత వెలుగు వెలిగిన సావిత్రి ఇలా అయిపోయిందేమిటి?' అనుకుంది. కాని ఈ స్థితే సావిత్రికి నయం అనుకుంది. వంచకులు మిగిల్చిన జ్ఞాపకాల మధ్య, స్వామిద్రోహుల మధ్య, మిత్రద్రోహుల మధ్య ఇమడలేక, వారిని ఏమీ అనలేక, తన గుండెలో రేగుతున్న మంటలను ఆర్పుకోలేక, వీటిని ఆర్పటానికి బీరు, బ్రాంది, కాంపోజ్ మాత్రలు, పెథిడిన్ ఇంజెక్షన్‌లు రోజురోజుకీ ఎక్కువ మోతాదులో తీసుకుంటూ, ఒకవైపు ఆరోగ్యం పాడవుతున్నా, ఒకరి ఆర్థిక సహాయం మీద ఆధారపడకుండా బ్రతుకు బండి నెట్టుకు రావటానికి పడుతున్న కష్టాలు కంటే, కోమానే ఒక వరం అనుకుంది చాముండి.

సావిత్రి కోమాలోకి వెళ్లి 500ల రోజులయింది. అప్పుడప్పుడు లేడి వెల్లింగ్‌టన్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లి ఏదైనా పరీక్షలు చేయించి, ట్రీట్‌మెంట్‌లో కాస్త మార్పులు చేసుకోవటం తప్ప పెద్దగా డాక్టర్ల పని కూడా లేకుండాపోయింది. అందరూ ఇక చేయటానికి ఏమీ లేదన్నారు.

ఆ తర్వాత సావిత్రి పరిస్థితి మరీ దిగజారనారభించింది. కోమాలోకి వెళ్లిన మొదట్లో కాస్త కదలిక వుండేది మనిషిలో. కాళ్లు చేతులు కదిలించేది, కళ్లు పెద్దవిగా చేసి అసహనంగా, కోపంగా చూస్తున్నట్లు వుండేది. నాలుక కదిలించి ఏదో మాట్లాడటానికి అన్నట్లు ప్రయత్నించేది. మొహం చిట్లించేది. రానురాను కదలికలన్నీ తగ్గాయి. ఇప్పటికి పూర్తిగా తగ్గాయి. ఇక మనిషిలో ఏమీలేదు. పుర్రె ఎముకలు తప్ప. చాముండి సిద్ధపడింది ఆ రోజు కోసం.

తమిళ దినపత్రిక 'దినతంతి' సావిత్రి మంచము మీద వున్న ఫోటోతోసహా, 'మహానటి సావిత్రి పరిస్థితి విషమించింది' అని వార్త ప్రచురించింది. ఆ వార్త చూసిన దగ్గరనుంచి ఎక్కడెక్కడినుంచో ప్రజలు రోజు ఐదువందలకు తగ్గకుండా అన్నానగర్ వచ్చి సావిత్రిని దర్శించుకోవటం మొదలుపెట్టారు. సావిత్రిని అంత హృదయవిదారకమైన రూపంలో చూడలేక కన్నీరు మున్నీరై సావిత్రిని విడువలేక విడిచేవాళ్లు.

డిసెంబర్ 26, 1981 సావిత్రి కోమాలోకి వెళ్లి 596వరోజు పరిస్థితి మరీ ఆందోళనకరంగా వుంది. వూపిరి తీసుకోవటానికి కష్టమవుతోంది. ఇంక లాభం లేదనుకొని లేడి వెల్లింగ్టన్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఆఖరి ఘడియలు వచ్చేశాయన్నారు డాక్టర్లు. కృత్రిమ శ్వాస ఏర్పాటు చేశారు. "ఈ శ్వాస ఎంతోసేపు నిలవదు. ఈరోజే ఆగిపోవచ్చు, కనిపెట్టుకుని వుండండి" అని చెప్పి డాక్టర్లు వెళ్లిపోయారు. సావిత్రి కుటుంబం అంతా పక్కనే వుంది. చాముండి, సావిత్రి శ్వాసశ్వాసని కనిపెట్టుకొని కూర్చొంది. సావిత్రి శ్వాసతోపాటే తనూ గాలి పీల్చింది. ఇద్దరి శ్వాసలు ఒకే లయ మీద వున్నాయి. రాత్రి 10.30 ని॥లకు చాముండి శ్వాస లయ తప్పింది. ఒక్క ఉదుటున లేచి చూసింది. సావిత్రి శ్వాస ఆగిపోయింది.

రాత్రికి రాత్రి సావిత్రి ఇక లేదు అన్న వార్త మద్రాసు అంతా పాకిపోయింది. తమిళనాడు, ఆంధ్రదేశం, బొంబాయి, కలకత్తా, విదేశాలు ఇలా సావిత్రి తెలిసిన ప్రతిచోటుకి పోయింది వార్త. అప్పటికే హాస్పిటల్‌ను చుట్టుముట్టారు జనం. తెల్లారిన తరువాత నుంగంబాకంలోని జి.జి. ఇంటికి తీసుకువచ్చారు సావిత్రిని.

సినీ ప్రముఖులు, ఇతరులు, రాజకీయ ప్రముఖులు, సావిత్రి అభిమానులు వేల సంఖ్యలో పోగయ్యారు. నుంగంబాకం హై రోడ్ అంతా జన సంద్రమే అయిపోయింది.

"పిచ్చితల్లీ, వెళ్లిపోతున్నావమ్మా" అంటూ పి.పుల్లయ్య ఏడ్చేశారు.

"ఏనాడో చనిపోయిందా తల్లి .ఇప్పుడు సాగనంపుతున్నాం" అన్నారు దాసరి.

"చివరి రోజుల్లో బ్రతికినంత కాలం చస్తూ బ్రతికింది, ఇప్పుడింక నిజంగా బ్రతుకుతుంది" అన్నారు ఆత్రేయ.

సావిత్రిని చిట్టచివరిమజిలీకి తీసుకువెళ్లే వాహనాన్ని విమానంగా అలంకరించారు దాసరి, మురారి.

జనం భోరున ఏడుస్తున్నారు. కొంతమంది స్త్రీలు స్పృహ తప్పి పడిపోయారు. నుంగంబాకం కార్పొరేషన్ స్మశాన వాటికలో కొడుకు సతీష్ అగ్ని సంస్కారం చెయ్యగా

సావిత్రి భౌతికకాయం అగ్నికి ఆహుతి అయ్యింది. కాని అందరి మనస్సులో మిగిలే ఉంటుంది. సూర్యచంద్రులు వున్నంత వరకు, సావిత్రి ప్రజల నోట నానుతుంది. అదే ఆమె సంపాదించుకున్న స్థిరాస్థి.

దక్షిణ భారత సినీ ఛాంబర్ స్వర్ణోత్సవ కమిటి కోమాలో లేకపోయినప్పటికీ చాలా ఆలస్యంగా మేల్కొని సావిత్రి వైద్య ఖర్చులు నిమిత్తం 10,000 రూపాయలు ప్రకటించింది. ఆ ప్రకటన కార్యరూపం దాల్చక ముందే సావిత్రి, 'నాకు ఇక అవసరం లేదులే' అన్నట్లు వెళ్లిపోయింది.

ఆమె కట్టించిన స్కూల్లో చదువుకున్న విద్యార్థులు, వారి సంతతి ఆమెను గుర్తు పెట్టుకుంటారు. ఆమె వల్ల మెడిసిన్ చదివి డాక్టర్ అయిన శ్రీనివాస్ గుర్తుపెట్టుకుంటాడు. 'దేవదాసు' దగ్గరనుంచి 'నవరాత్రి' వరకు ఆమె చిత్రాలతో ఎప్పటికీ జీవించి వుంటుంది.

***మరో సావిత్రి రాదు, అయినా ఫరవాలేదు. ఎందుకంటే ఈ సావిత్రికి మరణంలేదు.***



అలిమేలు, పుష్పవల్లి, విజయ, డా॥ తిరువూరి వెంకటేశ్వరరావు,
సతీష్, జి.జి., సావిత్రి

# మహానటి సావిత్రి మృతి

మద్రాసు డిసెంబరు 27 ప్రముఖ సినీనటి శ్రీమతి సావిత్రి నిన్న రాత్రి ఇక్కడ ఒక ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో మరణిం చారు. ఆమె వయస్సు 45 సంవత్సరాలు. తెలుగు తమిళ చలన చిత్ర రంగంలో ప్రదర్శన ఇచ్చింది. ఆ పాత్రలన్నింటిలో [illegible] సావిత్రి [illegible] చాలా గొప్ప నటిగా ఆమె పేరు పొందారు.



సావిత్రి మహానటులందరితోపాటు మహానటిగా పేరు గాంచారు

ఆమె 250 చిత్రాలకు పైగా నటించారు.

మద్రాసు ఏడాదిన్నర కాలం కోమాలో ఉన్నారు. ఆమె భర్త ప్రముఖ సినీ నటుడు జెమినీగణేష్. వీరికి కుమారుడు కుమార్తె ఉన్నారు. శ్రీమతి సావిత్రి అపుడు మైసూరు బెంగుళూరులోని వారి వ్యక్తిగత పనిమీద వెళ్లారు. అక్కడ ప్రముఖులు పెద్ద సంఖ్యలో వెళ్లి ఆమె భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

తాను పోషించిన ప్రతి పాత్రకు జీవం పోసిన మహానటి సావిత్రి

గుంటూరు జిల్లా చిర్రావూరు గ్రామంలో జన్మించిన సావిత్రి బాల్యం విజయవాడలోనే గడిచింది. విజయవాడలోనే నృత్యం నేర్చుకొన్నది. 12వ ఏట నాటకాలలో సావిత్రి నృత్య

1950లో సంసారం చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు సరసన కథానాయిక పాత్రకు సావిత్రిని ఎంపిక చేశారు. అయితే అంత పెద్ద నటుని ప్రక్కన నటించడానికి సావిత్రి జంకింది. దానితో ఆ చిత్రంలో చిన్న పాత్ర ఇచ్చారు. ఈ విధంగా 1950లో సినీరంగంలో ప్రవేశించింది. 1952లో ఎన్.టి. రామారావు సరసన పల్లెటూరు చిత్రంలో సావిత్రి నటించింది. 1953లో నాగేశ్వరరావు సావిత్రి కలిసి నటించిన దేవదాసు చిత్రం ద్వారా పేరు సంపాదించింది. ఆ చిత్రంలో సావిత్రి ధరించిన పార్వతి పాత్ర నాగేశ్వరరావు ధరించిన దేవదాసు పాత్ర అజరామరమయ్యాయి.

[illegible] అర్ధాంగి మిస్సమ్మ దొంగరాముడు తోడికోడళ్లు గుండమ్మకథ రక్తసంబంధం డాక్టర్ చక్రవర్తి వెలుగు నీడలు మనసే మందిరం మూగమనసులు

# సావిత్రి మృతి

మద్రాసు డిసెంబరు 27 తెలుగు తమిళ చలన చిత్ర రంగాలు రెండింటిలో గొప్ప ప్రఖ్యాతి సార్జించి లక్షలాది ప్రేక్షకుల హృదయాలను చూరగొన్న మహానటి శ్రీమతి సావిత్రి(45) నిన్న రాత్రి



నర్సింగ్‌హోంలో మరణించారు. 18 నెలలుగా వెంటిలేటర్ వుంచి ఆమె చికిత్స పొందుతున్నారు.

శ్రీమతి సావిత్రి - దేవదాసు అర్ధాంగి మిస్సమ్మ మూగమనసులు వంటి అనేక చిత్రాలలో అపూర్వ నటనా వైదుష్యాన్ని ప్రదర్శించి తెలుగు చలనచిత్రరంగంపై కాక తమిళ చలనచిత్ర రంగంలో కూడా చెరగని ముద్ర వేశారు. ఈమెకు భర్త, ఒకకుమారుడు, కుమార్తె ఉన్నారు.



The Largest Circulated Daily in Andhra Pradesh

# ఈనాడు

Simultaneously Published from Vijayawada, Hyderabad & Visakhapatnam

Dr. B. H. Hanumantha Rao (Govt Regd)

విజయవాడ 28-12-1981 సోమవారం 8 పేజీలు 50 పైసలు

## నిర్యుద్ధ ఒప్పందంపై షరతులు

### మాజీమంత్రి త్రివేది మృతి

### సాగర్, కొనత ఎన్నికల్లో 50 శాతం పోలింగ్

## ...వ్యవస్థ మారదు: ఇందిర

### రాలిన 'తార'


### ...ల సస్పెన్షన్

## సావిత్రి అంతిమయాత్ర



మహానటి సావిత్రి భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఆచార్య ఆత్రేయ






## సావిత్రి కుటుంబం – బంధువులు

1. అల్లాడ రత్తయ్య
2. అల్లాడ రత్తమ్మ
3. వడ్డి నరసింహం
4. వడ్డి మున్నెమ్మ
5. బోరగడ్డ జగ్గయ్య
6. బోరగడ్డ భగవతమ్మ
7. అల్లాడ సుబ్రమణ్యం
8. అల్లాడ హనుమంతరావు
9. దావులూరి అన్నపూర్ణమ్మ
10. దావులూరి సుబ్బయ్య
11. కొమ్మారెడ్డి దుర్గాంబ
12. కొమ్మారెడ్డి వెంకట్రామయ్య చౌదరి
13. నిశ్శంకర సుభద్రమ్మ
14. నిశ్శంకర గురవయ్య
15. వడ్డి హనుమంతరావు
16. వడ్డి బాలమ్మ
17. మల్లికార్జునరావు
18. మారుతి

S. సావిత్రి

19. జి.జి.
20. వడ్డి గోవింద్ రావు
21. వడ్డి విజయ చాముండేశ్వరి
22. ప్రసన్న
23. సతీష్
24. అరుణ్ కుమార్
25. అభినయ్
26. మధువంతి
27. ప్రద్యుమ్న
28. ఋత్విక్

సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి కుటుంబం చెన్నైలో వుంటుంది. ఆమె భర్త గోవిందరావు. వీరికి ఇద్దరు అబ్బాయిలు. పెద్ద అబ్బాయి అరుణ్. ఇతని భార్య, నటుడు రజనీకాంత్ భార్యకు దగ్గరి చుట్టం. వీరికి ఒక బాబు. రెండవ అబ్బాయి పేరు అభినయ్. అభినేత్రి సావిత్రి పేరుమీద ఈ పేరు పెట్టానంటుంది విజయ చాముండేశ్వరి. ఆమె ఇప్పుడు తన తల్లితండ్రుల పేర్లమీద 'సాగ' అని ఒక స్పా నడుపుతున్నారు.

సావిత్రి తనయుడు సతీష్. ప్రస్తుతం అమెరికాలో క్యాలిఫోర్నియాలో కంప్యూటర్ ఇంజనీరింగ్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని భార్య మలయాళీ, వారికొక బాబు.

## కృతజ్ఞతలు


ఎస్. జయంతి
షావుకారు జానకి
టి. వి. నగేష్ (జెమిని టీవి)
వాశిరాజు ప్రకాశం
రమణ (ఆంధ్ర జ్యోతి)
జి. మధుసూధనరావు
యమ్. లక్ష్మణ్‌రావు
డి. ఉమ
కె. పున్నయ్య చౌదరి
ముల్లూరి బాలాజి
ముల్లూరి నాయుడు
ఎల్. సాయి ప్రసన్న
కౌండిన్య
గోకుల్
లంక సూర్యనారాయణ
సిహెచ్. కుమార్ బాబు
జి.క్రాంతికుమార్
ఎస్.వి. రమణారావు
డి. కృష్ణమూర్తి
వాగ్దేవు రామ్మూర్తి (యు.ఎస్.ఎ)
సుశీల పద్మనాభన్, వాసంతి
(శ్రీనివాస గాంధీ నిలయమ్, చెన్నై)
పసుపులేటి రామారావు
పంచకర్ల రమేష్
శ్రీలత
మధు
రాధాబాయమ్మ
గంగాధర్
దీప
గీత
తోటకూర రఘు
పండు
నళిని
శారద, తిమ్మారెడ్డి (కర్నూలు)
మురళీకృష్ణ (తెనాలి)
కామేశ్వరి

### ఫోటో సౌజన్యం

జి.ఎన్. భూషణ్
ఫిల్మ్ న్యూస్ ఆనందన్
బాలయ్య
ఇండియన్ ఎక్స్‌ప్రెస్
శ్యామలరావు స్టూడియో
(హైదరాబాద్)
కిన్నెర ఆర్ట్స్
వీరన్న (విజయవాడ)
మోహనరావు (ఆల్ ఇండియా
సీనియర్ ఫోటో జర్నలిస్టు
విజయవాడ)

# సావిత్రి నటించిన చిత్రాలు

## తెలుగు

| సంఖ్య | సంస్థ & చిత్రం పేరు | విడుదల తేది | నటీనటులు | దర్శకుడు |
|---|---|---|---|---|
| 1. | సాధనా ఫిలిమ్స్ సంసారం | డిసెంబర్ 29, 1950 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్, లక్ష్మీరాజ్యం, | ఎల్.వి. ప్రసాద్ |
| 2. | విజయ ప్రొడక్షన్స్ పాతాళ భైరవి | మార్చి 5, 1951 | సావిత్రి, ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్., మాలతి, | కె.వి. రెడ్డి |
| 3. | స్వాతి ఫిలిమ్స్ రూపవతి | మే 17, 1951 | సావిత్రి, సూర్యప్రభ, సూర్యకాంతం,రత్నప్ప, సురభి. | కె. ప్రభాకరరావు |
| 4. | శుభోదయ పిక్చర్స్ ఆదర్శం | 1952 | సావిత్రి, గౌరీనాథశాస్త్రి, జగ్గయ్య, రామశర్మ, టి. కృష్ణ | హెచ్.వి. బాబు |
| 5. | పీపుల్ ఆర్ట్స్ పల్లెటూరు | 1952 | సావిత్రి, ఎన్.టి.ఆర్, నాగభూషణం, ఎస్.వి.ఆర్. | తాతినేని ప్రకాశరావు |
| 6. | భారతలక్ష్మి ప్రొడక్షన్స్ ప్రియురాలు | 1952 | సావిత్రి, గంగారత్నం, జగ్గయ్య, కనకం,కృష్ణకుమారి | టి. గోపీచంద్ |
| 7. | వినోదవారి శాంతి | ఫిబ్రవరి 15, 1952 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్. పేకేటి, కాశ్యప్ రామచంద్ర | వేదాంతం రాఘవయ్య |
| 8. | విజయ ప్రొడక్షన్స్ పెళ్లి చేసి చూడు | ఫిబ్రవరి 29, 1952 | సావిత్రి, ఎన్.టి.ఆర్, ఎస్.వి.ఆర్, జి. వరలక్ష్మి | ఎల్.వి. ప్రసాద్ |
| 9. | ఈస్టిండియా ఫిలిమ్ కంపెని సంక్రాంతి | అక్టోబర్ 10, 1952 | సావిత్రి, సదాశివరావు, శ్రీరంజని, శాంతాకుమారి సురభి, విజయలక్ష్మి | చిత్తజల్లు పుల్లయ్య |
| 10. | భాస్కర్ ప్రొడక్షన్స్ బ్రతుకుతెరువు | ఫిబ్రవరి 6, 1953 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., రేలంగి ఎస్.వి.ఆర్, సూర్యకాంతం | పి.ఎస్. రామ కృష్ణారావు |
| 11. | వినోదవారి దేవదాసు | జూన్ 26, 1953 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, ఎస్.వి.ఆర్, లలిత | వేదాంతం రాఘవయ్య |
| 12. | శోభాఫిలిమ్స్ పరోపకారం | సెప్టెంబర్ 25, 1953 | సావిత్రి, సి.ఎస్.రావు ఆర్. నాగేశ్వరరావు, రమా | కమల్ ఘోష్ |
| 13. | ప్రసాద్ ఆర్ట్‌పిక్చర్స్ పెంపుడు కొడుకు | నవంబరు 11, 1953 | సావిత్రి, ఎస్.వి.ఆర్, శివాజి గణేశన్, పుష్పవల్లి | ఎల్.వి. ప్రసాద్ |
| 14. | ఈస్టిండియా ఫిలిమ్స్ కంపెని ప్రతిజ్ఞ | 1953 | సావిత్రి, గుమ్మడి, కాంతారావు. రమణారెడ్డి, సుదర్శన్, గిరిజ, రాజనాల | హెచ్.ఎమ్. రెడ్డి |

| | | | | |
|---|---|---|---|---|
| 15. | శ్రీగజాననా ప్రొడక్షన్స్ కోడరికం | 1953 | సావిత్రి, ఆర్.సి. కాశ్యప, ఎస్. వరలక్ష్మి | కె. వెంబు & కె.ఎస్.ఆర్. రావు |
| 16. | విజయ ప్రొడక్షన్స్ చంద్రహారం | జనవరి 6, 1954 | సావిత్రి, ఎన్.టి.ఆర్ ఎస్.వి.ఆర్, శ్రీరంజని | కమలాకర కామేశ్వరరావు |
| 17. | జనత ప్రొడక్షన్స్ పరివర్తన | సెప్టెంబరు 1, 1954 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, ఎన్.టి.ఆర్, సీత | తాతినేని ప్రకాశరావు |
| 18. | నవయుగ ప్రొడక్షన్స్ జ్యోతి | 1954 | సావిత్రి, ప్రభాకర్, రామచంద్ర, జి.వరలక్ష్మి | కె.బి. తిలక్ & శ్రీధర్ |
| 19. | జంపన & నంది ప్రొడక్షన్స్ మేనరికం | 1954 | సావిత్రి, నారాయణరావు జి. వరలక్ష్మి | జంపన |
| 20. | విజయాప్రొడక్షన్స్ మిస్సమ్మ | జనవరి 12, 1955 | సావిత్రి, ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్., జమున | ఎల్.వి. ప్రసాద్ |
| 21. | రాగిణి ఫిలిమ్స్ అర్థాంగి | జనవరి 26, 1955 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, జగ్గయ్య, నాగయ్య, గుమ్మడి | పి. పుల్లయ్య |
| 22. | సాధనా ప్రొడక్షన్స్ సంతానం | ఆగస్టు 5, 1955 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, చలం రేలంగి,ఎస్.వి.ఆర్, శ్రీరంజని | రంగనాథదాసు |
| 23. | ఏ.వి.ఎమ్ ప్రొడక్షన్స్ వదిన | ఆగస్టు 9, 1955 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, రేలంగి, పండరి బాయి, కన్నాంబ | ఎమ్.వి. రామన్ |
| 24. | వినోదవారి కన్యాశుల్కం | ఆగస్టు 26, 1955 | సావిత్రి, సి.ఎస్.రావు, గోవిందరాజుల సుబ్బారావు గుమ్మడి, ఎన్.టి.ఆర్, జానకి | పి. పుల్లయ్య |
| 25. | అన్నపూర్ణ పిక్చర్స్ దొంగరాముడు | అక్టోబర్ 1, 1955 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, చలం జగ్గయ్య, రేలంగి, జమున | కె.వి. రెడ్డి |
| 26. | నరసు స్టూడియోస్ భలే రాముడు | ఏప్రియల్ 6, 1956 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, గిరిజ, రేలంగి | వేదాంతం రాఘవయ్య |
| 27. | లలితా ఫిలిమ్స్ చరణదాసి | డిసెంబర్ 20, 1956 | సావిత్రి, ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్, ఎస్.వి.ఆర్ | తాతినేని ప్రకాశరావు |
| 28. | అన్నపూర్ణాపిక్చర్స్ తోడికోడళ్ళు | జనవరి 11, 1957 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్ అంజలి, కన్నాంబ, | తాతినేని ప్రకాశరావు |
| 29. | విజయా ప్రొడక్షన్స్ మాయాబజార్ | మార్చి 27, 1957 | సావిత్రి, ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్., ఏ.ఎన్.ఆర్. | కె.వి.రెడ్డి |
| 30. | నరసు స్టూడియోస్ భలే అమ్మాయిలు | సెప్టెంబర్ 6, 1957 | సావిత్రి, ఎన్.టి.ఆర్, సి.ఎస్.ఆర్, జగ్గయ్య | వేదాంతం రాఘవయ్య |
| 31. | అనుపమ ఫిలిమ్స్ ఎమ్.ఎల్.ఎ | సెప్టెంబర్ 19, 1957 | సావిత్రి, జగ్గయ్య, గుమ్మడి | కె.బి.తిలక్ |

| | | | | |
|---|---|---|---|---|
| 32. | విక్రమ్ ప్రొడక్షన్స్ కుటుంబగౌరవం | నవంబర్ 2, 1957 | సావిత్రి, కన్నాంబ, ఎన్.టి.ఆర్. | బి.ఎస్. రంగ |
| 33. | ఆర్.ఆర్.పిక్చర్స్ కార్తవరాయుని కథ | అక్టోబర్ 18, 1958 | సావిత్రి, ఎన్.టి.ఆర్. | రామన్న |
| 34. | సంగీతాప్రొడక్షన్స్ ఇంటిగుట్టు | అక్టోబర్ 31, 1958 | సావిత్రి గుమ్మడి, ఎన్.టి.ఆర్. | వేదాంతం రాఘవయ్య |
| 35. | అన్నపూర్ణా పిక్చర్స్ మాంగల్యబలం | జనవరి 7, 1959 | సావిత్రి,ఏ.ఎన్.ఆర్., ఎస్.వి.ఆర్ | ఆదుర్తి సుబ్బారావు |
| 36. | విజయప్రొడక్షన్స్ అప్పుచేసిపప్పుకూడు | జనవరి 14, 1959 | జమున, సి.ఎస్.ఆర్. సావిత్రి, ఎన్.టి.ఆర్. | ఎల్.వి. ప్రసాద్ |
| 37. | శ్రీసారథిస్టూడియోస్ భాగ్యదేవత | అక్టోబర్ 23, 1959 | సావిత్రి, జగ్గయ్య, రేలంగి | టి. చాణక్య |
| 38. | సాహిని ఆర్ట్రప్రొడక్షన్స్ బందరాముడు | నవంబరు 6, 1959 | సావిత్రి, ఎన్.టి.ఆర్., రేలంగి | పి. పుల్లయ్య |
| 39. | శంభు ఫిలిమ్స్ నమ్మినబంటు | జనవరి 7, 1960 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., ఎస్.వి.ఆర్., గుమ్మడి | ఆదుర్తి సుబ్బారావు |
| 40. | పద్మశ్రీ పిక్చర్స్ వెంకటేశ్వర మహత్యం | జనవరి 9, 1960 | సావిత్రి, ఎన్.టి.ఆర్, రేలంగి వరలక్ష్మి, గుమ్మడి, నాగయ్య | పి.పుల్లయ్య |
| 41. | పక్షిరాజా స్టూడియోస్ విమల | ఆగస్టు 11, 1960 | సావిత్రి, శివాజి | ఎస్.ఎమ్. శ్రీరాములు నాయుడు |
| 42. | శ్రీ పొడక్షన్స్ అభిమానం | ఆగస్టు 26, 1960 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., కృష్ణకుమారి, రేలంగి | సి.ఎస్.రావు |
| 43. | అశ్వరాజ్ ప్రొడక్షన్స్ దీపావళి | సెప్టెంబరు 22, 1960 | సావిత్రి, ఎన్.టి.ఆర్, ఎస్.వి.ఆర్, కృష్ణకుమారి | రజనీకాంత్ |
| 44. | సంగీతా ప్రొడక్షన్స్ మామకు తగ్గ అల్లుడు | డిసెంబరు 9, 1960 | సావిత్రి, రేలంగి, ఎస్.వి.ఆర్. | వేదాంతం రాఘవయ్య |
| 45. | ప్రవీణా ఆర్ట్ ఫిలిమ్స్ మా బాబు | డిసెంబరు 22, 1960 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్ | తాతినేని ప్రకాశరావు |
| 46. | మంజీరా ఫిలిమ్స్ చివరకు మిగిలేది | 1960 | సావిత్రి, కాంతారావు, బాలయ్య, ప్రభాకరరెడ్డి | జి. రామినీడు |
| 47. | శ్రీ సారథిస్టూడియోస్ కుంకుమరేఖ | 1960 | సావిత్రి, జగ్గయ్య, బాలయ్య, రేలంగి | టి. చాణక్య |
| 48. | అన్నపూర్ణాపిక్చర్స్ వెలుగు నీడలు | జనవరి 6, 1961 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, జగ్గయ్య, రేలంగి | ఆదుర్తి సుబ్బారావు |
| 49. | శ్రీసారథి స్టూడియోస్ కలిసివుంటే కలదు సుఖం | సెప్టెంబరు 8, 1961 | సావిత్రి, ఎన్.టి.ఆర్. రేలంగి, ఎస్.వి.ఆర్ | టి. చాణక్య |

| | | | | |
|---|---|---|---|---|
| 50. | జగపతి పిక్చర్స్<br>ఆరాధన | ఫిబ్రవరి<br>16, 1962 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.,<br>రేలంగి, జగ్గయ్య, గుమ్మడి | వి. మధుసూధనరావు |
| 51. | బాబూమూవీస్<br>మంచిమనసులు | ఏప్రియల్<br>11, 1962 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.,<br>ఎస్.వి.ఆర్, షావుకారుజానకి | ఆదుర్తి సుబ్బారావు |
| 52. | విజయాప్రొడక్షన్స్<br>గుండమ్మకథ | జూన్<br>7, 1962 | సావిత్రి, ఎన్.టి.ఆర్.,<br>ఎస్.వి.ఆర్., జమున, | కమలాకర<br>కామేశ్వరరావు |
| 53. | పద్మశ్రీ పిక్చర్స్<br>సిరి సంపదలు | సెప్టెంబర్<br>19, 1962 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., రేలంగి<br>నాగయ్య, గుమ్మడి | పి. పుల్లయ్య |
| 54. | రాజలక్ష్మిప్రొడక్షన్స్<br>రక్త సంబంధం | నవంబరు<br>1, 1962 | సావిత్రి, ఎన్.టి.ఆర్., దేవిక,<br>కాంతారావు, రేలంగి | వి.మధుసూదనరావు |
| 55. | శ్రీసారధిస్టూడియోస్<br>ఆత్మబంధువు | డిసెంబర్<br>14, 1962 | సావిత్రి,ఎన్.టి.ఆర్.,<br>రేలంగి, ఎస్.వి.ఆర్ | పి.ఎస్.రామకృష్ణారావు |
| 56. | అన్నపూర్ణా పిక్చర్స్<br>చదువుకున్న అమ్మాయిలు | ఏప్రియల్<br>10, 1963 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.,<br>శోభన్‌బాబు, కృష్ణకుమారి | ఆదుర్తి సుబ్బారావు |
| 57. | రాజ్యం పిక్చర్స్<br>నర్తనశాల | అక్టోబరు<br>11, 1963 | సావిత్రి, కాంతారావు,<br>ఎన్.టిఆర్, శోభన్‌బాబు | కమలాకర<br>కామేశ్వరరావు |
| 58. | సాధనపిక్చర్స్<br>తోబుట్టువులు | 1963 | సావిత్రి, శారద,<br>జగ్గయ్య, జమున | రంగనాథ దాస్ |
| 59. | శ్రీశంభు ఫిలిమ్స్<br>పూజాఫలం | జనవరి<br>1, 1964 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.,<br>గుమ్మడి, జమున, జగ్గయ్య | బి.ఎన్.రెడ్డి |
| 60. | బాబూ మూవీస్<br>మూగమనసులు | జనవరి<br>30, 1964 | సావిత్రి, ఏఎన్.ఆర్.<br>గుమ్మడి, జమున | ఆదుర్తి సుబ్బారావు |
| 61. | అన్నపూర్ణ పిక్చర్స్<br>డాక్టర్ చక్రవర్తి | జులై<br>10, 1964 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.<br>జగ్గయ్య, గుమ్మడి | ఆదుర్తి సుబ్బారావు |
| 62. | జీవన్ ఫిలిమ్స్<br>పతివ్రత | 1964 | సావిత్రి | సి.హెచ్.నారాయణ<br>మూర్తి |
| 63. | అశోక్ మూవీస్<br>సుమంగళి | జనవరి<br>1, 1965 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.,<br>జగ్గయ్య, రేలంగి | ఆదుర్తి |
| 64. | శ్రీవాణీ ఫిలిమ్స్<br>నాదీ ఆడజన్మే | జనవరి<br>7, 1965 | సావిత్రి,ఎన్.టి.ఆర్.,జగ్గయ్య,<br>ఎస్.వి.ఆర్., జమున | ఏ.సి. త్రిలోక్‌చందర్ |
| 65. | రేఖా&మురళి ఆర్ట్స్<br>దేవత | జులై<br>24, 1965 | సావిత్రి, ఎన్.టి.ఆర్,<br>నాగయ్య, పద్మనాభం | హేమాంబరధరరావు |
| 66. | ప్రసాద్ ఆర్ట్స్‌పిక్చర్స్<br>మనుషులు మమతలు | సెప్టెంబర్<br>3, 1965 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్.<br>జగ్గయ్య, జయలలిత | ప్రత్యగాత్మ |
| 67. | ఎన్.ఏ.టి.వారి<br>శ్రీకృష్ణ పాండవీయం | జనవరి<br>13, 1966 | సావిత్రి, ఎన్.టి.ఆర్.,<br>గుమ్మడి | ఎన్.టి.రామారావు |

| | | | | |
|---|---|---|---|---|
| 68. | ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ నవరాత్రి | మార్చి 29, 1966 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., గుమ్మడి, జమున, రేలంగి | తాతినేని రామారావు |
| 69. | శ్రీకృష్ణ సాయిఫిలిమ్స్ మనసే మందిరం | అక్టోబర్ 6, 1966 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్, జగ్గయ్య, రేలంగి | సి.వి. శ్రీధర్ |
| 70. | భారత్ ఫిలిమ్స్ భక్తపోతన | 1966 | సావిత్రి, ఎస్.వి.ఆర్. జగ్గయ్య, రేలంగి | జి.రామినీడు |
| 71. | మోడరన్ థియేటర్స్ మొనగాళ్ళకు మొనగాడు | 1966 | సావిత్రి, ఎస్.వి.ఆర్., హరనాథ్, కృష్ణకుమారి | ఎస్.డి.లాల్ |
| 72. | గౌతమిపిక్చర్స్ నిర్దోషి | మార్చి 2, 1967 | సావిత్రి, ఎన్.టి.ఆర్., అంజలి | దాదా మిరాశి |
| 73. | విశ్వశాంతి పిక్చర్స్ కంచుకోట | మార్చి 22, 1967 | సావిత్రి, ఎన్.టి.ఆర్., దేవిక, కాంతారావు | సి.ఎస్.రావు |
| 74. | ఎన్.ఏ.టి.వారి ఉమ్మడి కుటుంబం | ఏప్రిల్ 20, 1967 | సావిత్రి, ఎన్.టి.ఆర్, దేవికా, కృష్ణకుమారి | యోగానంద్ |
| 75. | సురేష్ మూవీస్ ప్రాణమిత్రులు | మే 5, 1967 | సావిత్రి,ఏ.ఎన్.ఆర్.,గుమ్మడి కె. జగ్గయ్య, శాంతాకుమారి | పి.పుల్లయ్య |
| 76. | రామావిజేతా ఫిలిమ్స్ తల్లిప్రేమ | మార్చి 9, 1968 | సావిత్రి,ఎన్.టి.ఆర్, కాంచన, రేలంగి | శ్రీకాంత్ |
| 77. | చంద్రశేఖర ఫిలిమ్స్ మూగజీవులు | 1968 | సావిత్రి, జి.వరలక్ష్మి, రాజ్‌కుమార్ | జి.వరలక్ష్మి |
| 78. | శ్రీమాతా పిక్చర్స్ చిన్నారి పాపలు | ఆగస్టు 14, 1968 | సావిత్రి, షావుకారు జానకి, జగ్గయ్య, రేలంగి, జమున | సావిత్రి |
| 79. | ఎస్.వి.ఆర్ ఫిలిమ్స్ బాంధవ్యాలు | ఆగస్టు 15, 1968 | సావిత్రి, ఎస్.వి.ఆర్, లక్ష్మి, నాగయ్య | ఎస్.వి. రంగారావు |
| 80. | కల్చరల్ ఆర్ట్స్ జీవితాలు | 1968 | సావిత్రి | పి.యస్.మూర్తి |
| 81. | ఎన్.ఏ.టి.వారి వరకట్నం | జనవరి 9, 1969 | సావిత్రి, ఎన్.టి.ఆర్., రేలంగి, కృష్ణకుమారి | ఎన్.టి.రామారావు |
| 82. | ప్రగతి పిక్చర్స్ విచిత్ర కుటుంబం | మే 28, 1969 | సావిత్రి, ఎన్.టి.ఆర్., కృష్ణ విజయనిర్మల, శోభన్‌బాబు | కె.ఎస్.ప్రకాశరావు |
| 83. | పూర్ణాఆర్ట్ పిక్చర్స్ మాతృదేవత | నవంబరు 7, 1969 | సావిత్రి, ఎన్.టి.ఆర్., రేలంగి | సావిత్రి |
| 84. | అరుణాచలంస్టూడియోస్ చిరంజీవి | 1969 | సావిత్రి, చలమ్ | సావిత్రి |
| 85. | చక్రవర్తి పిక్చర్స్ మరోప్రపంచం | ఏప్రియల్ 10, 1970 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., గుమ్మడి, జమున | ఆదుర్తి |

| | | | | |
|---|---|---|---|---|
| 86. | జ్యోతి సినీ సిండికేట్ వారి పెత్తందార్లు | ఏప్రియల్ 30, 1970 | సావిత్రి, ఎన్.టి.ఆర్., రేలంగి | సి.యస్.రావు |
| 87. | జయలక్ష్మి ఆర్ట్స్ తల్లిదండ్రులు | జులై 23, 1970 | సావిత్రి, జగ్గయ్య,శోబన్‌బాబు, రేలంగి, నాగయ్య | కె.బాబూరావు |
| 88. | ఎన్.ఏ.టి.వారి కోడలు దిద్దిన కాపురం | అక్టోబర్ 21, 1970 | సావిత్రి, ఎన్.టి.ఆర్., వాణిశ్రీ, జగ్గయ్య, రేలంగి | యోగానంద్ |
| 89. | హేమాఫిలిమ్స్ సుపుత్రుడు | జనవరి 29, 1971 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్., అంజలి, లక్ష్మి | తాతినేని రామారావు |
| 90 | శ్రీవేంకటేశ్వరస్వామి ఫిలిమ్స్,నిండుదంపతులు | ఫిబ్రవరి 4, 1971 | సావిత్రి, ఎన్.టి.ఆర్., విజయనిర్మల | కె. విశ్వనాథ్ |
| 91. | సావిత్రి కంబైన్స్ వింత సంసారం | ఏప్రియల్ 14, 1971 | సావిత్రి, జగ్గయ్య | సావిత్రి |
| 92. | భరణిపిక్చర్స్ విచిత్ర దాంపత్యం | ఏప్రియల్ 16, 1971 | సావిత్రి, శోభన్‌బాబు, విజయనిర్మల | పి.సి. రెడ్డి |
| 93. | రామకృష్ణా పిక్చర్స్ తల్లీకూతురు | నవంబరు 5, 1971 | సావిత్రి, శోభన్‌బాబు జగ్గయ్య | జి. రామినీడు |
| 94. | భాను మూవీస్ కన్న తల్లి | ఆగస్టు 26, 1972 | సావిత్రి, శోభన్‌బాబు చంద్రకళ, రాధాకుమారి | టి. మాధవరావు |
| 95. | ప్రాతన ఫిలిమ్స్ శభాష్ పాపన్న | సెప్టెంబర్ 18, 1972 | సావిత్రి, జగ్గయ్య, శాంతకుమారి, రేలంగి | ఎస్.ఎస్. లాల్ |
| 96. | శభాష్ బేబి | సెప్టెంబర్ 21, 1972 | సావిత్రి, కృష్ణంరాజు దేవిక, నాగయ్య | ఎన్. ప్రసాద్ |
| 97. | విజయలక్ష్మి మూవీస్ అమ్మమాట | 1972 | సావిత్రి, నాగయ్య, వాణిశ్రీ, శోభన్‌బాబు, శ్రీదేవి. | వి. రామచంద్రరావు |
| 98. | దీప్తి ఇంటర్నేషనల్ దేశోద్ధారకుడు | మార్చి 29, 1973 | సావిత్రి, ఎన్.టి.ఆర్. నాగభూషణం, వాణిశ్రీ | సి.ఎస్. రావు |
| 99. | రామ విజేత ఫిలిమ్స్ రామరాజ్యం | ఏప్రిల్ 4, 1973 | సావిత్రి, కె. జగ్గయ్య, చంద్రకళ, జి. వరలక్ష్మి | కె.బాబురావు |
| 100. | శ్రీవాణి ఆర్ట్‌కంబైన్స్ పుట్టినిల్లు మెట్టినిల్లు | జులై 12, 1973 | సావిత్రి, కృష్ణ, శోభన్‌బాబు చంద్రకళ, లక్ష్మి | ఎస్. పట్టు |
| 101. | స్వామి ఇంటర్నేషనల్ జ్యోతిలక్ష్మి | డిసెంబర్ 7, 1973 | సావిత్రి, రామకృష్ణ, జ్యోతిలక్ష్మి, రామప్రభ | కె.ఎస్. రామిరెడ్డి |
| 102. | టి.జి.కె.ఫిలిమ్స్ ఎర్రకోటవీరుడు | 1973 | సావిత్రి, ఎన్.టి.ఆర్. బి.సరోజాదేవి | ఎమ్.ఎస్. పార్థసారథి |
| 103. | అన్నపూర్ణ పిక్చర్ పూలమాల | 1973 | సావిత్రి, కృష్ణంరాజు, చంద్రకళ | పి.వి. రెడ్డి |

| | | | | |
|---|---|---|---|---|
| 104. | అనిల్ ఆర్ట్స్<br>గాలిపటాలు | మార్చి<br>1, 1974 | సావిత్రి, కృష్ణ, విజయనిర్మల<br>జగ్గయ్య | తాతినేని ప్రకాశరావు |
| 105. | విజయ ప్రొడక్షన్స్<br>తులసి | మే<br>24, 1974 | సావిత్రి, గుమ్మడి, కల్పన<br>జి. వరలక్ష్మి, జగ్గయ్య | కె. బాబురావు |
| 106. | చిత్రాంజలి పిక్చర్స్<br>మనుషులు మట్టిబొమ్మలు | మే<br>31, 1974 | సావిత్రి, లక్ష్మి, జమున<br>జగ్గయ్య, కృష్ణ | బి. భాస్కరరావు |
| 107. | లోకేశ్వరి ఆర్ట్ పిక్చర్స్<br>ఆడంబరాలు అనుబంధాలు | ఆగస్టు<br>9, 1974 | సావిత్రి, రావుగోపాల్‌రావు<br>శారద, కృష్ణ | సి.ఎస్. రావు |
| 108. | లావణ్య పిక్చర్స్<br>అనగనగా ఒక తండ్రి | 1974 | సావిత్రి, గిరిబాబు, గుమ్మడి,<br>రోజా రమణి, నాగయ్య | సి.ఎస్. రావు |
| 109. | డాల్టన్స్<br>జీవితరంగం | 1974 | సావిత్రి, గుమ్మడి, ప్రమీల,<br>ఎస్.వి.ఆర్. చంద్రమోహన్ | పి.డి. ప్రసాద్ |
| 110. | నవభారత్ ఆర్ట్ ఫిలిమ్స్<br>ముగ్గురు అమ్మాయిలు | 1974 | సావిత్రి, చంద్రమోహన్,<br>చంద్రకళ, రేలంగి | ప్రత్యగాత్మ |
| 111. | శ్రీ గౌతమ్ పిక్చర్స్<br>ఉత్తమ ఇల్లాలు | ఏప్రిల్<br>18, 1974 | సావిత్రి, అంజలి, కృష్ణ | పి. సాంబశివరావు |
| 112. | రేఖా & మురళి ప్రొడక్షన్స్<br>సినిమా వైభవం | ఏప్రిల్<br>12, 1975 | సావిత్రి, పద్మనాభమ్<br>విజయనిర్మల | |
| 113. | జ్యోతీ ఇంటర్నేషనల్<br>తీర్పు | అక్టోబర్<br>1, 1975 | సావిత్రి, ఎన్.టి.ఆర్. | యు. విశ్వేశ్వరరావు |
| 114. | విజయవెళాంగినీ పిక్చర్స్<br>భారతంలో ఒకఅమ్మాయి | అక్టోబర్<br>2, 1975 | సావిత్రి, చంద్రమోహన్,<br>మురళీమోహన్, రాజసులోచన | దాసరి |
| 115. | శ్రీ గణేష్ చిత్రాలయ<br>సంతానం సౌభాగ్యం | అక్టోబర్<br>24, 1975 | సావిత్రి, పండరిబాయి,<br>కృష్ణ, విజయనిర్మల | డి.ఎస్. ప్రకాష్‌రావు |
| 116. | రంజిత్ మూవీస్<br>చీకటివెలుగులు | జులై<br>11, 1975 | సావిత్రి, కృష్ణ, వాణిశ్రీ | కె.ఎస్. ప్రకాష్‌రావు |
| 117. | చక్రపాణి మూవీస్<br>మా ఇంటి దేవుడు | 1975 | సావిత్రి, కె. హరిబాబు,<br>విజయలలిత, సతీష్ | బి.వి. ప్రసాద్ |
| 118. | శ్రీ విజయసారథిపిక్చర్స్<br>పూజ | 1975 | సావిత్రి, రామకృష్ణ, వాణిశ్రీ,<br>రేలంగి, చంద్రమోహన్ | మురుగన్ |
| 119. | మాధవి ఆర్ట్స్ కంబైన్స్<br>వైకుంఠపాళి | 1975 | సావిత్రి, గుమ్మడి, రంగనాథ్,<br>పుష్పలత, శారద | కె. బాపయ్య |
| 120. | విజయకృష్ణ కంబైన్స్<br>కవిత | మార్చి<br>18, 1976 | సావిత్రి, చంద్రమోహన్,<br>జగ్గయ్య, విజయనిర్మల | విజయనిర్మల |
| 121. | జోత్స్న సినీ సిండికేట్<br>పెళ్ళికానితండ్రి | 1976 | సావిత్రి, జగ్గయ్య | పద్మనాభమ్ |

| | | | | |
|---|---|---|---|---|
| 122. | శ్రీ కాకతీయ పిక్చర్స్ చిల్లరదేవుళ్ళు | మార్చి 11, 1977 | సావిత్రి, ప్రభాకరరెడ్డి, కాంచన . | టి. మధుసూదన్‌రావు |
| 123. | శ్రీ విజయకృష్ణ మూవీస్ పంచాయతి | సెప్టెంబర్ 2, 1977 | సావిత్రి, జగ్గయ్య, కృష్ణ, విజయనిర్మల | విజయనిర్మల |
| 124. | శ్యామ్‌ప్రసాద్‌ఆర్ట్ పిక్చర్స్ రంభ ఊర్వశి మేనక | 1977 | సావిత్రి | సాంబశివరావు |
| 125. | శ్రీలక్ష్మి నారాయణ ఎంటర్‌ప్రైజెస్ ముగ్గురు ముగ్గురే | మే 27, 1978 | సావిత్రి, మోహన్‌బాబు, జయచిత్ర, కృష్ణ, ప్రభాకరరెడ్డి | ఎస్.డి. లాల్ |
| 126. | విఠల్ ప్రొడక్షన్స్ జగన్మోహిని | ఆగస్టు 18, 1978 | సావిత్రి, నరసింహరాజు ప్రభ, విజయలక్ష్మి, బాలకృష్ణ | బి. విఠలాచార్య |
| 127. | అమృత ఫిలిమ్స్ ప్రేమ - పగ | ఆగస్టు 25, 1978 | సావిత్రి, మురళిమోహన్, లత, శారద, ప్రభాకరరెడ్డి | బి.వి. ప్రసాద్ |
| 128. | శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ అమరప్రేమ | 1978 | సావిత్రి, కమల్‌హాసన్, మనిమాల | తాతినేని రామారావు |
| 129. | దేవి ఆర్ట్ ప్రొడక్షన్స్ దేవదాసు మళ్ళీ పుట్టాడు | 1978 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్. వాణిశ్రీ, విజయనిర్మల | దాసరి |
| 130. | శ్రీ విజయకృష్ణ మూవీస్ రౌడీ రంగమ్మ | 1978 | సావిత్రి, చంద్రమోహన్ విజయనిర్మల | విజయనిర్మల |
| 131. | ధర్మ విజయ పిక్చర్స్ పునాదిరాళ్ళు | జూన్ 27, 1979 | సావిత్రి, చిరంజీవి, నరసింహరాజు, కవిత | రాజ్‌కుమార్ |
| 132. | విజయ మాధవి పిక్చర్స్ రంగూన్ రౌడీ | సెప్టెంబర్ 8, 1979 | సావిత్రి, కృష్ణంరాజు, జయప్రద, మోహన్‌బాబు | దాసరి |
| 133. | యువ చిత్ర గోరింటాకు | అక్టోబర్ 19, 1979 | సావిత్రి, శారద శోభన్‌బాబు | దాసరి |
| 134. | అండాల్ చిత్ర మూవీస్ అల్లరి పిల్లలు | 1979 | సావిత్రి, రామకృష్ణ | సి.ఎస్. రావు |
| 135. | శ్రీ పద్మావతి ఇంటర్నేషనల్ నా యిల్లు నావాళ్ళు | 1979 | సావిత్రి, నూతనప్రసాద్ | రాజచంద్ర |
| 136. | మంచిని పెంచాలి | జనవరి 31, 1980 | సావిత్రి, ఈశ్వరరావు, కాంతారావు | త్రిపురనేని మహారథి |
| 137. | కాయ్‌సైయ్ ఫిలిమ్ ఇంటర్నేషనల్ సర్కస్ రాముడు | మార్చి 1, 1980 | సావిత్రి, ఎన్.టి.ఆర్., జయప్రద, సుజాత | దాసరి |

| | | | | |
|---|---|---|---|---|
| 138. | ప్రభు చిత్ర ప్రేమ తరంగాలు | అక్టోబర్ 24, 1980 | సావిత్రి, కృష్ణంరాజు, చిరంజీవి, జయసుధ, | ఎస్.పి. చిట్టిబాబు |
| 139. | రామ్ శ్యామ్ క్రియేషన్ రామాయణంలో పిడకలవేట | 1980 | సావిత్రి, మురళీమోహన్ గిరిబాబు, దీప | రాజచంద్ర |
| 140. | తారక ప్రభు ఫిలిమ్స్ సుజాత | 1980 | సావిత్రి, సుజాత, మురళీమోహన్, మోహన్‌బాబు | దాసరి |
| 141. | హేరంబ చిత్ర మందిర్ పులిబిడ్డ | 1981 | సావిత్రి, కృష్ణంరాజు అంజలి, శ్రీదేవి | వి. మధుసూధన్‌రావు |
| 142. | శ్రీఅజంత సినీ ప్రొడక్షన్స్ అందరికంటే మొనగాడు | ఏప్రిల్ 25, 1985 | సావిత్రి, ప్రభాకరరెడ్డి, రాజ్యలక్ష్మి, జయసుధ, కృష్ణ | టి. కృష్ణ |

## తమిళ్

| సంఖ్య | సంస్థ & చిత్రం పేరు | విడుదల తేది | నటీనటులు | దర్శకుడు |
|---|---|---|---|---|
| 1. | విజయ ప్రొడక్షన్స్ పాతాళభైరవి | మే 17, 1951 | సావిత్రి, ఎన్.టి.ఆర్. ఎస్.వి.ఆర్., మాలతి | కె.వి. రెడ్డి |
| 2. | విజయ ప్రొడక్షన్స్ కల్యాణం పన్నిపార్ | ఆగస్టు 15, 1952 | సావిత్రి, ఎన్.టి.ఆర్., ఎస్.వి.ఆర్. వరలక్ష్మి | ఎల్.వి. ప్రసాద్ |
| 3. | నారాయణ & కంపెని మనంపోల్ మాంగల్యం | ఏప్రిల్ 17, 1953 | సావిత్రి, జెమిని, సురభి బాలసరస్వతి | పి. పుల్లయ్య |
| 4. | వినోదవారి దేవదాసు | సెప్టెంబర్ 11, 1953 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్. లలిత | వేదాంతం రాఘవయ్య |
| 5. | శోభా ఫిలిమ్స్ పరోపకారం | సెప్టెంబర్ 25, 1953 | సావిత్రి, రామశర్మ, జి. వరలక్ష్మి, నాగేశ్వరరావు | కమల్ ఘోష్ |
| 6. | రోహిణి వారి వంజమ్ | డిసెంబర్ 5, 1953 | సావిత్రి, మాధురి దేవి | వై. ఆర్. స్వామి |
| 7. | విజయ ప్రొడక్షన్స్ చంద్రహారం | జనవరి 14, 1954 | సావిత్రి, శ్రీరంజనీ ఎన్.టి.ఆర్. | కమలాకర కామేశ్వరరావు |
| 8. | మోడరన్ థియేటర్స్ సుగమ్ ఎంగే | సెప్టెంబర్ 9, 1954 | సావిత్రి, రామస్వామి, లలిత, బాలయ్య | కె. రామ్‌నాథ్ |
| 9. | జంపన & నంది ప్రొడక్షన్స్, కుడుంబమ్ | 1954 | సావిత్రి, ఎస్.వి. రంగారావు పి. కన్నాంబ | జంపనా |

| | | | | |
|---|---|---|---|---|
| 10. | ఏ.వి.ఎమ్. ప్రొడక్షన్స్ చెల్లెపిల్ల | జూన్ 24, 1955 | సావిత్రి, టి.ఎస్.బాలయ్య కె.ఆర్. రంగస్వామి, | ఎమ్.వి. రామన్ |
| 11. | విజయ ప్రొడక్షన్స్ మిసియమ్మ | జనవరి 14, 1955 | సావిత్రి, జెమిని, జమున ఏ.ఎన్.ఆర్., ఎస్.వి.ఆర్. | ఎల్.వి. ప్రసాద్ |
| 12. | అరుణ ఫిలిమ్స్ గోమతియిన్ కథాలిన్ | సెప్టెంబర్ 10, 1955 | సావిత్రి, ముతులక్ష్మి టి.ఆర్. రామచంద్రన్ | పి. నీలకంఠమ్ |
| 13. | మణి ప్రొడక్షన్ మామన్ మహల్ | అక్టోబర్ 14, 1955 | సావిత్రి, జెమిని, బాలయ్య చంద్రబాబు | ఆర్.ఎస్. మణి |
| 14. | మోడరన్ థియేటర్స్ మహేశ్వరి | నవంబర్ 13, 1955 | సావిత్రి, జెమిని | టి.ఆర్. రఘునాథ్ |
| 15. | విజయ స్టూడియోస్ గుణసుందరి | డిసెంబర్ 16, 1955 | సావిత్రి, జెమిని, మాధవన్ | కమలాకర కామేశ్వరరావు |
| 16. | రాగిణి ఫిలిమ్స్ పెన్నిన్ పెరుమయి | ఫిబ్రవరి 17, 1956 | సావిత్రి, జెమిని, శివాజి గుమ్మడి, నాగయ్య | పి. పుల్లయ్య |
| 17. | నరసు స్టూడియోస్ ప్రేమ పాశం | మార్చి 31, 1956 | సావిత్రి, జెమిని, రేలంగి | వేదాంతం రాఘవయ్య |
| 18. | వీనస్ పిక్చర్స్ అమరదీపం | జూన్ 29, 1956 | సావిత్రి, శివాజి, ఇ.వి. సరోజ, పద్మిని | తాతినేని ప్రకాశ్‌రావు |
| 19. | లలిత ఫిలిమ్స్ మాదరకుల మాణిక్కం | డిసెంబర్ 20, 1956 | సావిత్రి, జెమిని, ఏ.ఎన్.ఆర్. అంజలి, కన్నాంబ,ఎస్.వి.ఆర్. | తాతినేని ప్రకాశ్‌రావు |
| 20. | అన్నపూర్ణ పిక్చర్స్ ఎంగల్‌వీట్టు మహాలక్ష్మి | ఫిబ్రవరి 1, 1957 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్. | ఆదుర్తి |
| 21. | విజయా ప్రొడక్షన్స్ మాయాబజార్ | ఏప్రిల్ 12, 1957 | సావిత్రి, ఎన్.టి.ఆర్. ఏ.ఎన్.ఆర్., ఎస్.వి.ఆర్. | కె.వి. రెడ్డి |
| 22. | శరవణభవ యునిట్ పిక్చర్స్ వనంగముడి | ఏప్రిల్ 12, 1957 | సావిత్రి, శివాజి | పి. పుల్లయ్య |
| 23. | జూపిటర్ పిక్చర్స్ కర్పుకరశి | జూన్ 14, 1957 | సావిత్రి, జెమిని జి. వరలక్ష్మి | ఏ.ఎస్.ఏ. సామి |
| 24. | విజయ ఫిల్మ్స్ యార్ పైయ్యన్ | జులై 26, 1957 | సావిత్రి, జెమిని | టి.ఆర్.రఘునాథ్ |
| 25. | నరసు స్టూడియోస్ ఇరు సాహోదరిగల్ | ఆగస్టు 23, 1957 | సావిత్రి, జెమిని, బాలాజి | వేదాంతం రాఘవయ్య |
| 26. | నందిని పిక్చర్స్ సౌభాగ్యవతి | అక్టోబర్ 22, 1957 | సావిత్రి, జెమిని తంగవేలు, ఎస్.వి.ఆర్. | సి.హెచ్. నారాయణమూర్తి |

| | | | | |
|---|---|---|---|---|
| 27. | శ్రీ గణేష్ మూవీటోన్స్ మహాదేవి | నవంబర్ 22, 1957 | సావిత్రి, ఎమ్.జి.ఆర్. | నాదకర్ణి సుందరరావు |
| 28. | వి.ఆర్.వి. పిక్చర్స్ పతిని దైవం | ఆగస్టు 23, 1957 | సావిత్రి, జెమిని వరలక్ష్మి, తంగవేలు | సిహెచ్. నారాయణమూర్తి |
| 29. | జనతా పిక్చర్స్ మానా మలాయ్ | ఫిబ్రవరి 21, 1958 | సావిత్రి, జెమిని | సిహెచ్. నారాయణమూర్తి |
| 30. | విక్రమ్ ప్రొడక్షన్స్ కుడుంబ గౌరవం | ఫిబ్రవరి 28, 1958 | సావిత్రి, జెమిని కన్నాంబ | బి.ఎస్. రంగా |
| 31. | బుద్ధ పిక్చర్స్ పతిభక్తి | మార్చి 14, 1958 | సావిత్రి, జెమిని, శివాజి | భీమ్‌సింగ్ |
| 32. | పారగాన్ పిక్చర్స్ అన్నయిఇన్ ఆనయ | జులై 4, 1958 | సావిత్రి, శివాజి | చిత్రపు నారాయణమూర్తి |
| 33. | వలంపూరి పిక్చర్స్ తిరుమనం | జులై 18, 1958 | సావిత్రి, జెమిని, తంగవేలు | భీమ్‌సింగ్ |
| 34. | విజయ ప్రొడక్షన్స్ కడన్‌వాంగి కల్యాణం | సెప్టెంబర్ 17, 1958 | సావిత్రి, జెమిని, తంగవేలు, ఎస్.వి.ఆర్. | ఎల్.వి. ప్రసాద్ |
| 35. | మరగత పిక్చర్స్ పనాయి పిదితివల్ భాగ్యశాలి | అక్టోబర్ 1, 1958 | సావిత్రి, దురైరాజా, బాలాజి, భాగ్యశ్రీ | రమణ |
| 36. | ఆర్.ఆర్. పిక్చర్స్ కాత్తవరాయన్ | నవంబర్ 7, 1958 | సావిత్రి, శివాజి, తంగవేలు కమల, రాజమ్ | రమణ |
| 37. | అన్నపూర్ణ పిక్చర్స్ మంజల్ మహిమయ్ | జనవరి 14, 1959 | సావిత్రి ఏన్.ఎన్.ఆర్. ఎస్.వి.ఆర్., రేలంగి | ఆదుర్తి సుబ్బారావు |
| 38. | శ్రీ సారథి స్టూడియోస్ భాగ్యదేవతై | సెప్టెంబర్ 18, 1959 | సావిత్రి, జెమిని | టి. చానక్య |
| 39. | సాహిణీఆర్ట్ ప్రొడక్షన్స్ అదిశయ తిరుడన్ | అక్టోబర్ 25, 1958 | సావిత్రి, జెమిని, రేలంగి | పి. పుల్లయ్య |
| 40. | శంభు ఫిలిమ్స్ పట్టాయిలిన్ వేత్రి | ఫిబ్రవరి 19, 1960 | సావిత్రి, ఏ.ఎన్.ఆర్. ఎస్.వి.ఆర్., తంగవేలు | ఆదుర్తి సుబ్బారావు |
| 41. | మేఘాల పిక్చర్స్ కురవంచి | మార్చి 4, 1960 | సావిత్రి, శివాజి | ఏ. కాసిలింగమ్ |
| 42. | ఏ.వి.ఎమ్. ప్రొడక్షన్స్ కలత్తూర్ కన్నమ్మ | ఆగస్టు 12, 1960 | సావిత్రి, జెమిని, కమల్‌హాసన్ | ఏ. భీమ్‌సింగ్ |
| 43. | శ్రీ సారథి స్టూడియోస్ పుదియ పాదై | నవంబర్ 17, 1960 | సావిత్రి, జెమిని | టి. చాణక్య |

| | | | | |
|---|---|---|---|---|
| 44. | అన్నపూర్ణ పిక్చర్స్<br>తూయ ఉల్లమ్ | జనవరి<br>14, 1961 | సావిత్రి, ఎ.ఎన్.ఆర్. | ఆదుర్తి |
| 45. | జయలక్ష్మి పిక్చర్స్<br>అన్బు మగన్ | జనవరి<br>27, 1961 | సావిత్రి, ఎమ్.ఆర్. రాధ,<br>పుష్పలత, ఎ.ఎన్.ఆర్. | తాతినేని ప్రకాశ్‌రావు |
| 46. | బుద్ధ పిక్చర్స్<br>పావమన్నిపు | మార్చి<br>16, 1961 | సావిత్రి, జెమిని, శివాజి<br>ఎమ్.ఆర్. రాధ, నాగయ్య | భీమ్‌సింగ్ |
| 47. | రాజమని పిక్చర్స్<br>పాశమలర్ | మే<br>27, 1961 | సావిత్రి, జెమిని, శివాజి<br>తంగవేలు | భీమ్‌సింగ్ |
| 48. | శరవణభవ యూనిట్ పిక్చర్స్<br>ఎల్లావునక్కాగా | జూలై<br>1, 1961 | సావిత్రి, శివాజి, ఎస్.వి.ఆర్.<br>తంగవేలు | పి. పుల్లయ్య |
| 49. | పద్మిని పిక్చర్స్<br>కప్పలోతియ తమిలన్ | నవంబర్<br>7, 1961 | సావిత్రి, జెమిని, శివాజి<br>ఎస్.వి.ఆర్. | బి.ఆర్. పంతులు |
| 50. | రామన్ ప్రొడక్షన్స్<br>కొంజమ్ సలంగై | జనవరి<br>14-1-62 | సావిత్రి, జెమిని | ఎమ్.వి. రామన్ |
| 51. | ఏ.వి.ఎమ్. ప్రొడక్షన్స్<br>పార్థాల్ పశి తీరుయ్ | జనవరి<br>14, 1962 | సావిత్రి, జెమిని, శివాజి<br>బి. సరోజాదేవి, కమల్‌హాసన్ | భీమ్‌సింగ్ |
| 52. | రంగనాథన్ పిక్చర్స్<br>పడితాల్ మట్టుమ్‌పోదుమ | ఏప్రిల్<br>14, 1962 | సావిత్రి, ఎస్.వి.ఆర్.,<br>శివాజి, బాలాజీ | భీమ్‌సింగ్ |
| 53. | విజయ ప్రొడక్షన్స్<br>మణితన్ మారవిల్లయ్ | జూన్<br>8, 1962 | సావిత్రి, జెమిని, ఎస్.వి.ఆర్.<br>జమున, ఏ.ఎన్.ఆర్. | చక్రపాణి |
| 54. | శ్రీలక్ష్మి పిక్చర్స్<br>వడివుక్కు వల్లయ్ కప్పు | జూలై<br>7, 1962 | సావిత్రి, శివాజి | ఎ.పి. నాగరాజన్ |
| 55. | శరవణ ఫిలిమ్స్<br>పాదకానిక్కయ్ | జూలై<br>14, 1962 | సావిత్రి, జెమిని, కమల్‌హాసన్<br>అశోకన్ | కె. శంకర్ |
| 56. | వసుమతి పిక్చర్స్<br>కాతిరుంత కంగల్ | ఆగస్టు<br>29, 62 | సావిత్రి, జెమిని, ఎస్.వి.ఆర్. | తాతినేని ప్రకాస్‌రావు |
| 57. | శాంతి ఫిలిమ్స్<br>పందపాశమ్ | అక్టోబర్<br>27, 1962 | సావిత్రి, జెమిని, శివాజి<br>దేవిక | భీమ్‌సింగ్ |
| 58. | నేషనల్ మూవీస్<br>రక్తతిలకమ్ | సెప్టెంబర్<br>14, 1963 | సావిత్రి, శివాజి, నగేష్ | దాదా మిరాసి |
| 59. | చిత్ర పిక్చర్స్<br>కర్పగమ్ | నవంబర్<br>15, 1963 | సావిత్రి, జెమిని,<br>కె.ఆర్. విజయ | కె.ఎస్. గోపాలకృష్ణన్ |
| 60. | గౌరి పిక్చర్స్<br>పరిసు | నవంబర్<br>15, 1963 | సావిత్రి, ఎమ్.జి.ఆర్.,<br>రాగిణి | యోగానంద్ |

| | | | | |
|---|---|---|---|---|
| 61. | పద్మిని పిక్చర్స్<br>కర్ణన్ | జనవరి<br>14, 1964 | సావిత్రి, ఎన్.టి.ఆర్.,<br>శివాజి, రాజమ్మ | రామకృష్ణయ్య పంతులు |
| 62. | దేవర్ ఫిలిమ్స్<br>విత్తయికారన్ | జనవరి<br>14, 1964 | సావిత్రి, ఎమ్.జి.ఆర్.<br>నగేష్ | ఎమ్.ఎ. తిరుముగమ్ |
| 63. | శ్రీ పొన్ని పిక్చర్స్<br>కై కొడుత దైవమ్ | జులై<br>18, 1964 | సావిత్రి, ఎస్. రాజేంద్రన్<br>శివాజి, కె.ఆర్. విజయ | కె.ఎస్. గోపాలకృష్ణన్ |
| 64. | చిత్ర ప్రొడక్షన్<br>ఆయిరమ్ రూపాయి | డిసెంబర్<br>3, 1964 | సావిత్రి, జెమిని, నగేష్ | కె.ఎస్. గోపాలకృష్ణన్ |
| 65. | శ్రీ విజయలక్ష్మి పిక్చర్స్<br>నవరాత్రి | నవంబర్<br>3, 1964 | సావిత్రి, జెమిని, నగేష్ | ఎ.పి. నాగరాజన్ |
| 66. | మాధవి ప్రొడక్షన్స్<br>పాండవ వనవాసమ్ | జనవరి<br>14, 1965 | సావిత్రి, ఎన్.టి.ఆర్.,<br>గుమ్మడి, ఎస్.వి.ఆర్. | కమలాకర<br>కామేశ్వరరావు |
| 67. | ముక్త ఫిలిమ్స్<br>పూజెక్కు వంత మలర్ | మార్చి<br>12, 1965 | సావిత్రి, జెమిని<br>ముత్తురామన్ | బి. శ్రీనివాసన్ |
| 68. | సుదర్శనమ్ పిక్చర్స్<br>హల్లో మిస్టర్ జమీందార్ | మే<br>14, 1965 | సావిత్రి, జెమిని<br>ఎమ్.ఆర్. రాధ | కె.జె. మహదేవన్ |
| 69. | మోడరన్ థియేటర్స్<br>వల్లవనుక్కు వల్లవన్ | మే<br>28, 1965 | సావిత్రి, జెమిని | ఆర్. సుందరమ్ |
| 70. | శ్రీ విజయలక్ష్మి పిక్చర్<br>తిరువిలైయాడల్ | జులై<br>31, 1965 | సావిత్రి, శివాజి, దేవిక<br>నగేష్, ముత్తురామన్ | ఎ.పి. నాగరాజన్ |
| 71. | సుజాత సినీ ఆర్ట్స్<br>అన్నయిన్ ఆనై | మార్చి<br>4, 1966 | సావిత్రి, కె.ఆర్. విజయ,<br>జెమిని, బాలాజి | ఆర్. కృష్ణమూర్తి |
| 72. | విశ్వభారతి పిక్చర్స్<br>తట్టున్‌గల్ తిరక్కపడుమ్ | జూన్<br>17, 1966 | సావిత్రి, చంద్రబాబు<br>కె.ఆర్. విజయ | చంద్రబాబు |
| 73. | శ్రీ విజయలక్ష్మి పిక్చర్స్<br>సరస్వతి సబతమ్ | సెప్టెంబర్<br>3, 1966 | సావిత్రి, జెమిని, శివాజి | ఎ.పి. నాగరాజన్ |
| 74. | ఏ.ఎల్.ఎస్. ప్రొడక్షన్స్<br>కందన్ కరుణై | జనవరి<br>14, 1967 | సావిత్రి, జెమిని, శివాజి<br>జయలలిత, శ్రీదేవి, | ఎ.పి. నాగరాజన్ |
| 75. | రాజ్య లక్ష్మి పిక్చర్స్<br>సీత | జూన్<br>23, 1967 | సావిత్రి, కె.ఆర్.విజయ<br>జెమిని, ముత్తురామన్ | ఎ.పి. నాగరాజన్ |
| 76. | విజయలక్ష్మి పిక్చర్స్<br>తిరువరుత్ చెల్వర్ | జులై<br>28, 1967 | సావిత్రి, జెమిని, శివాజి<br>కె.ఆర్. విజయ, పద్మిని | ఎ.పి. నాగరాజన్ |

| | | | | |
|---|---|---|---|---|
| 77. | శ్రీ సావిత్రి ప్రొడక్షన్స్<br>కుళందై ఉళ్ళం | జనవరి<br>14, 1969 | సావిత్రి, జెమిని, వాణిశ్రీ<br>షావుకారుజానకి, బేబి రోజా | సావిత్రి |
| 78. | శ్రీ సావిత్రి ప్రొడక్షన్స్<br>ప్రాప్తమ్ | ఏప్రిల్<br>14, 1971 | సావిత్రి, శివాజి, ఎస్.వి.ఆర్.,<br>మనోరమ | సావిత్రి |
| 79. | గిరి మూవీస్<br>అన్నయ్ వేలాన్కన్ని | ఆగస్టు<br>15, 1971 | సావిత్రి, ముత్తురామన్<br>కె.ఆర్. విజయ, పద్మిని,జెమిని | కె. తంగప్పన్ |
| 80. | శ్రీ నవనీత ఫిలిమ్స్<br>పుగుంత వీడు | ఏప్రిల్<br>13, 1972 | సావిత్రి, ఎ.వి.ఎమ్. రాజన్,<br>చంద్రకళ, లక్ష్మి, విజయ | ఎస్. పట్టు |
| 81. | విజయచిత్ర ఫిలిమ్స్<br>జక్కమ్మ | సెప్టెంబర్<br>14, 1972 | సావిత్రి, నాగయ్య, జైశంకర్,<br>ఉష | ఎమ్.కర్ణన్ |
| 82. | శ్రీ నవనీత ఫిలిమ్స్<br>తాయిక్కుయరు పిళ్లై | డిసెంబర్<br>5, 1972 | సావిత్రి, ఎ.వి.ఎమ్. రాజన్,<br>జైశంకర్, లలిత | ఎస్. పట్టు |
| 83. | కుముదున్ ప్రొడక్షన్స్<br>మంజల్ కుంకుమమ్ | జనవరి<br>14, 1973 | సావిత్రి, రవిచంద్రన్ | ఎస్. పట్టు |
| 84. | విక్టరీ మూవీస్<br>పితమానమ్ పితు | జనవరి<br>14, 1973 | సావిత్రి, ముత్తురామన్<br>సుందరరాజన్, జయసుధ | ఎస్.పి. ముత్తురామన్ |
| 85. | శ్రీ శక్తి ఫిలిమ్స్<br>వీటు మాప్పిళయి | జూన్<br>30, 1973 | సావిత్రి, ఎ.వి.ఎమ్. రాజన్,<br>పద్మినీ, పరిమళ | ఎ.కె. సుబ్రమణ్యన్ |
| 86. | ముక్తా ఫిలిమ్స్<br>సూర్యకాంతి | ఆగస్టు<br>15, 1973 | సావిత్రి, ఆర్. ముత్తురామన్<br>జయలలిత, మనోరమ | వి. శ్రీనివాసన్ |
| 87. | గణేష్ క్రియేషన్స్<br>బాగ్దాద్ పెరజాగి | ఆగస్టు<br>30, 1973 | సావిత్రి, రవిచంద్రన్<br>జయలలిత, జయసుధ | రామన్న |
| 88. | మల్లియమ్ ప్రొడక్షన్<br>ఎంగ్గై తాయి | ఆగస్టు<br>31, 1973 | సావిత్రి, ఎ.వి.ఎమ్. రాజన్<br>కంతిమాతి, అశోకన్ | మల్లియమ్ రాజ్గోపాల్ |
| 89. | యోగచిత్ర<br>అక్కరైపచై | సెప్టెంబర్<br>19, 1974 | సావిత్రి, జైశంకర్<br>రవిచంద్రన్, లక్ష్మి, నాగయ్య | ఎన్. వెంకటేశ్ |
| 90. | ఎన్.వి.ఆర్. పిక్చర్స్<br>పుదువెల్లమ్ | ఫిబ్రవరి<br>21, 1975 | సావిత్రి, శివకుమార్<br>మంజుల, పుష్పలత | కె. విజయన్ |
| 91. | మాయ ఆర్ట్స్<br>అంతరంగమ్ | 1975 | సావిత్రి, కమల్హాసన్<br>దీప, సుకుమారి | ముక్త వి. శ్రీనివాసన్ |
| 92. | నిర్మితి ఫిలిమ్స్<br>అగ్రహారతి ఖాజుత్తై | 1977 | సావిత్రి, గోపాల్<br>ఎమ్.బి. శ్రీనివాసన్, శ్రీలత | జాన్ అబ్రహమ్ |

| | | | | |
|---|---|---|---|---|
| 93. | జయశ్రీ నాన్‌జిల్ ఇన్‌కార్పొరేషన్ పునీత అంతోనియర్ | 1977 | సావిత్రి, ముత్తురామన్ జయచిత్ర | నన్‌జిల్ దురై |
| 94. | సెల్లియమ్మన్ సినీ కంబైన్స్ వత్తతుక్కుల్ చదురమ్ | జులై 28, 1978 | సావిత్రి, శ్రీకాంత్, లత, విజయ్‌కుమార్, సుమతి | ఎస్.పి. ముత్తురామన్ |

## కన్నడ

| | | | | |
|---|---|---|---|---|
| 1. | శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దేవరు కొట్టవర | 1975 | సావిత్రి, విష్ణువర్ధన్, జయంతి, టి.ఎన్. బాలకృష్ణ | ఆర్. రామమూర్తి |
| 2. | పూర్ణిమ ఎంటర్‌ప్రైజెస్ తాయిగే తక్కమగ | డిసెంబర్ 12, 1978 | సావిత్రి, రాజ్‌కుమార్, షావుకారు జానకి. | సోమశేఖర్ |
| 3. | ఏ.వి. శేషగిరిరావు రవిచంద్ర | 1980 | సావిత్రి ప్రభాకర్, లక్ష్మి, సంపత్, రాజ్‌కుమార్ | ఏ.వి. శేషగిరిరావు |

## మలయాళం


| | | | | |
|---|---|---|---|---|
| 1. | నవధార చుళీ | డిసెంబర్ 7, 1973 | సావిత్రి, శ్రీధరన్ నాయర్, చలమ్, సుజాత | టి. సుకుమారన్ |
| 2. | మోహన్ మొహమ్మద్ ఫిలిమ్స్, అశ్వథామ | 1978 | సావిత్రి, మాదంబు కుంజుకుట్టన్, విదుబాల | కె.ఆర్. మోహనన్ |

## హిందీ

| | | | | |
|---|---|---|---|---|
| 1. | బహుత్ దిన్ హుయే | 1954 | సావిత్రి, రతన్‌కుమార్ | ఎస్.ఎస్. వాసన్ |
| 2. | సితారోన్ సే ఆగే | 1958 | సావిత్రి, ధర్మేంద్ర | |
| 3. | ఘర్ బసాకే దేఖో | 1963 | సావిత్రి, మనోజ్‌కుమార్ | కిషోర్ సాహు |
| 4. | గంగా కి లహరేం | 1964 | సావిత్రి, ధర్మేంద్ర | దేవి శర్మ |
| 5. | బలరామ్ శ్రీకృష్ణ | 1968 | సావిత్రి, పృధ్వీరాజ్‌కపూర్ | చంద్రకాంత్ |

## సంఖ్యల్లో సావిత్రి సినిమాలు

| సంవత్సరం | తెలుగు | తమిళ్ | కన్నడ | మలయాళం | హిందీ | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 1950 | 1 | - | - | - | - | 1 |
| 1951 | 2 | 1 | - | - | - | 3 |
| 1952 | 6 | 1 | - | - | - | 7 |
| 1953 | 6 | 4 | - | - | - | 10 |
| 1954 | 4 | 3 | - | - | 1 | 8 |
| 1955 | 6 | 6 | - | - | - | 12 |
| 1956 | 2 | 4 | - | - | - | 6 |
| 1957 | 5 | 9 | - | - | - | 14 |
| 1958 | 2 | 9 | - | - | 1 | 12 |
| 1959 | 4 | 2 | - | - | - | 6 |
| 1960 | 9 | 4 | - | - | - | 13 |
| 1961 | 2 | 6 | - | - | - | 8 |
| 1962 | 5 | 8 | - | - | - | 13 |
| 1963 | 3 | 3 | - | - | 1 | 7 |
| 1964 | 4 | 5 | - | - | 1 | 10 |
| 1965 | 5 | 4 | - | - | - | 9 |
| 1966 | 5 | 3 | - | - | - | 8 |
| 1967 | 4 | 3 | - | - | - | 7 |
| 1968 | 5 | - | - | - | 1 | 6 |
| 1969 | 3 | 1 | - | - | - | 4 |
| 1970 | 4 | - | - | - | - | 4 |
| 1971 | 5 | 2 | - | - | - | 7 |
| 1972 | 4 | 3 | - | - | - | 7 |
| 1973 | 6 | 6 | - | 1 | - | 13 |
| 1974 | 8 | 1 | - | - | - | 9 |
| 1975 | 8 | 2 | 1 | - | - | 11 |
| 1976 | 2 | - | - | - | - | 2 |
| 1977 | 3 | 1 | - | - | - | 4 |
| 1978 | 7 | 1 | 1 | 1 | - | 10 |
| 1979 | 6 | 1 | - | - | - | 7 |
| 1980 | 5 | - | 1 | - | - | 6 |
| 1981 | 1 | - | - | - | - | 1 |
| 1985 | 1 | - | - | - | - | 1 |
| | **143** | **93** | **3** | **2** | **5** | **247** |




మే 27, 1953 'ఆంధ్రపత్రిక' నుంచి




మార్చి 13, 1964 'ఆంధ్ర సచిత్రవారపత్రిక' నుంచి

## ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 1967లో నాలుగు వారాలపాటు 360 పైచిలుకు పాఠకుల ప్రశ్నలకు మహానటి సావిత్రి ఇచ్చిన సమాధానాలలో కొన్ని.

ప్ర : మీరే నెలలో పుట్టారు?

జ : జనవరి (4వ తేదీ) నెలలో.

ప్ర : ఇద్దరు మార్వాడీలు కలుసుకుంటే హిందీలోనే మాట్లాడుకుంటారు. ఇద్దరు సాహెబులు కలిస్తే ఉర్దూలో మాట్లాడుకుంటారు. తమిళులు ఎప్పుడూ తమిళమే మాట్లాడతారు. కాని ఇద్దరు తెలుగువారు కలిస్తే వచ్చీరాని ఇంగ్లీషులోనే మాట్లాడుకుంటారెందుకండీ?

జ : మనకర్మ.

ప్ర : "ఎందుకు?" శీర్షికలో పద్మనాభంగారు ఒక ప్రశ్నకు జవాబుగా "అరవ సాంబారుకు, ఆంధ్ర ఇడ్లీకి" పొత్తు వారికన్నా మీకే బాగా తెలుసునన్నారు. మరి ఆ సంబంధం ఏమిటో చెబుతారా?

జ : సాంబారు, ఇడ్లీ మనవి గానేగావు, మన సంప్రదాయం పెసరట్ అండ్ ఘుమఘుమ ఉప్మా.

ప్ర : ఇంతమంది తెలుగువారుండగా, తమిళుని వివాహమాడారేం?

జ : అనురాగానికి, అనుకూలతకు భాష అడ్డు రాదుగా!

ప్ర : ఈ ప్రపంచంలో పరమ సత్యమేది? ఘోర అహింస ఏది? జరగరాని అపచారమేమి?

జ : ఈ ప్రశ్న ఏమీ? ఈ సందేహమేమి? ఈ రాత యేమి?

ప్ర : లావు తగ్గుటకు చన్నీళ్లస్నానం చేయుచున్నారా?

జ : చన్నీళ్ళ స్నానం వల్లనే సన్నబడతాననుకుంటే మా యింట్లోవున్న ఫ్రిజడెరిలోనే కూర్చుందును.

ప్ర : మీ ఆరాధ్యదైవం ఎవరండీ?

జ : వెంకటేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు.

ప్ర : మీకు ఈత వచ్చునా?

జ : బాగా వచ్చు.

ప్ర : మీరు తెలుగువారై వుండి తమిళుని పెళ్లాడారు-మీకు తగిన అందగాడు, సంస్కారి, నటశేఖరుడు తెలుగువారిలో లేరా? మరి శ్రీ జెమినీలో వున్న ప్రత్యేకత, సద్గుణాలు ఏమిటో?

జ : మీ అందరికీ మీ అభిమాన నటిగా యింతవరకు వుండగలిగానంటే దానికి వారు కూడా ఒక ముఖ్యకారకులు.

ప్ర : నేను ప్రేమించిన అమ్మాయికి ఏ లోపమూ లేదు. కాని మీలా లావుగా మాత్రం వుంటుంది. వివాహం చేసుకుందామనుకుంటున్నాను, ఏం చేయమంటారు?

జ : దగ్గర్లోనే సైకిల్ షాపుంటే చూడండి, గాలి కొడితే మీరూ లావెక్కొచ్చునేమో.

ప్ర : వివాహమయ్యి పిల్లలుగల జెమినీ గణేశన్ గారిని మీరు పెళ్ళాడారు. దానివలన తోటి స్త్రీకి అన్యాయం చేసినట్లు కాదా?

జ : దక్షిణాదిన ఓ కథ వుంది ప్రచారంలో. విఘ్నేశ్వరుడికి సిద్ధి బుద్ధి అని ఇద్దరు భార్యలట. అలాగే మా గణపతి (గణేశ్) గారికి కూడా!

ప్ర : అవివాహితులైన అందమైన యువకులు మీకు లభించలేదా?

జ : నా కళ్ళకు లభించలేదు.

ప్ర : నేటి చిత్రాలను చూస్తూవుంటే నిర్మాతలు ప్రజాభిప్రాయాన్ని గుర్తించడం లేదని నేనంటే మీరంగీకరిస్తారా?

జ : ప్రజాభిరుచులు త్వరత్వరగా మారిపోతూండడం వల్లనే నిర్మాతలు ఇలా యిబ్బంది పడిపోతున్నారు.

ప్ర : సినిమా అంటే ఏమిటో నిర్వచించండి?

జ : లలిత కళల సమగ్ర సంగమం సినిమా.

ప్ర : ఈమధ్య మీరు సినిమాలలో కనిపించడం లేదేం తరచుగా?

జ : సన్నపడ్డాక కనిపిద్దామని.

ప్ర : నేడు వస్తున్న చిత్రాలు ముప్పాతిక వంతు ప్రజాభ్యుదయానికి గాక ప్రజా నాశనానికి తోడ్పడుతున్నాయి. మీరేమంటారు?

జ : మూడు వంతులు మాత్రమే మీ మాటతో అంగీకరిస్తా.

ప్ర : అక్కయ్యా, నా బరువు 32 కేజీలు... మీ బరువు రావాలంటే...?

జ : బాబ్బాబు... సగం బరువు నా దగ్గర్నుంచి తీసేసుకుందూ...

ప్ర : 1967లో పద్మశ్రీ బిరుదు మీకు తప్పక వస్తుంది.

జ : అంత బరువే! కష్టం... నేనెప్పుడూ "నటి"గానే వుండాలనుకుంటున్నాను.

ప్ర : పెద్ద తారలంతా వద్దంటే (ఈ ముద్దులు ప్రవేశ పెట్టడం) నిర్మాతలు, దర్శకులు ఏం చేస్తారండీ. బహుశా ఆ పద్ధతి రద్దు చేస్తారా?

జ : చేయరు. అలా అంగీకరించే తారలతోనే చిత్రాలు తీస్తారు.

ప్ర : ఉదాత్తమైన పాత్రలు నటించి ఉత్తమోత్తమ నటిగా ప్రేక్షకుల నుండి విశిష్టమైన అభిమానాన్ని పొందిన మీరు, అదే తెలుగు తెరపై "ముద్దు" ప్రవేశపెడితే మీరు నటిస్తారా? నటిస్తే ఎలా వుంటుంది?

జ : నటించను... ఎలా వున్నాసరే.

ప్ర : వివాహితులైన సినీతారలు చిత్రాల్లో నటించేటపుడు వారి మంగళ సూత్రాలు కనబడవేమండి?

జ : మీ చూపు అటెందుకు వెళ్తుంది?

ప్ర : ఈమధ్య మీరు మరీ లావై మీ పాత్రను సరిగా పోషించుకోలేకుండా వున్నారు. మీ సైజుని తగ్గించుకొనుటకు ప్రయత్నమేమి చేయలేదా?

జ : మీతో ఏకీభవించ లేకపోతున్నాను. నేను నా శరీరాన్ని పోషించలేక పోతున్నానేమో గాని, నేను నటించే పాత్రను పోషించలేనిదెపుడు!

ప్ర : శీలము గల స్త్రీలు అనగా ఎవ్వరు?

జ : శీలవతులు.

ప్ర : వారి లక్షణములేవి?

జ : శీలము కలిగి వుండుట.

ప్ర : అట్టి మహా గుణవంతులైన మహిళలు ప్రస్తుతం భారతదేశంలో మీకు తెలిసిన వారెవరు?

జ : మన ప్రధాని ఇందిరాగాంధి, మీ నటి సావిత్రి గణేశన్ – ఇంకా ఎంతోమంది.

ప్ర : ఏమండీ మా ప్రశ్నలకు మీరే స్వయంగా ప్రత్యుత్తరములిస్తున్నారా, లేక వేరెవరైనా మీ పేరున సమాధానాలిస్తున్నారా?

జ : ఔనూ ఇంతకీ మీరీ ప్రశ్న మీరే వ్రాస్తున్నారా? ఎవరైనా మీ పేరుతో వ్రాశారా?

ప్ర : మీ నాటక సమాజం ఏమంటుంది?

జ : కొంచెం ఓపిక పట్టండి, వచ్చే సంవత్సరం నాటక ప్రదర్శనలివ్వాలని ఏర్పాట్లు చేస్తున్నాను.

ప్ర : కళాకారులు దేశాభివృద్ధికి ఎంతవరకు బాధ్యులు?

జ : సమాజానికి సినిమా ప్రతిబింబం. ఆ సమాజానికి చరిత్రకారులు కళాకారులే. అనుక్షణం మార్పులు వస్తున్న దేశ కాల వాతావరణాలను యథాతథంగా గుర్తించడానికి సినిమాలే ప్రత్యక్ష ఆధారాలు ఏనాటికైనా.

ప్ర : ఇంటిదగ్గర ఎంతో సుఖ-సంతోషాలతో వుంటూ చిత్రాల్లో విషాదపాత్రలంత గొప్పగా ఎలా నటిస్తారండి?

జ : ఆ రోజుల్లో క్రమశిక్షణతో మేం నేర్చుకున్న విద్యాఫలితం.

ప్ర : నా అభిమాన తార శ్రీమతి సావిత్రి అని చెప్పుకోవటంలో నేనెంతో గర్విస్తాను. మరి ఈ మాట విన్నప్పుడు మీరెంతవరకు గర్విస్తారు?

జ : మీవంటి అభిమానులను చూస్తే నేను పదింతలు గర్విస్తా.

## సవరణలు - వివరణలు

| సంఖ్య | పేజినం. | సవరణ-వివరణ |
|---|---|---|
| 1 | 2 | అభిమానులు, ప్రచార సాధనాలు, సావిత్రిగారి జన్మదినం డిసెంబర్ 6న జరుపుచున్నారు. కాని సావిత్రిగారు పలు ఇంటర్వ్యూలలో తన జన్మదినం జనవరి నాలుగుగా పేర్కొన్నారు. విజయ స్పిన్నింగ్ మిల్స్, గంగూరులో వున్న డాక్యుమెంట్స్‌లో కూడా జనవరి నాలుగు అని వున్నది. |
| 2. | 2, 316 | సావిత్రి ఇంటిపేరు నిశ్శంకరరావు |
| 3. | 321 | 1965 జనవరి 14న విడుదలైన సావిత్రి చిత్రం "పాండవ వనవాసం", 1982లో విడుదలైన చిత్రం "దేవుడు మామయ్య" లిస్టులో చేర్చబడలేదు. |
| 4. | 227, 321 | "శ్రీకృష్ణ పాండవీయం"లో సావిత్రి నటించలేదు. |
| 5. | 325 | "దేవదాసు మళ్లీపుట్టాడు" లో విజయనిర్మల లేదు. |
| 6. | 325 | "గోరింటాకు"లో హీరోయిన్ సుజాత. |
| 7. | 323 | "విచిత్ర దాంపత్యం" నిర్మాతలు ఉషశ్రీ ప్రొడక్షన్స్. |
| 8. | 323 | "పూలమాల" నిర్మాతలు పొన్నలూరి బ్రదర్స్. |




ఎన్.టి.ఆర్, సావిత్రి



జగ్గయ్య, ఏ.ఎన్.ఆర్., సావిత్రి

## ఒక అభిమానికి మహానటి సావిత్రి వ్రాసిన లేఖ


Savitri

Senate Member:
S. V. UNIVERSITY, TIRUPATHI.
Director: VIJAY SPINNING MILLS LTD.
VIJAYAWADA-2

Phone: 613310
3291, 'W' Block - 1st Street,
Annanagar, MADRAS-600040.

Date 9-12-77

P.S.







మహానటి సావిత్రి గురించి శ్రీమతి పల్లవి రూపొందించిన
ఈ పుస్తకం చాలా యధార్థంగా ఆమె జీవితాన్ని ఆవిష్కరించింది.

గుమ్మడి వెంకటేశ్వరరావు



గాలినిండా సువాసనను నింపే మంచి గంధపు ముక్క వంటిది సావిత్రి! చీకటి చిక్కదనానికి భయపడకుండా ఉజ్వలంగా వెలిగే కర్పూరపు తునక వంటిది సావిత్రి! ఆ చందన శకలాన్ని, కర్పూరపు ముక్కను తెలుగు పాఠకులకందించిన పల్లవి గారిని అభినందిస్తున్నాను.

రావూరి భరద్వాజ